# 1. మానవ శరీరము మహిమ శరీరముగా మారగలదా?

ప్రియులారా! నిత్యజీవ పరిశోధనలో భాగముగా మానవ శరీరము మహిమ శరీరముగా మారగలదా? అనే అంశమును ఈ పాఠములో పరిశీలన చేద్దాం. దేవుని జ్ఞానమును నేర్చుకోవడానికి పడే కష్టం ఎప్పటికీ వృథాగా పోదు. ఈ జ్ఞాన లాభము నిత్యజీవములో మనకు అనుగ్రహింపబడుతుంది. కనుక, నిత్యజీవ పరిశోధన చేస్తున్నవారంతా తమ సమయమును సద్వినియోగము చేసుకుంటున్నారని తెలుసుకోవాలి. ఇందు విషయమై లోక సంబంధమైనవాటిని ఏ మాత్రం మీ దృష్టిలో పెట్టుకోకుండా, అయ్యో! మేము లోకమందున్న సంతోషాన్ని కోల్పోతున్నామే అని ఏమాత్రం దిగులుపడకుండా, రానున్న మంచి ఫలితములకొరకు నిరీక్షణ కలిగినవారై ఒక ఉన్నతమైన కార్యక్రమములో పాలిభాగస్తులవుతున్నందుకు చాలా సంతోషించాలి.

'మానవ శరీరము, మహిమ శరీరము'! మానవ శరీరమనగా ఈ భూమిమీద జీవిస్తున్నటువంటి ప్రతి మనిషి కంటికి కనిపించే శరీరం. ఇది మనుష్యులు ధరించుకున్న దేహం, కనిపించే అవయవాలతో కూడిన నిర్మాణం. దీనిని గూర్చి ఈ లోకానికి ఎక్కువగా చెప్పవలసిన అవసరం లేదు. మానవ శరీరం మన కళ్ల ముందే ఉంది, మనము దానిని పోషించుకుంటున్నాము, అతి జాగ్రత్తగా కాపాడుకుంటున్నాము. దీనికి ఏ మాత్రం చిన్న అస్వస్థత కలిగినా వెంటనే మన దగ్గరున్న ధనాన్ని వెచ్చించి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకుంటాం. దీనిని అందరికీ అందమైనదిగా చూపించాలి అనుకుంటాం. దీనిని దీర్ఘకాలం సంరక్షించాలనుకుంటాం. ప్రతి దినము ఈ శరీరానికి కలిగే ఆకలిని, దప్పికను తీరుస్తుంటాం. దీనిని కడుగుతుంటాం, పరిశుభ్రంగా దీనిని ఉంచుకుంటాం. దీనికి క్రొత్త వస్త్రాలు తొడుగుతుంటాం. శ్రేష్టమైన ఆహార పదార్థాలతో ఈ కనిపించే శరీరానికి తృప్తిని కలిగించాలనుకుంటాము. దాదాపుగా ఈ లోకమంతా దీనిని గూర్చి నిరంతరాయంగా ఆలోచిస్తుంది. మానవ శరీరమును గూర్చి ఈ మనుష్యులకు పెద్దగా చెప్పవలసిన అవసరం లేదు. దుష్టుడైన అపవాది మానవ దేహాన్ని కాపాడుకోవటంలో మనిషికి చాలా విషయాలను ఆలోచింపజేసాడు. ప్రకృతిలో జీవిస్తున్న జీవులను, లభ్యమౌతున్న పదార్థాలను ఆహారంగా తీసుకొని, ఆభరణాలుగా మలచుకొని, ఈ దేహాన్ని కాపాడుకోవాలి, సౌందర్యమైనదిగా ఉంచుకోవాలనే లోకసంబంధమైన జ్ఞానాన్ని మాత్రం దుష్టుడైనవాడు ప్రతి మనిషికి నేర్పించాడు. కాని ఇక్కడ తెలియని విషయం ఏమిటంటే, మహిమ శరీరం! మహిమ శరీరాన్ని గూర్చి దాదాపుగా ఏ ఒక్కరికీ తెలియదు. భూజీవిత కాలముమట్టుకే పరిమితమయ్యే ఈ మానవ దేహాన్ని గూర్చి మనిషికి తెలిసినటువంటి లోక సంబంధమైన జ్ఞానం మరియు నిత్యజీవానికి సంబంధించిన మహిమ శరీరాన్ని గూర్చి తెలియవలసినటువంటి దైవ సంబంధమైన జ్ఞానము; ఈ రెండింటిలో మానవ శరీరమును గూర్చి తెలిసినంతగా, మహిమ శరీరాన్ని గూర్చి ఎవ్వరికీ తెలియదు.

మానవ శరీరాన్ని గూర్చి లోకమంతటికీ అర్థమయింది. మానవ శరీరాన్ని గూర్చి ఎన్నెన్నో శాస్త్రాలున్నాయి. దీనిని ఎలా కాపాడుకోవాలో చిన్న పిల్లవాడి దగ్గర నుంచి వృద్ధుని వరకు అందరికీ తెలుసు. కానీ గొప్పదైన మహిమ శరీరాన్ని ఎలా కాపాడుకోవాలో, అసలు మహిమ శరీరాన్ని ఎలా సంపాదించాలో, అసలు మహిమ శరీరమంటే ఏమిటన్న విషయాలు ఈ ప్రపంచములో దేవుని జ్ఞానము లేని ఏ ఒక్కరికీ తెలియవు. కోట్లకొలదిగా ఉన్న మనుష్యులకు మహిమ శరీరమును గూర్చి తెలియనే తెలియదు. కనుక ఈ నిత్యజీవ పరిశోధనలో మొదటిగా ప్రాముఖ్యమైనటువంటి పాఠముగా దీనిని గూర్చి మనము పరిశీలన చేద్దాం. ఈ పుస్తక పఠనానికి ఒక మంచి ప్రారంభాన్నిద్దాం. ప్రియులారా! మహిమ శరీరమంటే ఏమిటి? ఈ మహిమ శరీరాన్ని ఏనాడూ మనము మన కళ్ళారా చూడలేదు, దానిని అనుభవించలేదు. అలాంటప్పుడు మనకు మహిమ శరీరాన్ని గూర్చి ఎలా తెలుస్తుంది? మహిమ శరీరమును గూర్చి మనకు ఎవరు చెబుతారు? పరలోకమందున్న దేవుడు తన పరిశుద్ధ గ్రంథములో మనిషికి తెలియని వాటిని గూర్చి వ్రాయించాడు. చరిత్రలో జరిగిన వాటిని తన గ్రంథములో చూపించాడు. మన వర్తమానము ఎలా ఉండాలనేదానిని గూర్చి ఆయన నేర్పిస్తున్నాడు. ఇదంతా

పాటిస్తే మన భవిష్యత్తు ఎలా ఉంటుందో, ఏమి జరుగుతుందో, ఆ భవిష్యత్తులో ఏమి ఉంటాయో తన గ్రంథంలో ఆయన పొందుపరిచాడు. అలాగని ఇది జోతిష్యశాస్త్రం కాదు. ఇది దేవుని ఆలోచనల నుండి పుట్టిన శాస్త్రం. ప్రకృతి పుట్టుకకు మూలం దేవుని వాక్యం. గనుక దీనిని ఖచ్చితంగా మనిషి నమ్మితీరాలి. ఇందు వ్రాయబడిన వాటికొరకు మనిషి నిరీక్షణ కలిగి ఉండాలి. అయితే ఆయన వాక్యమును గ్రుడ్డిగా నమ్మమని కూడా ఆయన చెప్పలేదు. దేవుని వాక్యమును పరిశోధనాత్మకంగా తెలుకోమన్నాడు, ఆ తరువాతే దానిని నమ్మమన్నాడు. కళ్ళకు కనిపించే వాటిని ఎంతో రూఢిగా నమ్ముతున్నటువంటి మనిషి, కనిపించని వాటిని, కలుగబోవువాటిని గూర్చి నమ్మటానికి ఎక్కువగా ఇష్టపడడు. అందుకే మహిమ శరీరమును గూర్చి దాదాపుగా ఏ ఒక్కరూ పట్టించుకోరు!

ప్రారంభ శతాబ్ధంలో యేసుక్రీస్తును గూర్చిన సువార్తను ప్రకటిస్తున్నటువంటి అపొస్తలులు, శిష్యులు తమ ప్రకటనలలో భాగముగా ఎక్కువగా పునరుత్థానాన్ని గూర్చి మాట్లాడేవారు. పునరుత్థానము అంటే మరల తిరిగి లేవడం, మరల తిరిగి జన్మించడం, మరల తిరిగి ఉనికి కలిగి ఉండటం. అందుకే దానికి పునరుత్థానము అనే పేరు! (పునరుత్థానము = పునర్ + ఉత్థానము). అందుకే దేవుడు అపొస్తలుడైన పౌలు ద్వారా వ్రాయించిన పత్రికలలో క్రీస్తును గూర్చిన సువార్త అంటే ఏమిటంటే, యేసుక్రీస్తు లేఖనముల ప్రకారం మన పాపముల నిమిత్తము 'మృతిపొందెను, సమాధిచేయబడెను, మృతులలోనుండి మూడవ దినమున తిరిగి లేపబడెను' అనే ఈ సువార్తను మనుష్యులందరికీ ప్రకటించాలని వ్రాస్తున్నాడు.(**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 15 : 1 - 4**) ప్రియులారా! దేవునిని గూర్చిన జ్ఞానమును ఈ భూమి మీద ఏ మనిషైనా నేర్చుకొంటున్నప్పుడు మొట్టమొదటి ప్రాథమికమైన సంగతిగా నేర్చుకొనవలసినది ఏమిటంటే, పునరుత్థానమును గూర్చి మరియు మహిమ శరీరమును గూర్చి నేర్చుకోవాలి. మనుష్యులకు వీటి మీద పరిపూర్ణమైనటువంటి అవగాహన ఉండాలి. ఇలా లేని పక్షంలో దేవుడు అలాంటివారిని గూర్చి ఏమంటున్నాడో, ఆ తరువాత పునరుత్థానమును గూర్చి, తదుపరి రాబోయే మహిమ శరీరాన్ని గూర్చి ఎలా వివరిస్తున్నాడో ఒక మంచి సందర్భాన్ని ఇప్పుడు మనము చూద్దాం.

**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 15 : 35- 'అయితే మృతులేలాగు లేతురు? వారెట్టి శరీరముతో వత్తురని యొకడు అడుగును.'** అని వ్రాయబడింది చూడండి. మానవ శరీరము, మహిమ శరీరము! మానవ శరీరము తల్లి గర్భములోనుండి వచ్చింది. మానవ శరీరం ఈ మట్టి లోకానికి సంబంధించినది, ఈ ప్రకృతికి సంబంధించింది. అందుకే ఈ ప్రకృతిలో దొరికే పదార్థాలను ఈ మానవ శరీరానికి పెడితే ఇది సుఖపడుతుంది. ఈ ప్రకృతిలో తనకు ఇష్టమొచ్చినట్టుగా ఈ మానవ దేహాన్ని విడిచిపెడితే ఇది సుఖపడుతుంది. ఈ మానవ దేహంలో నివసిస్తున్న ఒకడు ప్రారంభ శతాబ్ధంలో ఏమని అడుగుతున్నాడో చూడండి. 'అయితే మృతులేలాగు లేతురు?' హేబెలు మొదలుకొని యిప్పటివరకు ఎందరో మృతులున్నారు. ఎందరో చనిపోయి మట్టిలో పాతిపెట్టబడ్డారు, మరికొంతమంది కట్టెలపై కాల్చబడ్డారు. మరికొంతమంది దేహాలు వారి మరణం తరువాత కనిపించకుండా పోయాయి. కొంతమంది నీటిలో మునిగిపోయారు, మరికొంతమంది గాలిలో కలసిపోయారు. కొందరు అంతరిక్షములోనికి వెళ్ళారు, తిరిగి రాలేదు. ఇలా.. మానవదేహము ఇక్కడే మట్టిలో పూడ్చిపెట్టబడుతున్నప్పుడు, కాల్చివేయబడుతున్నప్పుడు, ముగింపబడుతున్నప్పుడు మృతులేలాగు లేతురు? అని ఒకడు అడుగుతున్నాడు. ఇంకా వాడు తన ప్రశ్నకు కొనసాగింపుతో ఏమంటున్నాడో చూడండి. 'వారెట్టి శరీరముతో వత్తురు?' ఒకవేళ మృతులు తిరిగిలేస్తే ఈ మానవ శరీరం మట్టిలో మట్టై కలిసిపోతుంది కదా. సముద్రంలో చేపలు వలన లేక మిగిలినటువంటి మహా మత్స్యముల వలన మునిగిన దేహములన్నీ నాశనం చేయబడుతున్నాయి కదా. ఒకవేళ ఈ మానవ శరీరం కట్టెలపై కాల్చితే, ఆ తరువాత బూడిదైపోతుంది కదా. అలాంటప్పుడు ఒకవేళ మృతులు అనగా చనిపోయినవారు తిరిగి లేస్తే వారు ఎలాంటి శరీరముతో తిరిగి వస్తారని ఒకడు అడుగును అని వ్రాయబడింది చూడండి. ఆ తరువాత **15 : 36**వ వచనంలో దేవుడు అపొస్తలుడైన పౌలు ద్వారా ఆ ప్రశ్నకు సమాధానాన్ని చెప్పడానికి ముందు, అలా అడిగిన ఆ వ్యక్తిని ఏమంటున్నాడో చూడండి! ఓ అవివేకీ, నీవు విత్తునది చచ్చితేనే గాని బ్రతికింపబడదు కదా అని అంటున్నాడు. అంటే ముందుగా ఈ ప్రశ్న వేసిన వాడికి కనీసం వివేకమే లేదన్నమాట. ప్రియులారా, ఇలాంటి ప్రశ్న వేస్తేనే

వాడు అవివేకి అయితే అసలు ఇలాంటి ప్రశ్నలు వేయకుండా, ఈ సమాజంలో పునరుత్థానమును గూర్చిగాని, మహిమ దేహమును గూర్చిగాని అస్సలు అవగాహన లేకుండా తిరుగుతున్న వారిని ఇంకేమనాలి చెప్పండి? మృతులు ఎలాగు లేస్తారో తెలియని వారు అవివేకులు. వారు ఎలాంటి శరీరంతో తిరిగి లేస్తారో తెలియని వారికి కనీసపు వివేకము లేదు. మరి అలాంటప్పుడు అసలు ఆ ధ్యాసే లేకుండా, పరిశోధన లేనివారిని ఇంకేమనాలి? ప్రశ్నవేయడమే రానివారు పరమ అవివేకులన్నమాట. ఈ రోజు లోకమందున్న పరమ అవివేకులను చూడండి, పరమ మూర్ఖులను చూడండి. వీరికి ప్రశ్న వేయటం కూడా చేతకాదు. అసలు మృతులు తిరిగి లేస్తారనే ఆలోచనే వారికి లేదు. మృతులు తిరిగి లేస్తే ఎలాంటి దేహముతో వస్తారని అడగాలంటే, అసలు ముందు మృతులు లేస్తారనే విషయం తెలియాలికదండి. ఈ రోజు సమాజములో ఉన్న మనుష్యులను చూస్తే ఈ ప్రాముఖ్యమైన సంగతి తెలియదండి. ఈ మానవ దేహాన్ని గూర్చి ఆలోచించమంటే మాత్రం అబ్బో.. ఎన్ని రకాలుగా ఆలోచిస్తున్నారో చూడండి, ఎంత గొప్పగా ఆలోచిస్తున్నారో చూడండి. ఉదయం నిద్ర లేచిన దగ్గరనుండి అద్దం ముందే నిలుచుంటారు. రాత్రి పడుకునే ముందు కూడా తమ అందాన్ని చూసుకొనే పడుకుంటారు. దేహాన్ని గూర్చి ఇంత ఆలోచన దేనికి? కొద్ది రోజులకే ఈ మట్టిలో పూడ్చబడేటటువంటి మానవ దేహాన్ని గూర్చి మనిషికి ఇంత ఆలోచన ఉంటే, నిత్యకాలము ఉండబోయే మహిమ దేహాన్ని గూర్చి కనీసపు ఆలోచన ఉందా? లేదండి. ఎటువంటి ఆలోచనా లేదు. అందుకే దేవుడు మొదట ఏమంటున్నాడంటే, మహిమ శరీరంపై ఆలోచన కలిగి ఉండాలంటున్నాడు. పునరుత్థానమునకు సంబంధించిన ప్రతి ప్రశ్నకు సమాధానము తెలియాలంటున్నాడు. మనిషి వివేకము కలిగినవాడయితే మొదట వీటికి సమాధానాన్ని తెలుసుకోవాలంటున్నాడు.

మృతులేలాగులేతురు? వారెట్టి శరీరముతో వత్తురని అడిగినప్పుడు, పరిశుద్ధాత్మ ప్రేరణతో అపొస్తలుడైన పౌలు ఏమంటున్నాడో చూడండి. ఓ అవివేకీ! నీవు విత్తునది చూచినప్పుడు అది(విత్తనము) చచ్చితేనే గాని బ్రతికింపబడదు గదా అంటున్నాడు. అంటే, మానవ దేహంలో మనిషిగా బ్రతికినటువంటి ప్రతీ ఒక్కడు చనిపోయిన తరువాత ఎలా లేస్తాడు? ఎటువంటి శరీరముతో వస్తాడు? అని ఒకవేళ ఆలోచిస్తే.. నీ చుట్టూ ఉన్న ప్రకృతే దానికి సమాధానమంటున్నాడు. ఒక విత్తనమును చూస్తే ఈ విషయం మీకు చాలా సులభంగా అర్థమవుతుంది అంటున్నాడు. పునరుత్థానమును గూర్చి మీరు నేర్చుకోవాలంటే ఏవేవో లోక సంబంధమైన శాస్త్రాలను చదవనక్కరలేదు. మహిమ దేహమును గూర్చి నేర్చుకోవాలనుకుంటే ఈ భూమి మీద లోకసంబంధమైన పుస్తకాలను మీరు తిరగవేయనక్కరలేదు. మీ చుట్టూ ఉన్న విత్తనములు, మొక్కలపై కనీసపు అవగాహన మీకుంటే చాలు. ఏమిటా కనీసపు అవగాహన? విత్తనాలను గూర్చి మీకు తెలుసా? అది తెలిస్తే మహిమ శరీరాన్ని గూర్చి చాలా వరకు తెలిసినట్లే. మానవ శరీరం మహిమ శరీరముగా మారగలదా? అనే ఈ గొప్పదైన అంశమును తెలుసుకోవటానికి నీవు విత్తే విత్తనమును ఒకసారి చూడమంటున్నాడు దేవుడు. నీవు నేర్చుకోవలసిన జ్ఞానము అక్కడే ప్రారంభవుతుంది. ఈ సృష్టిలోనే దేవుడు తనను గూర్చి తెలుసుకోదగిన జ్ఞానమును ఉంచాడు. మనిషికి నేర్పించవలసినటువంటి సంగతులను ఈ ప్రకృతిలో దేవుడు పొందుపరిచాడు. ఆత్మానుసారముగా ఈ ప్రకృతిని గూర్చి ఆలోచిస్తే మీకు దేవుని సంగతులు అర్థమవుతాయి. అందుకే నీవు విత్తునది చూడగా అది ఎలా మార్పు చెందుతుంది? విత్తనము ఒక మొక్కగా మారుతుంది, ఆ మొక్కగా మారేముందు ఆ విత్తనము ఏమవుతుంది? అది చనిపోతుంది. నీవు విత్తునది చూడగా అది చచ్చితేనే గాని బ్రతికింపబడదు. అంటే, మానవ శరీరము మహిమ శరీరముగా మారాలంటే, ఈ మానవ శరీరము ఏమవ్వాలన్నమాట? అది చావాలి! విత్తనం ఒక మొక్కగా మార్పు చెందాలంటే, ఆ విత్తనమును ఒక గొయ్యి తీసి అందులో దానిని కప్పెట్టాలి. ఈ భూమిలో పై పొరలలో దానిని కప్పెట్టాలి. అప్పుడు ఆ విత్తనం క్రుళ్ళిపోయి, చనిపోవాలి. ఆ చనిపోయిన విత్తనములో నుంచి ఒక నూతనమైన మొక్క బయటకు ఉత్పన్నమవ్వాలి. 'నీవు విత్తునది చచ్చితేనే గాని బ్రతికింపబడదు గదా. నీవు విత్తుదానిని చూడగా అది గోధుమ గింజయైనను సరే, మరి ఏ గింజయైనను సరే, వట్టి గింజనే విత్తుచున్నావు గాని పుట్టబోవు శరీరమును విత్తుట లేదు.' అందుకే దేవుడు మనకు ముందుగా మహిమ శరీరాలను ఈ భూమి మీద ఇవ్వలేదు. మానవ శరీరమును మాత్రమే ఈ భూమి మీద ప్రతి ఒక్కరికీ ఇచ్చాడు. ప్రతి తల్లి గర్భములో నుండి బయటికి వస్తున్నటువంటి మనమందరం మానవ దేహాలను ధరించుకొనే బయటకు వచ్చాము. మానవ దేహాలనే మనకు ఎందుకు ఇచ్చాడు అంటే ఇవన్నీ మహిమ దేహాలుగా మారాలి గనుక! తన పొలమంతా

పచ్చగా మారిపోవాలంటే ఒక రైతు ఏమి తెచ్చుకుంటాడు? విత్తనాలనే తెచ్చుకుంటాడు. అంతేగాని అప్పటికే తయారైన, ఫలించిన, ఉత్పత్తినిచ్చిన మొక్కలను ఇమ్మని మాత్రం అడగడు. అడిగినా ఎవ్వరూ ఇవ్వరు. మన ఇంటిలో పెంచుకోవాలన్నా మనము చిన్న చిన్న మొక్కలను తెచ్చుకుంటున్నాము. ఆ లేలేత మొక్కలు రైతుకు దొరకాలంటే అతడు కూడా ముందుగా ఒక విత్తనాన్ని సమకూర్చుకోవాలి. ఒక మొక్కకైనా, ఒక వృక్షానికైనా ప్రారంభం ఒక విత్తనం అనే విషయం మీకు అర్థమయితే మహిమ శరీరాన్ని గూర్చి కూడా మీకు కొంత అర్థమైనట్టే. దేవుడు మానవ దేహాలను భూమి మీద మనుష్యులకు(ఆత్మలకు) ఇచ్చి పంపించాడు. వాటిని మహిమ దేహాలుగా మార్చాలి అంటున్నాడు. నీవు విత్తునది గోధుమగింజ అయినా సరే, మరి ఏ గింజ అయినా సరే వట్టి గింజనే విత్తుచున్నావుగాని పుట్టబోవు శరీరమును విత్తుటలేదు. అయితే నీవు విత్తిన ఈ విత్తనములన్నింటికీ దేవుడే తన చిత్త ప్రకారము శరీరమును ఇచ్చును. ఆయన ప్రతి విత్తనమునకును దాని దాని శరీరమును ఇచ్చుచున్నాడు. విత్తనాలను, మొక్కలను దేవుడు మనకెందుకు చూపిస్తున్నాడంటే వీటి ద్వారా మానవ శరీరము, మహిమ శరీరములను గూర్చి మనకు అర్థమవుతుంది. వీటిని గూర్చిన పరిశోధన మీకు అర్థమైనట్టయితే, ఈ మానవ దేహములో నుండే మహిమ శరీరం రావాలి. మానవ దేహానికి, మహిమ దేహానికి ఒక ముఖ్యమైన విడదీయరాని సంబంధం ఉంది. ఇది మీకు చక్కగా అర్థం కావాలి. మానవ శరీరంతో సంబంధం లేకుండా మహిమ శరీరమును మనము ఎక్కడినుంచో తెచ్చుకోలేము. మహిమశరీరమనగా దానిని మనము దేవుని కృప వలన సంపాదించుకోవాలి. దానికి ఈ మానవ దేహంతో పని ఉంది. ఈ మానవ దేహాన్ని ఉపయోగించి, మనము మహిమ శరీరమును తెచ్చుకోవాలి. ఈ మానవ శరీరమే మహిమ శరీరముగా మారాలి. అలా మారాలంటే ఈ మానవ శరీరం దేవుని కొరకు విత్తబడాలి. మహిమ శరీరము కొరకు ఎదురుచూసేదిగా విత్తబడాలి. అప్పుడు మాత్రమే దీనిలో నుంచి మహిమ శరీరం బయటకి వస్తుంది. చనిపోయినటువంటి మానవ దేహం మరల మహిమ దేహపు జీవితాన్ని సంతరించుకోవటమనే ఈ విషయం పై ఈ భూమిమీద దాదాపుగా ఏ ఒక్కరికీ అవగాహన లేదు. చనిపోయినవాడు మరల మరొక గొప్ప దేహాన్ని, మరొక గొప్ప జీవితాన్ని సంతరించుకోవాలి. దీని ద్వారా దానిని తిరిగి తెచ్చుకోవాలి. అది ఒక ఉన్నతమైన జీవితం. దీని గూర్చి దేవుడు తన గ్రంథంలో చాలా ప్రాముఖ్యంగా వ్రాయించాడు. దీనికి ఆయన పెట్టిన పేరు 'మృతుల పునరుత్థానము'. అనగా, చనిపోయిన వారు తిరిగి లేవటం.

ఇక్కడ మీకు ఒక చిన్న సందేహం రావాలి! చనిపోయినవారందరూ తిరిగి లేస్తారా? లేక దేవుని కొరకు బ్రతికినవారు మాత్రమే తిరిగి లేస్తారా? భూమిలో పడినటువంటి విత్తనాలన్నీ మొక్కలుగా వస్తాయా? లేక కొన్ని మాత్రమే వస్తాయా? దేవుడు తన చిత్తప్రకారము మహిమ శరీరాన్ని ఎవరెవరికి ఏ విధంగా ఇస్తున్నాడు? ఈ విషయాన్ని మనము చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. ఏది ఏమైనా, ఎవరెలా బ్రతికినా అందరికీ జీవ పునరుత్థానము కలిగేటట్టయితే, అందరికీ మహిమ శరీరమే వచ్చేటట్టయితే అసలు మనము ఇలా దీని కొరకు నిత్యజీవ పరిశోధన చేయవలసిన అవసరం లేదు. ఈ భూసంబంధమైన జీవిత కాలములో మనము కూడా మన శరీరం కోరుకున్నట్లుగా ఇక్కడ బ్రతకవచ్చు. కానీ మహిమ శరీరము నిమిత్తము మనము ఈ నిత్యజీవ పరిశోధనలో ఉన్నామంటే, దేవుని గ్రంథమైన బైబిల్ చేతబట్టి ఆత్మజ్ఞానమును ఆలోచిస్తున్నామంటే దీనికి ఒక ప్రత్యేకమైన కారణం ఉండాలి. దీనివలన మనం గొప్ప లాభమును సంపాదించుకోగలగాలి. గనుక ఇప్పుడు మీకు ఆ సందేహ నివృత్తి నిమిత్తం ఒక మంచి సందర్భాన్ని చూపిస్తాను. మృతులైన వారందరిలో ఎవరు ఎలాంటి దేహాలను తమ కొరకు తెచ్చుకుంటారో, మృతులైన వారిలో ఎవరు తిరిగి జీవము కలిగి బ్రతుకుతారో, ఎవరు జీవమును కోల్పోతారో చూద్దాం.

**యోహాను సువార్త 5 : 29 'మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు'** అని వ్రాయబడి ఉంది. అంటే, దేవుడు ఈ భూమిమీద బ్రతికిన మనుష్యులను విభజిస్తున్నాడు మరియు వర్గీకరిస్తున్నాడని మనకు ఇక్కడ అర్థమవుతుంది. పుట్టిన మనుష్యులందరూ చనిపోతున్నారు. ఇందులో మేలు చేసినవారూ చనిపోతున్నారు, కీడు చేసినవారూ చనిపోతున్నారు. ప్రారంభ కాలములో నీతిమంతుడైన హేబెలు చంపబడ్డాడు, దుష్టుడైన కయీను కూడా చనిపోయాడు. నిత్యజీవ పరిశోధన చేసినవారూ చనిపోతున్నారు, లోక సంబంధమైన బ్రతుకును కలిగియున్నవారూ చనిపోతున్నారు. ఇక్కడ మీరు జాగ్రత్తగా అర్థంచేసుకోవాలి.

చనిపోయినవారందరికీ పునరుత్థానము ఉంది, ఒక విధముగా చెప్పాలంటే అందరూ తిరిగి లేవాలి. ఎందుకంటే దేవుడు మానవ శరీరాలను విత్తుతున్నాడు, ఆయన చిత్త ప్రకారము విత్తిన ప్రతిదానికి ఆయన ఇష్టానుసారంగా తిరిగి మహిమ దేహాలను ఇస్తున్నాడు. అయితే ఎవరికి మహిమ దేహాన్నివ్వడం ఆయనకిష్టం? ఎవరికి మహిమ దేహాన్ని దూరంచేయడం ఆయన చిత్తం? ఈ భూమిపై విత్తబడిన మానవ దేహానికి మహిమ దేహం రావాలంటే ఏమి చేయాలో ఇప్పుడు మనము ఆలోచించాలి. ఈ భూమిపై బ్రతికి చనిపోయినవారిలో మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకు, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకు వెళతారంటున్నాడు. ఇక్కడ అంటే పునరుత్థానములో రెండు రకాలు ఉన్నాయి. వర్గీకరణలో ఆయన రెండు విభాగాలను చూపిస్తున్నాడు. మొదటి విభాగం 'మేలు చేసినవారు జీవపునరుత్థానమునకు' వెళతారు. అంటే దేవుని వాక్యానుసారముగా బ్రతికి మేలు చేసినవారు చనిపోయి తిరిగి లేస్తారు. తరువాత రెండో విభాగంలో 'కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకు' బయటకు వస్తారు. దేవుని వాక్యమెరుగక, తమ బ్రతుకు కాలంలో కీడు చేసినవారు ఈ సమాజంలో కోకొల్లలుగా జీవిస్తున్నారు, చనిపోతున్నారు. వీరు తమ విషయమైన దేవుని సంకల్పాన్ని ఎరుగని వారు, తమ పరలోకపు తండ్రియైన దేవునికొరకు బ్రతకనివారు! మరి వీరు కూడా తిరిగి లేస్తారా? వీరికి కూడా పునరుత్థానము ఉంటుందా? మనిషిగా పుట్టిన ప్రతీ ఒక్కరికి పునరుత్థానము అనేది ఉంటుంది. అయితే ఇందులో జీవపునరుత్థానము వేరు, తీర్పు పునరుత్థానము వేరు. మేలు చేసినవారందరూ పునరుత్థానమునకు అసలైన అర్థాన్నిచ్చే 'జీవ పునరుత్థానానికి' వెళుతున్నారు. జీవ పునరుత్థానము అంటే ఏమిటో, తీర్పు పునరుత్థానము అంటే ఏమిటో ఇప్పుడు జాగ్రత్తగా చూద్దాం.

**అపొస్తలుల కార్యములు 24 : 14, 15 'ధర్మశాస్త్రమందును, ప్రవక్తల గ్రంథములయందును వ్రాయబడియున్నవన్నియు నమ్మి, నీతిమంతులకును అనీతిమంతులకును పునరుత్థానము కలుగబోవుచున్నదని వీరు నిరీక్షించుచున్నట్టు నేను కూడా దేవునియందు నిరీక్షణయుంచి, వారు మత భేదమని పేరుపెట్టు ఈ మార్గము చొప్పున నా పితరుల దేవునిని సేవించుచున్నానని తమరి యెదుట ఒప్పుకొనుచున్నాను.'** చనిపోయిన తరువాత ఏమి జరుగుతుంది? ఎవరికి ఏమి ఇవ్వబడుతుంది? అనే ప్రశ్నలకు దేవుడు ఇక్కడ సమాధానములను వ్రాయిస్తున్నాడు చూడండి. మనుష్యుల పునరుత్థానములను దేవుడు వర్గీకరిస్తున్నాడు చూడండి. ధర్మశాస్త్రమందు, ప్రవక్తల గ్రంథములయందు వ్రాయబడియున్నవన్నియు నమ్మి, నీతిమంతులకు అనీతిమంతులకు పునరుత్థానము కలుగబోవుచున్నదని అంటున్నాడంటే పునరుత్థానము ఎవరెవరికి కలుగుతుంది? నీతిమంతులకు కలుగుతుంది, అనీతిమంతులకు కూడా కలుగుతుంది. మేలు చేసినవారికి కలుగుతుంది, కీడు చేసినవారికి కూడా కలుగుతుంది. ఈ ప్రపంచంలో ప్రస్తుతం జీవిస్తున్నటువంటి జనాభా సుమారు 800 కోట్లమంది. వీరంతా చనిపోయిన తరువాత పునరుత్థానాన్ని పొందుతారు. అందరికీ ఈ పునరుత్థానము అనివార్యమైనప్పుడు అందరూ ఇప్పుడు అత్యవసరంగా దేనిని గూర్చి ఆలోచించాలి చెప్పండి? మనుష్యులందరూ ఈ పునరుత్థానమును గూర్చి ప్రాముఖ్యంగా ఆలోచించాలి. మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కడూ దీనిని గూర్చి చనిపోయే వరకు ప్రతి రోజు ఆలోచించవలసిన వారై యుండగా, కనీసం తమ జీవితకాలంలో ఒక్కరోజైనా ఆలోచిస్తున్నారా? పునరుత్థానము అంటే ఏమనుకుంటున్నారు? ఇది చాలా గొప్ప విషయం. జీవ పునరుత్థానమంటే, అది నిత్యకాలము ఉండేది. అది ఈ భూమి మీద ఉన్న అతి చిన్న జీవితకాలము వంటిది కాదు. పునరుత్థానమంటే చనిపోయిన ప్రతి మనిషి మరల ఈ భూమి మీదే మరో మనిషిలాగో లేక జంతువులాగో లేక పక్షిలాగో బ్రతికేందుకు జరిగే ఉత్థానము కానే కాదు. దానికొరకే అయితే దేవుడు మనిషిని ఆ దేహములో నుండి తిరిగి లేపనక్కర్లేదు. మరల బహు తక్కువ కాలము ఈ భూమి మీద జీవించడానికే అయితే దేవుడు మనిషికి పునరుత్థానాన్నే ఇవ్వనక్కర్లేదు. ఏడేడు జన్మలు ఈ భూమి మీదే జనింపజేయటంలో అర్థం లేదు, దానికి ఆధారమూ లేదు. దేవుడు తన గ్రంథములో వ్రాయించిన పునరుత్థానమనేది ఒక గొప్ప విషయం. ఈ ప్రపంచంలోనే అది చాలా అద్భుతమైనటువంటి విషయం. ఈ పునరుత్థానము ఎవరెవరికి కలుగుతుంది? మేలు చేసినవారికీ, కీడు చేసినవారికీ కలుగుతుంది. నీతిమంతులకూ, అనీతిమంతులకూ కలుగుతుంది. తమ మరణ దినములోపు దేవునివాక్యముచే నీతిమంతులని నిర్ధారించబడిన వారికి కలిగే పునరుత్థానము, పరలోకపు నిత్య జీవితముతో ముడిపడి ఉంటుంది. అది మన తండ్రియైన దేవుని మధ్య నివాసముగా ఉంటుంది. ఈ పునరుత్థానమందు నీతిమంతులు తెచ్చుకునే దేహం ఎలా ఉంటుంది? దాని పేరే మహిమ దేహము. అది నీతిమంతులైనవారు భూమి మీద తమ బ్రతుకుకాలములో

దేవుని కొరకు నీతిని జరిగించినప్పుడు వారికి వచ్చే ప్రతిఫలం! దేవుని కొరకు బ్రతికినవారికి వచ్చే లాభమే జీవ పునరుత్థానము. కీడు పునరుత్థానము కొరకే అయితే దేవుని కొరకు బ్రతుకవలసిన, దీనిని చదువవలసిన, నిత్యజీవ పరిశోధన చేయవలసిన అవసరమే లేదు. మనిషి తన బ్రతుకుకాలములో తన ఇష్టానుసారముగా జీవిస్తే చాలు, కీడు పునరుత్థానము సంభవిస్తుంది. నిత్య నాశనం ఏమీ చేయకపోయినా వచ్చేస్తుంది, దొరికేస్తుంది. దానిని పొందడానికి ఏ పరిశోధనా అక్కరలేదు. అందుకే ఈ సమాజంలో ఉన్నటువంటి మనుష్యులు దేవుని కొరకు ఏమీ చేయటంలేదు. అతి చిన్న భూజీవితకాలము కోసం మాత్రమే వారు ఆలోచిస్తున్నారు. అలా ఉండే వారికి కీడు పునరుత్థానము తప్పదు!

ఇంతకీ మేలు పునరుత్థానం మరియు కీడు పునరుత్థానం; ఈ రెండింటిలో ఏది గొప్పది? దేనిని మనము కోరుకోవాలి? దేనిని మనము అసహ్యించుకోవాలి? జీవ పునరుత్థానాన్ని మాత్రమే మనము కోరుకోవాలి. ఎందుకంటే నిత్యకాలము సంతోషంగా ఉండే జీవితమది. అది మహిమ దేహంలో నివసించే జీవితం. ఒక చిన్నపాటి దేహాన్ని దేవుడు ఈ భూమి మీద మనకు అనుగ్రహించినప్పుడు దీనిలో ఉంటేనే మనము ఇది ఇంత గొప్ప బ్రతుకా.. అనుకుంటున్నాము కదా! ఈ జీవితమే గొప్పదైతే రాబోయే మహిమ జీవితం ఇంకెంత గొప్పదిగా ఉంటుందో ఆలోచించండి. రోజు రోజుకి క్షీణించిపోయే ఈ దేహంలో ఉన్నప్పుడే మనము దీనిని గూర్చి ఇంత ఆనందిస్తున్నప్పుడు, మహిమ దేహంలో ఉంటే ఇంకెంత ఆనందిస్తామో చెప్పండి. మహిమ దేహము అనగానే అది ఒక గొప్పదైన దేహము అని అర్థం. ఒక ఘనమైనటువంటి దేహములో దేవుడు మనలను ఉంచాలి అని ఆశపడుచున్నాడు. జీవ పునరుత్థానము పొందిన ప్రతి ఒక్కరికీ ఆయన సిద్ధపరచిన మహిమ దేహాన్ని ఇవ్వాలని ఆయన నిర్ణయించాడు. ఈ మహిమ దేహములు దేవుని కొరకు బ్రతికిన నీతిమంతులకు మాత్రమే సిద్ధం చేయబడ్డాయి. అందుకే దేవుడు తన వర్గీకరణలో ఏమంటున్నాడంటే, భూమి మీద చనిపోయే ప్రతీ ఒక్కరికీ పునరుత్థానము కలుగుతుంది. అయితే వారిలో మేలు పునరుత్థానానికి అర్హత పొంది వెళ్లేవారు కొంతమందయితే, కీడు పునరుత్థానానికి జారిపోయేవారు మరి కొంతమంది. ఒకవేళ ఇక్కడ మీకు ఒక సందేహం రావచ్చు. అదేమిటంటే, మేలు పునరుత్థానమైనా, కీడుపునరుత్థానమైనా అది పునరుత్థానమే కదా. కనుక ఈ భూమి మీద మన ఇష్టాలను వదులుకొని దేవుని వాక్యములో వ్రాయబడిన విధంగా బ్రతకడానికి ఇంత కష్టపడడం ఎందుకు? మేము కీడు పునరుత్థానానికే వెళతాము అని ఒకవేళ ఎవరైనా అనుకుంటే, అసలు కీడు పునరుత్థానమనేది ఎలా ఉంటుందో దేవుని వాక్యమునుబట్టి దానిని గూర్చి మీకు కొంత చెబుతాను. ఎందుకంటే, ముందుగా దానిని గూర్చి తెలుసుకొన్న తరువాత అప్పుడు అక్కడకు వెళ్లండి.

ఉదాహరణకి ఎవరికైనా ఒక విపరీతమైనటువంటి రోగము వచ్చిందనుకోండి. వాడు పడకమీదే పడుకున్నాడనుకోండి. వైద్యుడు వచ్చి ఆ రోగిని పరీక్ష చేసిన తరువాత, ఆ రోగితో నీకు వచ్చినటువంటి రోగం చాలా భయంకరమైనది. నీ జీవితకాలమంతా ఈ రోగం నీతోనే ఉంటుంది. దీనికి వైద్యంగాని/ఔషధంగాని లేదు అన్నాడనుకోండి. అప్పుడా రోగి ఏమనుకుంటాడు చెప్పండి? పోనీలే, జీవిత కాలమంతా ఈ పడక మీదే ఉందాం అనుకుంటాడా? తన జీవితమంతా రోగంతోనే/బాధతోనే దినదినమూ బహువేదనపడుతూ ఉన్నప్పుడు సదరు రోగి మనసు ఎలా ఉంటుందో తెలుసా? ఇక నేను చనిపోతే బాగుండును అనుకుంటాడు. నేను నా జీవితమంతా ఈ వేదన అనుభవించలేను, నేను చనిపోతే బాగుండును అనుకుంటాడు. అప్పుడప్పుడు క్షణికావేశంలో తమ ఒంటిమీద కిరోసిన్ పోసుకొని కాల్చుకొన్నటువంటివారు సుమారు 70%, 80%, 90% కూడా కాలిపోయినటువంటి దేహాలతో అప్పుడప్పుడు మనకు కనిపిస్తుంటారు. అప్పుడు వారి బాధ ఎంత వర్ణణాతీతముగా ఉంటుందో తెలుసా? నిజంగా నేను చనిపోతే బాగుండును అని అనుకుంటారు వారు. క్షణికావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నాను, ఇక మీదట నా దేహం మామూలు దేహముగా తయారవ్వదు, ఇకపై నా దేహం మిగిలిన వారందరి దేహాల వలె ఉండదు, అలా కనిపించదు, చాలా బలహీనమైన దేహముగా అయిపోయిందని వారు చాలా బాధపడతారు. చర్మం కాలిపోతే అది చాలా పలచని పొరలా అయిపోతుంది. ఒకవేళ అలా కాలినచోట మరల ఎక్కడైనా చిన్న దెబ్బ తగిలిందంటే వారికి వెంటనే అక్కడ నుండి రక్తం వచ్చేస్తుంది. ఒక మోస్తరు చలికి కూడా వారు తట్టుకోలేరు. ఎందుకంటే వారి చర్మం పైపొర అంతా కాలిపోయింది. శరీర లేపనాలు

పూయగా పూయగా లోపలున్న ఆ పలచని పొర మాత్రమే మిగిలి ఉంటుంది. అలాంటప్పుడు వారు ఏమనుకుంటారో తెలుసా? నేను చనిపోతే బాగుండును అనుకుంటారు. ఎయిడ్స్ అనే భయంకరమైన మహమ్మారి రోగం మీకు తెలుసు. అది వచ్చిన తరువాత పోదని, దానికి వైద్యం లేదని చాలా మందికి తెలుసు. ఎయిడ్స్ వచ్చిన రోగి తన రోగం బాగా ముదిరి మంచం మీద పడిపోయిన తరువాత ఏమనుకుంటాడో తెలుసా? ఇక నేను చనిపోతే బాగుండును అనుకుంటాడు. వీటన్నింటిని మీరు బాగా ఆలోచించాలి. రోగంతో ఉన్న వ్యక్తి జీవితాంతం రోగంతోనే ఉండాలనుకుంటున్నాడా? ఉండకూడదనుకుంటున్నాడు. ఆరోగ్యంతో ఉన్న వ్యక్తి జీవితాంతం ఆరోగ్యంగా ఉండాలనుకుంటున్నాడు. చచ్చిపోవాలని మాత్రం అనుకోడు. మరి రోగంతో ఉన్నవాడే తాను చచ్చిపోవాలని ఎందుకు అనుకుంటున్నాడు చెప్పండి? దానికి కారణం వారి రోగం వారిని ప్రతినిత్యం బాధపెడుతుంది. సరిగ్గా కీడు పునరుత్థానము కూడా ఇటువంటిదే. కీడు పునరుత్థానము పొందిన వారిని దేవుడు చావనివ్వడు. ఆత్మలైన వారు చావడానికి అవకాశమే లేదు. ఎందుకంటే అది కూడా పునరుత్థానమే కదా! కానీ అది కీడు పునరుత్థానము, అది తీర్పు పునరుత్థానము. అక్కడ ప్రతినిత్యం మీ చెవికి మిమ్మును గూర్చిన తీర్పు వినిపిస్తుంది తప్ప, జీవము కలిగిన మాటలు వినిపించవు. అక్కడ మీ చుట్టూ మీవలె వేదనను అనుభవిస్తున్న పాపాత్ముల సంచారము ఉంటుంది. అది మృతుల లోకం. అది పాతాళ లోకం. అక్కడకు వెళ్ళే ప్రతి ఒక్కరూ తీరని వేదనతో ఉంటారు. అందుకే దేవుడు దానిని గూర్చి ఒక చిన్న మాటలో ఏమంటున్నాడో తెలుసా? అది తీర్పు పునరుత్థానము! అక్కడ వేదనయు, పండ్లు కొరుకుటయు నిరంతరము ఉంటాయి. ఈ కీడు పునరుత్థానమును మీరు ససేమిరా కోరుకోకూడదు. ఉదాహరణకి మీరు రాజకీయ ప్రవేశం చేస్తున్నప్పుడు మీరు ఎప్పుడు ఎక్కడ పోటీ చేసినా ప్రతిసారి ఓడిపోతారు అని తెలిసిపోయిందనుకోండి. అలాంటప్పుడు ఎవరైనా ఇక వారి జీవితంలో రాజకీయాలలోనికి వెళతారా? నేను ఎప్పుడు పోటీ చేసినా ఓడిపోతానట, నిత్యమూ నాకు ఓటమేనట అని తెలిసినప్పుడు అలాంటి వారు రాజకీయ సన్యాసం చేయటం మంచిది. వారు రాజకీయాలలోనికి వెళ్ళటం ఏమాత్రం ఉపయోగం లేదు. నీవు ఎంత చదివినా నిత్యమూ ఫెయిలైపోతావు అని ఒక ఉపాధ్యాయుడు తన విద్యార్థిని గూర్చి చెప్పాడనుకోండి. వాడు తరగతి గదిలో కూర్చుని ఉపయోగం లేదు. నీకు నేను కాదుకదా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వచ్చి పాఠాలు చెప్పినా ఫెయిలైపోతావని చెబితే వాడు ఇక తరగతికి వచ్చి ఏమి ఉపయోగం? అప్పుడు ఆ విద్యార్థి ఏమనుకుంటాడు? టి.సి. తీసుకొని వెళ్ళి ఏదో తనకు నచ్చిన పని నేర్చుకుంటాడు, దానిని చేసుకుంటాడు. మీరు జాగ్రత్తగా ఆలోచించాలి. ఎవరికైనా నిత్యము ఉండేటువంటి బాధ అంటే అది చాలా గొప్పది. దానిని మనం ద్వేషించాలి. దానికి మనము దూరమైపోవాలి. దానిని మనము పొందాలనుకోకూడదు. ఎందుకంటే అలాంటి బాధను అనుభవించేకన్నా చనిపోతే బాగుండును, ఇది ముగింపబడితే బాగుండును అనుకున్నప్పుడు అది మనకు అవసరమా? కొన్నిసార్లు కరడుగట్టిన నేరస్తులకు యావజ్జీవ ఖైదు పడుతుంది. ఇక నీవు కారాగారములోనే నీ బ్రతుకు దినములన్నీ గడపాలని జడ్జిగారు ఒక తీర్మానమును రాసిచ్చేస్తారు. యావజ్జీవ కారాగారమంటే అతడు బ్రతికియున్నంత కాలం కటకటాల వెనకే ఉండాలి. అలాంటప్పుడు ఆ నేరస్తుడు ఏమనుకుంటాడు? చనిపోతే బాగుండును అనుకుంటాడు. ఇక వాడు ఈ లోకాన్ని చూడలేడు, స్వేచ్ఛగా తిరగలేడు. తన జీవితం అక్కడే ముగింపబడుతుంది, తాను అక్కడే సమాధిచేయబడతాడు. అలా అయితే ఇక నా జీవితం ఎందుకు అనుకుంటాడు. కానీ, నేరం చేయకుండా స్వేచ్ఛగా బయట తిరుగుతున్నవాడు ఏమనుకుంటాడు? నేను ఇంకా బ్రతకాలి, నేను ఇంకా బ్రతకాలి అనుకుంటాడు. ఒకనికి ఏదైనా ప్రాణాపాయ స్థితి వచ్చినప్పుడు వాడు తనకున్న దానినంతా ఖర్చుపెట్టైనా సరే బ్రతకాలి, బ్రతకాలి అనుకుంటాడు. ఎందుకంటే, వాడు స్వేచ్ఛగా జీవిస్తున్నాడు. కానీ జైలులో ఉన్నవాడు మాత్రం, నాకెందుకులే ఈ బ్రతుకు అనుకుంటాడు. కీడు పునరుత్థానము ఎంత దుర్భరమైనదో, మేలు పునరుత్థానము ఎంత గొప్పదో ఇప్పటికైనా మీరు చాలా జాగ్రత్తగా నిర్ధారించుకోవాలి. ఈ జ్ఞానము తెలియకే సమాజంలో చాలామంది మోసపోతున్నారు. నేటి తరంలో చాలామంది మనుష్యులు దీనిని గూర్చిన అవగాహన లేక తిరుగుతున్నారంటే ఖచ్చితంగా వారంతా కీడు పునరుత్థానమును పొందటానికే ఎదురుచూస్తున్నారు. వారందరూ దానికే సిద్ధపడిపోతున్నారు. కానీ దాని వెనుక ఎంత భయంకరమైన శిక్ష ఎదురుచూస్తుందో, వారు ముగింపును మరణాన్ని కోరుకున్నా సరే అది వారికి దేవుడు ఇవ్వడన్న సంగతి అర్థం కావటం లేదు. ప్రియ చదువరులారా! ప్రతీ ఒక్కరూ పునరుత్థానములో పాలుపొందాలి, వారికొక దేహాన్ని తెచ్చుకోవాలి. అది

మహిమ దేహ సంబంధమైన జీవితమా? లేక కీడు సంబంధమైన జీవితమా అనేది మీరు ఈ భూమిపై దేవుని కొరకు చేసిన పనుల మీద, మీ జీవితం మీద, మీ భక్తి మీద, నిత్యజీవముపై మీ పరిశోధన మీద ఆధారపడి ఉంటుంది.

**కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 5 : 1- 'భూమిమీద మన గుడారమైన యీ నివాసము శిథిలమైపోయినను, చేతిపనికాక దేవునిచేత కట్టబడినదియు, నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకు ఉన్నదని యెరుగుదుము.'** ఈ సంగతి ఎవరికి తెలుసు? ఈ ఆత్మజ్ఞానాన్ని ఎవరు నమ్మగలరు? ఈ భూమిమీద మనము ధరించుకున్న శరీరమనే ఈ నివాసము మన ఆయుష్షు తీరగానే శిథిలమై మట్టిలో కలిసిపోతుంది. ఈ ప్రకృతిలో మీ కళ్ల ముందు కనిపించేవి ఎన్నో శిథిలమైపోవడం మనము చూస్తున్నాం. ఎంతో అంగరంగ వైభవంగా కట్టిన భవనం కొంత కాలానికి శిథిలమైపోతుంది. భవనమంతా ఒకేసారి కూలిపోకపోవచ్చు. కట్టిన కొంత కాలానికి ప్రారంభంలో కొద్ది కొద్దిగా భవనము యొక్క రంగు మారుతుంది. ఇంకా కొద్ది రోజులు గడిచేసరికి కొద్ది కొద్దిగా గోడలు బీటలు వారతాయి, గోడలో నుండి పెచ్చులు బయటికి వస్తాయి. ఆ తరువాత భారీ వర్షాలకు అక్కడక్కడ రంధ్రాలు పడి వర్షపునీరు భవనం లోపల కురుస్తుంది. ఆ తరువాత కొంత కాలానికి చెద పురుగులు, ఆ తరువాత కొంతకాలానికి ముక్కిపోయిన వాసన, ఆ తరువాత కొంతకాలానికి ఒకేసారి కూలిపోతుంది. చూసారా! మనము ధరించుకున్న ఈ మానవదేహం కూడా మనకు ముందుగా కొన్ని సూచనలు ఇస్తుంది. నేను కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నానని మనకు చెబుతుంది. మన చర్మం ముడతలు పడుతుంది అంటే పెచ్చులు ఊడిపోతున్నాయని అర్థం. మన కిడ్నీలు పాడైపోయాయంటే లోపల దూలాలు పుచ్చుపడుతున్నాయని అర్థం. మీరు ఈ శరీరానికి చక్కగా మేకప్ వేసినంత మాత్రాన కుదరదు. ఈ శరీరం రోజు రోజుకూ లోలోపల పాడైపోతూ, అనగా శిథిలమైపోతూ ఒకానొక రోజున పూర్తిగా పడిపోతుంది. మనము ధరించుకున్న ఈ దేహం ఇలాంటిది కనుకనే దేవుడు తన గ్రంథములో ఏమంటున్నాడో చూడండి. భూమి మీద మీరు ధరించుకున్న ఈ దేహం, కొద్దికాలము మీ గుడారమైన ఈ నివాసము శిథిలమైపోయినను మీరు బాధపడకండి. వయస్సు మీద పడే కొద్దీ మీ కళ్ళు సరిగా కనిపించడం లేదని బాధపడకండి. ఎందుకంటే ఇది ఎలాగూ కొంతకాలానికి శిథిలమైపోయే దేహం. ఈ శిథిలమైపోయిన దేహము ద్వారానే మీరు మహిమ దేహాన్ని తెచ్చుకోవడానికి ఎంతైనా ప్రయత్నం చేయాలి. మానవ శరీరంలో మనకు జరిగిన నష్టాన్ని మహిమ దేహాన్ని సంపాదించుకోవడం ద్వారా భర్తీ చేసుకోవాలి. ఎందుకంటే మహిమ దేహం శిథిలము కాని దేహం. మహిమ దేహపు జీవితంలో మనకు కళ్లు కనిపించడం లేదనే పరిస్థితి లేదు. చర్మం ముడతలు పడిపోతుంది అనే పరిస్థితి లేదు. కొంతకాలానికి మన కాళ్ళు వంగిపోతాయి అనే ఆవేదన లేదు. ఏ క్షణమైనా ఏదో ఒక రోగం వచ్చి మనలను పీడిస్తుందనే బాధ లేదు. ఎందుకంటే మనము తెచ్చుకొనబోయే మహిమ శరీరము ఎలాంటిదో తెలుసా? దేవుడు దానిని గూర్చి చెబుతున్నాడు. భూమి మీద మన గుడారమైన ఈ శరీరమనే నివాసము శిథిలమైపోయిననూ, శిథిలమవ్వని ఒక గొప్ప నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము. అది దేవుడు కట్టిన దేహము, నిత్య కాలము ఉండే మహిమ దేహము.

ప్రియులారా! దేవుడనుగ్రహించే మహిమ దేహము నిత్యమైనదైతే, మనము ధరించుకున్న నేటి మానవ దేహము తాత్కాలికమైనది. **కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 5 : 2వ వచనంలో** ఏమని వ్రాయబడిందో చూడండి. **'మనము దిగంబరులము కాక వస్త్రము ధరించుకొనినవారముగా కనబడుదుము. కాబట్టి పరలోకములోనుండి వచ్చు మన నివాసము దీనిపైని ధరించుకొననపేక్షించుచు దీనిలో మూల్గుచున్నాము.'** ఆత్మగా మనము ఈ మానవ దేహాన్ని విడిచిపెట్టినప్పుడు, మన దేహము ఈ మట్టిలో కలుస్తున్నప్పుడు, మనము దిగంబరులమయిపోతామేమోననే భయము మనకక్కరలేదు. మనము దేవునికుమారులుగా బ్రతికితే మహిమ దేహమును ధరించుకొంటాం. అందుకే పునరుత్థానము పొందినప్పుడు మీరు దిగంబరులుగా ఉండకుండా మీకు ఒక మహిమ దేహాన్ని ఇవ్వటానికి దేవుడు దానిని సిద్ధపరచుచున్నాడు. జీవ పునరుత్థానమును గూర్చి ఇంత వివరణ తన గ్రంథమందు దేవుడు వ్రాయించాడు. మనము దిగంబరులము కాక వస్త్రము ధరించుకొనినవారముగా కనబడుదుము. దీనిపైన పరలోకము నుండి వచ్చిన ఆ మహిమ దేహాన్ని ధరించుకోవాలి. ఈ సభ్య సమాజం దీనిని గూర్చి ఎప్పుడైనా ఆలోచించిందా? ఎప్పుడైనా ఇటువంటి పరిశోధన

చేసారా? ఈ మానవ దేహం మహిమ దేహంగా మారాలంటే ఆ మహిమ దేహం ఎక్కడ నుంచి రావాలి? భూమి నుండా, పాతాళలోకము నుండా, గాలి నుండా, దేవదూతల నుండా? కానే కాదు. అది పరలోకము నుండి వస్తుంది. అందుకే ఆ నిత్య నివాసమును, ఆ ఆలయాన్ని, ఆ మహిమ దేహాన్ని సంపాదించుకోవటానికి ఈ భూమి మీద మీ బ్రతుకుకాలంలో మీరు దేవుని కొరకు మూల్గుచు బ్రతకాలి. అసలు మీకు దేని కొరకు వస్తున్నాయి మూల్గులు? ఉద్యోగం చేస్తున్నందుకా? సంసారాన్ని నడిపిస్తున్నందుకా? లోక సంబంధమైన ప్రేమ ఫలించనందుకా? ఆస్తిలో నష్టపోయినందుకా? బంధం విడిపోయినందుకా? అధికారము కోల్పోయినందుకా? కాదు కాదు. వీటికొరకు కాదు మీరు బాధపడాల్సింది. మీరు దేవుని కొరకు పనిచేస్తున్నప్పుడు మీకు మూల్గులు రావాలి. అంటే, ఈ మానవ దేహములో మూల్గేటంతగా మీరు దేవుని కొరకు బ్రతకాలని అర్థం. మీ ఇష్టాన్ని మీరు నెరవేర్చుకుంటున్నప్పుడు కాదు, లోకం కొరకు మీరు బ్రతుకుతున్నప్పుడూ కాదు. బ్రతుకు చక్రంలో మీరు ఆవేశపడుతూ తద్వారా మీకు వచ్చే మూల్గులను గూర్చి దేవాధి దేవుడు ఇక్కడ మాట్లాడటం లేదు. మీరు దేవుని పనిని చేస్తున్నప్పుడు, ఆయన కొరకు ఆయాసపడుతున్నప్పుడు మీకు వచ్చే మూల్గులను గూర్చి ఇక్కడ వ్రాయబడింది. అందు నిమిత్తము మీరు ఈ మానవ దేహములో ఉండి మీరు ఎందుకు మూల్గుతున్నారంటే, పరలోకంలో మీకొరకు నిర్మించబడియున్న మీ శాశ్వతమైన నివాసమును సంపాదించుకొను నిమిత్తమే మీరు ఇందులో ఉండి మూల్గుతున్నారు. **కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 5 : 3- 'ఈ గుడారములోనున్న మనము భారము మోసికొని మూల్గుచున్నాము. ఇది తీసివేయవలెనని కాదు గాని మర్త్యమైనది జీవముచేత మ్రింగివేయబడునట్లు, ఆ నివాసమును దీనిపైని ధరించుకొన గోరుచున్నాము.'** ఈ మానవ దేహమును తీసివేయాలని కాదు. ఈ మానవ దేహంతోనే అసలైన పని ఉంది. ఈ మానవ దేహాన్ని మనము దేవుని సేవలో వాడినప్పుడు, దేవుని కొరకు దీనిని వినియోగించినప్పుడు దీనిపైననే దేవుడు ఆ మహిమ దేహాన్ని ధరింపజేస్తానంటున్నాడు. మర్త్యమైనది అనగా నాశనమయ్యేది, రాబోవు జీవముచేత మ్రింగివేయబడాలని మనము గ్రహించాలి. మనము ధరించుకున్న ఈ దేహమే మర్త్యమైనది. ఇది నాశనమునకు లోనయ్యేది. ఇది జీవముచేత మ్రింగబడాలి. అనగా జీవము కలిగిన ఆ మహిమ దేహము వచ్చినప్పుడు, ఇది దాని చేత మ్రింగివేయబడాలి, మహిమ దేహమును మనము ధరించుకోవాలి. **కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 5 : 5 'దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే.'** అంటే ఈ మహిమ దేహానికి 'కర్త' ఎవరైనా ఉన్నారంటే అది దేవుడే! ఈ మహిమ దేహాన్ని భూమి మీద ఉన్న మానవులకు అనుగ్రహించడానికి ఉన్న ఏకైక దిక్కే - పరలోకమందున్న తండ్రి! ఇక ఎవ్వరూ దీనిని సంపాదించి ఇవ్వలేరు. దీనిని మనకు తెచ్చిపెట్టలేరు.

ఈ భూమి మీద మనిషి తెలివితేటలు ఎంత వరకు అంటే, ఒక మనిషి మరో మనిషిని కాల్చకుండా బుల్లెట్ సూట్ తయారుచేసుకున్నాడు. మనిషి పరిజ్ఞానం అంతవరకే. ఒక మనిషిని మరో మనిషి కాల్చి చంపేస్తాడనే భయం ఒకడిలో పుట్టిన వెంటనే వాడు తన శరీరంపై ఒక బుల్లెట్ సూట్ ధరించుకుంటాడు. ఒకవేళ మనిషి అంతరిక్షంలోనికి వెళ్లాలనుకుంటే, అక్కడికి ఈ దేహంతో వెళితే ఈ మానవ దేహం తట్టుకోలేదు గనుక స్పేస్ సూట్ తయారుచేసుకున్నాడు. ఈ స్పేస్ సూట్ అంతరిక్షంలోనికి వెళ్లేటప్పుడు ధరించుకోవలసిన ప్రత్యేకమైన వస్త్రం అనుకున్నాడు. అంటే అంతరిక్షంలోనికి వెళ్ళినాగాని ఈ మానవ దేహానికి ఏమీ కానటువంటి వస్త్రమన్నమాట. ఈ భూమిమీద ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, అగ్నిమాపక దళంలో పనిచేసేవారు అగ్ని కీలలలోనికి వెళ్లి ఎవరినైనా రక్షించాలనుకుంటే ఫైర్ సూట్ ధరించాలనుకుంటారు. నీటిలో ఈదాలనుకుంటే స్విమ్ సూట్ ధరించాలనుకుంటారు. రసాయనాలతో పని చేయాలనుకుంటే కెమికల్ సూట్ ధరించాలనుకుంటారు. ఇవన్నీ ఈ మానవ దేహాన్ని ఇక్కడ జీవించి ఉన్నంతకాలము మాత్రమే కాపాడేటటువంటి వస్త్రాలన్నమాట. కానీ మన ఆయుష్షు తీరిన వెంటనే ఈ భూమిని విడిచి మనము మరో లోకానికి వెళ్ళాలి. అలాంటప్పుడు మనకు అక్కడ ఎలాంటి దేహము ఉండాలి? మనకు అక్కడ ఎలాంటి సూట్ ఉండాలి. అంతరిక్షంలోనికి వెళుతున్న మనిషి, పరలోక ప్రయాణముతో పోల్చి చూస్తే చాలా చిన్న దూరమును మాత్రమే ప్రయాణిస్తున్నాడు. ఇది మహా అయితే కొన్ని వేల కిలోమీటర్ల దూరం. ఈ భూమిని విడిచి, ఈ వాతావరణాన్ని విడిచి, పైనున్న అంతరిక్షములోనికి అతి కొద్ది దూరపు ప్రయాణానికే మనకు స్పేస్ సూట్ అవసరమైతే, నీటిలో కొద్ది లోతుకి వెళ్ళగానే మనకు స్విమ్ సూట్ అవసరమైతే, అగ్నికీలలలో కాలిపోకుండా ఉండేందుకు మనకు ఫైర్ సూట్ అవసరమైతే,

రసాయనాల తాకిడికి పాడవ్వకుండా ఉండేందుకు కెమికల్ సూట్ అవసరమైతే, పరలోకపు ప్రయాణానికి మహిమ దేహం (మైటీ సూట్) అవసరం లేదంటారా? మనము మరణించిన తరువాత ఈ లోకాన్ని దాటుకొని మరో లోకానికి ఒక్క క్షణములో వెళ్ళాలి. అందుకే దేవుడు తన లోకంలో మనకు ఏ దేహమైతే ఉండాలో, ఆయన లోకంలో మన ఆత్మలను ఏ దేహమైతే కాపాడగలదో అటువంటి మహిమ దేహాన్ని అక్కడ తయారుచేసి ఉంచుతున్నాడు. అందుకే ఆయన ఏమి వ్రాయించాడో చూడండి. **కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 5 : 5 'దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే. మరియు ఆయన తన ఆత్మ అను సంచకరువును మనకనుగ్రహించియున్నాడు.'** మహిమ దేహాన్ని మనము సంపాదించుకోవాలి అంటే ఆయన ఆత్మ సహాయం మనకు ఉండాలి అని వ్రాయబడింది. మనయందు ఆయనకున్న ప్రేమ చేత, మహిమ దేహము విషయమై ఆయన ఎన్ని వివరాలను పొందుపరిచాడో మీరు ఆలోచించండి. లోకమందున్న మనుష్యులు వ్రాసుకున్న ఏ శాస్త్రములోనూ మహిమ దేహాన్ని గూర్చిన విషయాలు లేవు. ఏ పుస్తకములోనూ ఈ సంగతులు మనకు కనిపించవు. ఈ బ్రతుకులో ఖచ్చితంగా మనము మహిమ దేహాన్ని పొందుటకు అర్హులము కావాలి. జీవ పునరుత్థానములో మనము పాలుపొందాలంటే ఖచ్చితంగా మనము మహిమ దేహాన్ని సంపాదించుకొని తీరాలి.

**ఫిలిప్పీయులకు 3 : 20, 21 'మన పౌరస్థితి పరలోకమునందున్నది; అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీన శరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును.'** ఈ భూమి మీద మన పౌరస్థితి లేనే లేదు. ఇక్కడ మన జీవితం శాశ్వతం కాదు. ఏ మనిషైనా ఇక్కడ శాశ్వతం కాదు. అతడు జాతిపిత గాంధీజీ అయినా సరే, ఆమె ముఖ్యమంత్రి అయిన జయలలిత అయినా సరే. తమ దేహాన్ని, తమ దేశాన్ని, తమ రాష్ట్రాన్ని, తన పార్టీని, తమ ధనాన్ని, తమ బంధువర్గాన్నంతటినీ విడిచిపెట్టి వెళ్ళిపోవాలి. విడిచి పెట్టిన వాటిని ఇక్కడ ఇంకా బ్రతుకుతున్నవారందరూ ఆక్రమించుకుంటారు. ఎందుకంటే మన పౌరస్థితి ఇక్కడిది కాదు. భూమి మీద ఉన్న ఏ మనిషిదైనా తన పౌరస్థితి ఇక్కడిది కాదు. ఒకడు దేవుని కొరకు బ్రతికితే తనకు పరలోకంలో పౌరస్థితి, ఒకడు దేవుని కొరకు బ్రతకకపోతే పాతాళలోకంలో తనకు పౌరస్థితి ఉంటుంది. ఈ భూమిపై బ్రతికిన ప్రతి ఒక్కరూ పునరుత్థానము చెందాలి. ఇక్కడ జీవ పునరుత్థానాన్ని గూర్చి దేవుడు మాట్లాడుతూ నిత్యజీవ పరిశోధన చేసేవారిని గూర్చి ఆయన ఏమంటున్నాడో తెలుసా? మన పౌరస్థితి పరలోకమందున్నది. అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము మనము కనిపెట్టుకొనియున్నాము. ఎందుకంటే, ఆయన వలననే మనకు ఇవన్నీ సాధ్యమయ్యాయి. ఆయన వలననే మనము దేవుడనుగ్రహించే ఈ మహిమ దేహాన్ని సంపాదించుకోగలుగుచున్నాము. ఆయన వలనే మనము మరల పరలోకంలో అడుగుపెట్టగలము. మనము ధరించుకున్న ఈ శరీరం దీనశరీరం, ప్రకృతి సంబంధమైనది, రోగాలబారిన పడేది, కష్టపడేది, అలసిపోయేది, కొంతకాలానికి మరణించేది! దేవుని కొరకు మనము బ్రతికితే ఈ దీనశరీరమును ఆయన తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును. ప్రారంభ శతాబ్దంలో క్రైస్తవులైన ఫిలిప్పీయులకు అపొస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మ ద్వారా ఈ పత్రిక వ్రాస్తున్నప్పటికే యేసుక్రీస్తు వారికి మహిమ దేహం ఉంది. యేసుక్రీస్తు ఈ భూమిమీదకు వచ్చినప్పుడు కన్య మరియ గర్భము నుండి ఆయన తెచ్చుకొన్న దేహము కూడా మనము ధరించుకున్నలాంటి మానవ దేహమే. ఈ భూమి మీద యేసు జీవించి ఉండగా యెరూషలేము ప్రాంతంలో సంచరించినప్పుడు ఆయన ధరించుకొన్న దేహము ఈ మర్త్యశరీరమే. కానీ ఆయన మరణించి, సమాధి చేయబడి, తిరిగి లేచినప్పుడు తండ్రి వలన ఒక మహిమ శరీరాన్ని ఆయన సంపాదించుకున్నాడు. అంటే యేసుక్రీస్తు అప్పటికే, అనగా సుమారు 2000 సంవత్సరాల క్రితమే తనకు మహిమ శరీరాన్ని తెచ్చుకున్న దానిని బట్టి, సరిగ్గా అటువంటి మహిమ శరీరానికి సమరూపము గల మహిమ శరీరమును మనకు కూడా ఇచ్చేందుకు ప్రణాళిక రచించబడినది. గనుక ఆనాటి నుంచి మన రక్షకుడైన యేసుక్రీస్తు కలిగియున్న మహిమ శరీరానికి సమరూపము గలదానిగా మన దేహాన్ని కూడా మనము మార్చుకోవాలి. ఇందుకేనయ్యా నీవు క్రైస్తవ్యాన్ని స్వీకరించాలి! ఇందుకేనమ్మా నీవు దేవున్ని నమ్ముకోవాలి. ఇందుకొరకే మీరు బైబిల్‌ను చేతపట్టాలి, నిత్యజీవ పరిశోధనకై పరితపించాలి. క్రైస్తవ్యం వలన ఈ మనుష్యులకు కలిగే గొప్ప లాభము ఏమిటో తెలుసా? ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఇవ్వలేని మహిమ దేహం నీ వశము కాబోతుంది. మహిమ దేహాన్ని సంపాదించుకోడానికి సిద్ధపడవలసినవారే క్రైస్తవులు. అందుచేత, దానిని

సంపాదించేంత వరకూ మనము నిద్రపోకూడదు. ఎందుకంటే, ఆ మహిమ దేహం అంత గొప్పది! అంత విలువైనది! మనుష్యులనుకున్నట్టుగా పైనున్న పరలోకానికి మహిమ దేహం లేకుండా అంత సులభంగా వెళ్ళిపోతామనుకుంటున్నారా? మనము మహిమ దేహాన్ని తెచ్చుకొంటే తప్ప పరలోకంలో అడుగుపెట్టలేము. అందుకే యేసుక్రీస్తు ఎలాంటి మహిమ దేహాన్ని తెచ్చుకొన్నారో అలాంటి మహిమ దేహాన్నే మనము కూడా తెచ్చుకోవాలి అని వ్రాయబడింది. దేవుడనుగ్రహించే మహిమ దేహాన్ని తెచ్చుకొన్న వారిలో యేసుక్రీస్తు ప్రప్రథముడు!

**అపొస్తలుల కార్యములు 26 : 22- 'అయినను నేను దేవుని వలననైన సహాయము పొంది నేటివరకు నిలిచియుంటిని; క్రీస్తు శ్రమపడి మృతుల పునరుత్థానము పొందువారిలో మొదటివాడగుటచేత, ఈ ప్రజలకును అన్యజనులకును వెలుగు ప్రచురింపబోవునని ప్రవక్తలును మోషేయు ముందుగా చెప్పినవికాక మరి ఏమియు చెప్పక, అల్పులకును ఘనులకును సాక్ష్యమిచ్చుచుంటిని.'** మృతుల జీవ పునరుత్థానమును పొందిన వారిలో మొదటివాడు ఎవరో తెలుసా? యేసుక్రీస్తు! ఇది యేసుక్రీస్తులో ఉన్న గొప్పతనం. దేవుని కుమారుడైన యేసును గూర్చి సర్వలోకానికి ప్రకటించాల్సింది ఇదే! ఆయన జీవ పునరుత్థానమును పొందినవారిలో మొదటివాడు. ఈ భూమిపై బ్రతికిన నీతిమంతులలో మొదట మరణించినది హేబెలు అయినా, జీవపునరుత్థానమును పొందినవారిలో మొదటివాడు యేసుక్రీస్తు. అబ్రాహాము మొదటివాడు కాదు, మోషే మొదటివాడు కాదు, దావీదు మొదటివాడు కాదు, మరణించిన ప్రవక్తలలో ఏ ఒక్కరూ మొదటివారు కాదు. హేబెలు మొదలుకొని నీతిమంతులంతా మరణించినా వారికింకా జీవ పునరుత్థానము దక్కలేదు. మహిమ దేహముల కొరకు వారందరూ ఆత్మలుగా ఇంకా నిరీక్షిస్తున్నారు. వారందరూ పరదైసులో నుండి ఎదురుచూస్తున్నారు. ఎందుకనగా, హేబెలు మొదలుకొని మరణించిన నీతిమంతులలో యేసుక్రీస్తు తప్ప ఇంకెవ్వరూ దేవుని అభీష్టమును సంపూర్ణముగా నెరవేర్చలేదు. వారి జీవితకాలములో ఏదో ఒక సందర్భములో వారు దేవుని మనస్సును నొప్పించారు. కానీ దేవుని కుమారుడైన యేసు తన జీవితకాలములో ప్రతి క్షణం దేవుని మనస్సును మెప్పించాడు. అందుకే, ప్రథమ ఫలముగా యేసుక్రీస్తును దేవుడు మృతులలోనుండి లేపాడు. అందుకే ఆ యేసు రూపమును ధరించుకొని, ఆయనవలె ఎవరైతే దేవునికి కనిపిస్తారో వారందరూ ధన్యులు. యేసు సంపాదించిన ఆ మహిమ దేహం మనకు కూడా కావాలి. ఆయన ఎలా మృతుల పునరుత్థానములో మొదటివాడయ్యాడో మనము కూడా మన మన వరుసలో బ్రతికింపబడాలి. ఆయనవలె మనము కూడా మృతులలోనుండి తిరిగి లేవాలి. జీవపునరుత్థానమును పొంది, పరలోకానికి వెళ్ళిపోవాలి. అందుకే ఆయనను గూర్చి ప్రకటించుచున్న అపొస్తలులు ఏమని చెబుతున్నారో చూడండి. **క్రీస్తు శ్రమపడి మృతుల పునరుత్థానము పొందువారిలో మొదటివాడగుటచేత, ఈ ప్రజలకును అన్యజనులకును వెలుగు ప్రచురింపబోవునని ప్రవక్తలును మోషేయు ముందుగా చెప్పినవికాక మరి ఏమియు చెప్పక, అల్పులకును ఘనులకును సాక్ష్యమిచ్చుచుంటిని.** ఇదే యేసుక్రీస్తును గూర్చి ఇవ్వవలసిన సాక్ష్యం!

ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా కొందరు యేసుక్రీస్తును నమ్మకపోవటానికి వారికి అడ్డు ఏమిటి చెప్పండి? అలాగని వారు అబ్రాహామును నమ్ముతున్నారు, మోషేను నమ్ముతున్నారు, దావీదును నమ్ముతున్నారు, ఎంతోమంది ప్రవక్తలనూ నమ్ముతున్నారు. యేసుక్రీస్తును మాత్రమే వారు విశ్వసించడం లేదు. ఇలా చేయడం వలన వారు ఏమి కోల్పోతున్నారో తెలుసా? మహిమ శరీరాన్ని కోల్పోతున్నారు. అబ్రాహాము తాను చనిపోయిన తరువాత మృతుల జీవ పునరుత్థానములో తాను కూడా పాలిభాగస్తుడు కావాలనే అతడు క్రీస్తును గూర్చి శ్రమపడ్డాడు. మోషే మరణించిన తరువాత మృతుల జీవ పునరుత్థానములో తన వరుసలో తాను కూడా బ్రతికింపబడాలని, తాను క్రీస్తుకొరకు తన బ్రతుకును సమర్పించాడు. చనిపోయిన వారిలో నీతిమంతులందరూ క్రీస్తును గూర్చి ఎందుకు వ్రాసారో, క్రీస్తు కొరకు ఎందుకు బ్రతికారో, క్రీస్తు కొరకు ఎందుకు శ్రమపడ్డారో తెలుసా? దీనికి కారణం ఒక్కటే! వారు క్రీస్తువలె మృతుల జీవ పునరుత్థానములో తిరిగి బ్రతికింపబడాలి. క్రీస్తు సంపాదించిన ఆ మహిమ దేహాన్ని తాము కూడా సంపాదించాలి.

యేసుక్రీస్తు తాను తిరిగి లేచిన తరువాత శిష్యులకు అగపడుతున్నప్పుడు తన మహిమ దేహంతో ఆయన కనిపిస్తున్నాడు. తాను ధరించుకున్న ఒక గొప్ప దేహంతో ఆయన వారికి కనిపిస్తున్నాడు. శిష్యులందరూ తలుపువేసుకొని ఒక గదిలో కూర్చున్నప్పుడు ఆయన వారికి ప్రత్యక్ష్యమవుతున్నాడు. తలుపు మూసి ఉన్నా ఆయన గదిలోనికి ఎలా

రాగలిగాడు అంటే, ఆయన ధరించుకున్నది మహిమ శరీరం. వారు పెట్టినవి తినగలుగుతున్నాడు, వారితో మాట్లాడగలుగుతున్నాడు. మహిమ శరీరానికి ఏదీ అడ్డు కాదు. ఎందుకంటే, ఆ శరీరానికి జీవమే తప్ప, మరణం లేదు. ఆ మహిమ శరీరముతోనే ఆయన పరలోకానికి ఆరోహణమయ్యాడు. మన ఆత్మ మీద ఆ మహిమ దేహం ఉండకపోతే మనము పరలోకాన్ని చేరలేము. ఆ గొప్పదైన దేహం మనకు రావాలంటే, దేవుడు దానిని మనకు ధరింపజేయాలంటే ఈ భూమి మీద ప్రతి క్షణం యేసుక్రీస్తు ద్వారా తండ్రియైన దేవుని కోసం మనము తపించాలి. ఈ దీన శరీరంలో ఉన్నప్పుడు మహిమ శరీరము కొరకు ఆలోచిస్తూ దాని నిమిత్తము పనిచేయాలి. దాని కొరకు మన సమస్తాన్ని దేవుని వాక్యానుసారముగా నష్టపరచుకోవాలి. ఎలాగైనా మనము మహిమ శరీరాన్ని సంపాదించుకోవాలి. అందుకే యేసు, ఈ భూమి మీద మీరు సమస్తమును పోగొట్టుకున్నా మీ ప్రాణమును మాత్రం దక్కించుకోవాలి అన్నాడు. అంటే యేసు మాటలలో ఉన్న పరమార్థం ఏమిటో తెలుసా? మీరు నిత్యజీవితంలో మహిమ దేహాన్ని సంపాదించుకోవాలని అర్థం. దేవుని కొరకు ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేని వారు మహిమ దేహాన్ని ఎక్కడ సంపాదించుకుంటారు? దేవుని కొరకు సమస్తాన్ని ఇచ్చినవాడికి మాత్రమే దేవుడు దానిని ఇవ్వాలనుకుంటున్నాడు. దేవుని కొరకు రక్తం కారేలా మనము కష్టపడాలి. అలాంటివారికి మహిమ దేహాన్ని ఆయన ఇవ్వాలి అనుకుంటున్నాడు. కనీసం ముఖపు చెమట కారేలా కూడా దేవుని కోసం కష్టపడలేని వారికి మహిమ దేహాన్ని ఎందుకివ్వాలి? ప్రియులారా! జాగ్రత్తగా ఆలోచించండి. మరణించిన తరువాత నిత్యకాలము పరలోకమందు మనము ఉండాలి అంటే, ఇక్కడ ఈ భూమి మీద కొంత కాలాన్ని దేవుని కోసం ఇవ్వలేమా? ఇవ్వాలి. నిత్యకాలం మనము మహిమ దేహములో ఉండాలి అంటే ఇక్కడ కొద్దికాలం మన దీన దేహాన్ని అర్పించలేమా? అర్పించాలి. ఈ మాటలయందు మీకు విశ్వాసం, భక్తి ఉంటే వ్రాయబడిన దేవుని మాటలు నిజమని మీరు నమ్మితే ఇప్పుడే మీరు తీర్మానించుకోవాలి. ఆ మహిమ దేహాన్ని సంపాదించేంత వరకు మీరు నిద్రపోకూడదు.

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 3 : 10- 'ఏవిధముచేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని ఆయన మరణ విషయములో సమానానుభవముగలవాడనై ఆయనను, ఆయన పునరుత్థానబలము ఎరుగు నిమిత్తమును, ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో యెరుగు నిమిత్తమును, సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను'.** విద్యార్థులు చదువుకొనేటప్పుడు వారు ఎలాగైనా సరే పాస్ అవ్వాలి అనుకున్నారనుకోండి, పరీక్ష వ్రాసేంత వరకూ ప్రతినిత్యం చదువుతూనే ఉంటారు. ఎందుకంటే ఏవిధంగానైనా వారు కష్టపడాలి. ఎలాగైనా సరే ఉత్తీర్ణులు కావాలి. ఒకడు ఒక ఉద్యోగాన్ని ఎట్టి పరిస్థితులలోనూ సంపాదించాలి అనుకున్నాడనుకోండి, వాడు దాని కొరకు ఎంతైనా కష్టపడతాడు. ఎంతైనా సాధన చేస్తాడు. ఏవిధంగానైనా ఈ సంవత్సరం నాకు పెళ్లి అయిపోవాలి అనుకునేవాడు పెళ్లిళ్ల పేరయ్యల చుట్టూ తిరుగుతాడు. ఏవిధంగానైనా సరే నాకు దేహధారుడ్యం కావాలి అనుకునేవాడు ప్రతి ఉదయం తెల్లవారుఝామున నిద్ర లేస్తాడు. పరిగెడతాడు, వ్యాయామం చేస్తాడు, బరువులెత్తేస్తాడు. ఎందుకు ఇంత కష్టం? మామూలుగా అయితే వాడు ఇంటిలో కొంచెము పని కూడా చేయడు. కానీ తన మనస్సులో ఒక ధృఢనిర్ణయం తీసుకున్నాడంటే తప్పకుండా దానిని సాధించి తీరుతాడు. అవును, ఏవిధముగానైనను దేనినైనను సంపాదించుకోవటానికి మనిషి ఎంతగా ఆలోచిస్తాడో, ఎంత కష్టానికైనా తెగిస్తాడో, ఎంతగా ప్రయత్నించి తాను అనుకున్నదానిని సంపాదించుకొంటున్నాడో చూడండి. ఏవిధముగానైనను పదవి సంపాదించుకోవాలంటే కాలినడకన ఊరూరూ తిరుగుతాడు. ఒక ధనవంతుడు ముఖ్యమంత్రి కావడానికి ఎందుకు మట్టి నేలపై నడుస్తున్నాడు? ఎందుకు పూరి గుడిసెలో అడుగుపెడుతున్నాడు? ఎందుకు ఎండనక, వాననక తిరుగుతున్నాడు చెప్పండి. ఏవిధముగానైనను తానొక మంత్రో, ముఖ్యమంత్రో, ప్రధానమంత్రో అవ్వాలని. దేనికైనా తెగించి, ఎంతటి త్యాగానికైనా సిద్ధపడి, ఎటువంటి నష్టాన్నైనా భరించి, ఏవిధముగానైనను సంపాదించాలి అనుకుంటే అటువంటివాటిలో ప్రథమమైనది, శ్రేష్టమైనది, మిగిలిన అన్నింటికంటే భిన్నమైనది ఒకటుంది. అదే మహిమ శరీరం! ఇది మనుష్యులలో ఎవ్వరి కంటికి కనిపించదు. నిత్యజీవ పరిశోధన చేసినవాడికి మాత్రమే దీనిని గూర్చి అర్థమవుతుంది. అందుకే పరిశుద్ధాత్మ ప్రేరణతో అపొస్తలుడైన పౌలు, క్రైస్తవులైన ఫిలిప్పీయులతో ఏమంటున్నాడో చూడండి. ఏవిధముచేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని ఆయన మరణ విషయములో సమానానుభవముగలవాడనై ఆయనను, ఆయన పునరుత్థానబలము ఎరుగు నిమిత్తమును, ఆయన శ్రమలలో

పాలివాడనగుట యెట్టిదో ఎరుగు నిమిత్తమును, సమస్తము నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను అన్నాడు. తనకున్న సమస్తాన్ని నష్టపరుచుకొని దానినంతటినీ పెంటతో సమానముగా ఎందుకు ఎంచుకొంటున్నాడంటే ఏవిధముగానైనను మహిమ శరీరాన్ని సంపాదించెయ్యాలి. తాను చచ్చాక తిరిగి లేవాలంటే ఏమి చేయాలి? అనే ఈ ప్రశ్న ఈ రోజు ఎవరిలో ఉంది? ఈ ఆవేదన ఎవరిలో ఉంది? ఉద్యోగం ఎలా సంపాదించాలి? దాని కొరకు ఏమి చేయాలని ఒకడడుగుతున్నాడు. ర్యాంకులు సంపాదించాలంటే ఏమి చేయాలని మరొకడు అడుగుతున్నాడు. ఆరోగ్యంగా బ్రతకాలంటే ఏమి చేయాలని ఒకడడుగుతున్నాడు. బాగా డబ్బు సంపాదించాలంటే ఏమి చేయాలని మరొకడడుగుతున్నాడు. ఇల్లు కట్టాలంటే ఏమి చేయాలని ఒకడడుగుతున్నాడు, పెళ్ళి చేయాలంటే ఏమి చేయాలని మరొకడడుగుతున్నాడు. అంతేగాని, నిత్యజీవాన్ని సంపాదించుకోవాలి, ఏ విధముగానైనను నేను మృతులలో నుండి తిరిగి లేవాలి, నాకంటూ ఒక మహిమ దేహాన్ని నేను సంపాదించుకోవాలి గనుక ఏమి చేయాలని ఏఒక్కరూ అడగలేకపోతున్నారు. అలాగని ఇదేమైనా సామాన్యమైన సంగతా? పోనీ మహిమ దేహమేమైనా తక్కువైనదా? ఇది అన్నిటికంటే ఉన్నతమైనది. అందుకే ఆనాటి పౌలు, దేవుని ఆత్మ వలన దీనిని బాగా గ్రహించాడు, అర్థం చేసుకొన్నాడండి. అందుకే, తనకున్న సమస్తమును నష్టపరచుకొని, దానిని పెంటతో సమానంగా యెంచుకొని, అసలు మహిమ దేహము తప్ప ఈ భూమి మీద ఇక నాకు ఏమీ వద్దు అంటున్నాడు. ప్రియులారా! జీవ పునరుత్థానము చెందినవారిలో మొదటివాడైన యేసుక్రీస్తు మహిమ దేహానికి సమరూపము కలిగినటువంటి దేహాలను ఈ భూమిపై ఎవరికి ఇవ్వాలా అని ఆలోచిస్తున్నాడు. భూమి మీద ఆయనవలె బ్రతికినటువంటి వారు ఎవరున్నారని ఆయన చూస్తున్నాడు. అలా బ్రతికిన వారికే మహిమ దేహమును ఇవ్వటానికి ఆయన నిరీక్షిస్తున్నాడు.

**కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 4 : 10 'యేసు యొక్క జీవము మా శరీరమందు ప్రత్యక్షపరచబడుటకై యేసు యొక్క మరణానుభవమును మా శరీరమందు ఎల్లప్పుడును వహించుకొని పోవుచున్నాము. ఏలయనగా, యేసు యొక్క జీవము కూడ మా మర్త్యశరీరమునందు ప్రత్యక్షపరచబడినట్లు, సజీవులమైన మేము ఎల్లప్పుడు యేసు నిమిత్తము మరణమునకు అప్పగింపబడుచున్నాము.'** మరణమునండి తిరిగిలేచిన యేసుక్రీస్తుకు ఏ దేహమైతే వచ్చిందో, ఆయన ఇప్పుడు ఏ జీవముతో ఉన్నాడో ఆ జీవము మనలో కూడా ఉండాలంటే ఏమి చేయాలి? యేసుక్రీస్తు మరణానుభవము కూడా మనలో ఉండాలి. దేవుడిచ్చే మహిమ దేహాన్ని మనము సంపాదించుకోవాలంటే గనుక ఈ దీన శరీరంలో ప్రతి క్షణం మనము యేసు నిమిత్తము మరణానికి అప్పగించబడేవారముగా బ్రతకాలి. ఏ క్షణం మనలను యేసు నిమిత్తమైన మరణం ఆవహిస్తుందో తెలియదు. దానికి మనము సర్వసిద్ధంగా ఉండాలి. ఆ గొప్పదైన మరణంతో మనము మహిమ దేహాన్ని సంపాదించుకొనేటట్టుగా ఉండాలి. మన మరణం మనకు ఒక మంచి బహుమానాన్ని ఇవ్వాలి. మన మరణం మన జీవితంలో ఒక ప్రధాన ఘట్టం కావాలి. అంతేగాని అది ఒక విచారకరమైన ఘట్టం కాకూడదు. మన మరణం వలన మనము లాభం పొందాలి. దాని వలన మనం సంతోషించాలి. ఇదే అపొస్తలుడైన పౌలుగారి మాటలలో దాగియున్న భావం. యేసుక్రీస్తు ఎలాగైతే మహిమ దేహాన్ని తెచ్చుకొన్నాడో మనము కూడా ఈ దీన శరీరంలో ఉన్నప్పుడు మహిమ దేహాన్ని తెచ్చుకొను నిమిత్తం ప్రయత్నం చేయాలి, బహుగా కష్టపడాలి.

ప్రియులారా, ఈ భూమి మీద పునరుత్థానముపై ఎవ్వరికీ కొంచెము కూడా అవగాహన లేదు. ఈ కాసేపు ఎలా బ్రతకాలి, ఎలా పేరు సంపాదించుకోవాలనే మనిషి ఆలోచిస్తున్నాడు. ఇది చాలా చిన్న ఆలోచన, అవివేకమైన ఆలోచన. మహిమదేహాన్ని సంపాదించుకోవటానికి ఏమాత్రం ఆలోచన చేయనివాడెంత దౌర్భాగ్యుడో ఆలోచించండి. ఆనాడు యేసుక్రీస్తు కాలంలో కూడా ఇలాంటి వారు ఉన్నారు. అపొస్తలుల కాలంలో ఇలాంటి మనుష్యులే ఉన్నారు. ఈరోజు మొత్తంగా ఈ భూమి మీద మనుష్యులంతా ఇలాగే ఉన్నారు. యేసు కాలంలో ఇలాంటి వారిని గూర్చి ఒక సందర్భం వ్రాయబడింది. వారే పునరుత్థానము లేదని చెప్పెడి సద్దూకయ్యులు. అంటే ఆనాడు పునరుత్థానమును నమ్మనివారు ఒక వర్గంగా, ఒక తెగగా మారిపోయారు. వారిని చూడగానే వీరు పునరుత్థానము లేదని చెప్పేవారని ఇట్టే అర్థమయ్యేలా జీవిస్తున్నారు. నిజంగానే పునరుత్థానము లేదా? ఒకడు ప్రతినిత్యం తన ఆకలిని తీర్చుకోవడానికి తింటున్న

ఆహారపదార్థాలన్నీ పునరుత్థానము వల్లనే వచ్చాయి. పునరుత్థానము వల్లనే అందరి కడుపూ నిండుతుంది. పునరుత్థానము వల్లనే అందరూ జీవమును కలిగియున్నారు. పునరుత్థానము వల్లనే ఈరోజు ప్రకృతిలో ప్రతీ ఒక్కరూ ఉనికి కలిగి బ్రతుకగలుగుతున్నారు. నీవు విత్తినది చచ్చితేనే గాని బ్రతికింపబడదు. అలా బ్రతికింపబడిన దానినిబట్టి, నీవు బ్రతికింపబడుతున్నావు. మరి నీవు పునరుత్థానాన్ని నమ్మవా? ప్రారంభ శతాబ్దంలో పునరుత్థానమును నమ్మనివారు ఎలా ఉన్నారో చూడండి. **అపొస్తులుల కార్యములు 17 : 32 'మృతుల పునరుత్థానమును గూర్చి వారు వినినప్పుడు కొందరు అపహాస్యము చేసిరి'.** ప్రారంభ శతాబ్దంలో ఆత్మావేశముచేత అపొస్తలుడైన పౌలు పునరుత్థానమును గూర్చి ప్రకటిస్తుంటే, అది కొందరికి అపహాస్యముగా ఉంది. క్రైస్తవ్యమంటే ఏమిటి? ఒక చర్చ్ కట్టుకోవడమా? అందులో గంట పెట్టుకోవడమా? ఆదివారం చర్చ్‌కి రెండు గంటలపాటు హాజరవ్వడమా? బాప్తీస్మము పొందిన తరువాత ఏదో క్రైస్తవులమని పిలిపించుకోవడం కోసమా? మతశాఖలుగా చీలిపోయి, నాదొక శాఖ, నీదొక శాఖ; నాదొక సిద్ధాంతం, నీదొక సిద్ధాంతం అని చెప్పుకోవడమా? కాదు. క్రైస్తవ్యమంటే ఏమిటో తెలుసా? మృతుల పునరుత్థానాన్ని గూర్చి ఖచ్చితంగా చెప్పిన దేవుని మహాజ్ఞానం. ఆ మృతుల పునరుత్థానమును గూర్చి ప్రారంభ శతాబ్దంలో శిష్యులు తమ నోరార పలుకుతున్నప్పుడు వారెలా ప్రవర్తిస్తున్నారో చూడండి. వారు మృతుల పునరుత్థానమును గూర్చి వినినప్పుడు దానిని గూర్చి అపహాస్యము చేసిరి. మృతుల పునరుత్థానమా.. అని నవ్వుతున్నారు, హేళన చేస్తున్నారు. నీవు తిరిగి బ్రతుకుతావా, నీకు మహిమ శరీరం వస్తుందా.. మేమేమో దేవుని కొరకు క్రీస్తువలె బ్రతుకకపోతే తీర్పు పునరుత్థానానికి వెళ్ళిపోతామా? క్రీస్తును నమ్మకపోతే, క్రీస్తు రూపాన్ని ధరించుకోకపోతే, ఆయన మహిమదేహ రూపానికి సమరూపము కలిగిన దేహాన్ని మేము తెచ్చుకోలేమా.. అని అపహాస్యము చేసే అపహాసకులు ఆనాటి కాలంలో ఉన్నారు. ఈరోజు కూడా లోకమందున్నవారిలో చాలామంది అలాంటివారే ఉన్నారు. నిజానికి క్రైస్తవులుగా చెలామణి అవుతున్నవారిలో కూడా చాలామందికి జీవపునరుత్థానమును గూర్చి తెలియదు కదా. క్రైస్తవులందరికీ మృతుల పునరుత్థానము మీద మంచి అవగాహన ఉందా? మహిమ దేహాన్ని తెచ్చుకోవాలనే ఆలోచన వారికుందా? శరీరానికి తగిలిన ఒక చిన్న దెబ్బ, ఆ దెబ్బ తగ్గిపోవడానికి కొంచెం నూనె! శరీరం లోపల పుట్టినటువంటి చిన్న జబ్బు, ఆ జబ్బు తగ్గిపోవడానికి చిన్న ప్రార్థన! ఇంటిలో కలిగిన ఒక చిన్న సమస్య, ఆ సమస్య సమసిపోవడానికి ఒక చిన్న కానుక! ఇదేనా క్రైస్తవ్యం? ఇంతేనా దేవుని గూర్చిన అవగాహన? బైబిల్‌లో ఇలాంటి క్రైస్తవ్యమే ఉందా? లేదు. 66 పుస్తకాలలో దాగియున్న దేవుని ఘోష ఏమిటో తెలుసా? భూమి మీదకి వచ్చిన ప్రతి మనిషి దీన శరీరాన్ని ఉపయోగించి మహిమ శరీరాన్ని తెచ్చుకోవాలి. ఇలా చెబితే అది మనుష్యులకు అపహాస్యముగా ఉందా? అయితే వారు కీడు పునరుత్థానానికి వెళ్ళిపోతారు. ఆనాటి క్రైస్తవసంఘములో కూడా ఇలాంటి వారు ఉన్నారని వ్రాయబడింది.

**తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 2 : 16- 'అపవిత్రమైన వట్టి మాటలకు విముఖుడవై యుండుము. అట్టిమాటలాడువారు మరి యెక్కువగా భక్తిహీనులగుదురు. కొరుకుపుండు ప్రాకినట్టు వారి మాటలు ప్రాకును. వారిలో హుమెనైయును, ఫిలేతును ఉన్నారు. వారు పునరుత్థానము గతించెనని చెప్పుచు సత్యము విషయము తప్పిపోయి, కొందరి విశ్వాసమును చెరుపుచున్నారు'.** నాణ్యతలేని బోధలు చేస్తున్న వారిని గూర్చి దేవుడు ఏమంటున్నాడో తెలుసా? అపవిత్రమైన వట్టి మాటలకు విముఖుడవై యుండాలి. ఈ దీనశరీరంలోని కష్టాలను తీర్చుకోవడానికి, ఈ దీన శరీరమందు సుఖాన్ని అనుభవించడానికి మనము ప్రభువును నమ్ముకుంటే అది అపవిత్రమైన వట్టిమాట. మహిమ శరీరాన్ని తెచ్చుకోవడమెలాగో చెప్పే మాటలే పవిత్రమైన మాటలు. జీవ పునరుత్థానమును గూర్చి వివరించని బోధలకు విముఖుడవై యుండుము. అనగా నీ ముఖాన్ని త్రిప్పుకో అని వ్రాయబడింది. అట్టి మాటలాడువారు మరి ఎక్కువగా భక్తిహీనులగుదురు. కొరుకుపుండు ప్రాకినట్టుగా వారి మాటలు జనులలో ప్రాకుతాయి. జీవం కలిగిన దేవుని మాటలు ఎక్కడైనా ఇంత వేగంగా ప్రాకుతున్నాయా? లేదు. మహిమ శరీరం కోసం మానవులను, ముఖ్యంగా క్రైస్తవులను ఆలోచింపజేయడం కోసం ఎంతగానో కష్టపడాలి. కానీ ఈ దీనశరీరము కొరకు చెబితే మాత్రం చెవి కోసుకుని వింటారు. అవి కొరుకుపుండు ప్రాకినట్టుగా ప్రాకుతాయి. ఆనాడు అట్టివారిలో హుమెనైయును, ఫిలేతు అనేవారున్నారు. ఇంతకీ వీరు ఏమి చేస్తున్నారు? వీరిని గూర్చి దేవుడెందుకు ప్రస్తావించాడు? వారు పునరుత్థానము గతించెనని చెప్పుచు సత్యము విషయము తప్పిపోయి, కొందరి విశ్వాసమును చెరుపుచున్నారు. వీరు సంఘమును పాడుచేస్తూ జీవపునరుత్థానము గతించిపోయిందని చెబుతున్నారు. యేసుక్రీస్తు ఏనాడో

పునరుత్థానుడయ్యాడు కదా. అప్పటికి చాలా సంవత్సరాలు గడిచిపోయింది కదా. ఇక పునరుత్థానము గూర్చి ఆలోచించనక్కర్లేదు అని బోధిస్తున్నారు. అంటే ఇక దేనిని గూర్చి ఆలోచించమని వారి ఉద్దేశ్యమన్నమాట? ఈ మృతదేహాన్ని గూర్చి ఆలోచించుకోమని, మానవ దీనదేహాన్ని గూర్చి ఆలోచించుకోమని వారు వట్టి మాటలను ఆనాడు సమాజములో విస్తరింపజేస్తున్నారు. నిజానికి ఆనాడు ఇద్దరే! ప్రారంభ కాలము గనుక హుమనైయును, ఫిలేతు మాత్రమే ఉన్నారు. ఈ రోజైతే దాదాపుగా అందరూ అలాంటివారే. నేటి సంఘాలలో ఈ శరీరపు బ్రతుకునే గొప్పదిగా చూపించే దౌర్భాగ్యులు కోకొల్లలుగా ఉన్నారు.

**తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 2 : 19- 'అయినను దేవునియొక్క స్థిరమైన పునాది నిలుకడగా ఉన్నది. ప్రభువు తనవారిని ఎరుగును అనునదియు ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతివాడును దుర్నీతినుండి తొలగిపోవలెను అనునదియు దానికి ముద్రగా ఉన్నది'.** ఎవడు ఎలాంటి మాటలు చెప్పినా, అవి ఎంతగా కొరుకుపుండు ప్రాకినట్టు ప్రాకినా, వాటివలన ఎందరు మోసగించబడినా... నిజం ఎప్పటికీ నిజమే! జనులను ఎవరు ఎలా మభ్యపెట్టినా, క్రైస్తవ్యాన్ని తమ చేతులలోనికి తీసుకుని, తమ స్వార్థం కొద్దీ ఎంతగా దొంగలపాలు చేసినా సత్యం ఎప్పటికీ సత్యమే! అందుకే దేవుడు ఏమంటున్నాడో చూడండి. దేవుని యొక్క స్థిరమైన పునాది నిలుకడగా ఉన్నది. మనము ఈ పాఠములో ఇప్పటివరకు చదువుకున్న వాక్య భాగమంతా స్థిరమైనది. దేవునివాక్యంలో ఉన్న ఆయన భావాలన్నీ ఎప్పటికీ స్థిరముగా ఉండేవి. అవి వ్రాయబడి మనుష్యుల చేతికివ్వబడి సుమారు రెండువేల సంవత్సరాలు పైబడినా ఇప్పటికీ ఈ మాటలు స్థిరం. భవిష్యత్ కాలంలో కూడా ఇవి స్థిరం. మధ్యలో పుట్టిన అపవిత్రమైన వట్టి మాటలు మధ్యలోనే పోతాయి. ప్రారంభ శతాబ్దంలో అపొస్తలులనోట లేని అబద్ధపుబోధే మధ్యలో పుట్టిన బోధ. ఇప్పుడున్న ఈ అబద్ధపు బోధ మరి కొద్దికాలానికి ఆగిపోయే బోధ. అది మధ్యలోనే అంతరించిపోయే బోధ. మీరు అలాంటి అపవిత్రమైన బోధలకు విముఖులుగా ఉండాలి. అనాదికాలంలో దేవుడు సంకల్పించిన బోధ, యేసుక్రీస్తు పరిచయం చేసి పరిపూర్ణం చేసిన బోధ, అపొస్తలులు శిష్యులు ప్రకటించిన బోధే, ఈ రోజు మనము చదువుచున్న బోధ! మనము ప్రతినిత్యం జ్ఞాపకం చేసుకోవలసిన, దాని ప్రకారమే బ్రతుకవలసిన బోధ ఇదే! ఇది నిత్యకాలము ఉండే బోధ. **దేవునియొద్ద స్థిరమైన పునాది మనకొరకు నిలుకడగా ఉన్నది. ప్రభువు తన వారిని ఎరుగును అనునదియు ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతివాడును దుర్నీతినుండి తొలగిపోవలెను అనునదియు దానికి ముద్రగా ఉన్నది.** దేవుడు ఈ బోధకు ఒక ముద్ర వేసాడు. ఇది చెదిరిపోకుండా, నిత్యమూ ఉండేలా దేవుడు దీనిని భద్రం చేసాడు. దీనినిబట్టి, మహిమ శరీరము కొరకు మానవ శరీరంలో ఉన్న ప్రతిమనిషి తప్పకుండా ఆలోచించాలి. దేవుని జీవవాక్కును గూర్చిన విషయములను మనిషి అర్థం చేసుకోవాలి. ఆవిధంగానే మనిషి బ్రతకాలి. ఆవిధంగానే మనిషి ఆలోచన చేయాలి.

**తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 2 : 20- 'గొప్పయింటిలో వెండి పాత్రలును బంగారు పాత్రలును మాత్రమేగాక కఱ్ఱవియు మంటివియు కూడ ఉండును. వాటిలో కొన్ని ఘనతకును కొన్ని ఘనహీనతకును వినియోగింపబడును. ఎవడైనను వీటిలో చేరక తన్నుతాను పవిత్ర పరచుకొనినయెడల వాడు పరిశుద్ధపరచబడి, యజమానుడు వాడుకొనుటకు అర్హమై ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచబడి, ఘనత నిమిత్తమైన పాత్రయై యుండును'.** పరలోకమందున్న దేవుని యొక్క సృష్టిలో మనుష్యులంతా ఒక గొప్ప ఇల్లుతో పోల్చబడ్డారు. ఆయన ఇంటిలో ఏవేవి ఉంటాయో చూడండి. వెండి పాత్రలు, బంగారు పాత్రలు మాత్రమేకాక కఱ్ఱవియు, మంటివియు కూడా ఉండును. గొప్ప ఇల్లు కదా, అందులో కఱ్ఱతో చేయబడినవి, మట్టితో చేయబడినవి ఉండడానికి వీలులేదని అనుకోకండి. ప్రియులారా! ఈ ఉపమానమును మీరు బహు జాగ్రత్తగా గమనించాలి. ఈ భూమి మీద అందరూ పునరుత్థానమును పొందుతారు. అలా పొందినవారిలో కొంతమంది మేలు పునరుత్థానానికి, మరికొంతమంది కీడు పునరుత్థానానికి వెళ్లిపోతారు. దీనిని గూర్చి మనకు అర్థం కావాలంటే, ఈ మంచి ఉపమానమును చక్కగా అర్థం చేసుకోవాలి. గొప్పయింటిలో వెండి పాత్రలు, బంగారు పాత్రలు మాత్రమే కాక కఱ్ఱవియు, మంటివియు కూడా ఉండును. వాటిలో కొన్ని ఘనతకు, కొన్ని ఘనహీనతకు వినియోగింపబడును. బంగారు పాత్రలు, వెండి పాత్రలు ఘనతకు వినియోగింపబడుతున్నాయి. అంటే తినడానికి, త్రాగడానికి, మంచి మంచి కార్యక్రమాలు

చేసుకోవడానికి ఘనమైనటువంటి పాత్రలుగా ఇలాంటివాటిని వినియోగిస్తారు. అందులో బంగారు పాత్రలు, వెండిపాత్రలు ఉంటాయి. అలాగే, కొన్ని ఘనహీనతకు కూడా వినియోగింపబడతాయి. ఒక ఇంటిలో ఘనతకు కొన్ని పాత్రలు వినియోగింపబడితే, ఘనహీనతకు మరికొన్ని పాత్రలు వినియోగింపబడుతున్నాయి. తిండికి ఒక పాత్రను వినియోగిస్తారు. బహిర్భూమికి వేరొక పాత్రను వినియోగిస్తారు. వేటిని వేటికి వినియోగించాలో వాటిని వాటికే వినియోగించాలి. అవును, ఇది మనకు బాగా తెలుసు. కనుక, **ఎవడైనను వీటిలో చేరక తన్నుతాను పవిత్ర పరచుకొనినయెడల వాడు పరిశుద్ధపరచబడి, యజమానుడు వాడుకొనుటకు అర్హమై ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచబడి, ఘనత నిమిత్తమైన పాత్రయై యుండును.** ఏమి కావాలి మీకు? మీరు ఎలా వినియోగింపబడాలి అనుకుంటున్నారు? మీ పునరుత్థానము ఎలా ఉండాలని కోరుకుంటున్నారు? పునరుత్థానమైతే అది అందరికీ సంభవిస్తుంది. ఆయన ఇంటిలో మూడు లోకాలు ఉన్నాయి. మొదటిది పరలోకము, రెండవది భూమి ఉన్న లోకము, మూడవది భూమి క్రిందనున్న పాతాళలోకము. ఆయన ఇంటిలో ఏ పాత్రగా మీరు వినియోగింపబడాలి అనుకుంటున్నారు? ఏ లోకానికి వెళ్ళాలనుకుంటున్నారు? ఘనత కొరకు వినియోగింపబడే పాత్రగానా? లేక ఘనహీనతకొరకు వినియోగింపబడే పాత్రగానా? మీకు ఏది కావాలి చెప్పండి? ఏ పాత్రగా మీరు మారిపోవాలనుకుంటున్నారో ఆలోచించుకోండి. ఏ పునరుత్థానమును మీరు కోరుకోవాలో ఆలోచించండి. నిత్యమూ ఆనందించే వారుగా ఘనత కలిగినవారుగా ఉండాలి అంటే **తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 2 : 20 - 21** వచనములలో దేవుడు దానిని గూర్చే చెప్పాడు. ఎవడైనను వీటిలో చేరక, అనగా ఘనహీనమైన వాటిలో చేరక తన్ను తాను పవిత్రపరచుకొనినయెడల వాడు పరిశుద్ధపరచబడి, యజమానుడు వాడుకొనుటకు అర్హమై ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచబడి, ఘనత నిమిత్తమైన పాత్రయై యుండును. మీరు ఘనమైన పాత్రగా వినియోగింపబడాలన్నది దేవుని కోరిక. వజ్రాలు పొదిగినటువంటి వస్తువులుగా మీరు మారిపోవాలి.

ప్రియులారా! పునరుత్థానము ప్రతి మనిషికి తప్పకుండా కలుగుతుంది. కానీ, ఆ పునరుత్థానము జీవపునరుత్థానమై ఉండాలి. ఘనమైన పాత్రగా మీరు యెంచబడాలి. మీరు అపవిత్రమైన వట్టి మాటలలో చేరక మిమ్మును మీరు పవిత్రపరచుకొనినయెడల మీరు పరిశుద్ధపరచబడి దేవుడు వాడుకొనుటకు అర్హమై ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచబడి, ఘనత నిమిత్తమైన పాత్రగా ఉంటారు. మీరు ఘనత నిమిత్తమైన పాత్రగా మారాలి అనుకుంటే ఇదిగో ఇలాంటి నిత్యజీవ పరిశోధనలో మీరు ఉండాలి. దేవుని వాక్యసంబంధమైన జీవపు విషయాలన్నింటినీ మీరు తెలుసుకోవాలి. ఆ తరువాత మీ జీవితకాలమంతా మీరు దేవుని కొరకు వీరోచితంగా బ్రతకాలి. దేవుని ఇష్టమును పూర్తిగా నెరవేర్చాలి. ఈ దీనశరీరము నుండి మహిమ శరీరాన్ని మీరు తెచ్చుకోవాలి. ఆ మహిమ శరీరం కలిగినవారే పరలోకానికి అర్హులు. అలాంటివారే దేవుని కుమారులుగా ఆయనున్న లోకానికి ఆహ్వానింపబడతారు. అలా కాని పక్షంలో మీరు తీర్పు పునరుత్థానమును పొందినవారై నిత్యకాలము బాధతో వేదనను అనుభవించవలసి వస్తుంది. అక్కడ మీరు చనిపోతే బావుండును కదా అని అనుకుంటారు. కానీ మీకు చావు దూరమైపోతుంది. అలాగని మీ శ్రమ కూడా ఆగిపోదు. నిత్యనాశనమందు అగ్ని ఆరదు, పురుగు చావదు. మీకొరకు మీరు మంచి నిర్ణయం తీసుకోండి! యేసుక్రీస్తు ప్రభువు పేరిట ఈ దేవుని పాఠమును చదివిన మీకు నా ధన్యవాదములు.

-------x------

## ప్రశ్నలు

1) మానవ శరీరము మరియు మహిమ శరీరముల మధ్య గల తేడాను వివరించండి.

2) పునరుత్థానము అనగానేమి? మానవునిలో జరిగే పునరుత్థాన ప్రక్రియను వివరించండి.

3) పునరుత్థానము పొందువారిలో మొదటివాడెవరు? ఆయన పొందిన పునరుత్థానమును తెలియజేయండి.

4) మనిషి మహిమ శరీరాన్ని సంపాదించుకోవాలంటే ఈ మానవ శరీరమునందు ఏమి చెయ్యాలి?

5) పునరుత్థానము గతించినదని చెప్పు భక్తిహీనులకు పునరుత్థానమున్నదని ఏలాగు నిరూపిస్తారు?

6) దేవుని ఇంటిలో ఘనమైన పాత్రగా ఉండుటకు ఏమి చెయ్యాలి?

7) మేలు పునరుత్థానము, కీడు పునరుత్థానములను సవివరముగా తెలియజేయండి.

# 2. బైబిల్ గణాంకములు

బైబిల్ గణాంకములు అనే ఈ పాఠం చాలా కష్టమైనది, మరియు చాలా ఆకర్షించేదిగా కూడా ఉంటుంది. బైబిల్ గణాంకములు అనగా బైబిల్‌లో ఉన్న గణితం. గణితమనగా లెక్కలు. లోకంలో చిన్ననాటనుండి మనము విద్యను అభ్యసిస్తున్నప్పుడు అందులో ఒక భాగమే గణితశాస్త్రం. పదవ తరగతి పాసవ్వాలంటే అందులో గణితశాస్త్రం ఒకానొక భాగము. అందుకే ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రతీ సంవత్సరం మనకు ఉపాధ్యాయులు లెక్కలు నేర్పిస్తుంటారు. మన దైనందిన జీవితంలో ఆయా సందర్భాలలో మనము లెక్కించవలసిన పరిస్థితిని ఎదుర్కొంటాము. ఇంటిలో నివసించేటటువంటి గృహిణులు కూడా లెక్కలు నేర్చుకోవటం చాలా ముఖ్యమైన విషయం. వారు గ్యాస్ సిలిండర్ తీసుకున్నా, కూరగాయలు కొనుక్కున్నా, పాలవాడికి డబ్బులు చెల్లించాలన్నా, పేపరు వాడికి డబ్బులు చెల్లించాలన్నా, పిల్లల స్కూల్ ఫీజులు లెక్కవేయాలన్నా.. ఇవన్నీ ఇంటిలో ఉన్న గృహిణి చెల్లించాలంటే గనుక ఆమెకు కూడా లెక్కలు తెలిసుండాలి. ఇలా ప్రతి ఒక్కరికీ లెక్కలు తెలియవలసిన అవసరం ఎందుకంటే, ఈ లోక సంబంధమైన జీవితంలో లెక్కలతో కూడుకున్నటువంటి ఎన్నో వ్యవహారాలను మనము చూస్తున్నాం. అందుకే చిన్ననాటి నుండి పిల్లలకు లెక్కలు నేర్పిస్తూ ఉంటారు. అంకెలతో ప్రారంభమైనటువంటి ఈ లెక్కలు, కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు, ఇంకా పైస్థాయికి వెళ్లే కొద్దీ క్లిష్టమైనటువంటి సమస్యలను గణితంలో మనము చూస్తుంటాం. ఇంజనీరింగ్ శాస్త్రమంతా దాదాపుగా ఈ లెక్కలతోనే ముడిపడి ఉంటుంది.

ప్రియులారా! ఈ మాటలన్నీ నేను ముందుగా ఎందుకు వ్రాస్తున్నానంటే, 'బైబిల్ గణాంకములు' అనే ఈ పాఠాన్ని మనము నేర్చుకుంటున్నప్పుడు బైబిల్‌లో కూడా మనకు ఆయా సందర్భాలలో లెక్కలు ఎదురుపడతాయి. బైబిల్‌లో కూడా దేవుడు అంకెలను, లెక్కలను ప్రస్తావించాడు. మన ఆత్మీయ జీవితంలో, భూమి మీద మనము బ్రతికియున్న ఈ కాలంలో మనం పరలోకానికి అర్హతను సాధించాలంటే, మనము కూడా అన్ని విషయములలో లెక్క కలిగి ఉండాలి. మనము లెక్క లేకుండా ఎలా పడితే అలా జీవించడానికి వీలు లేదు. దేవునిలో మన జీవితమంతా లెక్కలమయం. పరలోకమందున్న దేవుడు ప్రతి దానిని లెక్క చూస్తున్నాడు. మనము కూడా ఆయనకు లెక్క అప్పజెప్పవలసినవారముగా ఉన్నాము. సామాన్యులకు, పామరులకు కూడా అర్థమయ్యేటట్టుగా దేవుడు తన గ్రంథములో తన లెక్కలను వ్రాయించాడు. వాటిని నిశితంగా పరిశీలించి మనలను అర్థం చేసుకోమని ఆయన కోరుకుంటున్నాడు. ఆదికాండము మొదటి అధ్యాయం ప్రారంభపు మాటలలో కూడా దేవుడు మనకు లెక్కలను చూపిస్తున్నాడు. దేవుడు ఆదియందు భూమిని, ఆకాశమును సృజించాడు. వాటి క్రమాన్ని అక్కడ ఆయన వ్రాయిస్తూ, మొదటి దినాన ఏమి చేసాడో, రెండవ దినాన ఏమి చేసాడో, మూడవ దినాన ఏమి చేసాడో, నాలుగు, ఐదు, ఆరవ దినాలలో తన పనిలో భాగంగా వేటిని వేటిని ఒక క్రమంలో ఆయన సృష్టించాడో తెలియజేసాడు. అలా వ్రాసిన తర్వాత, ఆయన సృష్టి కార్యక్రమం పూర్తి చేసిన తరువాత దేవుడు ఒక మాట పలుకుతున్నాడు.

**ఆదికాండము 1 : 31 'దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాల మంచిదిగ నుండెను. అస్తమయమును, ఉదయమును కలుగగా ఆరవ దినమాయెను.'** అంటే ఆయన ఈ సృష్టికార్యక్రమమును ఆరు దినములలోగా పూర్తిచేసాడు. సరిగ్గా ఆరవ దినము ముగింపుకు వచ్చేసరికి ఆయన తన పనినంతటిని ముగించాడు. అంటే ఆయన తాను చేస్తున్న పని విషయంలో కాలానికి సంబంధించి కొంత లెక్కను కలిగి ఉన్నాడు. తాను నిర్ణయించుకున్న ఆరు దినములలో తన పనిని పూర్తిగా చేయాలి అనేటువంటి లెక్కను పరలోకంలో ఆయన కలిగియున్నాడు. అందుకే అస్తమయమును, ఉదయమును కలుగగా ఆరవ దినము పూర్తయింది. తన పని కూడా ముగింపబడింది. ఆరవ దినము ముగింపబడేలోపు దేవుడు అన్నింటిని పూర్తిచేసాడు. ఇక **ఆదికాండము 2 : 1** వ వచనములో **'ఆకాశమును, భూమియు**

**వాటిలో ఉన్న సమస్త సమూహమును సంపూర్తి చేయబడెను.'** అని వ్రాయబడింది. దేవుడు ఒక కాలాన్ని నిర్ణయించుకొని ఆ కాలములోపు ఆకాశమును భూమిని వాటిలోనున్న సమస్త సమూహమును సంపూర్తి చేయాలనుకున్నాడు. వీటన్నిటిని పూర్తిచేయడానికి దేవుడు ఆరు దినాల కాలమును తీసుకున్నాడు. ఇది దేవుని లెక్క. ఈ లెక్కలోపు తాను అనుకున్న దానిని పూర్తిచేయాలనుకున్నాడు.

**ఆదికాండము 2 : 2 'దేవుడు తాను చేసిన తన పని యేడవ దినములోగా సంపూర్తి చేసి, తాను చేసిన తన పని యంతటినుండి యేడవ దినమున విశ్రమించెను.'** అంటే ఇదంతా ఒక లెక్కకు సంబంధించినదని మనము అర్థం చేసుకోవాలి. లెక్కా, పత్రం లేకపోతే దేవుడు ఎన్ని రోజులైనా తీసుకోవచ్చు. ఉదాహరణకు, ఒక చెట్టును చేయడానికి ఎన్ని రోజులైనా తీసుకోవచ్చు, ఒక జంతువును చేయడానికి ఎన్ని రోజులైనా తీసుకోవచ్చు. మనిషిని చేయటానికి కూడా ఆయన ఎన్ని రోజులైనా తీసుకోవచ్చు. కానీ దేవుడు అలా చేయలేదు. ముందుగా ఆయన తనకు పట్టే కాలాన్ని నిర్ణయించుకొన్నాడు. ఆ నిర్ణీత కాలంలో ఆయన తాను అనుకున్న సమయం లోపులోనే తన పనినంతటినీ ముగించాడు. ఇది దేవునికి ఉన్న ఒక గొప్ప లక్షణం. అంటే ఆయన బద్ధకస్తుడు కాడు. దేవుని కొరకు ఒక పనిని మనము చేయాలని నిర్ణయించుకున్న తర్వాత నిర్ణీత సమయము లోపు మనము ఆ పనిని పూర్తి చేయగలగాలి. మనము బద్ధకస్తులుగా ఉండకూడదని నేర్పించడానికే దేవుని లెక్కలను ఆయన మనకు నేర్పిస్తున్నాడు. ఇది దేవుని అభీష్టం. తన పిల్లలు కూడా ఇవ్వబడిన సమయములోపు ఆయన నిర్ణయించిన పనిని పూర్తిచేయాలన్నది ఆయన సంకల్పం. చాలా మంది దేవుని దగ్గరకు వచ్చేసరికి బద్ధకస్తులుగా మారిపోతారు. ఎందుకంటే, ఆయన వెనువెంటనే శిక్షను విధించడు అలాగే వెనువెంటనే బహుమానమును కూడా ఇవ్వడు. గనుక, దేవుని విషయంలో మనుష్యులు చాలా నిర్లక్ష్యంగా ఉంటారు. అందుకే ఈ మంచి పాఠాన్ని మీకు నిర్ణయించితిని. దేవుని మనస్సు ఎలా ఉంటుందంటే, ఆయన ఒక సమయాన్ని నిర్ణయించుకున్నాడంటే ఆ సయయంలోపు పనిని పూర్తిచేస్తాడు. ఆయన ఒక నిర్ధిష్టమైన లెక్క కలిగినవాడు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ భూమి మీదకు శరీరధారిగా వచ్చి తండ్రి అప్పగించిన పనిని చేస్తున్నాడు. ఆయన పనిని పూర్తి చేస్తూ ఆయనకివ్వబడిన కాలంలోపు దానినంతటినీ పూర్తిచేయడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఎందుకంటే, ఆయన కూడా తండ్రివలె లెక్క కలిగిన కుమారుడు. దేవుని మనస్సులో ఎలాంటి లెక్కలున్నాయో, భూమి మీద యేసుక్రీస్తు మనస్సులో కూడా అలాంటి లెక్కలే ఉన్నాయి.

**యోహాను సువార్త 17 : 4 'చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద నిన్ను మహిమపరచితిని.'** దేవునిచే ఇవ్వబడిన కాలములోపే యేసుక్రీస్తు ఏమి పూర్తిచేసాడో చూడండి. తండ్రి తనకప్పగించిన పనిని పూర్తిచేసాడు. ఏది? మనం ఈ మాటను మన జీవిత కాలంలో ఎన్నడైనా చెప్పగలమా? చేయుటకు తండ్రియైన దేవుడు మనకిచ్చిన పనిని సంపూర్ణముగా నెరవేర్చి భూమి మీద ఆయన్ను మహిమపరిచే రోజు మన జీవితంలో రావాలి. యేసుక్రీస్తుకు ఇవ్వబడిన ఈ భూజీవితకాలంలో తండ్రి తనకు అప్పగించిన పనిని సంపూర్తి చేయాలని ముందుగా ఆయన ఒక లెక్క వేసుకున్నాడు. ఆ లెక్క ప్రకారమే ఆయన ఈ లోకములోనికి అడుగుపెట్టాడు. లేదంటే తన పన్నెండవయేట యెరూషలేములో దేవాలయములో తన భూసంబంధమైన తల్లిదండ్రులను విడిచిపెట్టి బోధకుల మధ్య ఆయన ఎందుకు కూర్చోవాలి?**(లూకా సువార్త 2 : 41 - 49)** దేవుని పనిని త్వరత్వరగా ఆయన ముగించాలి గనుక! పెందలకడనే సమాజమందిరమునకు వచ్చి ఆయన ఎందుకు బోధించాలి?**(లూకా సువార్త 21 : 37 - 38)** పరలోకపు తండ్రి పనిని ముగించాలి గనుక! రాత్రివేళ ఒలీవల కొండకు వెళ్ళి ఆయన ఎందుకు ప్రార్థించాలి? తండ్రి ఇచ్చిన పగటి సమయాన్ని వృథా చేయకుండా, దానినంతటినీ ఆయన పనికొరకు వినియోగించి, రాత్రి సమయంలో పని చేయలేము గనుక రాత్రివేళ ప్రార్థన చేయుచు కాలము గడుపుచుండెను. **(యోహాను సువార్త 9 : 4)** ఆయన ప్రయాణించుచున్న దోనె అలలచేత కొట్టబడుచున్నా ఎందుకు ప్రయాణం చేయాలి?**(మత్తయి సువార్త 8 : 23 - 26)** తండ్రి పనిని ముగించాలి గనుక! ప్రజలను ఆకలి దప్పులతో ఉంచి కూడా ఎక్కువ సమయం అరణ్యప్రదేశములో దేవుని వాక్యాన్ని ఎందుకు ప్రకటించాలి? **(మత్తయి సువార్త 14 : 13 - 21)** ఆయన దేవుని పనిని ముగించాలి గనుక! అవసరమైతే ఐదు రొట్టెలు రెండు చేపలను

వీరందరికీ పంచిపెడదాం అనుకున్నాడు తప్ప, దేవుని పనిని వాయిదా వేద్దామని మాత్రం అనుకోలేదు. ఎందుకంటే అక్కడ దేవుని లెక్క ఆయనకు గుర్తుంది. ఇశ్రాయేలీయులంతా క్రమం తప్పకుండా పనిని తప్పించుకోవడానికి ఆచరించే విశ్రాంతి దినమున కూడా యేసు ఎందుకు తండ్రి పనిని చేయాలి? **(యోహాను సువార్త 5 : 16 - 17)** అది పరలోకమందున్న దేవుని మనస్సు గనుక! అదే విధంగా మనము కూడా ఏ విధంగా లెక్క కలిగి పనిచేయాలో దేవుడు అపొస్తలుడైన పౌలు ద్వారా వ్రాయిస్తున్నాడు. దీనినిబట్టి మనము చేయవలసిన పని తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో మీరు గ్రహించాలి.

**తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 4 : 5- 'అయితే నీవు అన్ని విషయములలో మితముగా ఉండుము. శ్రమపడుము, సువార్తికుని పనిచేయుము, నీ పరిచర్యను సంపూర్ణముగా జరిగించుము.'** ఒకేసారి ఎక్కువైనా లేక తక్కువైనా లెక్క తేడా వస్తుంది. ఏ విషయంలోనైనా సరే మీరు మితముగా ఉండాలి. లోక సంబంధమైన ఉద్యోగమా? ఎంతవరకు చేయాలో అంతవరకే చేయండి. ఓవర్‌టైమ్ అవసరం లేదు. ఎందుకంటే, మనకొరకు దేవుని పని ఎదురుచూస్తుంది. ఇది మనకు చాలా ముఖ్యమైనది. నీవు అన్ని విషయములలో మితముగా ఉండుము. షాపింగ్‌కి వెళితే అందులో మితముగా ఉండండి. వెళ్ళిన పని అయిపోగానే వెంటనే వచ్చేయాలి, అంతేగాని అక్కడ కొంత కాలం కాలక్షేపం చేద్దామని అనుకోకూడదు. టైంపాస్ ఎక్కడా చేద్దామనుకోకూడదు. ఎందుకంటే మీకు వేరే ముఖ్యమైన పని ఉంది. మీరు లోక సంబంధులు కారు. మీరు పరలోకానికి వెళ్లవలసిన వారు. మీరు దేవుని కుమారులు గనుక మీ విలువైన సమయాన్ని వృధా చేసుకోకూడదు. దైవ ప్రేరణచేత అపొస్తలుడైన పౌలు ఆనాడు తిమోతితో ఏమంటున్నాడంటే, నీవు అన్ని విషయములలో మితముగా ఉండుము. భోజనం చేసే విషయంలో, మంచి నీరు త్రాగే విషయంలో, దుస్తులు ధరించుకునే విషయంలో.. ఇలా అన్ని విషయాలలో నీవు మితముగా ఉండాలి. నిద్రపోయే విషయంలో, ఆటలాడే విషయంలో మితముగా ఉండాలి. అన్నింటిలోనూ మితముగా ఉన్న తరువాత ఏమి చేయాలో చూడండి. అన్నిటిలో లెక్క కలిగి ఉన్న తర్వాత, మిగుల్చుకున్నటువంటి ఆ మంచి శ్రేష్టమైన సమయాన్ని ఏంచేయాలో తెలుసా? మీరు శ్రమపడాలి! ఎవరి కొరకు? దేవుని కొరకు. భర్తతో మితముగా ఉండాలి, భార్యతో మితముగా ఉండాలి, పిల్లలతో మితముగా ఉండాలి, తల్లిదండ్రులతో మితముగా ఉండాలి, బంధువులతో మితముగా ఉండాలి. చూసారా? అన్నింటిలోనూ మీరు మితముగా ఉన్నప్పుడు అది మీ ఆరోగ్యానికి కూడా మంచిది. చివరకు వచ్చేసరికి మీరు మితముగా ఉండి, కాపాడుకున్న మీ విలువైన సమయమును మీరు దేవుని కొరకు ఖర్చు చేయాలి. ఆయన కొరకు శ్రమపడాలి. సువార్తికుని పనిచేయాలి. మీ పరిచర్యను సంపూర్తిగా నెరవేర్చాలి. అన్నింటిలోనూ మీరు మితముగా ఉన్నప్పుడే మీ పరిచర్యను పూర్తి చేయగలరు. ఎందుకంటే, అప్పుడే మీ విషయమై దేవుని లెక్క మీకు అర్థమైనట్టు. దేవుడు మీకిచ్చిన ఆయుష్కాలములో పూర్తి చేయవలసిన దేవుని పనిని మీరు ఏమాత్రం తక్కువగా అంచనా వేయకూడదు. మీ జీవితంలో మీరు దేనిని పూర్తి చేసినా చేయకపోయినా, దేవుని పనిని మాత్రం పూర్తి చేయాలి. ఎవరిని సంతోషపెట్టినా సంతోషపెట్టకపోయినా దేవున్ని మాత్రం మీరు సంతోషపెట్టాలి. ఈ లెక్క మీకు చక్కగా అర్థం కావాలి. అపొస్తలుడైన పౌలు పానార్పణముగా పోయబడుచున్నాడు. తాను అప్పటికి వెడలిపోవు సమయము సమీపమైయున్నది. ఆయన దేవుని కొరకు మంచి పోరాటమును పోరాడాడు. చివరకు నిర్ణీత కాలములో తన పరుగును కడముట్టించాడు. పైగా, అతి ప్రాముఖ్యమైన విషయం, తన విశ్వాసమును కాపాడుకున్నాడు. ఈ మాటలన్నీ ఆయన ఎందుకు చెప్పగలుగుచున్నాడంటే, తన జీవితకాలంలో తాను దేవుని పనిని పూర్తిచేసాననే నిశ్చయత ఆయనకు కలిగింది. అదే ధీమాతో ఆయన ఆ మాట చెప్పగలుగుతున్నాడు. యేసుక్రీస్తు తన విషయమైన దేవుని లెక్క పూర్తి చేసి అందరికీ ఒక మాదిరి ఉంచాడు. అదే బాటలో పౌలుకూడా లెక్క పూర్తి చేయగలిగాడు. దేవుని మనస్సు ఎరిగిన వారు, వారికి దేవునిచే ఇవ్వబడిన సమయములోగా ఆయన నిర్ణయించిన పనిని పూర్తిచేయాలి.

**నిర్గమకాండము 20 : 11 'ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, యేడవ దినమున విశ్రమించెను. అందుచేత యెహోవా విశ్రాంతిదినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను.'** మరల ఇశ్రాయేలీయులకు దేవుడు నిర్ణీత కాలములో చేసిన తన పనిని గూర్చి తెలియజేస్తున్నాడు. ఆరు దినములలో ఆయన పనిని పూర్తిచేసాడు. పనిని ముగించిన పిదప ఏడవ దినమున ఆయన విశ్రమించాడు. ఆయన

లెక్కలేనివాడు కాదని మీరు నిశ్చయముగా తెలుసుకోవాలి. ఈ విషయాన్ని ఆయన ఇశ్రాయేలీయులతోనూ, లేఖనముల ద్వారా మనతోనూ పదే పదే చెబుతున్నాడు. ఎందుకంటే, లెక్క కలిగిన పనిని మనము నెరవేర్చాలన్న సత్యము మన మనస్సులో బలంగా నాటబడాలి.

నిర్గమకాండము 31 : 17 **'నాకును ఇశ్రాయేలీయులకును అది ఎల్లప్పుడును గురుతైయుండును; ఏలయనగా ఆరు దినములు యెహోవా భూమ్యాకాశములను సృజించి యేడవదినమున పని మాని విశ్రమించెనని చెప్పుము.'** భూమి మీద బ్రతుకుచున్న జనులు తెలుసుకోవలసింది ఏమిటంటే, తమ చుట్టూ ఉన్న ప్రకృతి ఒక నిర్ణీతకాలంలో లెక్క కలిగినదిగా సృష్టింపబడింది. అందుకే ఈ ప్రకృతి కూడా ఎప్పుడూ లెక్కలు కలిగే ఉంటుంది. అది ఎప్పుడూ దానికి దేవుడు నియమించిన లెక్క దాటలేదు. ఉదాహరణకు, పగటివేళ సూర్యుడు ఉదయాన తూర్పుదిక్కున కనిపిస్తాడు, మరలా సాయంత్రం అయ్యేసరికి పడమర దిక్కుకు వెళ్ళిపోతాడు. రాత్రివేళ ఆకాశంలో మనకు చంద్రుడు కనిపిస్తాడు, నక్షత్రాలు మనకు కనిపిస్తాయి. ఋతువులను కూడా గమనించండి. వసంతఋతువు, గ్రీష్మఋతువు, వర్షఋతువు, శరదృతువు, హేమంతఋతువు మరియు శిశిరఋతువు. ఇవన్నీ వాటివాటి కాలము ప్రకారం మనకు వస్తున్నాయి. ప్రతీదీ లెక్కలు కలిగి నడుస్తున్నది. ఈ భూమి మీద ఎప్పుడు ఏ ఫలం రావాలో, ఆ కాలంలోనే ఆ ఫలం రావటంలో ఉన్న పరమార్థం ఏమిటంటే ఇది దేవునిచే నడిపింపబడుచున్న లెక్కలు కలిగిన ప్రకృతి. ప్రియులారా! దేవుని పిల్లలుగా ఉన్న మనము లెక్కలు కలిగిన వారముగా ఉండాలి. మీ జీవితకాలంలో దేవుని కొరకు బ్రతికి ఆయన పనిని సంపూర్తిచేసిన వారముగా మనముండాలనేదే దేవుని ఆలోచన. అందుకే ఆయన ప్రతీదానికి ఒక లెక్కను నియమిస్తున్నాడు. మానవుల ఆయుష్కాలానికి కూడా దేవుడు ఒక లెక్కను నియమించాడు. ఆ లెక్క కలిగిన బ్రతుకుకాలంలోనే ఇప్పుడు మనము ఉన్నాము. ఆ లెక్క పూర్తైపోతే మనము ఈ భూమిని విడిచి వెళ్ళిపోవాలి. భూమి మీదకు ప్రతి మనిషిని దేవుడు పంపించేటప్పుడు, వారికి ఒక లెక్కఇచ్చి పంపించాడు. దేవుడిచ్చిన ఆ లెక్క పూర్తయిపోతే, వెనువెంటనే మనము ఈ దేహాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోవాలి. మన జీవితము విషయమై ఆ దేవుని లెక్క అంత ప్రాముఖ్యమైనది. ప్రారంభకాలంలో అనగా, ఆదాము కాలంలో మనిషికి దేవుడిచ్చిన ఆయుష్షు లెక్క వందల సంవత్సరాలకొద్దీ ఉండేది. అందుకే, ఆదాము 930 సంవత్సరాలు బ్రతుకగలిగాడు. అంటే, ఆనాటికాలంలో మనుష్యులు సుమారు 900 నుండి 1000 సంవత్సరాల ఆయష్కాలమును కలిగి బ్రతికారు. అది వారికివ్వబడిన దేవుని లెక్క. ఆ తర్వాత కొంత కాలము గడిచింది. మనుష్యులకు సుమారు 1000 సంవత్సరాల ఆయష్కాలమును ఇవ్వడం వలన వారు దేవుని సంకల్పమును నెరవేర్చలేకపోతున్నారు సరికదా, వారు మరింత దుర్మార్గులవుతున్నారు. అందుకే, ఆ తరువాత నోవహు కాలం, జలప్రళయ కాలం వచ్చేసరికి దేవుడు నరుని ఆయుష్కాలాన్ని 120 సంవత్సరాలకు తగ్గించేసాడు. తొమ్మిది వందలు, వెయ్యి సంవత్సరాల కాలము మనుష్యులకివ్వడం వలన ఉపయోగం లేకపోయింది. ఎందుకంటే, మనిషికి దేవుని లెక్క తెలియడంలేదు. మనిషి ఈ భూజీవితకాలంలో లెక్కలేకుండా తిరుగుతున్నాడు. కనుక నోవహు కాలం వచ్చేసరికి మనిషి ఆయుష్కాలం 120 సంవత్సరాలయిపోయింది. 930 సంవత్సరాలెక్కడ? 120 సంవత్సరాలెక్కడ? ఆ తరువాత మరల దేవుడు, మోషేకాలం వచ్చేసరికి నరుని ఆయుష్కాలమును ఇంకా తగ్గించేసాడు. అది 70 యేళ్ళు, ఒకవేళ అధిక బలమున్నయెడల 80 యేళ్లు. అయినను వాటి వైభవం ఆయాసమే, దు:ఖమే! మనిషి లెక్కలేనివాడిగా బ్రతుకుతున్నాడు అనటానికి ఇదే నిదర్శనం. నరుని ఆయుష్కాలాన్ని దేవుడు ఇన్ని సార్లు ఎందుకు తగ్గించాడు? మూడుసార్లు నరుని ఆయుష్కాలాన్ని దేవుడు ఎందుకు మార్చాల్సివచ్చిందంటే, మనిషికి దేవుని లెక్క తెలియదు. అలాగని మనిషికి లెక్కలు అస్సలు తెలియవా? ఎవరినైనా నీవు ఏమి చదివావు అని అడిగితే, నేను ఐ.ఐ.టీ.లో ఎం.ఎస్సి. (మ్యాథ్స్) చదివానండి అంటాడు. మరొకడు పిహెచ్.డి. (మ్యాథ్స్) చదివానండి అంటాడు. ఒకడు మ్యాథ్స్ ప్రొఫెసర్, మరొకడు గణిత శాస్త్రజ్ఞుడు. కానీ, వీరికి తెలిసిన లెక్క ఎంతవరకూ అంటే, వీరికి త్రికోణమితి మాత్రమే తెలుసు. వీరికి ఆల్‌జీబ్రా మాత్రమే తెలుసు. దాని వలన అందరికి గుండె గాబరా తప్ప ఇంకేమీ ఒరగదు. లోక సంబంధమైన గణితాన్ని నేర్చుకోవడం వలన మనిషి ఈ భూమి మీద అతి చిన్న ప్రకృతి జీవితంలో కొద్దికాలం మాత్రమే సుఖంగా ఉండగలడు. కొద్దిగా మాత్రమే ప్రయోజనమును తెచ్చుకోగలడు. కానీ పరలోకసంబంధమైన జీవితానికి ఇవేవి ఉపయోగపడవు. భూమి మీద గణితశాస్త్రం తెలిసిన వారికి దేవుని లెక్కలు తెలుసా? **యోబు 14 : 5 'నరుల ఆయుష్కాలము**

**పరిమితి కలది, వారి నెలల సంఖ్య నీకు తెలిసేయున్నది.'** నరుల ఆయుష్కాలము 'అ'పరిమితమైనది కాదు. ఒక పరిమితి కలిగిన ఆయుష్కాలంలో దేవుడు ఒక లెక్క ఇచ్చి మనుష్యులను ఈ భూమి మీదకు పంపించాడు. కానీ, వారికిచ్చిన నెలల, సంవత్సరముల సంఖ్యను మాత్రం ఆయన చేతుల్లోనే పెట్టుకున్నాడు. మన ఆయుష్కాలము సంఖ్యను ముందుగా మనకు చెప్పేస్తే అది చాలా ప్రమాదకరం. మనమెంతకాలం బ్రతుకుతామో అది మనకు తెలిసిపోతే అది చాలా ప్రమాదం. అలా అయితే ఇక మనిషి దేవున్ని ఎదిరించేస్తాడు. అందుకే ప్రతి మనిషి తాలూకు ఆయుష్కాలపు సంఖ్యను మాత్రం ఆయన దగ్గరే ఉంచుకున్నాడు. కానీ ఒకటి మాత్రం మనకు తెలియాలి. అదేమిటంటే, నీ ఆయుష్కాలము ఒక లెక్క కలిగినదని నీవు తెలుసుకోవాలి. లెక్కలేనంత జీవితకాలమును దేవుడు ఏ ఒక్కరికీ ఇవ్వలేదు. లెక్కలేనన్ని బర్త్‌డేలు మీరు చేసుకోలేరు. పరిమితి కలిగిన బర్త్‌డేలు మాత్రమే మీకు వస్తాయి. పరిమితి కలిగిన సంవత్సరాలను మాత్రమే దేవుడు మనకిచ్చాడు. దీనినంతటినీ ఇప్పుడు ఆయన గ్రంథములో పరిశీలన చేద్దాం.

**ఆదికాండము 5 : 5 'ఆదాము బ్రతికిన దినములన్నియు తొమ్మిదివందల ముప్పది యేండ్లు. అప్పుడతడు మృతిబొందెను.'** ఇది ఆదాము కాలం, ఇది షేతు కాలం, ఆ తరములో పుట్టిన కొంతమంది మనుష్యుల కాలమిది. అది సుమారుగా 1000 యేండ్ల కాలము. అది ఆనాడు దేవుడు మనుష్యులకిచ్చిన పరిమితి కలిగిన ఆయుష్కాలం. ఆ తరువాత నోవహు జలప్రళయ కాలం వచ్చింది.

**ఆదికాండము 6 : 3 'అప్పుడు యెహోవా - నా ఆత్మ నరులతో ఎల్లప్పుడును వాదించదు; వారు తమ అక్రమ విషయములో నరమాత్రులై యున్నారు; అయినను వారి దినములు నూట ఇరువది యేండ్లగుననెను.'** మనుష్యులు తమ జీవితపు లెక్కను తెలుసుకోలేకపోతున్నారు. దేవునికొరకు తమ జీవితకాలమంతా ఎంతో పనిని జరిగించవలసినవారు భూమి మీద తమ కాలాన్ని వృథాగా గడుపుతున్నారు గనుక వారు నరకపాత్రులవుతున్నారు. వారు తమ అక్రమ విషయంలో కేవలం నరమాత్రులై ఉన్నారు. అయినను వారి దినములు 120 యేండ్లగును అన్నాడాయన. ఇక నోవహు తరము నుండి పుట్టుకొచ్చిన మనుష్యులందరూ ఇంచుమించు 120 యేండ్లు బ్రతికారు.

**కీర్తనలు 90 : 10 'మా ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు. అధికబలమున్న యెడల ఎనుబది సంవత్సరములగును. అయినను వాటి వైభవము ఆయాసమే, దు:ఖమే. అది త్వరగా గతించును. మేము ఎగిరిపోవుదుము.'** ఇదే ఆయుష్కాలంలో ఇప్పుడు మనము కూడా ఉన్నాము. అందుకే సుమారుగా 70 యేళ్ళపాటు మనము బ్రతుకగలుగుతున్నాము. ఇందులో కొందరు 70 కంటే కొద్దిగా ముందుగానే వెళ్ళిపోవచ్చు, లేక కొందరు అంతకంటే కొద్దిగా ఎక్కువగాను బ్రతకవచ్చు.

ప్రియులారా! ఈ దేవుని లెక్క మనకు అర్థమైనప్పుడు దేవుని కొరకు ఎంతగా పనిచేయాలో మనము నేర్చుకుంటాము. యేసుక్రీస్తును తెలుసుకొని, మన హృదయపూర్వకముగా ఆయనను అంగీకరించి, బాప్తిస్మమును పొందేనాటికే ఎంతో కాలము గడిచిపోయింది, మనకు చాలా వయస్సు వచ్చేసింది. ఇంకా ఎంతకాలం బ్రతుకుతామో ఆ సంఖ్య మనకు తెలియదు. కానీ, ఒక్కటి మాత్రం మనకు తెలుసు. మన ఆయుష్షుకాలము ఒక పరిమితి కలిగినది. అలాంటప్పుడు మనము దేవుని కొరకు సమయమనక అసమయమనక ఆయన సేవచేస్తూ మన కాలమును గడపాలి. ఆయన పనిని ముగిస్తూ ముందుకు సాగాలి. ఆయన కార్యక్రమాలను పూర్తిచేస్తూ మన ఖాతాలో వేసుకుంటూ ఉండాలి. ఆయన చిత్తాన్ని నెరవేరుస్తూ ఆయన్ను మెప్పిస్తూ ఉండాలి. ఎందుకంటే ఆయన లెక్క కలిగినవాడు. అనుకున్న సమయంలోపు పనిని పూర్తి చేయాలన్న మనస్సు కలిగినవాడు. ఆయన తన లెక్కలన్నింటినీ తన గ్రంథములో మనకొరకు భద్రపరచి ఉంచాడు.

ఈ భూమిపై మొట్టమొదట దేవుడు ఇశ్రాయేలీయులను తన కొరకు ఒక జనాంగముగా ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ఇశ్రాయేలీయులను నిర్ణయించటంలో ఆయన చాలా లెక్కలను మనకు చూపించాడు. దీని విషయమై మొదట దేవుడు అబ్రాహాముకు ఒక వాగ్దానం చేసాడు. భూమి మీద అనేకమంది కుమారులను తనకు సంతానముగా

ఇస్తానన్నాడు. ఇశ్రాయేలీయులంతా అబ్రాహాము గర్భము నుండే పుట్టాలని దేవుడు నిర్ణయించాడు. కానీ, అబ్రాహాముకు దేవుడు ఈ వాగ్ధానమును చేసేసరికే అబ్రాహాముకు తన భార్యకు వయస్సు మీరిపోయింది. అయినా దేవుని వాగ్ధానము నిరర్థకము కానేరదు గనుక, అబ్రాహాము వృద్ధాప్యంలో అతనికి ఇస్సాకు పుట్టాడు. దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్ధానము ప్రకారం, ఆయన చాలా మంది పిల్లలను అబ్రాహాముకు ఇస్తానన్నాడు కానీ ఇస్సాకు ఒక్కడే పుట్టాడు. అంటే, దేవుని వాగ్ధానము నెరవేరడానికి ఇంకా సమయము ఉందన్నమాట. కొంత కాలాన్ని ఆయన నిర్ణయించాడు. అందుకే , ఆ తరువాత ఇస్సాకు పెద్దవాడై వివాహమును చేసుకున్న తరువాత తనకు ఇద్దరు కుమారులు పుట్టారు. వారే యాకోబు, ఏశావులు. యాకోబు నీతిని చూచిన దేవుడు మరల తాను అబ్రాహాముకు చేసిన వాగ్ధానమును జ్ఞాపకం చేసుకున్నాడు. అనేకమంది మనుష్యులను దేవుడు అబ్రాహాము ద్వారా ఈ భూమి మీదకు రప్పించాలనుకున్నప్పుడు, వెనువెంటనే ఒక వంద మంది పిల్లలను అబ్రాహాముకు ఆయన ఇవ్వలేదు. అబ్రాహాము తరువాత ఇస్సాకు, తరువాత ఇశ్రాయేలు(యాకోబు) వరకు ఆయన ఎదురుచూచాడు. ఇక ఇశ్రాయేలు వచ్చేసరికి, దేవుడు ఇశ్రాయేలులోనుండి 12 మంది మనుష్యులను తీసుకొని వస్తున్నాడు. వారే ఇశ్రాయేలీయులకు ప్రారంభికులు. ఇశ్రాయేలు జనాంగమంతా, దేవుడు నిర్ణయించిన కాలాన్ని బట్టి యాకోబు గర్భము నుండి వచ్చిన 12 మంది మనుష్యుల ద్వారా బయటకు వచ్చారు. వారిలో నుండి యూదా గోత్రము ద్వారా యేసుక్రీస్తు ఈ లోకానికి శరీరాన్ని ధరించుకొని వచ్చాడు.

**ఆదికాండము 35 : 23 'యాకోబు కుమారులు పండ్రెండుగురు. యాకోబు జ్యేష్ఠకుమారుడగు రూబేను, షిమ్యోను, లేవి, యూదా, ఇశ్శాఖారు, జెబూలూను; వీరు లేయా కుమారులు. రాహేలు కుమారులు యోసేపు, బెన్యామీను. రాహేలు దాసియైన బిల్హా కుమారులు దాను, నఫ్తాలి. లేయా దాసియైన జిల్పా కుమారులు గాదు, ఆషేరు. వీరు పద్దనరాములో యాకోబునకు పుట్టిన కుమారులు.'** యాకోబు నుండి వచ్చిన వీరందరూ కలిపి మొత్తం పండ్రెండుమంది. దేవుడు సరిగ్గా పండ్రెండుమందినే పుట్టించాలా? పండ్రెండు గోత్రాలనే ఈ భూమి మీద ఇశ్రాయేలీయుల కొరకు దేవుడు నిర్ణయించాలా? అవును. ఇది దేవుని లెక్క. ఇంత మందినే ఆయన ఏర్పాటు చేసుకున్నాడు. మనకు పిల్లలు పుట్టినప్పుడు మనకు లెక్క ఉండకపోవచ్చు, ఏదో కాకతాళీయముగా కొంతమంది పిల్లలు నాకు పుట్టారులే అని మనమనుకుంటాం. కానీ, ఈ భూమి మీదకు వచ్చే ప్రతి బాలుడు, బాలిక వెనుక దేవుని మహా సంకల్పం దాగి ఉంది. అది దేవుని లెక్కకు సంబంధించిన విషయం! ఈ భూమి మీద తల్లిదండ్రులకు పిల్లల విషయంలో లెక్క ఉండకపోవచ్చు, కానీ దేవునికి లెక్క ఉంది. ఆయన పనిని నెరవేర్చడానికి ఆయన పిల్లలు మనకు పుట్టినవారుగా ఈ భూమి మీదకు వస్తున్నారు. అందుకే ఆయన ఆయా తల్లిదండ్రులకు మంచి బహుమానములుగా పిల్లలను ఇస్తున్నాడు. ఆయన పని అవసరత లేదనుకుంటే ఆయన ఇవ్వడు. అందుకే ఆనాటి కాలంలో దేవుడు ఒక లెక్క కలిగి యాకోబుకు పండ్రెండుమంది పిల్లలను ఇచ్చాడు. వారి ద్వారా ఇశ్రాయేలీయులంతా భూమి మీదకు ఆయా కాలాలలో వచ్చారు. వారి ద్వారా దేవుని కార్యక్రమాలు జరిగాయి. ప్రియులారా! ఇదంతా మీ మనస్సులో జ్ఞాపకముండాలి. గత కాలపు చరిత్రను లెక్క కలిగినదిగా మీరు తెలుసుకోవాలి.

ఆనాడు యాకోబు గర్భాన పుట్టినవారు పండ్రెండుమంది. ఆ పండ్రెండుమంది ఎవరెవరి ద్వారా రావాలో కూడా దేవునికి లెక్క ఉంది. యాకోబు మొదటి భార్యయైన లేయా ద్వారా వచ్చినవారెంతమంది? లేయా దాసియైన జిల్పా ద్వారా వచ్చిన వారెంతమంది? యాకోబు రెండవ భార్యయైన రాహేలు ద్వారా వచ్చినవారెంతమంది? రాహేలు దాసియైన బిల్హా ద్వారా వచ్చిన వారెంతమంది? ఇవన్నీ మనము అర్థం చేసుకోవాలి. ఆ తరువాత దేవుడు మరల కొంతకాలం ఎదురు చూసాడు. ఈ పండ్రెండుమంది ఇశ్రాయేలీయులలో నుంచి పిల్లలు రావాలి. రూబేనులో నుంచి రావాలి, షిమ్యోనులో నుంచి రావాలి, లేవీలో నుంచి రావాలి. యూదా, ఇశ్శాఖారు, జెబూలూను, యోసేపు, బెన్యామీను, దాను, నఫ్తాలి, గాదు, ఆషేరు వీరందరిలో నుంచి పిల్లలు రావాలి. ఒక్కడైన అబ్రాహాము ఇద్దరయ్యారు. ఇద్దరైన అబ్రాహాము, ఇస్సాకులు ముగ్గురయ్యారు. ముగ్గురైన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు పండ్రెండుమంది అయ్యారు. ఈ పండ్రెండుమంది ద్వారా వందల సంఖ్యలో ఇశ్రాయేలు జనాంగముగా మారారు. ఈ ఇశ్రాయేలీయులు వారి అవిధేయతను బట్టి వారు ఐగుప్తు బానిసత్వంలోనికి వెళ్లిపోయారు. ఆ తరువాత దేవుడు వారి మూలుగును శ్రమను విని, అబ్రాహాముకు తాను

చేసిన వాగ్దానమును జ్ఞాపకము చేసుకుని, ఐగుప్తు బానిసత్వములో నుండి వారిని తీసుకొనివచ్చి కనాను దేశాన్ని వారికి ఇచ్చాడు. ఇదంతా రాబోయే తరాలకు ఒక సాదృశ్యంగా ఆయన చూపించాలనుకున్నాడు. అపవాది బానిసత్వంలో నుండి పరలోకాన్ని సాధించాలంటే క్రీస్తు న్యాయకత్వంలో మనము ఎలాంటి శ్రమలు అనుభవించాలో, ఎలాంటి యుద్ధాలు చేయాలో భవిష్యత్తు తరాలకు చూపించటానికే దేవుడు ఇశ్రాయేలీయులను ఏర్పాటు చేసుకున్నాడు. వారిని ముందుగా మనకు ఒక ఉదాహరణగా చూపించాడు. ఈరోజు మనము అపవాదితో యుద్ధకాలములో ఉన్నాము. ఆనాడు ఇశ్రాయేలీయులు కూడా యుద్ధకాలంలో ఉన్నారు. ఇశ్రాయేలీయులందరిచేత ఆయన యుద్ధం చేయించాలంటే వారికి ఒక లెక్క ఉండాలనుకున్నాడు. ఆ లెక్కలను దేవుడు తన గ్రంథంలో పొందుపరిచాడు. నిజంగా పరలోకమందున్న దేవునికి ఎంతగా లెక్క కలిగి లేకపోతే ఆయన వ్రాయించిన గ్రంథాలలో ఒక గ్రంథానికి లెక్కల పేరు పెడతాడు చెప్పండి? బైబిల్‌లో ఉన్న 66 పుస్తకాలలో ఒక పుస్తకానికి లెక్కల పేరు ఉంది. అదే '**సంఖ్యాకాండము**'. సంఖ్యా కాండమనగా ఇశ్రాయేలీయుల లెక్కలకు సంబంధించిన గణిత శాస్త్రమంతా అందులోనే ఉంటుంది. బైబిల్ చదువుతున్నప్పుడు చాలామంది ఇదొక మతం, ఇదొక విదేశీ విశ్వాసం అని పొరపాటుపడుతున్నారు. ఇది మతం కాదు. మతం మనకు ఏమి నేర్పిస్తుంది? ఆచారాలను, సిద్ధాంతాలను మన నెత్తిన పెడుతుంది. బైబిల్ అనేది ఒక విశేషమైన పుస్తకం. దానిని పరిశోధిస్తున్నకొద్దీ ప్రపంచంలో ఉన్న ప్రతీఒక్కడికీ బుద్ధి చెప్పగలిగినటువంటి జ్ఞానము మనలో చిగురిస్తుంది. ఆనాటి ప్రారంభ శతాబ్దంలో నాటి క్రైసవులు లోకపు జ్ఞానులకు సైతం బుద్ధి చెప్పగలిగారు, వారి మధ్యన కూర్చుని మాట్లాడగలిగారు!

ప్రియులారా! సంఖ్యాకాండమంటే లెక్కల పుస్తకం. ఇశ్రాయేలీయులను దేవుడు ఏర్పాటు చేసుకున్న తరువాత అందులో ఎంతమంది యుద్ధానికి పనికొస్తారో అనేదానిని దేవుడు లెక్క కట్టమంటున్నాడు. ఎందుకంటే వారంతా దేవుని తరపున యుద్ధం చేయాలి. కనాను దేశాన్ని ఊరకనే దేవుడు వారి చేతుల్లో పెట్టలేదు. దానిని వారు యుద్ధం చేసి సంపాదించుకోవాలి. గనుక రూబేను గోత్రం మొదలుకొని, మిగిలిన పండ్రెండు గోత్రాలలో ఎంతమంది యుద్ధానికి పనికివస్తారో దేవుడు లెక్కించమంటున్నాడు. ఆ లెక్కను ఇప్పుడు మనము తెలుసుకుందాం. దానికంటే ముందు మీరు తెలుసుకోవలసిన మరొక ముఖ్యమైన సంగతి ఉంది. అదేమంటే, యాకోబు గర్భము నుండి పుట్టినటువంటి పండ్రెండుమందిలో లేవీ గోత్రాన్ని దేవుడు ప్రక్కన పెట్టాడు. ఎందుకంటే, వీరి పని యుద్ధం కాదు. లేవీ గోత్రంలో ఉన్నటువంటి యువకులను దేవుడు లెక్కపెట్టనివ్వలేదు. ఎందుకంటే, దేవుడు వారికి నిర్ణయించిన పని వేరు. లేవీ గోత్రపువారందరూ దేవుని యాజకత్వపు పనిని కలిగియుండాలి. దేవునికి నరులకు మధ్యవర్తులుగా యాజకత్వపు పనికి వారు అప్పగించబడ్డారు. దేవుని మందసపు పనిని, ప్రత్యక్షపు గుడారపు సేవను లేవీయులే చేయాలి. గనుక వారు యుద్ధానికి వెళ్లకూడదు. అంటే అప్పుడు పండ్రెండు గోత్రాలలో ఒక గోత్రం(లేవీ) ప్రక్కకు వచ్చేసింది. దానికి బదులుగా దేవుడు యోసేపు కుమారులకు రెండు గోత్రాలను ఇచ్చి ఆ పండ్రెండు లెక్కను సరి చేసాడు. యోసేపు ఐగుప్తులో నివసిస్తున్నప్పుడు తనకు ఇద్దరు కుమారులు పుడతారు. వారే మనష్షే, ఎఫ్రాయిములు. వీరిని చూచినటువంటి యాకోబు, యోసేపునకు పుట్టినటువంటి ఈ ఇద్దరు కుమారులను తన సొంత కుమారులుగా స్వీకరిస్తాడు. వారికి కూడా పండ్రెండుమందితో పాటుగా తన స్వాస్థ్యమునిచ్చి వారిని ఆశీర్వదిస్తాడు. దానినిబట్టి లేవీయులు యాజకత్వము కొరకు ప్రక్కనపెట్టబడినా, మిగిలిన గోత్రీకులతో కలిపి వీరు లెక్కకట్టబడతారు. యోసేపుకు ఇవ్వవలసిన ఆ గోత్రాన్ని తన కుమారులైన మనష్షేకు ఒక అర్థగోత్రంగా, మరియు ఎఫ్రాయిముకు మరొక అర్ధ గోత్రంగా ఇవ్వడం జరుగుతుంది.

**ఆదికాండము 48 : 5- 'ఇదిగో నేను ఐగుప్తునకు నీయొద్దకు రాకమునుపు ఐగుప్తు దేశములో నీకు పుట్టిన నీ యిద్దరు కుమారులు నా బిడ్డలే; రూబేను, షిమ్యోనులవలె ఎఫ్రాయిము, మనష్షేలు నా బిడ్డలై యుందురు. వారి తరువాత నీవు కనిన సంతానము నీదే; వారు తమ సహోదరుల స్వాస్థ్యమునుబట్టి వారి పేళ్ళ చొప్పున పిలువబడుదురు.'** అంటే, మనష్షే, ఎఫ్రాయిములు యోసేపుకు పుట్టినవారైనాగాని, దేవుని లెక్కల ప్రకారం యాకోబు వారిని తన బిడ్డలుగా స్వీకరించాడు. అలా మనష్షే, ఎఫ్రాయిములు ఇశ్రాయేలు అర్థగోత్రాలుగా మారిపోయారు. దేవుని యాజకత్వము కొరకు లేవీ ప్రక్కకు తీయబడ్డాడు. ఇక మిగిలిన వారిలో ఇరువది యేండ్లు మొదలుకొని పైప్రాయముగలవారినందరిని దేవుడు యుద్ధానికి

సైనికులుగా లెక్కపెడుతున్నాడు.

సంఖ్యాకాండము 1 : 1 **'వారు ఐగుప్తుదేశమునుండి బయలువెళ్లిన రెండవ సంవత్సరము, రెండవ నెల, మొదటి తేదిని, సీనాయి అరణ్యమందలి ప్రత్యక్షపు గుడారములో యెహోవా మోషేతో ఇట్లనెను. ఇశ్రాయేలీయుల వంశముల చొప్పున వారివారి పితరుల కుటుంబములను బట్టి వారివారి పెద్దల చొప్పున మగవారినందరిని లెక్కించి సర్వసమాజసంఖ్యను వ్రాయించుము. ఇశ్రాయేలీయులలో సైన్యముగా వెళ్లువారిని, అనగా ఇరువది యేండ్లు మొదలుకొని పైప్రాయముగల వారిని, తమ తమ సేనలనుబట్టి నీవును అహరోనును లెక్కింపవలెను.'** సంఖ్యాకాండము అనే పుస్తకమును దేవుడు ఎలా లెక్కలతో ప్రారంభిస్తున్నాడో చూడండి. లెక్క లేకుండా ఏదీ దేవుని దగ్గర జరగదు. ప్రతిదానికి ఆయన లెక్కకడుతున్నాడు. అందుకే బైబిల్ అంతా ఒక మహా గణితశాస్త్రము వంటిది. లోకమందున్న గణితశాస్త్రమును మించిన గణితశాస్త్రమే బైబిల్! ఒక మనిషిని పరలోకానికి నడిపించే గణితమంతా బైబిల్‌లోనే మనకు కనిపిస్తుంది. ఐగుప్తు బానిసత్వము నుండి ఇశ్రాయేలీయులను మోషే తన నాయకత్వంలో నడిపిస్తున్నప్పుడు ఎర్ర సముద్రాన్ని దాటించిన తర్వాత ఏమంటున్నాడో తెలుసా? వారు ఐగుప్తు దేశము నుండి బయలు వెళ్లినప్పుడు రెండవ సంవత్సరం, రెండవ నెల, మొదటి తేదీన సీనాయి అరణ్యమున ప్రత్యక్షపు గుడారములో యెహోవా మోషేతో ఇశ్రాయేలీయుల వంశము చొప్పున వారివారి పితరుల కుటుంబములనుబట్టి వారివారి పెద్దల చొప్పున మగవారినందరిని లెక్కించి వారి సర్వసమాజ సంఖ్యను వ్రాయించమన్నాడు. ఎవరైతే యుద్ధానికి పనికొస్తారో, యుద్ధానికి వీరులుగా ఎంతమందైతే సిద్ధంగా ఏ గోత్రంలో ఉన్నారో వారి లెక్కను మోషే మరియు అహరోనులు వ్రాయించాలి. సర్వజనసంఖ్యను కూడా వారు వ్రాయించాలి. మనుష్యులలో పరలోకానికి వెళ్ళేవారు ఎంతమంది? అపవాదితో పాతాళానికి పోయేవారు ఎంతమంది? మహాలోకాన్ని సాధించేందుకు ఈరోజు అపవాదితో యుద్ధం చేసేవారు ఎంతమంది ఉన్నారు? ఒకప్రక్క లోకమందున్న మనుష్యులు పాడైపోతుండగా, ప్రజలందరూ వక్రమార్గాన పోతుండగా, అపవాదితో యుద్ధంచేసి మనుష్యులను రక్షించే యుద్ధవీరులు ఈరోజు ఎవరున్నారు? ఎక్కడున్నారు? ఆనాడు ఇశ్రాయేలీయులు జాతినంతటిని ఐగుప్తు బానిసత్వము నుండి రక్షించి, వారిని వాగ్ధత్త దేశమందు నివసింపజేయాలంటే యుద్ధవీరులు అవసరం; అలాంటివారికి ఒక సంఖ్య అవసరం. ఇశ్రాయేలీయులలో ఎవరైతే పురుషులై ఇరువది యేండ్లు పైబడినటువంటి యుద్ధవీరులుగా ఉన్నారో వారి సంఖ్య అవసరం. ఆరోజు వారే లేకపోతే ఇశ్రాయేలు జాతికే ప్రమాదం. అందుకే దేవుడు నలుదిక్కులకు వారిని పాళెములుగా విడగొడుతున్నాడు. తూర్పున ఒకపాళెం, పడమటిన ఒక పాళెము, ఉత్తరాన ఒక పాళెం మరియు దక్షిణాన ఒక పాళెముగా ఆనాటి ఇశ్రాయేలు యుద్ధవీరులు ఏర్పడ్డారు! ఏ పాళెములో ఎంతమంది ఇశ్రాయేలు సైనికులుండాలో ముందుగా దేవుడు ఒక సంఖ్యను నిర్ణయించి, వారి ద్వారానే ఆయన ఇశ్రాయేలు జాతిని కాపాడుతున్నాడు. ఎందుకంటే, ఈ ఇశ్రాయేలీయులలో నుండే యేసుక్రీస్తు రావాలి! ఆయనే ఈ లోకాన్ని రక్షించాలి. ఈ రోజు యేసుక్రీస్తును ధరించుకున్న వారు కూడా తమ చుట్టూ ఉన్న మనుష్య తరాన్ని రక్షించాలి. అంటే నేడు మనము కూడా లెక్కలు కలిగిన వారముగా ఉండాలి. ఏ ప్రాంతానికి ఎంతమంది వెళ్లాలి? ఏ ప్రదేశంలో దేవుని మాటలు చెప్పాలి? ఎక్కడికి ఎవరిని పంపించాలి? ఇదంతా ప్రణాళిక కలిగి ఉండాలి. ప్రారంభంలో మనము చేసే ప్రతి పని చాలా చిన్నదిగా ఉంటుంది. కానీ దైవజ్ఞానానుసారముగా చేసే ప్రతి పని భవిష్యత్తులో అనేక మందిని రక్షిస్తుంది. సర్వభూతలమంత మహాపర్వతంగా మారిపోయే దేవుని సామ్రాజ్యం, ఒక నిషేధింపబడిన చిన్న రాయిగా ప్రారంభమయింది. అది ఆనాడు ఎన్నికలేనిది కావచ్చు. యేసుక్రీస్తు జననం నాటి ప్రజలలో ఎవ్వరికీ ఎన్నికలేదు. కానీ ఆయనే సత్యాన్ని స్థాపించాడు, ఆయనే సర్వలోకానికి మార్గమయ్యాడు, జీవమును అనుగ్రహించాడు. భవిష్యత్తులో లెక్కకలిగినవారమై సర్వప్రపంచాన్ని రక్షించడానికి మంచి కార్యక్రమాలను మనము చేయాలి. దాని కొరకు మంచి ప్రణాళికలు మనము వేయాలి. ఇశ్రాయేలీయులు దానికి ఒక మంచి ఉదాహరణగా కనిపిస్తున్నారు. భవిష్యత్తులో మీరెలా పనిచేయాలంటే ఒకనాడు దేవుడు పనిచేసినట్టుగా, ఇశ్రాయేలీయులచేత పని చేయించినట్టుగా అనగా వారిచేత యుద్ధం చేయించినట్టుగా మీరూ చేయాలి. కానీ, వారు శరీర సంబంధమైన యుద్ధాలు చేస్తే, మనము ఆత్మ సంబంధమైన యుద్ధాలు చేయాలి. అందుకే దేవుడు, సంఖ్యాకాండములో ఇశ్రాయేలు యుద్ధవీరులను పాళెములుగా విడగొడుతున్నాడు. దీనినంతటిని దేవుడు లెక్కకడుతున్నాడు.

సంఖ్యాకాండము 1 : 20- **'ఇశ్రాయేలు ప్రథమ కుమారుడైన రూబేను పుత్రుల వంశావళి. తమ తమ వంశములలో తమ తమ పితరుల కుటుంబములలో ఇరువది యేండ్లు మొదలుకొని పై ప్రాయము కలిగి సేనగా వెళ్లువారందరి సంఖ్యను తెలియజెప్పగా రూబేను గోత్రములో లెక్కింపబడినవారు నలుబది యారువేల ఐదువందల మందియైరి.'** యాకోబుకు మొదట పుట్టినవాడు రూబేను గనుక ఆ రూబేను నుండి వచ్చినటువంటి యుద్ధవీరుల సంఖ్య దేవుడు లెక్కపెడుతూ, నలుబది యారువేల ఐదువందలమంది అన్నాడు. తరువాతిగా షిమ్యోను గోత్రము నుండి యాబది తొమ్మిదివేల మూడువందల మంది. గాదు పుత్రుల సంఖ్య నలుబది యయిదువేల ఆరువందల యాబదిమంది. యూదా పుత్రుల సంఖ్య డెబ్బది నాలుగువేల ఆరువందలమంది. ఇశ్శాఖారు పుత్రుల సంఖ్య ఏబది నాలుగువేల నాలుగువందలమంది. జెబూలూను పుత్రుల సంఖ్య ఏబది యేడువేల నాలుగువందలమంది. యోసేపు కుమారుడైన ఎఫ్రాయిము పుత్రుల సంఖ్య నలుబదివేల ఐదువందలమంది. యోసేపుకు మరొక కుమారుడైన మనష్షే పుత్రుల సంఖ్య ముప్పది రెండువేల రెండువందలమంది. బెన్యామీను పుత్రుల సంఖ్య ముప్పది యైదువేల నాలుగువందలమంది. దాను పుత్రుల సంఖ్య అరువది రెండువేల ఏడువందలమంది. ఆషేరు పుత్రుల సంఖ్య నలువది ఒకవేయి ఐదువందలమంది. చివరిగా, నఫ్తాలి పుత్రుల సంఖ్య ఏబది మూడువేల నాలుగువందలమంది. ఇప్పుడు మొత్తంగా కూడితే, ఇశ్రాయేలులో అన్ని గోత్రములలో యుద్ధవీరుల సంఖ్య ఆరు లక్షల మూడువేల ఐదువందల ఏబదిమంది. ఇప్పుడు వీరందరిని నలుదిక్కులకు నాలుగు పాళెములుగా విడగొట్టాలి. ఇశ్రాయేలీయులలో స్త్రీలు, చంటి బిడ్డలు, వృద్ధులు మధ్యలో ఉంటారు. వీరికి రక్షణగా చుట్టూ పాళెములుగా ఈ లెక్కింపబడిన యుద్ధవీరులుండాలి. వీరంతా చుట్టూ ఉన్న శత్రుసైన్యంతో  యుద్ధం చేయాలి. ఇశ్రాయేలు జాతిని వీరు కాపాడాలి. ఇక నాలుగు పాళెములుగా ఎవరెవరు ఏ దిక్కునకు పంపబడ్డారో మనము ఆలోచిస్తే, తూర్పుదిక్కు యూదా పాళెముగా నిర్ణయింపబడింది. ఈ యూదా పాళెములో యూదాగోత్రంతో పాటుగా ఇశ్శాఖారు గోత్రం మరియు జెబూలూను గోత్రములలోని యుద్ధవీరులు ఉండాలి. ఇక పడమర దిక్కున ఎఫ్రాయిము పాళెము నిర్ణయింపబడింది. ఈ ఎఫ్రాయిము పాళెములో ఎఫ్రాయిము గోత్రంతో పాటుగా బెన్యామీను మరియు మనష్షే గోత్రములలోని యుద్ధవీరులు ఉండాలి. ఉత్తరము దిక్కున దానుపాళెము నిర్ణయింపబడింది. ఈ పాళెములో దాను గోత్రంతో పాటుగా ఆషేరు మరియు నఫ్తాలి గోత్రములలోని యుద్ధవీరులు ఉండాలి. ఇక చివరిగా దక్షిణాన రూబేను పాళెము నిర్ణయింపబడింది. ఈ రూబేను పాళెములో రూబేను గోత్రముతో పాటుగా షిమ్యోను మరియు గాదు గోత్రములలోని యుద్ధవీరులు ఉండాలి. ఇప్పుడు ఒక్కొక్క పాళెములో ఎంతమంది యుద్ధవీరులున్నారో లెక్క చూడండి. తూర్పున ఉన్న **యూదా పాళెములో** యూదా, ఇశ్శాఖారు, జెబూలూను గోత్రముల లెక్క 74,600+54,400+57,400 = **1,86,400** మంది వచ్చారు. పడమరన ఉన్న **ఎఫ్రాయిము పాళెములో** ఎఫ్రాయిము, బెన్యామీను, మనష్షే గోత్రముల లెక్క 40,500+35,400+32,200 = **1,08,100** మంది వచ్చారు. ఉత్తరాన ఉన్న **దాను పాళెములో** దాను, ఆషేరు, నఫ్తాలి గోత్రముల లెక్క మొత్తం కలిపి 62,700+41,500+53,400 = **1,57,600** మంది వచ్చారు. ఇక చివరిగా దక్షిణపు దిక్కున **రూబేను పాళెములో** రూబేను, షిమ్యోను, గాదు గోత్రముల లెక్క 46,500+59,300+45,650 = **1,51,450** మంది వచ్చారు. ఇప్పుడు ఈ నాలుగు పాళెములను కలుపగా యుద్ధవీరుల మొత్తం సంఖ్య మనకు తెలుస్తుంది. **1,86,400+1,08,100+1,57,600+1,51,450 = 6,03,550** వీరే దేవుని తరుపున పోరాడవలసిన ప్రజలు!

సంఖ్యాకాండము 1 : 45, 46 **'అట్లు ఇశ్రాయేలీయులలో తమ తమ పితరుల కుటుంబముల చొప్పున లెక్కింపబడిన వారందరు, అనగా ఇరువది యేండ్లు మొదలుకొని పై ప్రాయము కలిగి సేనగా బయలువెళ్లిన ఇశ్రాయేలీయులందరు లెక్కింపబడి ఆరు లక్షల మూడువేల ఐదువందల ఏబదిమందియైరి.'** సంఖ్యాకాండంలో దేవుడు ఆయన లెక్కలను ఎలా చెబుతున్నాడో చూడండి. దేవుని పనిని ఈ భూమిమీద జరిగించే ప్రతి ఒక్కరూ ఇలా లెక్క కలిగి ఉండాలి. దేవుని పనిలో మనము నిర్లక్ష్యంగా ఉండకూడదు. దేవుడే ఎంతగా లెక్కపెడుతున్నాడో చూడండి. ఒక్కొక్క గోత్రంలో ఎంతమంది? ఒక్కొక్క పాళెములో ఎంతమంది? వారిలో తూర్పున ఉండవలసిన వారెందరు? పడమరన ఉండవలసిన వారెందరు? ఉత్తరాన, దక్షిణాన ఉండి యుద్ధం చేయవలసిన వారెందరు? వీరందరినీ దేవుడు లెక్కలుగట్టి ఆనాడు యుద్ధానికి పంపిస్తున్నాడంటే, ఈరోజు మనము కూడా అంత చక్కగా ఆలోచించి ఆత్మ సంబంధమైన యుద్ధమును చేయొద్దా

చెప్పండి? అందుకే స్క్రిప్చర్స్ యూనివర్శిటీగా ఏర్పడి, ప్రతి చోట అనేక మందిని నియమించి వారిచేత నేను దేవుని కొరకు అపవాదిపై యుద్ధమును చేయిస్తున్నాను. ఇంకా భవిష్యత్తులోఎంతో పనిని మనము చేయాలి. దీనిని ముగించడానికి చాలా గొప్పగా మరియు వీరోచితముగా మనము పోరాడాలి.

ప్రియులారా! దేవుడు లెక్కలు కలిగిన హృదయము గలవాడు. దేనినీ ఆయన అనాలోచితంగా తీసుకోలేదు. ప్రతి విషయంలో ఆయనకు లెక్క ఉంది. తరువాత ఇశ్రాయేలీయుల నుంచి యేసుక్రీస్తు వచ్చాడు. యేసుక్రీస్తు ఇంతకీ ఏ కాలములో రావాలి? దావీదు కాలంలో రావాలా? బబులోనుకు ఇశ్రాయేలీయులు చెరపట్టపడిన కాలంలో రావాలా? లేక మరేదైనా ఇతర ప్రవక్తల కాలంలో రావాలా? కాదు, కాదు! దీనికి కూడా ఆయన దగ్గర ఒక లెక్క ఉంది. ఎప్పుడు పడితే అప్పుడు అనాలోచితముగా యేసు ఈ భూమి మీదకు వెళ్లడానికి వీలు లేదు. ఆయన దానికి కూడా ఒక సమయాన్ని నిర్ణయించాడు. ఒక కాలమును ఆయనే నిర్ణయించాడు. యేసు వచ్చేంతవరకూ ఎంతమంది ప్రవక్తలను పంపించాలో, ఆ ప్రవక్తల సంఖ్యను కూడా ఆయన నిర్ణయించి దానిని ఆయన పూర్తి చేసాడు. ఎంతమంది న్యాయాధిపతులను ఆయన నియమించాలో అంతమంది న్యాయాధిపతులను ఆయన నియమిస్తున్నాడు. ఎంతమంది స్త్రీలు ప్రవక్త్రిలు ఉండాలో అంతమందిని ఆయన నిర్ణయించాడు. ఇశ్రాయేలీయులను పరిపాలించడానికి ఎంత మంది రాజులు రావాలో ఆయన నిర్ణయించాడు. మరలా అందులో యూదులను పరిపాలించడానికి యూదా రాజులు ఎంతమంది, ఇశ్రాయేలీయులను పరిపాలించడానికి ఇశ్రాయేలు రాజులు ఎంతమంది అనేది కూడా దేవుడు నిర్ణయించాడు. దేవుని లెక్కలలో ఇదంతా జరిగిస్తూ, ఆయన అనుకున్న ఒకానొక సమయము వచ్చేసరికి, లెక్క పూర్తయినప్పటికి పరలోకమందున్న యేసుక్రీస్తును కన్య మరియ గర్భము ద్వారా పంపించాడు.

గలతీయులకు వ్రాసిన పత్రిక 4 : 4 **'అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీయందు పుట్టి మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్న వారిని విమోచించుటకై, ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను.'** యేసుక్రీస్తు ఏదో అనాలోచితంగా ఎప్పుడు పడితే అప్పుడు వచ్చేసాడనుకుంటున్నారా? లేదు. దేవుడు నిర్ణయించిన కాలము పరిపూర్ణమయింది. న్యాయాధిపతుల కాలం అయిపోయింది. ఇశ్రాయేలురాజుల కాలం అయిపోయింది. యూదా రాజుల కాలం అయిపోయింది. ప్రవక్తలు వెళ్లవలసిన కాలం ముగింపబడింది. ఆ తరువాత కాలము పరిపూర్ణమైనప్పుడు యేసును ఈ భూమి మీదకు దేవుడు పంపించాలి. అంతకు ముందు వచ్చిన వారందరి సమయం ముగింపబడింది, క్రీస్తు సమయం వచ్చేసింది. అందుకే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను. ఆయన స్త్రీ ద్వారా వచ్చాడు. మనము దత్తపుత్రులము కావలెనని, ధర్మశాస్త్రమునకు లోబడియున్న వారిని అనగా ఇశ్రాయేలీయులను విమోచించుటకై ఆయన ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను. ఆ ధర్మశాస్త్రాన్ని ఆయన నెరవేర్చిన తరువాత దానిని కొట్టివేసాడు అని వ్రాయబడింది. ప్రియులారా! జాగ్రత్తగా ఆలోచించండి. కాలము పరిపూర్ణమైనప్పుడు యేసుక్రీస్తు భూమి మీదకి వచ్చాడు. ఇక యేసును గూర్చి ఆలోచిస్తే, ఆయన కూడా ఈ భూమి మీద లెక్కలు పాటిస్తున్నాడు. యేసు ఈ భూమి మీద జీవించిన కాలం చాలా తక్కువ. ఆ తక్కువ కాలంలో ఆయన దేవుని పనిని పూర్తిగా చేయాలి. అందుకే యేసు చాలా లెక్కలు కలిగి జీవించాడు. ఆయనకు పండ్రెండేళ్లప్పుడే దేవుని లెక్కలన్నీ జ్ఞాపకం చేసుకుంటూ తాను దేవుని పనిని చేయాలని, యుక్తవయస్సుకు వెళ్లినప్పుడు (సుమారు ముప్పది యేండ్లప్పుడు) సువార్తను ప్రకటించి తండ్రి పనిని నెరవేర్చి తాను ఈ భూమిని విడిచి వెళ్లిపోవాలనే ఉద్ధేశ్యంతో బ్రతికాడు. ఆ క్రమంలో ఆయన మరణించాలి, సమాధి చేయబడాలి, తిరిగి లేవాలి! ఆయన పరలోకానికి ఆరోహణుడవ్వాలి. అటువలె ఆయనవలె అనేక మందిని క్రీస్తు శిష్యులుగా తయారు చేయాలి. యేసు తనకు శిష్యులను ఏర్పరచుకొంటున్నప్పుడు కూడా ఆయన లెక్కలు కలిగియున్నాడు. యేసుక్రీస్తు ఎంతమందిని తన శిష్యులనుగా ఏర్పరుచుకున్నాడో పరిశీలిద్దాం.

మత్తయి సువార్త 10 : 2- **'ఆ పండ్రెండుమంది అపొస్తలుల పేర్లు ఏవనగా, మొదట పేతురనబడిన సీమోను, అతని సహోదరుడగు అంద్రెయ; జెబెదయి కుమారుడగు యాకోబు, అతని సహోదరుడగు యోహాను; ఫిలిప్పు, బర్తొలొమయి, తోమా, సుంకరియైన మత్తయి; అల్ఫయి కుమారుడగు యాకోబు, తద్దయియను మారుపేరుగల లెబ్బయి;**

**కనానీయుడైన సీమోను, ఆయనను అప్పగించిన ఇస్కరియోతు యూదా.'** దేవుని రాజ్య సువార్త ప్రకటనలో భాగంగా, దయ్యములను వదిలించుటకు, అద్భుతములు చేయుటకు, మహాత్కార్యములను ఆనాటి మనుష్యుల మధ్య చేసి, దేవుని వాక్యమును స్థిరపరచుటకుగాను, యేసు పండ్రెండుమంది శిష్యులను ఏర్పాటుచేసుకున్నాడు. ఆ పండ్రెండుమంది పేర్లను జాగ్రత్తగా గమనించండి. మొదటగా, 1) పేతురు అనబడిన సీమోను! సీమోను మరియు పేతురు అనే ఈ రెండుపేర్లతో ఆ శిష్యుడు పిలువబడేవాడు. ఆ తరువాత 2) అతని సహోదరుడగు అంద్రెయ అనగా, పేతురుకు సహోదరుడగు అంద్రెయ! 3) జెబెదయి కుమారుడగు యాకోబు, 4) జెబెదయి కుమారుడగు యాకోబుకు సహోదరుడగు యోహాను! అంటే, జెబదయికి ఇద్దరు కుమారులున్నారు. వీరిద్దరికి యేసుక్రీస్తు 'బోయనెర్గసు' అను పేరు పెట్టెను. ఎందుకంటే, వీరు ఎప్పుడూ ఉరుముతూ ఉండేవారు. 'బోయనెర్గసు' అను మాటకు ఉరిమెడు వారని అర్థం. తరువాత, 5) ఫిలిప్పు, 6) బర్తొలొమయి, 7) తోమా. మత్తయి, మార్కు మరియు లూకా సువార్తలలో ఇప్పుడు చెప్పబడిన ఈ ఏడుగురు శిష్యులకు ఇవే పేరులు ఉన్నాయి. ఆ తరువాత 8) సుంకరియైన మత్తయి, ఇతడు పన్ను వసూలు చేసేవాడు. 9) అల్ఫయి కుమారుడగు యాకోబు. ఇక్కడ మరల యాకోబు వచ్చాడు. అనగా, మొదట చెప్పబడిన జెబెదయి కుమారుడగు యాకోబు వేరు, అల్ఫయి కుమారుడగు యాకోబు వేరు. 10) తద్దయి అను మారు పేరుగల లెబ్బయి. ఇతని గూర్చి కాస్త జాగ్రత్తగా ఆలోచించండి. ఎందుకంటే ఇతనికి మూడు సువార్తలలో చాలా పేర్లు ఉన్నాయి. ఈ పరిశీలనలో భాగంగా, **లూకా సువార్త 6 : 13 'ఉదయమైనప్పుడు ఆయన తన శిష్యులను పిలిచి, వారిలో పండ్రెండుమందిని ఏర్పరచి వారికి అపొస్తలులు అను పేరు పెట్టెను. వీరెవరనగా- ఆయన ఎవనికి పేతురు అను మారుపేరు పెట్టెనో ఆ సీమోను, అతని సహోదరుడైన అంద్రెయ, యాకోబు, యోహాను, ఫిలిప్పు, బర్తొలొమయి, మత్తయి, తోమా, అల్ఫయి కుమారుడైన యాకోబు, జెలోతే అనబడిన సీమోను, యాకోబు సహోదరుడైన యూదా, ద్రోహియగు ఇస్కరియోతు యూదా అనువారు.'** ఈ పట్టికలో జెలోతే అనబడిన సీమోనే, మత్తయి సువార్తలో ఉన్న కనానీయుడైన సీమోనన్నమాట. మరియు తద్దయి అను మారుపేరు గల లెబ్బయియే, యాకోబు సహోదరుడగు యూదా అన్నమాట. 11) కనానీయుడైన సీమోను 12) ఇస్కరియోతు యూదా. మరల మరొక్కసారి మీకు యేసు శిష్యుల పట్టికను చెబుతాను, జాగ్రత్తగా చూడండి. **మత్తయి సువార్త 10: 2 - 4, మార్కు సువార్త 3 : 13 - 19, లూకా సువార్త 6 : 13 - 16** వరకు ఉన్న వచనములలో యేసు శిష్యుల వివరములు మనకు కనిపిస్తాయి. ఈ మూడింటిని క్రోడీకరించి, అపొస్తలులుగా యేసు ఆ పండ్రెండుమందిని ఏర్పరచుకొనుటను మనము జాగ్రత్తగా ఆలోచిస్తే, ఈ విషయంలో ఆయన మంచి గణాంకములను కలిగినవాడని అర్థమవుతుంది. ఆయన దేవుని పని కొరకు శిష్యులను ఏర్పరచుకుంటున్నప్పుడు లెక్క కలిగి ఉన్నాడు.

ఈ లెక్క సరిగ్గా అర్థంకానివాడే ఇస్కరియోతు యూదా! ఇతడే యేసుక్రీస్తు దగ్గర ఆ శ్రేష్టమైన ఉ ద్యోగాన్ని కోల్పోయినవాడు. చివరిగా ఆ లెక్కలలోనుంచి తప్పించుకున్నవాడు. దేవుని లెక్కలు తెలియనివాడు. ఆ పండ్రెండుమందిలో తానుకూడా ఒకనిగా ఉన్నప్పుడు అతడు ఏమని ఆలోచించుకోవాలి? తాను ఆ లెక్కల్లో ఉన్నందుకు అదొక మహాభాగ్యమని యెంచుకుని తన జీవిత కాలమంతా తాను లెక్క కలిగి బ్రతకాలి. అతడు పరలోకపు లెక్కను చూచుకోవాలి కానీ, ఈ భూమి మీద 30 వెండి నాణెముల లెక్క మాత్రమే చూచుకున్నాడు. చూసారా! ఇక్కడే మనిషి అవివేకిగా మారి, అపవాది ఉచ్చులో చిక్కుబడతాడు. ఆనాడు, తప్పిపోయిన ఇస్కరియోతు యూదా తనకు ప్రధానయాజకులు 30 వెండి నాణెములు లెక్క సరిగ్గా ఇచ్చారా, లేదా? అని చూచుకున్నాడే తప్ప, దేవుని లెక్కలలో నుండి అతడు తప్పుకున్నాడన్న విషయాన్ని గ్రహించలేకపోయాడు. ఇంతకీ ఆ 30 వెండి నాణెముల లెక్క అతనిని ఈ భూమి మీదైనా సుఖంగా బ్రతకనిచ్చిందా? లేదు. అతడు యేసును అప్పగించిన తరువాత పోయి ఉరిపెట్టుకున్నాడు. ఓ మనుష్యులారా! మీరు ఈ భూమి మీద రంగునోట్ల లెక్కను కాక దేవుని లెక్క ప్రప్రథమంగా సరిచూచుకోండి. కరెన్సీ నోట్ల లెక్క విషయంలో పొరపాటు జరిగితే కలిగే నష్టమేమీ గొప్పది కాదు. కానీ దేవునిలెక్క విషయంలో పొరపాటు జరిగితే ఆ నష్టాన్ని ఏమాత్రం భర్తీ చేయలేము. మీ సంపాదనెంత? మీ జేబులో ఉన్నదెంత? మీరు బ్యాంకులో దాచుకున్నదెంత? ఇలాంటివన్నీ మీకు బాగా గుర్తుంటాయి. కానీ దేవుని గణాంకములు మీకు గుర్తున్నాయా? ఇశ్రాయేలీయులలో రూబేను గోత్రములో లెక్కింపబడినవారి సంఖ్య ఎంత అంటే ఎవ్వరూ చెప్పలేరు. అది గుర్తుండదు. మనము పరలోకానికి వెళ్లాలంటే,

మనము లెక్క కలిగి జీవించాలి. ఈ దేవుని లెక్కలన్నీ మనకు తెలిసుండాలి, ఎల్లప్పుడూ గుర్తుండాలి. లోకసంబంధమైన వాటిమీద దృష్టిపెట్టకండి. ఇస్కరియోతు యూదా ఎంత దౌర్భాగ్యుడైపోయాడో చూసారా! మొదట ఆ పండ్రెండుమందిలో ఒకడుగా లెక్కింపబడ్డాడు. ఆ శిష్యుల లెక్క ఎంత గొప్పదో, ఆ లెక్కలో అతడు ఎందుకున్నాడో, ఆ విశిష్టతను అతడు తెలుసుకోలేకపోయాడు. నిత్యజీవ పరిశోధన అనే ఈ పుస్తకములోని పాఠములను చదివి, నేర్చుకుంటున్న మీరు కూడా దేవుని లెక్కలలోనికి వచ్చారు. ఈ లెక్కలలోనికి మీరెందుకు వచ్చారంటే ఒక మహాకార్యాన్ని సాధించడానికి కార్యసాధకులుగా దీనిలోనికి అడుగుపెట్టారు. ఏదో ఊరకనే మీరు ఈ పుస్తకమును చదవడం లేదు. కారణములేనిదే దేవుడు ఎవ్వరినీ ఈ పుస్తకాన్ని చదవనివ్వడు. దీనిని చదువుచున్నామంటే దేవుని లెక్కల్లోనికి అడుగుపెట్టామన్నమాట. దేవుడనుగ్రహించిన మహాభాగ్యమిది. దేవుడు ముందుగా నిర్ణయించినవారు తప్ప దీనిని ఎవ్వరూ విశ్వసించలేరు. ఈ పుస్తకాన్ని చదివినా మార్పు లేనివారు, దేవునికి ఇంకా దూరంగానే జీవిస్తున్నవారు దేవుని లెక్కలలో నుండి తుడిచి పెట్టబడతారు. మీరు అలాంటివారు కాకూడదని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇది ఆత్మకు సంబంధించిన మహాజ్ఞానం. ఇది పరలోకపు మహాభాగ్యం. దీనిని దేవుడు ఎవరికి కట్టబెట్టాలని చూస్తూ, ఆయన లెక్కలు కడుతున్నాడు. ఆ లెక్కలలోనికి ఎవరు వస్తున్నారో వారికే ఆయన రాజ్యాన్ని ఇస్తున్నాడు. ఈ లెక్క ఎవరికి అర్థం కావడంలేదో వారిని ప్రక్కకు తుడిచేస్తున్నాడు. ప్రియులారా! ఇస్కరియోతు యూదాలా మాత్రం మనమెవ్వరూ మారకూడదు. ఇంత చదివిన తరువాత కూడా మీరు ఇంకా రంగునోట్లను గూర్చి, ఆస్తులను గూర్చి ఆలోచిస్తూ, లోకమందున్న వాటిని గూర్చి లెక్కలు కడుతూ ఉన్నారనుకోండి, ఇక మీకు ఉపయోగం లేనట్టే. ఈ రోజు లోకంలో అందరూ లోకపరమైన లెక్కలోనే ఉన్నారు. ఒక సినిమా హీరో తాను నటించినటువంటి సినిమాలను లెక్కపెట్టుకుంటున్నాడు. ఒక క్రీడాకారుడు తాను సాధించిన పతకాలను లెక్కపెట్టుకుంటున్నాడు. చూసారా! వీరి లెక్కలు ఎలా ఉంటున్నాయో. కానీ మనము ఆ లెక్కల్లో కాకుండా దేవుని లెక్కలలోనికి వచ్చాము. గనుక ఈ బైబిల్ గణాంకముల ప్రకారము మనము జీవించాలి. పరలోకానికి వెళ్ళే సంఖ్యలో మనము కూడా చేర్చబడాలి. ఇక ఆయన లెక్కలు ఏ స్థాయిలో ఉంటాయో మచ్చుకు కొన్నింటిని చూద్దాం.

**కీర్తనలు 147 : 4 'నక్షత్రముల సంఖ్యను ఆయన నియమించియున్నాడు. వాటికన్నిటికి పేరులు పెట్టుచున్నాడు.'** బైబిల్‌ను మతగ్రంథం అనుకుంటున్నారా? కాదు. ఇది మహా జ్ఞానగ్రంథం. ఈ రోజు శాస్త్రవేత్తల దగ్గరకు వెళ్లి, ఆకాశంలో ప్రతిరోజూ కనిపించే నక్షత్రాల సంఖ్య ఎంతని వారిని అడగండి. చెప్పగలరేమో చూద్దాం. పోనీ మీ సైన్స్ మాస్టారుగారి దగ్గరకు వెళ్లి ఆకాశంలో నక్షత్రాలకంటూ ఒక సంఖ్య ఉంటుందా అని అడగండి. బైబిల్ చెంతకు రాకపోతే ఏ ఒక్కరికీ ఈ రహస్యం తెలియదు. కానీ దేవుడైతే నక్షత్రాలకు సంఖ్యను నియమించి, వాటికి పేర్లు కూడా పెట్టాడు. వాటి సంఖ్య కోటానుకోట్లు ఉంటుందిలే, లెక్కింపలేనిదిలే అని ఈ శాస్త్రవేత్తలు తప్పించుకోవటానికి వీలులేదు. ఎందుకంటే, శాస్త్రాన్ని మించిన దేవుని వాక్యము నక్షత్రాలకు సంఖ్య ఒకటుందని చెప్పింది. నక్షత్రాల సంఖ్యను ఆయన నియమించియున్నాడు. ఆయన దగ్గర ఉన్న లెక్కలు ఏ స్థాయిలో ఉంటాయంటే, ఈరోజు భూమి మీద గణితశాస్త్రం ఆయన లెక్కల దగ్గర ఒక తల వెంట్రుకతో సమానం. ఈ లోకపు గణితశాస్త్రం ఆయన దృష్టికి ఎన్నిక లేనిది. ఒకవేళ బైబిల్‌ను మతగ్రంథమని ఎవరైనా అంటే, ముందు వారు నక్షత్రముల సంఖ్యను చెప్పాలి. చెప్పలేరా? అయితే, దేవుని దగ్గర వాటి సంఖ్య ఉంది. కానీ వాటి సంఖ్యను ఆయన తన గ్రంథములో ఎందుకు వ్రాయించలేదు? ఎందుకంటే, అది మనిషికి అవసరం లేని విషయం! నీకొరకు వ్రాయించవలసిందేదో అది ఆయన పూర్తిగా వ్రాయించాడు. దేవుని గణాంకములు తెలుసుకుంటే మీరు పరలోకానికి వెళతారు. నక్షత్రముల సంఖ్య ఎంత ఉందో తెలుసుకుంటే మీరు పరలోకానికి వెళతారా? అందుకే వాటికంటూ ఒక సంఖ్య ఉందని చెప్పి ఆయన అక్కడతో సరిపెట్టాడు. వాటి సంఖ్య ఇంత అని తెలియడం వలన మీరు మీ బ్రతుకును మార్చుకుని పరలోకమును సాధించలేరు. దాని వలన నీకు జ్ఞానము కలుగదు. కానీ వాటి సంఖ్య ఆయనకు తెలుసన్న విషయం మీకు తెలియాలి. నక్షత్రముల సంఖ్యను ఆయన నియమించియున్నాడు. వాటికి అన్నిటికీ ఆయన పేర్లు పెట్టుచున్నాడు. ఈ సృష్టిలో కోటానుకోట్ల దేవదూతలుంటే వాటన్నిటికీ కోటానుకోట్ల పేర్లున్నాయి. మనకు పుట్టినటువంటి పిల్లలు ఒకరో, ఇద్దరో ఉంటారు. వారికి పేర్లు పెట్టడానికి మనము చాలా ఆలోచిస్తాం. చాలా పుస్తకాలను తిరగేస్తాం. ఒకరు, ఇద్దరు, ముగ్గురు పిల్లలకే మనము పేర్లు పెట్టలేకపోతే, సంఖ్యకు మించిన నక్షత్రములకు

ఆయన పేర్లు పెడుతున్నాడు. ఆయనకున్న గణాంకములు ఎంత ఉన్నతమైనవో చూడండి. నిజంగా ఆ తండ్రిని మనము తెలుసుకుంటున్నందుకు చాలా ధన్యులము. ఇంకా, ఆయన లెక్కలు ఎలా ఉంటాయో మరొక సందర్భమును చూద్దాం.

**లూకా సువార్త 12 : 7 'మీ తల వెంట్రుకలన్నియు లెక్కింపబడియున్నవి'.** ఆకాశంలో నక్షత్రాలంటే భారీ ఆకారంలో ఉన్నాయి గదా, అవి ఆయన దృష్టికి చాలా పెద్దవిగా కనిపిస్తాయి గనుక లెక్కపెట్టేసాడు; తానే వాటన్నింటినీ సృష్టించాడు గనుక లెక్కపెట్టేసాడు; మన నెత్తి మీద ఉన్న తలవెంట్రుకల లెక్క ఆయనకుంటుందా? ఒకరకంగా చెప్పాలంటే వాటి లెక్క మనకే లేదు. రోజూ మనము తల దువ్వుకుంటున్నాము. అలా దువ్వుకుంటున్నప్పుడు మన దువ్వెనతోబాటు బోలెడు వెంట్రుకలు వచ్చేస్తాయి. వాటినలా తీసేసి, ఒక మూలను పడేస్తాము. అంతేగానీ, ఏనాడైనా మనకు ఎన్ని వెంట్రుకలు ఊడిపోయాయని కూర్చుని ఒకటి, రెండు, మూడు అని లెక్కపెట్టుకున్నామా? లేనే లేదు. కానీ, మన విషయమై ఆయన లెక్కల స్థాయి ఎంత గొప్పగా ఉంటుందో ఆయన చెబుతున్నాడు. మీ తల వెంట్రుకలన్నియు లెక్కంపబడియున్నవి. అవి ఇన్ని, అన్ని అని ఆయన ఒక్కొక్కరి లెక్క చెప్పడం లేదు కానీ, ఆయన దగ్గర మాత్రం లెక్క ఉంది. ఈ భూమిపై నివసించిన, నివసిస్తున్న కోట్లాదిమంది మనుష్యుల తలవెంట్రుకలన్నింటినీ ఆయన లెక్కపెట్టడమేమిటి? మనము ఎంతో అల్పముగా, లెక్కలేనితనంగా చూసే తల వెంట్రుకలనే ఆయన లెక్కిస్తున్నాడంటే, ఇక మిగిలిన అన్ని విషయాలను ఆయన ఇంకెంతగా లెక్కిస్తాడు చెప్పండి. మన మాట, మన కదలిక, మన ఆలోచన, మన జీవితం... ఇలా దేవునికి మన విషయమై ప్రతీదీ లెక్కే అని తెలియజేయడానికే, క్రీస్తు ఆ మాటను తెలియజేసారు. అంటే నిజంగా పరలోకమందున్న తండ్రికి ప్రతి మనిషి విషయమై ఎంత లెక్క ఉంటుందో మీరు ఇప్పుడు ఆలోచించండి. దీనినిబట్టి, ఇప్పుడు మనము ఆయన దగ్గర ఎంత లెక్కకలిగి జీవించాలో అర్థమవుతోంది కదా. మనము చేయాల్సిన వాటన్నింటినీ దేవుడు తన గ్రంథమందు వ్రాయించాడు. మనిషి జీవిస్తున్న ఆయుష్కాలంలో ఎదురయ్యే ప్రతీరోజూ వారు ఏ పనిని చేయాలో అనేది లెక్క కలిగి ఉండాలన్నదే దేవుని ఆలోచన. లెక్క లేకపోతే భవిష్యత్తులో చాలా భయంకరమైన పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే, ఏ ఒక్కరోజును దేవుని పనిని చేయకుండా వృథా చేసుకోకండి. ఒకరోజు దేవుని పని చేయకుండా మీరు ఆరోజును పోగొట్టుకోకండి. ఎందుకంటే, ఆరోజు దేవుని లెక్కలలో ఉన్నది. మీ తల వెంట్రుకలే దేవునికి లెక్కంటే ఆయన మీకిచ్చిన రోజులు ఆయనకు లెక్కుండదా? మనము బ్రతికిఉన్న సెకనులు, నిమిషాలు, గంటలు, రోజులు, నెలలు, సంవత్సరాలు... అన్నీ ఆయనకు లెక్కే! మనిషి దేహాన్ని విడిచి వెళ్లిన తరువాత వీటన్నిటి తాలూకా చిట్టాను ఆయన విప్పుతాడు. భూమి మీద ఉండగానే దీని రహస్యాన్ని తెలుసుకుంటే అది చాలా మంచిది. అప్పుడు దేవుని తీర్పును తప్పించుకుని, పరలోకానికి వెళ్లే అవకాశం కలుగుతుంది.

**కీర్తనలు 90 : 12 'మాకు జ్ఞాన హృదయము కలుగునట్లుగా చేయుము. మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుము.'** అని మోషే దేవుని ప్రార్థిస్తున్నాడు. ఇంతకీ ఏమిటా జ్ఞానము? దేనికా జ్ఞానము? మనిషికి దేవుని గణాంకములు తెలియాలి. అదే అసలైన జ్ఞానము. అందుకే మోషే, మాకు జ్ఞాన హృదయము కలుగునట్లుగా చేయుము. మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుము అని అడుగుతున్నాడు. మన దినములను మనము లెక్కించుకోవాలి. యేసుక్రీస్తులోనికి అడుగుపెట్టిన తరువాత మీరు దేవుని కొరకు చేసిన పని ఎంత? మీకు దేవుడిచ్చిన దినములెన్ని? ఏ దినాన దేవునికి ఎంతపని చేసారు? ఈ లెక్కంతా దేవునికి అప్పజెప్పుతున్నారా? దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ప్రతీరోజూ ఈ లెక్కను తండ్రికి అప్పజెప్పేవాడు. ప్రతిరోజు పెందలకడనే వచ్చి సమాజ మందిరములో దేవుని వాక్యాన్ని జనులకు నేర్పించి, రోజంతా దేవుని సేవలో ఉండి రాత్రివేళ ఒలీవ కొండకు వెళ్లి తండ్రియైన దేవునికి ప్రార్థన చేస్తూ తన లెక్కనంతా అప్పగించేవాడు. చూసారా, దేవుని కుమారుడు ఎంత లెక్కగా ఉన్నాడో. దేవుని ప్రవక్తలు, నీతిమంతులు, ప్రారంభ శతాబ్దపు అపొస్తలులు, శిష్యులు... ఇలా అందరూ లెక్క కలిగి దేవుని కొరకు జీవించారు. అందుకే మోషే దేవుని ఇల్లంతటిలో నమ్మకమైనవానిగా ఉన్నాడు. దేవుడు ప్రతి మనిషి అడుగుజాడలను లెక్కపెడుతున్నాడు. మనుష్యులు దేవుని ఉద్దేశ్యములను నెరవేర్చుతున్నారా, లేదా అనేది దేవుని లెక్కలలో ఉంది.

**కీర్తనలు 56 : 8 'నా సంచారములను నీవు లెక్కించి యున్నావు. నా కన్నీళ్లు నీ బుడ్డిలో నుంచబడి యున్నవి.**

**అవి నీ కవిలెలో(పుస్తకములో) కనబడును గదా.'** ఒక మనిషి ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో, ఏయే పనుల మీద ఉంటున్నాడో అనేదానిపై దేవునికి పూర్తిగా లెక్కుంది. సంచారము అంటే గమనా గమనములు. ఒక వాహనము ఎంత తిరిగిందో తెలియడానికి దానికి ఒక మీటర్ ఉంటుంది. ఆ వాహనమును ప్రారంభించినప్పటినుండి ఇప్పటి వరకు ఎంత తిరిగిందో ఆ మీటర్ చెప్పేస్తుంది. వాహనము యొక్క చక్రములు ఎన్ని రౌండ్లు తిరిగితే అన్ని కిలోమీటర్లు దూరం లెక్కకట్టుకుని రీడింగ్ చెప్పేస్తుంది. దేవుడు మనుష్యుల విషయంలో కూడా ఇలాగే రీడింగ్ చూస్తున్నాడు. మీ సంచారములేమిటి? అవి ఎక్కడెక్కడ? అవి ఎవరెవరికొరకు? ఎలా తిరిగారు? అందుకే తన పరిశుద్ధ గ్రంథములో దేవుడేమని వ్రాయించాడో చూడండి. దావీదు సంచారములను దేవుడు లెక్కించియున్నాడు. ఆ లెక్కలలో తాను దేవునిని సంతోషపెడుతున్నాడా, లేదా అనేది ఇక్కడ ప్రాముఖ్యము. లోకసంబంధమైన విద్యలో 'లెక్కలు' చాలా కఠినంగా ఉంటాయి. అయితే, దేవుని దగ్గర లెక్కలు ఇంకా కఠినంగా ఉంటాయి. ఆ దేవుని లెక్కలు పాసవ్వాలంటే ఏం చేయాలో తెలుసా? మీ సంచారములను దేవుని కొరకు జరిగించండి. ఒక అడుగు వేసారంటే ఆ అడుగు దేవుని కార్యక్రమాల్లో పడేటట్లుగా చూసుకోండి. అప్పుడు మీరు దేవుని లెక్కలలో పాసవుతారు. లోకసంబంధమైన గణిత శాస్త్రములో లెక్కలు సాధించాలంటే వాటికి స్టెప్స్ సరిగ్గా వెయ్యాలి. స్టెప్పులు తప్పులైతే లెక్కను సాధించలేరు, మార్కులు వేయరు. ఇక్కడ నిజజీవితంలో దేవుని కోసం మీ అడుగులు సరిగ్గా వేస్తున్నారా? దేవుని కార్యక్రమాలలో మీ అడుగులు పడుతున్నాయా? ఆత్మలను రక్షించడంలో మీ సంచారములున్నాయా? అప్పుడు మాత్రమే దేవుని దగ్గర మీకు మార్కులు పడతాయి. లేదంటే మిగిలినవన్నీ తప్పుడు సంచారములన్నమాట. వేస్ట్ స్టెప్స్ వేస్తే సమాధానము రాదుకదా! సమయం వృధా అవుతుంది. దేవుని గణాంకములను ఎలా చేయాలో ఒక మాదిరిని కూడా దేవుడు మనకు చూపిస్తున్నాడు గదా.. ఆయనే యేసుక్రీస్తు. ఆయన జీవితం మానవ జీవితాలకు ఒక మాదిరి! ఆయన మనుష్యులకు ఒక మంచి ఉదాహరణ. ఆ ఉదాహరణను చూచి మన జీవితపులెక్కను కూడా మనము విజయవంతముగా పూర్తి చేయాలి. మన సంచారములు ఎలా ఉండాలో యేసుక్రీస్తు నేర్పించాడు. పౌలు వాటిని అనుసరించాడు, పేతురు వాటిని అనుసరించాడు. ఎందరో ప్రవక్తలు, నీతిమంతులు మనకు వాటిని నేర్పించారు. ఇన్ని ఉదాహరణలు మన నడతలను సరిదిద్దుకోమని హెచ్చరిస్తున్నా, దేవుని కొరకు ఇంకా మనము అడుగులు వేయలేకపోతే ఎలా చెప్పండి. అందుకే దావీదు, నా సంచారములను నీవు లెక్కించియున్నావు, నా కన్నీళ్ళు నీ బుడ్డిలో నుంచబడి యున్నవి. అవి నీ కవిలెలో కనబడును గదా అంటున్నాడు. దేవుడు తన పుస్తకంలో మన సంచారములన్నింటినీ లెక్కలుకట్టి వ్రాస్తున్నాడు. ఏ కాలములో ఎక్కడెక్కడ ఎవరెవరి కొరకు మీరు తిరిగారు? దాని వలన వచ్చే ఫలితం దేవునికా? లేక దయ్యానికా? మీరు నీతిఫలాన్ని సంపాదించుకుంటున్నారా? లేక కీడు ఫలాన్ని సంపాదించుకుంటున్నారా? అనేది బహు జాగ్రత్తగా చూచుకోవాలి. మీరు వేసే ప్రతి అడుగు దేవుని కొరకై ఉండాలి. దేవుని సామ్రాజ్యంలో మిమ్మును అడుగుపెట్టించేదై ఉండాలి.

**యోబు 31 : 4 'ఆయన నా ప్రవర్తన నెరుగును గదా. నా అడుగు జాడలనన్నిటిని లెక్కించును గదా.'** దేవుడు ఈ భూమి మీద ఉన్న ప్రతి మనిషి ప్రవర్తనను తెలుసుకుంటున్నాడు. ఆకాశమందలి నక్షత్రముల సంఖ్యనే లెక్కపెట్టినవానికి ఇది ఒక పెద్ద లెక్కా చెప్పండి? గణిత శాస్త్రజ్ఞునికి '2 + 2 = 4' అనే చిన్న లెక్క ఎంత చెప్పండి. అది చాలా ఈజీ! మనుష్యుల అడుగుజాడల లెక్క కూడా ఆయనకు అంతే ఈజీ. మన అడుగు జాడలు దేని నిమిత్తము ఉన్నాయో, దేని కొరకు మన కష్టాన్ని ఇస్తున్నామో, మన చెమట కారుస్తున్నామో, దేని కొరకు మన ధనాన్ని వినియోగిస్తున్నామో.. ఇలా దీనినంతటిని ఆయన తన లెక్కల్లో వ్రాసుకుంటున్నాడు. దేవుడు మనిషి పట్ల ఇంతగా గణాంకాలలో ఉన్నప్పుడు, ప్రియమైన నా సహోదరులారా మీరు కూడా మీ జీవితము పట్ల లెక్క కలిగినవారుగా ఉండాలి. మీ జీవితాన్ని దేవునికి ఒక మంచి లెక్కగా ఇవ్వాలి. క్రీస్తును ఎరిగినప్పటి నుంచి మీరు క్రీస్తు కొరకు బ్రతుకుతూ, మీ జీవితకాలంలో ప్రతిరోజూ ఆయనకు లెక్క అప్పగించాలి.

ప్రకటన **13 : 18 'బుద్ధిగలవాడు మృగముయొక్క సంఖ్యను లెక్కింపనిమ్ము; అది యొక మనుష్యుని సంఖ్యయే; ఆ సంఖ్య ఆరువందల అరువది యారు; ఇందులో జ్ఞానము కలదు.'** ఈ సమాజములో బుద్ధిగలవారు ఎవరు? ఎవరైతే

తమ జీవితాంతము నిత్యజీవపరిశోధన చేస్తున్నారో వారే బుద్ధిగలవారు. ఎవరైతే పరలోక సాధనలో ఉన్నారో వారే బుద్ధిగలవారు. ఈ బుద్ధిగలవారు ఒక సంఖ్యను లెక్కించాలి. ఆ సంఖ్య ఎవరిది? ఈ భూమి మీద మృగము యొక్క సంఖ్య ఉంది. మన చుట్టూ ఉన్న ప్రజలలోనే ఈ మృగము యొక్క సంఖ్య ఉంది. ఇంతకీ ఏమిటా మృగము యొక్క సంఖ్య? బుద్ధిగలవారు ఎందుకీ మృగపుసంఖ్యను లెక్కించాలి? దీనిని మనం అర్థం చేసుకోవాలి. చివరిగా ఈ పాఠము యొక్క ముగింపులో మనము తీసుకోవలసిన నిర్ణయం, లెక్కించవలసిన సంఖ్య ఏమిటంటే, ఒక సంఖ్య ఉంది; అదే మృగము యొక్క సంఖ్య! ఈ భూమి మీద మనుష్యులను దేవునికి కాకుండా చేస్తున్నవాడు క్రూరమృగముతో పోల్చబడ్డాడు. వాడు దేవుని నుండి మనుష్యులను విడదీస్తున్నాడు. వాడి ఆకర్షణలో ఉంచి ఏవిధముగానైనా వారినందరినీ నరకానికి తీసుకొని వెళ్ళాలని ఆలోచిస్తున్నాడు. ప్రతివానిని వాడి సంఖ్యగా మార్చేసుకుంటున్నాడు. అంటే దేవుని నమ్మనివారు, దేవుని కొరకు బ్రతకనివారు, దేవుని ఇష్టాన్ని నెరవేర్చనివారు, నిత్యజీవపరిశోధన చేయనివారు, పరలోకానికి వెళ్ళాలనే తపన, ఆలోచన లేనివారు! వీరందరూ ఎవరో తెలుసా? వీరే దేవుని పరిభాషలో మృగము యొక్క సంఖ్య. ఈ మనుష్యులలో అలాంటివారు దేవుని యొద్దకు ఎందుకు రాలేకపోతున్నారు? దేవుని వాక్యాన్ని నేర్చుకొనుటకు ఎందుకు ఆసక్తి చూపలేకపోతున్నారు? అలాగని ఇదేమి అంత కష్టమైన పద్ధతేమీ కాదే. దేవుడు మనుష్యులనందరినీ ముళ్ళమీద కూర్చుని, అగ్నిలో నడిచి తన వాక్యమును వినమంటున్నాడా? మనుష్యులనందరినీ కొరడా దెబ్బలు కొట్టి ఆయన కొరకు బ్రతకమంటున్నాడా? మనుష్యులనందరినీ ఆకలి దప్పులతో ఉంచి ఆయన పని చేయమంటున్నాడా? ఈ భూమిపై ఆయన పిల్లలకు అన్ని వసతులను ఇచ్చి, హాయిగా కూర్చోబెట్టి దేవుని వాక్యమును నేర్చుకోమంటున్నాడు. నిజంగా దేవుడు మనయెడల ఎంత కృపను చూపిస్తున్నాడో ఆలోచించండి. అయినా మనము నీతిమంతులుగా మారకపోతే, ఇంకా మృగపు సంఖ్యగానే ఉండిపోతే కష్టం, తద్వారా మనిషికే నష్టం! లోకమందున్న మనుష్యులు మృగము సంఖ్యగా మారిపోతున్న వేళలో దేవుడు బుద్ధిగలవారిని ఏం చేయమంటున్నాడు చూడండి. ప్రకటన **13 : 18**వ వచనములో బుద్ధిగలవాడు మృగము యొక్క సంఖ్యను లెక్కింపనిమ్ము. అంటే మీయింటి వారిలో ఎంతమంది మృగము యొక్క సంఖ్య ఉన్నారో లెక్కించగలగాలి; మీరు నివసిస్తున్న మీ గ్రామంలో ఎంతమంది మృగము యొక్క సంఖ్యగా ఉన్నారో మీకు తెలియాలి; మీ మండలంలో మృగముయొక్క సంఖ్య ఎంతగా ఉన్నారో మీకు తెలియాలి; మీ పట్టణంలో మృగము యొక్క సంఖ్య ఎంత ఉన్నారో మీరు లెక్కించాలి; ఇలా లెక్కించి ఏం చేస్తారు? లెక్కించిన వారిని మృగపు సంఖ్య నుండి దేవుని సంఖ్యగా మార్చడానికి మీవంతు ప్రయత్నం మీరు చేయాలి. చూసారా, దేవుని మాటలలో ఉన్న పరమార్థం ఇదే. బైబిల్ గణాంకములలో ఉన్న పరమార్థం కూడా ఇదే. దేవుడు ఆనాటి ఇశ్రాయేలీయులను కూడా ఎందుకు లెక్క పెట్టమంటున్నాడు? ప్రతి గోత్రంలో ఎంతెంతమంది ఉన్నారు? ఎందుకంటే, వీరంతా యుద్ధం చేయాలి. ఆరు లక్షలకు పైబడిన వీరందరినీ దేవుడు యుద్ధానికి ఎందుకు పంపిస్తున్నాడంటే, వీరందరూ శత్రుదేశాలను లోబరుచుకోవాలి. భవిష్యత్తు తరాలకు వీరందరూ ఒక పాఠమును నేర్పించాలి. ఆరోజు ఇశ్రాయేలు నాయకుడైన యెహోషువ ఏం చేస్తున్నాడు? వేగులవారిని రాహాబను వేశ్య దగ్గరకు ఎందుకు పంపించాడు? ఆ యెరికో దేశమును ఎదురించాలంటే వారి సంఖ్యను వీరు లెక్కించాలి. వారి బలాబలములు వీరికి తెలియాలి. ఈరోజున్న మనము కూడా ఈ మృగపు ప్రపంచాన్ని దేవుని మార్గములో నడిపించాలంటే, ఈ మృగము యొక్క సంఖ్యను మనము తెలుసుకోవాలి. ఆ మృగపు సంఖ్యను దేవుని సంఖ్యగా మార్చడానికి మన జీవితకాలంలో మన ప్రయత్నమును ఎంత గొప్పగా చేయాలో అంచనా వేసుకోవాలి. ముందుగా లెక్క తెలిస్తేనే ఇవన్నీ చేయగలం. అందుకే, బుద్ధిగలవాడు మృగము యొక్క సంఖ్యను లెక్కింపనిమ్ము అని వ్రాయబడింది. ఏ మనిషైతే దెయ్యపు వలలో చిక్కుకున్నాడో, ఏ మనిషైతే చీకటి సామ్రాజ్యంలో మగ్గుతున్నాడో వాడు మృగము యొక్క సంఖ్య! ఇప్పుడు ఈ సంఖ్యను లెక్కించి, వారిని దేవుని సంఖ్యగా మార్చే ప్రయత్నం చేయాలి.

**మలాకీ 3 : 18 'అప్పుడు నీతిగలవారెవరో దుర్మార్గులెవరో దేవుని సేవించువారెవరో, ఆయనను సేవించనివారెవరో మీరు తిరిగి కనుగొందురు.'** నీతిగలవారెవరో దుర్మార్గులెవరో ఇప్పుడు మీరు వర్గీకరణ చేయాలి. ఇప్పుడు దుర్మార్గుల సంఖ్యను లెక్కిస్తూ వారిని దేవునిలోనికి తీసుకొని రావటానికి ప్రయత్నించాలి. అగ్నిలో నుండి లాగినట్టు కొందరిని రక్షించాలి. సందేహపడువారిమీద కనికరాన్ని చూపండి. దేవునివాక్యము కొరకు అహోరాత్రులు ఆలోచించేవారు, దానిని ప్రకటించడానికి

సాధన చేసేవారు, సమాజములోనికి వెళ్ళి దేవుని సంఖ్యను పెంచాలి. నిజముగా దేవుని సేవించేవారు వీరే. ఇప్పుడు ఇలాంటివారు మృగము యొక్క సంఖ్యను లెక్కించాలి. ఏవిధము చేతనైననూ కొందరినైనా రక్షించాలి. ఎందుకంటే జనులు మృగపు సంఖ్యగా ఉండిపోతే, వారిని వారే భక్షించుకుంటారు. చివరికి పాతాళానికి జారిపోయి, అగ్నికి ఆహుతి అయిపోతారు. నిత్యకాలం అక్కడ వేదనను అనుభవిస్తారు. అటువంటి పరిస్థితులలో నుంచి ఆ సంఖ్యలో కొద్ది సంఖ్యనైనా దేవుని సంఖ్యగా మార్చగలిగితే దేవుని గణాంకములు, బైబిల్ గణాంకములు మనకు అర్థమైనట్టే. ఇక నిర్ణయం మీదే!

-------×------

## ప్రశ్నలు

**1) ఆరు దినములలోపు దేవుడు సృష్టి కార్యక్రమమును పూర్తి చేయుటలో ఆంతర్యమును వివరించండి.**

**2) పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో వ్రాయబడిన కొన్ని గణాంకములను పేర్కొని, వాటిని వివరించండి.**

**3) సంఖ్యాకాండము అనే పుస్తకానికి ఆ పేరు ఎలా సార్థకమైనది? విశదీకరిమచండి.**

**4) మోషే నాయకత్వములో లెక్కింపబడిన ఇశ్రాయేలీయుల యుద్ధ సైన్యపు సంఖ్యను వివరించండి.**

**5) దేవుడు ఖచ్చితమైన లెక్కలు కలిగినవాడనుటను ఉదహరించండి.**

**6) 'మనిషి జీవితకాలములో ప్రతి క్షణము దేవుని లెక్కలో ఉన్నది' - వివరించండి.**

**7) 'బుద్ధిగలవాడు మృగముయొక్క సంఖ్యను లెక్కించుట' అనగా ఏమిటి?**

# 3. నోవహు ఓడ రహస్యం

జలప్రళయానికి ముందటి దినములలో దేవుడు ఈ భూమిపై నోవహు అనే నీతిమంతుని కనుగొన్నాడు. ఆ తరమువారిలో నోవహు ఒక్కడే ఆయన దృష్టికి నీతిమంతునిగా కనిపించాడు. ఈ నోవహును గూర్చి నేటి తరములో నివసిస్తున్న మనుష్యులు ఖచ్చితంగా ఒక మంచి పాఠాన్ని నేర్చుకోవాలి. అందుకే నిత్యజీవ పరిశోధనలో భాగముగా నోవహు ఓడను గూర్చిన ఈ పాఠమును నిర్ణయించడం జరిగింది. ఆదికాండము 6వ, 7వ అధ్యాయములలో నోవహు ఓడను గూర్చిన రహస్యాలను దేవుడు వ్రాయించాడు. జలప్రళయానికి ముందటి దినములలో పరిస్థితి ఏలాగున్నది అనే దానిని ఆదికాండము 6వ అధ్యాయం 5వ వచనము నుండి మనము చూడవచ్చు. జలప్రళయానికి ముందటి దినములలో ఈ భూమి మీద పరిస్థితి, దానిని బట్టి నివసిస్తున్న ప్రతి మనిషిని సంహరించాలని దేవుడు ఎందుకనుకున్నాడో, ఆయనకు అంత కోపం ఎందుకు వచ్చిందో అక్కడున్న సందర్భమును చదివితే మనకు అర్థమవుతుంది.

**ఆదికాండము 6 : 5- 'నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను.'** పరలోకమందున్న దేవుడు భూమి మీద నివసిస్తున్న మనుష్యులను చూడగానే నరులలో ఆయనకు చెడుతనము కనిపిస్తుంది తప్ప, నరుల నీతి కార్యక్రమాలు కనిపించడం లేదు. దేవుడు నరులను చూస్తున్నప్పుడు ఏ కాలంలోనైనా సరే ఆయనకు వారిలో ఏమి కనిపిస్తున్నాయి? నరుల చెడుతనము, వారి తలంపులలోని ఊహ అంతా చెడ్డదిగా మారిపోవడం. ఆనాడు దీనిని గమనించిన దేవుడు తన హృదయములో బాధపడుతున్నాడు. నరులలో ఆయనకున్న సంకల్పం నెరవేరకపోవటం, ఆయన రచించిన ప్రణాళిక నీరుగారిపోవటం వల్ల దేవునికి నరజాతిని బట్టి బాధ కలుగుతుంది. సమస్త జనులు ఈ భూమిపై ఎందుకొరకు పుడుతున్నారో, ఎలా బ్రతకాలో వారికి అర్థం కావటం లేదు. పైగా వారు చెడుతనంలో మాత్రం గొప్పవారవుతున్నారు. వారి ఊహలు, వారి ఆలోచనలు ఎల్లప్పుడూ చెడ్డవిగానే ఉంటున్నాయి. ఇదే దేవుని ఆవేదన! మనిషి చెడుతనంలో గొప్పవాడైనప్పుడు దానికి ప్రతిగా దేవుడు ఈ భూమి మీదకు జల ప్రళయాన్ని రప్పించాలని అనుకున్నాడు. మానవజాతినంతా ఆ అగాధ జలముల ద్వారా ముంచి నాశనం చేయాలనుకున్నాడు. ఆనాడు జరిగిన ఈ సందర్భాలన్నిటిని దేవుడు భవిష్యత్తు తరాలకొరకు లిఖితపూర్వకముగా తన పరిశుద్ధ గ్రంథములో నిక్షిప్తం చేసాడు. ఏ కాలములోనైనా మనిషి ప్రవర్తన ఈవిధంగానే ఉంటుందనటానికి నేటి మానవజాతి ఒక నిదర్శనంగా మనకు కనిపిస్తుంది. నేడు ఏ ప్రాంతానికి మనము వెళ్ళినా అక్కడ నరుల చెడుతనము గొప్పదిగా కనిపిస్తుంది. సరిగ్గా ఇలాంటి పరిస్థితులనే ఆనాడు చూచిన దేవుడు జలప్రళయంతో వారినందరినీ నాశనం చేసాడు. నీటి ప్రవాహముతో ఈ భూమినంతా ఊడ్చేయాలని నిర్ణయించుకున్నాడు. అలాంటి పరిస్థితులలో దేవుడు ఒక నీతిమంతున్ని మాత్రం జ్ఞాపకం చేసుకున్నాడు. ఆ కాలంలో దేవుని దృష్టిలో పడిన ఆ ఒక్కడైన నీతిమంతుడే నోవహు!

**ఆదికాండము 6 : 8- 'అయితే నోవహు యెహోవా దృష్టియందు కృప పొందినవాడాయెను.'** ఆనాడు అంత కోపములో ఉన్న దేవుడు నోవహును చూచిన తరువాత ఎందుకు అతనిని కృప నొందినవానిగా ఎంచాడు అని అంటే నోవహులో ఉన్న ఒక గొప్ప లక్షణమే దానికి కారణం. ఇంతకీ ఏమిటా లక్షణం?

**ఆదికాండము 7 : 1 'యెహోవా- ఈ తరమువారిలో నీవే నా యెదుట నీతిమంతుడవై యుండుట చూచితిని గనుక నీవును నీ యింటివారును ఓడలో ప్రవేశించుడి.** అవును. ఇదే దేవుడు నోవహులో కనుగొన్న గొప్పతనం! అదే నోవహులో ఉన్న లక్షణం. ఆ తరములో భూమిమీదనున్న మనుష్యులందరినీ దేవుడు నాశనం చేయాలని అనుకున్నప్పుడు, అందులో దేవుడు ఒక నీతిమంతుని కుటుంబాన్ని తప్పిస్తున్నాడంటే ఈ విషయంలో దేవుని మనస్సును మీరు గ్రహించాలి. ఎంత

గొప్పదో మీరు తెలుసుకోవాలి. ఆ జనులందరితోపాటు నోవహును అతని కుటుంబాన్ని కూడా దేవుడు ఊడ్చేయకుండా వారిని కాపాడాలని అనుకుంటున్నాడు. నోవహు యెహోవా దృష్టిలో కృప పొందినవాడాయెను. దీనిని నోవహు ఎలా సంపాదించుకోగలిగాడు? ఎలా అంటే అంతకు మునుపు నోవహుకున్న ప్రవర్తనే దానికి కారణం. దానిని బట్టి నోవహు రక్షింపబడ్డాడు. ఈరోజు చెడిపోయిన సమాజము మధ్య జీవిస్తున్న మనము చెడిపోయినవారిలాగే బ్రతకాలా? లేక నోవహు వలె నీతిని కొనసాగించాలా? అనే దానిని నోవహు నేర్పిస్తున్నాడు. దేవుని కొరకు నీతిగా బ్రతకటంలో ఎంత ఓర్పు, సహనం ఉండాలో నోవహు మనకు నేర్పిస్తున్నాడు. జలప్రళయానికి ముందటి దినములలో ఆ తరములోని మనుష్యులందరూ దేవుని దృష్టికి విరోధులుగానే బ్రతుకుతున్నారు. మరి నోవహు ఒక్కడే దేవుని దృష్టికి నీతిమంతునిగా ఎలా ఉండగలుగుతున్నాడో మీరు ఆలోచించండి. ప్రపంచమంతా ఒక వైపు ఆకర్షిస్తున్నప్పుడు నోవహు ఆ ఆకర్షణలో పడకుండా ఒక్కడే ఎలా నిలబడగలిగాడో, తద్వారా తన కుటుంబమును ఆ నీతిలో ఎలా నిలుపగలిగాడో ఆలోచించండి. ఇదే పాఠాన్ని మనకు నోవహు నేర్పిస్తున్నాడు. ఎప్పుడు లోకం ఈ విధంగానే ఉంటుంది. గొప్పగా మనలను చెడుతనము వైపు ఆకర్షించడానికి ప్రయత్నం చేస్తుంది. ఎందుకంటే నరుల చెడుతనము ఈ భూమి మీద గొప్పది. ఆ గొప్పదైన చెడుతనము మనలను అనునిత్యం తనవైపు లాగడానికి ప్రయత్నం చేస్తుంది. కాని నిజంగా మీరు నిగ్రహము కలిగినవారై, ఓర్పుతో నీతి కొరకు నిలబడితే ఆ తరువాత మంచి బహుమానాన్ని పొందుతారు. అలాంటి బహుమానమును ఆనాడు నోవహు పొందాడు. నోవహుతో దేవుడు ఇలా అంటున్నాడు 'ఈ తరమువారిలో నీవే నా యెదుట నీతిమంతునిగా ఉండుట చూచితిని గనుక నీవును, నీ యింటివారును ఓడలో ప్రవేశించుడి.' అందుకొరకు నోవహును దేవుడు ఒక ఓడను తయారు చేసుకోమన్నాడు. ఈ ఓడ వెనుకున్న రహస్యమిదే. ఓడ తయారు చేయబడటంలో రహస్యమిదే! నోవహు ఆ తరమువారిలో అందరికంటే నీతిమంతుడు. చెడుతనమును గొప్పదిగా చేస్తున్న తరములో పుట్టిన నోవహు వారితో కలువకుండా ఒక నీతిమంతునిగా బ్రతుకుతున్నాడు. ఈ విషయంలో నోవహుకు చాలా గొప్ప విశ్వాసం ఉంది. ఈరోజు దేవుని కొరకు బ్రతకమంటే మనుష్యులు ఎందుకో సందేహిస్తారు. నీతిగా బ్రతకాలంటే ఎందుకో మనుష్యులు వెనకడుగు వేస్తున్నారు. అలాంటప్పుడు వెంటనే నోవహును జ్ఞాపకం చేసుకోవాలి. ఒక చెడ్డ తరములో పుట్టినటువంటి నోవహు ఆ తరమునంతటిని ఎదిరించి ఒక్కడే నీతిమంతుడుగా ఎలా బ్రతుకుతున్నాడో, అతనికున్న నిగ్రహం ఏపాటిదో, విశ్వాసములో అతనికున్న స్థిరత్వం ఎంత గొప్పదో మీరు గ్రహించాలి. అలాగని దేవుడు ప్రతీరోజు నోవహుకు దర్శనములో కనిపిస్తున్నాడా? జరగబోయేదాన్నంతటిని నోవహుకు దేవుడు దర్శనములో చూపిస్తున్నాడా? లేదు. కేవలం అంతకుముందటి తరాలలో పుట్టినటువంటి కొంతమంది నీతిమంతులైన హేబెలు లాంటి వారి జీవితాలు మాత్రమే నోవహుకు ఉదాహరణగా ఉన్నాయి. కాని ఆయనకున్న విశ్వాసాన్ని చూస్తే అది అపారమైన విశ్వాసం. నోవహు తరానికి దేవుని గ్రంథాలు ఇంకా వ్రాయబడలేదు. పుస్తకాలు ఆయన చేతుల్లో లేవు. కేవలం నీతిమంతులు, పితరులు చెప్పినటువంటి మాటల మీద ఆధారపడ్డాడు. నోవహు యెహోవాకు ప్రార్థన చేయడం మానలేదు. పరలోకమందున్న తండ్రిని ఆరాధించడం మానలేదు. నిత్యజీవము కొరకు ఆలోచించడం మానలేదు. ఏ ఆధారము లేనప్పుడు కూడా అతడు నీతిమంతునిగా బ్రతుకుతున్నాడు. ఈరోజు మన చేతుల్లో బైబిల్ ఉంది. వినడానికి ఎన్నో ప్రసంగాలున్నాయి. మన చుట్టూ ఎంతోమంది నాయకులు మనలను నడిపిస్తున్నారు, ప్రోత్సహిస్తున్నారు. సంఘము మధ్యలో సంఘముతోపాటుగా ఉండే అవకాశము ఉంది. పరిపూర్ణమైనటువంటి జ్ఞానము అందుబాటులో ఉంది. అయినా సరే ఆనాడు నోవహు చూపినటువంటి విశ్వాసాన్ని అందుకోలేకపోతున్నారు. ప్రియులారా! నోవహు విశ్వాసాన్ని గూర్చి మరల కొన్ని వందల సంవత్సరాల తరువాత దేవుడు దానిని గ్రంథకర్త ద్వారా హెబ్రీ పత్రికలో వ్రాయిస్తున్నాడు.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 11 : 7 '**విశ్వాసమునుబట్టి నోవహు అదివరకు చూడని సంగతులనుగూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై, తన యింటివారి రక్షణకొరకు ఒక ఓడను సిద్ధముచేసెను; అందువలన అతడు లోకముమీద నేరస్థాపనచేసి విశ్వాసమునుబట్టి కలుగు నీతికి వారసుడాయెను.**' కేవలం నోవహుకున్నది విశ్వాసము మాత్రమే. ఇంతకీ ఏమిటా విశ్వాసం? హెబ్రీయులకు 11 : 1- '**విశ్వాసమనునది నిరీక్షింపబడువాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది.**' దేనినైతే నోవహు నిరీక్షిస్తున్నాడో, దాని నిజస్వరూపాన్ని విశ్వాసమునుబట్టి

చూడగలుగుతున్నాడు. అదృశ్యమైనది అనగా జలప్రళయం వచ్చుచున్నదనుటకు అతనియందున్న విశ్వాసమే కారణము. అప్పటివరకు జలప్రళయం ఎలా ఉంటుందో అతడెరుగకపోయినా దానిని నమ్మాడు. అప్పటివరకు ఎవ్వరూ జలప్రళయం కోసం ఓడను తయారు చెయ్యకపోయినా అతడు తయారు చేస్తున్నాడు. జరుగబోయే కార్యక్రమమంతా నోవహుకు అప్పటికి అదృశ్యమైనదిగా ఉన్నా దానిని అపారమైన విశ్వాసముతో నమ్మి నీతిమంతుడయ్యాడు. దేవుని మాటలను బట్టి రేపటి దినాన జలప్రళయం రాబోతుందని, దాని కొరకు తాను ఒక ఓడను దేవుడు చెప్పినట్టుగా సిద్ధం చేసుకోవాలని అనుకున్నాడు. తాను, తనతోపాటు నిర్ణయింపబడినవారు, దేవుడు తెలియజేసిన విధంగా జంతువులు, పక్షులతోపాటు ఆ ఓడ నీటి మీద తేలాలి. ఇదంతా నోవహు ముందుగా చూడలేదు. కానీ అదృశ్యమైనవి యున్నవి అని నమ్మాడు, వాటి కొరకు నిరీక్షిస్తున్నాడు. వాటియొక్క నిజస్వరూపాన్ని నోవహు తనలో కలిగియున్నాడు. అంతకుమునుపు ఎవ్వరూ జల ప్రళయము కొరకు ఓడను తయారు చేసినట్లుగా తాను చూడలేదు గనుక దేవుని మాటలను నమ్మలేను అని అనుకోకుండా అదివరకు చూడని సంగతులను గూర్చి దేవుని చేత హెచ్చరింపబడి, భయభక్తులు గలవాడై ఓడను తయారుచేసాడు. అందుకే ఆనాడు నోవహు బ్రతికి బట్టకట్టగలిగాడు. మిగిలినవారందరూ హాహాకారాలు చేస్తూ నీటిలో మునిగి చనిపోయారు. నోవహు భయభక్తులు గలవాడై తన ఇంటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధం చేసెను. నోవహులో నీతి లేకపోతే, నోవహు యింటివారికి ఇక దిక్కులేదు. నోవహు తనతోపాటు తన యింటివారిని కూడా రక్షించాలనుకున్నాడు. ఇదే నీతిమంతులకుండే లక్షణం. నీతిమంతుడు ఎప్పుడూ తానొక్కడే బ్రతకాలి అని అనుకోడు. తనతోపాటుగా ఇంకా అనేకమందిని కూడా రక్షించాలని అనుకుంటాడు. తానొక్కడినే రక్షింపబడాలని, తానొక్కడే పరలోకాన్ని ఆస్వాదించాలని, తానొక్కడే దేవుని దగ్గర ఉండాలనే కోరిక ఏ నీతిమంతునికీ ఉండదు. తనతోపాటు ఇంకా ఎందరు రావాలి? కొందరైనా రక్షింపబడాలని ప్రతి నీతిమంతుడూ ఆలోచిస్తూ ఉంటాడు. అబ్రాహాము సురక్షితమైన ప్రాంతంలో, ప్రశాంతముగా ఉన్నాడు. అటువంటి అబ్రాహాము దగ్గరకు దేవదూతలు వచ్చి లోతు నివసిస్తున్న ప్రాంతాలను మేము నాశనం చేస్తాం అంటున్నప్పుడు, అబ్రాహాము ఏమంటున్నాడో తెలుసా? అక్కడ నీతిమంతులుంటే ఆ ప్రాంతాలను కాపాడుతావా? అని దేవున్ని అడుగుతున్నాడు. తాను ఎందుకలా బ్రతిమిలాడుతున్నాడు? ఎందుకలా ప్రాధేయపడుతున్నాడు? తానొక్కడే రక్షింపబడితే ఆనందం కాదు. నీతిమంతునికి తనతోపాటు కొందరు రక్షింపబడితే అదే నీతిమంతునికి ఆనందం. లోకసంబంధముగా అయితే మనమొక్కరమే గట్టెక్కాలని, మనమొక్కరమే పాస్ అవ్వాలని, మనకొక్కరికే మంచి ర్యాంకు రావాలని అనుకుంటాము. నాతో పాటు అందరూ గట్టెక్కాలి అనే ఉద్దేశ్యము విద్యార్థి దశలోనే ఉండకపోవడం బాధాకరం. నేను మాత్రమే బాగుపడాలి అనే స్వార్థం మనుష్యులలో ఉండు దానిని బట్టి వారు బ్రతకలేకపోతున్నారు. ఒకడి దగ్గర లక్షల, వేల ఎకరాల భూములున్నాయి. మరొకడికి పండించుకోవడానికి ఒక ఎకరం భూమి కూడా ఉండదు. ఒకని దగ్గర బోలెడు ఇల్లులుంటాయి. తన ఇల్లులన్నీ అద్దెలకిచ్చి డబ్బు సంపాదించాలనుకుంటాడు. మనిషిది పుట్టెడు స్వార్థం. నాతోపాటు మరొకడు కూడా పట్టెడు మెతుకులు తినాలి అనుకునేటటువంటి ఆలోచన నేటి మనిషిలో లేదు. కాని నీతిమంతులలో ఆలోచన ఎలా ఉంటుందో చూడండి. నోవహు తన యింటివారి రక్షణ కొరకు ఓడను తయారుచేస్తున్నాడు. వీరందరు ఎందుకు ప్రభువా అని, తనతోపాటు తన భార్య ఎందుకు? తనతోపాటు తన కుమారులు ఎందుకు? తనతోపాటు తన కోడండ్రు ఎందుకు? అని అనలేదు. వారిని కూడా ఓడను ఎక్కించడానికి సిద్ధం చేస్తున్నాడు. ఇక్కడ నోవహు కేవలం తన కుటుంబము కొరకు మాత్రమే కాదు, తన చుట్టూ నివసిస్తున్న తరమువారి కొరకు కూడా ఆలోచిస్తున్నాడు. ఓడ ఎక్కడానికి ఇంకా ఎంతమందికి అవకాశముంటుందో అంతమంది నీతిమంతులుగా మారి లోపలికి వస్తే బాగుండును అని నోవహు ఆలోచిస్తున్నాడు. అందుకే ఆ ప్రయత్నాన్ని చేస్తున్నాడు. కానీ ఏ ఒక్కరూ మారకపోయేసరికి చివరకు నోవహు, అతని కుటుంబము మాత్రమే అర్హతను సంపాదించుకోగలిగారు. కానీ, అంతకు మునుపు నోవహు చేస్తున్న ప్రయత్నం ఏమిటో తెలుసా? ఒకవైపు నోవహు ఓడను సిద్ధం చేస్తున్నాడు. అలా సిద్ధం చేస్తున్నప్పుడు నోవహు చేస్తున్న మరో ప్రయత్నము ఏమిటో తెలుసా? తన తరములో మిగిలినటువంటి మనుష్యులు కూడా నీతిమార్గంలోకి వస్తే ఓడలోనికి ఎక్కుతారు, అప్పుడు వారు కూడా బ్రతికింపబడతారు, నాశనానికి వెళ్లరు గనుక ఆ నీతిమంతుని ఆలోచన ఎలా ఉందో చూడండి. నోవహు తనతోపాటు తన తరాన్ని కూడా రక్షించడానికి చాలా కష్టపడ్డాడు. మనము నీతిమంతులుగా మారాలంటే ఏం

చేయాలో తెలుసా? మన తరములో మనతోపాటు నివసిస్తున్న అనేకమందిని రక్షించడానికి ప్రయత్నం చేయాలి. నోవహు తన యింటివారికి మొదట దేవుని వాక్యం చెప్పాడు. వారందరు ఓడ ఎక్కేస్తామన్నారు. ఒకవేళ వీరిలో ఎవరు ఎదురు తిరిగినా వారు రక్షింపబడరు. కాని వారు ఏం చేసారు? నోవహు నా భర్త గనుక నోవహు మాట వినాలి అని అతని భార్య ఓడ ఎక్కింది. నోవహు మా తండ్రి నోవహు మాట వినాలి అని అతని కొడుకులు ఓడ ఎక్కారు. వారు నోవహుకు సహాయం చేసారు. అలాగే అతని కోడండ్రు బయట కుటుంబాలనుండి వచ్చినా గాని ఆ ముగ్గురు కోడండ్రు కూడా తమ మామగారి మాట విన్నారు. ఎందుకంటే, ఆయన ఈ తరమువారందరిలో నీతిమంతుడు. ఆయన దేవునికి ప్రార్థన చేస్తున్నాడు. ఆయన దేవుని వాక్యమును నెరవేరుస్తున్నాడు. మిగిలినవారందరు వ్యభిచారులుగా తిరుగుతున్నారు. లోకమందు చెడుతనము గొప్పదైపోయింది. అప్పుడు ఆ కోడండ్రు కూడా తాము ఆ యింటిలో అడుగుపెట్టినందుకు వారు ఆనాడు ఓడ ఎక్కగలిగారు. షేము, హాము, యాపెతులను వివాహము చేసుకున్నందుకు ఈ అవకాశము వారికి లభించింది. ఈ విధంగా నోవహు, తన భార్య, తన ముగ్గురు కుమారులు, ఆ ముగ్గురు కుమారులను వివాహం చేసుకున్న ముగ్గురు కోడండ్రు వెరసి మొత్తం మీద ఎనిమిది మంది అయ్యారు. కానీ ఓడ ఎక్కవలసింది కేవలం ఈ ఎనిమిది మందియేనా? సకల చరాచర జంతువులు, పక్షులలో దేవుని లెక్కచొప్పున అన్నీ ఓడలోనికి వచ్చేస్తున్నాయే? అలాంటప్పుడు మనుష్యులు రావద్దా? అందుకే నోవహు ఆనాడు చేస్తున్న ప్రయత్నమును చూడండి. దేనినిబట్టి నోవహును దేవుడు నీతిమంతునిగా ఎంచాడో మీరు ఇక్కడ గమనించండి. దేవుని జలప్రళయ నిర్ణయానికి ముందటి దినములలో అయితే దేవుడు నోవహును గూర్చి ఏమన్నాడో తెలుసా? నీవు నా దృష్టిలో కృప పొందినవాడవు అన్నాడు. ఆ తరువాత ఏం జరిగిందో తెలుసుకుందాం.

**ఆదికాండము 6 : 7 'అప్పుడు యెహోవా- నేను సృజించిన నరులును నరులతో కూడ జంతువులును పురుగులును ఆకాశ పక్ష్యాదులును భూమిమీద నుండకుండ తుడిచివేయుదును; ఏలయనగా నేను వారిని సృష్టించినందుకు సంతాపము నొందియున్నాననెను.'** లోకమందున్న జనులంతా కేవలం నిత్యజీవ పరిశోధనలో ఉండాలి. కాని ఈ లోకమందు వారు తిని త్రాగుతున్నారు. పెళ్లికిచ్చుటయందు, పెళ్లికివ్వబడుటయందు వారు ఆలోచన కలిగియున్నారు. అసలు దేవుని వాక్యమనే పదమే వారికి నచ్చటం లేదు. దేవుని జ్ఞానంలో మేముండాలి అనేటువంటి ఆలోచనే ఈ లోకానికి లేదు. అందుకే లోకమందున్న మనుష్యులను తుడిచివేయుదును అని దేవుడు అన్నాడు. అలా ఆయన అన్నప్పుడు ఇంకా ఏమి చెబుతున్నాడో చూడండి.

**ఆదికాండము 6 : 8 'అయితే నోవహు యెహోవా దృష్టియందు కృప పొందినవాడాయెను.'** పొందదగిన అర్హత లేకపోయినా మనలను ప్రేమించి ముందుగా మనపై దయ చూపడాన్ని కృప (మెర్సీ) అంటారు. మనలో యే అర్హత ఉందని మనము బాప్తిస్మమును తీసుకొనే అర్హతను దేవుడు కల్పించాడు? బాప్తిస్మం తీసుకోవడం మన గొప్పతనం కాదు; అది పరలోకమందున్న తండ్రి తన కుమారుడైన క్రీస్తు ద్వారా చూపిన కృప. దానినిబట్టి ఆయన మనకు కృప అనుగ్రహించాడు. కనుక మనము బాప్తిస్మమును తీసుకుంటున్నాము. కేవలం మన మనస్సులో క్రీస్తును రక్షకునిగా ఒప్పుకుని, దానిని హృదయపూర్వకముగా అంగీకరించినదానినిబట్టి దేవుడు మనకు తన అంగీకారమును తెలిపాడు. క్రీస్తు రాజ్యములో ప్రవేశించే అవకాశాన్ని కల్పించాడు. నిజానికి అర్హత సంపాదించుకుని ఆ తరువాత బాప్తిస్మమును తీసుకోవాలంటే మనము ఎంత కష్టపడాలో మీరు ఆలోచించండి. దేవుని కృప లేకుండా మన సొంత ప్రయత్నం వలన బాప్తిస్మమును తీసుకోమని దేవుడంటే గనుక భూమ్మీద ఎవ్వరూ బాప్తిస్మమును తీసుకోలేరు. అందుకే దేవుడు తన కృపచేత మనకు రక్షణ అనుగ్రహించాడు. అదే విధముగా ఆనాడు దేవుడు తన కృప చేత నోవహును కాపాడతానని చెప్పాడు. **'అయితే నోవహు యెహోవా దృష్టికి కృపపొందిన వాడాయెను'**. అలా చెప్పిన తరువాత దేవుడు నోవహుతో ఓడ తయారుచేసే విధానమంతటిని చెబుతున్నాడు. నోవహు ఒక ప్రక్క ఓడ తయారు చేస్తున్నాడు. ఓడ తయారు చేస్తున్న నోవహు మరో ప్రక్క నీతిని సంపాదించుకుంటున్నాడు. ఆదికాండము 6వ అధ్యాయములో మిగిలిన భాగమంతా దేవుడు ఓడను తయారుచేసే విధానాన్ని, జలప్రళయాన్ని గూర్చిన సంగతులను చెప్పాడు. ఆ కాలమంతటిలో నోవహు మరో ప్రక్క నీతిని సంపాదించుకుంటున్నాడు. దేనిద్వారా ఆ నీతిని సంపాదించాడో ఇప్పుడు చూద్దాం. అప్పటికి కేవలం నోవహు కృప పొందినవాడు మాత్రమే. కాని పూర్తిగా నీతిమంతుడు అవడానికి అతడు

ఏమి చేయాలి? **ఆదికాండము 6 : 22 'నోవహు అట్లు చేసెను; దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తు చేసెను.'** నోవహు ఓడను సిద్ధపరచుకున్నాడు. ఓడ సిద్ధపరచుకొనుచుండగా అతడు నీతిని సంపాదించుకుంటున్నాడు.

**ఆదికాండము 7 : 1 'యెహోవా- ఈ తరమువారిలో నీవే నా యెదుట నీతిమంతుడవై యుండుట చూచితిని గనుక నీవును నీ యింటివారును ఓడలో ప్రవేశించుడి.'** నోవహు కేవలం ఓడ కట్టేసి కూర్చుంటే దేవుడు ఈ మాట చెప్పకపోవును. దేవుడు చెప్పినట్టుగా ఓడను నిర్మించి, తన యింటిలో కూర్చుని, ప్రార్థన చేసుకుంటూ, భజన చేసుకుంటూ ఈ విషయం ఎవ్వరికి చెప్పకపోతే నోవహులో దేవుడు నీతిని చూడకపోవును. తన తరమువారు ఎందుకయ్యా ఈ ఓడను కడుతున్నావు అంటే, ఎందుకో కడుతున్నానులే, నా ఇష్టం, అది నీకెందుకు? అని అనకుండా ఎవరు అడిగినా అడగకపోయినా తన బాధ్యతగా ఒక గొప్ప పనిని నోవహు చేస్తున్నాడు. అప్పటి వరకు దేవుని కృప పొందినటువంటి నోవహు ఆ తర్వాత నీతిమంతునిగా ఎలా మారిపోయాడు? తన కుటుంబము కూడా ఓడలో ప్రవేశించడానికి ఎలా అర్హత పొందింది? దీనిని బాగా ఆలోచించాలి. నేటి కాలములో మనము కేవలం దేవుని కృపచేత అనుగ్రహింపబడిన బాప్తిస్మమును పొందితే పరలోకం వెళ్ళిపోతామా? కేవలం సంఘములో చేర్చబడితే మనము పరలోకమునకు వెళ్ళిపోతామా? వెళ్ళలేము. మనము నీతిని సంపాదిస్తేనే పరలోకానికి అర్హులము! మనము నిత్యజీవములోనికి అడుగుపెట్టి, నరకాగ్నిని తప్పించుకోవాలంటే దేవుడు మనలో చూడాల్సింది నీతి! ఆనాడు నోవహు ఒక ప్రక్క ఓడను సిద్ధం చేస్తున్నాడు. మరో ప్రక్క నీతిని సంపాదించుకుంటున్నాడు. ఇదెలాగో తెలియాలంటే, ఇంకా ఎక్కడెక్కడ దేవుడు తన పరిశుద్ధ గ్రంథములో నోవహును గూర్చిన ప్రస్తావన వ్రాయించాడో చూస్తే తప్ప మీకు అందులోని రహస్యాలు తెలియవు. అలా తెలియాలంటే నిత్యజీవ పరిశోధన లోనికే రావాలి. బైబిల్‌ను కేవలం చదువుకుంటూ వెళ్ళిపోతే, ఆదికాండములోనే మీరు నోవహును గూర్చి మరచిపోతారు. అబ్రాహాము కాలము వచ్చేసరికి నోవహును మరచిపోతారు. యాకోబు విషయాలు వచ్చేసరికి అబ్రాహామును మరచిపోతారు. మోషే వచ్చేసరికి యాకోబును మరిచిపోతారు. దావీదు వచ్చేసరికి మోషేను మరిచిపోతారు. కాని బైబిల్‌ను పరిశోధిస్తూ చదవాలి. నోవహు మొదట కృప పొందినవాడయ్యాడు. ఆ తర్వాత నీతిమంతుడయ్యాడు. ఈ మధ్యలో ఏం జరిగింది?

**పేతురు వ్రాసిన మొదటి పత్రిక 3 : 19- 'దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా , అవిధేయులైనవారియొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మల యొద్దకు, ఆయన ఆత్మరూపి గానే వెళ్లి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణపొందిరి.'** జలప్రళయానికి ముందటి దినములలో దేవుడు దీర్ఘశాంతముతో ఉన్నాడు. అంటే, ఆ కార్యక్రమం కేవలం ఒక్క రోజులో, రెండు రోజుల్లో ముగింపబడినది కాదు. నోవహు ఒక్క రోజులో, రెండు రోజుల్లో సంపాదించుకున్న నీతి కాదది. దేవుడు దీర్ఘశాంతం అన్నాడంటే, ఒక్క రోజును గూర్చి ఆయన దీర్ఘశాంతం అని చెబుతాడా? చెప్పడు. దీనినిబట్టి దేవుడు ఆనాటి మానవాళి మార్పు కొరకు చాలా రోజులుగా ఎదురు చూసాడన్నమాట. నోవహుతో ఓడ సిద్ధపరచమని చెప్పిన తరువాత దేవుడు జలప్రళయాన్ని వెంటనే రప్పించకుండా చాలా రోజులు ఎదురు చూస్తున్నాడు. ఆనాడు భూమిమీద నరుల యొక్క చెడుతనము గొప్పది వారి హృదయముయొక్క తలంపులలోని ఊహంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదని దేవుడు నిర్ణయం తీసుకున్న తర్వాత, నోవహు ఓడ సిద్ధం చేయడం మొదలు పెట్టినప్పటి నుంచి దేవుడు జలప్రళయాన్ని రప్పించినంతవరకూ చాలా దీర్ఘశాంతాన్ని ఆయన చూపించాడు. అంటే ఆ మధ్యకాలం చాలా ఎక్కువన్నమాట. దేవుడు తన నిర్ణయాన్ని నోవహు ద్వారా చెప్పిన తరువాత దానిని అమలుజరపడానికి మధ్యలో దేవుడు ఎదురు చూచిన రోజులు ఎన్నో మీకు తెలిస్తే చాలా ఆశ్చర్యపోతారు. అది చాలా ఎక్కువ కాలము. అందుకే దానిని దేవుని దీర్ఘశాంతము అన్నాడు. అది రోజుల కాలము కాదు, నెలల కాలము కాదు, సంవత్సరాల కాలము! నోవహు తన ఓడను తయారుచేయటానికి సంవత్సరాల కాలము పట్టిందంటారా? పట్టాలి, పడుతుంది కూడా! ఎందుకంటే దేవుడు నోవహును ఆషామాషీ ఓడను తయారు చేయమనలేదు. ఓడను తయారు చేయడానికి ఏ పదార్థాన్ని వాడాలో కూడా దేవుడే ముందుగా నిర్ణయించేసాడు. ఇప్పుడు ఆ పదార్థాన్ని తేవాలి. చితిసారకపు మ్రానును తెమ్మన్నాడు. దేవుడు చెప్పినట్టుగా నోవహు నిర్మించకపోతే, ఆ

మహా జలప్రళయములో ఓడ పల్టీ కొట్టేస్తుంది. దగ్గరలో దొరికాయి కదా అని ఇష్టము వచ్చిన కర్రలన్నీ జోడించేస్తే ఓడ తిరగబడిపోతుంది. ఆ ఓడ భారీ బరువుతో నీటిమీద తేలాలి. కొండలపైన అది నిలవాలంటే చాలా మంచి కర్రను దానికి వాడాలి. అందుకే దేవుడు ఒక చెక్కను నిర్ణయించి, చితిసారకపు మ్రానుని దానికి వాడాలన్నాడు. ఆదికాండము 6వ అధ్యాయంలో మీకు ఆ వివరాలన్నీ కొలతలతో సహా కనిపిస్తాయి. దాని బరువెంతుండాలి, దాని ఎత్తు ఎంతుండాలి, దాని వెడల్పు ఎంతుండాలి, కిటికీలు ఎక్కడెక్కడుండాలి, తలుపెక్కడ ఉండాలనే దాన్నంతటిని దేవుడు నిర్ణయించి, కొలతలన్నీ యిచ్చి నోవహును ఒక ఇంజనీర్‌గా మార్చేస్తున్నాడు. ఆ రోజుల్లో లోక శాస్త్రాలింకా పుట్టలేదు. సైన్స్ అనే పదం పుట్టలేదు. ఇప్పుడు దీనినంతటినీ దేవుడు చెప్పినట్టుగా చేయడానికి ఎంత సమయం పడుతుంది? కొన్ని సంవత్సరాల కాలం! సరిగ్గా ఎంత సమయం పట్టిందో మనకి తెలియాలి, సుమారుగా దేవుడు దీనికి ఎంత సమయం కేటాయించాడో తెలుసుకోవాలి. నోవహు నీతిని సంపాదించుకోవడానికి పట్టిన ఆ కాలమెంతో మనము లెక్క కట్టాలి. ఇప్పుడు ఆ పరిశోధనలోనికి అడుగుపెడదాం!

**ఆదికాండము 5 : 32- 'నోవహు ఐదువందల యేండ్లు గలవాడై షేమును హామును యాపెతును కనెను.'** నోవహుకు తన ముగ్గురు కుమారులు పుట్టినప్పటికి తన వయస్సు ఐదువందల యేండ్లు. ఆ వయస్సులో దేవుడు ఆజ్ఞాపించిన విధంగా నోవహు ఒక భారీ ఓడను నిర్మిస్తున్నాడు. ఇక్కడ మరొక విషయమేమిటంటే, నోవహు కాలము వరకు మనిషి ఆయుష్కాలము సుమారు 1000 సంవత్సరాల వరకు ఉండేది. నోవహు జలప్రళయము తరువాత దేవుడు మనిషి ఆయుష్కాలాన్ని 70 లేక 80 యేళ్ళకు కుదించేసాడు. నేటికాలములో 80 యేళ్ళ వయస్సు గలిగినవానిని చూస్తే ఇక అతడు ఏ పనిని చేయలేడన్నట్టుగా కనిపిస్తుంది. ఒక కుర్చీవేసి కూర్చోబెడితే అందులో కూర్చుంటాడు తప్ప అలాంటివాడు ఒక ఓడను కట్టగలడా? నిజానికి ఈ రోజుల్లో 60 సం॥ల వయస్సు దాటిన వారి పరిస్థితే అగమ్యగోచరం! ఏ పనినీ చేయలేకపోతున్నారు. తిండి పెడితే తిండి తినలేకపోతున్నారు, కాస్తంత దూరం నడవలేకపోతున్నారు. నోటిలోని పళ్లన్నీ ఊడిపోతున్నాయి. బోసి బామ్మలు, బోసి తాతలు అయిపోతున్నారు. కాని ఆనాటి నోవహు చాలా పటిష్టంగా ఉన్నాడు. ఎంత పటిష్టంగా ఉన్నాడంటే అతడు ఒక భారీ ఓడను తయారు చేయగలుగుతున్నాడు.ఆ ఓడ ఒక మహా జలప్రళయాన్ని తట్టుకోగల ఓడ. భూమి మీద అప్పటివరకూ అంతటి గొప్ప జలప్రళయమును ఎక్కడా ఎవ్వరూ ఎప్పుడూ చూడలేదు. సామాన్యమైన ఓడలను సైతం తిరగ గొట్టేటంత భారీ బలము కలిగినటువంటి జలరాశులు భూమి మీదకు రాబోతున్నాయి. అందుకే దేవుడు, దానినంతటినీ తట్టుకోగల ఒక ఓడను తయారు చేయమన్నాడు. ఆ ఓడను తయారు చేసేటప్పటికి నోవహు వయస్సు 500 యేండ్లు దాటింది. అప్పుడు దేవుడు తన నిర్ణయాన్ని వెల్లడి చేస్తూ, నోవహుతో 'నీవు నా దృష్టిలో కృప పొందినవాడవు' అన్నాడు. దేవుడు నోవహుతో జల ప్రళయమును గూర్చి చెప్పిననాట నుండి ఆ జల ప్రళయము ప్రారంభమయ్యేలోపు ఒక ఓడను తయారుచేయాలి మరియు తాను దేవుని దృష్టికి నీతిని సంపాదించుకోవాలి. అన్నట్టుగానే నోవహు దేవుని దీర్ఘశాంత కాలములో ఓడను సిద్ధం చేసాడు; అలాగే, నీతిని కూడా సంపాదించుకున్నాడు. ఇదంతా పూర్తయ్యే సరికి పట్టిన కాలమెంత?

**ఆదికాండము 7 : 6 'ఆ జలప్రవాహము భూమిమీదికి వచ్చినప్పుడు నోవహు ఆరువందల యేండ్లవాడు.'** నోవహుకు 500 యేండ్లు నిండిన కొంత కాలము తరువాత దేవుడు పై మాటలు చెప్పాడు. జల ప్రళయము ప్రారంభమయ్యే సరికి నోవహుకు 600 యేండ్లు వచ్చేసాయి. అంటే ఈ మధ్యకాలం ఎంత? ఒక సంవత్సరమో లేక రెండు సంవత్సరాలో కాదు. అది దాదాపుగా 100 సంవత్సరాలకు దగ్గర కాలము. ఇన్ని సంవత్సరాల కాలములో నోవహు ఓడను కడుతున్నాడు. ఇన్ని సంవత్సరాల కాలములో తాను నీతిని కూడా సంపాదించుకుంటున్నాడు. అవును, అందుకే దేవుడు దానిని తన 'దీర్ఘశాంతము' అన్నాడు. సంవత్సరాల కాలములో నోవహు యొక్క విశ్వాసం చెక్కు చెదరలేదు. నేటి క్రైస్తవుల విశ్వాసం కేవలం రోజుల వ్యవధిలోనే సన్నగిల్లిపోతుంది. బాప్తిస్మము తీసుకున్న రోజున వారికున్న విశ్వాసం చాలా గొప్పగా ఉంటుంది, బలంగా ఉంటుంది. వారు దేవునికోసం నిజంగా నిలబడాలని, దేవుని వాక్యములో వ్రాయబడిన దానిని ఉన్నది ఉన్నట్లుగా పరిశోధించి తెలుసుకోవాలని, దానినంతటినీ పాటించాలని, వారి ప్రాణమునర్పించైనా సరే వారు పరలోకాన్ని సంపాదించుకోవాలని

అనుకుంటారు. ఈ ప్రాణాన్ని కోల్పోయైనా ఆ నిత్యజీవపు ప్రాణమును దక్కించుకోవాలనే ఆశతో కనిపిస్తారు. ఈ నిర్ణయంతో, ఈ నిబద్ధతతో బాప్తిస్మమును తీసుకున్న రోజున మాత్రమే ఉంటారు. ఆ తరువాత ఒక వారం, నెల గడుస్తుంది. ఆ తరువాత నెమ్మదిగా ఓహో.. సంఘం అంటే ఇదేనా? రొట్టె, ద్రాక్షరసం, కానుకలు, పాటలు, వాక్యం... మహా అయితే సంవత్సరానికి ఒక పండుగ! చూశారా, ఎలా మారిపోతున్నారో? బాప్తిస్మమును తీసుకున్న కొంత కాలానికే క్రీస్తునందున్న విశ్వాసం సన్నగిల్లిపోతుంటే సంవత్సరాల కాలము నోవహు యొక్క విశ్వాసం కొంచెము కూడా చెక్కు చెదరలేదు. పైగా తాను నీతిని సంపాదించుకుంటున్నాడు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క మెట్టు తన విశ్వాస జీవితంలో పైకి ఎక్కుతున్నాడు. మొదట నోవహును గూర్చి దేవుడు, నీవు నా దృష్టియందు కృప పొందినవాడవు అన్నాడు. సంవత్సరాల కాలము గడచిన తరువాత నోవహును గూర్చి మరల దేవుడు, ఈ తరము వారిలో నీవే నాయెదుట నీతిమంతుడవు అంటున్నాడు. అప్పటికి నోవహుతో పాటు తన యొక్క కుటుంబము కూడా ఓడ ఎక్కడానికి సిద్ధపడింది, అర్హతను సంపాదించింది.

**ఆదికాండము 7 : 11- 'నోవహు వయస్సుయొక్క ఆరువందల సంవత్సరము రెండవ నెల పదియేడవ దినమున మహాగాధజలముల ఊటలన్నియు ఆ దినమందే విడబడెను, ఆకాశపు తూములు విప్పబడెను.'** దేవుని లెక్క ఎలా ఉందో చూడండి. నోవహుకు 500 యేండ్లు నిండిన తరువాత దేవుడు తన ప్రణాళికనంతటినీ నోవహుకు తెలియజేశాడు. నోవహు దాని యందు విశ్వాసముంచాడు. ఓడ నిర్మాణమును ప్రారంభించాడు. ఓడ నిర్మాణము పూర్తయింది. నోవహు ఆ నిడివిలో నీతిని సంపాదించుకోవడానికి శతవిధాల ప్రయత్నం చేసాడు. దేవుని కృప వలన నీతిని సంపాదించుకున్నాడు. అప్పుడు ఆకాశము నుండి మహాగాధజలముల ఊటలన్నియు దిగిపోతున్నాయి. ఇప్పుడు మరల క్రొత్త నిబంధన గ్రంథములో పేతురు వ్రాసిన మొదటి పత్రికను చూడాలి. నోవహు ఓడలో ఎంత పరిశోధన దాగి ఉందో చూడండి. దీని వెనుక దేవుడు ఎంత రహస్యాన్ని తన కుమారుల కొరకు దాచియుంచాడో చూడండి. ఆదికాండములో నోవహు ఓడ సంగతులను ఊరకనే చదువుకుంటూ వెళ్లిపోతే, నోవహును గూర్చి పైపైన మాత్రమే మీకు అర్థమవుతుంది. కాని నోవహును గూర్చి, ఆయన కట్టిన ఓడ రహస్యాలను గూర్చి మీకు అర్థం కావాలంటే మీరిలా నిత్యజీవ పరిశోధననే చేయాలి.

**పేతురు వ్రాసిన మొదటి పత్రిక 3 : 19- 'దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైనవారియొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మల యొద్దకు, ఆయన ఆత్మ రూపిగానే వెళ్లి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణ పొందిరి.'** అది కొద్ది రోజుల కాలము కాదు గాని, సంవత్సరాల కాలము గనుకనే దేవుడు దానిని దీర్ఘశాంతము అన్నాడు. ఇంతకీ దేవుని దీర్ఘశాంతం దేని కొరకు? జలప్రళయాన్ని రప్పించే ముందు అంత ఆలస్యం ఎందుకు చేస్తున్నాడాయన? ఆ దీర్ఘశాంత కాలములో ఒకవేళ ఎవడైనను తన మనస్సు మార్చుకొని నోవహును వెంబడించి, ఓడ ఎక్కుతాడేమోనని ఆయన వేచి చూస్తున్నాడు. అంటే దేవుడు మనుష్యుల మార్పు కొరకు సుదీర్ఘ సమయాన్ని వెచ్చిస్తున్నాడు. సంవత్సరాల కాలం పాటు దేవుని వాక్యము మనుష్యులకు ప్రకటింపబడుతూ మరోప్రక్క దేవుడు చెప్పినట్టుగా మొదటి అంతస్తు, రెండవ అంతస్తు, మూడవ అంతస్తు కలిగిన దానిగా ఓడ సిద్ధపరచబడుచున్నది. ఆ ఓడ ఎంత పొడవుండాలి, ఎంత వెడల్పుండాలి, ఎంత ఎత్తుండాలి, కిటికీ ఎక్కడుండాలి, దాని తయారీకి వాడవలసిన పదార్థమేమిటో అనేదానినంతటిని ముందుగా నిర్ణయించి దేవుడు నోవహుకు చెప్పాడు. ఆ విధంగా ఓడ సిద్ధపరుచుచుండగా దేవుడు దీర్ఘశాంతముతో ఉన్న కాలము సుదీర్ఘకాలము. ఒకవైపు ఓడ సిద్ధపరచబడుచుండగా మరొకవైపు మనుష్యుల రక్షణార్థమై దేవుని దివ్యమైన వాక్యము ప్రకటింపబడుచున్నది. ఆనాడు ఈ భూమి మీద దేవుని వాక్యం లేదు. చదవటానికి గాని, నేర్చుకోవటానికి గాని, పరిశోధించటానికి గాని దేవుని మాటలు లేవు. దేవుడు చెప్పిన ఆ హెచ్చరికలు మాత్రమే నోవహు దగ్గరున్నాయి. అలాంటప్పుడు నోవహు ఆ ప్రజలకు దేవుని వాక్యమును ఎలా చెప్పాలి? ఏమి చెప్పాలి? అప్పటికి ఇంకా ఆదికాండము, నిర్గమకాండము వ్రాయబడలేదు. నోవహు చేతిలో వ్రాయబడిన చరిత్ర లేదు, వ్రాయబడిన భవిష్యత్తు లేదు. మరి ఆ జనులకు నోవహు ఏమి చెప్పాలి? అనేకమందిని ఎలా రక్షించాలి? తాను దేవుని మాటలకు లోబడి ఓడ కడుతున్నాడు కనుక వచ్చి ఓడ ఎక్కమంటే వస్తారా? రారు. వారికి తగినంత దేవుని వాక్యమును చెప్పాలి, వివరించాలి. సూర్య చంద్ర నక్షత్రాలను గూర్చి, దేవదూతలను

గూర్చి, ముల్లోకాలను గూర్చి, తండ్రియైన దేవుడు, ఆయన కుమారుడు, పరిశుద్ధాత్ముడు, మానవుల రక్షణ ప్రణాళిక దీనినంతటిని గూర్చి నేర్పించాలి. కాని వీటిని గూర్చి చెప్పడానికి నోవహు చెంత దేవుని వాక్యము ఎక్కడుంది? అందుకే ఈ పరిస్థితిని గమనించిన దేవుడు పరలోకము నుండి యేసుక్రీస్తును దేవుని వాక్యము రూపములో ఆత్మ రూపిగా ఈ భూమి మీదకు పంపించాడు. అందుకే ఆ పరిస్థితిని పేతురు తన పత్రికలో ప్రస్తావిస్తూ, ఆయన(యేసుక్రీస్తు) ఆత్మ రూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను అని వ్రాసాడు. చాలామందికి యేసుక్రీస్తు కన్య మరియ గర్భాన 2000 సం॥ల క్రితం వచ్చాడు కదా అనుకుంటారు. కన్య మరియ గర్భాన 2000 సం॥ల క్రితం ఆయన శరీరధారిగా వచ్చిన మాట నిజమే కాని, నోవహు కాలంలో అయితే ఆత్మ రూపంలో వెళ్లాడు. అందుకే దేవుడు పేతురు పత్రికలో ఆయన రాకను గూర్చి చాలా స్పష్టంగా వ్రాయించాడు. శరీరధారిగా యేసుక్రీస్తు ఈ భూమి మీదకు రాక మునుపు ఆయన పరలోకంలో దేవుని దగ్గర వాక్యము రూపంలో ఉన్నాడు. ఈ రోజు బైబిల్‌గా మన చేతుల్లో గ్రంథస్థమైనటువంటి ఈ అక్షరాలను మనము చదువుతున్నప్పుడు ఈ మాటల్లో దాగి ఉన్నది యేసుక్రీస్తని తప్పక గ్రహించాలి.

**యోహాను సువార్త 1 : 1- 'ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను. వాక్యము దేవుడైయుండెను.'** ఆదియందే పరలోకములో దేవుని యొద్ద ఉన్న ఆ వాక్యము నోవహు కాలంలో ఈ భూమి మీదకు ఆత్మ రూపములో వచ్చెను. కనుక నోవహు నీతిని సంపాదించుకొను నిమిత్తం, తనతోపాటు అనేకమందిని రక్షించుటకు ప్రయత్నించుచుండగా దేవుని వాక్యము నోవహు యొద్దకు పరలోకమునుండి దిగి వచ్చెను. ఆ నోవహు ద్వారా ఆ దేవుని వాక్యము ఆనాడు చెరలో ఉన్న ఆత్మల యొద్దకు వచ్చెను. కన్య మరియ గర్భము ద్వారా అయితే శరీరధారిగా వచ్చెను. **యోహాను సువార్త 1 : 14 'ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను.'** ఇది కన్య మరియ గర్భాన వచ్చినటువంటి సందర్భం.

**పేతురు వ్రాసిన మొదటి పత్రిక 3 : 19- 'దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైనవారియొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మల యొద్దకు, ఆయన ఆత్మ రూపిగానే వెళ్లి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణ పొందిరి.'** ఇంతకీ ఆ అవిధేయులందరూ ఎవరు? వారే చెరలో ఉన్న ఆత్మలు! ఈనాడు 'దేవుని యొద్దకు రండి' అని వాక్యమును ప్రకటించినప్పుడు దీనినొక 'మతం' అని చెప్పి తప్పుకుంటున్న వారందరూ ఎవరు? చెరలో ఉన్న ఆత్మలు! వారందరు స్వేచ్ఛగా తిరుగుతున్న ఆత్మలు అని అనుకోకండి. అది పొరపాటు. అపవాది కబంధ హస్తాలలో చిక్కుకున్న ఆత్మలు వారందరు. వాడు చెప్పినట్లు చేస్తున్న ఆత్మలు వారందరు. లోకమందు వారి ఇష్టాన్ని వారు నెరవేర్చుకుంటూ చివరకు తమ్మును తామే పాడుచుకుంటారు. ఈ లోకమందున్న జనులు దైవజనులు అనుకుంటున్నారా? కాదు, అపవాది జనులు. వాడి ఆకర్షణలో బంధింపబడ్డారు. వాడేమి చెబితే వారు అదే చేస్తారు. వారందరిని గూర్చి దేవుడు అవిధేయులైనవారు అంటున్నాడు. నోవహు ఓడలోనికి వారు ఆనాడు రాలేకపోతున్నారంటే వారంతా అపవాది చెరలో ఉండిపోయారు. ఉదాహరణకు, మీ ఇంటిలో ఏదో ఒక కార్యక్రమం జరుగుతున్నదనుకుందాం. మీకున్న వారిలో ఒక బంధువు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్నాడనుకుందాం. వెళ్ళి అతనిని మీ ఇంటిలోని కార్యక్రమానికి పిలిచారనుకోండి. వస్తాడా? రాడు. అతనికి వద్దామని ఉన్నా జైలర్ వెళ్లనిస్తాడా. వెళ్లనివ్వడు. ఎందుకంటే అతడు జైల్లో ఉన్నాడు. అనగా చెరలో ఉన్నాడు. మీరెంత పిలిచినా, మీరెంత బ్రతిమిలాడినా రావడానికి అతనికి వీలులేదు. నేను రాలేనయ్యా చెరలో ఉన్నానుగా అంటాడు. సరిగ్గా అలాగే ఈ లోకమందున్న మనుష్యులను దేవుడు తన యొద్దకు ఆహ్వానిస్తున్నప్పుడు వారంతా చెరలో ఉండిపోయారు గనుక రాలేకపోతున్నారు. ఆనాటి లోకమందున్న మనుష్యులను నోవహు ఓడ ఎక్కండయ్యా అని ఆహ్వానిస్తున్నప్పుడు వారు సాతాను చెరలో ఉండిపోయారు గనుక రాలేకపోతున్నారు. ఇలా రాలేకపోతున్నవారికి దేవుని వాక్యమును వివరిస్తే వస్తారేమో అనే సదుద్దేశ్యముతో, ఆనాటి అవిధేయులైనవారి యొద్దకు అనగా చెరలోనున్న వారి యొద్దకు యేసుక్రీస్తు ఆత్మరూపిగానే వెళ్లి వారికి ప్రకటించెను. నోవహు ద్వారా ఆత్మరూపిగా ఆనాటి మనుష్యులతో మాట్లాడి, వారందరినీ రక్షించే ప్రయత్నమును చేసాడు. నాటి నుంచి నేటివరకు ఈ లోకమందు ఎందరో అవిధేయులైనవారు అపవాది చెరలో ఉండిపోయారు. చీకటి బంధకాలలో ఉ

ండిపోయారు. వాటిని ఛేదించుకుని బయటకు రాలేకపోతున్నారు. ఇలాంటి వారు ఓడలోనికి వస్తారా చెప్పండి? అందుకే దేవుడు తన గ్రంథములో ఇలాంటి వారిని గూర్చి భావి తరాలకు ఒక దృష్టాంతముగా పాఠమును వ్రాయించాడు. మనుష్యులు ఆ చెరలో ఉంటే చివరకు చెరలోనే నశించిపోతారు. యేసుక్రీస్తు శరీరధారిగా ఈ భూమి మీదకు వచ్చి దేవుని వాక్యమును ప్రకటిస్తున్నప్పుడు కూడా ఈ సందర్భమును ప్రయోగిస్తున్నాడు.

**లూకా సువార్త 4 : 18, 19 'ప్రభువు ఆత్మ నా మీద ఉన్నది; బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను; చెరలోనున్నవారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగినవారిని విడిపించుటకును ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు.' యెషయా 61 : 1-** వచనములలో వ్రాయబడిన మాటలను యేసుక్రీస్తు ఇక్కడ ప్రస్తావిస్తున్నారు. పరలోకంలో దేవుని యొద్ద దేవుడైయున్న దేవునివాక్యం భూమి మీద మనుష్యుల యొద్దకు వస్తోంది. ఆనాడు నోవహు ద్వారా ఈ లోకములోనికి వచ్చింది. ప్రభువు ఆత్మ ఒక మనిషి మీద ఉన్నప్పుడు అతడు బీదలకు సువార్త ప్రకటించాలి. ఇంతకీ బీదలంటే ఎవరు? దేవుని వాక్యము వారియొద్ద లేని అభాగ్యులే ఈ బీదలు. వారెంతటి ధనవంతులైనా వారి దగ్గర దేవుని వాక్యము లేకపోతే వారు బీదవారి క్రిందే లెక్క! అలాంటి వారికి దేవుని వాక్యమును ప్రకటించాలి. లోకమంతా చెడుతనములో గొప్పదవుతున్నప్పుడు ఆ చెడుతనము నుండి వారిని నీతిలోనికి తీసుకురావాలి. బీదలకు సువార్తను ప్రకటించుటకై దేవుడు యేసును ఆయన ఆత్మచేత అభిషేకించెను. చెరలో ఉన్నవారికి విడుదలను కలిగించాలి. దేవుని వాక్యమనే తాళంతో వారికి చెరనుండి విముక్తిని కలిగించాలి. ఒక్కొక్కసారి దేవుని వాక్యమును చెప్పినా, విడుదలయ్యే అవకాశం ఇచ్చినా, దేవుని వాక్యము చేత వారిని బ్రతికించాలని ఎంతో ప్రయత్నం చేసినా కొంతమందికి చెడుతనమే నచ్చుతుంది. ఎందుకంటే 'చెర'లో ఉంటే దొంగలతో, హంతకులతో, వ్యభిచారులతో ఉండిపోవచ్చు. ఇలాంటివారు నీతిమంతులతో కలువరు. చెరలో ఉన్న ఆత్మలకు దేవుని వాక్యమును ప్రకటించాలనే ఉద్ధేశ్యంతో ప్రభువు ఆత్మ ఎవరి మీదకు వస్తుందో వారు వెళ్లి వాక్యమును ప్రకటిస్తున్నారు.

**పేతురు వ్రాసిన మొదటి పత్రిక 3 : 19-** దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు అనగా సంవత్సరాల కాలం ఆయన దీర్ఘశాంతంతో ఉండి, ఆ సుదీర్ఘకాలంలో ఒకవైపు నోవహుచేత ఓడను నిర్మింపజేస్తూ, మరొకవైపు యేసు ఆత్మ చేత నోవహు ద్వారా దేవుని వాక్యమును ప్రకటింపజేస్తున్నాడు. దేవుని దీర్ఘశాంత కాలములో (1) ఓడ సిద్ధపరచబడింది (2) అవిధేయులైనవారి యొద్దకు అనగా, చెరలో ఉన్న ఆత్మలకు వాక్యము ప్రకటింపబడింది. నోవహు వయస్సు 500 యేండ్లు నిండిన తరువాత కేవలం దేవుని కృప పొందినవాడు; ఆ తరువాత కొన్ని సంవత్సరాలు గడిచి, నోవహు వయస్సు 600 యేండ్లు వచ్చేసరికి ఆయన నీతిమంతునిగా మారాడు. ఆ నీతిని కొన్ని సంవత్సరాల కాలములో ఆయన ఓడ సిద్ధపరచుచూ, అదివరకు చూడని సంగతులను విశ్వాసము చేత నమ్మి, స్థిరముగా వాటియందు నిలిచి, చాలా దృఢమైన నమ్మకంతో సంపాదించుకున్నాడు. ఆనాడు నోవహు చేతిలో వాక్యం లేదు; తన చుట్టూ యాజకులు, ప్రవక్తలు లేరు; కానీ నోవహు తాను అభిషేకింపబడిన దానిని బట్టి దేవుని వాక్యాన్ని ప్రకటిస్తున్నాడు. అలా ప్రకటించడమే నీతి సంపాదించుకోవడం.

**ఆదికాండము 7 : 1- 'యెహోవా- ఈతరమువారిలో నీవే నా యెదుట నీతిమంతుడవై యుండుట చూచితిని గనుక నీవును నీ యింటి వారును ఓడలో ప్రవేశించుడి.'** దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు, సంవత్సరాల కాలము దేవుడు ఎదురు చూచినప్పుడు, నోవహు అందరి యొద్దకు వెళ్లి వాక్యమును ప్రకటిస్తూ, తాను నీతిని సంపాదించుకుంటున్నప్పుడు, ఇంత చేసినా ఆ తరములో ఒక్కడు కూడా మారలేదు. కేవలం నోవహు కుటుంబం మాత్రమే మార్పును పొందింది. అందుకే దేవుడు నోవహుతో నీవొక్కడివే నీతిమంతుడవు అంటున్నాడు. ఈ తరము వారిలో నీవే నీతిమంతుడవు అంటున్నాడు. నోవహు అంత గొప్పగా నీతిని సంపాదించుకోగలిగాడు. ఆ తరములో నోవహు యొక్క ఈ ప్రవర్తనను చూచి ఎవరూ ఆయనతో పాటు రాలేదు. ఆయన ఒక ప్రక్క ఓడ తయారు చేస్తున్నా, తయారు చేస్తున్నప్పుడు ఆయన్ను చూచి ఎవరూ మార్పు నొందలేదు. ఓడ కట్టుకుంటున్న నోవహును పిచ్చివాడు అనుకున్నారు. వాక్యమును ప్రకటిస్తున్న నోవహును వెర్రివాడు అనుకున్నారు. ఎందుకని ఏ ఒక్కడూ నోవహు వెంట రాలేదు? సంవత్సరాల కాలములో

ఒక్కడు కూడా మారలేదంటే అది చాలా ఆశ్చర్యం! ఇక దేవుడు తుది నిర్ణయానికి వచ్చి నోవహుతో - నీవే నా యెదుట నీతిమంతుడవు, నీవును నీ యింటివారును ఓడలో ప్రవేశించండి అంటున్నాడు. దేవుడు ముందుగా నిర్ణయించిన మిగిలిన జీవులు జతలు జతలుగా వస్తాయి తప్ప, ఇక మారని మనుష్యులలో ఎవరూ రావడానికి వీలులేదు అన్నాడు. ఇది ఆనాటి పరిస్థితి! ఈనాటి పరిస్థితి కూడా సరిగ్గా ఇలాగే ఉంటుందంటారా? అవును. అప్పటి పరిస్థితిని చదువుకుని ఇప్పుడు జ్ఞానాన్ని ఖచ్చితంగా నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతోనే నేటికీ ఈ దేవుని మాటలు మనుష్యుల మధ్య సజీవంగా ఉన్నాయి.

**మత్తయి సువార్త 24 : 37- 'నోవహు దినములు ఏలాగుండెనో మనుష్యకుమారుని రాకడయు ఆలాగే ఉండును.'** అవును! అచ్చం అలాగే ఉంటుంది. ఆ రోజు ఏం జరిగిందో, ఈ రోజు కూడా అదే జరుగుతోంది. మరి ఈ రోజు ఓడ ఎక్కడా కనిపించడంలేదేమిటి అనుకుంటున్నారా? ఆనాడు నోవహు, భౌతికమైన జలప్రళయాన్ని తప్పించుకోవడానికి భౌతికమైన ఓడను తయారు చేసాడు. ఈనాడు నేను, మరికొంతమంది నీతమంతులైన దేవుని సేవకులు, ఆత్మసంబంధమైన నరకమును తప్పించుకోవడానికి ఆత్మసంబంధమైన సంఘమనే ఓడను తయారుచేస్తున్నాము. మా చుట్టూ నివసిస్తున్న తరాలకు దేవుని వాక్యమును ప్రకటిస్తున్నాము. ఈనాడు కూడా యేసు వెళ్లి సుమారు 2000 సం॥లు గడిచినా, యేసు రెండవ రాకడ విషయమై దేవుడు దీర్ఘశాంతముతో ఉన్నాడు. ఈ దేవుని దీర్ఘశాంత కాలములో సంఘమనే ఓడను తయారుచేస్తున్నాము, దేవుని వాక్యమును స్వచ్ఛమైనదిగా ప్రకటిస్తున్నాం. నోవహు దినములు ఏలాగుండెనో మనుష్య కుమారుని రాకడయు అలాగే ఉండును అనడానికి ఇదే నిదర్శనం.

**మత్తయి సువార్త 24 : 38- 'జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినమువరకు, వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచునుండి జలప్రళయమువచ్చి అందరిని కొట్టుకొనిపోవు వరకు ఎరుగక పోయిరి; ఆలాగుననే మనుష్యకుమారుని రాకడ ఉండును.'** నోవహు ఓడలోనికి వెళ్ళిన దినము వరకు అనగా, నోవహు వయస్సు యొక్క 600 యేండ్లు, 2వ నెల, 17వ తేది వరకు, ఆ జలప్రళయమునకు ముందటి దినములలో ఆనాటి జనులు ఇంకా చెరలోనే ఉన్నారు. వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచు జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకుని పోవువరకు ఇది దేవుని ప్రణాళిక అని ఎరుగకపోయిరి. కనీసం ఒక్కడికైనా మార్పులేదు! ఒకవైపు నోవహు తన కుటుంబముతోపాటు ఓడలోనికి వెళ్లాడు. ఆ జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొని పోవు వరకు వారు తెలుసుకోలేకపోయారు. అచ్చం ఆలాగుననే మనుష్యకుమారుని(యేసు) రెండవ రాకడ కూడా ఉంటుంది. చెరలో ఉన్న ఆత్మలు చెరలో ఉన్నట్టుగానే ఉండిపోతారు. వారు ఉన్నపాటునే నాశనానికి దిగిపోతారు. దేవుని లెక్క ప్రకారం ఒకానొక కాలమున యేసుక్రీస్తు వస్తాడు, నీతిమంతులను మాత్రమే పరలోకానికి తీసుకుని వెళతాడు. ఈ సంగతులను గ్రహించినవారు, నోవహు ఓడలోని రహస్యమును తెలుసుకున్నవారు, ఈలోపు నీతిని సంపాదించాలి. ఒక ప్రక్క తన రక్షణ ఓడను సిద్ధపరచుకుంటూ, మరో ప్రక్క నీతిని సంపాదించుకోవాలి. అనగా, మన తరములో అనేకమందికి దేవుని వాక్యమును ప్రకటించాలి. ప్రకటించిన వాక్యమును బట్టి వారు మారారా, లేదా? అన్నది ప్రకటించిన వానికి అనవసరం! ఆనాడు నోవహు దగ్గరైతే కేవలం ఒక్కడు కూడా మారలేదు. అలాగని నోవహు వాక్యమును ప్రకటించాడా? లేదా? ప్రకటించాడు. సంవత్సరాల కాలముగా నోవహు దేవుని వాక్యమును ప్రకటించాడు. నోవహు నీతిని సంపాదించుకోవడానికి మాత్రం శతవిధాలా ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. మనము కూడా అలాగే ఉండాలి. అందుకే నోవహు ఓడ రహస్యాలన్నీ దృష్టాంతములుగా వ్రాయబడ్డాయి. మన కొరకు ఈరోజు ఒక చరిత్రగా బైబిల్ గ్రంథంలో మనకు కనిపిస్తున్నాయి.

ప్రియులారా, మనము దేవుని రక్షణ ఓడ ఎక్కాలి అంటే కేవలం క్రీస్తు ద్వారా కృప పొందినంత మాత్రాన సరిపోదు. క్రీస్తును లోకానికి ప్రకటించుట ద్వారా నీతిని కూడా సంపాదించుకోవాలి. మనము నీతిమంతులు అయితేనే పరలోక రాజ్యములో అడుగుపెడతాము. మన కష్టాన్ని, మన కాలాన్ని మన చుట్టూ ఉన్న తరానికి ధారపోయాలి. చెరలోనున్న వారిని విడిపించడానికి మనము కష్టపడాలి. ఆ ప్రయత్నమును మనము చేయాలి. మనము దేవుని ఆత్మచేత అభిషేకించబడి దేవుని వాక్యాన్ని ప్రకటించి జనులకు చెరలో నుండి బయటకు వచ్చే అవకాశమును కల్పించాలి. వారు రక్షణలోనికి రానంటే మనము ఏమీ చేయలేము. వారు వచ్చిన పక్షంలో వారు కూడా రక్షణ ఓడను ఎక్కే అవకాశం వారికి ఉంటుంది.

కానీ, మన మట్టుకు మనము నీతిని సంపాదించుకోవాలి. దేవుని దీర్ఘశాంతమును ఇప్పటికీ మనము చూస్తున్నాం. ఆయన దీర్ఘశాంతాన్ని ఇంకా మనము చూడడానికి కారణం ఏమిటంటే, ఇది దేవుడు మనము నీతిని సంపాదించుకోడానికి ఇచ్చిన ఒక అద్భుత అవకాశం. ఈ దీర్ఘశాంత కాలంలో మనము ఖచ్చితంగా నీతిని సంపాదించుకోవాలి. రక్షణ ఓడను సిద్ధం చేసుకోవాలి. మీ ఓడ సిద్ధమైందా? ఉన్నపాటున యేసు రెండవ రాకడ జరిగితే పరలోకానికి వెళ్ళగలమన్న ధీమా మీకు వచ్చిందా? మీరు బైబిల్ పరిశోధనలో మునిగి తేలాలి. పరలోకపు తండ్రియైన దేవుని సంకల్పం మీకు పూర్తిగా అర్థం కావాలి. అదే మిమ్మల్ని రక్షించే ఓడ! బాప్తిస్మమును తీసుకున్ననాడు మనమంతా దేవుని కృపను పొందినవారమయ్యాము. ఇక మనము పరలోకంలో అడుగుపెట్టాలంటే దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు, మనము రక్షణ ఓడను కట్టుకుంటూ మరోప్రక్క మన చుట్టూ ఉన్న ఆత్మలను రక్షిస్తూ మన విశ్వాస జీవితంలో గొప్ప గొప్ప మైలు రాళ్లను మనము అందుకోవాలి. దేవుడు మన కొరకు ఒక సింహాసనమును సిద్ధం చేయాలి. నోవహు ఓడ యొక్క పాఠం మన జీవితాన్ని మార్చగలగాలి. మన విశ్వాస జీవితమును ఒక గొప్ప మలుపు త్రిప్పగలగాలి. ఈ ఓడ రహస్యం తెలిసినా కూడా మనము ఇంకా అనీతిమంతులుగా మిగిలిపోవడానికి వీలులేదు. మన జీవితములో మిగిలియున్న ఈ కొద్ది రోజులను మనము నీతిమంతులుగా మారడానికి ఉపయోగించుకోవాలి. మనము దేవుని నుండి నేర్చుకున్న ప్రతిమాట మన జీవితానికి ఎంతగానో ఉపయోగపడాలి. అనేకమందికి దేవుని వాక్యమును ప్రకటిస్తూ, క్రీస్తు సువార్తను వ్యాప్తి చేసేవారిలో మనము కూడా ఉంటూ, ఈ విధముగా నీతిని సంపాదించుకుంటూ దేవుడు నిర్మించిన ఆ మహా లోకానికి వెళ్లాలి.

--------×-------

## ప్రశ్నలు

**1) నోవహు కాలములో దేవుడు భూమిపై జల ప్రళయమును రప్పించుటకు గల కారణములను చర్చించండి.**

**2) దేవుని దృష్టిలో నోవహు కృప పొందినవాడు; దేవుని దృష్టిలో నోవహు నీతిమంతుడు; ఈ రెండు వాక్యములను వివరించగలరు.**

**3) దేవుని వాక్యముపై నోవహుకున్న విశ్వాసమును వివరించండి.**

**4) దేవుడు నోవహుతో జల ప్రళయము నిమిత్తము ఓడను తయారు చేయమన్న విధానమును వివరించండి.**

**5) నోవహు ఓడను తయారుచేయుటకు పట్టిన కాలమెంత? ఈ కాలములో నోవహు ఏమి చేసాడు?**

**6) దేవుని దీర్ఘశాంతము యొక్క ఔన్నత్యమును వివరించండి.**

**7) నోవహు జల ప్రళయ దినములకు, యేసు రెండవ రాకడ దినములకు మధ్యగల సారూప్యతను వివరించండి.**

# 4. సమస్తము ఎవరికి సాధ్యము?

సమస్తము ఎవరికి సాధ్యమని మీరనుకుంటున్నారు? లోకానుసారముగా ఆలోచిస్తే కొన్ని సమాధానములు మన కళ్లముందుకొస్తాయి.

♦రాజులకు ♦సంపన్నులకు ♦అధికారులకు ♦బలవంతులకు

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువేమిటి? అనే సామెతను మీరు వినే ఉంటారు. ధనవంతులు కోరుకుంటే కొండ మీది కోతి దిగి రాదా? అంటుంటారు. అధికారికి తలవంచనివాడెవడు అంటుంటారు. బలవంతుని బలానికి లొంగనిదేది అనుకుంటారు. ఇలా ఆయా వ్యక్తులను చూపిస్తూ వారికి సమస్తము సాధ్యమే అనే భ్రమలో మనుష్యులున్నారు. ఎవ్రిథింగ్ ఈజ్ పాజిబుల్ అంటూ మనిషి అప్పుడప్పుడు సూక్తులు చెబుతుంటాడు. సాధన చేస్తే ఏదైనా సాధ్యమే అంటాడు. కానీ, నేటికీ మనిషికి అసాధ్యమైనవి ఎన్నో ఉన్నాయి. ఇక దేవుని జ్ఞానానుసారముగా ఆలోచించి సమస్తము ఎవరికి సాధ్యమో ఈ పాఠములో ఖచ్చితమైన వివరములతో తెలుసుకుందాము. ఈ ప్రశ్నతో బైబిల్ గ్రంధమును పరిశీలించినప్పుడు ఒక సమాధానము మనకు కనిపిస్తుంది.

**మార్కు సువార్త 14 : 36** యేసుక్రీస్తు దేవునికి ప్రార్థన చేస్తూ - 'నాయనా తండ్రీ, నీకు సమస్తము సాధ్యము అంటున్నాడు.' ఈ భూమి మీద దేనినైనా సాధ్యపరచుకోగలిగినది ఎవరు అనగానే మొట్టమొదటి సమాధానము పరలోకపు తండ్రి! అది ఏదైనా సరే, సమస్తము దేవునికి సాధ్యమే! మీ మనస్సులో ఏదైనా ఒక ప్రశ్న పుడితే, ఆ ప్రశ్న సాధ్యమా కాదా అని పరలోకపు తండ్రి దగ్గరకు వెళ్లి అడిగితే దానికి ఖచ్చితంగా సమాధానము దొరకుతుంది. ఈ సకల చరాచర సృష్టిలో దేనినైనా ఆయన సాధించగలడు. పైన ఆకాశం, క్రింద భూమి, భూమి క్రింద పాతాళం - ఏ లోకమందైనా ప్రతిదానికి అద్భుతమైన సమాధానము పరలోకపు తండ్రి దగ్గర ఉంది. ఇది ఆయనకున్న ఒక గొప్ప అర్హత మరియు ఆధిక్యత. ఆయనను గూర్చి వ్రాయబడిన మరొక మాటను కూడా ఆలోచిద్దాం.

**యిర్మీయా 10 : 16 'యాకోబునకు స్వాస్థ్యమగువాడు వాటివంటివాడు కాడు; ఆయన సమస్తమును నిర్మించువాడు, ఇశ్రాయేలు ఆయనకు స్వాస్థ్యముగానున్న గోత్రము; సైన్యములకధిపతియగు యెహోవాయని ఆయనకు పేరు.'** పరలోకమందున్న తండ్రి సమస్తమును నిర్మించువాడు గనుక ఆయన నిర్మించిన వాటన్నింటిలో ఆయనకు సమస్తము సాధ్యము. ఆయన సమస్తమును నిర్మించినవాడు కాకుంటే ఆయనకు సమస్తము సాధ్యము కాదు. సమస్తమును ఆయనే నిర్మిస్తే ఆయనకు సమస్తము సాధ్యమే! ఉదాహరణకు, మీ ఇంటిలో వాషింగ్‌మిషన్‌కి రిపేర్ వస్తే ఎవరిని పిలుస్తారు? వాషింగ్ మెషిన్ మెకానిక్‌ని పిలుస్తారు. అందుకే మీరు ఏదైనా ఒక వస్తువును కొనుక్కున్నప్పుడు షాపు వారు ఇచ్చిన బిల్ మీద ఒక చిరునామా లేక కాంటాక్ట్ నంబర్ వ్రాసి ఇస్తారు. ఎందుకంటే, భవిష్యత్తులో ఆ వస్తువుకు ఏదైనా సమస్య వస్తే వారిని మాత్రమే మనము సంప్రదించాలి. సాధారణ వ్యక్తులు ఆ వస్తువును నిర్మించలేరు గనుక అందులో ఉన్నటువంటి రహస్యాలు వారికి తెలియదు. దానిని బాగు చేయడం వారికి సాధ్యము కాదు. దానిని నిర్మించిన వానికైతే అది సాధ్యము. అది ఎంత పెద్దదైనా ఎంత చిన్నదైనా నిర్మాణకుడు మాత్రమే దానిని చక్కపరచగలడు. ఈ ప్రకృతిలో సాధ్యాసాధ్యాలను గూర్చి మీరు ఆలోచించినప్పుడు నాకు సమస్తము సాధ్యమే అనదగినవారు ఎవరైనా ఉన్నారు అంటే ఆయన పరలోకమందున్న తండ్రి! మరొక వాక్యమును చూడండి.

**కీర్తనలు 115 : 3 'మా దేవుడు ఆకాశమందున్నాడు. తనకిచ్ఛవచ్చినట్లుగా సమస్తమును ఆయన చేయుచున్నాడు.'** చూసారా! పరలోకపు తండ్రిని గూర్చి ఎంత గాంభీర్యమైన మాట పలుకబడిందో! ఆయన గొప్పతనమును గూర్చి ఎంత చక్కగా వ్రాయబడిందో! దేవుడు ఆకాశమందు ఉన్నాడు అనగా ఆయన అన్నింటికి పైగా ఉన్నాడని అర్థం. ఆయన

తనకిష్టమొచ్చినట్లు సమస్తమును చేయుచున్నాడు. ఆయన పరిధిలోనికి రానిదంటూ ఏదీ లేదు. ఆయన తనకిష్టమొచ్చినట్లుగా సమస్తమును జరిగించుచున్నాడు. మరొకమాట చూద్దాం.

**1 దినవృత్తాంతములు 29 : 11, 12 'యెహోవా, భూమ్యాకాశములయందుండు సమస్తమును నీ వశము. మహాత్మ్యమును పరాక్రమమును ప్రభావమును తేజస్సును ఘనతయు నీకే చెందుచున్నవి. యెహోవా, రాజ్యము నీది; నీవు అందరిమీదను అధిపతిగా నిన్ను హెచ్చించుకొనియున్నావు. ఐశ్వర్యమును గొప్పతనమును నీవలన కలుగును. నీవు సమస్తమును ఏలువాడవు; బలమును పరాక్రమమును నీ దానములు హెచ్చించువాడవును; అందరికి బలము ఇచ్చువాడవును నీవే!'** భూమి మరియు ఆకాశము వాటియందున్న సమస్తము పరలోకమందున్న తండ్రి వశము. ఎందుకంటే, ఆయనే వాటన్నిటిని నిర్మించినవాడు. అవి నక్షత్రాలైనా, గ్రహాలైనా, చీకటి బిళములైనా... అంతా ఆయన గుప్పిట్లోనే ఉంది. ఈరోజు శాస్త్రవేత్తలకు తెలియని దానికోసం పరిశోధనల పేరిట లక్షల కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నారు. అంగారకుని మీద ఏముంది? అక్కడ నీళ్లున్నాయా లేదా? చంద్రుని మీద వాతావరణం ఎలా ఉంది? ఇలా వీటిని తెలుసుకోవటానికి 'నాసా' అనేటటువంటి అమెరికాకు చెందిన ఒక అంతరిక్ష పరిశోధన సంస్థ ఎన్నో ప్రయోగాలు చేస్తోంది. కోట్ల డాలర్లను ఈరోజు వాటి కొరకు ఖర్చుపెడుతుంది. ఇంతకీ ఇదంతా ఎవరిది? పరలోకమందున్న తండ్రిది. ఆయన అన్ని విషయాలలో గొప్పవాడు, ప్రథముడు. ఆయనను గూర్చి సర్వమానవాళికి పూర్తిగా అర్థమవ్వాలి. ఆయనతో ప్రతి ఒక్కరు మంచి సంబంధాన్ని కలిగి ఉండాలి. ఈరోజు ప్రకృతి వలన మనిషి కీడు అనుభవించడానికి కారణం, మనిషికి దేవునితో సంబంధము తెగిపోవడమే. దేవుడు సమస్తమును ఎరిగినవాడు, సమస్తమును ఇచ్చేవాడు, సమస్తమును సాధ్యపరచుకోగలిగినవాడు. ఈ ప్రపంచం మొత్తంగా దేవుని పాదాల మీద పడితే ఆయన సమస్తమును సాధ్యపరచి మనిషి చేతికిస్తాడు. కాని నేడున్న మనిషికి ఆ ఆలోచన లేదు. దేవుని యొద్దకు వెళ్లాలనుకునే మనస్సు మనిషికి లేదు. ఇక, సమస్తము ఎవరికి సాధ్యం? అనగానే మనకు ఇప్పటివరకు లభించిన ఆధారములనుబట్టి పరలోకమందున్న తండ్రికి సమస్తము సాధ్యమే అని మనకు అర్థమైంది. పరలోకమందున్న తండ్రి తరువాత ఇంకా సమస్తమును సాధ్యపరచుకోగలిగిన వారు ఎవరైనా ఉన్నారా? చూద్దాం.

**మత్తయి సువార్త 11 : 27 'సమస్తమును నా తండ్రిచేత నాకు అప్పగింపబడియున్నది. తండ్రిగాక ఎవడును కుమారుని ఎరుగడు; కుమారుడు గాకను కుమారుడెవనికి ఆయనను బయలుపరచనుద్దేశించునో వాడు గాకను మరి యెవడును తండ్రిని ఎరుగడు.'** ఈ సకల చరాచర సృష్టిలో పరలోకమందున్న తండ్రి తరువాత, అంతటివాడు ఆయన కుమారుడు మాత్రమే. ఆ కుమారుడు ఏమంటున్నాడంటే, పరలోకమందున్న తండ్రిని గూర్చి ఏ ఒక్కరికీ తెలియదు అంటున్నాడు. ఆయన తన కుమారునికి మాత్రమే తెలుసు. కుమారుడు ఎవరికైతే తండ్రిని పరిచయం చేస్తాడో వారికి మాత్రమే తెలుసు. పరలోకపు తండ్రి ఎవరికైతే పూర్తిగా తెలుసో వారికి సమస్తము సాధ్యమవుతుంది. ఈ లోకసంబంధముగా కూడా మనకు అధికారము లేకపోయినా, అధికారము కలిగిన వ్యక్తి మన తరపున ఉంటే మనకుండే ధైర్యమే వేరు. ఏ పనైనా ఇట్టే జరిగిపోతుంది. పరలోకపు తండ్రికి సమస్తము సాధ్యమైనప్పుడు, ఆయన తరపున ఎవరు ఉంటే వారికి కూడా సమస్తము సాధ్యమే కదా. పరలోకపు తండ్రికి ఎవరు తెలుసో వారికి ఇటువంటి ఆధిక్యతను ఆయన కల్పిస్తున్నాడు. తండ్రి వారికి తెలిసిన స్థాయిని బట్టి వారికి ఏ స్థాయిలో దేనిని సాధ్యపరచాలో దానిని సాధ్యపరుస్తున్నాడు. మీకు పరలోకపు తండ్రి కొద్దిగా మాత్రమే తెలుసు అనుకుంటే, మీకు కొద్దిగానే సాధ్యమవుతుంది. సమస్తము సాధ్యపరచుకోగలిగిన పరలోకపు తండ్రి మీకు బాగా తెలిసుండాలి. మీతో ఆయనకు మంచి సంబంధం ఉండాలి. లేదంటే మీకు ఏదీ సాధ్యం కాదనే చెప్పాలి. పరలోకపు తండ్రి తన అద్వితీయ కుమారుడైన యేసుకు సమస్తాన్ని అప్పగించాడు. ఎందుకంటే యేసుకు తప్ప ఇంకెవరికీ తండ్రిని గూర్చి అంతగా తెలియదన్నమాట. అందునుబట్టి, సమస్తము ఎవరికి సాధ్యం? అనగానే పరలోకపు తండ్రిని బాగుగా ఎరిగిన వారికి సాధ్యమే; అందులో మొదటివాడు దేవుని వాక్యమైన క్రీస్తు యేసు!

**యోహాను సువార్త 3 : 35 'తండ్రి కుమారుని ప్రేమించుచున్నాడు గనుక ఆయన చేతికి సమస్తము అప్పగించియున్నాడు.'** పరలోకపు తండ్రి తన అద్వితీయ కుమారునికి సమస్తమును ఎందుకిచ్చాడు? ఆయన తన కుమారుని ప్రేమిస్తున్నాడు. నీకు సమస్తము సాధ్యమనే అర్హత, ఆధిక్యత తండ్రి తన కుమారునికి ఇచ్చాడు. యేసు బాప్తిస్మమును

పొందినప్పుడు - 'ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు; ఈయనయందు నేనానందించుచున్నాను అని తండ్రి పరలోకమునుండి పలుకుతున్నాడు'.**(మత్తయి సువార్త 3 : 17)**ఈ విధముగా తండ్రి యేసును ప్రేమించిన దానినిబట్టి, యేసుకు కూడా తండ్రి వలన సమస్తము సాధ్యమే.

**యోహాను సువార్త 13 : 3 'తండ్రి తన చేతికి సమస్తము అప్పగించెననియు, తాను దేవుని యొద్దనుండి బయలుదేరి వచ్చెననియు దేవుని యొద్దకు వెళ్లవలసి యున్నదనియు యేసు ఎరిగి...'** యేసు దేవునియొద్దనుండి బయలుదేరి వచ్చాడు. తండ్రి తన చేతికి సమస్తము అప్పగించాడని ఆయనే తెలియజేస్తున్నాడు. ఆ సమస్తాన్ని తండ్రి చేతుల్లోనుంచి తీసుకొని దానిని భద్రముగా కాపాడుకొంటున్నాడు. ఆ అధికారమును యేసు జాగ్రత్తగా ఉపయోగిస్తున్నాడు. తన స్వప్రయోజనానికి ఏమాత్రం దానిని ఆయన వాడుకోవటంలేదు. తనకు దేవుడిచ్చిన ఆ ఆధిక్యతను మనుష్యులకు ఆత్మజ్ఞానమును నేర్పించుట కొరకు మాత్రమే వాడుతున్నాడు. ఒకడు పుట్టుకతో గ్రుడ్డివాడైతే వాడికి కళ్లు ఇచ్చేసాడు. దయ్యం పట్టిన వారినుండి దయ్యాలను వెళ్లగొట్టాడు. రక్తస్రావము కలిగిన స్త్రీకి ఆరోగ్యాన్నిచ్చాడు. చనిపోయిన శవం ఎదురుగా వస్తే ఆ శవాన్ని బ్రతికించాడు. లాజరు చనిపోయి సమాధిలో ఉంచబడితే, నాలుగు దినములు గడచినా సరే సమాధి నుండి సజీవముగా బయటకు తీసుకొచ్చాడు. మానవ మాత్రునికైతే ఇన్ని సాధ్యమా? యేసు దేవుని కుమారుడు; అనగా పరలోకపు తండ్రిపై పూర్తి అవగాహన కలిగినవాడు. ఆ తండ్రి సమస్తమును ఈయన చేతికప్పగించాడు. సమస్తమును సాధ్యపరచుకోగలిగిన ఆ శక్తిని యేసు కేవలం దేవుని వాక్య ప్రకటన కొరకు వినియోగిస్తున్నాడు. మానవ సమాజంలో దేవుని వాక్యమును స్థిరపరచడానికి ఆయన ఆ శక్తిని వినియోగిస్తున్నాడు. అంతే తప్ప, యూదులు ఆయనను సిలువ వేసినప్పుడు దాని నుండి తప్పించుకోవడానికి ఆ శక్తిని వినియోగపరచలేదు. ఆయనకు సమస్తము సాధ్యమే అయినా మానవాళి పాపముల నిమిత్తం శిక్షను తప్పించుకోవడానికి ఆయన ప్రయత్నించలేదు. ఆయన తన స్వప్రయోజనము కొరకు కాకుండా దేవుని వాక్య నెరవేర్పు కొరకు సమస్తమును వినియోగించాడు. పరలోకమందున్న తండ్రికి సమస్తము సాధ్యం. ఆయన కుమారుడైన యేసుకు సమస్తము సాధ్యం. అలాగే, దేవుని పరిశుద్ధాత్మకు కూడా సమస్తము సాధ్యమే. ఎందుకంటే, అద్వితీయ కుమారుడైన యేసు తరువాత ఆయన కూడా కుమారుని ఆత్మగా ఉన్నాడు. తన్ను ఎరిగిన కుమారునికి ఆయన సమస్తమును సాధ్యపరుస్తాడు గనుక పరిశుద్ధాత్మకు కూడా సమస్తము సాధ్యమే. ఇంకా సమస్తమును సాధ్యపరచుకోగలవారు ఎవరైనా ఉన్నారా? యేసును వెంబడించిన శిష్యులకు సమస్తము సాధ్యమేనా? చూద్దాం.

**మార్కు సువార్త 9 : 14- 'వారు శిష్యులయొద్దకు వచ్చి, వారి చుట్టు బహు జనులు కూడియుండుటయు శాస్త్రులు వారితో తర్కించుటయు చూచిరి. వెంటనే జనసమూహమంతయు ఆయనను చూచి, మిగుల విభ్రాంతినొంది ఆయనయొద్దకు పరుగెత్తికొనివచ్చి ఆయనకు వందనము చేసిరి. అప్పుడాయన - మీరు దేని గూర్చి వారితో తర్కించుచున్నారని వారిని అడుగగా, జనసమూహములో ఒకడు - బోధకుడా, మూగ దయ్యము పట్టిన నా కుమారుని నీయొద్దకు తీసుకొనివచ్చితిని. అది ఎక్కడ వానిని పట్టునో అక్కడ వానిని పడద్రోయును అప్పుడు వాడు నురుగు కార్చుకొని, పండ్లుకొరుకుకొని మూర్ఛిల్లును. దానిని వెళ్లగొట్టుడని నీ శిష్యులను అడిగితిని గాని అది వారిచేత కాలేదని ఆయనతో చెప్పెను.'** చూసారా! యేసు శిష్యులకు అప్పటికి సమస్తము సాధ్యము కాలేదు. దీనితో అక్కడ తర్కము పుట్టింది. శాస్త్రులు శిష్యులతో వాదము పెట్టుకుంటున్నారు. ఆ పరిస్థితులలో సమస్తమును సాధ్యపరచగల యేసు అక్కడికి వచ్చాడు. అందుకాయన ఏమంటున్నాడో చూడండి. సమస్తము సాధ్యమవ్వాలంటే, ఏమి ఉండాలో గమనించండి.

**మార్కు సువార్త 9 : 19- 'అందుకాయన విశ్వాసములేని తరమువారలారా, నేను ఎంతకాలము మీతో ఉ ందును? ఎంతవరకు మిమ్మును సహింతును? వానిని నా యొద్దకు తీసుకొని రండని వారితో చెప్పగా వారాయనయొద్దకు వానిని తీసికొని వచ్చిరి. దయ్యము ఆయనను చూడగానే, వాని విలవిలలాడించెను గనుక వాడు నేల పడి నురుగు కార్చుకొనుచు పొర్లాడుచుండెను. అప్పుడాయన - ఇది వీనికి సంభవించి యెంతకాలమైనదని వాని తండ్రినడుగగా అతడు- వాని బాల్యమునుండియే; అది వాని నాశనము చేయవలెనని తరచుగా అగ్నిలోను నీళ్లలోను పడద్రోయును. ఏమైనను నీవలననైతే మా మీద కనికరపడి మాకు సహాయము చేయుమనెను. అందుకు యేసు- (నమ్ముట) నీవలననైతే, నమ్మువానికి సమస్తమును**

**సాధ్యమేయని అతనితో చెప్పెను. వెంటనే ఆ చిన్నవాని తండ్రి- నమ్ముచున్నాను. నాకు అపనమ్మకముండకుండ సహాయము చేయుమని బిగ్గరగా చెప్పెను. జనులు గుంపుకూడి తన యొద్దకు పరుగెత్తుకొనివచ్చుట యేసు చూచి- మూగవైన చెవిటి దయ్యమా వానిని వదిలిపొమ్ము. ఇక వానిలో ప్రవేశింపవద్దని నీకాజ్ఞాపించుచున్నానని చెప్పి ఆ అపవిత్రాత్మను గద్దించెను. అప్పుడు అది కేకవేసి వానినెంతో విలవిలలాడించి వదలిపోయెను. అంతటవాడు చచ్చిన వానివలె ఉండెను గనుక అనేకులు వాడు చనిపోయెననిరి. అయితే యేసు వాని చెయ్యిపట్టి వాని లేవనెత్తగా వాడు నిలువబడెను.'** పరలోకమందున్న తండ్రి వలన సమస్తమును తన చేతులలో ఉంచుకొన్న యేసుకు అసాధ్యమైనది ఏదీ లేదు. అందుకే యేసు శిష్యులు వెళ్లగొట్టలేకపోయిన మూగదైన చెవిటి దయ్యమును యేసు వెళ్లగొట్టాడు. దయ్యమును వెళ్లగొట్టుటకు ముందుగా యేసు ఏమంటున్నాడో చూడండి. 'నమ్ముట నీవలనైతే నమ్మువానికి సమస్తము సాధ్యమే.' వెంటనే ఆ చిన్నవాని తండ్రి నమ్ముచున్నాను; నాకు అపనమ్మిక లేకుండా సహాయము చేయుమని బిగ్గరగా చెబుతున్నాడు. అప్పుడు యేసు ఆ దయ్యమును వెళ్లగొట్టాడు. ఇది ఈ భూమి మీద సుమారు రెండు వేల సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన. యేసుకు సమస్తము సాధ్యమే; ఎందుకంటే, ఆయన తండ్రిని పూర్తిగా ఎరిగినవాడు. కాని అప్పటికి యేసు శిష్యులకు సమస్తం సాధ్యము కావట్లేదు. ఎందుకంటే, వారింకా పరలోకపు తండ్రిని పూర్తిగా తెలుసుకోలేదు. దైవత్వం ఎవరికైతే పూర్తిగా అర్థమవుతుందో వారికి సమస్తము సాధ్యమే. అలాగని ఏది పడితే దానిని చేయడానికి వారు అధికృతను ఉపయోగించరు. మనుష్యుల రక్షణార్థము మాత్రమే, పరలోకపు తండ్రి అభీష్టము మేరకే దానిని వినియోగిస్తారు. పరలోకపు తండ్రికి సమస్తము సాధ్యం; యేసుకు సమస్తము సాధ్యం; యేసు శిష్యులకు ఇంకా ఆ కాలానికి సమస్తము సాధ్యం కాకపోయింది. అప్పుడాయన తన శిష్యులతో సమస్తమును సాధ్యపరచుకోగలిగే కొన్ని మాటలు చెబుతున్నాడు.

మత్తయి సువార్త 17 : 19- **'తరువాత శిష్యులు ఏకాంతముగా యేసునొద్దకు వచ్చి - మేమెందుచేత దానిని వెళ్లగొట్టలేకపోతిమని అడిగిరి. అందుకాయన - మీ అల్పవిశ్వాసము చేతనే; మీకు ఆవగింజంత విశ్వాసముండినయెడల ఈ కొండనుచూచి - ఇక్కడ నుండి అక్కడికి పొమ్మనగానే అది పోవును. మీకు అసాధ్యమైనది ఏదియునుండదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనెను.'** శిష్యులు యేసు దగ్గరకు ఏకాంతముగా వచ్చి మేమెందుచేత ఆ దయ్యమును వెళ్లగొట్టలేకపోయాము? అని అడిగారు. అంతకు మునుపు యేసే కదా తన శిష్యులకు దయ్యములను వెళ్లగొట్టమని, సువార్తను ప్రకటించమని చెప్పాడు. వారిచేత అన్నీ అవుతాయి అన్నాడు; కాని ఇక్కడకు వచ్చేసరికి మూగదైన చెవిటి దయ్యం వారి వలన వెళ్లలేదు. అందులోను శిష్యులతో శాస్త్రులు ఒకవైపు తర్కిస్తున్నారు. గనుక యేసును వారు ఏకాంతముగా దీనిలోని రహస్యాన్ని అడుగుతున్నప్పుడు ఆయన ఏమంటున్నాడో చూడండి. శిష్యులు ఎన్నటికీ ఆ దయ్యమును వెళ్లగొట్టలేరని ఆయన చెప్పలేదు. అలాంటి దయ్యములను వెళ్లగొట్టాలంటే, వారికున్న విశ్వాసపు స్థాయి సరిపోదని చెబుతున్నాడు. పరలోకపు తండ్రి యేసుకు ఇచ్చిన ఆ అధికారం, సమస్తమును సాధ్యపరచుకోవడం శిష్యులకు సాధ్యమే. కాని, వారికి యేసుపై విశ్వాసం పూర్తి స్థాయిలో లేదు. అందుకు యేసు, మీ అల్పవిశ్వాసము చేతనే మీరు దానిని వెళ్లగొట్టలేకపోయారు. మీకు ఆవగింజంత విశ్వాసం కూడా లేదంటున్నాడాయన. ఆవగింజ ఎంత ఉంటుంది. అది ఆకారంలో చిన్నదే కదా. కనీసం యేసుపై అంతటి విశ్వాసం కూడా అప్పటికి వారికి లేదు. ఒకవేళ వారికి దేవుని కుమారుడైన యేసుపై ఆవగింజంత విశ్వాసము ఉంటే ఈ కొండను చూచి ఇక్కడ నుండి అక్కడకు పొమ్మనగానే అది పోతుంది. ఆవగింజంత విశ్వాసముంటేనే, కొండను చూచి ఇక్కడనుండి అక్కడకు పొమ్మనగానే పోతే; ఆనబకాయంత విశ్వాసముంటే ఊరికి ఊరే కదిలిపోతుందన్నమాట. యేసును విశ్వసిస్తే ఒకనికి అసాధ్యమైనది ఏమిటి? సమస్తము సాధ్యమే. యేసునందు విశ్వాసముంచితే, వారికి పరలోకమందున్న తండ్రి అర్థమవుతాడు, అట్టి వారికి సమస్తము సాధ్యమే. ఒకవేళ సాధ్యం కాలేదు అంటే మీకు ఆయన తెలియదని అర్థం. ఒకవేళ మీకు అసాధ్యమైనది ఏదైనా ఉంది అంటే ఇంకా మీకు ఆయనకు మధ్య సరైన సంబంధము లేదని అర్థం. మీకు సరైన విశ్వాసం లేదని అర్థం. మరొక సందర్భమును చూడండి.

మార్కు సువార్త 11 : 20- **'ప్రొద్దున వారు మార్గమున పోవుచుండగా ఆ అంజూరపుచెట్టు వేళ్లు మొదలుకొని యెండియుండుట చూచిరి. అప్పుడు పేతురు ఆ సంగతి జ్ఞాపకమునకు తెచ్చుకొని - బోధకుడా, ఇదిగో నీవు శపించిన**

**అంజూరపుచెట్టు ఎండిపోయెనని ఆయనతో చెప్పెను. అందుకు యేసు వారితో ఇట్లనెను. మీరు దేవునియందు విశ్వాసముంచుడి. ఎవడైనను ఈ కొండను చూచి - నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుమని, చెప్పి తన మనస్సులో సందేహింపక తాను చెప్పినది జరుగునని నమ్మినయెడల వాడు చెప్పినది జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్నవాటినెల్లను పొందియున్నామని నమ్ముడి. అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను.'** ఆనాడు ఒకానొక సందర్భములో యేసుక్రీస్తు ఒక ఫలించని అంజూరపు చెట్టును శపించారు. ఆయన దానిని శపించిన మరునాడు ఆ చెట్టు వేళ్ళ మొదలుకొని ఎండిపోవడం ఆయన శిష్యులు చూచారు. అప్పుడు పేతురు ముందటి రోజున యేసు ఆ చెట్టును శపించిన సంగతిని జ్ఞాపకమునకు తెచ్చుకొని ఆశ్చర్యపడుతున్నాడు. ఇది చాలా అద్భుతం, ఆయన శిష్యులు దానిని సాధ్యం కాదనుకున్నారు. అప్పుడు ఆయన తన శిష్యులతో 'మీరు దేవునియందు విశ్వాసముంచండి.' అని చెబుతున్నాడు. పరలోకపు తండ్రికి సమస్తము సాధ్యమన్న సంగతిని మొట్టమొదట నమ్మాలి. ఆయన సమస్తమును నిర్మించినవాడు; సమస్తము ఆయన వశములో ఉన్నాయి. కనుక ఒకడు పరలోకపు తండ్రిని నమ్మినట్టయితే, ఆయనయందు విశ్వాసముంచినట్టయితే అతనికి సమస్తము సాధ్యమే. ఒకని విశ్వాసం, ప్రార్థన వాని జీవితములో సమస్తమును సాధ్యపరుస్తుంది అంటున్నాడు యేసుక్రీస్తు. ఇక యేసు చెప్పిన ఆవగింజంత విశ్వాసం ఎలా ఉండాలో దేవుని గ్రంథము నుండి తెలుసుకుందాం.

**యాకోబు 2 : 14 'నా సహోదరులారా! క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పినయెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా?'** అంటే యేసు చెప్పిన ఆవగింజంత విశ్వాసమనగా, ఆ విశ్వాసముతో పాటుగా వారిలో విశ్వాస సంబంధమైన క్రియలుండాలి. కేవలం నాలుకతో నాకు విశ్వాసముందని చెప్పటం వలన ఏమీ జరుగదు. ఎన్నెన్నో గొప్ప గొప్ప మాటలు చెప్పినా, క్రియలు లేని విశ్వాసం వలన ప్రయోజనం శూన్యం. లోక సంబంధమైన చరిత్రలోనే ఎన్నో అసాధ్యాలను సుసాధ్యం చేసిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు, ఒకనాడు మనిషి గాలిలో ఎగరటం, ప్రయాణించడం అసాధ్యం. గాలిలో ఎగురుతున్న పక్షులను చూచి భలే అనుకున్న మనిషి, నేనెప్పుడు ఎగురుతానో అలా అని ఆశపడేవాడు! ఆ తర్వాత కొంతకాలానికి గాలిలో ఎలాగైనా ఎగరాలనే గట్టి నమ్మకం మరియు దానికి సంబంధించిన ప్రయత్నాలు చేసే 'రైట్ బ్రదర్స్' వచ్చారు. ముందుగా వారి ఆలోచనలలో మనిషి గాలిలో ప్రయాణం చేయాలనే నమ్మకాన్ని కలిగి అ తరువాత ఆ నమ్మకాన్ని తమ క్రియలలో చూపిస్తూ పక్షిలాగే రెక్కలు కలిగినటువంటి విమానాన్ని తయారుచేసారు. పక్షి ఆకారంలోనే విమానాన్ని తయారు చేస్తే అది ఎగురుతుందనే ఆలోచన వారిలో ఉంది. మూతి సూదిగా, గాలి ఘర్షణను ఎదుర్కొనేటట్టుగా, అటూ ఇటూ సరితూగాలంటే అటువైపున ఒక రెక్క, ఇటువైపున మరొక రెక్క, గాలిలో ఏ ప్రదేశంలోనైనా మలుపు(టర్నింగ్) తీసుకోవాలంటే రెక్కలు తమకు నచ్చినట్టుగా కదలికలు కలిగి ఉండేటట్టుగా, ఇక చివరగా విమానాన్ని పూర్తిగా అదుపు చెయ్యటానికి వెనక ఒక తోక లాంటి నిర్మాణాన్ని చేసారు. ఒకవేళ ఆ రైట్ సహోదరులు తమ విశ్వాసాన్ని కేవలం మాటల వరకే పరిమితం చేసి ఉంటే మనిషి ఎప్పటికీ ఎగరలేకపోయి ఉండేవాడు. అది అసాధ్యంగానే ఉండిపోయేది. ఈ రోజు మనిషి కొన్ని గంటల వ్యవధిలో సునాయాసంగా దేశాంతర ప్రయాణాలు, ఖండాంతర ప్రయాణాలు చేయగలుగుతున్నాడంటే అది విమాన ప్రయాణాల వల్లనే కదా. ఒకప్పుడు మనిషికి అసాధ్యమైనది సుసాధ్యంగా మారింది. ఎలా అంటే, మొదట దేవుని ఆమోదం, ఆ తరువాత మనిషికున్న విశ్వాసము మరియు అతని క్రియలు. అలాగని మనిషి తాననుకున్న ప్రతిదానిని దేవుని అభీష్టము లేకుండా తనపై తనకున్న విశ్వాసము మరియు క్రియలనుబట్టి సాధించగలడా అంటే కాదనే చెప్పాలి. దీనికి కూడా కొంత పరిమితి ఉంది. భూమి మీద మనిషి తన అవసరాలను తీర్చుకునే ప్రయత్నంలో వాటికి దేవుని ఆమోదం తెలిపితే తప్ప ఏదీ జరగదు. సమస్తమును సాధ్యపరచగల పరలోకపు తండ్రిదే తుది నిర్ణయం. అలా కాని పక్షంలో ఈ రోజు ఎన్నింటినో మనిషి సాధించాలనే ప్రయత్నాలు చేస్తూ సంవత్సరాలుగా వాటిలో విఫలమవుతున్నాడంటే దానికి కారణం, దేవుని ఆమోదం ఆ ప్రయత్నాలకు లేదని నిస్సందేహంగా చెప్పొచ్చు. దేవుని వాక్యములో పరలోకపు తండ్రి మనస్సు తెలుసుకొని దానికి అనుగుణంగా మనిషి ప్రయత్నాలు ఉండాలి.

ప్రియులారా! దేవుని కృప వలన ఈ భూమి మీద మనిషి అసాధ్యం అనుకొన్న వాటిని తన జీవితంలో

సుసాధ్యం చేసుకుంటున్నాడు. కానీ ఇప్పటికీ అదే మనిషి దేవుని కృపను దూరం చేసుకుంటూ ఒక విషయంలో మాత్రం ఇంకా చాలా దూరంగానే ఉన్నాడు. అదే నిత్య జీవ సాధన! మనిషి మరణించిన తరువాత ఆత్మగా తానెక్కడికి వెళ్లాలనే విషయమును గూర్చి అవగాహన లేకుండా బ్రతుకుతున్నాడు. మనిషి మరణిస్తే అక్కడితో తన కథ సుఖాంతము అయిపోయిందనుకుంటున్నాడు. అక్కడితో జీవితం ముగింపబడుతుందనుకుంటున్నాడు. దీని మీద మనిషికి ఏమాత్రం పరిశోధన లేదు. అందుకే దానిని సాధించలేకపోయాడు. మరణము తరువాతి విషయానికొచ్చేసరికి మాత్రం మనిషి తన చేతులెత్తేసాడు. ఈ లోక సంబంధిగా బ్రతుకుతున్న మనిషి దేవుని యొద్దకు, ఆయన మాటలయొద్దకు రాకపోతే సమస్తాన్ని సాధించలేడు. వానికి ఇంకా అసాధ్యములు చాలానే ఉన్నాయి. ఒక యంత్రంతో పని చేయించుకుంటున్నంత మాత్రాన సమస్తము సాధ్యమైనట్టు కాదు. గాలిలో ఎగిరినంత మాత్రాన మనిషికి సమస్తము సాధ్యం కాదు. మరణం తరువాత ఏం జరుగుతుందో, మరణం తర్వాత ఆత్మ వెళ్లవలసిన లోకమును ఎలా సాధించాలో చెప్పగలిగితే అప్పుడు మనిషి సాధ్యపరచుకున్నట్టు. అందుకే దేవుని పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో తప్ప ఇంకెక్కడా ఏ పుస్తకంలోనూ 'సమస్తము సాధ్యము' అనే మాట కనిపించదు. విద్యార్థులు తాము చదువుకుంటున్న గణితశాస్త్రంలో ఇప్పటికీ కొన్ని అసాధ్యాలున్నాయి; వాటికి ఇప్పటికీ సమాధానాలు తెలియవు. భౌతికశాస్త్రంలో కొన్ని చిక్కు సమస్యలున్నాయి; నేటికీ వాటికి సమాధానము దొరకలేదు. లోక సంబంధమైన శాస్త్రాలలోనే చిన్న చిన్న విషయాలు ఇంకా అసాధ్యములుగానే ఉండిపోయాయి. నాటి నుండి నేటి వరకు ఈ ప్రపంచంలో పరలోకపు తండ్రి యొద్దకు రాని మనిషికి చాలా విషయాలు ఇంకా అసాధ్యములుగానే ఉన్నాయి. మనిషి, సమస్తము సాధ్యమైన పరలోకపు తండ్రిని తెలుసుకోలేదు గనుక, ఆయన కుమారుడైన యేసుక్రీస్తును తెలుసుకోలేదు గనుక నేటికీ అజ్ఞానములోనే ఉండిపోయాడు. నిజముగా పరమందున్న తండ్రిని, ఆయన కుమారుడైన క్రీస్తును తెలుసుకుంటే చిన్న చిన్న విషయాలన్నీ ప్రక్కకు పోయి అసలైన విషయం బయటకొస్తుంది. అదే నిత్యజీవం. ఈ విషయమై అనేకమైనవి తమ వలన సాధ్యమవుతున్న సందర్భములో యేసు శిష్యులకు ఆయన చేస్తున్న సత్యోపదేశమును చూడండి.

**లూకా సువార్త 10 : 20 'అయినను దెయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని వారితో చెప్పెను.'** యేసు తన శిష్యులతో దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషించవద్దంటున్నాడు. మరి వారు దేనిని బట్టి సంతోషించాలి? పరలోకమందు వారి పేరులు వ్రాయబడినందుకు వారు సంతోషించాలి. సమస్తమును సాధ్యపరచుకోగలిగినవాడు చేయగలిగిన అత్యుత్తమమైన పని అదే. ఈ భూమిపై జీవిస్తున్న ప్రతి మనిషి పేరు పరలోకములో తండ్రి దగ్గర ఉన్న జీవగ్రంథమందు లిఖింపబడాలి. అలా లిఖింపబడిన వానికి మాత్రమే సమస్తము సాధ్యమని చెప్పడానికి వీలుంటుంది. ఈ రోజు ఎందరో దైవజనులమని చెప్పుకుంటున్నవారు కూడా ప్రజలకు పట్టిన దయ్యములను వెళ్లగొడతామని, రోగములను వెళ్లగొడతామని, కష్టాలను పోగొడతామని చెబుతున్నారే తప్ప, ప్రతి మనిషి పేరు జీవ గ్రంథమందు లిఖింపబడేలా బోధ చేస్తామని చెప్పలేకపోతున్నారు. ఈ విషయాన్ని ఇక్కడ మీరు చాలా జాగ్రత్తగా పరిశీలించాలి. అసలైనది విడిచిపెట్టి బలహీనమైనవి ఎన్ని చేసినా ప్రయోజనమేమిటి? అందుకే ఆనాడే దేవుని కుమారుడైన యేసు తన శిష్యులకు ఏమి నేర్పిస్తున్నాడో చూడండి. పరలోకపు తండ్రిని, ఆయన కుమారుడైన యేసును తెలుసుకోవడం ప్రారంభిస్తే, అప్పటివరకు మనకు అసాధ్యమైనవి అన్నీ సాధ్యమవ్వటం చూస్తాము. కానీ మన సంతోషము అక్కడితో ఆగిపోకూడదు. అన్నింటికీ మించినది - 'మన పేరు జీవగ్రంథములో లిఖింపబడటం'. ఇది జరుగనినాడు మన వలన ఎన్ని సాధ్యములైనా ఉపయోగము లేదు. అందుకే, యేసు తన శిష్యులతో దయ్యములు మీకు లోబడుతున్నవని సంతోషించవద్దన్నాడు; మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని దానినిబట్టి సంతోషించుడని చెబుతున్నాడు.

ఇంత వరకు ఈ పాఠమును చదివిన మీరు మీ జీవితములో సమస్తమును సాధ్యపరుచుకోవాలని అనుకుంటున్నారా? అయితే, సాధ్యపరుచుకోవడానికి ఇప్పటినుండే మీ నడుమును బిగించండి. ఇక మీదట మీ కంటికి ఏదీ అసాధ్యమైనదిగా ఉండకూడదు. మీ జీవితంలో ఫలానాది మీకు అసాధ్యమని చెప్పటానికి వీలుండకూడదు. అవును,

ప్రభువును తెలుసుకున్నవారికి ప్రతీదీ సాధ్యమే. అయితే, సమస్తమును సాధ్యపరచుకోగల మన సామర్ధ్యమును దేని నిమిత్తము వినియోగించాలో తెలుసుకోవాలి. వ్యర్థముగా కాకుండా, అర్థవంతముగా మన జీవితము మారాలన్నదే పరలోకపు తండ్రి కోరిక!

కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 13 : 2 **'ప్రవచించు కృపావరము కలిగి మర్మములన్నియు జ్ఞానమంతయు ఎరిగినవాడనైనను, కొండలను పెకలింపగల పరిపూర్ణ విశ్వాసము గలవాడనైనను ప్రేమలేనివాడనైతే వ్యర్థుడను.'** దేవుని వలన బలము పొంది సమస్తమును సాధించుకుంటూ ఎన్ని కార్యక్రమాలు జరిగించినా, దానికి తోడుగా సహోదర ప్రేమ ఉండాలి. ఆ సహోదర ప్రేమతోనే మనము దేవుని కార్యక్రమాలను జరిగించాలి. ఈ సహోదర ప్రేమ అంటే ఏమిటి? సహోదర ప్రేమను ఎవరి మీద ఎలా చూపించాలి? ఈ భూమి మీద మన తరములో పుట్టిన మనుష్యులందరూ మనకు సహోదరులే. వారిని మనము దేవునిలో ప్రేమించాలి. అనగా, వారినందరినీ నిత్య నరకాగ్ని నుండి తప్పించడానికి వారికి దేవుని వాక్యమును ప్రకటించాలి. వారిని దేవుని కొరకు బ్రతికించాలి. ఈ భూమిపై అన్నింటికంటె ఈ పని చాలా ఉన్నతమైనది. సమస్తము సాధ్యపరచగలిగిన దేవుని కుమారుడైన యేసుక్రీస్తు కూడా సహోదరులను ప్రేమించుట కొరకే తన జీవితమంతా ధారపోసాడు. అందుకే, మీరు కూడా సమస్తమును సహోదర ప్రేమ ద్వారా సాధ్యపరచుకోవాలి. ఆ సహోదర ప్రేమకలిగినవారై అనేకమందికి నిర్మలమైన దేవుని వాక్యాన్ని ప్రకటించుటలో మీ జీవితం సాగిపోవాలి.

రోమీయులకు 8 : 28- **'దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము. ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్ఠుడగునట్లు, దేవుడు ముందుగా ఎవరిని ఎరిగెనో వారు తన కుమారునితో సారూప్యము గలవారగుటకు వారిని ముందుగా నిర్ణయించెను. మరియు ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను; ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను; ఎవరిని నీతిమంతులుగా తీర్చెనో వారిని మహిమపరిచెను. ఇట్లుండగా ఏమందుము? దేవుడు మన పక్షముననుండగా మనకు విరోధియెవడు? తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుక తీయక మనందరికొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతోపాటు సమస్తమును మనకు ఎందుకు అనుగ్రహింపడు?'** పరలోకమందున్న తండ్రిని హృదయపూర్వకముగా ప్రేమించాలి. ఇలా ఎవరు ప్రేమిస్తారంటే, ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారు మాత్రమే ఆయనను ప్రేమిస్తారు. అట్టివారికొరకు ఆయన సమస్తమును సమకూర్చుతున్నాడు. దానినిబట్టి సమస్తము సాధ్యమవుతుంది. ఆయన సమస్తమును నిర్మించినవాడు, ఆయనకు అసాధ్యమైనది ఏదీ లేదు. పరలోకపు తండ్రి ఎలాంటివాడో, ఆయన కుమారుడు అలాంటివాడే! ఆయన కుమారుడు ఎలాంటివాడో ఆయన కుమారునియందు విశ్వాసముంచినవారు కూడా అలాంటివారు కావాలన్నదే దేవుని ఉద్దేశ్యం. అందుకే యేసుతో సమానమైన సారూప్యమును సంపాదించుకోవాలి. అట్టివారిని పరలోకపు తండ్రి ఘనపరచుచున్నాడు; అనగా వారికి సమస్తమును సాధ్యం చేయడమన్నమాట. దేవుని నిమిత్తము ఒక కార్యక్రమాన్ని సంకల్పించినప్పుడు దాని కొరకు ప్రయత్నాలు చేస్తున్నప్పుడు, దాని నిమిత్తమైన గొప్ప విశ్వాసమును కలిగియున్నప్పుడు ఆ కార్యక్రమమును సాధ్యపరిచేవాడు దేవుడే. దేవుడు మన పక్షమున ఉండగా మనకు విరోధి ఎవడు? మనుష్యులందరి పాపముల నిమిత్తము పరలోకమందున్న తన సొంత కుమారుని అనుగ్రహించుటకు, అప్పగించుటకు వెనుకడుగు వేయని తండ్రి, ఆయన కుమారుడైన యేసుతోపాటుగా మనకు సమస్తమును ఎందుకు అనుగ్రహింపడు? అని దేవుడు ప్రశ్న వేస్తున్నాడు. ఇప్పుడు చెప్పండి సమస్తము ఎవరికి సాధ్యం? దేవుని నమ్మిన వారికి, నమ్మి ఆయన చిత్తానుసారముగా బ్రతుకుచున్నవారికి, ఆయన కుమారుని సారూప్యతలోనికి మారిన వారికి సమస్తము సాధ్యమే! అపొస్తలుడైన పౌలు ఆనాడు సరిగ్గా ఈ విధముగానే సమస్తమును సాధ్యపరచుకొంటున్నాడు. తాను దేవుని ఎరిగినవాడై, ఆయన కుమారుని ఎరిగినవాడై, ఆ కుమారుని సారూప్యతలోనికి మారిన పౌలు కొరింథీయులతో ఏమంటున్నాడో చూడండి.

కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 6 : 9- **'మేము మోసగాండ్రమైనట్లుండియు సత్యవంతులము; తెలియబడని వారమైనట్లుండియు బాగుగా తెలియబడినవారము. చనిపోవుచున్న వారమైనట్లుండియు ఇదిగో బ్రదుకుచున్నవారము. శిక్షింపబడిన వారమైనట్లుండియు చంపబడనివారము; దుఃఖపడినవారమైనట్లుండియు ఎల్లప్పుడు సంతోషించువారము;**

**దరిద్రులమైనట్లుండియు అనేకులకు ఐశ్వర్యము కలిగించువారము; ఏమియు లేనివారమైనట్లుండియు సమస్తమును కలిగినవారము.'** మొదటి శతాబ్ధములో యేసుకు అపొస్తలుడైన పౌలుకు సమస్తము సాధ్యమే. దానిని పై వాక్యభాగములో చాలా వివరణాత్మకముగా తెలియజేస్తున్నాడు. దేవుని వాక్యమును ప్రకటిస్తున్న పౌలు మరియు మరికొందరు శిష్యులు ఆనాడు పైకి మోసగాళ్లుగా కనిపిస్తున్నా నిజానికి యదార్థవంతులు. ఎందుకంటే, దేవుని రాజ్యమును పరిచయం చేస్తున్నప్పుడు జనుల దృష్టికి అది మోసముగానే కనిపిస్తుంది. కానీ దేవుని దృష్టికి మాత్రం అది సత్యవంతమైన క్రియ. అలాగే, తెలియబడని వారమైనట్లుండియు బాగుగా తెలియబడినవారము అంటున్నాడు. సమాజము దృష్టికి అన్నీ తెలిసినవారు, ప్రతి విషయము మీద పట్టు ఉన్నవారు ఎవరనగానే, ముందు వరుసలోనికి శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పండితులు మొదలైనవారు వస్తారు. అంతే తప్ప, దేవుని తెలుసుకుని ఆ దేవుని ప్రకటిస్తున్నవారు ఈ సమాజము దృష్టికి ఏమీ తెలియని వారనే కదా భావన! అందుకే పౌలు ఏమంటున్నాడంటే, అందరి దృష్టిలో మాకు ఏమీ రాదనుకున్నా, అన్నింటినీ బాగుగా తెలుసుకున్నవారము మేమే అని అంటున్నాడు. ఆ తరువాత, చనిపోవుచున్న వారమైనట్లుండియు ఇదిగో బ్రదుకుచున్నవారము అంటున్నాడు. లోకుల దృష్టికి నిజమైన దైవసేవకులు ఎలా ఉంటారో తెలుసా? వీరు బ్రతికినా ఒకటే, చచ్చినా ఒకటే. బ్రతికి ఏమి సాధిస్తున్నారని ఎగతాళి చేస్తారు. ఎందుకంటే, వారి దృష్టిలో బ్రతుకంటే, తినడం - త్రాగడం - గెంతడం - ఇవన్నీ చేయడానికి నాలుగు రూపాయలు సంపాదించుకోవడం. కానీ, పరమందున్న దేవుని దృష్టికి మాత్రం బ్రతుకంటే అది కాదు. ఆయనను తెలుసుకోవడం, ఆయన చిత్తాన్ని నెరవేర్చడమే అసలుసిసలైన బ్రతుకంటే. అందుకే లోకము దృష్టికి చనిపోవుచున్న వారమైనట్లుండియు బ్రదుకుచున్నవారము అంటున్నాడు. తరువాత, శిక్షింపబడుచున్న వారమైనట్లుండియు చంపబడనివారము అని అన్నాడు. దేవుని సేవలో అనేక సందర్భాలలో వారికి లోకము నుండి శిక్ష ఎదురవుతున్నా, ఆ శిక్ష నుండి వారు దేవుని వలన తప్పింపబడుతున్నారు. యేసు యొక్క సారూప్యత కలిగినవారిని ఈ లోకము దైవ చిత్తానుసారముగా శిక్షించగలదేగాని, చంపలేదు. వారి ప్రాణం దేవుని చేతుల్లో మాత్రమే ఉంటుంది. వారి ప్రాణమును ముట్టుకోవడానికి ఏ ఒక్కరికీ అధికారము లేదు. ఆ తరువాత దు:ఖపడిన వారమైనట్లుండియు ఎల్లప్పుడూ సంతోషించువారము అంటున్నాడు. నిజముగా దేవుని సేవ జరిగిస్తున్నవారికి ఏముంటుంది? సుఖమా, సంతోషమా? ఒక సరదా లేదు, వినోదం లేదు అనుకుంటారు. కానీ, నిజానికి వీరే అందరికంటే ఎక్కువగా సంతోషించాలి. అది దైవాభీష్టమైన సంతోషము. ఆ సంతోషము లోకము అనుభవిస్తున్నట్టుగా ఉండదు. పరమునకు అర్హులని ఎంచబడినవారు ఎల్లప్పుడూ తమ ప్రభువైన క్రీస్తునందు ఆనందించడమంటే ఇదే. సమస్తమును సాధ్యపరచుకున్నవారే నిరంతరము సంతోషముగా ఉండగలరు. ఆనాటి యేసు శిష్యులు ఈ ఆనందమును అమితముగా అనుభవిస్తున్నారు. ఆ తరువాత పౌలు ఏమంటున్నాడో చూడండి. దరిద్రులమైనట్లుండియు అనేకులకు ఐశ్వర్యమును కలిగించువారము అంటున్నాడు. లోకము దృష్టికి నిజమైన దైవసేవకులు దరిద్రమును అనుభవిస్తున్నట్టుగా కనిపిస్తారు. కానీ వారే నిజానికి అనేకమంది ఐశ్వర్యమును పొందడానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కారకులవుతున్నారు. ప్రత్యక్షంగా అయితే, దేవుని వాక్యమును వెదజల్లుతూ నమ్మిన వారి పాలిట క్రీస్తు అనుగ్రహించు వరములను వెదజల్లే వారిగా ఉంటున్నారు. పరోక్షంగా అయితే, అసలు ఈ లోకము ఇంకా ఉనికి కలిగి ఉందంటే దానికి వీరే కారణం. ఇంకా దేవుని నిజమైన సేవకులు ఈ భూమి మీద ఉన్నారు కాబట్టే, ప్రకృతి నిలిచి ఉంది. లేదంటే, ఇప్పటికే దేవుని ఉగ్రతకు బలైపోయి ఉండేది. కనుక, వీరు దరిద్రులమైనట్లుండియు అనేకులకు ఐశ్వర్యమును కలిగించేవారన్నమాట. ఇక చివరిగా, పౌలు ఏమంటున్నాడో చూడండి. ఏమియు లేనివారమైనట్లుండియు సమస్తమును కలిగినవారము అంటున్నాడు. అసలు పౌలు మరియు ప్రారంభ శతాబ్ధపు శిష్యులను చూస్తే వారి దగ్గర చెప్పుకోవడానికి ఏమీ లేదు. కానీ, వారే లోకమందున్న వారందరికంటే ఉన్నతులు. ఎందుకంటే, వారికి సమస్తము సాధ్యమే.

కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 3 : 21 **'కాబట్టి ఎవడును మనుష్యులయందు అతిశయింపకూడదు; సమస్తమును మీవి. పౌలైనను, అపొల్లోయైనను, కేఫాయైనను, లోకమైనను, జీవమైనను, మరణమైనను, ప్రస్తుతమందున్నవియైనను, రాబోవునవియైనను సమస్తమును మీవే. మీరు క్రీస్తు వారు; క్రీస్తు దేవునివాడు.'** ఈ భూమి మీద బ్రతుకుచున్న ప్రతి మనిషి పరలోకమందున్న తండ్రి మీద ఆధారపడాలి. మనుష్యులయందు అతిశయపడి, వారిపై ఆధారపడితే చివరకు మిగిలేది నాశనమే. కనుక, సమస్తమును సాధ్యపరచుకోవాలంటే పరలోకపు తండ్రియైన దేవునియందు

అతిశయించి క్రీస్తు సారూప్యతలోనికి మారి దేవుని చిత్తాన్ని నెరవేర్చడమే మానవ జీవిత లక్ష్యం. అలాంటి వారికి అన్నీ వారివే. వారి పరిధిలోనికి రానిదంటూ ఏదీ ఉండదు. ఆనాడు పౌలైనా, అపొల్లో అయినా, కేఫా అయినా, లోకమైనా, జీవమైనా, మరణమైనా, ప్రస్తుతమందున్నవైనా, రాబోయేవైనా.. సమస్తమును మీవే. అన్నింటికీ మించి పరలోకమందున్న తండ్రి ఆ రాబోవు లోకమును, ఆ గొప్ప జీవితమును కూడా అలాంటివారి వశము చేస్తాడు. అప్పుడు మీకు సమస్తము సాధ్యమని నిస్సందేహంగా చెప్పవచ్చు. పైగా, మీరు క్రీస్తువారు క్రీస్తు దేవుని వాడు. ఇదంతా ఎలా సాధ్యమైంది? మీరు నిజంగా క్రీస్తు కొరకు ఆలోచిస్తే, క్రీస్తు కార్యక్రమాలలో ఉంటే, మీరు క్రీస్తు వారు. ఆ క్రీస్తు దేవుని వాడు. ఆ దేవునికి సమస్తము సాధ్యం! క్రీస్తుకి సమస్తం సాధ్యం. ఆ క్రీస్తును నిజంగా ధరించిన ప్రతి క్రైస్తవునికి సమస్తము సాధ్యం! ఎవరైనా సమస్తమును సాధ్యపరచుకోగలిగిన వారైతేనే వారి పేరు పరలోకములో జీవగ్రంథమందు లిఖింపబడుతుంది. లేదంటే వారు ఈ భూమి మీద చిన్న చిన్న వాటితోనే సంతోషపడతారు. మీ పేరు జీవగ్రంథములో లేనట్టయితే పాతాళంలో ఖచ్చితంగా ఉంటుంది. ఈ పాఠమును పూర్తిచేసిన మీరు అలాంటివారుగా ఉండొద్దు. మీకు సమస్తము సాధ్యమవ్వాలి. దానికి తగ్గట్టుగా ఇప్పటి నుంచి మీ మనస్సును, మీ ప్రవర్తనను మార్చుకోవాలి. మనమంతా యేసుక్రీస్తు సారూప్యతలోనికి మారి దేవుని పిల్లలుగా సమస్తమును సాధ్యపరచుకోవాలి! మన ప్రభువు పేరిట మీకు నా ధన్యవాదములు.

-------×-------

## ప్రశ్నలు

**1) లోకానుసారముగా సమస్తము ఎవరికి సాధ్యము? దైవానుసారముగా సమస్తము ఎవరికి సాధ్యము?**

**2) 'తండ్రియైన దేవునికి సమస్తము సాధ్యము' - వివరించండి.**

**3) 'దేవుని కుమారునికి సమస్తము సాధ్యము' - వివరించండి.**

**4) యేసు శిష్యులు మూగదైన చెవిటి దయ్యమును వెళ్లగొట్టలేకపోయిన సందర్భమును వివరించండి.**

**5) యేసు చెప్పిన మాటలలో 'ఆవగింజంత విశ్వాసము' అనగా ఏమిటి?**

**6) క్రియలు లేని విశ్వాసము; క్రియలు కలిగిన విశ్వాసము - వీటిని సవివరముగా చర్చించండి.**

**7) సమస్తమును సాధ్యపరచుకోగలిగిన వారెవరు? వివరించండి.**

# 5. ధర్మశాస్త్రము ఎవరికి? ఎందుకు? పార్ట్ 1

ధర్మశాస్త్రమును గూర్చిన వివరణ సరిగ్గా తెలియక ఈ రోజు ఎందరో క్రైస్తవులని పిలువబడుతున్నవారు క్రీస్తుకు దూరంగానే బ్రతుకుతున్నారు. ధర్మశాస్త్రము పూర్తిగా అర్థమైతే ఈ రోజు క్రైస్తవ్యంలో ఎన్నో ప్రశ్నలకు సమాధానము దొరుకుతుంది. ♦ దశమభాగము ఇవ్వాలా? వద్దా? ♦ సున్నతి చేయించుకోవాలా? వద్దా? ♦ విశ్రాంతి దినాన్ని ఆచరించాలా? వద్దా? ♦ పండుగలు, ఉత్సవకాలాలు, దినములు, సంవత్సరాలు ఆచరించాలా? వద్దా? ఇవన్నీ మనకు తెలియాలంటే ఈ పాఠం ఖచ్చితంగా మనకు అర్థం కావాలి. ఒకే క్రీస్తును నమ్మిన క్రైస్తవులు ఒక్కటైన విశ్వాసములో లేకపోవడానికి ఇదొక ప్రధానమైన కారణము. అసలు ధర్మశాస్త్రము అంటే ఏమిటి? ధర్మశాస్త్రములో ఏముంది? ధర్మశాస్త్రము ఎవరి కొరకు వ్రాయబడింది? ధర్మశాస్త్రమును నేటికాలములో మనము ఎలా ఉపయోగించాలి? తదితర అంశములన్నీ ఈ రెండు పాఠములలో విశేషముగా తెలియపరచడానికి ప్రభువు కృప వలన ఉపక్రమిస్తున్నాను.

'ధర్మశాస్త్రం' అనగానే ఆ పేరులోనే దాని యొక్క లక్షణం మనకు కనిపిస్తుంది. మనుష్యులకు ధర్మాన్ని చెప్పే శాస్త్రం; ధర్మాన్ని విధించిన శాస్త్రం. ఏది ధర్మమో ఏది అధర్మమో తెలియజెప్పే శాస్త్రం. ఈ ధర్మశాస్త్రమును దేవుడు మొట్టమొదట భూమి మీద తన ప్రజలుగా ఏర్పరచబడ్డ ఇశ్రాయేలీయులకు ఇచ్చాడు. ఆనాటికాలంలో ఎందరో మనుష్యులు భూమి మీద ఉన్నా వారెవ్వరికీ కాకుండా ఇశ్రాయేలీయులకు మాత్రమే దేవుడు ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు. ఒక్కొక్క ధర్మం ఒక్కొక్క జాతి ప్రజలకు ఉంటుంది అని చెప్పటానికి నేడున్న పరిస్థితులు కూడా ఉదాహరణలుగా మనకు కనిపిస్తున్నాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఒకే ధర్మం అన్ని దేశాలలోనూ లేదు. ఏ దేశానికి కావలసినట్టుగా ఆ దేశం తమ రాజ్యాంగాన్ని వ్రాసుకుంది, ధర్మాన్ని విధించుకుంది. ఒక చిన్న ఉదాహరణ ఇక్కడ నేను ప్రస్తావిస్తాను. మన భారతదేశంలో రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే మనము రోడ్డుకు ఎడమవైపున ప్రయాణం చేస్తాము. మనకు ఎదురుగా వచ్చేవారు రోడ్డుకు కుడివైపున ప్రయాణం చేస్తారు. ఒకవేళ మీరు కుడివైపున ప్రయాణం చేస్తే మీకు ఎదురుగా వచ్చేవారు మీకు అడ్డుపడతారు. ప్రయాణం సాగదు, ట్రాఫిక్ ఎక్కువైపోతుంది. కనుక భారతదేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఉన్న నియమం ఏమిటంటే రోడ్డు మీద ప్రయాణం చేసేవారు ఎడమవైపున మాత్రమే ప్రయాణం చేయాలి. అలాగని ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సిద్ధాంతమా అంటే, కాదు. మీరు ఒకవేళ అమెరికా వెళితే ఇక్కడున్న నియమానికి భిన్నంగా రోడ్డు మీద కుడివైపున ప్రయాణం చేయాలి. మీకు ఎదురుగా ఎడమవైపున వాహనాలొస్తుంటాయి. అక్కడ ఒక నాలుగు చక్రాల వాహనాన్ని నడుపుతుంటే, స్టీరింగ్ వాహనానికి ఎడమవైపున ఉంటుంది. అక్కడున్న వాహనాలను వారు అలా తయారు చేసుకున్నారు. ఎందుకంటే రోడ్డు మీద ప్రయాణపు పరిస్థితిని బట్టి వారి వాహనాలను అలా నిర్మించుకున్నారు. ఇలా కొన్ని దేశాలు, అలా కొన్ని దేశాలు వారి వారి ప్రయాణపు నియమాలను నిర్దేశించుకున్నాయి. అంటే ప్రపంచ వ్యాప్తంగా ఒకే విధంగా ధర్మము, న్యాయము, విధులు లేవు. వీటన్నిటి విషయములో ఒక్కొక్క దేశం ఒక్కొక్క రకంగా పాటిస్తుంది. దేవుడు ధర్మశాస్త్రాన్ని ఆనాడు భూమి మీద ఇశ్రాయేలీయులకు మాత్రమే ఇచ్చాడు. ఆనాటి కాలంలో ఎందరో అన్యజనులున్నా వారికి ఈ ధర్మశాస్త్రము వర్తించదు. వారు ధర్మశాస్త్ర పరిధిలోనికి రారు. అనగా, వారు సున్నతి చేయించుకోనక్కరలేదు; వారు విశ్రాంతి దినాన్ని పాటించనక్కరలేదు; వారు పండుగలు ఆచరించనక్కరలేదు. మరి అలాగైతే వారు పరలోకం ఎలా వెళతారు? వారికి దేవుడు వారు అనుసరించదగిన మార్గమును ఇచ్చాడు. నీతిని, న్యాయాన్ని, ధర్మాన్ని వారు ధర్మశాస్త్రము లేకుండానే పాటించాలి. కానీ ఇశ్రాయేలీయులకు మాత్రం దేవుడు ధర్మశాస్త్రమును ఇచ్చాడు. అలా పుట్టింది ఈ ధర్మశాస్త్రం!

**రోమీయులకు వ్రాసిన పత్రిక 9 : 4 'వీరు ఇశ్రాయేలీయులు; దత్తపుత్రత్వమును మహిమయు నిబంధనలును ధర్మశాస్త్ర ప్రధానమును అర్చనాచారాదులును వాగ్దానములును వీరివి.'** దేవుడు ధర్మశాస్త్రమును ఇశ్రాయేలీయులకు అని అన్నాడంటే మిగిలినవారికి కాదని అర్థము. ఇది నేటి క్రైస్తవ్యం బైబిల్‌లో నేర్చుకోవలసిన ఒకానొక ప్రాథమికమైన అంశము.

ధర్మశాస్త్రమును, దత్తపుత్రత్వమును, మహిమను, నిబంధనలను, అర్చనాచారాదులను, వాగ్దానములను దేవుడు కేవలం ఇశ్రాయేలీయులకు మాత్రమే ఇచ్చాడు. వారికి దేవుడు ఈ ధర్మశాస్త్రమును ఎప్పుడిచ్చాడు? ఇశ్రాయేలీయులు పుట్టకముందే అబ్రాహాము గర్భం నుండి వీరు వస్తారు కనుక అబ్రాహాముకు ఇచ్చాడా? ఇశ్రాయేలీయులు పుట్టినప్పుడు ఇచ్చాడా? లేక ఇశ్రాయేలీయులు వచ్చిన తరువాత కొంత కాలానికి ఇచ్చాడా? బైబిల్‌లో ధర్మశాస్త్రమునకు సంబంధించిన ప్రతి ప్రశ్నకు సమాధానం ఉంది. దానిని ఈ పాఠములో మనము నేర్చుకుందాం.

ఇంతకీ ఇశ్రాయేలీయులు ఈ భూమిపై ఉనికి లోనికి ఎప్పుడొచ్చారు? వారు ఎప్పటి నుండి ప్రారంభమయ్యారు? నోవహు జలప్రళయము తరువాత, నోవహు ముగ్గురు కుమారులలో ఒకడైన షేము వంశావళిని గూర్చి దేవుడు వ్రాయించాడు. **(ఆదికాండము 11 : 10 - 26)** నోవహు - షేము - అర్పక్షదు - షేలహు - ఏబెరు - పెలెగు - రయూ - సెరూగు - నాహోరు - తెరహు - అబ్రాహాము! ఈ తెరహు కుమారుడైన అబ్రాహామునకు దేవుని వాక్యము ప్రత్యక్షమయింది. తన గర్భము నుండి  ఒక వంశమును తీసుకొస్తానని, వారిని ఆశీర్వదిస్తానని దేవుడు అబ్రాహాముతో వాగ్దానము చేసాడు. వారే అబ్రాహాము కుమారుడైన ఇస్సాకు కడుపున పుట్టిన యాకోబు సంతానమైన 12మంది ఇశ్రాయేలీయులు, వారి ద్వారా వచ్చిన అనేకమంది జనాంగము. దేవుడు వారికి మోషే ద్వారా తన ధర్మశాస్త్రమునిచ్చాడు. అబ్రాహాముతో దేవుడు వాగ్దానమైతే చేసాడు కానీ అతనికి తన వృద్ధాప్యము వరకు సంతానము లేదు. ఈ విషయమై అబ్రాహాము సంతానము కోసం తన భార్యకు దాసియైన హాగరు ద్వారా ఇష్మాయేలును కన్నాడు. కానీ ఆ ఇష్మాయేలు దేవుని వాగ్దానము ప్రకారం పుట్టినవాడు కాదు. అప్పుడు దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధనను జ్ఞాపకం చేసుకుని అబ్రాహాము వృద్ధాప్యంలో తన భార్యయైన శారాయి ద్వారా ఇస్సాకు అనే కుమారుని అనుగ్రహించాడు. ఆ ఇస్సాకు గర్భాన యాకోబు, ఏశావు అనే ఇద్దరు కవల పిల్లలు పుట్టారు. వీరిద్దరిలో ఏశావు మొదటివాడైనా తన జ్యేష్ఠత్వాన్ని ఆకలి తీర్చుకోవడానికి ఒక పూట కూటి కోసం తన తమ్ముడైన యాకోబుకు అమ్మివేసుకున్న ఏశావును దేవుడు ప్రక్కన పెట్టాడు. అప్పుడు జ్యేష్ఠత్వాన్ని తెలివిగా సంపాదించుకున్న యాకోబును దేవుడు చూసాడు. ఈ యాకోబు ద్వారా ఇశ్రాయేలీయులందరినీ రప్పించాలనుకున్నాడు. ఆ క్రమంలో యాకోబు తన మామయైన లాబాను దగ్గరకు వెళ్లవలసివచ్చింది. ఆ లాబానుకు లేయా, రాహేలు అనే ఇద్దరు కుమార్తెలున్నారు. చిన్నదైన రాహేలును వివాహం చేసుకుందామని యాకోబు అనుకున్నా, లాబాను చేసిన మోసము వలన యాకోబు లేయాను వివాహమాడవలసి వచ్చింది. దానికి గాను అతడు లాబాను దగ్గర ఏడు సంవత్సరాలు కొలువు చేసాడు. రాహేలు మీద తనకున్న ప్రేమచేత మరొక ఏడు సంవత్సరాలు కొలువు చేయడానికి యాకోబు ఒప్పుకుంటాడు. అలాగే లాబాను మందలను మేపుటకు మరొక ఆరు సంవత్సరములు కొలువు చేస్తాడు. ఈ విధంగా తన మామయైన లాబాను దగ్గర మొత్తం ఇరువది సంవత్సరాలు కొలువు చేసి లేయా, లేయా దాసియైన జిల్పా, రాహేలు, రాహేలు దాసియైన బిల్హా ద్వారా మొత్తం పన్నెండు మంది కుమారులను యాకోబు కన్నాడు. అప్పుడు పరమందున్న తండ్రి వీరిని జ్ఞాపకం చేసుకుని ఆ పన్నెండు మందిని ఇశ్రాయేలీయులుగా పిలిచాడు. ఈ విధంగా దేవునిచే ఇశ్రాయేలీయులు ఏర్పరచబడిన తరువాత ఆయన వారికి ఎంత కాలానికి ధర్మశాస్త్రమును ఇచ్చాడో పరిశీలన చేద్దాం.

**గలతీయులకు వ్రాసిన పత్రిక 3 : 17 'నేను చెప్పునదేమనగా - నాలుగువందల ముప్పది సంవత్సరములైన తరువాత వచ్చిన ధర్మశాస్త్రము, వాగ్దానమును నిరర్థకము చేయునంతగా పూర్వమందు దేవునిచేత స్థిరపరచబడిన నిబంధనను కొట్టివేయదు.'** ధర్మశాస్త్రాన్ని దేవుడు ఇశ్రాయేలీయులకు నాలుగు వందల ముప్పది సంవత్సరాలు గడచిన తరువాత ఇచ్చాడు. ఇంతకీ ఎప్పటి నుండి ఈ 430 సంవత్సరాలను లెక్కించాలి? ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వములోకి వెళ్ళినప్పటి నుండి ఈ 430 సంవత్సరాలను లెక్కించాలి. అనగా, ఇశ్రాయేలీయులు ఐగుప్తీయుల బానిసత్వములో ఉన్నప్పుడు వారి దగ్గర ధర్మశాస్త్రము లేదు. బానిసత్వము నుండి విడుదల కొరకు వారు దేవునికి మొఱ పెడుతున్నారు. వారు పరలోకపు తండ్రికి ప్రార్థనలు చేస్తున్నారు. ఇలా 430 సంవత్సరాలు గడచిన తరువాత దేవుడు వారిని జ్ఞాపకము చేసుకొని వారికి నాయకుడైన మోషే ద్వారా విముక్తిని అనుగ్రహించాడు. ఈ విషయమును పాతనిబంధన గ్రంథములో కూడా పరిశీలిద్దాం.

**నిర్గమకాండము 12 : 40 'ఇశ్రాయేలీయులు ఐగుప్తులో నివసించిన కాలము నాలుగు వందల ముప్పది సంవత్సరములు.'** ఇశ్రాయేలీయులు నాలుగువందల ముప్పది సంవత్సరములు ఐగుప్తు దేశములో బాధలను అనుభవించిన తరువాత దేవుడు మోషేను వారి యొద్దకు పంపించాడు. మోషే ఇశ్రాయేలీయులందరినీ ఆ బానిసత్వము నుండి బయటకు తీసుకొని వచ్చాడు. అప్పుడే ఈ ధర్మశాస్త్ర ప్రస్తావన ప్రారంభమయింది. ఇంతకీ ధర్మశాస్త్రమంతా ఒకేరోజున ఒక్కసారే ఇవ్వబడిందా? లేదు. ఇశ్రాయేలీయులకు దేవుడు ధర్మశాస్త్రాన్ని ప్రారంభంలో కొన్ని ఆజ్ఞలతోనే ప్రారంభించాడు. ఆ తరువాత దానిని మోషే ద్వారా పూర్తి చేయించాడు. ఇశ్రాయేలీయులకు దేవుడు ధర్మాశాస్త్రాన్ని ఇచ్చిన మాట వాస్తవమే అయినా, ఇశ్రాయేలీయులలో అందరూ పూర్తి ధర్మశాస్త్రమును చూడలేదు. మోషే జీవించి ఉన్న కాలములో తనతో పాటు పూర్తిగా జీవించి ఉన్న వారు మాత్రమే మోషే వ్రాసిన ధర్మశాస్త్రాన్ని చూడగలిగారు. మధ్యలో అరణ్య ప్రయాణములోనే చనిపోయినవారు పూర్తిగా ధర్మశాస్త్రాన్ని చూసే అవకాశం లేదు. మోషే తరువాత కూడా చాలా గ్రంథాలు ఈ ధర్మశాస్త్రానికి అనుబంధముగా వ్రాయబడ్డాయి. ఒకరి తరువాత ఒకరుగా ప్రవక్తలంతా పరిశుద్ధాత్మ ప్రేరణ చేత వ్రాసి పూర్తి చేసిన పాత నిబంధన గ్రంథాన్ని ఈ రోజు మనము చూస్తున్నాము. ఒకనాడు సీనాయి పర్వతము మీద రాతిపలకలపై దేవుడు వ్రాయించి ఇచ్చిన పది ఆజ్ఞలు మొదలుకొని, ఆ తరువాత మోషే ద్వారా పూర్తి చేయబడిన ధర్మశాస్త్రమునకు కొనసాగింపుగా ప్రవక్తలంతా వ్రాసినటువంటి పుస్తకాలన్నీ కలిపితే అది పూర్తిగా పాత నిబంధన అవుతుంది.

ప్రియులారా! ఇప్పటి వరకు వ్రాసిన సంగతులన్నీ జాగ్రత్తగా ఆలోచిస్తే, మోషే ధర్మశాస్త్రము ప్రధానముగా ఇశ్రాయేలీయులకు మాత్రమే ఇవ్వబడింది. కనుక ఈ మోషే ధర్మశాస్త్రమును పాటించవలసింది ఎవరు? ఎవరికి ఈ ధర్మశాస్త్రము ఉద్దేశించబడిందో, ఎవరి చేతికి ఇవ్వబడిందో వారే దానిని పాటించాలి. ఉదాహరణకు, రోడ్డుకు ఎడమవైపున నడువవలసింది ఎవరు? ఇండియాలో ఉన్నవారా? లేక అమెరికాలో ఉన్నవారా? ఇండియాలో ఉన్న ప్రతి ఒక్కరూ ఇక్కడ నిబంధనలను పాటించాలి. అమెరికాలో ఉన్న ప్రతి ఒక్కరూ అక్కడి నిబంధనలను పాటించాలి. లేదంటే ప్రమాదం జరుగుతుంది. కనుక, ధర్మశాస్త్రము ఎవరికి ఇవ్వబడిందో వారు మాత్రమే పాటించాలి. ఇప్పుడు ఇంతకీ ఇశ్రాయేలీయుల విషయంలో ధర్మశాస్త్రము ఎలా పూర్తిచేయబడిందో, ఇంతకీ వారు పాటించారో లేదో దేవుడు వ్రాయించిన మరికొన్ని మాటల్లో చూద్దాం.

**హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 7 : 11- 'ఆ లేవీయులు యాజకులైయుండగా ప్రజలకు ధర్మశాస్త్రమియ్యబడెను గనుక ఆ యాజకులవలన సంపూర్ణసిద్ధి కలిగినయెడల అహరోను క్రమములో చేరినవాడని చెప్పబడక మెల్కీసెదెకు క్రమము చొప్పున వేరొక యాజకుడు రావలసిన అవసరమేమి? ఇదియుగాక యాజకులు మార్చబడినయెడల అవశ్యముగా యాజక ధర్మము సహా మార్చబడును.'** ఇశ్రాయేలీయులకు లేవీయులు యాజకులుగా ఉన్నారు. ప్రత్యక్షపు గుడారములోకి, పరిశుద్ధ, అతిపరిశుద్ధ స్థలములలోనికి కేవలం ఈ లేవీయులకు మాత్రమే ప్రవేశముంది. అటువంటి లేవీయులు ఇశ్రాయేలీయులకు యాజకులై ఉండగా ప్రజలకు ధర్మశాస్త్రము ఇవ్వబడింది. ఈ యాజకుల వలననే ఇశ్రాయేలీయులకు సంపూర్ణసిద్ధి కలిగితే అహరోను క్రమములో చేరినవాడని చెప్పబడక మెల్కీసెదెకు క్రమము చొప్పున వేరొక యాజకుడు రావలసిన అవసరమేముంది అని దేవుడు ప్రశ్నిస్తున్నాడు. అంటే ఆయన ప్రశ్నలో అర్థమేమిటి? ఇశ్రాయేలీయులు ఆనాటి యాజకుల వలన, వారి చేతులలో ఉన్న ధర్మశాస్త్రము వలన సంపూర్ణసిద్ధిని పొందలేకపోయారు. అనగా, నీతిని పరిపూర్ణ స్థాయిలో అందుకోలేకపోయారని అర్థము. ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకే సంపూర్ణసిద్ధిని ఇవ్వలేకపోయింది. ఎందుకని? ఇశ్రాయేలీయులు ఆ ధర్మశాస్త్రాన్ని పాటించలేకపోవటం వల్లనే. ఇంకా పై వాక్యభాగానికి కొనసాగింపును చూస్తే, యాజకులు మార్చబడినయెడల అవశ్యముగా యాజకధర్మము సహా మార్చబడును అని వ్రాయబడింది. లేవీయుల వలన ఇశ్రాయేలీయులు నీతిమంతులుగా తీర్చబడలేకపోతున్నారు, వారికి సంపూర్ణసిద్ధి కలగడం లేదు. అందువలన దేవుడు ఈ యాజకులను నివారించాలనుకున్నాడు; ధర్మశాస్త్రాన్ని కూడా తీసివెయ్యాలనుకున్నాడు. ఆ యాజకుల స్థానంలో ఒక గొప్ప ప్రధానయాజకుడిని ఆయన పంపించాలనుకున్నాడు. ఆయనే మెల్కీసెదెకు క్రమము చొప్పున వచ్చిన దేవుని కుమారుడైన యేసుక్రీస్తు. యాజకులు మార్చబడితే, అప్పుడు ఇచ్చిన ధర్మము కూడా మార్చబడాలి కనుక దేవుడు తాను

ఇచ్చిన ధర్మశాస్త్రాన్ని కూడా తీసివేసి, క్రొత్త నిబంధనను ఇవ్వాలని నిర్ణయించాడు. అయితే, ఈ చివరి ప్రధాన యాజకుడైన క్రీస్తు మరియు చివరి క్రొత్త నిబంధన కేవలం ఇశ్రాయేలీయులకే పరిమితం చేయకుండా, సర్వలోకానికి అనుగ్రహించాడు.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 7 : 13- 'ఎవనిగూర్చి యీ సంగతులు చెప్పబడెనో ఆయన వేరొక గోత్రములో పుట్టెను. ఆ గోత్రములోనివాడెవడును బలిపీఠమునొద్ద పరిచర్య చేయలేదు. మన ప్రభువు యూదా సంతానమందు జన్మించెననుట స్పష్టమే; ఆ గోత్రవిషయములో యాజకులను గూర్చి మోషే యేమియు చెప్పలేదు. మరియు శరీరానుసారముగా నెరవేర్చబడు ఆజ్ఞగల ధర్మశాస్త్రమునుబట్టి కాక, నాశనములేని జీవమునకున్న శక్తినిబట్టి నియమింపబడి, మెల్కీసెదెకును పోలినవాడైన వేరొక యాజకుడు వచ్చియున్నాడు. కావున మేము చెప్పిన సంగతి మరింత విశదమైయున్నది. ఏలయనగా - నీవు నిరంతరము మెల్కీసెదెకు క్రమము చొప్పున యాజకుడవై యున్నావు అని ఆయన విషయమై సాక్ష్యము చెప్పబడెను. ఆ ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణసిద్ధి కలుగజేయలేదు గనుక ముందియ్యబడిన ఆజ్ఞ బలహీనమైనందునను నిష్ప్రయోజనమైనందునను అది నివారణ చేయబడియున్నది; అంతకంటె శ్రేష్ఠమైన నిరీక్షణ దానివెంట ప్రవేశపెట్టబడెను. దీనిద్వారా దేవునియొద్దకు మనము చేరుచున్నాము.' ఇక్కడ గ్రంథకర్త పరిశుద్ధాత్మ ఆవేశముతో ధర్మశాస్త్రము యొక్క పూర్తి వివరములను తెలియజేసాడు. లేవీయుల ద్వారా కానిది యూదా గోత్రములో పుట్టిన ఒకని ద్వారా జరిగింది. ఆ ఒకడే క్రీస్తు యేసు. వేరొక గోత్రంలో అనగా, యూదా గోత్రములో పుట్టిన యేసు దేవుని దృష్టికి సర్వలోకమును సమాధానపరచు నిమిత్తము నిరంతరము ఉండే ప్రధాన యాజకుడయ్యాడు. అసలు అంతకు పూర్వము యూదా గోత్రము లోనివాడెవడూ బలిపీఠమునొద్ద పరిచర్య చేయలేదు. కానీ యూదుడైన యేసు, మెల్కీసెదెకు క్రమములో ఒక ప్రధాన యాజకుడుగా పాత నిబంధనకు సమాప్తిగా, క్రొత్త నిబంధనకు ప్రారంభముగా కనిపిస్తున్నాడు. ఒకనాటి ధర్మశాస్త్రమును బట్టి లేవీయులైన యాజకులు ఇశ్రాయేలీయులందరిని దేవుని ధర్మము వైపు నడిపించాలని ప్రయత్నం చేసారు కానీ వారు సంపూర్ణసిద్ధిని పొందలేకపోయారు. కానీ ఆ తరువాత వచ్చిన యేసు అను మన ప్రధానయాజకుడు దేవుని దగ్గర నుండి మరొక నిత్యమైన నిబంధనను సర్వలోకము నిమిత్తము తీసుకొనివచ్చాడు. అదే 'క్రొత్త నిబంధన' అని పిలువబడుతుంది. అంటే ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన ధర్మశాస్త్రము వారిలో ఏ ఒక్కరినీ నీతిమంతులుగా తీర్చలేకపోయింది. దేవుడు ఏ గోత్రాన్ని అయితే ఇశ్రాయేలీయులచేత దేవుని ధర్మశాస్త్రాన్ని నెరవేర్చేలా చేయు నిమిత్తము వారికి బోధించడానికి నియమించాడో ఆ లేవీ గోత్రం వలనే ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడం కాకపోయింది. అందుకే దేవుడు మరొక గోత్రంలో యేసుక్రీస్తుని పుట్టించి ఆయన వలన మరొక నిత్యమైన నిబంధనను అనుగ్రహించాలని ఆలోచన చేసాడు. ధర్మశాస్త్రం ఇశ్రాయేలీయులకే ఇవ్వబడినా, వారే దానిని పాటించలేక పోయారు. ధర్మశాస్త్రమును బట్టి ఇశ్రాయేలీయులలో ఏ ఒక్కరూ పరలోకాన్ని పొందలేక పోయారు. మునుపు ఇవ్వబడిన ధర్మశాస్త్రము వలన ఏ ఒక్కరికీ సంపూర్ణ సిద్ధి లేదు. ఇశ్రాయేలీయుల వరకు ఎందుకు? లేవీయుల వరకు ఎందుకు? దానికి ప్రారంభికుడైన మోషేకు సైతం ధర్మశాస్త్రము పరిపూర్ణతను ఇవ్వలేకపోయిందనుటలో ఎటువంటి సందేహమూ లేదు! ఇది ఎందుకు ఇలా జరిగిందో ఒక మంచి కారణాన్ని దేవుడు తన గ్రంథములో తెలియజేసాడు. దానిని ఇప్పుడు మనము పరిశీలిద్దాం. లోపము ధర్మశాస్త్రములో ఉందా? లేక దానిని పాటించదలచుకున్న మనుష్యులలో ఉందా? దానిని తెలుసుకుందాం.

రోమీయులకు వ్రాసిన పత్రిక 2 : 13 'ధర్మశాస్త్రము వినువారు దేవుని దృష్టికి నీతిమంతులు కారుగాని ధర్మశాస్త్రమును అనుసరించి ప్రవర్తించువారే నీతిమంతులుగా ఎంచబడుదురు.' ఇది ధర్మశాస్త్రములో ఉన్న ఒక ప్రధానమైన లక్షణము. ధర్మశాస్త్రమును కేవలం వింటే వారు తండ్రియైన దేవుని దృష్టికి నీతిమంతులు కాలేరు. ఇశ్రాయేలీయులంతా ధర్మశాస్త్రాన్ని వినేవారు, కానీ దానిని అనుసరించి ప్రవర్తించే వారు కాదు. యాజకులంతా ధర్మశాస్త్రాన్ని వినిపించేవారు. ప్రధానయాజకులంతా ధర్మశాస్త్రాన్ని వినిపించేవారు. కానీ వారు కూడా ధర్మశాస్త్ర ప్రకారము ప్రవర్తించువారు కాదు. కనుక వీరంతా నీతిమంతులుగా ఎంచబడలేదు. ధర్మశాస్త్రము ఆనాటి యాజకులకు సైతం సంపూర్ణసిద్ధిని ఎందుకు ఇవ్వలేకపోయిందంటే ధర్మశాస్త్రాన్ని అందరూ వింటున్నారు, వినిపిస్తున్నారే తప్ప ఆ విధుల ప్రకారం ఎవ్వరూ ప్రవర్తించలేకపోతున్నారు. మీకిక్కడ ఒక సందేహం రావచ్చు. ధర్మశాస్త్ర ప్రకారం ఎవ్వరూ ప్రవర్తించకపోవడం ఏమిటి?

ఇశ్రాయేలీయులలో అనేకమంది దేవునికి ధర్మశాస్త్రాన్ని బట్టి బలులర్పించారు; విశ్రాంతి దినాన్ని పాటించారు; పండుగలను ఆచరించారు. అలాంటప్పుడు ఇశ్రాయేలీయులు, అందులోనూ యాజకులు కూడా ధర్మశాస్త్రాన్ని పాటించకపోవడమేమిటి? అనుకుంటున్నారా? అయితే ఇక్కడ ధర్మశాస్త్రానికున్న మరొక ప్రత్యేకతను మీరు తెలుసుకోవాల్సిందే!

**యాకోబు పత్రిక 2 : 10 'ఎవడైనను ధర్మశాస్త్రమంతయు గైకొనియు, ఒక ఆజ్ఞవిషయములో తప్పిపోయినయెడల(తొట్రిల్లినయెడల), ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధియగును.'** చూసారా, ధర్మశాస్త్రము ఎంత కఠినముగా ఉందో? అందుకే ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్రమునుబట్టి సంపూర్ణసిద్ధిని పొందలేకపోయారు. ఆజ్ఞలన్నిటిని పాటించి ఒక్క ఆజ్ఞ విషయంలో తప్పిపోతే అతడు నీతిమంతుడు కాలేడు. అంటే ధర్మశాస్త్రమును నెరవేర్చాలంటే, దానిలోని ఆజ్ఞలన్నిటినీ ఒక్కటికూడా తప్పిపోకుండా నెరవేర్చాలి. ఉదాహరణకు, ధర్మశాస్త్రములో 100 ఆజ్ఞలు ఉన్నాయి అనుకుంటే, వాటిలో 99 ఆజ్ఞలను పాటించి ఒక్క ఆజ్ఞను మీరితే, మొత్తంగా 100 ఆజ్ఞల విషయములోను తప్పిపోయినట్టే లెక్క. అందుకే ఆనాటి ఇశ్రాయేలీయులలో ఏ ఒక్కరికీ ధర్మశాస్త్రము సంపూర్ణసిద్ధిని ఇవ్వలేకపోయింది. ధర్మశాస్త్రమనేది ఒక కష్టమైన ప్రశ్న పత్రము లాంటిది. ఈ ధర్మశాస్త్రాన్ని దేవుడు ఇశ్రాయేలీయులకు ఇవ్వడంలో ఆయన ఉద్దేశ్యమును చూడండి. ఒక కఠినమైన ప్రశ్న పత్రాన్ని ఇశ్రాయేలీయులకు దేవుడిచ్చి మీ చేతనైతే దీనిని పూర్తి చేయండి అన్నాడు. అలాగని ధర్మశాస్త్రములో ఎటువంటి లోపమూ లేదు. విద్యార్థులకు ఇచ్చిన ప్రశ్న పత్రములో లోపముందని ఎవరైనా అనగలరా? అనలేరు. ఆనాడు దేవుడిచ్చిన ధర్మశాస్త్రంలో ఏమాత్రం లోపం లేదు కానీ అది కఠినమైన ప్రశ్నపత్రం. ఈ కఠినమైన ప్రశ్నపత్రాన్ని ఎవ్వరూ పూర్తి చేయలేకపోయారు. ఎందుకంటే, ఎవడైననూ ధర్మశాస్త్రమంతయు గైకొనియు ఒక్క ఆజ్ఞ విషయంలో తప్పిపోయిన యెడల ఆజ్ఞలన్నిటి విషయంలో అతడు అపరాధియగును. ఉదాహరణకు మోషేను తీసుకుంటే, ధర్మశాస్త్రమునుబట్టి అతడెంత మాత్రము నీతిమంతుడు కాలేడు. దేవుడు రాతిపలకలను మోషే చేతికిచ్చి ఇశ్రాయేలీయులందరికీ ఆయన ఆజ్ఞలను చెప్పమంటే, వారి మీదున్న కోపంతో మోషే ఆ రాతిపలకలను పడవేసి పగులగొట్టాడు. అలాగే, మోషేకు విరోధముగా వాదించుచున్న ఇశ్రాయేలీయులను కోపముతో ద్రోహులారా అని సంబోధించి, దేవుడు బండతో మాట్లాడమంటే తన కర్రతో కొట్టాడు. ఇశ్రాయేలీయుల విషయంలో ఎన్నెన్నో మహాకార్యక్రమాలను జరిగించి, వారందరితో పాటుగా శ్రమను, క్రీస్తు విషయమైన నిందను అనుభవించినా ధర్మశాస్త్ర విషయములో మోషే నీతిమంతుడు కాదు. మరి మోషే పరలోకానికి ఎలా నిర్ణయింపబడ్డాడు? దీనికి సమాధానం యేసుక్రీస్తు! తనకు నీతిని ఆపాదించలేని ధర్మశాస్త్రాన్ని ప్రక్కనపెట్టి, క్రీస్తు చెంతకు చేరిపోయాడు. అప్పటికి క్రీస్తు ఇంకా పుట్టలేదు కదా అంటే, రాబోవు కాలములో క్రీస్తు వస్తాడన్న విశ్వాసమును బట్టి క్రీస్తును అంగీకరించాడు. ఇశ్రాయేలీయులలో ఒకవేళ ఎవరైనా ధర్మశాస్త్రాన్ని ఆధారం చేసుకుంటే గనుక వారు సంపూర్ణసిద్ధిని పొందలేరు. ధర్మశాస్త్రములో ఏదో ఒక ఆజ్ఞ విషయంలో వారు తప్పిపోతారు. మరొక సందర్భములో వ్రాయబడిన వాక్యమును పరిశీలిద్దాం.

**గలతీయులకు వ్రాసిన పత్రిక 3 : 10 'ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు. ఎందుకనగా- ధర్మశాస్త్రగ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది.'** ధర్మశాస్త్రమునకు సంబంధించిన వారందరు అనగా ఇశ్రాయేలీయులందరూ అని అర్థం. పై వాక్యభాగములో ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు అని ఎందుకు వ్రాయబడింది? ప్రపంచంలో నివసిస్తున్న ప్రతి మనిషి ధర్మశాస్త్ర పరిధిలోనికే వస్తారనుకుంటే దేవుడు ఈ వాక్యమును ఇలా వ్రాయించనవసరంలేదు. కొందరు మాత్రమే అనగా, ఇశ్రాయేలీయులు మాత్రమే ధర్మశాస్త్రమునకు సంబంధించినవారు గనుక దేవుడు ఇలా వ్రాయించాడు. కనుక, ఇశ్రాయేలీయులందరూ ధర్మశాస్త్రమునుబట్టి శాపమునకు లోనైయున్నారు. అనగా, ధర్మశాస్త్రమును పరిపూర్ణముగా పాటించకపోవడంవల్ల అదే వారికి ఒక శాపముగా పరిణమించింది. 'ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు.' ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన ఒక్క ఆజ్ఞ విషయంలోనైనా ఎవడైనా తప్పిపోతే వాడు ధర్మశాస్త్రమును బట్టి శాపగ్రస్తుడు. ప్రియులారా! జాగ్రత్తగా ఆలోచించండి. ఇప్పటికీ యేసుక్రీస్తు తప్ప ఏ ఒక్కరూ పరలోకానికి వెళ్లకపోవటానికి ఇది ఒకానొక

కారణం. మోషే నిజంగా ధర్మశాస్త్రాన్ని పూర్తిగా పాటించినవాడైతే అతడు ఇప్పుడెక్కడుండాలి? మరణించిన తరువాత ఆయన ఆత్మ ఎక్కడికి వెళ్లాలి? పరలోకమందున్న తండ్రియైన దేవుని దగ్గరకు వెళ్లాలి. ఇశ్రాయేలీయులకు దేవుడనుగ్రహించిన ధర్మశాస్త్రాన్ని పూర్తి చేసినవారై తానున్నలోకానికి వారు రావాలని ఆయన నిర్ణయించుకున్నాడు. ధర్మశాస్త్రము కఠినమైనదే కావచ్చు; కానీ దానిని ఇశ్రాయేలీయులు పాటించాలి, పాటించినవారే పరలోకానికి వెళతారు. దేవుడు ఈ విధంగా నిర్ణయించినప్పుడు మోషే మరణించిన తరువాత పరలోకానికి వెళ్లలేకపోయాడు. అలాగే, పితరుడైన దావీదు కూడా ఇంకా పరలోకానికి వెళ్లలేదు. **అపొస్తలుల కార్యములు 2 : 34** ప్రకారం, దావీదు పరలోకానికి ఎక్కిపోలేదు. అలాగే, పితరుడైన అబ్రాహాము కూడా ఇంకా పరలోకానికి వెళ్లలేదు. **లూకా సువార్త 16 : 19 - 31** వరకు ఉన్న సందర్భంలో పాతాళలోకమందు వేదనకరమైన స్థలములో ధనవంతుడు బాధపడుతున్నాడు. అదే పాతాళలోకమందు నెమ్మదిపొందు స్థలములో లాజరు అనే వ్యక్తి అబ్రాహాము రొమ్మున ఆనుకొని విశ్రాంతి పొందుచున్నాడు. అంటే, అబ్రాహాము ఇంకా పరలోకానికి వెళ్లలేదు. చూసారా! హేబెలు మొదలుకొని ఇప్పటివరకు మరణించిన నీతిమంతులలో, ప్రవక్తలలో దేవుని కుమారుడైన యేసుక్రీస్తు తప్ప ఏ ఒక్కరూ పరలోకమునకు వెళ్లలేదు. ఎందుకని? ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడు శాపగ్రస్తుడు అని వ్రాయబడి ఉంది కదా! అందుకే పరలోకమునకు ఇంకా వెళ్లలేదు. అలాగని ఎప్పటికీ వెళ్లరని కాదు. వారిని పరలోకానికి చేర్చడానికే దేవుని కుమారుడైన యేసు ఈ భూమి మీదకు వచ్చి తన విషయమైన ధర్మశాస్త్రమును పూర్తిచేసాడు. ఆయనే నీతిమంతులను, ప్రవక్తలను పరలోకానికి తీసుకొని వెళతాడు. దేవుడు తన కుమారుడైన యేసు ద్వారా మరణించిన, మరణించబోతున్న నీతిమంతులందరికీ తన కృపను ఉచితముగా అనుగ్రహిస్తున్నాడు. నీతిమంతులంతా యేసు ద్వారా మాత్రమే పరలోకానికి వెళ్లగలరు తప్ప ధర్మశాస్త్రము ద్వారా వెళ్లాలంటే ఏ ఒక్కరివల్లా కాదు. దేవుడు ధర్మశాస్త్రాన్ని మోషే ద్వారా ఇశ్రాయేలీయులకు ఇచ్చాడు. అటువంటి మోషేకే ధర్మశాస్త్రాన్ని పూర్తిగా నెరవేర్చడం సాధ్యం కాలేదు. ఇక మిగిలిన ఇశ్రాయేలీయుల వలన అవుతుందా? ప్రవక్తల వలన కాలేదు, నీతిమంతుల వలన కాలేదు. వారి కొరకే ధర్మశాస్త్రము ఇవ్వబడినా వారందరి వలన కానప్పుడు, ఇప్పటి కాలములో జీవిస్తున్న మనకు ధర్మశాస్త్రము నిర్ణయింపబడనప్పుడు మన వలన ఆ ధర్మశాస్త్రమును పూర్తిగా నెరవేర్చడం వీలవుతుందా? ఈ భూమి మీద జీవించినవారిలో యేసుక్రీస్తు తప్ప ఏ శరీరియు ధర్మశాస్త్రమును పరిపూర్ణము చేయలేడనడానికి దేవుడు వ్రాయించిన ఒక చక్కని వాక్య భాగమును పరిశీలిద్దాం.

**గలతీయులకు వ్రాసిన పత్రిక 3 : 11- 'ధర్మశాస్త్రము చేత ఎవడును దేవుని యెదుట నీతిమంతుడని తీర్చబడడను సంగతి స్పష్టమే. ఏలయనగా- నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును. ధర్మశాస్త్రము విశ్వాస సంబంధమైనది కాదు గాని దాని విధులను ఆచరించువాడు వాటివలననే జీవించును.'** ధర్మశాస్త్రము వలన ఎవడును దేవుని యెదుట నీతిమంతుడని తీర్చబడడు. ఇది చాలా స్పష్టమైన సంగతి. సున్నతి, విశ్రాంతి దినాచారము, బల్యర్పణలు, పండుగలు,... ఇలా ధర్మశాస్త్రసంబంధమైన విధులను ఎన్ని చేసినా మనుష్యుల యెదుట నీతిమంతులవుతారేమోగాని, దేవుని యెదుట మాత్రం నీతిమంతులు కాలేరు. మరి ఆయన దృష్టికి మనుష్యులు నీతిమంతులెలా అవుతారు? ఏలయనగా, నీతిమంతులు విశ్వాసమూలముగా జీవించును అని వ్రాయబడి ఉంది. దేవునిపై క్రీస్తు ద్వారా విశ్వాసముంటేనే ఏదైనా సాధ్యం. యేసుక్రీస్తు నందలి విశ్వాసమే మనుష్యులను పరలోకానికి చేర్చుతుంది. యేసుక్రీస్తు నందలి విశ్వాసమే ఏ మనిషినైనా నీతిమంతునిగా మారుస్తుంది. ధర్మశాస్త్రము విశ్వాస సంబంధమైనది కాదు గాని దాని విధులను ఆచరించువాడు వాటి వలననే జీవించును అని వ్రాయబడి ఉంది. ధర్మశాస్త్రంలో కేవలం విధులున్నాయి, ధర్మశాస్త్రంలో ఇశ్రాయేలీయులు చేయవలసిన కార్యక్రమాలున్నాయి. వాటివలన ఎవడును నీతిమంతుడుగా తీర్చబడలేడు; తద్వారా పరలోకానికి వెళ్లలేడు.

ఇప్పుడు పాఠకులకు ఒక సందేహం రావచ్చు. ప్రపంచవ్యాప్తంగా చాలామందికి ఈ సందేహం ఉంటుంది. అదేమిటంటే, ఇంతకీ దేవుడు ఇంత కఠినమైన ధర్మశాస్త్రాన్ని ఇశ్రాయేలీయులకెందుకిచ్చినట్టు? ఎందుకంటే, తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రజలను ఎలా రక్షిస్తాడో నిరూపించడానికి ముందుగా ఈ కఠినమైన ధర్మశాస్త్రాన్ని దేవుడు ఇశ్రాయేలీయులకు ప్రవేశపెట్టాడు. యేసుక్రీస్తు ద్వారా ప్రపంచంలో ఉన్న సర్వమానవాళి దేవుని దగ్గరకు వెళ్లాలనే సదుద్దేశ్యముతో ముందుగా

కఠినమైన ధర్మశాస్త్రము ఇవ్వబడింది. ఆ ధర్మశాస్త్రాన్ని చూచిన తర్వాత మొదట ఇశ్రాయేలీయులు, ఆ తరువాత సర్వలోకము తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తు దగ్గరకు రావాలన్నది దేవుని సంకల్పం! ఒకవేళ దేవుడు ధర్మశాస్త్రాన్ని ఇవ్వకుండా ముందుగానే యేసుక్రీస్తును లోకములోనికి పంపిస్తే మనుష్యులందరూ ఏమంటారో తెలుసా? యేసుక్రీస్తులో ఉన్న గొప్పతనమేమిటి? యేసుక్రీస్తు లేకుండా మేము మా స్వశక్తి చేత పరలోకాన్ని సాధించుకోగలము అంటారు. అలా ఏ ఒక్కడూ గర్వాంధుడు కాకూడదనే, ముందుగా దేవుడు ధర్మశాస్త్రాన్ని ఇశ్రాయేలీయులకు అనుగ్రహించి వీలైతే దీనిని సాధించి చూపించమన్నాడు. మనుష్యులు తమ సొంత ప్రయత్నము వలన నీతిక్రియలు చేస్తే ఆ నీతిక్రియలు దేవుని దృష్టికి మురికి గుడ్డల్లా కనిపిస్తాయి. **(యెషయా 64 : 6)** మనుష్యులను వారి నీతిని గూర్చి మాట్లాడమంటే చాలానే చెప్తారు. అవి వారి దృష్టికి నీతి క్రియలు కావచ్చు. దేవుని దృష్టికి మాత్రం అవి మురికి గుడ్డలే. అడుక్కునేవానికి రూపాయి ధర్మం చేసాం; ఆపదలో కొందరికి అప్పిచ్చాం, పేదవారికి పెళ్ళిళ్లు చేసాం; భూదానం చేసాం; గోదానం చేసాం; అన్నదానం చేసాం; పండగల్లో ఫలాలిచ్చాం, బట్టలిచ్చాం, మందులిచ్చాం అని చెప్పుకుంటూపోతే దేవుడు వాటినన్నింటినీ తన దృష్టికి మురికి గుడ్డల వంటివే అని చెబుతాడు. ఎందుకని? దేవునికి దానధర్మాలు నచ్చవా? అనుకోకండి. మీరు చేస్తున్న దానం, ధర్మం వెనుక చరిత్రను దేవుడు పైకి తీస్తాడు. మనుష్యులయెదుట కనిపించాలని, అందరికీ వినిపించాలని, ఏదో పేరు సంపాదించాలని నీకున్న డబ్బులో కొంత పిసర అడుక్కునేవానికి రాల్చావు అంటాడు దేవుడు. నీకున్నదంతా పేదలకు పంచి ఇవ్వగల దాతృత్వం నీకుందా? అన్న వస్త్రములతో సంతృప్తి చెందగల గొప్ప గుణం నీకుందా? లేదు. అందుకే దేవుని దృష్టికి మనిషి నీతిక్రియలన్నీ మురికి గుడ్డల వంటివే. నిజంగా దేవుడు ఇశ్రాయేలీయులకు ముందుగా తన ధర్మశాస్త్రాన్నివ్వకుండా యేసుక్రీస్తునే పంపిస్తే ఏమనేవారో తెలుసా? యేసుక్రీస్తు ద్వారానే మేము పరలోకానికి ఎందుకు వెళ్లాలి? ధర్మశాస్త్రాన్నిస్తే మేము కూడా దానిని మా స్వశక్తిచేత పూర్తి చేసి మా అంతట మేమే పరలోకానికి వెళతామని అంటారు. అందుకే అలాగని ఎవ్వడూ చెప్పలేకుండా, ఏ ఒక్కడూ నోరెత్తకుండా ముందుగా ఆయన తన సంకల్పానుసారముగా ధర్మశాస్త్రాన్ని ఇశ్రాయేలీయులకు అనుగ్రహించాడు. ముందుగా ఇశ్రాయేలీయులలో ఎవరైనా తమంతటతామే యేసుక్రీస్తు సహాయం లేకుండా నిత్యజీవానికి రావాలనుకుంటే ధర్మశాస్త్రము వారికి ముందుగా అనుగ్రహింపబడింది. ఇశ్రాయేలీయులను నడిపించిన నాయకుడైన మోషే, ధర్మశాస్త్రమును పూర్తిగా పాటించలేక క్రీస్తు దగ్గరకు వెళ్లిపోయాడు. యుద్ధరంగములో చిన్న వడిసెల రాయితో గొల్యాతును సంహరించిన దావీదు, తన కత్తితో పదివేల మందిని చంపగల దావీదు, ధర్మశాస్త్రము ముందు ఓడిపోయాడు. ఊరియా విషయంలో, బత్షెబ విషయంలో ధర్మశాస్త్రము దావీదుకిచ్చిన మార్కులెన్ని? సున్నా! ఇప్పుడు దావీదు పరిస్థితి ఏమిటి? అందుకే దావీదు యేసుప్రభువు శరణు వేడుకున్నాడు. **(అపొ. కార్య. 2 : 25 - 35)**

ప్రియులారా! అందుకే దేవుడు ఇశ్రాయేలీయులకు ముందుగా ధర్మశాస్త్రాన్ని ఇచ్చి వారి సొంత క్రియల సత్తా ఏంటో చూపించమన్నాడు. ఈ విషయంలో ఇశ్రాయేలీయులకు కావలసినదంతా దేవుడు సమకూర్చాడు. ఒక రాజ్యాన్నిచ్చాడు, వారికి తిండిని పెట్టాడు, వారి బాగోగులన్నీ తానే చూసాడు. అన్ని వసతులను వారికి సమకూర్చి వారి చేతనైతే ధర్మశాస్త్రాన్ని పాటించి చూపించమన్నాడు. కానీ వారిలో ఏ ఒక్కరూ దానిని పూర్తిగా పాటించలేకపోయారు. ధర్మశాస్త్రములోని విధులను, ఆచారములను తు.చ. తప్పకుండా ఒక్కటికూడా మీరకుండా పాటించడం ఎవరివలనా కాలేదు. ఇక మిగిలిన అన్యజనుల వలన పూర్తి ధర్మశాస్త్ర ఆచరణ ఎలా సాధ్యమవుతుంది చెప్పండి. అందుకే దేవుడు ముందుగా ధర్మశాస్త్రాన్ని ఇశ్రాయేలీయులకు ఒక నిబంధనగా ఇచ్చి, దాని వలన వారిలో ఏ ఒక్కరూ పరలోకానికి రాలేరని, ఆ తరువాత తన కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకములోనికి పంపించాడు. ధర్మశాస్త్ర ప్రకారం ఎవరైనా నిత్యజీవమును సంపాదించాలని అనుకుంటే గనుక వారు ఖచ్చితంగా విఫలమైపోతారు. దానికి నిలువెత్తు నిదర్శనం ముందు వచ్చిన ఇశ్రాయేలీయులే. అందుకే, ఇశ్రాయేలీయులు మొదలుకొని అన్యజనులలో ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవుని కృపను పొంది నిత్యజీవమును సాధ్యపరచుకోవాలి. దేవుడు వ్రాయించిన మరొక మంచి వాక్యమును పరిశీలిద్దాం.

గలతీయులకు వ్రాసిన పత్రిక 5 : 3 **'ధర్మశాస్త్రము యావత్తు ఆచరింపబద్ధుడై యున్నాడని సున్నతి పొందిన ప్రతి మనుష్యునికి నేను మరల దృఢముగా చెప్పుచున్నాను.'** ఆనాడు ప్రారంభ శతాబ్దపు క్రైస్తవ సంఘాలలో కూడా ధర్మశాస్త్రమును గూర్చిన చర్చ జరిగింది. ఎందుకంటే అప్పుడప్పుడే ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్రాన్ని విడిచిపెట్టి యేసుక్రీస్తులోనికి వస్తున్నారు. అప్పుడు ధర్మశాస్త్రమును గూర్చిన ఇటువంటి పాఠము వారికి ఖచ్చితంగా అవసరం. అటువంటి పరిస్థితులలో అపొస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మ ప్రేరణతో ఈ గొప్ప పాఠమును ఎంత దృఢముగా చెబుతున్నాడో చూడండి. యేసుక్రీస్తు అనుగ్రహింపబడిన తరువాత కూడా ఇంకా ఇశ్రాయేలీయులలో ఒకవేళ ఎవరైనా ధర్మశాస్త్రమును బట్టి మాత్రమే మేము నిత్యత్వమును సాధిస్తాము అంటే, వారు ధర్మశాస్త్రము యావత్తు ఆచరింపబద్ధుడై యున్నాడని పౌలు దృఢముగా హెచ్చరిస్తున్నాడు. ఆనాటి కాలములో ఒక ఇశ్రాయేలీయుడు పౌలు దగ్గరకు వచ్చి నేను ధర్మశాస్త్రము ద్వారా పరలోకానికి వెళతాను; నాకు నీవు ప్రకటించుచున్న క్రీస్తు ఎందుకు అన్నాడంటే, అప్పుడు పౌలు అలాంటివానికి సమాధానమిస్తూ - అలాగైతే నీవు ధర్మశాస్త్రమును పూర్తిగా ఒక్క ఆజ్ఞ కూడా తప్పకుండా దానిని మొత్తంగా ఆచరింపబద్ధుడవై యున్నావు అని హెచ్చరిస్తున్నాడు. ధర్మశాస్త్రములో ఒక ఆజ్ఞను మాత్రమే పాటిస్తే ధర్మశాస్త్రమును మొత్తంగా పాటించినట్టు కాదు. ఒక్క ఆజ్ఞను మీరినా మొత్తంగా ధర్మశాస్త్రమును అతిక్రమించినట్టే. ఎవరైనా ధర్మశాస్త్రాన్ని ఆచరించాలనుకుంటే వాడు ధర్మశాస్త్రము యావత్తును ఆచరించాలి; అది భూమి మీదనున్న మనుష్యులలో ఎవరివలననూ కాదు. అందుకే అపొస్తలుడైన పౌలు తన చిన్ననాటనుంచి గమలీయేలు పాదముయొద్ద ధర్మశాస్త్రసంబంధమగు నిష్ఠయందు శిక్షితుడైననూ తనకు యేసుక్రీస్తు పరిచయమయ్యాక, నిజాన్ని గ్రహించినవాడై ఆ క్రీస్తు చెంతకు వెళ్లి దేవుని కృపనుబట్టి నీతిని సంపాదించుకున్నాడు. ఈ వివరణను దేవుడు అపొస్తలుడైన పౌలు ద్వారా తెలియపరచి నేటికి రెండు వేల సంవత్సరాలకు పైగా కాలము జరిగిపోయింది. ఇంకా ఈ ధర్మశాస్త్రమును గూర్చిన వివరణ నేటి నామకార్థ క్రైస్తవులకు దూరంగానే ఉంది.

ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 3 : 9 **'క్రీస్తును సంపాదించుకొని, ధర్మశాస్త్రమూలమైన నా నీతిని గాక, క్రీస్తునందలి విశ్వాసమువలననైన నీతి అనగా విశ్వాసమునుబట్టి దేవుడు అనుగ్రహించు నీతిగలవాడనై ఆయనయందు అగపడు నిమిత్తమును,... సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను.'** పౌలు నిత్యజీవమును ఎలా సంపాదించుకుందామనుకుంటున్నాడు? దేవుని దృష్టికి నీతిమంతునిగా ఎలా కనిపించాలనుకుంటున్నాడు? కేవలం క్రీస్తుయేసు ద్వారా మాత్రమే. అంతకు మునుపటి కాలమందైతే పౌలుకూడా ధర్మశాస్త్రానికి లోబడినవాడే. ధర్మశాస్త్రాన్ని ఆచరించి దాని ద్వారానే పరలోకానికి వెళ్లాలనుకున్నవాడే. కానీ పౌలుకు క్రీస్తు పరిచయం జరిగిన తరువాత అప్పుడు అతడికి అర్థమైంది. పౌలు ఏ ఒక్కవిషయంలో ధర్మశాస్త్రమును అతిక్రమించినా, ధర్మశాస్త్రమును పూర్తిగా అతిక్రమించినట్టే. అందువలన అతడేమి చేస్తున్నాడో చూడండి. క్రీస్తుని సంపాదించుకొని ధర్మశాస్త్ర మూలమైన తన నీతినిబట్టి గాక, క్రీస్తునందలి విశ్వాసమువలనైన నీతి (అనగా విశ్వాసమును బట్టి దేవుడనుగ్రహించు నీతి) కలిగినవాడుగా తాను మారాలనుకున్నాడు. పౌలు ఆ విధముగా నీతిని సంపాదించుకున్నాడు. మునుపటి ప్రవక్తలందరూ, నీతిమంతులందరూ, శిష్యులందరూ ఆ విధముగానే నీతిని సంపాదించుకున్నారు. ధర్మశాస్త్రసంబంధమైన క్రియల మూలముగా నీతిమంతులుగా మారదామనుకుంటే కుదరదు. ఇంత చదివిన తరువాత సహజంగానే అందరికీ కలిగే సందేహమేమిటంటే, ఇంతకీ ధర్మశాస్త్రము లోపము కలిగినదా? దానిని ఇశ్రాయేలీయులకిచ్చిన దేవుడు వారికి అన్యాయం చేసాడా? లేదు. అట్లనరాదు. ఇందులో ఉన్న మర్మమైన జ్ఞానమును తెలుసుకొనుటకు జాగ్రత్తగా ప్రయత్నించండి. ఈ విషయమైన వివరణ కొరకు మరొక చక్కని వాక్యభాగమును పరిశీలిద్దాం.

గలతీయులకు వ్రాసిన పత్రిక 3 : 21- **'ధర్మశాస్త్రము దేవుని వాగ్దానములకు విరోధమైనదా? అట్లనరాదు. జీవింపచేయ శక్తిగల ధర్మశాస్త్రము ఇయ్యబడి యున్నయెడల వాస్తవముగా నీతి ధర్మశాస్త్రమూలముగానే కలుగును గాని యేసుక్రీస్తు నందలి విశ్వాసమూలముగా కలిగిన వాగ్దానము విశ్వసించువారికి అనుగ్రహింపబడునట్లు, లేఖనము అందరిని పాపములో బంధించెను.'** దేవుడు ఇశ్రాయేలీయులకు అనుగ్రహించిన ధర్మశాస్త్రము దేవుని వాగ్దానములకు విరోధమైనదా? ఎట్టి పరిస్థితులలోనూ కాదు. ధర్మశాస్త్రంలో ఏమైనా లోపముందా? లేనే లేదు. దేవుడనుగ్రహించిన ధర్మశాస్త్రమందు లోపమున్నదని

చెప్పడానికి ఎలా వీలుపడుతుంది? మీకు మరల మరల చెబుతున్నాను. ధర్మశాస్త్రములో లోపముందని నేను ఈ పాఠములో చెప్పడం లేదు. లోపం మనిషిలో ఉంది. ధర్మశాస్త్రమును పూర్తిచేయగల సామర్థ్యం మనిషికి లేదు. ధర్మశాస్త్రము వలన ఏ ఒక్కరూ దేవుని దృష్టికి నీతిమంతుడు కాలేరు. అందుకే దేవుడు పై వాక్యభాగములో ఏమని వ్రాయించాడో చూడండి. ధర్మశాస్త్రము నిజంగా దానిని ఆచరించిన ప్రతి ఒక్కరినీ బ్రతికించగలిగి ఉంటే అందరికీ నీతి ఆ ధర్మశాస్త్రము వలననే కలగాలి. కానీ అలా జరగలేదు. కనుకనే, యేసుక్రీస్తు నందలి విశ్వాసమూలముగా కలిగిన వాగ్దానము విశ్వసించువారికి అనుగ్రహింపబడునట్లు లేఖనము అందరిని పాపములో బంధించింది. యేసుక్రీస్తుయొక్క గొప్పతనమును ఆకాశమంత ఎత్తులో చూపించడానికి, ఈ ధర్మశాస్త్రమును ఆచరించాలని దాని యొద్దకు వచ్చిన వారందరినీ పాపములో బంధించి ఉంచింది. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు యొక్క ఔన్నత్యము మనుష్యులలో ప్రతి ఒక్కరికి అర్థమవ్వాలి. అప్పుడే వారికి నిత్యజీవము చేరువవుతుంది. ఇప్పుడు ధర్మశాస్త్రము ఒక మనిషిని పాపములో ఎలా బంధిస్తుందో, యేసుక్రీస్తు నందలి విశ్వాసము మనిషిని పాప విముక్తునిగా ఎలా చేస్తుందో నేర్చుకోవడానికి ఒక మంచి ఉదాహరణను మీముందుంచుతాను. యేసుక్రీస్తు ఈ భూమి మీద జీవించియున్న కాలములో ఆనాటి శాస్త్రులు, పరిసయ్యులు వ్యభిచారమందు పట్టబడిన ఒక స్త్రీని ఆయన దగ్గరకు తీసుకొని వచ్చారు. ఈ సందర్భమును మీరు అర్థం చేసుకుంటే, ధర్మశాస్త్రము - యేసుక్రీస్తునందలి విశ్వాసములను గూర్చి మీకు చాలా స్పష్టముగా అర్థమవుతుంది.

**యోహాను సువార్త 8 : 3- 'శాస్త్రులును పరిసయ్యులును, వ్యభిచారమందు పట్టబడిన యొక స్త్రీని తోడుకొనివచ్చి ఆమెను మధ్య నిలువబెట్టి - బోధకుడా, యీ స్త్రీ వ్యభిచారము చేయుచుండగా పట్టబడెను; అట్టివారిని రాళ్లు రువ్వి చంపవలెనని ధర్మశాస్త్రములో మోషే మనకాజ్ఞాపించెను గదా; అయినను నీవేమి చెప్పుచున్నావని ఆయననడిగిరి.'** యేసు దగ్గరకు ఆ స్త్రీని తీసుకొచ్చిన వీరంతా ఎవరనుకుంటున్నారు? వారు ఏమీ తెలియని వారు కాదు. వారు శాస్త్రులు మరియు పరిసయ్యులు అనగా, ఇశ్రాయేలీయులలో ధర్మశాస్త్రాన్ని ఏ విషయంలోను అతిక్రమించకుండా దానిని తు.చ. తప్పకుండా పాటిస్తున్నామని ప్రజలచేత పిలువబడుతున్నవారని అర్థము. నిజానికి వీరు ధర్మశాస్త్రాన్ని ఎంతగా పాటిస్తున్నారో ఇప్పుడు తేల్చేద్దాం. ఒక రోజు ఉదయకాలమున యేసు దేవాలయములో ప్రజలందరికి దేవుని వాక్యమును బోధించుచుండగా, ఈ శాస్త్రులు పరిసయ్యులు వ్యభిచారమందు పట్టబడిన ఒక స్త్రీని తీసుకొని వచ్చి, ఆమెను మధ్యన నిలువబెట్టారు. అప్పుడు వారు యేసును శోధించుచు మోషే ధర్మశాస్త్రము ప్రకారమైతే ఆమెను రాళ్లతో కొట్టి చంపవలెను కదా అని చెప్పి, అయినను నీవైతే చంపమంటావా? వద్దా? అని అడిగి ఆయనను శోధిస్తున్నారు. అంటే, యేసు ఆమెను చంపమని చెబితే ఆ చంపిన నేరములో ఆయనను మిళితము చేయాలని లేక ఆమెను చంపవద్దని చెబితే మోషే ధర్మశాస్త్రమును అతిక్రమించినవానిగా ఆయనపై ముద్ర వేద్దామనే కుయుక్తితో ఆయన దగ్గరకు వచ్చారు. ఇంతకీ మోషే ధర్మశాస్త్రము ఏమని ఆజ్ఞాపించింది? వ్యభిచారమందు పట్టబడిన స్త్రీని రాళ్లతో కొట్టి చంపాలని ఆజ్ఞాపించింది. ధర్మశాస్త్రము క్రిందికి ఎవరైతే వస్తారో వారు పాపము చేస్తే ఆయా పాపములను బట్టి వారికి శిక్ష విధింపబడుతుంది. ఆ శిక్ష కూడా చాలా భయంకరంగా ఉంటుంది. మార్పునొందే అవకాశము ధర్మశాస్త్రము ఇవ్వదు. నేరము నిరూపింపబడితే వెంటనే శిక్షను అమలు చేస్తుంది. అంటే, ధర్మశాస్త్రము మనిషిని పాపములో బంధించిందన్నమాట. అందుకే ఆనాటి శాస్త్రులు పరిసయ్యులు వ్యభిచారమందు పట్టబడిన ఒక స్త్రీని మధ్యను నిలువబెట్టి మోషే ధర్మశాస్త్ర ప్రకారం ఈ స్త్రీని ఇప్పుడు రాళ్లతో కొట్టి చంపాలి అని చెబుతున్నారు. అది కూడా మోషే ధర్మశాస్త్రములో వ్రాయబడిన సంగతే. లేఖనము అందరినీ పాపములో బంధించెను; ఇప్పుడు ఆ స్త్రీని కూడా పాపములో బంధించింది. వ్యభిచారమందు పట్టబడిన ఆ స్త్రీని ధర్మశాస్త్రము బంధించి చావుకు ముందు నిలువబెట్టింది. ఇప్పుడు అక్కడ జీవాధిపతియైన యేసుక్రీస్తు ఉన్నాడు గనుక ఆమె బ్రతికిపోయింది, మరోవైపు శాస్త్రులు పరిసయ్యుల పాపము కూడా పండింది. యేసు దగ్గరకు గనుక ఆనాడు వారు రాకపోతే వారి చెంతనున్న ధర్మశాస్త్రాన్ని బట్టి వారామెను రాళ్లతో కొట్టి చంపేసుండేవారు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు అర్థంకాకపోతే ధర్మశాస్త్రము ఎలాంటిదో, దాని ముసుగులో మనుష్యులు ఎంత భయానకంగా మారిపోతున్నారో వారికి అర్థమై ఉండేది కాదు. వారు ఆనాడు యేసు మీద నేరము మోపవలెనని ఆయనను శోధించుచు నీవైతే ఏమి చెబుతావని ఆయనను అడుగుతున్నారు. అప్పుడు ఆయన ఎంతటి మహాజ్ఞాన సంగతులను తన నోరార తెలియజేస్తున్నాడో చూడండి.

**యోహాను సువార్త 8 : 6- 'ఆయన మీద నేరము మోపవలెనని ఆయనను శోధించుచు ఈలాగున అడిగిరి. అయితే యేసు వంగి, నేలమీద వ్రేలితో ఏమో వ్రాయుచుండెను. వారాయనను పట్టు వదలక అడుగుచుండగా ఆయన తలయెత్తి చూచి- మీలో పాపము లేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయవచ్చునని వారితో చెప్పి మరల వంగి నేలమీద వ్రాయుచుండెను. వారామాట విని, పెద్దవారు మొదలుకొని చిన్నవారివరకు ఒకని వెంట ఒకడు బయటికి వెళ్లిరి; యేసు ఒక్కడే మిగిలెను; ఆ స్త్రీ మధ్యను నిలువబడియుండెను.'** శాస్త్రులు మరియు పరిసయ్యులు యేసును శోధిస్తూ పట్టువదలక అడుగుతున్నప్పుడు ఆయన వారికి ఈ విధముగా సమాధానమును తెలియజేసాడు. మీలో పాపము లేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయండి అన్నాడు. అంటే, ఆమెపై నేరమును మోపుచున్న శాస్త్రులు, పరిసయ్యులు ధర్మశాస్త్రాన్ని పాటిస్తున్నప్పుడు వారు నీతిమంతులుగా ఉండాలి కదా! కానీ లేదు. వారిని ఆ ధర్మశాస్త్రము నీతిమంతులుగా తీర్చలేకపోయింది. వారు పాపాత్ములుగా ఉండగా ఎదుటివారు పాపము చేసినప్పుడు వారిని వీరు శిక్షించడానికి అధికారము వీరికెవరిచ్చారు? ఇక్కడ యేసు దానినే అడుగుతున్నాడు. ఒకవైపు యేసు ధర్మశాస్త్రమును గొప్పదిగానే చూపిస్తూ, దానిని నెరవేర్చని వారితో ఒక ఉన్నతమైన పరమార్థాన్ని తెలియజేస్తున్నాడు. పరమందున్న తండ్రి మనస్సులో ఉన్న ప్రధానమైన కోరిక ఏమిటి? పాపాత్మున్ని శిక్షించడమా? లేక పాపాత్మున్ని రక్షించడమా? ధర్మశాస్త్రములోని ప్రధానమైన విషయాన్ని యేసు అక్కడ వారికి జ్ఞాపకం చేస్తున్నాడు. అందుకే వారిలో పాపము లేనివానిని మొట్టమొదట ఆమె మీద రాయి వేయవచ్చని చెప్పాడు. మేము శాస్త్రులము పరిసయ్యులము, మేము ధర్మశాస్త్రాన్ని పాటిస్తున్నాము అని చెప్పుకుంటున్న వారే ధర్మశాస్త్రాన్ని అతిక్రమించారు. వారు దేవుని దృష్టికి నీతిమంతులు కారు. ఎందుకంటే ఏదో ఒక విషయంలో ప్రతిరోజు వారు తప్పిపోయి ధర్మశాస్త్రము చేత అపరాధులుగా తీర్చబడుతున్నారు. వారందరూ పాపాత్ములే అయినాగాని పైకి మాత్రం ప్రజలకు వారిని నీతిమంతులుగా చూపించుకుంటున్నారు. మేము విశ్రాంతిదినాన్ని ఆచరిస్తున్నాం, దశమ భాగాన్ని ఇస్తున్నాం, పండుగలన్నీ జరుపుకుంటున్నాం, ధర్మశాస్త్రాన్ని పాటిస్తున్నామని ప్రజలకు చూపించుకుంటున్నారు తప్ప వీరు మాత్రం దేవుని దృష్టికి పాపాత్ములుగానే బ్రతుకుతున్నారు. ఆ విషయం యేసుక్రీస్తు మాత్రమే బహిర్గతం చేయగలడు. ఎందుకంటే ఆయన మాత్రమే పాపము చేయకుండా పరిశుద్ధునిగా జీవిస్తున్నాడు. అందుకే యేసు ఆ స్త్రీపై రాయి వేయవద్దని చెప్పలేదు; పాపము చేయనివాడు ఆమె మీద మొట్టమొదట రాయి వేయవచ్చునని చెప్పాడు. యేసును శోధించి ఎలా చెప్పినా చిక్కుల్లో పెడదామని వారు వస్తే, దేవుని జ్ఞానమును చెప్పి వారినందరినీ ఒక్కమాటతో నోరు మూయించాడాయన. అందుకే ఆమెను చంపడానికి రాళ్లు సిద్ధం చేసుకుని వచ్చిన ఆ శాస్త్రులు పరిసయ్యులు యేసు చెప్పిన మాట విని పెద్దవారు మొదలుకొని చిన్నవారి వరకు ఒకనివెంట ఒకరు వెళ్లిపోయారు. అక్కడ ధర్మశాస్త్రానుసారం నీతిమంతుడైన యేసు ఒక్కడే మిగిలెను. ఎందుకంటే అక్కడున్న వారిలో ఆ స్త్రీని శిక్షించడానికి అర్హతను కలిగియున్నది యేసు ఒక్కడే. ఈ భూమి నిలిచియున్నంత వరకు మనిషిగా పుట్టిన వారందరిలో యేసుక్రీస్తు ఒక్కడే పాపమును చేయని పరిశుద్ధుడు. అక్కడ దోషిగా ఆ స్త్రీ నిలబడింది, పరిశుద్ధుడైన యేసు ఉన్నాడు. ఆమెను శిక్షించడానికి వచ్చిన వారంతా ఒకనివెంట ఒకరు వెళ్లిపోగా యేసు ఒక్కడే మిగిలాడు. ఎందుకంటే యేసు ధర్మశాస్త్రాన్ని బట్టి కూడా నీతిమంతుడు! అప్పుడాయన ఆమెతో ఏమంటున్నాడో చూడండి.

**యోహాను సువార్త 8 : 10- 'యేసు తలయెత్తి చూచి - అమ్మా, వారెక్కడ ఉన్నారు? ఎవరును నీకు శిక్ష విధింపలేదా? అని అడిగినప్పుడు ఆమె - లేదు ప్రభువా అనెను. అందుకు యేసు - నేనును నీకు శిక్ష విధింపను; నీవు వెళ్లి ఇక పాపము చేయకుమని ఆమెతో చెప్పెను.'** అంటే ధర్మశాస్త్రమునుబట్టి ఆ స్త్రీ ఒక్కతే పాపాత్మురాలనుకుంటున్నారా? ఆమెను శిక్షించడానికి వచ్చిన వారంతా పాపాత్ములే. ధర్మశాస్త్రము ఆ స్త్రీని ఎలా పాపములో బంధించిందో, వారినీ అలాగే ఇశ్రాయేలీయులందరినీ పాపములో బంధించింది. ఆమెకు, వచ్చిన వారికి పెద్దగా తేడా ఏమీ లేదు. అయితే ఈమె పాపము చేయుచుండగా పట్టుబడింది; వారు పాపము చేయుచుండగా పట్టుబడలేదు. అంతే తేడా! ఎవరైనా నిత్యత్వాన్ని స్వతంత్రించుకోవాలంటే వారికి యేసే శరణ్యం. ఎవరునూ నీకు శిక్ష విధింపలేదా అని ఆమెను అడిగినప్పుడు ఆమె లేదు ప్రభువా అని చెప్పింది. ఆ సందర్భములో ఆమెకు ఒక విషయం స్పష్టంగా అర్థమై ఉండాలి. అదేమిటంటే, ఇప్పటి వరకు తానే పెద్ద పాపాత్మురాలనే మానసిక క్షోభలో ఆమె ఉంది. ఇక తన జీవితమింతే కాబోలు, ఏదో ఒక రోజు పట్టుబడితే

తనకు చావే గతి అనుకుంటున్న పరిస్థితులలో, తనతోపాటు జీవిస్తున్న శాస్త్రులు పరిసయ్యులంతటి వారు కూడా పాపాత్ములే అని ఆమెకు అప్పుడు అర్థమవుతుంది. అలాగే, ప్రపంచమంతా పాపాత్ములే గనుక ఇక పరిశుద్ధతకు ఈ లోకంలో తావే లేదా అన్న పరిస్థితులలో ఎదురుగా దేవుని అద్వితీయ కుమారునిగా యేసు ఆమెకు కనిపిస్తున్నాడు. ధర్మశాస్త్రము అందరినీ పాపములో బంధించినా దేవుని కుమారుని మాత్రం పాపములో బంధించలేకపోయింది. అందుకే ఆమెకెదురుగా ప్రభువు ఒక్కడే మిగిలాడు. ప్రపంచమంతటిలో ఆయనొక్కడే నీతిమంతుడన్న సంగతి ఆమెకు స్పష్టమైంది. అప్పుడు యేసు ప్రభువు ఆమెతో ఏమంటున్నాడో చూడండి. నేనును నీకు శిక్ష విధింపనమ్మా అంటున్నాడు. ఈ లోకానికి శిక్ష విధించడానికి యేసు పంపబడలేదు. పాపాత్ములను వారి పాపములోనే బంధించడానికి యేసు రాలేదు. పాపములో ఇశ్రాయేలీయులను బంధించడానికి ధర్మశాస్త్రము ఇవ్వబడింది. పాపం నుండి మొదట ఇశ్రాయేలీయులను తరువాత సర్వలోకమును విముక్తుల్ని చేయడానికి యేసుక్రీస్తు అనుగ్రహింపబడ్డాడు. మనుష్యులు ఎన్ని పాపములు చేసినా, ఆయన్ను తెలుసుకున్న తరువాత ఇకమీదట ఎన్నటికీ పాపము చేయవద్దని చెబుతూ మనుష్యులను నీతిమంతులుగా మార్చడానికి ఆయన ఈ లోకానికి వచ్చాడు. ఇదే యేసుక్రీస్తు నామమున పొందే బాప్తిస్మము అనే కార్యక్రమము ద్వారా కలిగే పరివర్తన! ఇది సర్వలోకానికి ఎంత గొప్ప అవకాశమో చూడండి. ఇది ప్రపంచంలో ఇంకెవ్వరికీ చేతకాదు. ఒక గజదొంగ పోలీసులకు పట్టుబడితే వానిని శిక్షిస్తారు. అలా శిక్షిస్తున్నప్పుడు ఆ దొంగ నిజంగా మార్పునొంది ఇక మీదట దొంగతనములు చేయను అని పోలీసులతో లేక న్యాయమూర్తితో చెబితే వారు వింటారా? శిక్ష పూర్తయ్యే వరకు వానిని విడిచిపెట్టరు. అలాగని శిక్ష పూర్తయి, వానిలో మార్పు రాకపోయినా సరే వానిని విడిచిపెడతారు. అంటే అతడు ఇంకా దొంగగానే మరల సమాజములోనికి విడిచిపెట్టబడ్డాడన్నమాట. కానీ దేవుని కుమారుడైన యేసు అలాంటివాడు కాదు. ఆయన మార్పును కోరుకుంటున్నాడు. మారిన వారిని పరిశుద్ధులుగా తీర్చుతున్నాడు. నిజానికి ధర్మశాస్త్రం కూడా ఇశ్రాయేలీయులను ఏమి చేసిందంటే వారిని పాపములో బంధించి ఉంచింది. ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులలో అగ్రగణ్యులైన మోషేను పాపములో బంధించింది, దావీదును పాపములో బంధించింది, ఎందరైతే నీతిమంతులు ప్రవక్తలు ఉన్నారో వారినందరినీ పాపములో బంధించింది. ఆ పాపపు బంధకాలలో నుండి వారిని విడిపించినవాడు యేసుక్రీస్తు మాత్రమే. ఎందుకంటే, వారంతా రాబోవు యేసుక్రీస్తుపై విశ్వాసముంచి, దేవుని కృపను పొంది నీతిమంతులుగా మరణించారు. అందుకే యేసు ఆ స్త్రీతో - నేనును నీకు శిక్ష విధింపను, నీవు వెళ్లి ఇక పాపము చేయకుమని ఆమెతో చెప్పెను. ఆయన వలన ఆ రోజు ఆ స్త్రీ తన ప్రాణాలను కాపాడుకోగలిగింది. అదే ధర్మశాస్త్రమైతే ఆమెను చంపేది కదా. ఈ ధర్మశాస్త్రమనే కాడి క్రింద చిక్కుకున్న ఇశ్రాయేలీయులందరినీ, అలాగే పాపము వలన బంధింపబడిన సర్వలోకమును కాపాడడానికే దేవుని కుమారుని రాక ఈ భూమిపై జరిగింది.

**గలతీయులకు వ్రాసిన పత్రిక 4 : 4- 'అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను. ఆయన స్త్రీయందు పుట్టి, మనము దత్తపుత్రులము(స్వీకృతపుత్రులము) కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను.'** క్రీస్తు రాక పరమార్థాన్ని ఈ వాక్యభాగములో దేవుడు తెలియజేస్తున్నాడు. ఆయన ధర్మశాస్త్రమునకు లోబడియున్న ఇశ్రాయేలీయులందరినీ ధర్మశాస్త్రము నుండి విమోచించడానికి వచ్చాడు. పాపములో బంధింపబడిన సర్వలోక మానవాళి కోసం ఆయన వచ్చాడు. దీని కొరకు దేవుడు ఒకానొక కాలమును నిర్ణయించి తన కుమారుడైన క్రీస్తును పంపించాడు. ఆయన ఇశ్రాయేలీయులలో యూదుల వంశములో స్త్రీయందు పుట్టాడు. మొదట ఇశ్రాయేలీయులను, ఆ తరువాత సర్వజనులను దేవునికి దత్తపుత్రులను చేయవలెనని ఆయన వచ్చాడు. దీనంతటి కొరకు మొదట ఆయన ధర్మశాస్త్రమునకు లోబడియున్న ఇశ్రాయేలీయులను దాని నుండి విమోచించాలి. అలా చేయాలంటే, ఆయనే స్వయంగా ధర్మశాస్త్రానికి లోబడినవాడుగా జీవించాలి. పరలోకమందున్న దేవుడు, తన కుమారుడైన యేసును ఈ భూమి మీదకు పంపిస్తున్నప్పుడు ఇచ్చిన ప్రధానమైన ఆజ్ఞ ఏమిటంటే, ఆయన ధర్మశాస్త్రమునకు లోబడియున్న ఇశ్రాయేలీయులందరినీ విమోచించాలంటే, ముందుగా ఆయన ధర్మశాస్త్రాన్ని పాటించి నిరూపించాలి. లేదంటే, ధర్మశాస్త్రాన్ని కొట్టివేయడానికి గాని, ధర్మశాస్త్రానికి లోబడియున్నవారిని విమోచించడానికి గాని ఆయనకు అర్హత ఉండదు. అందుకే యూదులలో స్త్రీయందు పుట్టిన యేసుక్రీస్తు ఈ భూమి మీద తన విషయమైన ధర్మశాస్త్రాన్ని పూర్తిగా

నెరవేర్చాలి. అలా నెరవేర్చితే గాని ధర్మశాస్త్రానికి లోబడియున్నవారిని ఆ కాడి నుంచి విమోచించే అవకాశం ఉండదు. పరలోకమందున్న తండ్రి అన్ని విషయాలలోనూ చాలా ఖచ్చితంగా ఉన్నాడు. ఆయన అన్యాయస్థుడు కాదు. ఆయన ఏ ఒక్కరికీ పక్షపాతి కాదు. తన కుమారుడైన యేసును పంపించి, ఆయన ధర్మశాస్త్రమును నెరవేర్చకుండా దానిని వారి నుండి తొలగించమని ఆయన చెప్పలేదు. ఆయన ముందుగా ధర్మశాస్త్రాన్ని నెరవేర్చితే తప్ప ధర్మశాస్త్రమును తొలగించే అధికారం ఆయనకు లేదు. అందుకే ముఖ్యంగా ఇశ్రాయేలీయుల నిమిత్తం (ఎవరైతే ధర్మశాస్త్రము క్రిందికి వస్తారో వారందరి నిమిత్తం) ఆయన ధర్మశాస్త్రమునకు లోబడియున్నవాడయ్యాడు. ఈ విధంగా పరలోకపు తండ్రి ఎందుకు నిర్ణయించాడంటే, భూమి మీద ఇశ్రాయేలీయులలో ఏ ఒక్కరూ దేవుడిచ్చిన ధర్మశాస్త్రాన్ని పాటించలేకపోయారు గనుక, మనుష్యులలో ఎవ్వరూ పాటించలేని కఠినమైన ధర్మశాస్త్రమును దేవుడెందుకివ్వాలి? అని ఆయన్ను తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. అందుకే, తన కుమారుడైన యేసుకు మానవ దేహమునిచ్చి, అన్ని విషయములలో రిక్తునిగా చేసి మోషే ధర్మశాస్త్రమును పాటించమని చెప్పాడు. అందుకే యేసు ఒక గొప్ప బాధ్యతను తన భుజములపై వేసుకుని ఈ భూమి మీదకు పాప శరీరాకారముతో వచ్చాడు. దేవుడు ఇశ్రాయేలీయులకిచ్చిన ధర్మశాస్త్రాన్ని నెరవేర్చి ఆయనిచ్చిన ధర్మశాస్త్రములో ఎటువంటి లోపము లేదని నిరూపించాడు. ఇశ్రాయేలు ప్రజలే లోపము కలిగినవారు తప్ప దేవుని ధర్మశాస్త్రము లోపము కలిగినది కాదు. వారు దేవున్ని వారి పూర్ణహృదయముతో ప్రేమించలేకపోయిన దానినిబట్టి ధర్మశాస్త్రమందు ఏదో ఒక విషయంలో తప్పిపోయేవారు. అందుకే వారిలో ప్రతి ఒక్కరూ ధర్మశాస్త్రమంతటినీ నిర్వీర్యం చేసారు. కానీ కాలము పరిపూర్ణమైనప్పుడు యేసు ఈ భూమి మీదకు వచ్చి దేవుని ధర్మాశాస్త్రాన్ని పూర్తిగా నెరవేర్చాడు. ఆయన ఏ ఒక్క విషయంలో కూడా పాపము చేయకుండా దేవుని ధర్మశాస్త్రాన్ని నెరవేర్చి, అప్పుడు ధర్మశాస్త్రాన్ని వారి నుండి తొలగించి నూతన నిబంధనను అనుగ్రహించాడు. దానినిబట్టి ధర్మశాస్త్రమనే బంధకాలలో నుండి ఇశ్రాయేలీయులను విడిపించాడు. దీని వలన మిగిలిన అన్యజనులకు కూడా గొప్ప లాభం కలిగింది. ఎందుకంటే, క్రీస్తు అనుగ్రహించిన నూతన నిబంధన కేవలం ఇశ్రాయేలీయులకు మాత్రమే నిర్ణయింపబడినది కాక, అది సర్వలోకానికి ఇవ్వబడింది. ధర్మశాస్త్ర నెరవేర్పు - ధర్మశాస్త్ర ముగింపు అనే ఈ మహాకార్యక్రమాన్ని ఆయన పూర్తిచేస్తే తప్ప హేబెలు మొదలుకొని మరణించిన నీతిమంతులకు కూడా పరలోకం వెళ్లే అవకాశం లేదు. అందుకే వారందరూ పాతాళ లోకమందలి పరదైసులో నెమ్మది పొందు స్థలంలోనే ఉన్నారు. యేసు, తాను ధర్మశాస్త్రమును నెరవేర్చడానికే వచ్చానని చెబుతున్న సందర్భమును చూడండి.

**మత్తయి సువార్త 5 : 17- 'ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టి వేయవచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టి వేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.'** ఈ వాక్యమును జాగ్రత్తగా పరిశీలిస్తే తప్ప అందులోని పరమార్థం అర్థం కాదు. ఇక్కడ యేసు మాటలలోని భావమేమిటంటే, ధర్మశాస్త్రమును పూర్తిగా ఒక్కరైనా నెరవేర్చకుండా దానిని కొట్టేయడానికి వీలు లేదు. ధర్మశాస్త్రమును ఎవరైనా కొట్టివేయాలంటే (అనగా రద్దు చేయాలంటే) ముందుగా వారు దానిని నెరవేర్చి తండ్రికి చూపించాలి. అప్పుడు పరమందున్న తండ్రి దానిని కొట్టివేయడానికి అనుమతినిస్తాడు. దాని స్థానంలో క్రొత్త నిబంధనను అనుగ్రహిస్తాడు. దీనంతటికీ సమర్థుడెవరు? ఎంతో కాలముగా తండ్రియైన దేవునికి ఏ ఒక్కడూ కనిపించలేదు. అప్పుడు ఆయన కుమారుడైన యేసు ఈ భూమి మీదకు వచ్చాడు. ఆయన ఈ భూమి మీదకు వచ్చీ రాగానే ధర్మశాస్త్రమును ప్రవక్తల వచనములను కొట్టివేసే అవకాశము లేదు. ఎందుకంటే ధర్మశాస్త్రమంతయు నెరవేరు వరకు అందులో నుండి ఒక పొల్లుగాని సున్న గాని తప్పిపోవడానికి వీలులేదు. ధర్మశాస్త్రమంతయు నెరవేర్చబడితే, అప్పుడు ఆయన దానిలోనుండి పొల్లు, సున్న ఏమిటి, దానిని మొత్తంగా తప్పిస్తాడు. అసలు దానిని ఇశ్రాయేలీయుల యొద్దనుండి తప్పించడానికే కదా ఈ భూమి మీదకు వచ్చి దానిని పూర్తిచేస్తున్నాడు! కనుక, యేసు మాటలలో ఆయన ధర్మశాస్త్రమును గూర్చి - నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు అంటున్నాడు. ముందుగా ధర్మశాస్త్రమంతయు నెరవేర్చాలి, ఆ తరువాత మాత్రమే దానిని కొట్టివేయాలి. నెరవేర్చకుండా దానిని కొట్టివేయడానికి ఆయన రాలేదు; అలా చేయడానికి వీలూ లేదు. యేసుక్రీస్తు ఈ భూమి మీద జీవిస్తున్నప్పుడు చాలా

మంది ఈయన ధర్మశాస్త్రమును పాటించుటలేదేమోనని అపోహ పడుతున్నారు. విశ్రాంతి దినాచారము విషయములో ఆనాటి శాస్త్రులు పరిసయ్యులు ధర్మశాస్త్రోపదేశకులు యేసుపై నింద వేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఆయన వారి కళ్లు తెరిపిస్తున్నాడు. మనుష్యకుమారుడు విశ్రాంతి దినమునకు ప్రభువైయున్నాడని వారికి సర్వశ్రేష్టమైన జ్ఞానమును తెలియజేస్తున్నాడు. అప్పటివరకు ధర్మశాస్త్ర విషయములో అనేకమారులు తప్పిపోయిన వారు, ధర్మశాస్త్రమును పూర్తిగా నెరవేర్చడానికి వచ్చిన యేసుపై నిందలు వేయడం వారి మూర్ఖత్వానికి నిలువెత్తు నిదర్శనం. ధర్మశాస్త్రాన్ని పరిపూర్ణముగా నెరవేర్చి దానిని కొట్టివేయడానికి ఆయన వచ్చాడు. యేసు ధర్మశాస్త్రమంతటిని నెరవేర్చిన సందర్భమును చూస్తే మనకు ఈ విషయం స్పష్టమవుతుంది. ఇంతకీ యేసు ధర్మశాస్త్రమును ఎప్పుడు పూర్తిగా నెరవేర్చాడు? ఆయన మరణము వరకు దానిని నెరవేర్చి, తన జీవితములో దానిని పూర్తి చేసాడు. అందుకే, ఆయన మరణించి తిరిగి పునరుత్థానమైన తరువాత చెబుతున్న అత్యంత ప్రాముఖ్యమైన విషయమేమిటో తెలుసా? ధర్మశాస్త్రము ఆయన జీవితములో పూర్తిగా నెరవేర్చబడినదని తెలియజేస్తున్నాడు.

**లూకా సువార్త 24 : 44 'అంతట ఆయన - మోషే ధర్మశాస్త్రములోను ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరవలెనని నేను మీయొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను.'** పాత నిబంధనలో అనగా, మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను యేసును గూర్చి పరలోకపు తండ్రి ఏమేమి వ్రాయించాడో అవన్నియు నెరవేరవలెనని ఆయన శిష్యులతో జీవించి ఉన్నప్పుడు వారితో చెప్పిన మాటలన్నీ సిలువ మరణముతో నెరవేరాయి. అప్పటితో ఆయన తన విషయమైన ధర్మశాస్త్రమంతటిని నెరవేర్చేసాడు. ఆయనను గూర్చి లేఖనములలో వ్రాయబడినవన్నీ పొల్లు, సున్నతో సహా నెరవేర్చబడ్డాయి. ఇశ్రాయేలీయులలో నీతిగా బ్రతికినవారు సైతం ఆయా బలహీనమైన సందర్భాలలో వారు చేసిన అతిక్రమములనుబట్టి ఏ ఒక్కరు ఈ విధముగా ధర్మశాస్త్రమును నెరవేర్చలేకపోయారు. వారి జీవితాలలో కొన్ని కొన్ని సందర్భాలలో దేవుని వాక్యానికి భిన్నముగా బ్రతికారు. నోవహు అయినా, అబ్రాహామైనా, మోషే అయినా, దావీదైనా, ప్రవక్తలలో ఇంకెవరైనా గాని, వారి జీవితములో దేవుని వాక్యము పూర్తిగా నెరవేరలేదు. అందుకే యేసుక్రీస్తు మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను ఆయన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేర్చాడు. ఇలా ఆయన నెరవేర్చిన తరువాత శిష్యులు లేఖనములను గ్రహించునట్లుగా ఆయన వారి మనస్సు తెరచి 'క్రీస్తు శ్రమపడి మూడవదినమున మృతులలోనుండి లేచుననియు, యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయనపేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది' అని తెలియజేసాడు. ధర్మశాస్త్రమనే కాడిని తొలగించి తొలుత ఇశ్రాయేలీయులకు, తద్వారా సర్వమానవాళికి దేవుని కుమారుడైన యేసుక్రీస్తు రక్షణను ప్రకటించాడు. (కొనసాగింపును తదుపరి పాఠములో చదవండి)

-----×------

## ప్రశ్నలు

**1) ఇశ్రాయేలీయులకు దేవుడు ధర్మశాస్త్రమును పరిచయం చేసిన విధానమును తెలియజేయండి.**

**2) ధర్మశాస్త్రమునకు లోనైనవారు ఎవరు? వారు ధర్మశాస్త్రమును ఏలాగు పాటింపవలెను?**

**3) 'ధర్మశాస్త్రము చేత ఎవడును దేవుని యెదుట నీతిమంతుడని తీర్చబడడు' - చర్చించండి.**

**4) ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు; క్రీస్తు నందలి విశ్వాసము వలనైన నీతి; ఈ రెండిటి మధ్య వ్యత్యాసమును వివరించండి.**

**5) 'మనిషిని జీవింపజేయ శక్తి లేని ధర్మశాస్త్రము దేవుని వాగ్దానములకు విరోధమైనది కాదు' - వివరించండి.**

**6) ధర్మశాస్త్రమును అతిక్రమించిన యూదులు; ధర్మశాస్త్రమును నెరవేర్చిన యేసుక్రీస్తు; - ఉదాహరణల ద్వారా ఈ**

రెండు సన్నివేశాలను నిర్ధారించండి.

7) క్రీస్తు ధర్మశాస్త్రమును నెరవేర్చి, దానిని ఏ విధముగా కొట్టివేసెనో వివరించండి.

మునుపటి పాఠములో ధర్మశాస్త్రమనగా ఏమిటో, దాని ప్రారంభము ముగింపు ఎలా జరిగాయో, దానికి నిర్ణయింపబడినవారు ఎవరో, దానిని యేసుక్రీస్తు ఏ విధముగా నెరవేర్చి కొట్టివేసాడో సవివరముగా చదివి గ్రహించారని ఆశిస్తున్నాను. ఇంతవరకు మీకు అర్ధమైతే ఇక మీదట ధర్మశాస్త్రము యొక్క అవసరత నేటి క్రైస్తవ్యానికి ఎంతవరకు ఉందో లేఖనముల వెలుగులో నేర్చుకుందాము.

**యోహాను సువార్త 1 : 17 'ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను; కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను.'** ధర్మశాస్త్రానికి ప్రారంభికుడు మోషే అయితే, దేవుని కృపకు సత్యమునకు ప్రారంభికుడు యేసుక్రీస్తు. ఇశ్రాయేలీయులందరినీ పాపములో బంధించిన ధర్మశాస్త్రమును మోషే ఇస్తే, ఇశ్రాయేలీయులతో పాటు సర్వలోకమునకు దేవుని కృపను యేసుక్రీస్తు అనుగ్రహించాడు. పై వాక్యభాగములో మోషేను మరియు యేసుక్రీస్తును ఎందుకు పోల్చి వ్రాయబడింది? వారిద్దరికీ ఒక విషయములో సారూప్యత ఉంది. అదే నిబంధన విషయము! మోషే పాత నిబంధనకు ప్రారంభికుడైతే, క్రీస్తుయేసు క్రొత్త నిబంధనకు ప్రారంభికుడు. అందుకే వీరిద్దరినీ పోల్చి వెంటవెంటనే ఈ వాక్యభాగములో మాట్లాడుతున్నాడు. ధర్మశాస్త్రము, దేవుని కృప ఈ రెండూ ఒకదానికొకటి సారూప్యత కలిగినవి మరియు ఒకదాని వెంబడి మరొకటి వచ్చినవి. ఒకదానిని మరొకటి మ్రింగివేసినది. ఒకదానిని మరొకటి కొట్టివేసినది. ఒకదానికంటే మరొకటి మరి బలమైనది. ఈ రెండింటిలో ఏది దేనిని మ్రింగివేసింది? ఏది దేనిని కొట్టివేసినది? ఏది దేనికంటె మరి బలమైనది? మోషే ద్వారా ధర్మశాస్త్రము, యేసుక్రీస్తు ద్వారా కృపయు సత్యమును అనుగ్రహింపబడ్డాయి. మోషే ద్వారా అనుగ్రహింపబడ్డ ధర్మశాస్త్రం చివరకు ఆ మోషేనే బ్రతికించలేకపోయింది, మోషే నడిపించిన ఇశ్రాయేలు జనాంగాన్నీ రక్షించలేకపోయింది. యేసుక్రీస్తు ద్వారా అనుగ్రహింపబడ్డ కృపయు సమాధానము ఆయనతో పాటు అనేకమందిని నిత్యజీవములోనికి నడిపించింది. ఇందువలన ధర్మశాస్త్రము ఎవరిద్వారా అనుగ్రహింపబడిందో ఆ మోషే కూడా ఈ క్రీస్తుయేసు కృప దగ్గరికే వచ్చేసాడు. ఈ సత్యమునే మోషే ఆశ్రయించాడు. నేటి క్రైస్తవులలో కూడా అనేకమంది ఈ స్పష్టమైన జ్ఞానమును అర్ధంచేసుకోకుండా గ్రుడ్డిగా ఇంకా ధర్మశాస్త్రాన్నే చూస్తున్నారు. ధర్మశాస్త్రములో వారికి నచ్చిన కొన్ని విషయాలను వారు పాటించాలనుకుంటున్నారు. ఈ ధర్మశాస్త్రము ద్వారానే పరలోకానికి వెళ్లాలని విఫలయత్నాలు చేస్తున్నారు. నాటి ఇశ్రాయేలీయులవలె నేటి క్రైస్తవులు కూడా సున్నతి చేయించుకోవాలని, దశమ భాగములను ఇవ్వాలని, యెరూషలేము యాత్రలు చేయాలని, పండుగలు అమావాస్య విశ్రాంతి దినము మున్నగువాటిని ఆచరించాలని, బలులు అర్పణలు పూర్ణాంగహోమములు దేవుని పేరిట నిర్వహించాలని అనుకుంటున్నారంటే వీరికి ఈ పాఠముపై కనీసపు అవగాహన లేదని అర్ధమవుతోంది. అలాంటి నామకార్ధ క్రైస్తవుల మనో నేత్రములు తెరిపించడానికి దేవుని వాక్యపు పరిశోధనలోనికి అడుగుపెడదాం.

**గలతీయులకు వ్రాసిన పత్రిక 2 : 15- 'మనము జన్మము వలన యూదులమే గాని అన్యజనులలో చేరిన పాపులము కాము. మనుష్యుడు యేసుక్రీస్తునందలి విశ్వాసమువలననే గాని ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమున నీతిమంతుడుగా తీర్చబడడని యెరిగి మనమును ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలమున గాక క్రీస్తునందలి విశ్వాసమువలననే నీతిమంతులమని తీర్చబడుటకై యేసుక్రీస్తునందు విశ్వాసమువలననే యున్నాము. ధర్మశాస్త్ర సంబంధ క్రియలమూలమున ఏ శరీరియు నీతిమంతుడని తీర్చబడడు గదా.'** ప్రారంభ శతాబ్దపు సంఘములో మొదట యూదులుగా మరియు ఇశ్రాయేలీయులుగా ఉండి తరువాత యేసుక్రీస్తు సువార్తను అంగీకరించి ఆయన నామమున బాప్తిస్మమును పొంది క్రైస్తవులుగా మారినవారు కొందరున్నారు. అటువంటి వారిని ఉద్దేశిస్తూ అపొస్తలుడైన పౌలు మనము అన్యజనులలో చేరిన పాపులము కాదు అంటున్నాడు. అన్యజనులకు మనకు ధర్మశాస్త్రమును బట్టి వ్యత్యాసం ఉంది అంటున్నాడు. ఆ తరువాత ఏ మనుష్యుడైనా యేసుక్రీస్తునందలి విశ్వాసము వలననే కాని, ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలమున

నీతిమంతునిగా తీర్చబడడని యెరిగి మనమును ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలమున గాక యేసుక్రీస్తునందలి విశ్వాసమువలననే నీతిమంతులమని తీర్చబడుటకై ఆయన యందు విశ్వాసముంచి యున్నాము అంటున్నాడు. ఇక్కడ పౌలు మాటలలో చాలా స్పష్టముగా మనుష్యుడు ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా నీతిమంతుడని తీర్చబడడని చెబుతున్నాడు. అందువలన విశ్వాసమునుబట్టి ఇశ్రాయేలీయులంతా క్రీస్తు ద్వారా నీతిమంతులుగా మారిపోవాలి. అతడు ఇశ్రాయేలీయుడు కావచ్చు, అతడు అన్యజనుడు కావచ్చు. ధర్మశాస్త్రము వలనైన క్రియల మూలమున ఏ శరీరియు నీతిమంతుడని తీర్చబడడు. ఈ భూమి మీద యేసుక్రీస్తు ఒక్కడే ధర్మశాస్త్రమును తన విషయమై పరిపూర్ణముగా నెరవేర్చి దానిని తొలగించాడు. ముఖ్యంగా ఇశ్రాయేలీయుల మీద నుంచి ఆ ధర్మశాస్త్రమనే కాడిని తీసేసాడు. ఇంత గొప్ప అవకాశాన్ని యేసుక్రీస్తు కల్పించినప్పుడు, లేదు లేదు మరల మాకు ఆ కాడి మాత్రమే కావాలి అంటున్నారంటే అలాంటివారు నిత్యత్వానికి చాలా దూరములో ఉన్నారని గమనించాలి. ఒకప్రక్క యేసుక్రీస్తును నమ్ముకున్న క్రైస్తవులమని ఈ లోకానికి కనబరచుకొంటున్నారు. మరోప్రక్క ధర్మశాస్త్రములో వ్రాయబడిన కొన్ని వచనములను వారికి అనుకూలముగా మలచుకొని అదే క్రీస్తును వారి జీవితాలకు దూరం చేసుకుంటున్నారు. ఇది చాలా దౌర్భాగ్యపు పరిస్థితి!

**గలతీయులకు వ్రాసిన పత్రిక 2 : 21 'నేను దేవుని కృపను నిరర్థకము చేయను; నీతి ధర్మశాస్త్రమువలననైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే.'** ఒకవేళ ఎవరైనా ఇప్పటికి కూడా నీతి ధర్మశాస్త్రమువలననే కలుగుతుంది అని చెబితే, ఒక మనిషి కేవలం ధర్మశాస్త్రము వలననే పరలోకమునకు వెళ్లగలడు అని అంటే - ఆ పక్షమందు దేవుని కుమారుడైన యేసుక్రీస్తు సిలువ మీద చనిపోయినది నిష్ప్రయోజనమే కదా అని వ్రాయబడింది. అంటే ధర్మశాస్త్రమును అడ్డుపెట్టుకుంటూ దైవకుమారుని సిలువ త్యాగాన్ని కూడా నిష్ప్రయోజనముగా మార్చుచున్నవారు దౌర్భాగ్యులు కారంటారా? యేసుక్రీస్తు తన సిలువ మరణము ద్వారా పరలోకానికి వెళ్లే మార్గాన్ని ఒక మహాభాగ్యముగా అనుగ్రహిస్తుంటే ఇంకా ధర్మశాస్త్రపు మార్గములోనే వెళతాను అనుకునే వారిని ఏమనాలి చెప్పండి? ఇలాంటివారు ఎంత భయంకరులంటే, వారెలాగూ పాతాళానికి జారిపోతారు; కానీ వారితో పాటుగా వారి బోధలను గ్రుడ్డిగా నమ్మినవారిని కూడా తమతోపాటు నరకపాత్రులుగా చేస్తున్నారు. ఇటువంటివారు తమ మతములో కొందరు అమాయకులను కలుపుకోవడానికి బైబిల్‌లోనే ధర్మశాస్త్ర సంబంధమైన కొన్ని వచనములను చూపిస్తారు. అంటే, ఆ వచనములు దేవుడు ఒకప్పుడు ఇశ్రాయేలీయులకు చెప్పిన వచనములన్నమాట. ధర్మశాస్త్రంలో దేవుడు దశమభాగమును ఇమ్మని చెప్పాడంటూ, సున్నతి చేయించుకోవాలని దేవుడు ఆజ్ఞాపించాడంటూ, పండుగలను ఆచరించాలంటూ, విశ్రాంతి దినాన్ని పరిశుద్ధముగా పాటించాలంటూ, యెరూషలేము యాత్రలు చేయాలంటూ... ఇలా వారికి నచ్చినవి, వారు మెచ్చినవి మాత్రమే అమాయకులకు చెబుతారు. నిజంగా బైబిల్‌ను పరిశోధించకపోతే మొదటిసారి వారు చెప్పిన మాటలకే అమాయకులైన వారంతా నిజమని నమ్మేస్తారు. చూసారా! ఇదంతా అపవాదియైనవాడు కొంతమంది మనుష్యుల ద్వారా చేస్తున్న గారడీ! ఏ విధముగానైనా క్రీస్తు సిలువ త్యాగాన్ని నిర్వీర్యం చేయడానికి నేటికీ జరుగుతున్న ఒక భయంకరమైన కుట్ర. ఈ భూమిపై ఈనాడే కాదు ఏనాటికైనా ఒక మనిషికి నీతి ఆపాదించబడాలంటే అది దేవుని కుమారుడైన క్రీస్తు వలననే సాధ్యం. ఒకవేళ నీతి ధర్మశాస్త్రము వలననే కలిగితే క్రీస్తు చనిపోవడం కూడా నిష్ప్రయోజనమే అవుతుంది. ధర్మశాస్త్రం ఎవరికైతే ఉద్దేశించబడి ఇవ్వబడిందో ఆ ఇశ్రాయేలీయులలో ఏ ఒక్కరైనా ఆ ధర్మశాస్త్రము ద్వారా నీతిని సంపాదించుకున్నారా? లేదు. మోషే, దావీదు, సమూయేలులాంటి ఎందరో హేమాహేమీలున్నా ఏ ఒక్కరికీ ధర్మశాస్త్రము నీతిని ఆపాదించలేకపోయింది. నీతిమంతులందరూ తమ నీతిని దైవసుతుని వలననే పొందగలిగారు. యేసుక్రీస్తు ఈ భూమి మీద జీవించియున్న కాలములో యూదులు ఇశ్రాయేలీయులు ఆయన మహాజ్ఞానాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నం చేసారు. అప్పటివరకు వారు ధర్మశాస్త్రమును తమకు అనుకూలముగా మలచుకొని వారి పబ్బం వారు గడుపుకొంటున్న సందర్భములో యేసు బోధలు వినే సరికి వారంతా ఆశ్చర్యపడుతూ ఆయనను ఎలాగైనాసరే నిర్బంధించడానికి ప్రయత్నిస్తున్నారు. అప్పుడు యేసుక్రీస్తు వారినిగూర్చి ఏమంటున్నాడో చూడండి.

**యోహాను సువార్త 7 : 19 'మోషే మీకు ధర్మశాస్త్రము ఇయ్యలేదా? అయినను మీలో ఎవడును ఆ ధర్మశాస్త్రమును**

**గైకొనడు; మీరెందుకు నన్ను చంపజూచుచున్నారని వారితో చెప్పెను.'** ఇశ్రాయేలీయులకు మోషే ధర్మశాస్త్రమును ఇచ్చాడు. నిజంగా ఆనాటి ఇశ్రాయేలీయులలో ఎవరికైనా మోషే మీద, ధర్మశాస్త్రము మీద గౌరవం ఉంటే వారు ధర్మశాస్త్రమును తు.చ. తప్పకుండా పాటించి చూపించాలి. వారి జీవితకాలములో ఏ ఒక్క విషయంలో ధర్మశాస్త్రమును తప్పిపోయినా మొత్తంగా ధర్మశాస్త్రమును మీరినట్టే కదా. అటువంటి పరిస్థితులలో ఒకవైపు ధర్మశాస్త్రమును అనేక విషయములలో అతిక్రమిస్తూ, మరొకవైపు యేసు బోధలను వారు నిరాకరిస్తున్నారు. అందుకే వారి జీవితాలను యేసు ఆనాడు బహిరంగముగా ఎండగడుతున్నాడు. ఆనాటి ఇశ్రాయేలీయులలో ఎవడునూ ధర్మశాస్త్రాన్ని గైకొనడు. కానీ, దేవుని కృపను అనుగ్రహించి సత్యములోనికి నడిపిస్తున్న యేసును వారు నిరాకరిస్తున్నారు. ఆయన మరణించి పునరుత్థానుడై తిరిగి వెళ్లిన తరువాత ప్రారంభపు శతాబ్దములో దేవుని వాక్యమును వీరోచితముగా ప్రకటిస్తున్న స్తెఫను మాటలలో కూడా ఈ భావజాలాన్ని చూడండి.

**అపొస్తలుల కార్యములు 7 : 53 'దేవదూతల ద్వారా నియమింపబడిన ధర్మశాస్త్రమును మీరు పొందితిరిగాని దానిని గైకొనలేదని చెప్పెను.'** ఆనాడు మోషే సీనాయి పర్వతము మీద రాతిపలకలను దేవదూతలద్వారా పొందాడు. పరలోకమందున్న దేవుడు ఆజ్ఞలు కలిగిన రాతి పలకలను దేవదూతలకి ఇచ్చి పంపించాడు. వారు భూమి మీద మోషే చేతులకు వాటిని అందజేసారు. ఆ విధముగా పొందిన ధర్మశాస్త్రమును ఇశ్రాయేలీయులు, యూదులు పాటించడం లేదు. దేవుడు మోషేకు ధర్మశాస్త్రమును ఇవ్వడం, ఆ ధర్మశాస్త్రమును ఇశ్రాయేలీయులు నెరవేరుస్తారేమో అని ఆయన ఎదురు చూడడం, ఆ తరువాత కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుడైన యేసును పంపించడం జరిగిపోయాయి. అటువంటి పరిస్థితులలో ఇంకా ధర్మశాస్త్రమునే పట్టుకొని వ్రేలాడుతున్న ఆనాటి యూదులు, ఇశ్రాయేలీయులతో దైవజనుడైన స్తెఫను యేసుక్రీస్తును గూర్చిన సువార్తను ప్రకటిస్తున్నప్పుడు వారా మాటలు వినగానే కోపముతో మండిపడి అతనిని చూచి పండ్లు కొరికిరి అని వ్రాయబడింది. ఆనాడు స్తెఫను యూదులతో ఉన్నమాట చెబితే వారికి కోపం వచ్చింది. లేనిమాటలు చెబితే మాత్రం తెగ ఆనందపడిపోతున్నారు. ధర్మశాస్త్రము ద్వారా మనము పరలోకం వెళతామంటే సంతోషించే ఈ దుష్టలోకం అలాగని ఆ ధర్మశాస్త్రమును పాటిస్తుందా అంటే అంత సామర్థ్యం వారికి లేదు. ధర్మశాస్త్రములో మనకు నచ్చినవి కొన్ని చేసి, నచ్చని మిగిలిన వాటిని విడిచిపెడితే అది నీతి అనిపించుకుంటుందా? దేవుని పేరిట ఒక గుడిని కట్టుకోవడం, గుడిలో ఒక గంట పెట్టుకోవడం, ఏఫోదును ధరించుకోవడం, సున్నతి చేయించుకోవడం, విశ్రాంతి దినమును, పండుగలను ఆచరించడం... మొదలైనవన్నీ మాకిష్టం కనుక చేస్తాం; ఇంకా ధర్మశాస్త్రములో బోలెడుంటాయి వాటిని మేము చేయలేము అంటే దాని వలన నీతి ఆపాదించబడుతుందా? ధర్మశాస్త్రము ఆనాడే కాదు; ఈనాటికీ ఏనాటికైనా ఏ ఒక్కరికీ నీతిని ఆపాదించదు. అందుకే దేవుడు తన ప్రియ సుతుడైన యేసును ఈ లోకానికి ఒక వరముగా అనుగ్రహించాడు. మనుష్యులు నిజంగా క్రైస్తవ్యమును స్వీకరిస్తే వారు పరిపూర్ణముగా సత్యమును అనుసరించి నడుచుకొనేవారుగా ఉంటారు.

ఇప్పుడు పాఠకులకు ఒక సందేహము రావచ్చు. అదేమిటంటే ధర్మశాస్త్రము ఇంత భయంకరమైనదైనప్పుడు, కఠినమైనదైనప్పుడు, ధర్మశాస్త్రము వలన ఏ ఒక్కరూ నీతిమంతులుగా తీర్చబడలేరు అనుకున్నప్పుడు మరి ఈ ధర్మశాస్త్రాన్ని మనము కలిగి ఉండడమెందుకు? దానిని బైబిల్ నుండి తొలగించి కేవలం క్రొత్తనిబంధననే కలిగియుందామా? దీనిని మాత్రమే చదువుదామా? ఆదికాండము మొదలుకొని మలాకీ గ్రంథము వరకు పుస్తకాలను తీసేద్దామా? లేదు, అట్లనకూడదు. వాటిని మనము తప్పకుండా చదవాలి. పాతనిబంధనను మనము ఖచ్చితంగా కలిగి ఉండాలి. అందుకే దేవుడు వాటిని కూడా మన దగ్గర ఉంచాడు. ఇలా చేయడం వెనుక దేవుడు ఒక రహస్యాన్ని చెబుతున్నాడు. పాత నిబంధన మన చేతుల్లో ఉండడం వెనుక దేవుడు ఒక పరమార్థాన్ని తెలియజేస్తున్నాడు. ఏ ధర్మశాస్త్రమైతే ఇశ్రాయేలీయులు పాటించలేదని ఆయన చెప్పాడో ఆ ధర్మశాస్త్రాన్ని మనుష్యులంతా కలిగి ఉండాలి. ఎందుకంటే దానిని వారు చదవాలి. అందులో ఉన్న సంగతులు నేర్చుకోవాలి. అలాగని వాటిని గైకొనడానికైతే మాత్రం కాదు. చరిత్రలో ఇశ్రాయేలీయులు ఏ విధముగా తప్పటడుగులు వేసారో మనము నేర్చుకోవాలి. ఏ విషయములలో మనుష్యులు బలహీనులైపోయారో ఆయా విషయములలో క్రీస్తుయేసు

ద్వారా నిత్యత్వాన్ని సంపాదించడానికి ప్రయత్నించాలి. ఇదే దేవుడు ధర్మశాస్త్రమును మనకు చేరువ చేయడంలో ఆయన ప్రధానమైన ఉద్దేశ్యం. ఈ విషయమును ఆయన తన గ్రంథమందు స్పష్టం చేస్తున్నాడు.

**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 10 : 11- 'ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను.'** ధర్మశాస్త్రమును మనము ఆచరిస్తామని కాదు; అందులో ఉన్న సారాంశాన్ని నేర్చుకోవాలని దేవుడు ఆశిస్తున్నాడు. ఆనాడు దేవుని ధర్మశాస్త్రాన్ని పాటించని వారు ఆ విధముగా సంహరింపబడ్డారు గనుక నేడు దేవుని జ్ఞానాన్ని అనుసరించకపోతే నేను కూడా అలాగే సంహరింపబడతాననే విషయం మనకు అర్థం కావాలి. ధర్మశాస్త్రంలో ఉన్నదంతా దేవుని జ్ఞానమే. ఈ విషయంలో చదువరులు పొరపాటు పడకూడదు. ధర్మశాస్త్రము కఠినమైనదే కావచ్చు; కానీ అందులో ఉన్నది మాత్రం దేవుని జ్ఞానమే. అందుకే యేసుక్రీస్తు ఆయన మాటలలో కూడా ధర్మశాస్త్రమును నేను కొట్టివేయుటకు రాలేదు, నెరవేర్చి ఆ బంధకాలలో నుండి మిమ్ము‌ను విడిపించుటకు వచ్చాను అంటున్నాడు. నిజంగా ధర్మశాస్త్రము అపవిత్రమైనదైతే యేసు దానిని ఎందుకు నెరవేర్చాలి? ఆయన దానిని నెరవేర్చకుండానే కొట్టివేయవచ్చు కదా. కనుక ఒకవైపు ధర్మశాస్త్రము చాలా పవిత్రమైనది; మరోవైపు దానిని పాటించకుండా దాని నుండి సారాంశమును గ్రహించాలి. అందుకే ధర్మశాస్త్రమందలి సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడ్డాయి. ఆదాము కాలం, నోవహు కాలం, అబ్రాహాము కాలం, మోషే కాలం, దావీదు కాలం, ప్రవక్తల కాలం... ఈ సంఘటనలన్నీ చదివిన తరువాత మనము ఎలా బ్రతకాలో మనకు అర్థమవ్వాలి. దేవునికి అనుకూలముగా ఏమి చేయాలో, దేవునికి భిన్నముగా ఏమి చేయకూడదో తెలుసుకోవాలి. ఎందరో భక్తుల జీవితాలను ఉదాహరణలుగా ధర్మశాస్త్రమందు దేవుడు ఎందుకు వ్రాయించాడంటే వాటి ద్వారా మనము పాఠాలను నేర్చుకోవాలి. అలాగే దుష్టులైన వారు ఎలా ప్రవర్తించారో అలా మనము ఉండకూడదని పాఠమును నేర్చుకోవాలి. అంతవరకే తప్ప, ధర్మశాస్త్రములో ఇశ్రాయేలీయుల కొరకు దేవుడు వ్రాయించిన విధి విధానాలను, ఆచారాలను మనము ఈనాడు పాటించవలసిన అవసరత లేనే లేదు. ఎందుకంటే, అంతకంటె పవిత్రమైన క్రీస్తు నూతన నిబంధన మన కొరకు ఎదురు చూస్తోంది. కానీ దీని కొరకు మనకు ధర్మశాస్త్రమనే సహాయం కావాలి. ధర్మశాస్త్రము ఒక బాల శిక్షకునిగా నూతన నిబంధన దగ్గరకు మనలను నడిపిస్తోంది. దీనిని అపొస్తలుడైన పౌలు గలతీయులకు వ్రాసిన పత్రిక ద్వారా ధృవీకరిస్తున్నాడు.

**గలతీయులకు వ్రాసిన పత్రిక 3 : 24- 'కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము'** ఉదాహరణకు, చిన్నపిల్లలకు ఇంకా నడక రాని పరిస్థితులలో వారు నడవాలి అంటే ఏమి చేస్తారు? ఒక మూడు చక్రాల బండిని తయారుచేసి, దానిని పట్టుకుని వారితో ఒక్కొక్క అడుగు ముందుకు వేయించడానికి ప్రయత్నిస్తారు. ఇలా ఎంతకాలం చేస్తారు? ఆ చిన్నారులకు నడక వచ్చేంత వరకు చేస్తారు. వారు తమంతట తాము నడిచేంత వరకు వారి తల్లిదండ్రులో లేక సంరక్షకులో వారికి సహాయం చేస్తారు. కానీ ఆ చిన్నారులు వారి జీవితాంతం అలా ఉండిపోవాలని మాత్రం ఎవరూ కోరుకోరు. వారు తమంతట తాము స్వయంగా నడిచేంతవరకు వారి చేతికి ఒక సహాయముగా మూడు చక్రాల బండినిచ్చి దానిని పట్టుకొని నడవమని చెబుతారు. అలా కొంతకాలానికి వారికి నడక వచ్చేస్తుంది. నడక వచ్చిన తరువాత కూడా ఆ బండినే పట్టుకొని నడుస్తున్నారనుకోండి అప్పుడు చూచినవారంతా ఏమంటారు? అలా నడవకూడదు, దానిని ప్రక్కన పడేసి నీయంతట నీవు మామూలుగా నడువు అంటారు. ప్రియులారా! యేసుక్రీస్తు యొద్దకు మనుష్యులను నడిపించడానికి ధర్మశాస్త్రము ఒక బాలశిక్షకునిలాంటిది. ఈ విషయమును దేవుడు తన గ్రంథమందు ఎంత స్పష్టంగా వ్రాయించాడో చూడండి. అయినాసరే నేటికీ చాలామందికి ఇది అర్థం కావడం లేదు. అలాగని ధర్మశాస్త్రము మన దగ్గరుండాలి! ఉంటేనే సర్వసత్యమును గూర్చి మనకు పరిపూర్ణముగా అర్థమవుతుంది. కానీ దానిని పాటించడానికి కాదు, దానిని చదివి క్రొత్త నిబంధనను మనము పాటించాలి. ఆ కాలమున ఉన్న ఇశ్రాయేలు ప్రజలకు, అన్యజనులకు ఏమేమి సంభవించాయో తెలుసుకొని యేసుక్రీస్తు వచ్చి సుమారు 2000 సంవత్సరాలు గడచిన తరువాతి కాలములో జీవిస్తున్న మనము పరిపూర్ణులుగా ఎలా జీవించాలో పూర్తిగా అర్థమయ్యేటట్లుగా ధర్మశాస్త్రమును

మనము పరిశోధిస్తూ చదివి దానిని గ్రహించాలి. ఇంకా ధర్మశాస్త్రమును గూర్చి కొన్ని వివరణలను పరిశీలిద్దాం.

**యూదా పత్రిక 1 : 7 'ఆ ప్రకారముగానే సొదొమ గొమొఱ్ఱాలును వాటి చుట్టుపట్లనున్న పట్టణములును వీరివలెనే వ్యభిచారము చేయుచు, పరశరీరానుసారులైనందున నిత్యాగ్నిదండన అనుభవించుచు దృష్టాంతముగా ఉంచబడెను.'** ఆనాడు సొదొమ గొమొఱ్ఱా పట్టణాలు ఎందుకు నాశనం చేయబడ్డాయి? వారు పరశరీరానుసారులైనందున ఆకాశము నుండి అగ్ని గంధకములను దించి ఆ పట్టణములను దేవుడు కాల్చేసాడు. ఈ ఉదంతం రాబోయేటటువంటి మనుష్యులకు దృష్టాంతము. ఆనాడు వారికి సంభవించాయి గనుక మనమలా చేయకూడదని నేర్చుకొను నిమిత్తం దేవుడు వారికి శిక్ష విధించాడు. వారి జీవితాలలో జరిగినవన్నీ దృష్టాంతములుగా మన మార్పు కొరకు పాఠాలుగా వ్రాయబడ్డాయి. వాటన్నిటినీ చదివిన మనము జ్ఞానమును నేర్చుకొను నిమిత్తం అవి వ్రాయబడ్డాయి. ధర్మశాస్త్రమైనా, క్రొత్త నిబంధనైనా దేవుని మాటలలో ప్రతిమాట విలువైనది, శ్రేష్టమైనది. కానీ, ఏది పాటించదగినది? ఏది చదివి, దాని ద్వారా జ్ఞానమును నేర్చుకోదగినది అనేది తెలుసుకోవాలి. పాతనిబంధనలోని ఆజ్ఞలను చదివి వాటి ద్వారా జ్ఞానమును నేర్చుకోవాలి. క్రొత్తనిబంధనలోని ఆజ్ఞలను చదివి వాటిని మనము చక్కగా పాటించాలి. ఈ రోజు మనిషి పాటించవలసిన వాటినన్నిటినీ వదిలేసాడు. ఏవైతే పాటించకనక్కరలేదో వాటిని గట్టిగా పట్టుకుంటున్నాడు. అవి కేవలం బాల శిక్షకునిలాంటివి; అవి కేవలం ఛాయలాంటివి.

**రోమీయులకు వ్రాసిన పత్రిక 15 : 4 'ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలని ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి'.** ఓర్పు వలనను లేఖనములవలనైన ఆదరణవలనను మనకొక గొప్ప నిరీక్షణ కలగాలి. అవును, పూర్వమందు జనులకు ఈ విధంగా జరిగింది. ఇప్పుడు మనకు ఏ విధంగా జరుగుతుందనేది అర్థం చేసుకోవాలి. అందుకే, పూర్వము నోవహు దినములు ఎలాగుండెనో మనుష్యకుమారుని రాకడ కూడా ఆలాగే ఉండును అని యేసుక్రీస్తు అన్నాడు. నోవహు దినములలో జరిగిన దానిని ఇప్పుడు మీరు జ్ఞాపకము చేసుకోండి అని అంటున్నాడే తప్ప మీరు కూడా చితిసారకపు మ్రాను కోసం ఎక్కడెక్కడికో వెళ్లి, నోవహు కట్టినట్టే ఒక మూడంతస్థులు కలిగినటువంటి ఓడను కట్టమని చెప్పడం లేదు. అప్పటి ఓడ వేరు, ఇప్పటి ఓడ వేరు. చూసారా! అప్పటి సంగతులన్నీ మనకు దృష్టాంతములుగా వ్రాయబడ్డాయి. అందుకే యేసుక్రీస్తు దానిని జ్ఞాపకం చేసుకోమంటున్నాడు. అప్పటికాలంలో ఎలా జరిగిందో తెలుసుకుంటే ఇప్పటికాలంలో శిక్షను తప్పించుకునే అవకాశం కలుగుతుంది. కనుక అది ఛాయ, ఇది నిజం! అప్పుడు జరిగిన దానిని లేఖనములలో చదివి, మీరు ఆదరణ పొందాలి. దానిని చదివిన వారు నిరీక్షణను కలిగి ఉండాలి. ఓర్పుతో దేవుని పనిని ముందుకు కొనసాగించాలి. ముందు జరిగినదంతా ఒక ఉదాహరణ. అందుకే పాతనిబంధన గ్రంథం మన దగ్గరుండాలి, ధర్మశాస్త్రం మన దగ్గరుండాలి, వాటిని మనము జాగ్రత్తగా పఠించాలి.

**హెబ్రీయులకు -వ్రాసిన పత్రిక 10:1 'ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపము గలదికాదు గనుక ఆ యాజకులు ఏటేట ఎడతెగకుండ అర్పించు ఒక్కటే విధమైన బలులు వాటిని తెచ్చువారికి ఎన్నడును సంపూర్ణ సిద్ధి కలుగజేయ నేరవు.'** ఒకవేళ ధర్మశాస్త్రము ద్వారానే అనేకమంది మనుష్యులు నీతిమంతులైతే ఇక యేసుక్రీస్తు పరలోకమునుండి ఈ భూమి మీదకు రావలసిన అవసరం లేదు కదా. కానీ అలా జరుగలేదు. దేవుని సంకల్పం ప్రకారం నియమ నిబంధనలు కలిగిన ధర్మశాస్త్రమును ముందుగా ఇశ్రాయేలీయులకిచ్చి, ఆ తరువాత వారు దానిని పాటించలేకపోయేసరికి తన కుమారుని ద్వారా క్రొత్త నిబంధనను ఇవ్వాలి. అందుకే ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల (అనగా క్రొత్త నిబంధన యొక్క) ఛాయగలదియేగాని ఆ వస్తువుల యొక్క నిజస్వరూపము మాత్రం కాదు. ముందుగా ఇవ్వబడిన ధర్మశాస్త్రములో నిజస్వరూపమైతే లేదు; అందులో ఛాయ (నీడ) మాత్రమే ఉంది. నీడ మనుష్యులను పరలోకం చేర్చలేదు. నీడ గతించిపోతుంది కానీ నిజస్వరూపము క్రీస్తులో ఉంది. ఆనాడు ఎందరో యాజకులు ఇశ్రాయేలీయుల పేరిట ఎన్నో బలులను, అర్పణలను దేవునికి అర్పించినా ఏనాడూ ఏ అర్పణా వారిని దేవునికి అనుసంధానం చేయలేకపోయింది. యేసుక్రీస్తు అనే నిజమైన అర్పణ మాత్రమే దేవునికి నచ్చింది. అది మాత్రమే మనుష్యుల పేరిట పరలోకపు సన్నిధికి వెళ్ళింది. తండ్రీ, సర్వలోకము నిమిత్తం ఇదిగో నా ప్రాణమును నీ చేతికి అప్పగించుకొనుచున్నాను

అని యేసు పలికి తన ప్రాణమును ఒక అర్పణగా దేవునికి ఇచ్చాడు. ఆ అర్పణ వలన సర్వజాతి మనుష్యులు యేసుక్రీస్తును అంగీకరించినవారై పరలోకానికి వెళ్లగలిగే అవకాశం కల్పించబడింది. అసలు ధర్మశాస్త్రము ఎవరెవరికి నిర్ణయింపబడిందో చాలా స్పష్టంగా దేవుడు మరొక వాక్య భాగములో వ్రాయించాడు.

**తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 1 : 8- 'అయినను శ్రీమంతుడగు దేవుడు నాకు అప్పగించిన ఆయన మహిమగల సువార్త ప్రకారము, ధర్మశాస్త్రము ధర్మవిరోధులకును అవిధేయులకును భక్తిహీనులకును పాపిష్టులకును అపవిత్రులకును మతదూషకులకును పితృహంతకులకును మాతృహంతకులకును నరహంతకులకును వ్యభిచారులకును పురుషసంయోగులకును మనుష్యచోరులకును అబద్ధికులకును అప్రమాణికులకును, హితబోధకు విరోధియైనవాడు మరి ఎవడైనను ఉండినయెడల, అట్టివానికిని నియమింపబడెనుగాని, నీతిమంతునికి నియమింపబడలేదని యెవడైనను ఎరిగి, ధర్మానుకూలముగా దానిని ఉపయోగించినయెడల ధర్మశాస్త్రము మేలైనదని మనమెరుగుదుము.'** ఇంకా ఇప్పటికీ ధర్మశాస్త్రమును పాటిస్తానని ఎవరైనా అంటే, వారు పైన చెప్పబడిన లిస్ట్‌లో ఏదో ఒకదానికి చెందినవాడన్నమాట. అందుకే నేటికీ వారు ధర్మశాస్త్రాన్ని వదలలేకపోతున్నారని అర్థం. ఒక్కమాటలో చెప్పాలి అంటే, ధర్మశాస్త్రము ధర్మవిరోధులందరికీ నియమింపబడెను. కానీ ధర్మశాస్త్రము నీతిమంతునికి నియమింపబడలేదని ఎవరైనా ఎరిగి ధర్మానుకూలముగా దానిని ఉపయోగించిన యెడల ధర్మశాస్త్రము మేలైనదని యెరుగుదుము. ఇప్పుడు ధర్మానుకూలముగా ధర్మశాస్త్రమును ఉపయోగించడమంటే ఏమిటో తెలుసుకుందాము. నేటి క్రైస్తవులు ధర్మానుకూలముగా ధర్మశాస్త్రమును ఉపయోగించడమంటే దానిలో వ్రాయబడిన సంగతులను పాఠములుగా నేర్చుకుంటూ క్రొత్త నిబంధనలో ఉన్న ప్రతి ఆజ్ఞను పాటించడమే! ధర్మశాస్త్రాన్ని నేటి క్రైస్తవులు ఎలా వినియోగిస్తున్నారు? ధర్మశాస్త్రము వారికెలా ఉపయోగపడుతుంది? ధర్మానుకూలముగా దానిని ఉపయోగిస్తున్నారా? ఒక కత్తి కూరగాయలు తరుగుకోవడానికీ ఉపయోగపడుతుంది, నరహత్య చేయడానికీ ఉపయోగపడుతుంది. వీటిలో కత్తిని దేనికి ఉపయోగించాలి? జీవార్థమై ఉపయోగించాలే తప్ప మరణార్థమై కాదు కదా. అటువలె ధర్మశాస్త్రమును కూడా జీవార్థమై ఉపయోగించదలిచితే దానిని దృష్టాంతముగా నేర్చుకోవాలి. ధర్మవిరోధులు, అవిధేయులు, భక్తిహీనులు, పాపిష్టులు, అపవిత్రులు, మతదూషకులు, పితృహంతకులు, మాతృహంతకులు, నరహంతకులు, వ్యభిచారులు, పురుషసంయోగులు, మనుష్యచోరులు, అబద్ధికులు, అప్రమాణికులు, హితబోధకు విరోధియైనవాడు ఎవడైనా ఉంటే అట్టివాడు.. ఇలా ఉండగోరువారైతేనే వారు ధర్మశాస్త్రమును పాటించవచ్చు. అట్టివారు పాతాళానికే జారిపోతారని లేఖనము స్పష్టం చేసింది. ఇలాంటి దుష్క్రియలను వదలలేక పోతున్నవారెవరైనా ఉంటే వారందరూ ధర్మశాస్త్రము చెంతకే వెళతారు. ఎందుకంటే ధర్మశాస్త్రములో ఏముంది? ఒకడు పాపమును చేస్తే దాని కొరకు దేవునికి ఒక బలిని అర్పించమని ఉంది. మళ్లీ పాపము చేస్తే మళ్లీ బలి అర్పించవచ్చు. ఇలా పాపము చేసుకుంటూ.. మరో ప్రక్క బలిని అర్పించుకుంటూ పోతే ఇక మనిషి నీతిమంతుడయ్యేది ఎన్నడు? కనుక మనిషిని ధర్మశాస్త్రము వారి వారి పాపములలోనే బంధించి ఉంచుతుంది. కానీ యేసు ద్వారా ఇవ్వబడిన క్రొత్తనిబంధన అలా కాదే. ఒక్కసారే ఆయన మన కొరకు బలియై మనలను నీతిమంతులుగా చేసి ఇక పాపము జోలికి వెళ్లనివ్వకుండా చేస్తున్నాడు. దేవునికి కావలసినది ఇదే కదా.

నేరస్తులుంటేనే పోలీసుల అవసరత ఉంది. నేరస్తులుంటేనే కోర్టుల అవసరత ఉంటుంది. నేరస్తులే లేకపోతే వారి అవసరత ఏముంది. దేశంలో అందరూ మంచివారే ఉంటే పోలీసులు ఖాళీగా ఉంటారు, న్యాయవాదులు న్యాయమూర్తులు ఖాళీగా ఉంటారు, జైళ్లు ఖాళీగా ఉంటాయి. అలాగే, దేవుని ప్రణాళిక చొప్పున ప్రజలందరూ నీతిమంతులైతే ధర్మశాస్త్రము యొక్క అవసరత ఏముంది? అలాగని ధర్మశాస్త్రము మంచిది కాదా? మంచిదే. లోకములో మన మధ్యనున్న న్యాయమూర్తులు మంచివారు కాదా? పోలీసులు మంచివారు కాదా? మంచివారే. నేరస్తులున్నారు కాబట్టి వీరి అవసరత వచ్చింది. అలాగే, ఆనాడు ఇశ్రాయేలీయులలో భూమి మీద అనీతిమంతులున్నారు కనుక ధర్మశాస్త్రము యొక్క అవసరత వచ్చింది. కానీ దాని వలన ఏ ఒక్కడూ నీతిమంతునిగా తీర్చబడలేకపోయేసరికి యేసుక్రీస్తు వచ్చి దాని అవసరతను లేకుండా చేసాడు. ఆయన ధర్మశాస్త్రము పూర్తిచేసి దానిని నివారణ చేసాడు. కనుక నేటికైతే ధర్మశాస్త్రము

నీతిమంతులకు నియమింపబడలేదని యెరిగి ఎవడైనను ధర్మానుకూలముగా దానిని ఉపయోగించినయెడల ధర్మశాస్త్రము మేలైనదని తెలుసుకోవాలని వ్రాయబడింది. ధర్మశాస్త్రమును ధర్మానుకూలంగా ఉపయోగించుకోవాలి. ధర్మశాస్త్రమును చదవాలి, నేర్చుకోవాలి, అనేకమందికి బోధ కలిగేటట్లుగా చెప్పాలి. కానీ ఆ విధులను పాటించవలసిన అవసరత లేదు. వాటికంటె మరి శ్రేష్టమైన క్రొత్తనిబంధనను పాటించాలి. ధర్మానుకూలంగా ఉపయోగించుకోవడం అంటే ఇదే. క్రీస్తు త్యాగమును నిష్ప్రయోజనం చేయకుండా నిత్యమైన క్రొత్త నిబంధన యొద్దకు మనము వెళ్లాలి. అందుకే దేవుడు క్రొత్త నిబంధనను ఇస్తానని ముందుగానే చెప్పాడు.

యిర్మీయా గ్రంథము 31 : 31 **'ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు.'** ధర్మశాస్త్రము ఇంకా ఇశ్రాయేలీయులకు అమలులో ఉన్న కాలములోనే దేవుడు చెప్పిన ఈ వాక్యమును పరిశీలించండి. ధర్మశాస్త్రాన్ని దేవుడు పాతదిగా మార్చివేయబోతున్నాడు. అంటే యేసుక్రీస్తు మొదటి రాకడకు అప్పటికి కాలము సమీపమౌతుందన్నమాట. ఆయన ఇశ్రాయేలీయులకు, యూదులకు మాత్రమే ధర్మశాస్త్రమును ఇచ్చాడు గనుక వారితోనే ఈ మాటను ముందుగా చెప్పాడు. అన్యజనులకైతే ధర్మశాస్త్రముతో సంబంధము లేదు గనుక వారు సరాసరి క్రొత్త నిబంధన యొద్దకే చేర్చబడతారు. ఇశ్రాయేలీయుల విషయమైతే వారు అప్పటికి ధర్మశాస్త్రము యొక్క ఆధీనములో ఉండుటనుబట్టి వారితో దేవుడు ఈ మాటలు చెప్పాడు. అందుకే ఆయన ఏమంటున్నాడంటే - ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను, యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి. అవి రానే వచ్చాయి. అవి వచ్చి, సుమారు 2000 సం.లు గడచిన కాలములో నేడు మనము ఉన్నాము. ఇప్పుడు మనము క్రొత్త నిబంధనలో ఉంటూ క్రొత్త నిబంధన ప్రకారము చెప్పబడిన దానిని నెరవేరుస్తూ, మరొకవైపు పాత నిబంధనలో ఉన్న దానిని చదివి నేర్చుకుంటూ యేసుక్రీస్తు ద్వారా ఆయన మార్గములో నిత్యత్వానికి సాగిపోవాలి. క్రొత్తనిబంధన వచ్చినప్పుడు పాతనిబంధన తీసివేయబడింది. క్రీస్తు పాతనిబంధనను పూర్తిచేసిన తరువాత దానిని కొట్టివేసాడు. ఒకవేళ ఆయన కొట్టివేయకపోతే ఇప్పటికీ మనుష్యులంతా ఏటేటా దేవునికి బలులు అర్పిస్తూనే ఉండాలి. ఇప్పటికీ ధర్మశాస్త్రంలో వ్రాయబడిన అనేకమైన విధులను చేయవలసి వచ్చేది. కానీ అలా జరుగలేదు. పరలోకపు తండ్రి మహాకృపనుబట్టి యేసుక్రీస్తు నామమున బాప్తిస్మమును పొంది, ఆయన రాజ్యములో చేర్చబడి, సర్వసత్యములో ముందుకు సాగిపోవాలి. గనుక ఈ భావమును మరల ఆయన మరొక వాక్యభాగములో తెలియజేసాడు.

ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 2 : 14 **'ఆయన మన సమాధానమైయుండి మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రమును, తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్యగోడను పడగొట్టి, మన ఉభయులను ఏకము చేసెను.'** చూసారా! ఇశ్రాయేలీయులకు అన్యజనులకు మధ్య ఉన్న ప్రధానమైన వ్యత్యాసం ఒక్కటే. అదే ధర్మశాస్త్రము. ఒకనాటి కాలంలో ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రముంది, అన్యజనులకు ధర్మశాస్త్రం లేదు. ఇప్పుడు యేసుక్రీస్తు వచ్చిన తరువాత ఆయన ద్వారా పరలోకానికి వెళ్ళాలనుకొంటున్న ప్రతి ఒక్కరినీ ఆయన సమాధానపరుస్తూ అందులో ఇశ్రాయేలీయులను అన్యజనులను అందరినీ కలిపేస్తున్నాడు. ఇక వారి మధ్య మునుపటివలె వ్యత్యాసం లేదు. వారి మధ్యలో ఉన్న గోడే ధర్మశాస్త్రము. యేసు ధర్మశాస్త్రమనే మధ్యగోడను పడగొట్టి ఉభయులను ఏకము చేస్తున్నాడు. అంటే ఆయన ధర్మశాస్త్రాన్ని తీసేస్తున్నాడు. ఆయన దగ్గర ఇప్పుడు అందరూ సమానమే. యూదుడైనా గ్రీసుదేశస్తుడైనా, ఇశ్రాయేలీయుడైనా అన్యుడైనా, పురుషుడైనా స్త్రీయైనా, క్రీస్తునందు అందరూ ఏకముగా ఉన్నారు. ధర్మశాస్త్రము అమలులో ఉంటే ఇలా చెప్పడానికి వీలు లేదు. అప్పుడు ఒకడు హెచ్చుగా ఒకడు తక్కువగా ఉండేవారు. కానీ ఇప్పుడు యేసులో ఎటువంటి భేదమూ లేదు. అందరినీ తన సిలువ మరణముతో సమానులనుగా చేయడానికే ఆయన అంత వేదన, బాధ అనుభవించాడనుటలో ఎటువంటి సందేహమూ లేదు. కనుక ఆయన చెంతకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన నిత్యజీవప్రధాత. ఇక కొందరైతే ఎన్ని చెప్పినా వినరు; వారు సాతాను కుమారులుగా ఉండటానికే ఇష్టపడతారు. అట్టివారిని గూర్చి కూడా దేవుడు వ్రాయించిన మాటలను జ్ఞాపకం చేసుకోండి.

కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 3 : 14- 'మరియు వారి మనస్సులు కఠినములాయెను గనుక

**నేటివరకును పాతనిబంధన చదువబడునప్పుడు, అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక, ఆ ముసుకే నిలిచియున్నది.'** ఇంతకీ ఇక్కడ ఎవరి మనస్సులు కఠినములాయెను? ఇప్పటికీ ధర్మశాస్త్రమును పాటించాలి అనుకుని భ్రమపడినటువంటివారి మనస్సులు కఠినములైపోతాయి. ఇప్పటికీ ఇంకా చాలామంది ఇలాంటివారిని గూర్చి అప్పుడప్పుడు వింటున్నాము కదా. విశ్రాంతి దినమును పాటించాలని, ఇశ్రాయేలీయుల పండుగలను ఆచరించాలని, దశమభాగమును ఇవ్వాలని, యెహోవా సాక్షులమని చెప్పుకుంటున్నవారి మనస్సులు కఠినపరచబడతాయని దేవుడు ఆనాడే వ్రాయించాడు. గనుకనే ఇప్పటివరకు కూడా వారు పాత నిబంధనను చదువుతున్నప్పుడు అది ఇంతకు మునుపే క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక, ఆ ధర్మశాస్త్రమనే ముసుకే ఇంకా వారికి నిలిచియున్నది. ఇంకా ఆ బాలశిక్షకుని క్రిందే, ఇంకా ఆ ఛాయలోనే వారి బ్రతుకులను వెళ్లదీసుకుంటున్నారు. ఇలాంటివారు ఇంకెప్పుడు పరలోకానికి వస్తారు. అంటే వీరు అతి భయంకరమైన స్థితిలో ఉన్నారన్నమాట. నీతి విషయములో వెఱ్ఱివారుగా మారిపోయారన్నమాట. భక్తి ముసుకులో ఇంకా భక్తిహీనులుగానే ఉన్నారన్నమాట. అందుకే దేవుడు ఏమంటున్నాడో జాగ్రత్తగా చూడండి. ఎందుకంటే భవిష్యత్తు తరాలలో మీరు ఈ మాటలను అనేకమందికి అందించాలి. ఈ మాటలు మీతోనే సమాధి కాకూడదు. నేను వీటిని మీకు అందిస్తున్నాను. మీరు సమాజములోకి వెళ్లి అనేకమందిని వెలిగించాలి. ఎంతోమంది మీ చుట్టుప్రక్కల ఉన్నవారు అజ్ఞానములో ఉండిపోయారు. ధర్మశాస్త్రమును పాటించి దాని ద్వారానే పరలోకమునకు వెళ్లాలనుకునే అజ్ఞానములో ఉండిపోయారు. గనుక వారందరికీ ఈ వాక్యములను నేర్పాలి. దేవుని ప్రణాళికను తెలియజేయాలి. అందుకే ఈ రచన ద్వారా మీకు ధర్మశాస్త్ర సంబంధమైన వివరాలనన్నింటినీ ఇస్తున్నాను. విషయమును కేవలం రెండు ముక్కల్లో చెప్పలేక కాదు. ఈ రిఫరెన్స్‌లన్నీ మీకు ఎందుకు వ్రాస్తున్నానంటే ఏ ఒక్కడూ దేవుని సంకల్పమును, యేసు త్యాగమును నీరు గార్చే విఫలయత్నం చేయకూడదు. మీరు వీటిని తెలుసుకుని, జాగ్రత్తపడి భవిష్యత్తు తరాలలో ఎవ్వరూ ధర్మశాస్త్రమును గూర్చి తప్పుగా మాట్లాడకుండా యేసుక్రీస్తు బలియాగాన్ని ఒక మహాభాగ్యంగా వీరోచితముగా ప్రకటించేటట్టుగా మీరు దీనిని నేర్చుకోవాలి.

**కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 3 : 15- 'నేటివరకును మోషే గ్రంథము వారు చదువునప్పుడెల్ల ముసుకు వారి హృదయముల మీదనున్నది గాని వారి హృదయము ప్రభువువైపునకు ఎప్పుడు తిరుగునో అప్పుడు ముసుకు తీసివేయబడును.'** ధర్మశాస్త్రమనే ముసుకు వారి హృదయముల మీద ఉండిపోయింది గనుక మోషే గ్రంథమును చదువుతున్నప్పుడు దానిని ఎలా అర్థం చేసుకోవాలో వారికి తెలియలేదు. దేవుడు ఏ ఉద్దేశ్యంతో తన గ్రంథమందు ఈ మాటలన్నిటిని ఆయా ప్రవక్తలచేత వ్రాయించాడో వాటి పరమార్థం ఇట్టివారికి తెలియదు. కానీ ఇప్పటికీ మించి పోయింది లేదు. నేటి మనుష్యులు ఇంకా భూమి మీద జీవించి ఉన్నారు గనుక, ఇప్పుడు వారి హృదయమును ప్రభువు వైపు త్రిప్పుకుంటే ఆ ముసుకును తీసి స్పష్టముగా చూడగలిగినవారవుతారు. అదే వారికి నిత్యజీవమార్గము.

**గలతీయులకు వ్రాసిన పత్రిక 4 : 24- 'ఈ సంగతులు అలంకార రూపకముగా చెప్పబడియున్నవి. ఈ స్త్రీలు రెండు నిబంధనలై యున్నారు. వాటిలో ఒకటి సీనాయి కొండ సంబంధమైనదై దాస్యములో ఉండుటకు పిల్లలను కనును; ఇది హాగరు. ఈ హాగరు అనునది అరేబియాదేశములో ఉన్న సీనాయి కొండయే. ప్రస్తుతమందున్న యెరూషలేము దాని పిల్లలతోకూడ దాస్యమందున్నది గనుక ఆ నిబంధన దానికి దీటయియున్నది. అయితే పైనున్న యెరూషలేము స్వతంత్రముగా ఉన్నది; అది మనకు తల్లి.'** మోషే ధర్మశాస్త్ర గ్రంథమును, క్రొత్త నిబంధనను ఇక్కడ అలంకార రూపంలో పోల్చి చెబుతున్నాడు. పితరుడైన అబ్రాహాము భార్యలనిద్దరినీ ఇక్కడ ఉదాహరణగా తీసుకుంటున్నాడు. ఈ రెండు నిబంధనలు ఇద్దరు స్త్రీలకు పోలికగా ఉన్నాయి. అనగా, అలంకారము రూపములో చెప్పబడ్డాయి. ఒకటి హాగరు అయితే మరొకటి శారా. హాగరు ద్వారా పుట్టినది దాస్యములో ఉండిపోయింది. శారా ద్వారా పుట్టినది స్వతంత్రత కలిగినదై వాగ్దాన పుత్రులుగా విరాజిల్లుతోంది. అందుకే ఈ స్త్రీలు రెండు నిబంధనలకు గుర్తుగా ఉన్నారు. వాటిలో ఒకటి, అనగా ధర్మశాస్త్రము ప్రస్తుతము అరేబియా దేశంలో ఉన్న సీనాయి కొండ సంబంధమైనదై దాస్యములో ఉండుటకు పిల్లలను కనును; ఇది హాగరు. ప్రస్తుమందున్న యెరూషలేము, అనగా ఇశ్రాయేలీయులు వారి పిల్లలతో కూడా దాస్యమందున్నారు. గనుక పాతనిబంధన దానికి దీటయియున్నది. అయితే, పైనున్న యెరూషలేము స్వతంత్రముగా ఉన్నది; అది మనకు తల్లి! యేసుక్రీస్తు దాస్యములో

ఉన్నటువంటి బంధకాలలో నుండి మనుష్యులను విడిపించి, స్వతంత్రత కలిగిన పరలోకపు యెరూషలేమునకు మార్గమును చూపిస్తున్నాడు. ఇప్పుడు చెప్పండి! ఈ రెండు నిబంధనలలో మీరు దేనిని ఎన్నుకుంటారు? ఖచ్చితముగా లేఖనములనుబట్టి రెండవ నిబంధనే మనుష్యజాతి నిత్యజీవ ప్రదాయిని!

**రోమీయులకు వ్రాసిన పత్రిక 10 : 4 'విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు.'** హేబెలు మొదలుకొని యేసుక్రీస్తు రెండవ రాకడవరకు విశ్వసించు ప్రతి ఒక్కరికి నీతి ధర్మశాస్త్రము వలన కలుగదు. అందుకే యేసుక్రీస్తు ఒక పరిసయ్యుడు సుంకరులను గూర్చి ఉపమాన భావమును తెలియజేస్తూ, పరిసయ్యుడు తన ప్రార్థనలో తాను వారమునకు రెండు మారులు ఉపవాసము చేయుచు, తన సంపాదనయంతటిలో దశమభాగమును ఇచ్చుచున్నానని చెప్పినా అతని ప్రార్థన అంగీకరింపబడలేదు. వాని ప్రార్థన పరలోకపు దేవుని సన్నిధికి చేరకుండా అక్కడే ఆగిపోయింది. అయితే దూరమున నిలుచున్నటువంటి సుంకరి తన ప్రార్థనలో, ప్రభువా ఆకాశమువైపు కన్నులెత్తుటకైనను ధైర్యముచాలక తన రొమ్ము కొట్టుకొనుచు దేవా, పాపినైన నన్ను కరుణించుమని పలికెను. ఈ సుంకరి ప్రార్థన పరలోకపు సన్నిధికి చేరి దేవునిచే క్షమింపబడి నీతిమంతునిగా తీర్చబడి తన ఇంటికి వెళ్లెనని చెప్పాడు. **(లూకా సువార్త 18 : 9 - 14)** దీనినిబట్టి పరలోకమందున్న తండ్రియైన దేవుడు ఒక మనిషి నుండి ఏమి కోరుకుంటున్నాడో చెప్పండి. తన కుమారుడైన యేసుక్రీస్తువారి ద్వారా కృపను స్వీకరించి, దేవునిపై విశ్వాసము కలిగి బ్రతికే వారే దేవునికి కావాలి. ఎవరైతే తమ స్వనీతిని ఆధారము చేసుకొని భూమి మీద తమ గాంభీర్యాన్ని ప్రదర్శిస్తారో వారు దేవునికి అక్కరలేదు. అటువంటివారిని దేవుడు లెక్కించడంలేదు. వారు పరలోకములో ప్రవేశించలేరు. ఇక రోమీయులతో పౌలు ఏమంటున్నాడో చూడండి. 'విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియైయున్నాడు.' ధర్మశాస్త్రమును గూర్చి దేవుడు తన గ్రంథములో ఎన్నెన్ని ఆధారాలనుంచాడో చూడండి. క్రీస్తే ధర్మశాస్త్రమునకు సమాప్తము! విశ్వసించువారికి మాత్రమే ఈ విషయం అర్థమవుతుంది. విశ్వాసుల విషయంలో క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు; అవిశ్వాసులు ఇంకా ధర్మశాస్త్రాన్ని పాటించాలి అనుకుంటే వారికి మాత్రం ఇంకా ధర్మశాస్త్రము కొనసాగుతుంది. అట్టి అవిశ్వాసులకు ఇక క్రీస్తు అక్కరలేదు. వారు నరకానికి జారిపోతారు. అందులో సందేహమే లేదు. యేసుక్రీస్తు ధర్మశాస్త్రమును ముగించాడు. ఇప్పుడు మనమంతా ఆయన దగ్గరకు మాత్రమే వెళ్లాలి. ఆయన ద్వారా విశ్వాసమును కలిగి ఉండాలి. ఆయనను ధరించుకుని అన్ని విషయములలో క్రీస్తువలె ఉండుటకు పాటుపడదాం. క్రొత్తనిబంధనలో ఆయన మనకు నేర్పించిన పరిపూర్ణమైన జ్ఞానమును గ్రహించి నిత్యజీవపు మార్గములో పయనిద్దాం. ఇలా మొదటి శతాబ్దములో అపొస్తలుడైన పౌలు క్రీస్తును గూర్చి ప్రకటిస్తుంటే ఆయన మీద నాటి యూదులు ఇశ్రాయేలీయులు తప్పుడు మాటలను ప్రయోగించారు. ఎందుకంటే, 'సత్యవాది లోకవిరోధి' అన్నట్టుగా నిజాన్ని చెప్పి ఎవరినైనా రక్షించాలనుకుంటే అది వారికి గిట్టదు. ఇలా దేవుని వాక్యమును ఆధారాలతో పౌలు ఆనాడు ప్రకటిస్తున్నప్పుడు ఆయనను వాక్యముతో ఎదుర్కొనలేక, చంపాలని ప్రయత్నిస్తున్నారు. పైగా పౌలు ధర్మశాస్త్రానికి విరోధముగా మాట్లాడుతున్నాడని ఆయన మీద అభియోగాలు వేస్తున్నారు.

**అపొస్తలుల కార్యములు 23 : 28 'వారు అతని మీద మోపిన నేరమేమో తెలిసికొనగోరి నేను వారి మహాసభయొద్దకు అతనిని తీసుకొనివచ్చితిని. వారు తమ ధర్మశాస్త్రవాదములను గూర్చి అతనిమీద నేరము మోపిరే గాని మరణమునకైనను, బంధకములకైనను తగిన నేరము అతనియందేమియు కనుపరచలేదు.'** చూసారా! యూదులు పౌలు మీద ధర్మశాస్త్రమునుబట్టి ఒక నేరాన్ని మోపాలనుకుంటున్నారు. కాని పౌలు మరణమునకైనను, బంధకములకైనను తగిన నేరమేమీ చేయలేదని ఆనాటి రోమా అధికారులు ఒకరికి ఒకరు లేఖల ద్వారా పై విధముగా తెలియజేసుకుంటున్నారు. ధర్మశాస్త్ర సంబంధమైన వాదములు! అంటే పౌలు ఈ జ్ఞానమును చెబుతున్నందుకు ఆ రోజు వారు వాదమును పెట్టుకుంటున్నారు. చివరకు దేవుని కుమారుడైన యేసును అంగీకరించని వారు పౌలును ఒక నేరస్తునిగా చిత్రీకరిస్తున్నారు. ధర్మశాస్త్రమును అపార్థం చేసుకొనే ప్రతివారు తమ్మును తామే పొడుచుకొని నిత్యాగ్నిలోనికి జారిపోతారు. పౌలు తన బాల్యము నుండి ధర్మశాస్త్రమును అనుసరిస్తున్నవాడైనా క్రీస్తును అంగీకరించిన తరువాత ఇక ఎన్నడూ ధర్మశాస్త్రము జోలికి వెళ్లలేదు.

**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 9 : 20 'యూదులను సంపాదించుకొనుటకు యూదులకు యూదునివలె ఉంటిని. ధర్మశాస్త్రమునకు లోబడినవారిని సంపాదించుకొనుటకు నేను ధర్మశాస్త్రమునకు లోబడినవాడను కాకపోయినను, ధర్మశాస్త్రమునకు లోబడినవానివలె ఉంటిని.'** చూసారా! ఆనాడు యూదులకు యేసుక్రీస్తును పరిచయం చేయాలంటే పౌలు నిజానికి ధర్మశాస్త్రమునకు లోబడినవాడు కాకపోయినప్పటికీ ధర్మశాస్త్రమునకు లోబడినవానివలె ఉన్నాడు. అలాంటి వారిని యేసుక్రీస్తులోనికి తీసుకురావాలంటే పౌలు యుక్తిగా ఎలా ప్రవర్తిస్తున్నాడో చూడండి. అలాగని పౌలు ధర్మశాస్త్రానికి లోబడినవాడా? కాదు. ధర్మానుకూలంగా ధర్మశాస్త్రాన్ని ఉపయోగించువాడు మాత్రమే. అందుకే ఏమంటున్నాడంటే, ధర్మశాస్త్రమునకు లోబడినవారిని రక్షించడానికి తాను ధర్మశాస్త్రానికి లోబడినవాడను కాకపోయినా లోబడినవానిగా వారి మధ్య ఉండవలసి వచ్చింది అంటున్నాడు. వారికి పౌలు ద్వారా క్రీస్తు పరిచయమైన తరువాత అసలు నిజాన్ని చెబుతాడు. వారు ఇశ్రాయేలీయులలో పుట్టారు గనుక ధర్మశాస్త్రమనే ఉచ్చులో బంధింపబడిపోయారు. ఒక రకంగా ఇది సాధారణమైన విషయమే. కానీ ఇశ్రాయేలీయులుకాని నేటి అన్యజనులలో కొందరు అబద్ధ బోధలకు అలవాటుపడి సత్యసంబంధమైన క్రీస్తును దూరం చేసుకుంటున్నారంటే వీరినేమనాలి? ధర్మశాస్త్రమును పాటించడానికి ఏనాడూ పౌలుగాని పేతురుగాని ప్రారంభ శతాబ్ధపు శిష్యులుగాని అపొస్తలులు గాని నిజ క్రైస్తవులెవరైనాగాని ఒప్పుకోరు. ఎందుకంటే క్రీస్తు ధర్మశాస్త్రానికి సమాప్తియైయున్నాడు. ఆ 'క్రీస్తు ద్వారా మాత్రమే' మనము పరలోకానికి వెళ్లాలి. మరల చెబుతున్నాను, ధర్మశాస్త్రము కేవలం ఇశ్రాయేలీయుల కొరకే ఇవ్వబడింది; ఇశ్రాయేలీయుల దగ్గర నుంచి కూడా 2000 సంవత్సరాల క్రితమే యేసుక్రీస్తు దానిని నెరవేర్చి, తీసేసాడు. తద్వారా క్రొత్త నిబంధనను ఇశ్రాయేలీయులతోపాటు అందరికీ అనుగ్రహించాడు. ఇంత శ్రేష్టమైనటువంటి, మరిగొప్పదైనటువంటి నిబంధనను ఆయన సర్వలోకమునకు అనుగ్రహించాడు. దాని ద్వారా మనలను పరలోకానికి తీసుకొని వెళ్లాలని ఆయన ఆశ పడుతున్నాడు. దేవునిపై విశ్వాసము కలిగినవారమై, ఆయన జ్ఞానమును నేర్చుకున్నవారమై పరలోకము కొరకు ఎదురు చూద్దాం. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు అనుగ్రహించిన క్రొత్త నిబంధనను పాటిస్తూ, ధర్మశాస్త్రాన్ని ధర్మానుకూలంగా ఉపయోగిద్దాం! యేసుక్రీస్తు ప్రభువు పేరిట మీకు సమాధానము కలుగును గాక!

-------x-------

## ప్రశ్నలు

**1) మోషే ద్వారా అనుగ్రహింపబడిన ధర్మశాస్త్రము; యేసుక్రీస్తు ద్వారా అనుగ్రహింపబడిన కృప మరియు సత్యము; - వీటిని వివరించండి.**

**2) ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలకంటె క్రీస్తునందలి విశ్వాసము ఎంత ఉన్నతమైనదో వివరించండి.**

**3) ఇశ్రాయేలీయులలో ఏ ఒక్కరూ ధర్మశాస్త్రమును పరిపూర్ణముగా నెరవేర్చలేకపోయారని యేసు చెప్పిన మాటలను వివరించండి.**

**4) 'క్రీస్తు నొద్దకు నడిపించుటకు ధర్మశాస్త్రము ఒక బాలశిక్షకుడు' - వివరించండి.**

**5) ధర్మశాస్త్రమందలి దృష్టాంతములను నేటి క్రైస్తవ్యం ఏలాగున పరిగ్రహించాలి?**

**6) 'క్రీస్తు పాత నిబంధనను కొట్టి వేసెను' అని లేఖనముల ద్వారా వివరించండి.**

**7) ధర్మానుకూలముగా ధర్మశాస్త్రమును ఉపయోగించుట ఎలా? వివరించండి.**

## 7. క్రైస్తవుల పండుగలు ఆచరణీయమా? శోచనీయమా?

పండుగ అనగా, అందరికీ ఆనందాన్ని సంతోషాన్ని ఇచ్చే ఒక వేడుక. ఉత్సవం, మహోత్సవం, పర్వదినం ఇలా అనేక పర్యాయపదాలతో పిలువబడుతున్న పండుగ కార్యక్రమాలు నేటి సమాజంలో మనుష్యుల మధ్య గొప్పగా జరగడాన్ని మనము చూస్తున్నాం. కుటుంబములో ఎవరిదైనా పుట్టినరోజు వస్తే ఇంటిలో ఆ రోజు పుట్టినరోజు పండుగ. ఎవరిదైనా పెళ్లిరోజు వస్తే అదొక పెళ్లిరోజు పండుగ. ఉద్యోగం వచ్చినా, కుమారుడు లేక కుమార్తె పుట్టినా, ఇల్లు కట్టుకున్నా లేక ఇంటిలో ఏదైనా శుభకార్యం జరిగినా ఆ ఇల్లంతా పండుగ వాతావరణంతో నిండిపోతుంది. ఇవి ఒక ఇంటికి లేక కొన్ని కుటుంబాలకు సంబంధించిన పండుగలు. ఈ క్రమంలో దేవునికి సంబంధించినటువంటి పండుగలు కూడా తరచు మనము చూస్తుంటాము. వారు నమ్మిన విశ్వాసములో కొందరు దేవుని పేరిట చేసే పండుగలు కూడా ఉన్నాయి. ఒక పండుగ వస్తే, ఇది ఫలానా వారి పండుగ అని; మరొక పండుగ వస్తే ఇది మరొకరి పండుగ అని చెబుతూ ఉంటారు. ఇది మా దేవుని పండుగ, ఇది మీ దేవుని పండుగ అని చెప్పుకునే మాటలను మనము వింటున్నాము. అంటే ఒకరు నమ్మిని దేవునికి సంబంధించిన పండుగను మరొకరి విశ్వాసంలో జరిగితే ఇది వారి పండుగ అని సరిపెట్టుకుంటారు. ఆ రోజు వారు మాత్రమే క్రొత్తబట్టలు వేసుకుంటారు, తోరణాలు కట్టుకుంటారు, చిన్నచిన్న లైట్‌లు వెలిగిస్తారు, బాకానాదాలు పెట్టుకుంటారు; ఇది మా పండుగండి అంటారు. మిగిలినవారు మాత్రం సాధారణమైన బట్టలతోనే ఉంటారు. వారు ఇది మా పండుగ కాదు గనుక మేము జరుపుకోము అంటారు. అంటే, పండుగ అనేసరికి ఒక వ్యక్తికి సంబంధించిన పండుగ, ఒక ఇంటిలో పండుగ, కుటుంబాలకు సంబంధించిన పండుగ, ఒక వర్గానికి సంబంధించిన పండుగ, ఒక దేవునికి సంబంధించిన పండుగ! చూసారా.. అందరూ ఏదో ఒక సందర్భంలో వారి ఇష్టాయిష్టాలనుబట్టి పండుగలను ఆచరించడానికే ప్రయత్నిస్తున్నారు. ఇంతకీ ఈ పండుగలు ఎలా వచ్చాయి? మనిషికి పండుగ చేసుకోవాలనే కోరిక ఎలా పుట్టింది? దీనితో మన పరిశోధనను ప్రారంభిద్దాం.

మనిషి ప్రారంభకాలానికి మనము వెళితే అక్కడ ఆదాము, హవ్వ అను ఇద్దరు మనుష్యులు ఉన్నారు. వారిద్దరికీ అప్పటికి పండుగలేమీ లేవు. ఉన్నది ఇద్దరే! సంతోషమైనా దు:ఖమైనా వారిద్దరిలోనే ఉంటుంది. ఆ తరువాత వారిద్దరికీ పిల్లలు పుట్టారు. హవ్వకు మొదటి కుమారుడైన కయీను పుట్టినప్పుడు ఆమె- 'యెహోవా దయ వలన నేను ఒక కుమారుని సంపాదించుకున్నాను' అని పలికింది. ఆ రోజు ఆమెకు నిజంగా సంతోషకరమైన దినమే. కానీ ఆమె దానిని పండుగగా జరపుకున్నట్టు ఎక్కడా దాఖలాలు లేవు. ఆ తరువాత సంతాన వ్యాప్తి చెందారు. కష్టాలు, సుఖాలు అనుభవిస్తున్నారే గాని, పండుగలను ఆచరించినట్టుగా మనకెక్కడా కనిపించదు. అంటే, ఆదికాలములో పండుగలనేవి లేవు. మరి పండుగలు మనుష్యులలోనికి ఎలా వచ్చాయి? పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ చరిత్రలో ఇశ్రాయేలీయులు దేవుని పేరిట పండుగలను ప్రారంభించారు. ప్రపంచంలోని మిగిలిన జాతులు వీరిని చూచిన తరువాతే వారి వారి పండుగలను రూపొందించుకున్నారు. మేము కూడా పండుగలను ఆచరించాలి, ఉత్సవ కాలాలు జరుపుకోవాలి, సంవత్సరంలో మాకు కూడా ఆయా కాలాలు వచ్చినప్పుడు పండుగలను ఆచరించాలి అనేటువంటి భావన ఇశ్రాయేలీయుల ద్వారా సర్వ ప్రపంచానికి ప్రాకింది. ఇప్పుడున్నవారు ఏ విశ్వాసములో ఉన్నా గాని దీనికి మూలం అంటూ ఎక్కడ ఉంది అంటే ఇశ్రాయేలీయుల దగ్గరే ఉంది. ఈ ఇశ్రాయేలీయులలో పండుగలు ఎలా ప్రారంభమయ్యాయో చూద్దాం.

**లేవీయకాండము 19 : 1- 'మరియు యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను - ఇశ్రాయేలీయుల సర్వసమాజముతో ఇట్లు చెప్పుము. మీరు పరిశుద్ధులై యుండవలెను. మీ దేవుడనైన యెహోవానగు నేను పరిశుద్ధుడనై యున్నాను. మీలో ప్రతివాడును తన తల్లికి తన తండ్రికి భయపడవలెను. నేను నియమించిన విశ్రాంతిదినములను ఆచరింపవలెను; నేను మీ దేవుడనైన యెహోవాను.'** విశ్రాంతిదినాచారం, పండుగ ఆచారం, ఉత్సవ ఆచారం.. ఇవన్నీ ఇశ్రాయేలీయులే

ప్రారంభించారు. వారు దేవుని ఆజ్ఞను బట్టి వాటిని ప్రారంభించారు. దీని తరువాతనే మిగిలిన ప్రపంచానికి దేవుని పేరిట కూడా పండుగలు చేయవచ్చనే విషయం తెలిసింది. ఇంతకీ ఇశ్రాయేలీయులను విశ్రాంతిదినాన్ని ఆచరించమనుటలో దేవుని ఉద్దేశ్యం ఏమిటంటే, పని పూర్తి చేసినవాడు విశ్రాంతిని పొందాలనే భావన వారికి అర్థం కావాలి. దేవుడు మనిషి కోసం పని చేసాడు, ఇప్పటికీ పనిచేస్తున్నాడు. విశ్రాంతి పనిని వెంబడిస్తుంది. గనుక ప్రతి మనిషి తన జీవితకాలమంతా పని చేసి, దేహాన్ని విడిచిపెట్టిన తరువాత విశ్రాంతి పొందాలనే భావనను తెలియజేయడానికి దేవుడు ఇశ్రాయేలీయులకు విశ్రాంతి దినమును ప్రవేశపెట్టాడు. పని చేస్తే దేవుడు విశ్రాంతినిస్తాడు అనే విషయం జ్ఞాపకంలో ఉండాలి. దీనిని దేవుడు నేర్పించటానికి, పరిశుద్ధతను ఇశ్రాయేలీయులలో చూడటానికి వారిని విశ్రాంతిదినమును ఆచరించమన్నాడు. ఇంతకీ వారు ముఖ్యముగా ఏయే పండుగలను ఆచరించారో చూద్దాం.

- పస్కా పండుగ (పులియని రొట్టెల పండుగ)
- కోత పండుగ / ఫలసంగ్రహపు పండుగ
- ప్రథమ ఫలముల పండుగ (వారముల పండుగ, సంవత్సరాంతమందు పంటకూర్చు పండుగ)
- పర్ణశాలల పండుగ

**నిర్గమకాండము 12 : 1- 'మోషే అహరోనులు ఐగుప్తు దేశములో ఉండగా యెహోవా వారితో ఈలాగు సెలవిచ్చెను - నెలలలో ఈ నెల మీకు మొదటిది, యిది మీ సంవత్సరమునకు మొదటి నెల. మీరు ఇశ్రాయేలీయుల సర్వ సమాజముతో - ఈ నెల దశమినాడు వారు తమ తమ కుటుంబముల లెక్కచొప్పున ఒక్కొక్కడు గొఱ్ఱెపిల్లనైనను, మేకపిల్లనైనను, అనగా ప్రతి యింటికిని ఒక గొఱ్ఱెపిల్లనైనను ఒక మేకపిల్లనైనను తీసికొనవలెను. ఆ పిల్లను తినుటకు ఒక కుటుంబము చాలక పోయినయెడల వాడును వాని పొరుగువాడును తమ లెక్కచొప్పున దాని తీసుకొనవలెను. ఆ గొఱ్ఱెపిల్లను భుజించుటకు ప్రతివాని భోజనము పరిమితినిబట్టి వారిని లెక్కింపవలెను. నిర్దోషమైన యేడాది మగపిల్లను తీసికొనవలెను. గొఱ్ఱెలలో నుండియైనను మేకలలో నుండియైనను దాని తీసికొనవచ్చును. ఈ నెల పదునాలుగవ దినమువరకు మీరు దాని నుంచుకొనవలెను. తరువాత ఇశ్రాయేలీయుల సమాజపు వారందరు తమ తమ కూటములలో సాయంకాలమందు దాని చంపి దాని రక్తము కొంచెము తీసి, తాము దాని తిని యిండ్లద్వారబంధపు రెండు నిలువు కమ్ములమీదను పై కమ్మిమీదను చల్లి ఆ రాత్రియే వారు అగ్నిచేత కాల్చబడిన ఆ మాంసమును పొంగని రొట్టెలను తినవలెను. చేదుకూరలతో దాని తినవలెను. దాని తలను దాని కాళ్లను దాని ఆంత్రములను అగ్నితో కాల్చి దాని తినవలెను; దానిలో ఉడికి ఉడకనిదైనను నీళ్లతో వండబడినదైనను తిననే తినకూడదు; ఉదయకాలము వరకు దానిలోనిదేదియు మిగిలింపకూడదు. ఉదయకాలమువరకు దానిలో మిగిలినది అగ్నితో కాల్చి వేయవలెను. మీరు దానిని తినవలసిన విధమేదనగా, మీ నడుము కట్టుకొని మీ చెప్పులు తొడుగుకొని మీ కఱ్ఱలు చేత పట్టుకొని, త్వరపడుచుదాని తినవలెను; అది యెహోవాకు పస్కా బలి. ఆ రాత్రి నేను ఐగుప్తు దేశమందు సంచరించి, ఐగుప్తు దేశమందలి మనుష్యులలోనేగాని జంతువులలోనేగాని తొలి సంతతియంతయు హతముచేసి, ఐగుప్తు దేవతలకందరికిని తీర్పు తీర్చెదను; నేను యెహోవాను. మీరున్న యిండ్లమీద ఆ రక్తము మీకు గురుతుగా ఉండును. నేను ఆ రక్తమును చూచి మిమ్మును నశింపచేయక దాటిపోయెదను. నేను ఐగుప్తు దేశమును పాడు చేయుచుండగా మిమ్ము సంహరించుటకు తెగులు మీ మీదికి రాదు. కాబట్టి యీ దినము మీకు జ్ఞాపకార్థమైనదగును. మీరు యెహోవాకు పండుగగా దాని నాచరింపవలెను.'** పస్కాను ఒక పండుగగా ఆచరించాలని దేవుడు ఇశ్రాయేలీయులకు ఆనాడు ఆజ్ఞాపించాడు. దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి బయటకు రప్పించిన దానికి ఒక గుర్తుగా ఈ పస్కాను వారు యేటేట పాటించాలి. ప్రతి సంవత్సరం మొదటి నెల(ఆబీబు నెల) పదునాలుగవ దినము సాయంకాలము మొదలుకొని ఏడు రోజులపాటు అనగా, ఇరువది ఒకటవ దినము సాయంకాలము వరకు వారు పులియని రొట్టెలను తినవలెను. అలాగే, ఆ ఏడు దినములలో మొదటి దినమున మరియు ఏడవ దినమున ఇశ్రాయేలీయులంతా పరిశుద్ధ సంఘముగా కూడుకొనవలెను. ఇది ఇశ్రాయేలీయులు ఆచరించాలని దేవుడు వారికి చెప్పిన పండుగ.

**నిర్గమకాండము 12 : 43 'మరియు యెహోవా మోషే అహరోనులతో ఇట్లనెను - ఇది పస్కాపండుగను గూర్చిన కట్టడ; అన్యుడెవడును దాని తినకూడదు గాని వెండితో కొనబడిన దాసుడు సున్నతి పొందినవాడైతే దాని తినవచ్చును. పరదేశియు కూలికి వచ్చిన దాసుడును దాని తినకూడదు.'** పస్కా పండుగను ఇశ్రాయేలీయులు మాత్రమే ఆచరించాలి. పస్కా పండుగ అనగానే, ఇశ్రాయేలీయులందరూ ఐగుప్తు దేశము యొక్క బానిసత్వము నుండి యెహోవా సేనగా బయలుదేరిన విషయము భవిష్యత్తు తరాలలో వారికి గుర్తు రావాలి. దీని కోసమే దేవుడు ఇశ్రాయేలీయులతో పస్కాను ఒక పండుగగా ఆచరించమని చెప్పాడు.

**నిర్గమకాండము 23 : 16 'నీవు పొలములో విత్తిన నీ వ్యవసాయముల తొలిపంట యొక్క కోతపండుగను, పొలములోనుండి నీ వ్యవసాయ ఫలములను నీవు కూర్చుకొనిన తరువాత సంవత్సరాంతమందు ఫలసంగ్రహపు పండుగను ఆచరింపవలెను.'** దేవుడు భూమిని మనుష్యుల కొరకు ఫలింపజేస్తున్నాడన్న విషయమును వారి జ్ఞాపకములలో ఉంచుటకు వారు వ్యవసాయపు ఫలములను పొందుతున్న ప్రతీసారి ఈ పండుగను ఆచరించాలి.

**నిర్గమకాండము 34 : 22 'మరియు నీవు గోధుమలకోతలో ప్రథమ ఫలముల పండుగను, అనగా వారముల పండుగను సంవత్సరాంతమున పంటకూర్చు పండుగను ఆచరింపవలెను.'** ఇది గోధుమల కోతకు సంబంధించిన పండుగ. దీనిని ఆచరించునప్పుడెల్ల దేవుని కృప వలన భూమి పండుతున్నదని ఇశ్రాయేలీయులు జ్ఞాపకముంచుకోవాలి.

**లేవీయకాండము 23 : 34 'నీవు ఇశ్రాయేలీయులతో ఇట్లనుము - ఈ యేడవనెల పదునైదవ దినము మొదలుకొని యేడు దినములవరకు యెహోవాకు పర్ణశాలల పండుగను జరుపవలెను.'** ఈ భూమి మీద వారి నివాసం శాశ్వతమైనది కాదని ఇశ్రాయేలీయులు జ్ఞాపకం చేసుకోవాలి. తమ పితరులు గుడారములలో జీవించినట్టుగా గుర్తు చేసుకొని పరిశుద్ధులుగా, నీతిమంతులుగా వారు జీవించాలి. వ్రాయబడిన మాటలను బట్టి నేటికీ పర్ణశాలల పండుగను ఆచరిస్తున్న వారున్నారు. ఆనాడు మా పితరులైన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు గుడారములలో నివసించారు గనుక మేము కూడా ఒక వారం రోజులపాటు గుడారాలలో నివసిస్తే సరిపోతుందనుకుంటున్నారే తప్ప, ఆనాడు పరలోకపు తండ్రి ఎందు నిమిత్తం ఇశ్రాయేలీయులను పర్ణశాలల పండుగ ఆచరించమన్నాడో గుర్తెరగలేకపోతున్నారు. మనుష్యులంతా ఈ భూమి మీద పరదేశులు మరియు యాత్రికులు. వారు ఇక్కడ తాత్కాలికంగా ఉండవలసిన వారు. ఈ భూమి మనుష్యులకు స్థిర నివాసం కాదు. అందుకే దేవుడు - ఏడవనెల పదునైదవ దినము మొదలుకొని ఏడు దినముల వరకు యెహోవాకు పర్ణశాలల పండుగను జరుపవలెను అని వారితో చెప్పాడు. అలాగే, ఆ ఏడు దినములలో వారు ఏమేమి చేయాలో కూడా దేవుడు నిర్దేశించాడు. వాటిలో మొదటి దినమున వారు పరిశుద్ధ సంఘముగా కూడవలెను. అందులో వారి జీవనోపాధియైన ఏ పనియు చేయకూడదు. ఆ ఏడు దినములు వారు యెహోవాకు హోమము చేయవలెను. ఎనిమిదవ దినమున వారు పరిశుద్ధ సంఘముగా కూడి యెహోవాకు హోమార్పణము చేయవలెను. అది వారికి వ్రతదినముగా ఉండును. అందులో వారు జీవనోపాధియైన యే పనియు చేయకూడదు. ఇది ఇశ్రాయేలీయులు పర్ణశాలల పండుగను ఆచరింపవలసిన విధానం!

ప్రియులారా! ఇవన్నీ ఆనాటి కాలానికి ధర్మశాస్త్రమును బట్టి దేవుడు ఇశ్రాయేలీయులకు విధించిన పండుగలు. కాని నేటి కాలములోని వారు ఇశ్రాయేలీయులైనా, అన్యజనులైనా ప్రభువైన క్రీస్తును అంగీకరిస్తే వారు క్రైస్తవులనబడతారు. యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము తీసుకున్న వారంతా క్రైస్తవులు. నేటి క్రైస్తవులు కూడా కొన్ని పండుగలను దేవుని పేరిట ఆచరిస్తున్నారు. కనుక నిజంగా క్రైస్తవులకు కూడా దేవుడు ఆనాటి ఇశ్రాయేలీయులవలె కొన్ని పండుగలను ఉద్దేశించాడా? లేదా? అనే విషయాన్ని 'క్రైస్తవుల పండుగలు ఆచరణీయమా? శోచనీయమా?' అనే ఈ పాఠములో పరిశోధనాత్మకంగా నేర్చుకొండి.

క్రీస్తు శకము మొదటి శతాబ్ధంలో అపొస్తలుడైన పౌలు గారు ఈ పండుగల విషయమై మాట్లాడుతూ ఒక జాగ్రత్తను చెబుతున్నారు.

కొలొస్సయులకు వ్రాసిన పత్రిక 2 : 16- **'కాబట్టి అన్నపానముల విషయములోనైనను, పండుగ అమావాస్య విశ్రాంతిదినము అనువాటి విషయములోనైనను, మీకు తీర్పు తీర్చ నెవనికిని అవకాశమియ్యకుడి. ఇవి రాబోవువాటి ఛాయయేగాని నిజ స్వరూపము క్రీస్తులో ఉన్నది.'** దీనినిబట్టి, పండుగల విషయములో నేటి క్రైస్తవులకు ఎవ్వరూ తీర్పు తీర్చకుండా ఉండాలంటే వాటిని గూర్చిన ఖచ్చితమైన అవగాహన ఉండాలి. ఇంతకీ క్రైస్తవులు ఆచరించదగిన పండుగలు నిజంగా ఉన్నాయా, లేవా? ఆనాడు కొలొస్సయిలోని క్రైస్తవులలో ఎక్కువమంది ఇశ్రాయేలీయులలో నుండి వచ్చిన వారున్నారు గనుక వారిని పౌలు ఉద్దేశిస్తూ పై మాటలు చెబుతున్నాడు. ఈ భూమి మీద ఇశ్రాయేలీయుల పండుగలు ఎలా ప్రారంభమయ్యాయో, ఆ పండుగలను గూర్చి దేవుడు తన గ్రంథములో ఏమని వ్రాయించాడో అనే దానిని జాగ్రత్తగా నేర్చుకుంటే ఎవ్వరూ పండుగల విషయమై తీర్పు తీర్చరు. ఇక నేటి క్రైస్తవులనబడుతున్న వారు ముఖ్యముగా ఆచరిస్తున్న పండుగలను కూడా ఆలోచిస్తే...

■క్రిస్మస్ (యేసు జననమునకు గుర్తుగా)

■భస్మ బుధవారం (40 దినముల ఉపవాస దినముల(లెంట్ డేస్) ప్రారంభమునకు గుర్తుగా)

■మట్టల ఆదివారం (యేసు శ్రమ పడుటకు యెరూషలేముకు వెళ్లిన రోజుకు గుర్తుగా)

■గుడ్‌ఫ్రైడే (యేసు సిలువ వేయబడిన రోజుకు గుర్తుగా)

■ఈస్టర్ (యేసుక్రీస్తు పునరుత్థానమునకు గుర్తుగా)

నేటి క్రైస్తవులు కూడా ఆనాటి ఇశ్రాయేలీయులవలె పైన ఉదహరించబడిన పండుగలను ఆచరించాలా? ఆచరించకూడదా? ఈ విషయాలను పరిశోధిద్దాం. మీరు ఈ పండుగలను ఆచరిస్తున్నందుకు లేక ఆచరించనందుకు ఇటువంటి విషయాలలో ఎవ్వరూ మీకు తీర్పు తీర్చే అవకాశమును ఇవ్వకూడదు. పరలోకానికి వెళ్లే ప్రతి క్రైస్తవుడు పరిపూర్ణుడుగా ఉండాలి. అతడు దేవుని జ్ఞానమును పూర్తిగా తెలుసుకున్నవాడై ఉండాలి. ఇక పరిశోధన లోనికి వెళితే..

ముందుగా ఇశ్రాయేలీయులకు దేవుడు పండుగలను ఎందుకు పరిచయం చేసాడో తెలుసుకుందాం. దేవుడు పండుగలను ఇశ్రాయేలీయుల కాలంలో ప్రవేశపెట్టాడు; వాటిని ఇశ్రాయేలీయులతోనే ముగించాడు! ఎందుకంటే, పండుగల వలన ఇశ్రాయేలీయులలో ఎటువంటి మార్పును దేవుడు చూడాలనుకున్నాడో ఆ మార్పు వారిలో ఆయనకు కనిపించలేదు. ఇశ్రాయేలీయుల కాలంలో పండుగ అనగానే, ఆ పండుగకు సంబంధించిన దేవుని జ్ఞానము వారి మధ్య పదే పదే వినిపించాలి. దేవుడు వారి పితరులకు చేసిన మేలులు, అద్భుతములను భవిష్యత్తు తరాలలో పుట్టినవారు విని పరలోకపు తండ్రికి వారి విధేయతను చూపాలి. ఈ సంగతులను ప్రతి యేట వారికి జ్ఞాపకం చేయడానికి మాత్రమే పండుగ ఉద్దేశించబడింది. ఎందుకంటే ఇశ్రాయేలీయుల చేతులలో దేవుని ప్రణాళిక అంతా కలిగిన పరిపూర్ణమైన గ్రంథము లేదు. ఇంకా అప్పటికి దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును ఈ భూమి మీదకు పంపించలేదు. ఇశ్రాయేలీయులు అప్పటికి ఇంకా ధర్మశాస్త్రమనే బాల శిక్షకుని క్రిందనే ఉన్నారు. ఇటువంటి స్థితిలో దేవుడు వారిని పండుగలను ఆచరించమన్నాడు. అందుకే ధర్మశాస్త్రములో ఆచారాలు, కట్టడలు, బలులు, హోమములు, వ్రతదినములు.. ఇవన్నీ ఉన్నాయి. ఇక యేసుక్రీస్తు వచ్చిన తరువాత అయితే ఇశ్రాయేలీయులతోపాటు సర్వలోకమును ఆయన మహాజ్ఞానము లోనికి నడిపించాలనే ఉద్దేశ్యంతో వీటినన్నింటినీ ఆయన మాన్పించేయాలనుకున్నాడు. అలాగని ఇశ్రాయేలీయులు పండుగల విషయంలో దేవుని సంకల్పమును నెరవేర్చారా అంటే లేదనే చెప్పాలి. వారిలో పండుగలు ప్రారంభమైన నాటి నుంచి దినములు గడిచే కొద్ది అవి ఎలా మారిపోయాయంటే, పండుగ అనగానే - 'తినుట త్రాగుట సంతోషించుట' ఇవి మాత్రమే కనిపిస్తున్నాయి తప్ప దేవుని గూర్చిన జ్ఞానమును మాత్రం ఏ ఒక్కరూ చర్చించుట లేదు. వారు పండుగలను కేవలం తమ ఆనందానికి, వినోదానికి మాత్రమే వినియోగించుకున్నారు. వారి వారి వ్యాపారాలకు మాత్రమే వారు పండుగలను వినియోగించుకున్నారు. దేవుడు ఈ పరిస్థితినంతా తన పరిశుద్ధ గ్రంథములో వ్రాయించాడు. ఇక ఆయన ఒక నిర్ణయానికి వచ్చాడు. అదేమిటంటే, దేవుని సంకల్పము వారి పండుగలలో నెరవేరని నాడు ఇక ఆ పండుగలెందుకు? వాటిని దేవుడు

వారిచేత మాన్పించాలనుకున్నాడు. ఆయన ప్రారంభించిన పండుగలను ఆయనే ముగించాలనుకున్నాడు.

**ఆమోసు 8 : 4- 'దేశమందు బీదలను మ్రింగివేయను దరిద్రులను మాపివేయను కోరువారలారా - తూము చిన్నదిగాను రూపాయి యెక్కువదిగాను చేసి, దొంగత్రాసుచేసి, మనము ధాన్యమును అమ్మునట్లు అమావాస్య యెప్పుడైపోవునో, మనము గోధుమలను అమ్మకము చేయునట్లు విశ్రాంతిదినము ఎప్పుడు గతించిపోవునోయని చెప్పుకొనువారలారా, దరిద్రులను వెండికి కొనునట్లును పాదరక్షలనిచ్చి బీదవారిని కొనునట్లును చచ్చు ధాన్యమును మనము అమ్ముదము రండని విశ్రాంతిదిన మెప్పుడైపోవునో అని చెప్పుకొనువారలారా, ఈ మాట ఆలకించుడి.'** చూసారా, ఇశ్రాయేలీయుల పరిస్థితి! అమావాస్య త్వరగా అయిపోతే, విశ్రాంతిదినము త్వరగా అయిపోతే తమ తమ దొంగ వ్యాపారాలు బాగా సాగుతాయని అనుకొంటున్నారు. అంటే నాటి ఇశ్రాయేలీయులకు విశ్రాంతి దినమును గూర్చి ఏమైనా అర్థమైందా? దేవుడు అమావాస్యను ఎందుకు ఆచరించమన్నాడో వారికి అర్థమైందా? లేదనే చెప్పాలి. వారి మనస్సంతా వారి వ్యాపారాలపైనే ఉంది. ఎందుకంటే, వారి కడుపే వారి దేవుడు, నాశనమే వారి అంతము. కనుకనే దేవుడు ఇశ్రాయేలీయుల పండుగల విషయమై ఒక నిర్ణయానికి వచ్చాడు. దానిని ఆయన తరువాతి వాక్య భాగములో చెబుతున్నాడు.

**ఆమోసు 8 : 10 'మీ పండుగ దినములను దు:ఖదినములుగాను మీ పాటలను ప్రలాపములుగాను మార్చుదును.'** ప్రారంభములో దేవుడు ఇశ్రాయేలీయుల మధ్య పండుగలను ప్రవేశపెట్టినప్పుడు అవి ఎలా ఉండేవి? వాటిని వారికి దేవుడు ఉద్దేశించడంలో ఆయన ప్రణాళిక ఏమిటి? పండుగ పాఠమును నేర్పేదిగా ఉండాలి, దేవుని దృష్టికి విలువైనదిగా ఉండాలి. కాని కాలక్రమేణా, వారు పండుగలను ఎలా మార్చేసుకున్నారో చూడండి. పండుగకు పేరు దేవునిది, పండుగలో వినోదం వీరిది! అందుకే వారి పండుగలను ముగించాలనుకుంటున్నాడు. వారి పండుగ దినములను దు:ఖదినములుగాను, వారి పాటలను ప్రలాపములుగాను మార్చుదునంటున్నాడు.

**యిర్మీయా 7 : 34 'ఉల్లాసధ్వనియు ఆనందధ్వనియు పెండ్లికుమారుని స్వరమును పెండ్లికుమార్తె స్వరమును యూదా పట్టణములలోను యెరూషలేము వీధులలోను లేకుండచేసెదను; ఈ దేశము తప్పక పాడైపోవును.'** దేవుడు ఇశ్రాయేలీయులతో శాపమును గూర్చిన మాటలను ఎందుకు చెబుతున్నాడు? ఎందుకంటే, వారికి పండుగల పరమార్థం తెలియదు. ఇశ్రాయేలీయుల కాలంలో ఇశ్రాయేలీయులు పండుగలను ఆచరించడానికి నిజంగా అర్హులే అయినా కాని ఆ పండుగలను కూడా వారు ఎలా ఆచరిస్తున్నారంటే, కేవలం వారి శరీర కోరికలు తీర్చుకోవడానికి మరియు లాభమును సంపాదించుకోవటానికి మాత్రమే ఆచరిస్తున్నారు. అంతే తప్ప, తమ తరాలలో పుట్టుకొస్తున్నటువంటి అనేకమందికి దేవుని ఔన్నత్యమును నేర్పించడానికి వారు పండుగలను ఆచరించడం లేదు. మరి పండుగల ప్రారంభంలో దేవుడు ఏమన్నాడు. పస్కా పండుగను గూర్చైతే - ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వములో నుండి దేవుడు బయటకు తీసుకొని వచ్చాడు గనుక 'పస్కా'ను ఆచరించమన్నాడు. దానినంతటినీ జ్ఞాపకం చేసుకోవడానికి, దానిని ప్రత్యక్షంగా చూడని ఇశ్రాయేలీయులకు వారి పితరులు ఆ సన్నివేశాలను వివరించి వారిలో దేవుని భక్తిని పెంచాలని దేవుడు ఆశించాడు. కాని, రాను రాను ఈ పండుగలు ఎలా మారిపోయాయి? ఇశ్రాయేలీయులు తమ కోరికలను తీర్చుకోవటానికి మాత్రమే ఇవి అవకాశాలుగా కనిపిస్తున్నాయి. అందుకు దేవుడు కోపంతో ఏమంటున్నాడంటే ఇశ్రాయేలీయుల ప్రాంతంలో ఎక్కడా ఉల్లాస ధ్వని, ఆనంద ధ్వని లేకుండా చేస్తానన్నాడు. మరొక వాక్యభాగములో చూడండి.

**ఆమోసు 5 : 21- 'మీ పండుగ దినములను నేను అసహ్యించుకొనుచున్నాను; వాటిని నీచముగా ఎంచుచున్నాను; మీ వ్రత దినములలో కలుగు వాసనను నేను ఆఘ్రాణింపనొల్లను. నాకు దహనబలులను నైవేద్యములను మీరర్పించినను నేను వాటిని అంగీకరింపను; సమాధాన బలులుగా మీరర్పించు క్రొవ్విన పశువులను నేను చూడను. మీ పాటల ధ్వని నాయొద్దనుండి తొలగనియ్యుడి, మీ స్వరమండలముల నాదము వినుట నాకు మనస్సు లేదు.'** ఆమోసు ప్రవక్త ద్వారా దేవుడు ఇశ్రాయేలీయులతో మాట్లాడుతున్నాడు. వారి పండుగ దినములను ఆయన అసహ్యించుకొనుచున్నాడు. వాటిని ఆయన నీచముగా ఎంచుకొనుచున్నాడు. ఇప్పుడు ఆలోచించండి! దేవుని జ్ఞానములేని పండుగ అంటే దేవుని దృష్టిలో ఎలా ఉంటుందో గమనించండి. ఒక సాధారణ దినము అయితే దేవునికి అంతగా బాధ లేదు. కాని పండుగ వచ్చేసరికి దేవునికి

విపరీతమైన బాధ! ఎందుకంటే ఆ దినమున దేవునికి మనుష్యులలో అవమానము కలుగుతుంది. ఏ పండుగలను గూర్చి అయితే దేవుడు ఇశ్రాయేలీయులను పరిశుద్ధముగా ఆచరించమన్నాడో వాటినే వారు అపరిశుద్ధముగా మార్చేసారు. పండుగ పేరు చెప్పి ఇశ్రాయేలీయులు దేవునికి అర్పణలు తీసుకొని వస్తే వాటిని ఆయన అంగీకరించుట లేదు. దేవుని పేరిట పండుగ, ఆ పండుగలో దేవుని పాటలను వారు పాడుకుంటే సరిపోతుందా? ఆ పాటలను వినే దేవునికి ఏమాత్రమైనా సంతోషం కలుగుతుందా? వారి స్వరమండల సన్నాయి నాదముల వలన దేవుడు హాయిగా ఆనందిస్తున్నాడా లేక వాటి వలన ఆయన్ను బాధపెడుతున్నారా? దేవుడు తన గ్రంథములో వ్రాయించిన మాటలను చూస్తే, ఇశ్రాయేలీయుల పండుగల వలన ఆయనకు ఏమాత్రం సంతోషము లేదని అర్థమవుతోంది. అందుకే, దేవుడు చేయమని ఆజ్ఞాపించిన పండుగలనే ఆయన మరల చేయొద్దని ఆజ్ఞాపిస్తున్నాడు.

**హోషేయ 2 : 11 'దాని ఉత్సవకాలములను పండుగలను అమావాస్యలను విశ్రాంతి దినములను నియామక కాలమును మాన్పింతును.'** అంటే దేవుడు వాటిని ప్రారంభించాడు గనుక ఆయనే వాటిని మాన్పిస్తాను అంటున్నాడు. పండుగలను ఆయనే ప్రారంభించాడు; కానీ వాటి వలన సత్ఫలితం రాలేదు. అందువలన దేవుడు యేసుక్రీస్తును ఈ లోకములోనికి పంపించడానికి ముందుగా ఈ పండుగలన్నింటిని మాన్పిస్తాను అంటున్నాడు. ఇందులో ఒకటి ఉంచి మరొకటి తీసివేయడము కాకుండా, అన్నిటిని ఆయన మాన్పిస్తాను అంటున్నాడు. యేసుక్రీస్తు వచ్చి ధర్మశాస్త్రాన్ని పరిపూర్ణముగా నెరవేర్చేంత వరకు వాటిని ఉంచి అక్కడితో వాటిని నిలుపుదల చేయాలనుకున్నాడు. యేసుక్రీస్తు కాలంలో ధర్మశాస్త్రము ఇంకా అమలులో ఉన్నది గనుక ఆయన జీవించి ఉన్న కాలములో కొన్ని పండుగలు ఆచరింపబడ్డాయి. ఆ పండుగ సమయంలో యేసుక్రీస్తు ద్వారా పలుకబడిన కొన్నిమాటలను పరిశోధన చేద్దాం.

**యోహాను సువార్త 7 : 2- 'యూదుల పర్ణశాలల పండుగ సమీపించెను గనుక ఆయన సహోదరులు ఆయనను చూచి - నీవు చేయుచున్న క్రియలు నీ శిష్యులును చూచునట్లు ఈ స్థలము విడిచి యూదయకు వెళ్లుము. బహిరంగమున అంగీకరింపబడ గోరువాడెవడును తన పని రహస్యమున జరిగింపడు. నీవు ఈ కార్యములు చేయుచున్నయెడల నిన్ను నీవే లోకమునకు కనబరచుకొనుమని చెప్పిరి.'** ఇది యేసుక్రీస్తు కాలములో వచ్చిన పర్ణశాలల పండుగ. ఈ పర్ణశాలల పండుగ సమీపించెను గనుక ఆయన సహోదరులు ఆయనను చూచి హేళన చేస్తున్నారు. నీవు చేయుచున్న క్రియలు నీ శిష్యులను చూచునట్లు ఈ స్థలము విడిచి యూదయకు వెళ్లుము అంటున్నారు. పండుగ పరమార్థం తెలియనివారు లోక రక్షకుడైన యేసును అపార్థము చేసుకుంటున్నారు. ఇక ఈ సందర్భములో మనకు కొన్ని మంచి సంగతులు అర్థమవుతాయి.

**యోహాను సువార్త 7 : 8- 'మీరు పండుగకు వెళ్లుడి; నా సమయమింకను పరిపూర్ణము కాలేదు గనుక నేను ఈ పండుగకు ఇప్పుడే వెళ్లనని వారితో చెప్పెను. ఆయన వారితో ఈలాగు చెప్పి గలిలయలో నిలిచిపోయెను.'** అది ఇంకా ధర్మశాస్త్రము అమలులో ఉన్న కాలము గనుక పర్ణశాలల పండుగ ప్రస్తావన అక్కడ యేసు దగ్గరకు వచ్చింది. అయితే, దేవుడు ఇశ్రాయేలీయుల పండుగలను త్వరలోనే మాన్పిస్తాడన్న విషయము ఆయనకు తెలుసు. కనుక, ఈ పండుగ విషయమై యేసు ప్రవర్తన ఎలా ఉందో గమనించండి. ఆయన పండుగ ఆచరించడానికి కాకుండా, పండుగలో దేవుని పనిని నెరవేర్చడానికే వెళుతున్నట్టుగా మనకు అక్కడ అర్థమవుతుంది.

**యోహాను సువార్త 7 : 10- 'అయితే ఆయన సహోదరులు పండుగకు వెళ్లిపోయిన తరువాత ఆయనకూడా బహిరంగముగా వెళ్లక రహస్యముగా వెళ్లెను. పండుగలో యూదులు- ఆయన ఎక్కడ అని ఆయనను వెదుకుచుండిరి. మరియు జనసమూహములలో ఆయననుగూర్చి గొప్ప సణుగు పుట్టెను; కొందరాయన మంచివాడనిరి; మరికొందరు- కాదు, ఆయన జనులను మోసపుచ్చువాడనిరి; అయితే యూదులకు భయపడి ఆయనను గూర్చి యెవడును బహిరంగముగా మాటలాడలేదు.'** చూసారా! ధర్మశాస్త్రము అమలులో ఉన్న కాలములో యేసు పర్ణశాలల పండుగ ఎందుకు చెయ్యాలో తెలిసినవాడు గనుక, మిగిలిన వారందరివలె పండుగ నిమిత్తం యూదయకు వెళ్లలేదు. ఆనాడు యూదులలో ఉన్నవారంతా దేవుని మనస్సెరుగక తమ ఇష్టానుసారముగానే పండుగలను ఆచరిస్తున్నారు. ఎలాగూ దేవుడు ఈ పండుగలన్నిటిని అప్పటికి ఇక కొద్ది కాలములోనే రద్దుచేయబోతున్నాడు. అందుకే యేసు బహిరంగముగా వారితోపాటు వెళ్లక, నిజముగా దేవునికి

ఇష్టానుసారమైన పండుగ చేయడానికి రహస్యముగా వెళుతున్నాడు. ఎందుకంటే ఆ పండుగలో ఈయన ఏమి ఆచరించాలో దానిని మాత్రమే ఆచరించి రావాలి. అయితే ఆ పండుగలో యూదులు ఏమి చేస్తున్నారో చూడండి. పండుగలో ఆయన ఎక్కడ? అని వెదుకుచుండిరి. అంటే, యూదుల మనసంతా యేసుక్రీస్తు మీదనే ఉంది. ఈయన తండ్రియైన దేవుని మనస్సును చెబుతున్నాడు గనుక, అసలు ఈయనైతే పండుగను ఎలా ఆచరిస్తాడో చూద్దామని, అసలు ఈయన పండుగ ఆచరించడానికి యూదయకు వస్తాడా లేదా? అని ఆయనను వెదకుతున్నారు. అంతేకాక, జనసమూహములలో ఆయనను గూర్చి గొప్ప సణుగు కూడా పుట్టింది. అందరూ పండుగను మరచిపోయి, యేసు ఎక్కడ? ఆయన మంచివాడా కాదా? అని మాట్లాడుకొంటున్నారు. ఈ విధంగా కొందరాయనను మంచివాడు అంటున్నారు, మరికొందరు ఆయనను చెడ్డవాడు అంటున్నారు. అయితే యూదులకు భయపడి, ఏ ఒక్కరూ ఆయనను గూర్చి బహిరంగముగా మాత్రం మాట్లాడలేదు. ఆ తరువాత ఏమి జరిగిందో చూడండి. ఇంతకీ యేసు ఈ పర్ణశాలల పండుగను ఎలా ఆచరిస్తున్నాడో చూడండి.

**యోహాను సువార్త 7 : 14- 'సగము పండుగైనప్పుడు యేసు దేవాలయములోనికి వెళ్లి బోధించుచుండెను.'** పర్ణశాలల పండుగలో సగము పండుగ అయిపోయింది. ఇంతకీ పర్ణశాలల పండుగను ఎన్ని దినములు ఆచరించాలి? **లేవీయకాండము 23 : 33- 'మరియు యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను. - నీవు ఇశ్రాయేలీయులతో ఇట్లనుము - ఈ యేడవ నెల పదునయిదవ దినము మొదలుకొని యేడు దినములవరకు యెహోవాకు పర్ణశాలల పండుగ జరుపవలెను. వాటిలో మొదటి దినమున మీరు పరిశుద్ధసంఘముగా కూడవలెను. అందులో మీరు జీవనోపాధియైన యే పనియు చేయకూడదు. ఏడు దినములు మీరు యెహోవాకు హోమము చేయవలెను. ఎనిమిదవ దినమున మీరు పరిశుద్ధ సంఘముగా కూడి యెహోవాకు హోమార్పణము చేయవలెను. అది మీకు వ్రతదినముగా ఉండును. అందులో మీరు జీవనోపాధియైన యే పనియు చేయకూడదు.'** అంటే, ధర్మశాస్త్ర ప్రకారము ఇశ్రాయేలీయులు పర్ణశాలల పండుగను ఆచరించాలంటే మొత్తం ఎనిమిది దినములపాటు ఆచరించాలి. ఈ ఎనిమిది దినముల పండుగలో ఇశ్రాయేలీయుల నుండి దేవుడు కోరుకున్నది ఏమిటి? ఏ పనియు చేయక దేవుని మాత్రమే సేవించడం, పరిశుద్ధతతో ఒక సంఘముగా కూడుకోవడం! ఇవి నాటి ఇశ్రాయేలు జనాంగము ఏనాడో మరచిపోయారు. పండుగలో వారి సంతోషాలకు మాత్రమే వారు తావునిచ్చారు. మనుష్యుల ఇష్టాలను గొప్పగా చేసే పండుగకు యేసు ఎందుకు వెళ్లాలి? అందుకే, దేవుని ఇష్టాన్ని నెరవేర్చడానికి మాత్రమే ఆయన సగము పండుగ అయిన తరువాత వారికి కనిపించాడు. అనగా, సుమారు నాలుగు దినముల కాలము. అప్పుడు యేసు దేవాలయములోనికి వెళ్లి తండ్రి పనిని నెరవేర్చు నిమిత్తం వారికి దేవుని వాక్యమును బోధించాడు. అప్పుడు యూదులు ఆయనను గూర్చి ఏమంటున్నారో చూడండి.

**యోహాను సువార్త 7 : 15- 'యూదులు అందుకు ఆశ్చర్యపడి - చదువుకొనని ఇతనికి ఈ పాండిత్యమెట్లు వచ్చెనని చెప్పుకొనిరి. అందుకు యేసు - నేను చేయు బోధ నాది కాదు; నన్ను పంపిన వానిదే. ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనినయెడల, ఆ బోధ దేవుని వలన కలిగినదో, లేక నా యంతట నేనే బోధించుచున్నానో, వాడు తెలిసికొనును.'** యేసు వారితో - నేను దేవుని యొద్దనుండి వచ్చినవాడను. దేవుడు నాకు చెప్పినట్టే నేను బోధిస్తున్నాను అంటున్నాడు. చూసారా! పండుగ విషయమై యేసు ఈ లోకానికి జ్ఞానమును నేర్పిస్తున్నాడు. లోకమందున్న నేటి నామకార్థ క్రైస్తవులకు దేవుని పండుగ అంటే ఏమి అర్థమయింది? పండుగ అంటే అది కేవలం మనకు మాత్రమే సంతోషాన్ని ఇచ్చేది కాకూడదు; అది పరలోకపు తండ్రికి సంతోషాన్నివ్వాలి. ధర్మశాస్త్రము అమలులో ఉన్నప్పుడే యేసుక్రీస్తు మనుష్యాచారములతో కూడిన పండుగలను ఆచరించడానికి ఇష్టపడలేదు. ఎందుకంటే అది పరలోకపు తండ్రి ఆయనకు నిర్ణయించిన పని కాదు. అయితే, పండుగలో దేవుడు దేనిని కోరుకున్నాడో, దేనివలన పరలోకపు తండ్రికి సంతోషము కలుగుతుందో ఆ కార్యక్రమాన్ని మాత్రమే ఆయన చేసాడు. అదేమిటంటే, యేసు దేవాలయము లోనికి వెళ్లి తండ్రి తనకు చెప్పిన దానిని బోధిస్తున్నాడు. ఒకవేళ ఇక్కడ పాఠకులు సందేహపడవచ్చు. సంవత్సరంలో ఒక్కసారైనా మా ఇంటిని శుభ్రం చేసుకోవాలి; క్రొత్తబట్టలు తొడుక్కోవాలి; పిండి వంటలు వండుకోవాలి; బంధువులను ఆహ్వానించుకోవాలి; ఇలా అయితే మాకెప్పుడు పండుగ? ఏదో ఒక రోజును మాకు కూడా పండుగ ఆచరించాలని ఉంది అంటారా? దేవుడు తన పిల్లలందరినీ ఆనందముగా

ఉంచాలనే చూస్తున్నాడు. తన పిల్లలను నిరంతరం బాధతో ఉంచాలనుకునే కఠినమైన మనస్సు కాదాయనది. అందుకే ఈ వాక్యమును చూడండి.

ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 4 : 4 **'ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి.'** ఆయన పిల్లలు ఈ భూమిపై నిరంతరం ఏడుస్తూ బ్రతకాలని దేవుడు ఏనాడూ కోరుకోలేదు. వారు నిరంతరం సంతోషంగా ఉండాలనే ఆయన కోరుకుంటున్నాడు. అవి కొన్ని పండుగ దినములు మాత్రమే కాదు. క్రీస్తునందున్న సత్యమును తెలుసుకొన్న నాటనుంచి ఆయన పిల్లలు ప్రతీ దినము సంతోషించవలసినదే. అయితే వారు ప్రభువునందు మాత్రమే ఆనందించాలి. మీరు నివసిస్తున్న ఇంటిని శుభ్రం చేసుకుంటారా? అది ప్రభువు నిమిత్తమై ఉండాలి. క్రొత్త బట్టలు కొనుక్కుంటారా? అయితే ప్రభువు నిమిత్తము కొనుక్కోండి. ప్రభువు నిమిత్తము ఏదైనా చేయడమంటే ఏమిటంటే ప్రభువు కార్యక్రమాలలో మీరు ఉండాలి. ప్రభువు కొరకు బ్రతుకు నిమిత్తం మీ ఇంటిని శుభ్రం చేసుకోండి. ప్రభువు కొరకు బ్రతుకు నిమిత్తం క్రొత్త దుస్తులు కొనుక్కోండి. ప్రభువు వాక్యమును ప్రకటించడానికి బంధువులందరినీ ఆహ్వానించండి. మీరు ఏ పని చేసినా అందువలన దేవుని వాక్యానికి గొప్ప కలుగుతుందా, లేదా? అన్న దానిని జాగ్రత్తగా చూచుకోవాలి. ప్రభువు నందు ఆనందించండి, ఎల్లప్పుడు ప్రభువు నందు మాత్రమే ఆనందించండి. ఒక మంచి ఆహారపదార్ధం మీరు తింటున్నారా? మీరు దానిని ప్రభువు కొరకు తినాలి. ఆ ఆహారపదార్థం కడుపులోనికి వెళ్లి జీర్ణమై శక్తినిచ్చి, ఆ శక్తివలన మీరు దేవుని కొరకు బ్రతకాలి. దాని వలన ఒక సహోదరుడు బ్రతికింపబడాలి. ఇందు నిమిత్తమే మీరు ఏదైనా కొనుక్కోవాలి, ఏదైనా తినాలి, ఏదైనా అనుభవించాలి. ఈ సమాజంలో పండుగ పేరుతో తమ ఇష్టాలను మాత్రమే నెరవేర్చుకొనే ఎందరో దౌర్భాగ్యులను మీరు చూస్తున్నారు. వారివలె ఏమాత్రం ఉండకుండా మీరు ఒక పవిత్రమైన కుటుంబముగా కట్టబడి, ఆ కుటుంబము ద్వారా నేటి సమాజానికి దేవుని వాక్యాన్ని అందించండి. అప్పుడది దేవుని కుటుంబమవుతుంది.

ప్రియులారా! మీ జీవితకాలంలో మీరు ఆలోచించిన ప్రతి ఆలోచన ప్రభువు కొరకై ఉండాలి. మీరు కష్టపడినా, మీరు ఉద్యోగం చేసినా, మీరు ధనమును సంపాదించుకున్నా, మీరు మాట్లాడినా, మీరు తిన్నా, మీరు నవ్వినా, మీరు ఏడ్చినా... సమస్తము ప్రభువు నిమిత్తమే ఉండాలి. ఇలా మీ జీవితం ఉంటే మిమ్మును గూర్చి ప్రతి క్షణం పరలోకమందున్న తండ్రికి సంతోషమే! నిజంగా మీలాంటి వారే పరలోక రాజ్యానికి రావాలని ఆయన ఆశపడతాడు. ఇక ఆత్మగా ఈ దేహాన్ని విడిచి నిత్యత్వానికి వెళితే, అక్కడ ప్రతినిత్యం పండుగే. పరలోకంలో ప్రతి రోజు ఆనందమే. భూమి మీదే ప్రభువునందు మనకు ఆనందాన్ని అనుగ్రహిస్తున్న దేవుడు పరలోకంలో అనుగ్రహించడా? ప్రపంచంలో మిగిలిన అన్యజనులందరికి సంవత్సరంలో అప్పుడప్పుడు ఆయా కాలాలలో పండుగలు వస్తాయి. వారికి పండుగ వస్తే పైకి నవ్వుతారు; లోపల వారికి లోకసంబంధమైన ఎన్నో విచారాలు, బాధలు ఉంటాయి. అందుకే, ఒక పండుగ వచ్చింది గనుక వారి దగ్గర ధనము లేకపోతే అప్పు చేసైనా సరే ఆ పండుగను జరుపుకోవాలనుకుంటారు. చివరకు వారికి మిగిలేది వారు చేసిన అప్పు మాత్రమే. పండుగంటే ఈ సమాజానికి తెలిసినదేమిటి? క్రొత్త బట్టలు, పిండి వంటలు, సినిమాలు, షికార్లు, కోడి పందాలు, జూదములు,... ఇంకా శృతి మించితే వ్యభిచారములు. ఇవన్నీ వారిని వారు కాల్చుకోవడానికే తప్ప తమ ఆత్మను పరలోకానికి చేర్చుకోవడానికి ఏమాత్రం ఉపయోగపడవు. పండుగ పేరు చెప్పి నేటి సమాజం భావి తరాలకు నేర్పిస్తున్నది ఏమిటి? అందుకే నానాటికీ ఈ వ్యవస్థ ఇలా తగలబడిపోతోంది. కనీసం బైబిల్ చేతబట్టిన క్రైస్తవులైనా దేవుని వాక్యమును బట్టి పండుగ పరమార్ధాన్ని చెబుతారేమో అనుకుంటే, మరొకవైపు వీరు కూడా క్రిస్మస్ అని న్యూ ఇయర్ అని పండుగలు జరుపుకొంటుంటే ఈ సమాజానికి ఇక బుద్ధిని చెప్పేవారెవరు? అందుకే పరిశుద్ధ గ్రంథములో దేవుని ఆవేదనను చూడండి.

కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 5 : 6- **'మీరు అతిశయపడుట మంచిదికాదు. పులిసిన పిండి కొంచెమైనను ముద్దంతయు పులియజేయునని మీరెరుగరా? మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్త ముద్ద అవుటకై ఆ పాతదైన పులిపిండిని తీసిపారవేయుడి. ఇంతే కాక క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను. గనుక పాతదైన పులిపిండితోనైనను దుర్మార్గతయు దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండ, నిష్కాపట్యమును సత్యమునను పులియని**

**రొట్టెతో పండుగ ఆచరింతము.'** నేటి క్రైస్తవులలో అనేకమంది వారి జీవితములలో ఇంకా పులిసిన పిండినే కలిగి ఉన్నారు. ఎన్నోసార్లు దేవుని గూర్చిన మాటలు విన్నా, దేవుని వాక్యాన్ని గొప్పగా నేర్చుకొంటున్నా, ఇంకా లోకసంబంధముగా ఆలోచిస్తూ ఆచారాలకు సంబంధించిన పండుగలనే చేస్తున్నారు. అందుకే మీరు అతిశయపడుట మంచిది కాదు. పులిసిన పిండి కొంచెమైనను ముద్దంతయు పులియజేయునని మీరెరుగరా? మంచి పిండిని పులియబెట్టడానికి ఒక్క చిటికెడు పులిసిన పిండి చాలు. అది మంచి ముద్దంతటిని పాడు చేస్తుంది. గొప్ప విశ్వాస జీవితాన్ని ఒక చిన్న దుష్క్రియ పాతాళానికి తీసుకెళ్లిపోతుంది. అందుకే దేవుడు ముందుగా ఈ జాగ్రత్తను వ్రాయించాడు. ప్రతి పండుగలో ప్రధానమైన ఆకర్షణ పిండి వంటలే గనుక, పిండిని ఒక ఉదాహరణగా తీసుకొని దేవుడు బోధ చేస్తున్నాడు. మీరు పులిపిండి లేనివారుగా ఉండాలంటే, మీరు క్రొత్త ముద్దగా మారాలంటే, ఆ పాతదైన పులిసిన పిండిని తీసి పారవేయాలి.

ఇంతేకాక, క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను. ఆనాడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు చెరలో నుండి బయటకు తీసుకొని రావడానికి పస్కా బలి ఏలాగున అవసరమైనదో, ఈనాడు మనలను అపవాది చెరలో నుండి విముక్తిని అనుగ్రహించడానికి క్రీస్తు అను పస్కా బలి అవసరమైనది. గనుక, దేవుని కుమారుడైన క్రీస్తును ఎల్లప్పుడూ జ్ఞాపకాలలో ఉంచుకుంటూ, పాతదైన పులిపిండితోనైనను దుర్మార్గతయు దుష్టత్వమును అను పులిపిండితోనైనను కాకుండ నిష్కాపట్యము సత్యము అను పులియని రొట్టెతో ప్రతి దినం పండుగ ఆచరిద్దాం. ఇక మన జీవితాలకు ఆ పాతదైన పులిపిండి వద్దు. పాత పస్కా పండుగ అవసరం ఇక మనకు లేదు. పాత పర్ణశాలల పండుగ అవసరం ఇక మనకు లేదు. దేవుడు తన అద్భుతమైన సంకల్పము చొప్పున వాటినన్నింటినీ రద్దుచేసాడు. పాతదైన ధర్మశాస్త్రాన్ని ఆయన తన కుమారుని ద్వారా కొట్టి వేయించాడు. ఇప్పుడు క్రొత్త పిండిని కలిగినవారమై, ఆ పాత పిండిని సమూలంగా తీసివేసి పులియని రొట్టెతో అనగా సత్యసంబంధమైన దేవుని వాక్యముతో ఆయనకిష్టమైనట్టుగా క్రీస్తు ప్రభువునందు ఆనందిస్తూ ప్రతి దినము పండుగ చేద్దాం.

ఈ పండుగలో నిష్కాపట్యము ఉంది; సత్యము ఉంది. సత్యమంటే దేవుని వాక్యము **(యోహాను సువార్త 17 : 17).** మనము కపటము లేకుండా స్వచ్ఛమైన దేవుని వాక్యాన్ని అనేక మందికి ప్రకటిస్తూ పులియని రొట్టెతో పండుగ చేయాలని ఆజ్ఞాపింపబడింది. ఎందుకంటే ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించాలి. ఈ పండుగను ఆచరించి ఆనందించాలి. నిజముగా దేవుడు వ్రాయించిన ఈ పులియని రొట్టెతో, క్రీస్తు అనే పస్కా బలి నిమిత్తమైన పండుగను మీరు ఆచరిస్తే మీదే నిత్యజీవము. లేదా ఈ లోకమందున్న వ్యర్థమైన పండుగలను ఆచరిస్తూ ఇందులోనే కలసిపోతాను అనుకుంటే మీదే పాతాళము. లోకసంబంధమైన పండుగలు సంవత్సరానికి ఒక్కసారే వస్తాయి. కొద్ది కాలమే మీకు తాత్కాలికమైన ఆనందాన్నిస్తాయి. పరలోక సంబంధమైన పండుగ మీకు క్రీస్తు పరిచయమైనప్పటి నుండి ప్రతి రోజు వస్తుంది. నిత్యకాలము మీకు శాశ్వతమైన ఆనందాన్ని అనుగ్రహస్తుంది. నిర్ణయం మీదే!

-------x-------

## ప్రశ్నలు

**1) ఇశ్రాయేలీయులకు దేవుడు పండుగలను ఎందుకు పరిచయం చేసాడు? చర్చించండి.**

**2) నాటి ఇశ్రాయేలీయులకు పండుగల పరమార్థం తెలిసిందా? చర్చించండి.**

**3) ఇశ్రాయేలీయులకు పండుగలను పరిచయం చేసిన దేవుడు వాటిని మరల ఎందుకు ముగించాలనుకున్నాడు?**

**4) యూదుల పర్ణశాలల పండుగ విషయంలో యేసు నేర్పించిన పాఠమును వివరించండి.**

5) నేటి నామకార్థ క్రైస్తవులు లేఖన విరుద్ధముగా ఆచరించుచున్న పండుగల మీరు ఏ విధముగా ఖండిస్తారు?

6) ప్రభువునందు ఆనందించుట అనగా ఏమిటి?

7) నేడు క్రైస్తవులు లేఖనానుసారముగా ఆచరించవలసిన పండుగ ఏది? దానిని వివరించండి.

## 8. యాత్రలో ఉన్న పరదేశులు యెరూషలేము యాత్ర చేయవచ్చా?

దేవుడు భూమి మీద మనుష్యులను యాత్రలను చేయమన్నాడు. మనుష్యులను ఆయన ఒకే చోట స్థిరంగా ఉండవద్దన్నాడు. అందుకే ప్రారంభ కాలము నుంచి మనము దైవగ్రంథమును చూస్తే, చరిత్రలో ఎందరో దేవుని పిల్లలు యాత్రలు చేసినట్టుగా మనకు కనిపిస్తుంది. విశ్వాసులకు తండ్రిగా ఎంచబడిన అబ్రాహాము మొదలుకొని ఆయన ప్రజలని పిలువబడిన ఇశ్రాయేలీయుల వరకు వారు చేసిన యాత్రలు మనకు కనిపిస్తాయి. దేవుడు మనిషిని యాత్ర చేయాలనే కోరుకుంటున్నాడు. వారి జీవితకాలమంతా యాత్రలోనే ఉండమంటున్నాడు. కానీ ఆ యాత్రలు మన ఇష్టాన్ని నెరవేర్చుకొనేవి కాక, దేవుని సంకల్పమును నెరవేర్చేవిగా ఉండాలన్నది ఇక్కడ ప్రధానమైన విషయము. ఆనాడు అబ్రాహాము ఏ విధముగా యాత్ర చేసాడో పరిశీలిద్దాం.

**ఆదికాండము 12 : 1 'యెహోవా - నీవు లేచి నీ దేశమునుండియు నీ బంధువులయొద్దనుండియు నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము.'** దేవుడు అబ్రాహాముతో ఒక దేశాన్ని విడిచి మరో దేశానికి యాత్ర చేయమని ఆదేశించాడు. నేటి కాలములో యెరూషలేము యాత్రను చేయాలో, చేయకూడదో మనము తెలుసుకోవాలంటే ముందుగా మనము ఆలోచించవలసినది ఏమిటంటే, అసలు యాత్ర అనేది దేవునికి ఇష్టమా, కాదా? దైవగ్రంథములో దేవుని ఆజ్ఞానుసారముగా అబ్రాహాము యాత్ర చేసినట్టుగా మనకు కనిపిస్తుంది. ఆ తరువాత అబ్రాహాము కుమారుడైన ఇస్సాకు కూడా యాత్ర చేసినట్టుగా మనకు కనిపిస్తుంది. అలాగే, యాకోబు, అతని కుమారులు కూడా యాత్రలు చేసినట్టుగా మనము చూడగలము. ఇశ్రాయేలీయులు చేసిన యాత్రలు సంవత్సరాల కొద్దీ మనకు కనిపిస్తుంది. ఆ యాత్రలోనే వారు పిల్లలను కన్నారు, ఆ యాత్రలోనే వారు పెద్దవారైపోయారు, చివరకు ఆ యాత్రలోనే వారు చనిపోయారు. వారు అంత పెద్ద యాత్రలను చేసారు. సుమారు 40 సంవత్సరముల పాటు ఇశ్రాయేలీయులు ప్రయాణంలోనే ఉన్నారు. ఆ తరువాత దావీదు యాత్రలు చేసాడు; ప్రవక్తలు కూడా యాత్రలు చేసారు. పరిశుద్ధ గ్రంథములో కనిపిస్తున్నటువంటి నీతిమంతులందరూ ఎక్కువగా తమ జీవితాలను యాత్రలోనే గడిపారు. దేవునికి ఇష్టానుసారమైన యాత్ర చేస్తే అది ఆయనకు చాలా ఇష్టం.

**కీర్తనలు 84 : 5 'నీవలన బలము నొందు మనుష్యులు ధన్యులు. యాత్రచేయు మార్గములు వారికి అతి ప్రియములు.'** దేవుని వలన బలము నొందువారు యాత్రను కోరుకుంటారు. యాత్రచేయు మార్గము వారికి అతి ప్రియము. అందుకే దేవుని పిల్లలందరూ వారి జీవితములో ఎక్కువ భాగము యాత్రలో ఉన్నట్టే మనకు కనిపిస్తుంది. వారు ఒకే చోట స్థిరముగా ఉండిపోయినవారు కాదు. అబ్రాహామును తాను పుట్టి పెరిగిన దేశములో ఉండగానే దేవుడు అక్కడే అతనిని ఆశీర్వదించవచ్చు. కానీ ఆయన అలా చేయలేదు. అబ్రాహామును ఆయన ఆశీర్వదించడానికి ముందు అతని చేత దేవుడు యాత్రను చేయించాలి. ఒక మనిషి దేవునికి ఇష్టుడుగా ఉండాలంటే, ఆ మనిషి దేవుని కొరకు నడవాలి. అందుకే ఆయన కొరకు నడిచే పాదములను గూర్చి, సువార్త ప్రకటించుచు సమాధానము ప్రకటించుచు రక్షణ సమాచారము ప్రచురించు వారి పాదములు ఎంతో సుందరములై యున్నవవి తన గ్రంథములో వ్రాయిస్తున్నాడు. **(యెషయా 52 : 7 / రోమీయులకు వ్రాసిన పత్రిక 10 : 15)** ఆయన నిమిత్తము నడిచేవారంటే ఆయనకు ఇష్టం. ఆయన నిమిత్తం ప్రయాణం చేసేవారంటే ఆయనకు ప్రీతి. ఆయన నిమిత్తం యాత్రలో ఉన్నవారంటే ఆయనకు మక్కువ.

ఇక మన పాఠము విషయానికొస్తే 'యాత్రలో ఉన్న పరదేశులు యెరూషలేము యాత్ర చేయవచ్చా?' ఇప్పటి కాలములో జీవిస్తున్న మనము దేవుని కొరకు ఏ విధమైన యాత్రలు చేయాలి? అన్నది ఈ పాఠము యొక్క పరిశోధనాంశము. నేటి క్రైస్తవులు, యాత్ర అనగానే వెంటనే వారు యెరూషలేమును జ్ఞాపకం చేసుకుంటారు. ఈ యెరూషలేము యాత్ర దేవుని ఉద్దేశ్యమో కాదో ఈ పాఠములో సవివరముగా తెలియజేయబడుతుంది. సంవత్సరంలో

ఒకసారి లేక తమ జీవితంలో ఒకసారి యెరూషలేమును దర్శించుకోవాలన్నది దేవుని అభీష్టమా? లేక మనుష్యుల ఆచారమా? అసలు దేవుడు కోరుకొనే యాత్ర ఏమిటి? అది ఎలా ఉండాలి? ఆయన మొదటి కాలము నుంచి తన పిల్లలను ఎలాంటి యాత్రలో ఉండమన్నాడు? ఎందుకు యాత్రలో ఉండమన్నాడు? దేవుని వాక్యము పరిపూర్ణముగా మన చేతికి ఇవ్వబడిన ఈ కాలములో మనము దేవునికి నచ్చిన యాత్రను ఏ విధముగా చేయగలం? నేడున్న మనుష్యులను క్రైస్తవుల పుణ్యక్షేత్రం ఎక్కడ ఉంది? అని అడిగితే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన 'యెరూషలేము'ను చూపిస్తారు. యెరూషలేము యాత్ర ఒక పవిత్రమైన యాత్రని, ప్రతి క్రైస్తవుడు తన జీవితకాలంలో ఒక్కసారైనా యెరూషలేము యాత్ర చేసి ఆ ప్రాంతాన్ని దర్శించుకోవాలని నేటి మనుష్యులలో ఉన్న ఒకానొక అభిప్రాయం. అందుకే ఈ రోజు యెరూషలేము ఒక పర్యాటక స్థలముగా మారిపోయింది. ప్రపంచంలో ఎక్కడెక్కడో జీవిస్తున్న క్రైస్తవులు యెరూషలేము సందర్శనార్థమై ఆ దేశానికి తరలి వస్తున్నారు. యెరూషలేములో సొలొమోను కట్టించిన మందిరం, యొర్దాను నదీ ప్రాంతం, యేసు సంచరించిన ప్రదేశాలు, ఇంకా కొన్ని ప్రదేశాలు, వస్తువులు, ఆధారాలను చూడటానికి అనేకమంది దేశవిదేశాల నుంచి సందర్శకులు ఆ దేశానికి వెళుతున్నారు. దీనిని గమనిస్తూ ప్రభుత్వాలు కూడా వారి వారి దేశాలలో క్రైస్తవులుగా ఉన్న వారికి ప్రత్యేకముగా కొన్ని నిధులను కేటాయిస్తూ వారి యెరూషలేము యాత్రలను ప్రోత్సహిస్తున్నారు. సాధారణ విశ్వాసులేగాక, ఎందరో క్రైస్తవ బోధకులు కూడా అక్కడకు వెళ్లి వచ్చి వారి వీడియోలను చూపించి, మేము యెరూషలేముకు వెళ్లాము గనుక మీరు కూడా వెళ్లండి అని ప్రోత్సహిస్తున్నట్టుగా మనకు కనిపిస్తుంది. తమ సంఘాలలో ధనవంతులై యాత్ర ఖర్చును భరించగలిగిన వారిని తమతోపాటు యెరూషలేము తీసుకొనివెళ్లే సంఘకాపరులు కూడా ఉన్నారు. గనుక యెరూషలేమును వివిధ కారణాలచేత దర్శించాలనుకొనే వారందరూ, అలాగే వారి వారి స్వదేశాలలో కూడా కొన్ని కొన్ని ప్రాంతాలను దేవుని పేరిట దర్శించుకోవాలనుకొనే వారందరూ ఈ పాఠాన్ని జాగ్రత్తగా చదవండి. దేవుడు నిజంగా కోరుకునే యాత్ర ఎలా ఉంటుంది? మనుష్యులు చేసే యాత్రలు దేవునికి ఇష్టమో కాదో తెలుసుకుందాం. ముందుగా యెరూషలేమును గూర్చి దేవుడు తన గ్రంథములో వ్రాయించిన మాటలను పరిశోధిస్తూ ముందుకు వెళదాం.

**మత్తయి సువార్త 5 : 35 'యెరూషలేము తోడన వద్దు; అది మహారాజు పట్టణము.'** యెరూషలేము దావీదు మహారాజు యొక్క పట్టణం. దావీదు యెరూషలేమును కేంద్రముగా చేసుకొని ఇశ్రాయేలీయులను, యూదులను పరిపాలించాడు. ఆ తరువాత అతని కుమారుడైన సొలొమోను యెరూషలేములో దేవుని కొరకు ఒక మందిరాన్ని కట్టించాడు. ఆ తరువాత ఇశ్రాయేలీయులకు యూదులకు యెరూషలేము ఒక ముఖ్య పట్టణము, పరిశుద్ధ పట్టణముగా పిలువబడింది. ఎందుకంటే అక్కడ దేవునికి సొలొమోను నిర్మించిన దేవాలయముంది. మరియు వారిని పరిపాలించే రాజు దేవుని ఆత్మ కలిగినవాడై ఆ పట్టణమందు నివసించాడు. కనుక, యేసు ధర్మశాస్త్ర కాలములో ఉన్న యూదులకు, ఇశ్రాయేలీయులకు ధర్మానుకూలముగా ఈ మాటలను చెబుతూ, యెరూషలేము తోడనవద్దు అది మహారాజు పట్టణము అన్నాడు. అంటే ఇశ్రాయేలీయుల కాలంలో దేవుడు యెరూషలేము పట్టణాన్ని పవిత్రమైనదిగానే పరిగణించాడు. ఎందుకంటే దీని వెనుక దేవునికి చాలా గొప్ప ఆలోచన ఉంది. అదేమిటంటే, యూదులు చెరపట్టబడినప్పుడు యెరూషలేము నుండి వివిధ ప్రాంతాలకు చెదరిపోయిన వారంతా ఏటేటా ఒక్కసారైనా యెరూషలేమునకు వచ్చి వారు ధర్మశాస్త్ర ప్రకారము పండుగను ఆచరించాలి. ఏటేట ఒక్కసారైనా వారు వచ్చి సొలొమోను దేవాలయములో దేవునికి బలులనర్పించాలి. అలాగని దేవుడు యెరూషలేమును నిత్యమూ గొప్పగా చేద్దామని కాదు. నిత్యమూ ఆయన వారిచే బలులను స్వీకరించాలని కాదు. దీనిని ప్రతినిత్యం తరతరాలకు ఒక వాడుక చేద్దామని కాదు. యెరూషలేము పట్టణము ధర్మశాస్త్రకాలములో ఉన్న ఆనాటి ఇశ్రాయేలీయులకు మరియు యూదులకు మాత్రమే పవిత్రమైన పట్టణము. కాలక్రమేణా ఇశ్రాయేలీయులు, యూదులు దేవుని నుండి తొలగిపోయారు. దేవుని ధర్మశాస్త్రమును వారు అతిక్రమించారు. చివరకు వారు దేవుని పేరిట వచ్చిన ప్రవక్తలను కూడా యెరూషలేములోనే చంపి, ఆ పట్టణమును రక్తసిక్తమైన పట్టణముగా మార్చేసారు. కానీ ప్రారంభములో అయితే, యెరూషలేము దావీదు మహారాజు యొక్క పట్టణం. రాజైన దావీదు కాలంలో, సొలొమోను కాలంలో యెరూషలేము ఒక పవిత్రమైన పట్టణం. కాని ఆ తరువాత వచ్చిన ఇశ్రాయేలీయుల మరియు యూదుల రాజులు చాలా మూర్ఖులుగా

మారిపోయారు. వారి మూర్ఖత్వం ఎంత ఘోరముగా మారిపోయిందంటే, ఎవరైనా ఒక ప్రవక్త చావాలంటే అది యెరూషలేములోనే తప్ప మరెక్కడా కాకూడదనుకునేంతగా! ఒక నీతిమంతుని వారు చంపాలనుకున్నారంటే అతనిని యెరూషలేములో చంపుతున్నారు. ఈ విధంగా, ఒకనాడు పవిత్రమైన ప్రజలతో నిండిన యెరూషలేము పట్టణం పవిత్రంగానే ఉంది. రాను రాను అపవిత్రులనేకులు అందులో నివసించుటవలన ఆ పట్టణము నీతిమంతుని మరణానికి ఆవాసముగా మారిపోయింది. యెరూషలేమును శాపము పొందిన పట్టణముగా వారు మార్చేసారు. ఈ విషయాలన్నీ వారు గమనించకుండా, చరిత్ర నుండి పాఠాలను నేర్చుకోకుండా, పైకి మాత్రం ఏమి చెప్పుకుంటున్నారంటే - యెరూషలేము మహారాజు పట్టణం, అందులో సొలొమోను దేవాలయం ఉంది, అది పవిత్రమైన పట్టణమని చెప్పుకుంటున్నారు. మరొకవైపు వీరు చేస్తున్న ఆగడాలు ఆ యెరూషలేము పట్టణాన్ని నీతిమంతుల రక్తముతో ముంచేస్తున్నాయి. యేసుక్రీస్తు ఈ భూమి మీదకు వచ్చినప్పుడు ఇదే విషయాన్ని ఆయన బహిర్గతం చేసాడు. యేసు యెరూషలేము ప్రాంతములో తన శిష్యులతో మరియు చుట్టూ ఉన్న జనసమూహముతో ఈ విషయములను బహిర్గతం చేసాడు. ఆయన వచ్చినంత వరకు యెరూషలేమును గూర్చి ఏ ఒక్కరూ పల్లెత్తు మాట కూడా అనలేదు. ఎందుకంటే యెరూషలేమును గూర్చి ఏమి చెప్పినా వారి చుట్టూ ఉన్న యూదులు వారిని శిక్షిస్తారేమోననే భయం. దేవుని కుమారుడైన యేసు మాత్రం నిర్భయంగా పరలోకపు తండ్రి మనస్సులో ఉన్న మాటలను తెలియజేసాడు.

మార్కు సువార్త 11 : 15- **'వారు యెరూషలేమునకు వచ్చినప్పుడు ఆయన దేవాలయములో ప్రవేశించి, దేవాలయములో క్రయ విక్రయములు చేయువారిని వెళ్లగొట్ట నారంభించి, రూకలు మార్చువారి బల్లలను, గువ్వలమ్మువారి పీటలను పడద్రోసి దేవాలయము గుండ ఏ పాత్రయైనను ఎవనిని తేనియ్యకుండెను. మరియు ఆయన బోధించుచు -నా మందిరము సమస్తమైన అన్యజనులకు ప్రార్థన మందిరమనబడును అని వ్రాయబడలేదా? అయితే మీరు దానిని దొంగల గుహగా చేసితిరనెను.'** యేసు కాలములో ఆనాటి యెరూషలేము దేవాలయపు పరిస్థితి ఎలా ఉందో చూడండి. దేవునికి నివాస స్థలముగా ఉండవలసిన దేవాలయము యూదులకు ఒక వ్యాపారపు ఇల్లుగా మార్చబడింది. వ్యాపారస్తులకు ఒక బజారులా మార్చబడింది. దానికి కారణం ఎవరు? నాటి యూదులే కదా. ఒక స్థలం పవిత్రముగా ఉండాలన్నా, అపవిత్రపరచబడాలన్నా ఆ స్థలములో సంచరించే మనుష్యుల ప్రవర్తన మీదే ఆధారపడి ఉంటుందనుటలో ఎటువంటి సందేహమూ లేదు. నేటికీ కూడా మీరు ఆలోచించండి. ఒక ప్రదేశం పవిత్ర స్థలముగా ప్రాచుర్యాన్ని పొందుచున్నదంటే అక్కడ జరిగే వ్యాపారమే దానికి కారణం. ఆ వ్యాపారాన్ని బట్టి వ్యాపారస్తులందరూ అక్కడికి వెళ్లి, వచ్చుచున్న భక్తులనందరినీ ఆకర్షిస్తున్నారు. వాక్యమును విని, మారుమనస్సునొందడానికి రాని జనం, పుణ్యస్థలాలని పేరు పెట్టబడినవాటికి మాత్రం తండోపతండాలుగా వెళ్లిపోతారు. కారణం ఏమిటంటే, అక్కడ జరిగే సంబరం, క్రయవిక్రయాలు, తిండి, ఆట,.. ఇతరత్రా అన్నీ అక్కడ వారికి పుష్కలంగా దొరుకుతాయి. అందుకే అక్కడికి తమకున్న దానిని ఖర్చు చేసుకొని మరీ వెళ్లిపోతున్నారు. ఆనాటి యెరూషలేము దేవాలయమును కూడా ఇలాగే మార్చేసారు. అప్పుడు యేసు వారి అజ్ఞానమును బహిరంగముగా నిలదీస్తున్నాడు. సొలొమోను దేవాలయమును ఎందుకు కట్టించాడో దాని పరమార్థమును తెలియజేస్తున్నాడు. దేవుని మందిరము సమస్తమైన అన్యజనులకు ప్రార్థనా మందిరముగా ఉండాలి. ఇది వ్రాయబడిన మాట. **(యెషయా 56 : 6, 7; యిర్మీయా 7 : 11)** వ్రాయబడిన మాటలను నాటి యూదులు మీరుతున్నారు. అవును, యెరూషలేము మహారాజు పట్టణము అని వ్రాయబడింది. దానికి వారు ఏమైనా న్యాయం చేస్తున్నారా? దేవుని మందిరమని పేరు పెట్టబడిన ఆలయం ఎలా ఉండాలి? దేవాలయానికి వచ్చిన సమస్త జనులకు దేవుని వాక్యమును నేర్పించే వాక్యపు నిధిగా ఉండాలి. కానీ, ఆనాటికే యెరూషలేము దేవాలయం ఒక దొంగల గుహగా మారిపోయింది. ఇశ్రాయేలీయులు, యూదులు ఎంతటి దౌర్భాగ్యులుగా మారిపోయారో చూడండి. యేసు వీరిని గూర్చి స్వయంగా చెబుతున్నాడు. ఆయన కాలములో అనగా సుమారు 2000 సం॥ల క్రితమే యెరూషలేము దేవాలయము ప్రార్థన మందిరముగా కాక దొంగల గుహగా ఉంది. మరి ఇప్పుడు? అది ఒక పర్యాటక స్థలం. నేటికీ ఆ స్థలములో దేవుని వాక్యమును బోధిస్తున్నారా? లేక నాలుగు రూకలు సంపాదించుకోవడానికి ఆ పేరును ఉపయోగించుకుంటున్నారా? అవును. అది ఆ దేశపు ప్రభుత్వానికి ఒక ఆదాయపు వనరుగా కనిపిస్తుందే తప్ప, మిగిలిన ప్రపంచ దేశాలకు దేవుని ఔన్నత్యమును చాటే ప్రదేశంగా మాత్రం లేదు.

ఇప్పుడు చెప్పండి. యెరూషలేము యాత్రను దేవుడు కోరుకుంటాడా? అటువంటి యాత్రను నేటి క్రైస్తవులు చేయవచ్చా? ఇది మాత్రమే కాదు. ఇంకా అనేకమైన విషయములను దేవుడు తన పరిశుద్ధ గ్రంథములో పొందుపరిచాడు. వాటిని కూడా పరిశోధిద్దాం.

లూకా సువార్త 13 : 31- '**ఆ గడియలోనే కొందరు పరిసయ్యులు వచ్చి - నీవిక్కడనుండి బయలుదేరి పొమ్ము. హేరోదు నిన్ను చంప గోరుచున్నాడని ఆయనతో చెప్పగా ఆయన వారిని చూచి - మీరు వెళ్ళి, ఆ నక్కతో ఈలాగు చెప్పుడి - ఇదిగో నేడును రేపును నేను దయ్యములను వెళ్లగొట్టుచు (రోగులను) స్వస్థపరచుచునుండి మూడవ దినమున పూర్ణ సిద్ధి పొందెదను. అయినను నేడు రేపు ఎల్లుండి నా త్రోవను నేను పోవుచుండవలెను; ప్రవక్త యెరూషలేమునకు వెలుపల నశింప వల్లపడదు. యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచు, నీయొద్దకు పంపబడినవారిని రాళ్లతో కొట్టుచు ఉండుదానా, కోడి తన పిల్లలను తన రెక్కలక్రింద ఏలాగు చేర్చుకొనునో ఆలాగే ఎన్నో మారులు నేను నీ పిల్లలను చేర్చుకొనవలెనని యుంటినిగాని మీ రొల్లకపోతిరి. ఇదిగో మీ యిల్లు మీకు పాడుగా విడువబడుచున్నది - ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడునుగాకని మీరు చెప్పువరకు మీరు నన్ను చూడరని మీతో చెప్పుచున్నాననెను.**' ఈ మాటలలో యేసుప్రభువు పూర్తిగా యెరూషలేము యొక్క చరిత్రను చెబుతున్నాడు. చివరకు ఆయన మరణము కూడా ఆ యెరూషలేము ప్రాంతములోనే జరుగునన్నట్టుగా ఆయన ముందుగా తెలియజేసాడు. ఎందరో ప్రవక్తల రక్తాన్ని ఆ నేలపై చిందింపజేసిన ఇశ్రాయేలీయులు, యూదులు చివరకు దేవుని కుమారుడైన యేసు రక్తాన్ని కూడా ఆ నేలపైనే చిందించారు. అసలు ఒక దేవుని ప్రవక్త ఇశ్రాయేలీయుల చేత నాశనము చేయబడాలంటే అది యెరూషలేములోనే. ఎంతోకాలంగా, యెరూషలేములో ప్రవక్తలను చంపేస్తున్నారు. ఆ యెరూషలేము ప్రవక్తల రక్తంతో నిండిపోయింది. అందుకే నిజమైన ప్రతి ఇశ్రాయేలు ప్రవక్త యెరూషలేము లోపటనే చనిపోవాలి. అందుకే యేసు తన మరణము సమీపించినప్పుడు యెరూషలేముకు ప్రయాణమై వెళ్లాడు. ఏ ప్రవక్తైనా, నీతిమంతుడైనా దేవుని పేరిట వచ్చి స్వచ్ఛమైన దేవుని వాక్యమును బోధిస్తే అతనిని యూదులు యెరూషలేము లోపటనే చంపేసారు. యేసు మరణానికి ముందు బాప్తిస్మమిచ్చు యోహాను తల అలాగే తెగ్గొట్టబడింది. యేసును కూడా ఆ యెరూషలేములోనే శిక్షించారు, చంపేసారు. అవును, దేవుని తీర్మానము ప్రకారం, ధర్మశాస్త్ర కాలములో ఉన్న ఇశ్రాయేలీయులు, యూదుల కొరకు వచ్చిన దేవుని ప్రవక్తలంతా ఆ యెరూషలేము బయట నశింపబడటానికి వీలులేదు. దీనంతటికీ ప్రధానమైన కారణం, యెరూషలేముకు దేవుని పేరు పెట్టి పవిత్రముగా దానిని చూపించి దానిని దయ్యానికి నివాసముగా మార్చడమే. అందుకే దేవుని కోపము కట్టలు తెంచుకుని, ప్రవక్త రక్తమును ఆ యెరూషలేములోనే ఇశ్రాయేలీయులు, యూదులచేత చిందింపజేసి, వారికి తీర్పు తీర్చడానికి సిద్ధంగా ఉన్నాడు. యేసు కాలములోనే యెరూషలేము పాడైపోయినదిగా విడువబడింది. దాని ఒకప్పటి వైభవం గొప్పది. కానీ నేడు అది పాడుబడిన స్థలమని యేసే సాక్ష్యమిచ్చాడు. ఎందరో ప్రవక్తల రక్తాన్ని కళ్ల జూసిన ఆ యెరూషలేము చరిత్రను దేవుడు తన గ్రంథమందు నిక్షిప్తం చేసాడు. యెరూషలేము మందిర ఆవరణములో ఒక ప్రవక్త మరణాన్ని గూర్చి దేవుడు వ్రాయించాడు.

దినవృత్తాంతములు రెండవ గ్రంథము 24 : 21 '**అందుకు వారతనిమీద కుట్రచేసి, రాజుమాటను బట్టి యెహోవా మందిరపు ఆవరణములోపల రాళ్లు రువ్వి అతని చావగొట్టిరి.**' ఇది ప్రవక్తయైన జెకర్యా మరణం. ఈ జెకర్యా ఇశ్రాయేలీయులను ఉద్దేశ్యించి వారికి దేవుని వాక్యమును వివరించగా, వారు అతనిపై కుట్ర చేసి దేవుని మందిరము లోపటనే అతనిని రాళ్లు రువ్వి చంపేసారు. చూసారా. ఆనాటి ఇశ్రాయేలీయులు ఏమనుకుంటున్నారంటే, వారేదో ఒక పాపాత్ముని్న చంపేస్తున్నట్టుగా, అది కూడా ఒక దేవాలయములో ఆ హత్య జరిగించి వారేదో దేవునికిష్టులన్నట్టుగా భ్రమిస్తున్నారు. కాని వారు చంపుతున్నది దేవుడు పంపిన ఒక ప్రవక్తను, అందులోనూ వారు చంపుతున్నది దేవుని పేరు పెట్టబడిన ఒక మందిరములో అన్న విషయాన్ని తెలుసుకోలేకున్నారు. యెరూషలేము పవిత్ర పట్టణమైనప్పుడు, అది మహారాజు పట్టణమైనప్పుడు, దైవ ప్రవక్త ప్రాణాన్ని దేవుని మందిరము లోపల ఎందుకు తీస్తున్నారు? వారి భయంకరమైన దుష్కార్యముల వలనే యెరూషలేము దేవుని దృష్టికి పాడుబడినదిగా మారిపోయింది. ప్రియులారా! మీరు ఈ విషయమును జాగ్రత్తగా ఆలోచించాలి. నేటి యెరూషలేమును గూర్చి దేవుడు మనకు చక్కగా అర్థమయ్యేలా వివరించాడు. ఒకనాడు

అది పరిశుద్ధ పట్టణం, ఒకనాడు అది పరిశుద్ధ దేవాలయం. కాని యేసు కాలానికి ఆ యెరూషలేము దొంగల గుహగా, శాపము పొందినదిగా, దైవ సుతుని ప్రాణాలను తీయడానికి కూడా వెనుకాడకుండా మారిపోయింది.

**మత్తయి సువార్త 23 : 34- 'అందుచేత ఇదిగో నేను మీయొద్దకు ప్రవక్తలను జ్ఞానులను శాస్త్రులను పంపుచున్నాను; మీరు వారిలో కొందరిని చంపి సిలువవేయుదురు, కొందరిని మీ సమాజమందిరములలో కొరడాలతో కొట్టి, పట్టణమునుండి పట్టణమునకు తరుముదురు. నీతిమంతుడైన హేబెలు రక్తము మొదలుకొని బలిపీఠమునకును, దేవాలయమునకును మధ్య మీరు చంపిన, బరకీయ కుమారుడగు జెకర్యా రక్తమువరకు భూమిమీద చిందింపబడిన నీతిమంతుల రక్తమంతయు మీ మీదికి వచ్చును. ఇవన్నియు ఈ తరమువారిమీదికి వచ్చునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.'** ఆనాటి యెరూషలేము పట్టణస్తులు నీతిమంతులను చంపుతున్నారు. ప్రవక్తలను, జ్ఞానులను, శాస్త్రులను దేవుడు పంపించినప్పుడు వారి మాటలు విని మారుమనస్సు పొందకపోగా, వారిలో కొందరిని సిలువ వేసి చంపుతున్నారు. మరి కొందరిని భయపెడుతూ పట్టణము నుండి పట్టణమునకు తరుముతున్నారు. వారి యొద్దకు పంపబడిన చిట్టచివరి ప్రవక్త వరకు ప్రవక్తలందరిని వారు చంపేసారు. కనుక, నేటి యెరూషలేము ఒకనాడు ప్రవక్తల నిరపరాధ రక్తమును చూచిన ప్రాంతము. అది ప్రవక్తల రక్తం, నీతిమంతుల రక్తం, దేవుడు పంపించిన మనుష్యుల యొక్క రక్తం. ఇప్పుడు ఎవరైనా ఆ ప్రాంతానికి వెళ్లాలంటే ఎంత భయపడాలి చెప్పండి. అలాగైతే, యేసుక్రీస్తు ఆ ప్రాంతంలో ఎందుకు పుట్టాడు? ఆ ప్రాంతము అంత భయంకరమైనదైనప్పుడు ఆయన అక్కడ ఎందుకు జీవించాడు? ఎందుకంటే, ఆయన ధర్మశాస్త్రమును నెరవేర్చడానికి వచ్చాడు. ఆ ప్రాంతంలోనే దేవుని కుమారుడైన యేసు కూడా వారి చేతులలో మరణించాలి. ఇందునిమిత్తమే యేసు అక్కడ నివసించాడు. ఇక నీతిమంతుడైన హేబెలు రక్తము మొదలుకొని బలిపీఠమునకును దేవాలయమునకును మధ్య వారు చంపిన బరకీయ కుమారుడగు జెకర్యా రక్తము వరకు భూమి మీద చిందింపబడిన నీతిమంతుల రక్తమంతయు యెరూషలేము నివాసుల మీదికి తప్పక వచ్చునని యేసు నిశ్చయముగా చెప్పాడు. ఎందుకంటే పరిశుద్ధ పట్టణమైన యెరూషలేము అలా రక్తసిక్తముగా మారిపోవడానికి కారకులు వారే. అందుకే దేవుడు వారిని శిక్షించేంత వరకు విడిచిపెట్టలేదు.

**మత్తయి సువార్త 24 : 1 'యేసు దేవాలయమునుండి బయలుదేరి వెళ్లుచుండగా ఆయన శిష్యులు ఆ దేవాలయపు కట్టడములు ఆయనకు చూపింపవచ్చిరి. అందుకాయన - మీరు ఇవన్నియు చూచుచున్నారు గదా; రాతిమీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనెను.'** అప్పటికి యేసు శిష్యులకు ఇంకా యెరూషలేము యొక్క చరిత్ర, సొలొమోను దేవాలయం యొక్క పరిస్థితి అర్థం కాలేదు. యేసు, దేవుని వాక్యమును ప్రకటించడానికి మాత్రమే యెరూషలేము దేవాలయములో ఉన్నాడు. అంతే తప్ప ఆ దేవాలయపు అందాలను చూచి తరించడానికి కాదు; పర్యటన చేసి సంతోషించడానికి కాదు. అక్కడ ఆయనకు దేవుని పని ఉంది. దానిని ముగించి ఆయన వెళ్లిపోతుంటే, ఆయన శిష్యులు మాత్రం లోకపరంగా ఆలోచిస్తూ ఆ దేవాలయపు కట్టడములను ఆయనకు చూపిస్తున్నారు. యేసు లేకుండా కలిగినది ఏదీ లేదు. యెరూషలేము దేవాలయమును గూర్చి ఆయనకు తెలియదా? యేసుకు తెలియని యెరూషలేము చరిత్రను ఆయనకు ఏ టూరిస్ట్ గైడ్ చెప్పగలడు? ఆ దేవాలయపు కట్టడాలను గూర్చి యేసుకు వివరించాలని ఆయన శిష్యులు ఉపక్రమిస్తున్నప్పుడు ఆయన ఏమంటున్నాడో చూడండి. మీరు ఇవన్నియు చూచుచున్నారు కదా, అయితే ఈ దేవాలయములో రాతిమీద రాయి ఒకటైనను నిలిచి ఉండకుండ పడద్రోయబడునని వారితో నిశ్చయముగా చెప్పాడు. ఇది నిజంగా ఎంత అద్భుతం! యేసు మొహమాటము లేకుండా యెరూషలేము మరియు దేవాలయపు భవిష్యత్తును ఖచ్చితముగా తెలియజేసాడు. అలాగే, ఆ పట్టణము యెడల, సొలొమోను దేవాలయము యెడల వాంఛ కలిగిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భముగా యేసు ఒక మంచి పాఠమును నేర్పిస్తున్నాడు. యెరూషలేము పుణ్యక్షేత్రమని గాని, సొలొమోను దేవాలయం ఒక పవిత్ర స్థలమని గాని భావించడానికి వీలు లేదు. దానిని దేవుని పేరిట పర్యాటక కేంద్రమని భావించి మోసపోకండి. ఈ భూమి మీద స్వలాభాపేక్ష కలిగిన వారు మాత్రమే వాటిని మీరు దర్శించాలన్నట్టుగా మీకు చెబుతారు; అవసరమైతే దేవుని వాక్యమును కలిపి చెరిపి మీకు బోధిస్తారు. అదంతా నిజమని భావించకూడదు. యేసు తన శిష్యులతో చెప్పిన మాటలు అనతి కాలములోనే యెరూషలేము

పట్ల, సొలొమోను దేవాలయము పట్ల సంభవించాయి. ప్రవక్తలను తమ చేతులార చంపిన యూదులు మహా శ్రమలను అనుభవించారు. దేవుని తీర్పులు ఆలస్యము కాక అవి వాటి కాలమందు తప్పక నెరవేరతాయి. ఇప్పటికీ యెరూషలేములో దేవునికి ఆత్మసంబంధమైన ఆరాధనలు ఏమైనా జరుగుతున్నాయా? అక్కడకు వెళ్లిన పర్యాటకులు దేవున్ని ఆత్మతోను సత్యముతోను ఆరాధించి వస్తున్నారా? లేనే లేదు. అక్కడ ఉండటానికి వసతి ఎక్కడ? అక్కడ ఇంకా చూడదగిన ప్రదేశాలు ఏమున్నాయి? క్రొత్త క్రొత్త తిండి పదార్థాలు ఏమేమి దొరుకుతాయి? అక్కడ కొనుక్కుని ఇంటికి పట్టుకెళ్లవలసిన వస్తువులేమిటి? ఇంతే కదా అక్కడకు వెళ్లే ప్రతి పర్యాటకులకుండే ఆలోచన! ఇంతకు మించి దేవునికొరకు వారి ఆలోచన ఏమిటి చెప్పండి. దేవుని ఆరాధించే స్థలమును గూర్చి ప్రస్తావిస్తే, యేసు ఒకానొక సందర్భములో మంచి సమాధానమును అనుగ్రహిస్తున్నాడు. దానిని ఆలోచిద్దాం.

**యోహాను సువార్త 4 : 20- 'మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించిరి గాని ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురని ఆయనతో అనగా యేసు ఆమెతో ఇట్లనెను. -అమ్మా ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు. నా మాట నమ్ముము;'** యేసు కాలములో దైవారాధనను గూర్చి ఆనాటి యూదులు ఏమని చెప్పుకుంటున్నారో చూడండి. దేవున్ని ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని వారు ప్రచురిస్తున్నారు. గనుకనే వారు పరిశుద్ధ పట్టణమైన యెరూషలేములో ఆరాధిస్తున్నామని చెప్పుకుంటున్నారు. దీనికి దేవుని కుమారుడైన యేసు సమాధానమేమిటో తెలుసా? 'ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమందు పర్వతముల మీద గాని, యెరూషలేములో గాని దేవుని ఆరాధింపరు' అన్నాడు. ఎందుకంటే ఒకనాడు యెరూషలేముకున్న పవిత్రత రాను రాను అక్కడ నివసించిన ప్రజల పాపములనుబట్టి తొలగిపోయింది. ఇప్పుడది దేవుని ఆరాధనా స్థలము కాదని యేసు 2000 సంవత్సరాలకు ముందే చెప్పాడు. యేసు చెప్పిన ఆ కాలమెప్పుడు? అదే యేసు ధర్మశాస్త్రాన్ని పూర్తి చేసిన కాలము. అదే యేసు రక్షణ మార్గమును ప్రకటించిన కాలము. అదే ప్రారంభపు క్రైస్తవ సంఘ కాలము. అదే క్రొత్త నిబంధన కాలము. ఆ కాలము వచ్చేసరికి ఇక ఎవ్వరూ పరలోకపు తండ్రిని యెరూషలేములో ఆరాధించరు. దానినిబట్టే అది నేడొక పర్యాటక స్థలముగా మారింది తప్ప దేవుని ఆరాధనా స్థలముగా ఉండలేకపోయింది. దేవుని మనసెరిగిన ఆయన కుమారుడైన యేసు, మీరు యెరూషలేములో తండ్రిని ఆరాధించరు అన్నాడంటే ఇప్పుడు ఏ ఒక్కరైనా దేవుని యాత్ర పేరిట యెరూషలేమునకు వెళ్లవలసిన అవసరత ఉందంటారా? యెరూషలేములో తండ్రికి ఆరాధన జరుగనప్పుడు ఆ ప్రదేశముతో మనిషికి పనేమిటి? దేవుడు చెప్పిన జ్ఞానమును విస్మరించి, మానవ కోరికలకే విలువనిచ్చిన మనిషి తీర్పు కొరకు సిద్ధంగా ఉండాలి సుమా! ఇంతకీ ఇప్పుడు దేవునికి ఆరాధన ఎక్కడ జరుగుతుంది. ఆత్మతోను, సత్యముతోను దేవునికి ఆరాధనలు ఎక్కడ జరగాలని దేవుడు కోరుకున్నాడు? నేడు దేవుని ఆరాధనా స్థలమేది? దీనికి సమాధానమును కేవలం ఆయన కుమారుడైన యేసు ద్వారా ఈ మానవ ప్రపంచానికి దేవుడు తెలియజేసాడు. దానిని ఈ ప్రపంచానికి చెప్పడానికి ముందు ఆయన తన ద్వారా దానిని జరిగించి చూపించాడు. దేవుని ఆరాధనా స్థలం మనిషికి దేవుడిచ్చిన శరీరమే. యేసు తనకు దేవుడిచ్చిన శరీరమును దేవాలయముగా మలచి ఆయనకు ప్రీతికరమైన సేవ చేసాడు. **(యోహాను సువార్త 2 : 21 / హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 3 : 6 / కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 3 : 16)** ఏ దేహము ద్వారానైతే మనుష్యులకు దేవుని వాక్యము ప్రకటింపబడుతుందో ఆ దేహంలో దేవునికి ఆరాధన జరుగుతుంది. ఒకనాడు యెరూషలేము మహారాజు పట్టణం. ఒకనాడు యెరూషలేములో దేవునికి ఆరాధన జరిగింది. అనాడు పాత నిబంధనకు బద్ధులైనవారంతా, అనగా ఇశ్రాయేలీయులంతా ఏటేటా యెరూషలేము వెళ్లి దేవుని ఆరాధించి, పండుగను ఆచరించాలి. అక్కడ దేవునికి హోమములను అర్పించాలి. కాని ఇశ్రాయేలీయుల దుష్కార్యముల వలన దేవుడు ఆ యెరూషలేము ప్రాంతాన్ని శాపమునకు లోనుచేసాడు. అది నీతిమంతుల రక్తముతో నిండినప్పుడు దేవుని ఆశీర్వచనమును పొందనేరదు గదా. అది చివరకు ఒక ఎండిన మోడులా మిగిలిపోతుంది. ఇశ్రాయేలీయులు, యూదులు దేవుని పట్ల అంత ఘోరంగా ప్రవర్తించారు. దీనినిబట్టి దేవుడు యెరూషలేముకు శాపమును విధించాడు. కనుక ఇప్పుడు మనము చేయవలసిన యాత్ర ఏమిటి? మన దేహమును దేవునికి ఆలయముగా మలచి, మనము సంపాదించిన ధనముతో అనేకమందికి క్రీస్తు సువార్తను అందించి, నూతన యెరూషలేము దేవుని దగ్గర పరలోకమందున్నది గనుక

దానిని చేరుటకు ప్రయత్నించాలి. నిజముగా ప్రతి క్రైస్తవుడు చేయవలసిన యాత్ర పరలోకపు యాత్రే తప్ప యెరూషలేము యాత్ర కాదు. ఇంకా కొన్ని విశేషమైన ఆధారాలను పరిశోధన చేద్దాం.

**లూకా సువార్త 21 : 20 'యెరూషలేము దండ్లచేత చుట్టబడుట మీరు చూచునప్పుడు దాని నాశనము సమీపమైయున్నదని తెలిసికొనుడి.'** యేసు రాకతో యెరూషలేము నాశనము మొదలైంది. అందుకే 2000 సంవత్సరాల క్రితమే యెరూషలేము ఏ విధముగా నాశనమవుతుందో యేసు చెప్పాడు. ఆయన చెప్పినది యదాతథంగా జరిగింది. రోమా సామ్రాజ్య కాలంలో యెరూషలేము శత్రువుల దండ్లచేత పట్టబడింది. ఈనాటికీ యెరూషలేము ప్రాంతమంతా డేంజర్ జోన్ గానే ఉంది. ఇజ్రాయెల్ దేశముపై ఎప్పుడు ఏ దేశము యుద్ధమును ప్రకటిస్తుందో తెలియదు. పాలస్తీనా ఇజ్రాయెల్ దేశాలమధ్య యుద్ధ వాతావరణం ఆరని మంటలా నిరంతరం రగులుతూనే ఉంటుంది. పాలస్తీనాకు వంతపాడే దేశాలు కొన్ని అయితే, ఇజ్రాయెల్‌కు వంత పాడే దేశాలు మరికొన్ని. ఇలా రెండు వర్గాలుగా విడిపోయి నాశనమునకు సిద్ధంగా ఉన్న ప్రాంతాలవి. అక్కడ దేవునికి ఆరాధన జరుగుతుందనుకోవడం, అది దేవునికిష్టమైన స్థలమనుకోవడం పరిశుద్ధ గ్రంథమును బట్టి వట్టి అవివేకం!

**లూకా సువార్త 21 : 24 'వారు కత్తివాత కూలుదురు; చెరపట్టబడినవారై సమస్తమైన అన్యజనముల మధ్యకు పోవుదురు; అన్యజనముల కాలములు సంపూర్ణమగువరకు యెరూషలేము అన్యజనములచేత త్రొక్కబడును.'** ఇశ్రాయేలీయులు, యూదులు తమ ప్రాణములను అరచేతిలో పెట్టుకొని అన్యజనుల మధ్యలోనికి పారిపోయారు. ఇక యెరూషలేము వారికి నివాస స్థలముగా లేదు. అన్యజనముల కాలములు సంపూర్ణమగువరకు యెరూషలేము అన్యజనములచేత త్రొక్కబడుతుంది. ఈనాటికీ ఆ ప్రాంతము అనేకమందిచేత త్రొక్కబడుతూ, ఒకనాడు దానికున్న పవిత్రత, ఘనత అన్నీ మట్టిలో కలిసిపోయాయి. ఈ మాటలకు అర్థం ఏమిటంటే, దేవుని దృష్టిలో యెరూషలేము అన్యులచేతికి అప్పగింపబడుతుంది. అది ఆయనకు పనికి రానిదిగా మారిపోతుంది. దీనంతటికీ కారణం, ఒకనాటి ఇశ్రాయేలీయులు, యూదుల అవిధేయత మరియు వారు దేవునిపై చేసిన దౌర్జన్యం. ఇప్పుడు అలాంటి శాపమును పొందిన యెరూషలేము యాత్రను మనము చేయాలంటారా? నిజంగా ఆ యెరూషలేమును సందర్శించి మనము చూసేది ఏమిటి? దాని నుండి మనము నేర్చుకొనేది ఏమిటి? దేవునికి కోపాన్ని తెప్పించటం తప్ప, నేడున్న యెరూషలేముకు వెళ్లటం వల్ల మనిషికి మిగిలేది ఏమీ లేదు. ఒకవేళ దేవుని గూర్చి తెలుసుకోవాలంటే పరిశుద్ధ గ్రంథమును తెరచి దేవుని వాక్యమును చదవండి. దేవుని గూర్చి చూసేదైనా, నేర్చుకునేదైనా దేవుని గ్రంథములో ఉంది తప్ప, పర్యాటక స్థలాలలో లేదు.

ప్రియులారా! యెరూషలేము యాత్ర పేరిట నేటి క్రైస్తవ్యానికి వినబడుతున్నదంతా ఒక వ్యాపారం. నాడు యేసు చెప్పినట్టుగా ఈ తరములో మరల దేవుని పేరు పెట్టుకుని యాత్రలు చేసి ఆయన ఇచ్చిన విలువైన దేహమును దొంగల గుహగా చేయకండి. అలాగని దేవుడు ముందుగా తన గ్రంథమందు దీనినంతా వ్రాయించి ఉంచలేదా? యెరూషలేములో తండ్రిని ఎవ్వరూ ఆరాధించరు, ఆరాధించలేరు. యెరూషలేము నీతిమంతుల రక్తముతో నిండిపోయిన ఒక ప్రదేశం. దాని చెంతకు వెళ్లాలనుకోకండి; అక్కడి కట్టడాలను చూడాలనుకోకండి. రాతిమీద రాయి ఒకటైనను మిగలకుండా అది పడద్రోయబడుతుంది. దేవుడు తన కుమారులను చేయమన్న యాత్ర ఇటువంటిది కాదు. ఆయన ప్రారంభము నుంచి తన పిల్లలతో చేయించిన యాత్ర ఇటువంటిది కాదని పాఠకులు గమనించాలి. యాత్రలంటే దేవునికిష్టం. కానీ దేవునికిష్టమైన యాత్రలు చేయడం మనిషికిష్టమా? ఇదే అసలైన ప్రశ్న. మనము చేయవలసిన ఒక అద్భుతమైన యాత్ర ఉంది. అది పది రోజులతోనో, నెల రోజులతోనో ముగింపబడే భూమి మీద యెరూషలేము యాత్ర వంటిది కాదు. అది మీ జీవితకాలమంతా మీరు చేయవలసిన యాత్ర. ఆ యాత్ర చేయడానికి కష్టంగా ఉన్నా దాని వలన వచ్చే బహుమతి మాత్రం చాలా విలువైనది. అదే అసలుసిసలైన దేవుడు కోరుకున్న యాత్ర. ఇప్పుడు దానిని తెలుసుకుందాం. మనము నిజంగా చేయవలసిన యాత్ర ఏమిటో పరిశీలనగా తెలుసుకుందాం.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక **11 : 13 'వీరందరు ఆ వాగ్దానముల ఫలము అనుభవింపక పోయినను, దూరమునుండి చూచి వందనము చేసి, తాము భూమి మీద పరదేశులమును యాత్రికులమునై యున్నామని ఒప్పుకొని,**

**విశ్వాసముగలవారై మృతినొందిరి.'** అనగా, మనిషి భూజీవిత కాలములో, అతడు దేవుని కొరకు బ్రతుకుతున్నప్పుడు తన పరిశుద్ధమైన జీవిత కాలమే ఒక యాత్ర. ఈ భూమి మీద మనిషి పరదేశిగా ఉన్నాడు. అనగా, ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతానికి వెళ్లే పరదేశిగా కాదు. ఈ భూమి నుండే మరొక లోకానికి వెళ్లే పరదేశిగా ఉండాలి. దీనిని నేర్పించడానికే ప్రారంభకాలంలో దేవుడు తాను ఏర్పరచుకొన్న మనుష్యులను యాత్రలు చేయమన్నాడు. వారిని భవిష్యత్తు తరాలకు ఒక ఉదాహరణగా చూపిస్తూ, కనాను దేశానికి వెళ్లే యాత్ర చేయమన్నాడు. అవన్నీ భవిష్యత్ కాలములో వాక్యము పరిపూర్ణమైన తరువాత మనిషి తాను ఒక పరదేశినని, ఒక యాత్రికుడనని గుర్తెరిగి తన జీవితకాలమంతా దేవుని కొరకు బ్రతుకవలసిన వాడై ఉన్నాడు. తన జీవిత కాలములో క్రీస్తు సువార్త అందని వారికి దానిని ప్రకటించే క్రమంలో అనేకమంది మనుష్యులను సందర్శించి, వారికి దేవుని మాటలను చెప్పి, వారిని దేవుని సంఘముగా కట్టి... ఈ విధముగా తన యాత్రను పూర్తిచేసి దేవుని పిలుపునందుకొని నిద్రించి పరలోకానికి చేర్చబడాలి. అదే పరలోకపు తండ్రి దృష్టికి పరిపూర్ణమైన యాత్ర. మునుపటి కాలములో దేవుని జ్ఞానము ఈ విధముగా అర్థం చేసుకున్న వారంతా ఇదే యాత్రలో ఉండాలని వాక్యము ద్వారా గ్రహించి ఆ యాత్రనే వారి జీవితాలలో పూర్తి చేసుకొన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుంటూ దేవునికిష్టమైన ఈ యాత్రను మన జీవితకాలములో తప్పక పూర్తి చేయాలి.

గలతీయులకు వ్రాసిన పత్రిక 4 : 25 **'ఈ హాగరు అనునది అరేబియాదేశములో ఉన్న సీనాయి కొండయే. ప్రస్తుతమందున్న యెరూషలేము దాని పిల్లలతోకూడ దాస్యమందున్నది గనుక ఆ నిబంధన దానికి దీటయియున్నది. అయితే పైనున్న యెరూషలేము స్వతంత్రముగా ఉన్నది; అది మనకు తల్లి.'** చూసారా, మోసపోవద్దు. ప్రస్తుతమందున్న యెరూషలేము దాస్యములో ఉంది. ఈ దాస్యములో ఉన్న యెరూషలేము యొద్దకు వెళదామనుకుంటున్నారా లేక స్వతంత్రురాలైన యెరూషలేము దగ్గరకు వెళదామనుకుంటున్నారా. దీనినంతటినీ దేవుడు ఒక పోలికగా ఇక్కడ మనకు వివరిస్తున్నాడు. దేవుని గ్రంథములో స్వతంత్రురాలనగా శారా; దాసి అనగా హాగరు. వీరు పితరుడైన అబ్రాహాముకు భార్యలు. ఇందులో హాగరు అనునది నేటికీ అరేబియా దేశములో ఉన్న సీనాయి కొండయే. ప్రస్తుతమందున్న యెరూషలేము దానికి దీటయియున్నది. అయితే, పైనున్న యెరూషలేము స్వతంత్రముగా ఉన్నది. అది మనకు తల్లి. అనగా, వాగ్దత్త కుమారుడైన ఇస్సాకును కన్న తల్లి శారా గనుక ఆమెను పోలిన యెరూషలేము పరలోకమందున్నది. దాని యొద్దకు మనము వెళ్లాలి. అందుకే పైనున్న యెరూషలేము అనగా పరలోకమని అర్థం; ఆ లోకానికి వెళ్లు నిమిత్తము మనము ఈ భూమి మీద దేవుని కొరకు యాత్రలు చేయాలి. మన పుట్టుకే యాత్రికులుగా ఉండటానికి జరిగిన పుట్టుక. పరదేశులుగా మనము బ్రతుకుచున్నాము. మన జీవితకాలమంతా పరదేశులుగానే ఉంటూ, మన సొంత దేశమైన పరలోకానికి అర్హతను సంపాదించుకోవడానికి గొప్ప యాత్రలు దేవుని కొరకు చేయాలి. ఈ యాత్రలో అనేకమందిని అగ్నిలో నుండి రక్షించాలి.

ప్రకటన గ్రంథము 3 : 12 **'జయించువానిని నా దేవుని ఆలయములో ఒక స్తంభముగా చేసెదను. అందులోనుండి వాడు ఇకమీదట ఎన్నటికిని వెలుపలికిపోడు. మరియు నా దేవుని పేరును, పరలోకములో నా దేవుని యొద్దనుండి దిగి వచ్చుచున్న నూతనమైన యెరూషలేమను నా దేవుని పట్టణపు పేరును, నా క్రొత్త పేరును వానిమీద వ్రాసెదను.'** ఇవన్నీ మనకు అర్థమైతే మనము దేవుని సంఘములో ఒక స్తంభముగా నిలబడిపోవాలి. మన జీవితం దేవుని సంఘములోనుండి ఎన్నటికిని వెలుపలికి పోనిదిగా, లోకమాలిన్యమును అంటించుకొననిదిగా ఉండాలి. అప్పుడు ఎవరైతే దేవుని సంఘములో స్తంభములవంటివారుగా ఉంటారో వానిపై దేవుని పేరును, పరలోకములో దేవుని యొద్దనుండి దిగివచ్చుచున్న నూతనమైన యెరూషలేమను దేవుని పట్టణపు పేరును, ఆయన క్రొత్త పేరును వ్రాసెదను అంటున్నాడు యేసు. భూమిమీద దేవుని కొరకు ప్రాణాలు అర్పించినటువంటి పరిశుద్ధులందరూ ఇప్పుడు ఆ నూతన యెరూషలేముకు ఆహ్వానింపబడతారు. ఆనాటి ఇశ్రాయేలీయుల కంటె గొప్పగా, భూమిపై ఉన్న దాస్యపు యెరూషలేమును మించి, స్వతంత్రురాలైన పరలోకపు యెరూషలేము కొరకు నేటి క్రైస్తవులంతా యాత్ర చేయాలి.

ప్రకటన గ్రంథము 21 : 2 **'మరియు నేను నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధపట్టణము తన భర్తకొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట చూచితిని.'**

యోహానుకు దర్శనమందు దేవుడు భవిష్యత్తును చూపిస్తూ, నూతన యెరూషలేమును చూపిస్తున్నాడు. దాని వైభవము చాలా గొప్పదిగా ఉంటుంది. దానిని ఎదుర్కొనుటకు, దానిలో అడుగు పెట్టుటకు ప్రతి మనిషి దేవుని కొరకు గొప్ప యాత్రను చేయాలి. దేవుని యొద్ద నుండి బయలుదేరడానికి సిద్ధముగా నూతనమైన యెరూషలేము మనకొరకు ఎదురు చూస్తున్నది. ఆ పరిశుద్ధ పట్టణము కొరకు ప్రతి ఒక్కరు ఎదురు చూడాలన్నదే దేవుని అభీష్టము. ఆ నూతన యెరూషలేమనే పరలోకపు పట్టణము తన భర్త కొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడియున్నది. అది పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగివచ్చుటను దర్శనములో యోహాను చూచాడు. దానిని పరిశుద్ధాత్మ ప్రేరణతో లిఖించాడు; దానినే మనము చదువుతున్నాము. ఆ యెరూషలేములో పరిశుద్ధులు, నీతిమంతులు, దేవుని కొరకు ప్రాణాలు అర్పించినవారు మాత్రమే ఉంటారు. ఇప్పుడు చెప్పండి. మనము ఏ యెరూషలేముకు వెళ్లాలి? పరలోకపు యెరూషలేముకు మాత్రమే వెళ్లాలి. ఈ భూమి మీద యెరూషలేమును స్వతంత్రించుకోవాలనే కోరిక ఆనాటి నీతిమంతులకే లేదు. ఇక ఈనాడు దేవుని వాక్యము పరిపూర్ణము చేయబడిన కాలములో మనము బ్రతుకుచూ ఇంకా ఈ భూమి మీద యెరూషలేమును చూడాలనే కోరికను కలిగి ఉంటే అది దేవుని దృష్టికి చాలా పెద్ద నేరం. అత్యంత విలువైన పరలోకపు యెరూషలేమును విడిచిపెట్టి, ఈ భూమి మీద నున్న యెరూషలేమును ఎవరైనా కోరుకుంటారేమోనని తండ్రియైన దేవుడు తన కృపాబాహుళ్యముచేత బహు జాగ్రత్తతో ఈ మాటలన్నిటినీ వ్రాయించాడు.

ప్రకటన గ్రంథము 21 : 10 **'ఆత్మవశుడనైయున్న నన్ను యెత్తయిన గొప్ప పర్వతము మీదికి కొనిపోయి, యెరూషలేము అను పరిశుద్ధ పట్టణము దేవుని మహిమగలదై పరలోకమందున్న దేవుని యొద్ద నుండి దిగివచ్చుట నాకు చూపెను.'** యోహానుకు దర్శనములో చూపబడిన యెరూషలేము ఈ భూమి మీద యెరూషలేము పట్టణము కాదు. పరలోకమందు దేవుని దగ్గర సిద్ధపరచబడి ఉన్న యెరూషలేము యోహానుకు దర్శనమందు చూపబడింది. దానినే మనము కోరుకోవాలి. ఆ యెరూషలేము వెళ్లడానికే ఇప్పటి వరకు ఈ భూమి మీద బ్రతికిన ప్రతి నీతిమంతుడు ఆలోచన చేసాడు. అటువలె మనము కూడా పరలోకపు యెరూషలేమును చేరుకొనుట కొరకు మాత్రమే యాత్ర చేయాలి. భూమి మీద దేవుని కొరకైన మన జీవితమే ఒక యాత్రని తెలియజేసే సందర్భము ఒకటి చూద్దాం.

**ఆదికాండము 47 : 9 'యాకోబు - నేను యాత్రచేసిన సంవత్సరములు నూటముప్పది, నేను జీవించిన సంవత్సరములు కొంచెముగాను దుఃఖసహితమైనవిగా ఉన్నవి.'** ఇశ్రాయేలు గోత్రీకుల తండ్రియైన యాకోబు, తన జీవితకాలము యొక్క చివరిదశలో దానిని గూర్చి మాట్లాడుతూ, తాను 130 సంిిలు జీవించానని, ఆ సంవత్సరాలన్నీ తాను దేవుని కొరకు యాత్ర చేసిన దినములని తెలియజేసాడు. అంటే ఇప్పుడు మనము కూడా దేవుని కొరకు బ్రతికితే ఆయన కోరుకున్న యాత్రలో ఉన్నట్టే. ఈ మంచి యాత్రను చేస్తూ నూతన యెరూషలేముకు దగ్గరవ్వాలి. ఇక్కడ మీకు ఒక ఆసక్తికరమైన విషయమును చివరిగా చెప్పాలనుకుంటున్నాను. ఈ భూమి మీది యెరూషలేమును దర్శించాలంటే, మన దగ్గర కొంత సొమ్ము ఉంటే సరిపోతుంది. దీనికి నీతి, పరిశుద్ధత, దేవుని కొరకైన జీవితం.. ఇవేమీ అక్కరలేదు. కానీ పరలోకపు యెరూషలేమును చేరాలంటే, మనము సంపాదించిన సొమ్ముతో పని లేదు. నిజానికి, ధనవంతులు పరలోకపు యెరూషలేములో ప్రవేశించలేరు. పరలోకపు యెరూషలేము సాధన అందరికీ దక్కేది కాదు. నీతిమంతులైన కొందరికి మాత్రమే ఆ మహాభాగ్యం దొరుకుతుంది. దేనిని కోరుకుంటారో, దేని కొరకు ఇక మీదట యాత్ర చేస్తారో ఇప్పుడు నిర్ణయించుకోండి.

ప్రియులారా! పరలోకములో ఉన్న నూతనమైన యెరూషలేము కొరకు మీ యాత్రను పూర్తి చేయండి. నూతన యెరూషలేముకు దగ్గరయ్యే నిమిత్తం ఆ యాత్రలో మీరు కొనసాగండి. మీకు దేవుడిచ్చిన ప్రతిరోజు దేవుని కొరకు యాత్ర చేసే వారుగా బ్రతకండి. అప్పుడు ఆ యాత్రలో ఒక్కొక్కరోజు మీరు గమ్యానికి చేరువవుతారు. అప్పుడు మాత్రమే మీకు ధైర్యం కలుగుతుంది. ఎన్నాళ్లగానో సంఘములో ఉంటున్నా పైనున్న యెరూషలేము కొరకు ఆలోచన లేకుండా ఈ భూమి మీద పాత యెరూషలేమును చేరాలనుకుంటే ప్రయోజనమేమీ లేదు. కనుక, మంచి యాత్ర చేయండి. మనమంతా నూతన యెరూషలేములో కలుసుకోవాలి. ప్రభువు పేరిట మీకు శుభములు!

-------×-------

# ప్రశ్నలు

1) దేవుడు మనిషిని యాత్రలు చేయమన్నాడు. ఈ విషయములో పాత నిబంధన కాలపు యాత్రలను నాటి నీతిమంతులు ఏ విధముగా పూర్తి చేసారో వివరించండి.

2) 'యెరూషలేము మహారాజు పట్టణము' - ఈ వాక్యమును వివరించండి.

3) యేసు శరీరధారిగా ఈ భూమి మీదకు వచ్చే నాటికి, యెరూషలేము దేవాలయపు పరిస్థితి ఏలాగున్నదో వివరించండి.

4) 'ప్రవక్తలు యెరూషలేము లోపటనే నశించిరి' - ఈ సందర్భమును ఉదాహరణలతో వివరించండి.

5) యెరూషలేము దేవాలయమును గూర్చి యేసు తన శిష్యులకు ఇచ్చిన వివరణను తెలియజేయండి.

6) పరలోకపు తండ్రిని యెరూషలేములో కాకుండా, ఒక మనిషి తన ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను. - వివరించండి.

7) క్రైస్తవులు చేయవలసిన నూతన యెరూషలేము యాత్రను గూర్చి సవివరముగా తెలియజేయండి.

## 9. క్రైస్తవులు సిద్ధపరచుకోవలసిన నూనె ఏది?

ప్రియులారా! ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేకమంది క్రైస్తవులకు నూనె బాగా పరిచయం. వారిలో చాలామంది దేవాలయానికి గాని, క్రైస్తవ బహిరంగసభలకు గాని వెళుతున్నప్పుడు తమతోపాటుగా నూనెను తీసుకొని వెళుతుంటారు. ముఖ్యంగా స్వస్థత కార్యక్రమాలకు వెళుతున్నప్పుడు తమతో పాటుగా ఒక కొబ్బరినూనె సీసా పట్టుకుని వెళ్లడం పరిపాటి. వారి చేతుల్లో బైబిల్ ఉందో లేదో సందేహమే గాని, నూనె సీసా మాత్రం ఉంటుంది. ఒకవేళ వారు తమతోపాటు నూనెను తీసుకొని వెళ్లకపోతే ఆ కార్యక్రమంలోనే నిర్వాహకులు కొబ్బరినూనె సీసాలను వచ్చిన వారికి అమ్ముతుంటారు. దానినే 'ప్రేయర్ ఆయిల్' అంటారు. ప్రేయర్ ఆయిల్ అనగా తెలుగులో ప్రార్థన నూనె లేక స్వస్థత నూనె అని అర్థం వస్తుంది. ఈ నూనె ప్రస్తావన ఎక్కడ నుంచి వచ్చిందో, అసలు క్రైస్తవుడు సిద్ధపరచుకొనవలసిన నూనె ఎలాంటిదో, ఈ పాఠములో మీరు సవివరముగా నేర్చుకుంటారు. క్రైస్తవ్యంలో మనము చేసే ప్రతి కార్యక్రమానికి బైబిల్ ఆమోద ముద్ర వేయాలి. మనకు ప్రామాణికము బైబిలే. మనము ప్రార్థన చేసినా, దేవుని పని చేసినా, దేవుని కొరకు ఎటువంటి నిర్ణయాన్ని తీసుకున్నా దానికి దేవుని వాక్యము ఆమోదమును తెలపాలి. అది చిన్న విషయం కావచ్చు, పెద్ద విషయం కావచ్చు. మాట చేతగాని, క్రియ చేతగాని మనమేమి చేసినా అది మన ప్రభువైన క్రీస్తుయేసు ద్వారా పరలోకపు తండ్రియైన దేవుని అభీష్టాన్ని నెరవేర్చేదై ఉండాలి.

ఇంతకీ ఎక్కడనుండి వచ్చింది ఈ నూనె? ప్రతి క్రైస్తవుడూ తనతో పాటు ఒక నూనెబుడ్డిని తీసుకొని వెళ్లమని దేవుడు చెప్పాడా? ఒకవేళ చెబితే క్రైస్తవులైన ప్రతి ఒక్కరూ అలాగే తీసుకొని వెళ్లాలి. లేదా, వెంటనే నూనెను గూర్చి పాఠమును అర్థం చేసుకొని నిజముగా చేత పట్టవలసిన నూనెను సిద్ధం చేసుకోవాలి. దేవుడు మనలను చేయమని ఆజ్ఞాపించిన ప్రతిదానిని మనము నెరవేర్చాలి. ఆయన కుమారుని నామమున బాప్తిస్మమును తీసుకోమన్నాడు. అందుకే బాప్తిస్మమును తీసుకుంటున్నాము. ఆయన కుమారుని యొక్క మరణ, సమాధి, పునరుత్థానములను జ్ఞాపకం చేసుకొనుటకు, మనము కూడా ఆయన కుమారుని సారూప్యత లోనికి మారుటకు, ఆయన శరీరానికి సాదృశ్యంగా రొట్టెను, ఆయన రక్తానికి సాదృశ్యంగా ద్రాక్షారసమును తీసుకొనమన్నాడు. మనం వాటిని స్వీకరిస్తూ వాటిని ఎల్లప్పుడూ జ్ఞాపకమందుంచుకుంటున్నాము. చిన్న విషయమైనా, పెద్ద విషయమైనా దేవుడు వ్రాయించిన దానిని, క్రొత్త నిబంధనలో ఆయన మనకు తెలియజేసిన దానిని పాటించడానికి మనము అనునిత్యం ప్రయత్నం చేస్తున్నాము. అలాంటప్పుడు కొంతమంది క్రైస్తవులు అనునిత్యం వారితో పాటు నూనెసీసాను కలిగి ఉంటున్నారు కదా. కొబ్బరినూనెను ప్రతి క్రైస్తవుడు సిద్ధపరచుకోవాలని దేవుడు ఎక్కడైనా వ్రాయించాడా? నూనె, నూనె సీసాలను గూర్చి తండ్రిగాని, యేసుక్రీస్తుగాని, ప్రవక్తలుగాని ఎప్పుడైనా ఏ కాలంలోనైనా చెప్పారా? దీనిని ఈ పాఠములో వివరణాత్మకముగా ఆలోచన చేద్దాం.

యేసు తాను బ్రతికియున్న కాలంలో భూమి మీద పరలోకరాజ్యానికి పోలికగా ఒక ఉపమానాన్ని చెబుతున్నాడు. బహుశా, నేటి క్రైస్తవులలో కొందరు ఈ ఉపమానాన్ని చూచుకొని తమతో పాటు నూనెను తీసుకొని వెళుతూ మేము కూడా నూనె సీసాను కలిగి ఉండాలని పొరపాటుపడ్డారనేది నా అభిప్రాయం. ఎందుకంటే, ఈ ఉపమానములో తప్ప నూనెను తమతోపాటుగా తీసుకొని వెళ్లమన్నట్టుగా బైబిల్‌లో ఇంకెక్కడా లేదు. ఇప్పుడు ఆ ఉపమానమును గూర్చి ఆలోచన చేద్దాం. ముందుగా, ఉపమానములను అర్థం చేసుకుంటున్నప్పుడు వాటిలో చెప్పబడిన రూపకాలంకారములను ఉన్నది ఉన్నట్టుగా తీసుకోకూడదు. అవి చెప్పే అర్థాలను, లక్షణాలను అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు, ఒక బలమైన మనిషిని గూర్చి ఇతరులకు చెప్పాలనుకుంటే, అతనిని ఒక ఏనుగుతో పోలుస్తారు. ఫలానా వ్యక్తి ఏనుగులాంటి మనిషండి అంటారు. అలాగని, ఆ వ్యక్తికి ఏనుగు మాదిరిగా ఒక తొండము, రెండు కొమ్ములు, నాలుగు కాళ్లు, ఒక తోక ఉంటాయని కాదు. అతడు ఏనుగులా ఉంటాడు అనే మాటకు అర్థం - అతడు చాలా బలంగా ఉంటాడని. మరొక ఉదాహరణగా, ఆమె చీమ వలె చడీచప్పుడు లేకుండా వెళ్లిపోతుంది అంటారు. అంటే ఆమె చాలా నెమ్మదిగా, శబ్దం

చేయకుండా వెళుతుంది అని అర్థం. మరొక ఉదాహరణగా, ఆయన కట్టిన బిల్డింగ్ ఆకాశాన్ని అంటేటట్టుగా ఉంది అంటుంటారు. నిజంగా బిల్డింగ్ ఎక్కడైనా ఆకాశాన్ని అంటుతుందా? అది 5 అంతస్థులో, 10 అంతస్థులో లేక 20 అంతస్థులో ఉంటుంది. ఆ బిల్డింగ్‌ను క్రింద నుంచి చూడగానే అది ఎక్కడో ఆకాశంలో ఉన్నట్టు ఉంటుంది. అందుకే అటువంటి భవనాన్ని చూడగానే అది మా ఊళ్లో ఆకాశాన్ని అంటేటట్టుగా ఉంది అంటారు. ఇక్కడ మనము తీసుకోవలసిన భావం కేవలం భవనము యొక్క ఎత్తు మాత్రమే. దీనినే తెలుగు భాషకు సంబంధించి రూపకాలంకారం అంటారు. ఒక విషయాన్ని చక్కగా అర్థమయ్యేటట్టు చెప్పడానికి దానిని ఉపమానములతో పోల్చి చెబుతారు. పరలోకరాజ్య సంగతులు భూమి మీద నివసిస్తున్న మనిషికి అర్థమయ్యేలా చెప్పడానికి యేసు అనేక పర్యాయములు ఈ ఉపమానములను ప్రయోగించాడు. ధనవంతుడు పరలోకరాజ్యంలో ప్రవేశించలేడు అని చెప్పడానికి ఆయన తీసుకున్న ఉపమానాలు, ఒంటె మరియు సూది బెజ్జం. అందుకే, ఒకవేళ ధనవంతుడు పరలోకరాజ్యములో ప్రవేశింపగలిగితే సూది బెజ్జములో ఒంటె దూరుట కూడా సులభమే అన్నాడు. ఆనాటి కాలంలో యూదులకు అందుబాటులో ఉన్నవి, వారు ప్రతి నిత్యం చూస్తున్నవి ఒంటె మరియు సూది. కనుక వాటిని ఉపమానములుగా తీసుకుంటూ ధనవంతుడు పరలోకరాజ్యంలో ప్రవేశించలేడు అని చెబుతున్నాడు. అలాంటి ఒకానొక ఉపమానమును పరలోకరాజ్యమునకు పోలికగా చెబుతూ యేసు ఒకానొక సందర్భములో నూనెను ప్రస్తావించాడు.

**మత్తయి సువార్త 25 : 1- 'పరలోకరాజ్యము తమ దివిటీలు పట్టుకొని పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు బయలుదేరిన పదిమంది కన్యకలను పోలియున్నది.'** పరలోకరాజ్యమును గూర్చి యేసుక్రీస్తు ఒక పోలిక ద్వారా చెబుతున్నాడు. మనుష్యులకు తెలియని పరలోకరాజ్య రహస్యాలను ఆయన ఉపమానములతో పోల్చి చెబుతున్నాడు. ఈ సందర్భములో పరలోకరాజ్యము - తమ దివిటీలను పట్టుకొని పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు బయలుదేరిన పదిమంది కన్యకలను పోలియున్నది. ఇక్కడ చెప్పబడినది అంతా పోలికే. పరలోకరాజ్యము అనేమాట తప్ప మిగిలినదంతా రూపకాలంకారమే. ఈ పోలికలో ఆయన ఉపయోగించిన వ్యక్తిత్వాలను మరియు పదార్థాలను చూస్తే పెండ్లి కుమారుడు, కన్యకలు, దివిటీలు మనకు కనబడుతున్నాయి. వాటిని ఉన్నది ఉన్నట్టుగా తీసుకోవడానికి వీలు లేదు. వాటి పరమార్థాన్ని గ్రహించి మన బ్రతుకులను సరిదిద్దుకోవాలి. భూమి మీద ఉన్న మనుష్యులకు పరలోకానికి సంబంధించిన సంగతులను తెలియజేయాలంటే, వాటిని మనిషి అర్థం చేసుకోవాలంటే ఉపమానము ద్వారా మాత్రమే చెప్పాలి. మనిషి మరణించిన తరువాత ఈ లోకాన్ని దాటి వెళ్లి మరో లోకాన్ని చేరాలంటే అది సామాన్యమైన విషయము కాదు; అది చాలా గొప్ప సంగతి. గనుక పరలోకరాజ్యమును గూర్చి అర్థం చేసుకోవాలంటే ఉపమానములు ఎంతైనా అవసరం. ఇక్కడ పరలోకరాజ్యమును గూర్చి వివరించడానికి పెండ్లి కుమారుని, కన్యకలను ఎందుకు పోలికగా చెబుతున్నాడంటే, ఈ భూమిపై వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగా ఉండాలి. ఆ వివాహములో అందరికంటె గొప్పగా పెండ్లి కుమారుడు పవిత్రుడుగా ఉంటాడు; అలాగే పెండ్లికుమార్తె, అనగా కన్యక పవిత్రురాలిగా ఉంటుంది. పెండ్లికుమారుడు కన్యక కొరకు ఎదురు చూస్తూ, పెండ్లి కుమార్తె పెండ్లికుమారుని కొరకు ఎదురు చూస్తూ ఒకరికొరకు మరొకరు నిబద్ధతతో ఎదురుచూస్తారు. వీరిద్దరూ పవిత్రమైన భావాలతో ఒకరియెడల ఒకరు దృష్టిని కలిగి ఉంటారు గనుక వీరిని ఒక ఉదాహరణగా తీసుకున్నాడు. లోకమందున్న మిగిలిన వారికి పరి పరి విధాల ఆలోచనలుంటాయి. కానీ పెండ్లికుమారునికి మాత్రం పెండ్లికుమార్తె మీదే దృష్టి ఉంటుంది. అలాగే పెండ్లికుమార్తెకు పెండ్లికుమారుని మీదే దృష్టి ఉంటుంది. అందుకే యేసుక్రీస్తు పరలోకరాజ్యమును పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె (కన్యక) తో పోల్చాడు. ఇంకా కొనసాగింపును చూద్దాం.

**మత్తయి సువార్త 25 : 2- 'వీరిలో అయిదుగురు బుద్ధిలేనివారు, అయిదుగురు బుద్ధిగలవారు. బుద్ధిలేనివారు తమ దివిటీలు పట్టుకొని తమతోకూడ నూనె తీసికొనిపోలేదు. బుద్ధిగలవారు తమ దివిటీలతో కూడ సిద్దెలలో నూనె తీసికొనిపోయిరి.'** ఇక ఈ ఉపమానములో పెండ్లికుమారుడు ఒక్కడే గాని కన్యకలు మాత్రం పది మంది. ఇదెలా సాధ్యం? ఈ భూమి మీద పెండ్లి కార్యక్రమంలో ఒక్కడే పెండ్లి కుమారుని, ఒక్కతే పెండ్లి కుమార్తెను చూస్తాము కదా. అవును. అందుకే మీకు ముందుగానే చెప్పాను. ఉపమానమనగా అందులో చెప్పబడినవాటిని ఉన్నది ఉన్నట్టుగా తీసుకోకూడదు. ఈ ఉపమానములో

పెండ్లికుమారుడనగా రెండవ రాకడలో రాబోవుచున్న యేసుక్రీస్తు. కన్యక అనగా, దేవుని సంఘములో ఉన్న మనుష్య సమాజం. దేవుని సంఘములలో అనేకమంది మనుష్యులు ఉన్నారు. కనుక ఎక్కువ మంది మనుష్యులకు పోలికగా పది మంది కన్యకలు చెప్పబడ్డారు. ఈ పది మంది కన్యకలు దేవుని సంఘాన్ని సూచిస్తున్నారు. అందులో అయిదుగురు బుద్ధిలేనివారు. అనగా, దేవుని సంఘములో కొందరు బుద్ధిలేనివారు అని అర్థం చేసుకోవాలి. సంఘాలలో కొందరు బుద్ధిలేనివారు, మరికొందరు బుద్ధికలిగినవారు ఉంటారు. ఉదాహరణకు, ఆ పది మందిలో అయిదుగురు బుద్ధిలేనివారు, అయిదుగురు బుద్ధిగలవారు అన్నాడు. చూసారా, ఈ లోకములో క్రీస్తు సువార్తకు లోబడని మనుష్యులు కోటానుకోట్లుగా ఉన్నారు. అందులో దేవుని వాక్యమును విని, దానికి లోబడి ప్రభువైన యేసు నామమున బాప్తిస్మమును పొంది, దేవుని సంఘములో చేర్చబడినవారు చాలా తక్కువ మంది. ఆ తక్కువ మందిలో మరల దేవునికి కొత్తే మిగిలింది! అంటే, సంఘములోనికి అడుగుపెట్టిన వారంతా పరలోకానికి రారు. అందులో బుద్ధిలేనివారు, బుద్ధికలిగినవారు తప్పక ఉంటారు. సంఘములో బుద్ధిలేనివారు పేరుకు మాత్రమే క్రైస్తవులు. వారి జీవితాలు మాత్రం క్రీస్తుకు దూరంగా ఉంటాయి. బైబిల్ చేత పట్టుకున్నా, ప్రతి వారం చర్చ్‌కు వెళుతున్నా వారిలో పరిశుద్ధాత్మ నివాసం ఉండడు. ఇక ఈ బుద్ధిలేనివారిని, బుద్ధికలిగినవారిని దేని విషయంలో వేర్పాటు చేస్తున్నాడో చూడండి. బుద్ధిలేనివారు తమ దివిటీలు పట్టుకొని తమతోపాటు నూనెను తీసుకొని పోలేదు. బుద్ధికలిగినవారు తమ దివిటీలతోపాటు సిద్దెలలో నూనెను తీసుకొని వెళ్లారు. ఆ కన్యకల చేతులలో ఉన్న దివిటీలు వెలగాలంటే దానిలోనికి నూనె కావాలి. వెలుగుతున్న దివిటీ ఎక్కువసేపు వెలగాలంటే, అదనపు నూనె కావాలి. దివిటీ ఎక్కువసేపు ఎందుకు వెలగాలి? పెండ్లికుమారుని రాక ఆలస్యమవుతుంది. ఆయన రాక ఎంత ఆలస్యమైనా దివిటీకి ఎటువంటి ఢోకా ఉండకూడదంటే, దివిటీతోపాటు అదనపు నూనె అవసరమే కదా. ఇందులోనే బుద్ధి దాగి ఉంది. కన్యకగా అర్హతను సంపాదించి దివిటీ పట్టుకొని పెండ్లికుమారుని ఎదుర్కోవడానికి వెళ్లడం ఒక ఎత్తైతే, దివిటీలో అదనపు నూనెను కూర్చుకొని, పెండ్లికుమారుని రాక ఎంత ఆలస్యమైనా తమ దివిటీని వెలిగించుకోవడం మరో ఎత్తు. అనేకమంది ఈ విషయంలోనే అర్హతను కోల్పోతారు; పెండ్లికుమారునికి దూరమవుతారు. ఇదంతా నేటి సంఘాల పరిస్థితికి రూపకాలంకారము. అలాగని, యేసు చెప్పిన ఈ ఉపమానములో ఉన్నవన్నీ ఉన్నది ఉన్నట్టుగా తీసుకోమని కాదు; వాటి పరమార్థాన్ని గ్రహించాలని అర్థం. నేడు క్రీస్తును ఎరిగిన తరువాత సంఘములలో చేర్చబడినవారు కూడా కన్యక వేషము వేసుకొని, తమ చేత దివిటీలు పట్టుకొని, రాత్రివేళ పెండ్లికుమారుని కోసం ఎదురు చూడమని కాదు. దేవుని సంఘాలలో చేర్చబడిన క్రైస్తవులు తన చేత పట్టుకోవలసిన దివిటీ వేరే ఉంది. యేసు ఉపమాన రూపములో చెప్పిన దివిటీకి రూపకాలంకారములో ఏదైతే ఉంటుందో దానినే మనము సిద్ధపరచుకోవాలి. దివిటీ రాత్రి వేళ వెలుగునిస్తుంది. కనుక అంధకార సంబంధమైన క్రియలను విసర్జించి, తేజస్సంబంధమైన క్రియలను చెయ్యాలి. **(రోమీయులకు వ్రాసిన పత్రిక 13 : 12)** దివిటీ వెలగటానికి నూనెగా ఏదైతే పోలికగా చెప్పబడిందో దానిని మనము కలిగి ఉండాలి. అనగా, మన క్రియలు వెలుగు సంబంధమైనవై యుండటానికి అనునిత్యం మన హృదయాలోచనలను దేవుని వాక్యముతో క్రీస్తు మార్గములో నడిపించుకోవాలి. ఇదే సిద్ధపాటుతో కూడిన నూనె. బుద్ధిలేని కన్యకలు తమ దివిటీలు పట్టుకొని తమతో పాటు నూనెను తీసుకొని పోలేదు. బుద్ధిగలవారు తమ దివిటీలతో పాటు సిద్దెలలో నూనె తీసుకొని పోయిరి. ఆ తరువాత పర్యవసానము ఏమి జరిగిందో చూద్దాం.

**మత్తయి సువార్త 25 : 5- 'పెండ్లికుమారుడు ఆలస్యము చేయగా వారందరు కునికి నిద్రించుచుండిరి. అర్ధరాత్రివేళ - ఇదిగో పెండ్లికుమారుడు, అతనిని ఎదుర్కొన రండి అను కేక వినబడెను. అప్పుడు ఆ కన్యకలందరు లేచి తమ దివిటీలను చక్కపరచిరి గాని బుద్ధిలేని ఆ కన్యకలు - మా దివిటీలు ఆరిపోవుచున్నవి గనుక మీ నూనెలో కొంచెము మాకియ్యుడని బుద్ధిగలవారినడిగిరి. అందుకు బుద్ధిగల కన్యకలు - మాకును మీకును ఇది చాలదేమో, మీరు అమ్మువారియొద్దకు పోయి కొనుక్కొనుడని చెప్పిరి. వారు కొనబోవుచుండగా పెండ్లికుమారుడు వచ్చెను, అప్పుడు సిద్ధపడియున్న వారు అతనితో కూడ పెండ్లి విందుకు లోపలికి పోయిరి; అంతట తలుపు వేయబడెను. ఆ తరువాత తక్కిన కన్యకలు వచ్చి - అయ్యా, అయ్యా, మాకు తలుపు తీయుమని అడుగగా అతడు - మిమ్ము నెరుగనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. ఆ దినమైనను గడియయైనను మీకు తెలియదు గనుక మెలకువగా ఉండుడి.'** పెండ్లికుమారుని రాక ఆలస్యమైంది. కానీ

ఆయన తప్పక వస్తాడు. ఆయన వచ్చినప్పుడు చూసుకుందామని కొందరు, ఆయన వస్తాడు గనుక ఇప్పుడే చూసుకోవాలని మరికొందరు. ఇందులోనే బుద్ధిలేని మనస్సు, బుద్ధిగలిగిన మనస్సు కనబడతాయి. వారంతా దివిటీలు పట్టుకొని నిద్రించుచుండగా, అర్ధరాత్రివేళ పెండ్లికుమారుడు వచ్చాడు. అనగా, దీని పరమార్థం ఏమిటంటే, ఎవ్వరూ అనుకొనని కాలములో యేసు రెండవరాకడ జరుగుతుంది. అంతా నెమ్మదిగా ఉంది అనుకునే వేళలో యేసు రెండవరాకడ జరుగుతుంది. ఉపమానములో అర్ధరాత్రివేళ ఇదిగో పెండ్లికుమారుడు అతనిని ఎదుర్కొన రండి అను కేక వినబడెను. అప్పుడు ఆ పదిమంది కన్యకలు లేచి తమ దివిటీలను చక్కపరుచుకున్నారు. ఎందుకంటే, దివిటీలు పట్టుకున్న వారిని మాత్రమే పెండ్లికుమారుడు పరలోకరాజ్యము లోపలికి ఆహ్వానిస్తున్నాడు. ఎవరైతే బుద్ధిగలిగి ఉన్నారో, ఎవరి దీపమైతే దేదీప్యమానముగా వెలుగుతున్నదో వారిని మాత్రమే పెండ్లికుమారుడు విందులోనికి ఆహ్వానిస్తున్నాడు. అప్పుడు బుద్ధిలేని కన్యకలు ఇబ్బందిలో పడిపోయారు. పెండ్లికుమారుని రాక తొందరగా జరుగుతుందనుకొని కొంత కాలానికి మాత్రమే సరిపడు నూనెను దివిటీలో ఉంచుకొని, అదనపు నూనెను వారితో తెచ్చుకోకుండా సిద్ధపాటును మరచిపోయారు. ఆయన రాక ఆలస్యమైతేనే ఎవరు బుద్ధిలేనివారో, ఎవరు బుద్ధిగలిగినవారో బయటపడుతుంది. బుద్ధిలేని కన్యకల దివిటీలు నూనె లేక ఆరిపోవుచున్నవి గనుక వెంటనే వారి చూపు బుద్ధిగలిగిన కన్యకల నూనె సిద్దెలపై పడింది. అక్కడ అంతా కన్యకలే, అంతా పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు వచ్చినవారే. అందరూ పెండ్లి విందులోనికి కొనిపోబడాలని వచ్చినవారే. కానీ ఆయిదుగురు మాత్రం చివరి వరకు వారి అర్హతను కాపాడుకోలేక పోయారు. వెంటనే వారు మీ నూనెలో కొంచెము మాకియ్యుడని బుద్ధిగలిగిన కన్యకలను అడుగుతున్నారు. మీ నూనెలో కొంచెము మాకిస్తే మేము కూడా మీతో పాటు లోపలికి వచ్చేస్తామంటున్నారు. అప్పుడు బుద్ధిగలిగిన కన్యకలేమంటున్నారో చూడండి. ఈ నూనె మాకును మీకును చాలదేమో; మాకు సరిపోయేటంతగా మేము సిద్ధపరుచుకున్నాము అని సమాధానమిస్తున్నారు. ప్రియ పాఠకులారా, దీని పరమార్థాన్ని గ్రహిస్తున్నారా? దేవుని సంఘములో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరు ఆయన క్రియలలో పాలిభాగస్తులై ఉండాలి. ఎవరికి సరిపడిన క్రియలు, ఎవరికి అప్పగించిన క్రియలు వారు చేస్తారు. అనేకమందికి చాలినన్ని క్రియలు, చాలినంత అర్హతను ఏ ఒక్కరు సంపాదించలేరు. వారి మట్టుకు వారు రక్షింపబడటానికి మాత్రమే వారి సిద్ధపాటు సరిపోతుంది. కనుక ఎవరి అర్హత వారిదే. యేసు రెండవ రాకలో ఎవరి మీద ఆధారపడినా ప్రయోజనం ఉండదు. అందుకే ఇప్పుడే యేసు మీద ఆధారపడండి. చాలినన్ని క్రియలు దేవుని కొరకు చేసి, సువార్త కార్యక్రమాలలో పాలిభాగస్తులై పరలోక రాజ్యానికి అర్హతను సంపాదించండి.

ప్రియులారా! ఇది యేసుక్రీస్తు రెండవ రాకడకు సంబంధించిన సందర్భం. పెండ్లికుమారుడు వచ్చిన వెంటనే కన్యకలను తీసుకొని వెళ్లినట్టుగా, క్రీస్తు కూడా వేవేలకొలది దూతల పరివారముతో వచ్చిన వెంటనే తన కొరకు సిద్ధముగా ఉన్న నీతిమంతులను తీసుకొని వెళతాడు. కానీ నేటి కాలములో అంతటి సిద్ధపాటు ఎవరికుంది? నాటి నోవహు జలప్రళయ కాలములో వలె అందరూ తిని త్రాగి సంతోషిస్తున్నారు. నాటి ప్రజలలో నోవహు కుటుంబము తప్ప మిగిలినవారంతా జలప్రళయము వచ్చువరకు అది వచ్చునన్న సంగతి ఎరుగక పోయిరి అని పరిశుద్ధ గ్రంథము తెలియజేసింది. నాశనమయ్యే జనులకు చివరి క్షణం వరకు మార్పు రాదు. అప్పుడు వచ్చినా ప్రయోజనం లేదు. న్యాయస్థానములో శిక్ష ఖరారైన తరువాత మార్పు రావడం వలన ప్రయోజనం ఏమిటి? బుద్ధిలేని కన్యకలకు పెండ్లికుమారుడు వచ్చిన తరువాత బుద్ధివస్తే ప్రయోజనం ఏమైనా ఉందా? చివరకు పెండ్లికుమారుడు వారిని విడిచిపెట్టవలసి వచ్చింది. చరిత్రలో తన ఇష్టమును తాను నెరవేర్చుకున్న ధనవంతుడు పాతాళలోకమునకు వెళ్లి బాధపడుతున్నాడు. వేదన అనుభవిస్తున్నప్పుడు ప్రతి ఒక్కరికీ మార్పు వస్తుంది. కానీ అది ధర్మానుకూలమైన మార్పు కాదు. పాతాళలోకములో వేదనకరమైన స్థలములో బాధ అనుభవిస్తున్న ధనవంతుడు మార్పుచెంది, మరల అబ్రాహాము రొమ్మున ఆనుకొనుటకు కొనిపోబడే అవకాశము లేదు. అత్యల్పమైన లౌకిక రాజ్యాంగములోనే ఒక్కసారి నేరం బుజువైతే ఖచ్చితంగా జైలులోనికి వెళ్లాలి; దోషికి శిక్ష విధింపబడితే అది ఖచ్చితంగా పూర్తయి తీరాలి. ఒకవేళ శిక్ష విధింపబడకుండా ఉండాలి అంటే నేరం చేయక ముందే తనలో మార్పు రావాలి. ఇక అత్యున్నతమైన దేవుని రాజ్యాంగము ప్రకారం, శిక్షలోనికి వెళ్లిపోయిన తరువాత మార్పు చెందే అవకాశమే లేదు. ఆ శిక్ష అత్యంత భయంకరమైనదై, అంతము లేనిదై ఉ

ంటుంది. అందుకే, బుద్ధిలేని కన్యకలు బుద్ధిగల కన్యకలను నూనె అడిగినప్పుడు, మీరు వెళ్లి అమ్మువారి యొద్ద కొనుక్కోండి అని చెప్పారు. వారు కొనబోవుచుండగా పెండ్లికుమారుడు వచ్చెను; అప్పుడు సిద్ధపడిన వారు ఆ పెండ్లికుమారునితో కూడా పెండ్లివిందుకు లోపలికి వెళ్లారు. అంతలో తలుపువేయబడింది. ఆ తరువాత తక్కిన కన్యకలు వచ్చి అయ్యా, అయ్యా, మాకు తలుపు తీయమని అడుగగా అతడు, నేను మిమ్మునెరుగనని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను. దీనికోసమే యేసు ఈ ఉపమానమును చెప్పాడు. యేసు రెండవ రాకడ కొరకు మీరు సిద్ధపాటును కలిగి ఉండండి అని ఒక్కమాటతో చెబితే అందులోని తీవ్రత మనకు అర్థం కాదు. దాని లోతును మనము ఆలోచించలేము. అందుకే ఈ ఉపమానాన్ని యేసు తెలియజేసాడు. యేసు రెండవ రాకడ జరిగిన తరువాత దేవుని కొరకు ఏమీ చెయ్యలేము. ఆయన రాకముందే ఏమైనా చెయ్యాలి. మనిషి తన్ను తాను రక్షించుకొని, తన పొరుగువారిని కూడా రక్షించే అద్భుతమైన కార్యక్రమాలలో మునిగి తేలాలి. ఇదే క్రైస్తవులు సిద్ధపరచుకోవలసిన అసలైన నూనె. ఇంకా జాగ్రత్తగా ఈ విషయమును పరిశీలిద్దాం.

ప్రియులారా! ఇది దేవుని జ్ఞానానుసారముగా వ్రాయబడుతున్న పుస్తకమే తప్ప నా సొంత జ్ఞానము కలిగిన పుస్తకం మాత్రం కాదు. ఈ దేవుని జ్ఞానము రక్షణ విషయంలో మనిషిని ఆలోచింప చేస్తున్నట్టుగా మనకు కనిపిస్తుంది. మారాలి అనుకుంటే ఇప్పుడే మారాలి అన్నట్టుగా, లేదంటే ఇక ఎప్పటికీ మార్పు సాధ్యం కాదు అన్నట్టుగా నిర్ణయాన్ని తీసుకునే అధికారాన్ని మన చేతులలో ఉంచింది. గనుక ఇప్పుడే అనుకూల సమయము, ఇదే రక్షణ దినము అని దేవుడు మనుష్యులందరినీ హెచ్చరిస్తున్నాడు. ఎందుకంటే పెండ్లికుమారుడు ఏ క్షణాన్నైనా రావచ్చును. ఆయన వచ్చేసరికి సరియైన నూనెను (దైవ సంబంధమైన క్రియలు) కలిగినవారుగా, దివిటీ వెలుగుచున్నట్టుగా ఉండాలి; లేకపోతే అటువంటి ఏ ఒక్కరినీ పరలోకరాజ్యములో అడుగుపెట్టనివ్వడు. మనిషి బ్రతికి ఉన్నప్పుడే, అతనికి సమయముండగానే దేవుని కొరకు అనేక కార్యక్రమాలు చేయాలి. దీనిని మనస్సులో ప్రప్రథమమైనదిగా ఆలోచించుకోవాలి. చాలా మందికి తమ తమ జీవితాలలో చాలా ప్రాముఖ్యమైన విషయాలు ఉంటాయి. వారికి దేవుడంటే ఒక చిట్టచివరి ఆలోచనగా ఉంటుంది. అది చాలా పెద్ద తప్పు. ఎందుకంటే తండ్రియైన దేవుడు, మనిషి కొరకు ఆలోచించిన విధానాన్ని ఒక్కసారి తలచుకుంటే ఏ ఒక్కరూ దేవున్ని ప్రక్కకు నెట్టరు. మనిషి కోసం ఇంత గొప్ప విశ్వాన్ని తయారుచేసి, అందులో అతి చిన్న ఆకారంలో ఉన్న భూమి మీద మనిషిని ప్రవేశపెట్టి, ఆ భూమిపై సకల సౌకర్యాలను కలుగజేసి గొప్పదైన బ్రతుకును దేవుడు మనిషికిచ్చాడు. దీని కోసం ఆయన తన ప్రజ్ఞను, బలమును అంతటినీ ధారపోసాడు. దేవుని దృష్టిలో మనిషికి చాలా గొప్ప స్థానముంది. మనిషి దృష్టిలో దేవునికి అంత గొప్ప స్థానముందా? లేదనే చెప్పాలి. బుద్ధిగల కన్యకలైతే సిద్ధపాటుతో ఉన్నారు. వారి దగ్గరున్న నూనె వారికి మాత్రమే సరిపోతుంది. కనుక, వారికి సరిపోయినంత నూనెను సిద్దెలలో తీసుకొని వారు సిద్ధంగా ఉన్నారు. పెండ్లి కుమారుడు వారు నిద్రపోతున్న వేళలో వచ్చాడు. అంతలో పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు బుద్ధి కలిగిన కన్యకలు తమ వెలుగుచున్న దివిటీలతో ఆయనను ఎదుర్కొనుటకు వెళ్లిపోయారు. వారికి పెండ్లికుమారుడు తలుపు తీసాడు, వారు లోపలికి వెళ్లిపోయారు. ఇక బుద్ధిలేని కన్యకలు అప్పటికప్పుడు నూనెను కొనుక్కోవాలని ప్రయత్నిస్తున్నారు. కానీ సమయం లేదు. అప్పటికే తలుపు వేయబడింది. వారు విడిచి పెట్టబడ్డారు. యేసు రెండవ రాకడ జరిగిన తరువాత అప్పటికప్పుడు బాప్తిస్మమును పొందాలని ఆలోచించేవారు బుద్ధిలేనివారే. వృద్ధాప్యంలో చనిపోయే ముందు అప్పటికప్పుడు దేవుని కొరకు మార్పు నొందుదాములే అని అనుకునేవారు బుద్ధిలేనివారే. అప్పుడు ఇక మనిషి ఆలోచన ఏమీ పని చెయ్యదు. ఇక మిగిలింది దేవుని తీర్పే. తన కొరకు బ్రతకని మనిషిని దేవుడు పాతాళలోకానికి పంపించాలని నిర్ణయం తీసుకున్నాడు. గనుక ఆ దినమైనను, ఆ గడియైనను మీకు తెలియదు గనుక మెళకువగా ఉండాలి. అలాగని నిద్రపోవద్దని కాదు. మెళకువ అనగానే, అలసత్వం లేకుండా దేవుని కొరకు బ్రతకాలని అర్థం. కన్యకలు నిద్రపోతున్నవేళలో పెండ్లికుమారుడు వచ్చాడన్నది రూపకాలంకారములో చెప్పబడిన మాట. అలాగని, యేసుక్రీస్తు తన రెండవరాకడలో అర్థరాత్రివేళ మాత్రమే వస్తాడని మాత్రం కాదు. దీనినంతటిని యేసు ఈ భూమి మీద ఉన్నప్పుడు ఉపమానాలంకారములో ఎందుకు చెప్పాడంటే పరలోకరాజ్యానికి మనుష్యులంతా సిద్ధపాటును కలిగిన కన్యకలవలె ఉండాలని ఆయన సూచిస్తున్నాడు. అలాగని మనుష్యులంతా నిజానికి పెండ్లి కావలసిన కన్యకలు కాదు

కదా. అలాగని మన చేతుల్లో నిరంతరము వెలిగే దివిటీ లేదు కదా. మన దగ్గర సిద్దెలు, వాటిలో నూనెను మనము కలిగిలేము కదా. అయితే, ఆయన ఉపమానానికి పోలికగా మనుష్యులంతా సిద్ధపాటును కలిగి ఉండాలన్నది యేసు ఉద్దేశ్యం. ఒక పెండ్లి కావలసిన కన్యక, తన పెండ్లికుమారునిపై దృష్టినుంచి ఏలాగు ఎదురు చూస్తుందో ఆ విధముగానే మనుష్యులు కూడా రాబోవుచున్న క్రీస్తు కొరకు ఎదురు చూడాలి. వెలుగుచున్న దివిటీలవలె, దేదీప్యమానమైన జీవితాలను కలిగి ఉంటూ, అవి ఆరిపోకుండా ఉండాలంటే, కావలసినన్ని దేవుని క్రియలనే నూనెను మనుష్యులు సిద్ధం చేసుకోవాలి. ఇక్కడ మనిషి సిద్ధపరచుకొనవలసిన నూనె అనగా, అతడు దేవుని కొరకు పనిచేయడం, దేవుని యెడల విశ్వాసమును కలిగి ఉండడం, దేవుని కార్యక్రమాలను విరివిగా చేయడం! ఇక, మనము పాఠము యొక్క ప్రారంభములో మాట్లాడుకున్నట్టుగా, నేడు అనేక మంది క్రైస్తవులు దేవుని యొద్దకు తమతో పాటు నూనెను కూడా తీసుకొని వెళుతున్నారు. ప్రేయర్ ఆయిల్ అనే పేరుతో అనేకమంది ఈ నూనెను కలిగి ఉంటున్నారు. ఈ నూనె రాసుకుంటే మాకు స్వస్థత కలుగుతుందంటున్నారు. ఈ నూనె వలన మాకు మంచి జరుగుతుందంటున్నారు. ఈ కొబ్బరి నూనె / ఏదైనా తైలములను గూర్చి బైబిల్‌లో వ్రాయబడి ఉందా? కొన్ని సందర్భాలను ఇప్పుడు మనము ఆలోచన చేద్దాం.

**మార్కు సువార్త 6 : 12 'కాగా వారు బయలుదేరి, మారుమనస్సు పొందవలెనని ప్రకటించుచు అనేక దయ్యములు వెళ్లగొట్టుచు నూనె రాచి అనేకులగు రోగులను స్వస్థపరచుచుండిరి.'** అంటే ప్రారంభ శతాబ్ధపు కాలంలో, యేసు తన శిష్యులను ఇశ్రాయేలు జనులయొద్దకు పంపినప్పుడు వారు బయలుదేరి మారుమనస్సు పొందవలెనని అనేకులకు ప్రకటిస్తూ దేవుని రాజ్య సువార్త కార్యక్రమాలలో ఉన్నారు. వారు అలా ప్రకటిస్తున్నప్పుడు వారికి ఎదురైన కొంతమందిని స్వస్థపరుస్తున్నారు. అంటే సూచకక్రియల ద్వారా స్వస్థతలు జరిగే కాలంలో వారున్నారు. సూచకక్రియల ద్వారా స్వస్థతలు జరిగే కాలం ఏమిటని పాఠకులకు ఇక్కడ సందేహం రావచ్చు. అయితే ఇప్పుడు స్వస్థతలు జరగవా? అని ప్రశ్నించవచ్చు. ముందుగా ఈ సందేహానికి సమాధానమును తెలియజేస్తాను. స్వస్థత అంటే రోగమును బాగుపరచడం; లోపమును సరిచేయడం. సాధారణంగా ఈ ప్రక్రియ వైద్యము ద్వారా జరుగుతుంది. అందుకే ఏదైనా రోగము వచ్చినప్పుడు వైద్యుని సంప్రదిస్తారు. వైద్యులు రోగాన్ని నిర్ధారించి, రోగికి తగిన ఔషధాలను ఇస్తారు. రోగి బాగుపడిన తరువాత అతనికి స్వస్థత కలిగినదని చెబుతారు. ఈ భూమి మీద మొదటి మనిషియైన ఆదాము దగ్గర నుండి నేటి వరకు స్వస్థపడే అవకాశమును దేవుడు అందరికీ అనుగ్రహించాడు. స్వస్థత అన్ని కాలములలో జరుగబట్టే, నేటికీ మనిషి ఈ భూమి మీద ఉనికిని కలిగి ఉన్నాడు. స్వస్థత ఎల్లప్పుడూ జరుగుతుంది. కానీ, ఆ స్వస్థత ఎలా జరిగింది? అనేది ఇక్కడ ఆలోచించదగిన విషయం. అనగా, స్వస్థత సూచకక్రియల వలన జరిగిందా? లేక ప్రకృతిలో దేవుడనుగ్రహించిన ఔషధముల వలన జరిగిందా? సూచకక్రియల వలన జరిగితే అది వెనువెంటనే క్షణాలలో జరిగినట్టు; ఔషధాల ద్వారా జరిగితే కొంత కాలము వ్యవధిలో జరిగినట్టు. అయితే, దేవుని అనుగ్రహము ఉన్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ప్రక్రియ ద్వారా స్వస్థత జరుగుతుంది. ఇక సూచకక్రియల ద్వారా స్వస్థత ఎందుకు జరిగిందంటే, దేవుని శక్తి సామర్ధ్యాలను మనిషి తక్కువగా అంచనా వేసినప్పుడు వాటిని నిరూపించి, దేవునిపై మనిషికి విశ్వాసమును కలిగించడానికి జరుగుతాయి. అలాంటివాటిలో ఒక ఉదాహరణగా, చరిత్రలో సిరియా దేశానికి సైన్యాధిపతియైన నయమాను అనే కుష్ఠురోగి ఉండేవాడు. అతడు తన కుష్ఠురోగముతో ఎలీషా అనే ప్రవక్త దగ్గరకు వచ్చాడు. ఈ కుష్ఠురోగితో ప్రవక్తయైన ఎలీషా యొర్దాను నదిలో ఏడు మారులు మునగమన్నాడు. అతడు ప్రవక్త చెప్పినట్టుగా చేసేసరికి అతనికి స్వస్థత వెంటనే కలిగింది. అతని దేహము పసిపిల్ల దేహము వలె మారిపోయింది. పాతనిబంధన కాలములో ఆనాడు స్వస్థతలు జరిగాయి. క్రొత్తనిబంధన కాలములో యేసు నామమున స్వస్థతలు జరిగాయి. దేవుని వాక్యాన్ని స్థిరపరచడానికి ఆయాకాలాలలో అవసరతనుబట్టి స్వస్థతలు ఎలా జరగాలి అన్నదానికి దేవుడు ప్రాముఖ్యతను ఇచ్చాడు. వాక్యమును స్థిరపరచడానికి యేసుక్రీస్తు కాలంలో వెనువెంటనే మరుక్షణంలో స్వస్థత జరిగింది. ఈరోజు మనిషి చెంత పరిపూర్ణమైన దేవుని వాక్యము ఉంది. ఆ స్థిరపరచబడిన వాక్యమును చదివి, విని, గ్రహించి మనిషి విశ్వాసమును పొందాలి. దేవుడు ప్రకృతిలో వైద్యమును, ఔషధాలను అనుగ్రహించాడు. వాటి ద్వారా మనిషి శారీరక స్వస్థతను మాత్రమే పొందగలడు. కానీ దేవునికి ఆత్మీయ స్వస్థత పొందేవారు కావాలి. ఇక నూనె విషయానికొస్తే, యేసు కాలములో ఆయన శిష్యులు మనుష్యులను మారుమనస్సు పొందవలెనని ప్రకటించుచు, దయ్యములను వెళ్లగొట్టుచు,

నూనె రాచి అనేకులగు రోగులను స్వస్థపరచుచుండిరి అని వ్రాయబడింది. అంటే నాటి కాలములో శిష్యులు దేవుని వాక్యాన్ని స్థిరపరచడానికి స్వస్థతలు, సూచకక్రియలు చేసారు. శిష్యుల చేతులలో అప్పటికి ఇంకా క్రొత్తనిబంధన పూర్తిగా లేదు. యేసుక్రీస్తు చెప్పిన మాటలనే వారు అంగీకరించి వాటిని నేర్చుకొని ప్రజలకు ప్రకటిస్తున్నారు. అలా ప్రకటించేటప్పుడు వారు స్వస్థతలు, సూచకక్రియలు చేయకపోతే వారు ప్రకటిస్తున్న దేవుని వాక్యాన్ని నమ్మడానికి ప్రజలకు ఎటువంటి ఆధారమూ ఉండదు. కనుక మొట్టమొదట నాటి ప్రజలు దేవునియందు విశ్వాసముంచాలి అంటే వారి చేతుల్లో దేవుని గ్రంథమైనా ఉండాలి. లేదంటే ఒక అద్భుతాన్నైనా జరిగించాలి. కనుక, అటువంటి సందర్భంలో శిష్యులు నూనె రాచినట్టుగా మనకు దేవుని గ్రంథములో కనిపిస్తుంది.

**యాకోబు పత్రిక 5 : 14- 'మీలో ఎవడైనను రోగియై ఉన్నాడా? అతడు సంఘపు పెద్దలను పిలిపింపవలెను; వారు ప్రభువు నామమున అతనికి నూనె రాచి అతనికొరకు ప్రార్థనచేయవలెను. విశ్వాసహితమైన ప్రార్థన ఆ రోగిని స్వస్థపరచును, ప్రభువు అతని లేపును; అతడు పాపములు చేసినవాడైతే పాపక్షమాపణ నొందును.'** సంఘములో ఎవరైనా రోగియై, పాపములు చేసినవారైతే వారి స్వస్థత కొరకు మరియు వారి పాపక్షమాపణ కొరకు సంఘపు పెద్దలు ఆ రోగి యొద్దకు వెళ్లాలి. ప్రభువు నామమున అతనికి నూనె రాచి, అతని కొరకు ప్రార్థన చేయాలి. ఆ ప్రార్థన విశ్వాసహితమైనదైతే ఆ రోగి స్వస్థపరచబడతాడు. విశ్వాసహితమైన ప్రార్థన అనగా, ఆ రోగి స్వస్థతనొందితే అతడు దేవుని కొరకు బ్రతుకుతాడని దేవునితో చెప్పగలగాలి. అతడు బాగుపడిన తరువాత యేసుక్రీస్తును తన సొంత రక్షకునిగా అంగీకరించాలి. ముందుగా ఆ రోగిలో ఇటువంటి మనస్సుండాలి. అప్పుడు సంఘపెద్ద అతని కొరకు ప్రార్థన చేయాలి. అంతేతప్ప, నేను రోగంతో బాధపడుతున్నాను, నేను కష్టంలో ఉన్నాను, నాకోసం ప్రార్థన చేయండి అని అడిగిన ప్రతి ఒక్కరికీ స్వస్థత అనుగ్రహించమని దేవునికి ఎలా ప్రార్థన చేయగలం? ఇలాంటి స్వస్థతల కోసం చాలా మంది అన్యజనులు అడుగుతారు. మాకు కూడా ప్రార్థించిన నూనె ఇవ్వండి అంటారు. అలాగని స్వస్థతనొందినా నొందకున్నా వారు దేవుని కొరకు బ్రతకాలనే ఉద్దేశ్యంతో ఉన్నారా? యేసు, ప్రభువని వారు హృదయపూర్వకముగా అంగీకరిస్తున్నారా? ఈ విషయాలను జాగ్రత్తగా తెలుసుకున్న తరువాతనే ఒక సంఘపెద్ద రోగి కోసం ప్రార్థన చెయ్యాలి. అప్పుడది విశ్వాసహితమైన ప్రార్థన అవుతుంది. సంఘపెద్ద రోగి యొద్దకు వెళ్లి, అతనికి ప్రభువు నామమున నూనెరాచి, అతని కొరకు ప్రార్థన చేయాలి. అతన్ని బాగుచేసేది యేసు ప్రభువే. అయితే, ఆ రోగి పాపము చేసినవాడైతే అతడు పాపక్షమాపణను పొందుతాడు. ఈ సందర్భములో రోగి యొక్క శారీరక స్వస్థత కంటె అతని యొక్క పాపక్షమాపణే ప్రాముఖ్యమైనదిగా కనిపిస్తుంది. ఈ మాటలలోని దేవుని జ్ఞానము నేటి క్రైస్తవ్యానికి సరిగ్గా అర్థంకాక వీరితో పాటు నూనె ఇచ్చుకుంటున్నారు. ఇక్కడ సంఘపెద్ద తనతోపాటుగా నూనె తీసుకొనివచ్చి రోగి కొరకు ప్రభువు నామమున ప్రార్థించి అతనికి రాయాలే తప్ప రోగి తనతోపాటు నూనెను ఉంచుకోనక్కరలేదు.

♦యేసు పరలోకరాజ్యమును గూర్చి చెప్పిన ఉపమానములో కన్యకలు ఉంచుకున్న నూనె దేవుని క్రియలకు సంబంధించినది.

♦శిష్యులు దేవుని వాక్యమును ప్రకటిస్తూ, రోగులను స్వస్థపరచుచున్నప్పుడు రాచిన నూనె, స్వస్థతలు వెనువెంటనే జరుగుచున్న కాలమునకు సంబంధించినది.

♦సంఘములో ఎవడైనను రోగిగా ఉన్నప్పుడు సంఘపెద్ద విశ్వాసహితమైన ప్రార్థన చేసి ప్రభువు నామమున రాచిన నూనె, పాపక్షమాపణకు సంబంధించినది.

ఇక పాఠకులు ముఖ్యముగా గమనించవలసినటువంటి విషయం ఏమిటంటే, శిష్యులుగాని లేక సంఘపెద్దలుగాని దేవుడు ఆజ్ఞాపించినట్టుగా వారు ఎక్కడికైతే వెళ్లారో అక్కడికి వారితో పాటుగా నూనెను తీసుకొనివెళ్లి, అవసరమైన రోగులకు ప్రభువు నామమున రాచి వచ్చేసారు. అలాగని దానికి పరిశుద్ధ గ్రంథములో ఎక్కడా 'స్వస్థతా నూనె' అని గాని 'ప్రార్థనా నూనె' (ప్రేయర్ ఆయిల్) అని గాని పేరు లేదు. అది కేవలం మామూలు నూనె మాత్రమే. అక్కడ విశేషమంతా క్రీస్తు ప్రభువులోను, ప్రకటింపబడుతున్న దేవుని వాక్యములోను, విశ్వాసములోను ఉన్నదే తప్ప

నూనెలో మహాత్మ్యం ఏమీ లేదు. అందుకే, నయమానను కుష్ఠరోగిని ప్రవక్తయైన ఎలీషా దేవుని శక్తిచే స్వస్థపరచాలనుకున్నప్పుడు యొర్దాను నదికి వెళ్లి ఏడు మారులు మునగమని చెప్పాడు. అలాగని యొర్దానులో మునిగిన ప్రతిఒక్కరికీ కుష్ఠరోగము నుండి విముక్తి దొరుకుతుందని కాదు. అందుకే మొదట కుష్ఠరోగియైన నయమాను ఎలీషా మాటను చులకన చేసి, మా సిరియా దేశములో యొర్దాను కంటె గొప్ప నదులు లేవా అని మాట్లాడతాడు. అక్కడ విశేషము యొర్దాను నదిది కాదు; పరలోకమందున్న దేవునిది. ప్రభువైన దేవుడు ప్రవక్తయైన ఎలీషా ద్వారా లోకానికి పరిచయమవ్వాలనే ఉద్దేశ్యముతో ఆ సూచకక్రియను జరిగించాడు. ప్రారంభ శతాబ్ధపు శిష్యులు మరియు సంఘపెద్దలు తమతోపాటుగా నూనెను తీసుకొనివెళ్లి రోగికి రాచినట్టుగా గమనించాలి. కనుక స్వస్థత ఎవరు జరిగిస్తే వారి చేతిలో మాత్రమే నూనె ఉండాలి. అంతేగాని విశ్వాసుల/రోగుల చేతుల్లో నూనె ఎందుకు? విశ్వాసుల దగ్గర ఉండవలసినది దేవుని కొరకైన క్రియలే తప్ప కొబ్బరి నూనె మాత్రం కానే కాదు. ఒకవేళ నూనె ఎవరి దగ్గరైనా ఉండాలి అంటే అది సంఘపెద్ద దగ్గర ఉండాలి. అది కూడా స్వస్థతలు వెనువెంటనే జరుగుతున్న కాలంలో, దేవుని వాక్యము ఇంకా పరిపూర్ణం చేయబడని కాలంలో వారి దగ్గర నూనె ఉండాలి. ఇప్పుడు అందరి దగ్గర ఉండవలసినది దేవుని కొరకు బ్రతికే శ్రేష్ఠమైన జీవితం. ఈ యుగసంబంధమైన దేవతగా పిలువబడిన అపవాది ఎంత తెలివిగా అవిశ్వాసుల కళ్లు మూసిందో చూడండి. తమ జీవితకాలమంతా దేవుని కొరకైన బ్రతుకు వారిలో లేకుండా, తమ దగ్గర కేవలం కొబ్బరి నూనెను ఉంచుకోమని చెప్పింది. క్రైస్తవ్యానికి ఏమిటీ దౌర్భాగ్యపు పరిస్థితి? క్రైస్తవులు నిజంగా సిద్ధపరచుకొనవలసిన నూనెను విడిచిపెట్టి, తమతోకూడ ఉంచుకొనవలసిన అవసరం లేని కొబ్బరి నూనెను ఉంచుకుంటున్నారంటే వీరినేమనాలి? వాక్యమును నిర్వీర్యం చేసేది వీరు కాదా? ఇలాంటివారి మీదకి దేవుని ఉగ్రత తుదమట్టుకు శీఘ్రముగా వస్తుంది. కనుక మార్పునొంది దేవుని కొరకు మేల్కొలుపు కలిగిన జీవితాలను కలిగి ఉండాలి.

ప్రియులారా! క్రైస్తవ ప్రపంచం అనేక విషయాలలో మోసపోయింది అనటానికి ఇలాంటి సందర్భాలే నిదర్శనాలు. నూనె విషయంలో చాలా మంది నామకార్ధ క్రైస్తవులు మోసపోయారు. మేము కూడా ఎల్లప్పుడూ ప్రార్ధనా నూనె (ప్రేయర్ ఆయిల్) కలిగి ఉండాలి అనుకుంటున్నారు. ఈ నూనెను చర్చ్‌లో లేక క్రైస్తవ బహిరంగ సభలలో పాస్టర్‌గారు అమ్మితే కొనుక్కోవాలి అనుకుంటున్నారు. ఆ నూనెను తమతోపాటు ఉంచుకొని, వారికి ఎప్పుడైనా ఒంట్లో బాగాలేదనిపిస్తే దానిని రాసుకోవాలి అనుకుంటున్నారు. ఏమిటీ పిచ్చి నమ్మకాలు? వారి అజ్ఞానము వలన దేవుని వాక్యమును ఏల నవ్వులపాలు చేస్తున్నారు? బాప్తిస్మము తీసుకున్న ప్రతి క్రైస్తవుడు దేవుని కొరకు బ్రతకాలి. అలా బ్రతుకుచున్న వారిని ప్రభువు కంటికి రెప్పలా కాపాడుతాడు. ఒకవేళ శ్రమ/రోగము/బాధలు వచ్చినా నీతి నిమిత్తము వాటిని అనుభవిస్తే దానికి తగిన బహుమానమును ప్రభువు తన లోకమందు అనుగ్రహిస్తాడు. మనము పరలోకమును చేరాలంటే మనకు ఆ అర్హతను సంపాదించిపెట్టే 'దేవుని క్రియలను' మన సిద్దెలలో నింపుకోవాలి. క్రీస్తు ప్రభువు రాకడ ఏ క్షణంలోనైనా జరగవచ్చు. ఆయన ఆసన్నమయ్యే కాలము ఎవరికీ తెలియదు. దానిని పరలోకపు తండ్రి తన స్వాధీనమందుంచుకున్నాడు. మరల తిరిగి క్రీస్తును ఎప్పుడు పంపిస్తాడో ఎవరికీ తెలియదు. ఈ రహస్యాన్ని ముందుగా తన గ్రంథమందు వ్రాయించి మనకు తెలియజేసాడు గనుక మనము మెలకువ కలిగిన బ్రతుకులను కలిగి ఉండాలి. సిద్ధపాటుతో మరియు వెలుగుచున్న బ్రతుకుతో ప్రభువును ఎదుర్కోవాలి. దీని కొరకు మనము యేసుక్రీస్తు కార్యములను చేస్తూ వాటిని సిద్ధపరచుకోవాలి. ఈ జాగ్రత్తను అపొస్తలుడైన పౌలు ద్వారా దేవుడు వ్రాయించాడు.

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 2 : 21 'అందరును తమ సొంత కార్యములనే చూచుకొనుచున్నారు గాని, యేసుక్రీస్తు కార్యములను చూడరు.'** జనులు తమ జీవిత కాలమంతా తమ తమ సొంతకార్యములనే చూచుకొంటున్నారు. వారికి యేసుక్రీస్తు కార్యములను చూచే తీరిక లేదు. అంటే, పెండ్లి కుమారుని ఎదుర్కొనే సిద్ధపాటు వారిలో లేదన్నమాట. వారి సిద్దెలు ఖాళీగా ఉన్నాయి. వారి దివిటీలు ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. చీకటి బ్రతుకులలో జీవితాలను గడుపుతూ దేవునికి దూరంగా వెళ్లిపోతున్న తరుణంలో ఈ పాఠం అలాంటివారికి ఒక మేల్కొలుపుగా ఉండాలి. ప్రతి మనిషి తన జీవితకాలములో యేసుక్రీస్తును తెలుసుకొని జీవితాంతం ఆయన కొరకు జీవించాలి. రెండవరాకడలో రానైయున్న

ఆ పెండ్లికుమారుని మీదే తమ దృష్టినంతా ఉంచాలి. మిగిలిన విషయాలపై దృష్టి ఉంచితే మనస్సు చెడిపోయినదవుతుంది. తన మనస్సులో వేరొకరితో సంబంధం పెట్టుకున్నదవుతుంది. చివరకు ఆ కన్యక వ్యభిచారిణిగా పిలువబడుతుంది. అలాంటి వారిని పెండ్లికుమారుడు పరిగ్రహిస్తాడా? లేదు. అందుకే ప్రతి కన్యక తన పెండ్లి కుమారుని మీదే దృష్టి ఉంచాలి; పెండ్లికుమారుని కొరకే ఆలోచించాలి. తన జీవితమంతా పెండ్లికుమారుని కొరకు మాత్రమే ధారపోయాలి. యేసుక్రీస్తు మనకొరకు పెండ్లి కుమారుని పోలి రాబోవుచున్నాడు. మనమంతా కన్యకలను పోలి సిద్ధపడి ఉండాలి. ప్రియులారా! పరిశుద్ధ గ్రంథములో దేవుడు మనుష్యుల కొరకు అన్నింటినీ వ్రాయించాడు. మనకు తెలియవలసిన దానిని ఏదీ ఆయన రహస్యముగా దాచిపెట్టలేదు. యేసు రెండవ రాకడను గూర్చి మన కళ్లకు కట్టినట్టుగా తెలియజేసాడు. మన సిద్ధపాటును గూర్చి ఉపమానభావములతో హెచ్చరించాడు. ఇంకా క్రీస్తును మీ సొంత రక్షకునిగా అంగీకరించకపోతే, వెంటనే తగు నిర్ణయమును తీసుకోండి. ఎందుకంటే, రాబోవునవి దుర్దినములే!

ప్రసంగి 12 : 1- **'దుర్దినములు రాకముందే - ఇప్పుడు వీటియందు నాకు సంతోషము లేదని నీవు చెప్పు సంవత్సరములు రాకముందే, తేజస్సునకును సూర్య చంద్ర నక్షత్రములకును చీకటి కమ్మకముందే, వాన వెలిసిన తరువాత మేఘములు మరల రాకముందే, నీ బాల్యదినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము.'** ఇది ప్రతి మనిషి యొక్క చిట్టచివరి స్థితిని చెప్పే వాక్యము. మనుష్యులు తమకిష్టమైనట్టుగా సుఖమును తనివితీరా అనుభవించిన తరువాత వెనువెంటనే చెప్పే మాట ఏమిటో తెలుసా? 'ఇప్పుడు వీటియందు మాకు సంతోషము లేదు' అంటారు. ఏ మనిషైనా, అతడు ఎంత గొప్పగా బ్రతికినా సరే, తన వృద్ధాప్యంలో స్మశానానికి సిద్ధమవుతున్నప్పుడు ఏమంటాడో తెలుసా? సుఖమేముందండి ఈ జీవితంలో? అని తన జీవితాన్ని గూర్చి ఒక్కమాటలో తేల్చేస్తాడు. తన జీవిత కాలంలో తాను సుఖమును అనుభవించడానికి పడిన కష్టాలలో ప్రతిదానిని జ్ఞాపకం చేసుకుంటూ, ఏముంది ఈ జీవితం? ఈ జీవిత చరమాంకములో నాకు వేటియందూ సంతోషము లేదు అని చెబుతాడు. అంతటి భయంకరమైన పరిస్థితి రాకుండా ఉండాలంటే, మరణానికి ముందు సంతోషముగా జీవితమును ముగించాలంటే, రాబోయే నిత్య మహిమ కొరకు ఈ జీవితములో క్రీస్తును అంగీరించి దేవునికి దగ్గరవ్వాలి. ఈ జీవిత కాలమందు మనకిష్టమైనట్టుగా సుఖమును అనుభవించి, దేవుని వాక్యమును నిర్వీర్యపరిస్తే మిగిలేది చీకటే. అందుకే, దుర్దినములు రాకముందు ప్రతి మనిషి జాగ్రత్తపడాలి. వారి పాలిట దుర్దినములు రాకముందు వారు తగిన నిర్ణయమును తీసుకోవాలి. దేవుని వాక్యము చెవిన పడగానే, బాల్యదినములయందే మన సృష్టికర్తను స్మరణకు తెచ్చుకోవాలి. ఇదే ఈ ప్రపంచమంతటిలో గొప్పదైన విషయం. మన సృష్టికర్త మన స్మరణలో ఉంటే మన చిన్ననాట నుంచి దేవుని కార్యక్రమాలలో ఉండగలము. యేసుక్రీస్తును అంగీకరించిన ప్రతి ఒక్కరు బాల్యములోనికి వెళ్లినట్టే. శారీరక బాల్యములో మన సృష్టికర్తను జ్ఞాపకం చేసుకునేటట్టుగా మన తల్లిదండ్రులుగాని, ఈ లోకంగాని మనకు అవకాశం ఇవ్వలేకపోయినా, యేసుక్రీస్తు నామమున తీసుకొనే బాప్తిస్మము ద్వారా మరల చిన్నపిల్లలయ్యే అవకాశము వచ్చింది. ఇదే విషయాన్ని యేసు రూఢిగా తెలియజేస్తున్నాడు.

**యోహాను సువార్త 3 : 1- 'యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యుడొకడుండెను. అతడు రాత్రియందు ఆయనయొద్దకు వచ్చి - బోధకుడా, నీవు దేవునియొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము. దేవుడతనికి తోడైయుంటేనేగాని నీవు చేయుచున్న సూచకక్రియలను ఎవడునూ చేయలేడని ఆయనతో చెప్పెను. అందుకు యేసు అతనితో - ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను.'** దేవుని రాజ్యములో అడుగు పెట్టాలంటే ఒకడు క్రొత్తగా జన్మించాలి. ఎందుకంటే చిన్న పిల్లలలాంటి వారిదే పరలోకరాజ్యం. క్రొత్తగా జన్మించడమంటే, మళ్లీ తల్లి గర్భమందు ప్రవేశించి జన్మించాలా? అని నీకొదేము సందేహాన్ని వెళ్లబుచ్చుతున్నప్పుడు, యేసు - ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మిస్తే అతడు క్రొత్తగా జన్మించినట్టు అని తెలియజేసాడు. అనగా, యేసు నామమున తీసుకొనే బాప్తిస్మమనే కార్యక్రమంలో నీటిలో మునిగి తిరిగి లేవాలి. నీటి మూలముగా జన్మించినవారికి యేసు నామములో పరిశుద్ధాత్మను దేవుడు అనుగ్రహిస్తాడు. అప్పుడు వారు ఆత్మ మూలముగా జన్మిస్తారు. ఇదంతా కేవలం యేసుక్రీస్తులో తీసుకొనే బాప్తిస్మము ద్వారా జరుగుతుంది. ఇకపై వారి జీవితం నూతనమైనదిగా మారుతుంది.

వారి ఆలోచనా విధానం మారిపోతుంది. యేసుక్రీస్తును పొందిన వారైతే బాప్తిస్మమును పొందిననాటనుండి వారి జీవిత విధానము ఎలా ఉండాలో అదంతా బైబిల్‌లో వ్రాయబడింది. కనుక ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని ఆయన నిశ్చయముగా చెబుతున్నాడు. ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించినప్పుడు అతని గత పాపపు జీవితమంతా ఇక జ్ఞప్తికి రాదు. ఇది ఒక విడిచిపెట్టకూడని భాగ్యము. ఇంతటి గొప్ప అవకాశమును ఎవ్వరూ కల్పించరు. లోకమందున్న పోలీసులు, కోర్టులు నేరస్తులకు కఠినమైన శిక్షలను విధిస్తాయే తప్ప, పరివర్తన కలిగిన జీవితాన్ని అనుగ్రహించలేవు. నీటిలో బాప్తిస్మమును పొందితే నీ పాపమంతా పోతుందని ఎవ్వరూ చెప్పలేదు. తండ్రియైన దేవుని నుండి కృపను పొందినవాడై యేసుక్రీస్తు ఒక్కడే ఈ గొప్ప మార్గమును మానవాళికి పరిచయం చేసాడు. కనుక దేవుని కొరకు బ్రతకాలనుకునే వారికి ఇదొక సువర్ణావకాశం. ఇలా క్రీస్తు మార్గములో అడుగుపెట్టి, అనేకమంది సహోదరులను రక్షించు నిమిత్తం దేవుని క్రియలను పూర్తి చేస్తూ వాటితో మన సిద్దెలను పుష్కలంగా నింపుకుంటూ, ప్రకాశవంతమైన వెలుగు కలిగిన జీవితాలను కలిగి ఉందాం. పెండ్లికుమారుని పోలిన క్రీస్తుయేసు రానే వస్తాడు. మనమంతా పెండ్లివిందుకు పోలికయైన పరలోకరాజ్యమునకు కొనిపోబడతాము! నిర్ణయం మీదే.

-------×-------

## ప్రశ్నలు

**1) రూపకాలంకారమునకు సంబంధించిన ఉపమానముల ద్వారా పరిశుద్ధ గ్రంథములో వ్రాయబడిన సంగతులను ఏలాగు అర్థం చేసుకోవాలి?**

**2) పరలోక రాజ్యమునకు పోలికగా చెప్పబడిన పదిమంది కన్యకలు మరియు పెండ్లి కుమారుని గూర్చి వివరించండి.**

**3) బుద్ధిగల కన్యకలు సిద్ధపరచుకొనియున్న నూనెకు సాదృశ్యమును వివరించండి.**

**4) యేసు శిష్యులు రోగాలను స్వస్థపరచుటకు నూనె రాచిన సందర్భమును వివరించండి.**

**5) సంఘ పెద్దలు ప్రభువు నామమున రోగికి నూనె రాచి అతని కొరకు ప్రార్థన చేసే సందర్భమును వివరించండి.**

**6) నేటి క్రైస్తవులు సిద్ధపరచుకోవలసిన నిజమైన నూనెను గూర్చి వివరించండి.**

**7) నేటి నామకార్థ క్రైస్తవులు తమతో పాటు సిద్ధపరచుకొంటున్న నూనెను గూర్చి దేవుని వాక్యము ద్వారా ఎలా ఖండిస్తారు?**

## 10. సాతాను విషానికి బైబిల్ ఔషధం!

విషం అనగా అది అందరికి తెలిసినదే. ఏదైనా ఒక జీవిని చంపటానికి ఉపయోగించేదే విషం. పొలంలో పంటకు చీడపురుగు పట్టినా, ఎలుకలు పడినా వాటిని చంపడానికి పురుగులమందును (విషం) వాడుతారు. ఇది అనేకమందికి సుపరిచితమైన సంగతి. ఈ ప్రకృతిలో దేవుడు ఆహార పదార్థాలతోపాటుగా విష పదార్థాలను కూడా ఉంచాడు. ఈ విష పదార్థాన్ని అతి తక్కువ మోతాదులో తీసుకున్నా సరే, వెంటనే నురుగు కక్కుకుంటూ చనిపోతారు. అందుకే చాలామంది ఆత్మహత్య చేసుకోవాలనుకునేవారు విషాన్ని తమలోనికి తీసుకుంటారు. అది దేవుని దృష్టికి చాలా పెద్ద తప్పు. మనిషి ఎట్టి పరిస్థితులలోను ఆత్మహత్య చేసుకోకూడదు. దేవుడు మనిషికిచ్చిన జీవితాన్ని సంపూర్ణంగా దేవుని కొరకే వినియోగించు వారుగా మనుష్యులుండాలి. మానవ జీవితంలో కష్టాలు రాక మానవు. మీకు, నాకు, మనుష్యులందరికి కష్టాలు ఉన్నాయి, ఉండబోతున్నాయి. వాటికి ధీటుగా నిలబడి దేవుని సహాయంతో క్రీస్తులో ముందుకు కొనసాగిపోవాలి. ఇక మన పాఠములో విషాన్ని గూర్చి ఆలోచిస్తే, ఈ ప్రకృతిలో ఒక జీవిని బలవంతముగా చంపడానికి ఉపయోగించేదే విషం. దేవుడు తన సృష్టిలో భాగముగా ఈ విషాన్ని ప్రకృతిలో ఈ భూమి మీద మన మధ్యన ఎందుకు ఉంచాడు? ఎందుకంటే, దేవడు మనుష్యులకు ఈ విషం ద్వారా ఒక చక్కని పాఠమును నేర్పించాలనుకుంటున్నాడు. జీవమును కలిగించేదే కాకుండా జీవాన్ని బలవంతముగా చంపేదానిని కూడా దేవుడు మన మధ్యనే ఉంచాడు. ఒక్కసారి ప్రారంభ కాలానికి వెళ్లి ఏదెను తోటను జ్ఞాపకం చేసుకోండి. ఆ ఏదెనులో కూడా దేవుడు తినదగిన ఫలవృక్షాలన్నింటిని ఉంచినప్పుడు, జీవ వృక్షముతో పాటుగా, తోట మధ్యన మంచి చెడ్డల తెలివినిచ్చు తినకూడని వృక్షమును కూడా ఉంచాడు. ఆ మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలము ఆదాము హవ్వల పాలిట ఒక విషం లాంటిది. దేవుడు వారితో దాని తిను దినమున మీరు చచ్చెదరు అన్నాడు. అంటే, ఆదాము హవ్వలు దేవుని దృష్టిలో ఆత్మీయముగా మరణిస్తారని అర్థము.

**ఆదికాండము 2 : 16- 'మరియు దేవుడైన యెహోవా - ఈ తోటలోనున్న ప్రతి వృక్ష ఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును; అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను.'** మనిషి ఒక విష పదార్థమును స్వీకరిస్తే ఏమౌతాడు? చనిపోతాడు. ఫుడ్ పాయిజన్ అయితే దానిని తిన్నవారందరూ అస్వస్థతకు గురవుతారు. జీవమునిచ్చే ఆహారం ఎక్కువ పరిమాణములో ఉన్నా, దానిని పాడుచేసే విషం చాలా చిన్న పరిమాణములో ఉంటుంది. ఏదెను తోటలో ఆదాము హవ్వలు తినదగిన ఎన్నో వృక్ష ఫలాలున్నాయి; అలాగే జీవ వృక్ష ఫలములు కూడా ఉన్నాయి. కానీ వారు తినకూడనిది మాత్రం ఒక్కటే - అదే తోట మధ్యన ఉన్న మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలము. ఆ తోటలో దాని పరిమాణము చాలా చిన్నది. అది ఒక్కటిగానే ఉంది. ఆకారంలో, మోతాదులో అది చిన్నదైనా మొత్తంగా మనిషిని మాత్రం చంపేస్తుంది. అందుకే దేవుడు ప్రత్యేకంగా దీనిని గూర్చి ఆదాము హవ్వలకు తెలియజేసాడు. ఈ పాఠమును భావితరాలకు వివరించడానికే దేవుడు ప్రారంభ కాలములో జరిగిన దీనిని మన కొరకు వ్రాయించాడు. లోకమందున్న వైద్యశాస్త్రం అభివృద్ధి చెందాక నిన్న మొన్న విషాన్ని గూర్చి శాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. ఈ ప్రకృతిలో విష పదార్థమనేది ఒకటుంటుందని, దానిని తీసుకున్ననాడు మనిషి చస్తాడని తెలుసుకున్నారు. దానినే ఆంగ్లములో 'పాయిజన్' అంటారు. వైద్య పరిభాషలో జంతువులు/పాములు/పురుగులు విరజిమ్మే విషాన్ని 'వీనమ్' అంటారు. లోకమందున్న శాస్త్రవేత్తలు వైద్యశాస్త్రము అభివృద్ధి చెందాక వీటన్నింటినీ నేర్చుకున్నారు. ఫలానా పదార్థాన్ని తింటే, ఫలానా ద్రవాన్ని త్రాగితే, ఫలానా పాము కాటు వేస్తే మనిషి నురుగు క్రక్కుకుంటూ ఎందుకు చచ్చిపోతున్నాడంటే, విషం అంత ప్రమాదకరమైనదని తెలుసుకున్నారు. గొప్ప బలమైన మనిషి కూడా చిటికెడు విషానికి క్రింద పడిపోతాడు. దీనిని గూర్చి దేవుడు తన పరిశుద్ధ గ్రంథములో ఏనాడో వ్రాయించాడు. కొన్ని వేల సంవత్సరాల క్రితం పరిశుద్ధాత్మ ప్రేరణచేత ఇశ్రాయేలు నాయకుడైన మోషే, ధర్మశాస్త్రాన్ని వ్రాస్తున్నప్పుడు ఆదికాండములో దీనిని దేవుడు తెలియజేసాడు. ఈ ప్రకృతిలో మనిషిని చంపగలిగే విషం ఎప్పుడూ కొద్దిగానే ఉంటుంది. దానిని టన్నుల కొద్దీ

మనము స్వీకరించనక్కరలేదు. కొద్ది పరిమాణములో దానిని తీసుకుంటే చనిపోతారు. సంవత్సరం పొడుగునా వందల కేజీల బియ్యం తిన్న కుటుంబంలో ఉన్నవారందరు ఒక్కరోజు ఒక చిన్న చెంచాతో విషం తీసుకుంటే వారంతా చనిపోతారు. చూసారా? విషానికి ఎంత శక్తి ఉందో! అలాగే, ఎంతో గొప్పగా కట్టుకున్నటువంటి మన జీవితాలు కూడా ఒక చిన్న విషయంతోనే నేల కూలిపోతాయి. ఇప్పటి వరకు ఎన్నో పాఠాలను నేర్చుకున్నా, ఎంతో జ్ఞానసముపార్జన చేసినా, దేవుని కొరకు బ్రదుకుతున్నా, ఏదో ఒక సందర్భంలో మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములాంటి సందర్భము మనకు ఎదురవుతుంది. అప్పుడు మనం ఖచ్చితంగా చాలా జాగ్రత్త పడాలి. అటువంటి విషం జోలికి వెళ్లకుండా మన జీవితాలను జాగ్రత్త చేసుకోవాలి. లేదంటే, ఆ విషం చాలా భయంకరమైనది. అప్పటివరకు సంపాదించుకున్నటువంటి బలాన్ని అది పూర్తిగా నాశనం చేస్తుంది. దేవుడు ఈ ప్రకృతిని మంచి మంచి పదార్థాలతో నింపేసాడు. తాను చేసినవన్నిటినీ చూచి మంచిది, మంచిది అన్నాడు. అలాగే, మనుష్యులను చంప శక్తిగల విష పదార్థపు సృష్టి కూడా ఆయన దృష్టికి మంచిదే. అలాగని ఆయన దృష్టికి ఆ విష పదార్థము మంచిదని, దానిని స్వీకరించి చనిపోమని కాదు. ఆ విషము మనుష్యుల మధ్య ఉండటం, ప్రకృతిలో అది నాశనకర పదార్థముగా ఉండటం దేవుని దృష్టికి మంచిది. ఎందుకంటే, ఏ మనిషి దేవుని దృష్టికి బలహీనుడవుతాడో ఆ మనిషి చనిపోవాల్సిందే. అది దేవుని తీర్మాణము. ఏ మనిషైతే విషాన్ని స్వీకరిస్తాడో ఆ మనిషి చనిపోతాడు కనుక దేవుడు విషాన్ని కూడా ప్రకృతిలో ఉంచాడు. ఎవరైతే దానిని తీసుకోకుండా, దానికి దూరంగా ఉండి తమ జీవితాలను కాపాడుకుంటారో వారే బ్రదుకుతారు. ఇక ఇదంతా శరీర సంబంధమైన బ్రతుకుకు సంబంధించినది. ఆత్మ సంబంధమైన బ్రతుకు కూడా ఇలాగే ఉంటుంది. దేవుని వాక్యమును ఆహారముగా తీసుకుంటూ, నిత్యము దేవుని కొరకు జీవిస్తే నిత్యజీవానికి ఆహ్వానింపబడతాము. అయితే, విషములాంటి సాతాను సంబంధమైన క్రియలలో పాలుపంచుకొని దేవునికి భిన్నమైన బ్రతుకులను కలిగి ఉంటే నిత్య నాశనానికి జారిపోతాము. మనుష్యులంతా తన ఆజ్ఞలకు లోబడి జీవిస్తూ, నిత్యలోకానికి రావాలన్నది దేవుని సంకల్పం.

విషమనేది ఈ ప్రకృతిలో ఎన్నో రూపాలలో మనకు కనిపిస్తుంది. సహజంగా విషం అనగానే మనకు వెంటనే గుర్తుకువచ్చేది సర్పం. ఎల్లప్పుడూ సిద్ధంగా పాము కోరలలో విషం ఉంటుంది. దానిని తయారు చేసుకోడానికి సర్పానికి సమయమేమీ పట్టదు. అన్ని సర్పములు విషపూరితమైనవి కాకపోయినా సర్పమనగానే అందరికీ భయం. ఎందుకంటే, ఒకవేళ విష సర్పమైతే దానికి మరల 'యాంటి-వీనమ్' ఇంజెక్షన్ తీసుకోవడం కనుక ఆలస్యమైతే ప్రాణం పోవడం ఖాయం. అందుకే విషపూరితముకాని సర్పమన్నా సరే, అది మనిషిని కాటు వేయగానే వారు చాలా భయపడతారు. ఎందుకంటే పాము కోరల్లో విషం ఎల్లప్పుడూ సిద్ధం, అది మహా వేగంగా రక్తమును విషపూరితం చేస్తుంది. ఇప్పుడు ఈ విషమును గూర్చి మనము తెలుసుకొనవలసిన జ్ఞానమును దేవుడు తన పరిశుద్ధ గ్రంథములో ఏ విధముగా వ్రాయించాడో చూద్దాం.

**ద్వితీయోపదేశకాండము 32 : 33 'వారి ద్రాక్షరసము క్రూరసర్పముల విషము; నాగుపాముల క్రూర విషము.'** సర్పము కోరలలో విషపూరితమైన పదార్థం ఉంటుంది. అటువంటి సర్ప విషముతో దేవుడు మనిషి స్వభావాన్ని పోల్చి చెబుతున్నాడు. మనిషి కూడా విష స్వభావము గలవానిగా మారిపోతాడు. విషాన్ని ఎక్కించుకుని, ఆ విషాన్ని మరల ఇతరులకు వెదజల్లేవానిగా మారిపోతాడు. ఎందుకంటే మనిషిని అపవాది అనే ఘటసర్పం కాటు వేస్తున్నాడు. అలా విషాన్ని ఎక్కించుకున్న తరువాత ఆ మనిషి నిలువెత్తు విషము కలిగినవానిగా మారిపోతున్నాడు. సర్పములో విషము మన శరీరానికే ప్రమాదం. కానీ, అపవాది ఎక్కించే విషం మన ఆత్మీయజీవితానికి ప్రమాదం. ఇలాంటి క్రూర సర్పముల విషమును నిలువెల్లా కలిగిన మనుష్యులను అప్పుడప్పుడు మనము చూస్తుంటాము. ఇంతకీ ఈ విషము మనిషిలో ఎక్కడ ఉంటుంది? దానిని ఎలా గుర్తు పట్టాలి? దేవుని గ్రంథమును ఈ విషయమై పరిశీలన చేద్దాం.

**యోబు 20 : 12- 'చెడుతనము వారి నోటికి తియ్యగా నుండెను. వారు నాలుక క్రింద దాని దాచిపెట్టిరి. దాని పోనియ్యక భద్రము చేసికొనిరి, నోట దాని నుంచుకొనిరి. అయినను వారి కడుపులో వారి ఆహారము పులిసిపోవును. అది వారిలోపట నాగుపాముల విషమగును.'** సర్పమునకు దాని కోరలలో విషము ఉన్నట్టే, మనిషికి తన నోటిలో నాలుక క్రింద

విషము ఉంటుంది. అనగా, తన మాటలు విషాన్ని వెదజల్లుతాయని అర్థము. మనిషి ఒక నాగుపాము వలె మారిపోతున్నాడు. మనిషిని చూడగానే దేవునికి సర్పములవలె కనిపిస్తున్నారన్న మాట. మనిషికి దేవుని వాక్యమును చెప్పినా వాని నాలుక క్రింద మాత్రం విషమునే దాచుకుంటున్నాడు. అప్పుడప్పుడు మనకు కొంత మంది మనుష్యులు తమ నోట్లో గుట్కా వంటి పదార్థమును పెట్టుకొని అదే పనిగా నములుతూ కనిపిస్తారు. దానిని వారు క్రిందకు ఊయరు, అలాగని కడుపులోనికి మ్రింగరు. పెదవుల క్రింద, నాలుక క్రింద ఆ మత్తు పదార్థాన్ని పెట్టుకొని నములుతూ ఉంటారు. అట్టి మాదిరిగా, అపవాదిచేత మోసగింపబడిన మనుష్యులు తమ నాలుక క్రింద విషాన్ని ఉంచుకుంటారని దేవుడు తెలియజేసాడు. వారు తమ విషాన్ని విడిచిపెట్టరు, అలాగని దానిని మ్రింగరు. ఎదుటివారిని మోసగించడానికి సమయాన్ని వెదుక్కుంటూ తగిన కాలములో సరిగ్గా తమ నాలుకతో విషపూరితమైన మాటలు పలికి నాశనాన్ని కలుగజేస్తారు. దీనినిబట్టి మనిషి నిలువెత్తు విషంగా మారిపోతున్నాడని అర్థమవుతోంది. అపవాది తనకు లోబడినవారిని కాటు వేస్తున్నాడు. అందుకే, దేవుడు అపవాదిని ఒక మహా ఘటసర్పంతో పోల్చాడు. దానిచేత కాటు వేయబడినవారందరిలో నిలువెల్లా విషమే ఉంటుంది. మరొక మంచి మాటను చూద్దాం.

**కీర్తనలు 58 : 3- 'తల్లికడుపున పుట్టినది మొదలుకొని భక్తిహీనులు విపరీతబుద్ధి కలిగియుందురు. పుట్టినతోడనే అబద్ధములాడుచు తప్పిపోవుదురు. వారి విషము నాగుపాము విషమువంటిది.'** దేవుడు చిన్న పిల్లలను చూస్తూ వారు కూడా పాములవలె విషాన్ని కక్కుతున్నారని వ్రాయించాడు. తమ తల్లిగర్భములో నుండి నిన్న మొన్న వచ్చినవాడు కూడా విష సర్పములా మారిపోతున్నాడు. ఈ లెక్కన చూస్తే మానవ ప్రపంచంలో నేడున్నటువంటి జనాభాలో ఎంతమంది ఇలాంటి వారున్నారో ఇప్పుడు మీరు అంచనా వేయండి. ఎన్ని కోట్ల మంది ఇలాంటి వారున్నారు. పాము పిల్లలవలె పెరుగుతున్నారు. ఆ మహా ఘటసర్పానికి బానిసలై పాతాళపు అంచున బ్రతుకుతున్నారు.

**రోమీయులకు వ్రాసిన పత్రిక 3 : 10- 'ఇందును గూర్చి వ్రాయబడినదేమనగా - నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు గ్రహించువాడెవడును లేడు దేవుని వెదకువాడెవడును లేడు అందరును త్రోవ తప్పి యేకముగా పనికిమాలినవారైరి. మేలుచేయువాడు లేడు. ఒక్కడైనను లేడు. వారి గొంతుక తెరచిన సమాధి, తమ నాలుకతో మోసము చేయుదురు; వారి పెదవులక్రింద సర్ప విషమున్నది. వారి నోటినిండ శపించుటయు పగయు ఉన్నవి. రక్తము చిందించుటకు వారి పాదములు పరుగెత్తుచున్నవి. నాశనమును కష్టమును వారి మార్గములలో ఉన్నవి. శాంతిమార్గము వారెరుగరు. వారి కన్నుల యెదుట దేవుని భయము లేదు.'** ఈ లోకమందున్న మనుష్యులను ఉద్దేశ్యిస్తూ దేవుడు వ్రాయించిన మాటలివి. మొత్తంగా లోకమంతా ఇదే తీరులో ఉంది. సర్పం విషము తమలో లేకుండా, పూర్తిగా దేవుని వాక్యముతో నింపబడి నడుచుకొంటున్నవారు ఎందరున్నారు చెప్పండి! పరలోకమందున్న దేవుని దృష్టికైతే నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు. దేవుని గ్రహించువాడెవడును లేడు, ఆయనను వెదకు వాడెవడును లేడు; అందరును త్రోవ తప్పిపోయి ఏకముగా పనికిమాలిన వారయ్యారు. వారి గొంతుక తెరచిన సమాధి. వారు తమ నాలుకతో మోసము చేయుదురు. వారి పెదవుల క్రింద సర్ప విషమున్నది. వారి నోటి నిండ శపించుటయు, పగయే ఉన్నవి. ఈ రోజు సమాజంలో దీనినే మనము చూస్తున్నాము. ఏ మనిషిలోనైనా, ఏ వర్గములోనైనా, ఏ జాతిలోనైనా ఇదే పోకడ మనకు కనిపిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి దేశములోను ప్రతి ప్రాంతములోను పరిస్థితి ఇలాగే ఉంది. ఒకడు నోరు తెరచి మాట్లాడితే దీవెనకరమైన మాటలు, శాంతికరమైన మాటలు ఎక్కడా మనకు కనిపించని పరిస్థితి! అలాగే, పరిశుద్ధ గ్రంథములో నుండి మరొక మాటను పరిశీలిద్దాం.

**కీర్తనలు 140 : 2- 'వారు తమ హృదయములలో అపాయకరమైన యోచనలు చేయుదురు. వారు నిత్యము యుద్ధము రేపజూచుచుందురు. పాము నాలుకవలె వారు తమ నాలుకలు వాడి చేయుదురు. వారి పెదవులక్రింద సర్పవిషమున్నది.'** మనుష్యుల మాటలలో దాగియున్నదంతా విషం. అది సమాజాన్ని మేల్కొలిపేది కాదు. ఒకడు మాట్లాడాడంటే, ప్రకటన చేసాడంటే దాని వలన ఎంతోమంది నాశనానికి జారిపోతున్నారు. ఎందుకంటే, అది విషముతో నిండిన ప్రకటన. పాము నాలుకవలె వారు తమ నాలుకను వాడి చేసి సమాజాన్ని పాడుచేసే మాటలను వదులుతున్నారు. వారి పెదవుల క్రింద సర్పవిషము ఉన్నది. వారంతా నిలువెత్తు విషాన్ని కలిగినవారు. వారు మాట్లాడితే విషపూరితమైన మాటలే వస్తాయి. అవి

సమాజాన్ని పాడు చేస్తాయి. నేటి కాలంలో ఎందరో రాజకీయ నాయకులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, సినీ నటులు/రచయితలు/దర్శకులు... ఈ కోవకు చెందినవారే. తమ నాలుకను తాము అదుపు చేసుకోలేరు. అది వారి వలన కాదు. ఎందుకంటే, వ్రాయబడిన ఒక చక్కని మాట దీనికి సమాధానమును చెబుతుంది.

**యాకోబు పత్రిక 3 : 8 'యే నరుడును నాలుకను సాధుచేయ నేరడు, అది మరణకరమైన విషముతో నిండినది, అది నిరర్గళమైన దుష్టత్వమే.'** సర్పవిషమును తమ పెదవుల క్రింద నుంచుకొని, తమ నాలుకతో విషాన్ని వెదజల్లే మాటలను పలుకువారు నాలుకను ఎన్నటికీ అదుపు చెయ్యలేరని వ్రాయబడింది. ఇందులో ఎంత మాత్రం సందేహం లేదు. అది కేవలం దుష్టత్వం. నాలుకను సాధు చేయటం ఈ లోకంలో ఏ మనిషికి చేత కాదు. హృదయము నిండిన దానినిబట్టి నోరు మాట్లాడుతుంది. హృదయమంతా విషముతో నిండిపోయింది కనుకనే వారి పెదవుల క్రింద విషము ఉంది. వారు మాట్లాడితే విషపూరితమైన మాట బయటకు వస్తుంది. అందుకే, మనిషి తన హృదయాన్ని దేవుని వాక్యముతో నింపుకోవాలి. లోకమంతా విషముతో నిండిపోయిన సందర్భములో, మనిషికి మరల జీవము దొరకాలంటే 'యాంటీ వీనమ్ ఇంజక్షన్' లాంటి దేవుని వాక్యమే ఔషధం. అదే పరిశుద్ధ గ్రంథములో వ్రాయబడిన వాక్యము. బైబిల్ అనే ఈ ఔషధం మనిషి చెంత లేకపోతే, ఆ విషము బారినుండి బయటపడలేరు. ఎందుకంటే, విషము కలిగిన ప్రతి ఒక్కడూ ఒక మత్తు లోనికి వెళ్లిపోతాడు. ఆది ఘటసర్పం మనిషిని కాటు వేస్తే, వాడు ఆ మత్తులోనే ఉండిపోవాలనిపిస్తుంది. అందుకే, ఒక వ్యక్తిని నీతిమంతునిగా మార్చాలంటే ముందుగా తనకు ఎక్కిన విషాన్ని దించాలి. దానికి ఈ ప్రపంచంలో ఉన్న ఏకైక ఔషధం బైబిల్‌లో ఉన్న దేవుని మాటలు. మరొక మంచి మాటను పరిశీలించండి.

**సామెతలు 15 : 30 'మంచి సమాచారము ఎముకలకు పుష్టి ఇచ్చును.'** చూసారా, మంచి సమాచారము పుష్టినిస్తుందని వ్రాయబడింది. ఈ భూమి మీద పరలోకము నుండి వచ్చిన గొప్ప సమాచారమే దేవుని వాక్యము. మణికుమార్‌గా నేనైతే ఈ మాటలను నా సొంత జ్ఞానముతో వ్రాయలేను. నేను వ్రాసిన ప్రతి మంచి మాటకు పరిశుద్ధ గ్రంథములో ఉన్న దేవుని వాక్యమే ఆధారము. ఈ మంచి సమాచారము మనిషికి పట్టిన విషాన్నంతా దించేస్తుంది. వారి ఎముకలకు మంచి పుష్టినిస్తుంది అనగా, వారి బ్రతుకు ఈ భూమి మీద ఆరోగ్యకరంగా ఉంటుంది. ఇలా దేవుని వాక్యము చేత తమకు ఎక్కిన విషాన్ని దించుకున్నవారు ధన్యులు. దేవుని వాక్యము వారికి వినిపిస్తున్నా తమ చెవులను మందము చేసుకొనువారు అభాగ్యులు. ఒకవైపు దేవుడు వారిని చూచి కనికరపడుతున్నా, దీర్ఘశాంతముతో కాలమును పెంచుతున్నా వారిలో మార్పు రావడం లేదు. అయితే, దేవుని ప్రయత్నమైతే కొనసాగుతూనే ఉంది. ఆనాడు యేసు కాలంలో, ఆయన కాపరిలేని మందగా ఉన్న జనులను చూచి వారిమీద జాలి పడుతున్నాడు. అలా వారి మీద కనికరపడి వారికి దేవుని వాక్యమును బోధిస్తున్నాడు. వారికి దేవుని సమాచారాన్ని తెలియజేస్తున్నాడు. ఎందుకంటే వారందరు విషముతో నిండిపోయారు. బాప్తిస్మమిచ్చు యోహాను కూడా ఇటువంటి వారిని గూర్చి పరిశుద్ధాత్మ ప్రేరణతో ఏమంటున్నాడో చూడండి.

**లూకా సువార్త 3 : 7- 'అతడు తనచేత బాప్తిస్మము పొందవచ్చిన జనసమూహములను చూచి- సర్పసంతానమా, రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటకు మీకు బుద్ధి చెప్పినవాడెవడు? మారుమనస్సునకు తగిన ఫలములు ఫలించుడి - అబ్రాహాము మాకు తండ్రి అని మీలో మీరనుకొన మొదలుపెట్టుకొనవద్దు; దేవుడు ఈ రాళ్లవలన అబ్రాహామునకు పిల్లలను పుట్టింపగలడని మీతో చెప్పుచున్నాను. ఇప్పుడే గొడ్డలి చెట్ల వేరున ఉంచబడియున్నది గనుక మంచి ఫలము ఫలించని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడునని చెప్పెను.'** బాప్తిస్మమిచ్చు యోహాను ఆనాటి జనసమూహములను చూచి వారిని 'సర్ప సంతానమా' అని పిలుస్తున్నాడు. అనగా, అప్పటికే వారంతా అపవాది కాటుకు లోనయ్యారని అర్థము. వారు అపవాదికి పిల్లలుగా మారిపోయారన్నమాట. వారిలో నిలువెత్తు విషము ఉంది. అలాంటివారు బాప్తిస్మమిచ్చు యోహాను దగ్గరకు వచ్చినప్పుడు ఆయన కంటికి వారంతా సర్పములవలె కనిపిస్తున్నారు. అప్పుడు ఆయన వారికి దేవుని వాక్యమును ఔషధముగా ప్రయోగిస్తున్నాడు. మారుమనస్సు పొందడమే కాకుండా, దానికి తగిన ఫలములను ఫలించాలని చెబుతున్నాడు. పైగా వారు ఇశ్రాయేలు గోత్రములలో పుట్టినవారు గనుక, అబ్రాహాము మాకు తండ్రి అని వారిలో వారు అనుకొంటూ, తమ్మును తాము సముదాయించుకొంటున్నారు. వారు శరీరాన్ని బట్టి అబ్రాహాము వంశములో పుట్టినా, ఆత్మను బట్టి

ఎప్పుడో దేవునికి దూరమయిపోయారు. అబ్రాహాము సంతానమైనంత మాత్రాన దేవుడు వారికి నిత్యజీవమును అనుగ్రహిస్తాడనుకుంటే అది పొరపాటు. దేవుడు వారిని చూచేసరికి వారు సర్పము యొక్క సంతానముగా కనిపిస్తున్నారు. వారి పైపైన మాటల వరకు దేవుడు, ఆచరణలో మాత్రం అపవాది ఉన్నారు. అందుకే, బాప్తిస్మమిచ్చు యోహాను వారి విషాన్ని దించడానికి దేవుని వాక్యమును ప్రకటిస్తూ, మారుమనస్సుకు తగిన ఫలములను ఫలించమని తెలియజేస్తున్నాడు. దేవునికి కావాలనుకుంటే, రాళ్ల వలన కూడా అబ్రాహామునకు పిల్లలను పుట్టింపగలడని వారితో చెబుతున్నాడు. వారు ఇంకా సర్పములవలె జీవిస్తే, ఇప్పుడే గొడ్డలి చెట్టు వేరున ఉంచబడియున్నదని హెచ్చరిస్తున్నాడు. మంచి ఫలములు ఫలింపని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడుతుంది. ఇలా వారికి హెచ్చరికతో కూడిన దేవుని మాటలు తెలియజేసి వారి విషాన్ని క్రిందకు దించడానికి ప్రయత్నిస్తున్నాడు. అందుకు ఆయన మాటలు విన్నవారంతా ఏమంటున్నారో చూడండి. అలాగైతే మేమేమి చేయవలెనని అతనిని అడుగగా, అంటే వారిలోని విషం కాస్త దిగిందన్నమాట. బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పిన దేవుని వాక్యమును విన్న తరువాత జనులు మేము ఏమి చేయవలెను అని అడిగినందుకు, అయన వారితో రెండు అంగీలు గలవాడు ఏమియు లేనివానికి ఇయ్యవలెననియు, ఆహారము గలవాడు అలాగే చేయవలెనని చెప్పెను. సుంకరులును బాప్తిస్మమును పొందవచ్చి బోధకుడా మేమేమి చేయవలెనని అడుగగా, అతడు మీకు నిర్ణయింపబడిన దానికంటే ఎక్కువ తీసుకొనవద్దు అని వారితో చెప్పెను. సైనికులును బాప్తిస్మమును పొందవచ్చి మేమేమి చేయవలెనని అడుగగా, అతడు ఎవనిని బాధపెట్టకయు, ఎవని మీదను అపనింద వేయకయు, మీ జీతములతో తృప్తిపొందియుండుడని వారితో చెప్పెను. దీనినిబట్టి చూస్తే ఎంతమందికి ఎన్ని విధాలుగా విషము ఎక్కిందో చూడండి. మొత్తంగా జనులందరికి ఒక విధంగా, ఆ జనులలో మరల సుంకరులకు వారికి దొరికిన అవకాశమును బట్టి వారికి ఒక విధంగా, సైనికులకు ఒక విధంగా... ఇలా సమాజంలో పలు విధాలైన మనుష్యులను పలు విధాలుగా మోసగించి, వారికి అపవాది విషాన్ని ఎక్కిస్తున్నాడు. ఇప్పుడు దానికి విరుగుడుగా, దైవజనుడైన బాప్తిస్మమిచ్చు యోహాను కూడా దేవుని వాక్యమనే మంచి ఔషధాన్ని వారి వారి విషానికి తగ్గట్టుగా ఇస్తున్నాడు చూడండి. కట్లపాము కాటు వేస్తే ఒక వైద్యం, తాచుపాము కాటు వేస్తే ఒక వైద్యం, పొడపాము కాటు వేస్తే ఒక వైద్యం చెయ్యాలి. అందరికి ఒకే వైద్యం పని చెయ్యదు. అందుకే సర్పము కాటు వేయగానే వైద్యుడు అది ఏ సర్పమో తెలుసుకుని దానికి తగిన వైద్యం చేస్తాడు. దైవగ్రంథములో మనుష్యులందరికీ కావలిసిన వైద్యం ఉంది. ఎక్కిన విషమును బట్టి ఆ ఔషధమును పరిశుద్ధ గ్రంథము నుండి స్వీకరించాలి. అందుకే దేవుడు అనేక విధములైన సంగతులను తన వాక్యములో పొందుపరిచాడు. కనుక ఏ రకమైనటువంటి విషంతో నిండిపోయినా మనిషికి అద్భుతమైన వైద్యమును చేయగలిగే ఔషధం కేవలం బైబిల్‌లో మాత్రమే ఉంది. ఉదాహరణకు, అపొస్తలుడైన పౌలు ప్రారంభ శతాబ్ధములో ఎన్ని విధాలైన మనుష్యులకు ఎన్ని విధాలుగా వైద్యం చేస్తున్నాడో చూడండి.

కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 9 : 19- **'నేను అందరి విషయము స్వతంత్రుడనైయున్నను ఎక్కువమందిని సంపాదించుకొనుటకై అందరికిని నన్ను నేనే దాసునిగా చేసికొంటిని. యూదులను సంపాదించుకొనుటకు యూదులకు యూదునివలె ఉంటిని. ధర్మశాస్త్రమునకు లోబడినవారిని సంపాదించుకొనుటకు నేను ధర్మశాస్త్రమునకు లోబడినవాడను కాకపోయినను, ధర్మశాస్త్రమునకు లోబడినవానివలె ఉంటిని. దేవుని విషయమై ధర్మశాస్త్రము లేనివాడను కాను గాని క్రీస్తు విషయమై ధర్మశాస్త్రమునకు లోబడినవాడను. అయినను ధర్మశాస్త్రము లేనివారిని సంపాదించుకొనుటకు ధర్మశాస్త్రము లేనివారికి ధర్మశాస్త్రము లేనివానివలె ఉంటిని. బలహీనులను సంపాదించుకొనుటకు బలహీనులకు బలహీనుడనైతిని. ఏ విధముచేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్నివిధముల వాడనైయున్నాను.'** చూసారా, అపొస్తలుడైన పౌలు ఎంత చక్కటి వైద్యం చేస్తున్నాడో! ఆయన దేవుని వాక్యమును చాలా చక్కగా అవగాహన చేసుకున్నాడు. యేసుక్రీస్తు చూపిన మార్గమును, ఆ మార్గము ద్వారా చేరగలిగే నిత్యజీవమును ఆయన బాగా అర్థం చేసుకున్నాడు. దేవుని కొరకు అనేకమంది మనుష్యులను రక్షించాలనే పట్టుదలతో ఎవరికి ఏ విధముగా వైద్యము చెయ్యాలో నేర్చుకున్నాడు. నేను కొంతమందికే వైద్యం చేయగలనని దేవుని పని నుండి తప్పించుకోలేదు. అలాగే, తప్పుడు వైద్యం చేసి మనుష్యులను నాశనమూ చెయ్యలేదు. ఆయన అనేకమందికి క్రీస్తు మార్గమును పరిచయం చేయాలనుకున్నాడు. వీలైనంతమట్టుకు అనేకమందిని విషపు ఛాయలలో నుండి నిత్యజీవములోనికి తీసుకురావాలనుకున్నాడు. ఈ రోజుల్లో ఎక్కడ చూచినా

మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రులే కనిపిస్తున్నాయి. ఎందుకంటే, అన్ని రోగాలకు ఒకే ఆసుపత్రి, ఒకే చిరునామాను ప్రజలు కోరుకుంటారు. ఒక డాక్టరు గారి దగ్గరకు వెళితే ఏ రకమైన రోగానికైనా వైద్యం చేస్తాడు అంటే, రోగులంతా అక్కడికే వెళ్లడానికి ఇష్టపడతారు. ప్రారంభ శతాబ్ధములో అపొస్తలుడైన పౌలు ఎటువంటి విషానికైనా ఔషధమును ఇవ్వగలిగిన సామర్థ్యము కలగినవాడు. దీనికోసమే ఆయన దేవుని జ్ఞానాన్ని పరిపూర్ణముగా నేర్చుకున్నాడు. దానినిబట్టి ఎక్కువమందిని సంపాదించుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు. అందులో ముఖ్యంగా యూదులున్నారు. ఆ యూదులకు ఎక్కిన విషాన్ని దించాలంటే, వారి మధ్య ఒక యూదుని వలె ఉండి వారికి వాక్యమును ప్రకటించాలి. యూదులను క్రీస్తు మార్గములోనికి తీసుకొనిరావాలంటే పరిశుద్ధ గ్రంథములో వారికి చెప్పవలసిన మాటలను ముందుగా వారికి చెప్పాలి. ఆ తరువాత కొందరు ధర్మశాస్త్రమునకు లోబడినవారున్నారు. వారికి ఎక్కిన విషమును దించాలంటే, పౌలు ధర్మశాస్త్రమును పాటించేవాడు కాకపోయినను, వారి యొద్దకు వెళ్లి వారి మధ్య ధర్మశాస్త్రమునకు లోబడినవానివలె ఉండి వారికి నూతన నిబంధనను పరిచయం చేయాలి. అలాగని పౌలు రంగులు మార్చటం లేదు. పౌలు దేవుని ధర్మానికి అన్యాయము చేయుటలేదు. అందుకే, దేవుని విషయమై ధర్మశాస్త్రము లేనివాడను కాను గాని క్రీస్తు విషయమై ధర్మశాస్త్రమునకు లోబడినవాడను అని చెప్పాడు. అంటే, ధర్మానుకూలముగా ధర్మశాస్త్రమును ఎలా పాటించాలో పౌలుకు తెలుసు. దానినిబట్టి ధర్మశాస్త్రము విషయములో ఆయన యుక్తిగా నడుచుకొంటున్నాడు.

ఇక్కడ పాఠకులు చాలా జాగ్రత్తగా గమనించవలసిన విషయమేమిటంటే, అందరినీ ఏ విధముగానైనా రక్షించాలి కదా అని రక్షించేవాడు పాపములో పడిపోకూడదు. అది మొదటికే మోసం. కనుక ముందు మనలను మనము రక్షించుకుంటూ, ఇతరులను రక్షించాలి. ఇక పౌలు, బలహీనులను సంపాదించుకొనుటకు బలహీనుడనైతిని అన్నాడు. అంటే, ఎవరికి ఏ స్థాయిలో వైద్యం చెయ్యాలో ఆ స్థాయిలోనే వైద్యం చెయ్యాలి. చిన్న రోగానికి పెద్ద ఔషధం ఇవ్వకూడదు; పెద్ద రోగానికి చిన్న ఔషధం పని చెయ్యదు. క్రొత్తగా దేవున్ని తెలుసుకొనే వారికి వాక్యమును ఎలా నేర్పించాలి? సంఘములో బలహీనులైన వారికి వాక్యమును ఎలా నేర్పించాలి? అన్నీ తెలిసినా మరల మరల తప్పులు చేసేవారికి వాక్యమును ఎలా నేర్పించాలి? ఇలా, అన్నిటిని బేరీజు వేసుకొని దేవుని వాక్యమును చక్కగా, మనిషిని రక్షించేదిగా ప్రకటించాలి. ఈ ప్రపంచంలో ఎలాంటి మనిషికైనా దేవుని వాక్యము వైద్యం చేయగలదు. ఎవరైనా దేవుని దగ్గరకు వచ్చి ఇది నా సమస్య అని చెప్పుకుంటే ప్రతి ఒక్కరికి దేవుడు సమాధానమును ఇవ్వగలడు, వారిని బాగు చేయగలడు. దేవుడు కేవలం ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో సంబంధించినవాడు కాదు. ఒకనికి న్యాయం చేసి మరొకరికి అన్యాయం చెయ్యడు. దేవుడు సర్వలోకానికి దేవుడు. ఆయనకు అసాధ్యమైనది ఏదీ లేదు. ఆయన దగ్గర మనుష్యులందరినీ బాగుపరచగలిగిన వైద్యం ఉంది. ఆయన మాటలు విషానికి విరుగుడు. అవి ఎముకలకు పుష్టి కలిగిస్తాయి. స్వయంగా యేసుక్రీస్తు కూడా తన చుట్టూ ఉన్న మనుష్య సమాజాన్ని చూస్తూ వారిని సర్పముల వంటి వారే అంటున్నాడు. దైవదృష్టితో చూచిన ప్రతి ఒక్కరికీ, ఈ మనుష్యులంతా సర్పము వలె కనిపిస్తారు. వారి మాటలు విన్నా, వారి క్రియలు చూచినా అపవాది వారిలో స్పష్టముగా కనిపిస్తాడు. వాడి క్రియలు వీరి యందు నెరవేరుతాయి.

**మత్తయి సువార్త 12 : 34 'సర్ప సంతానమా మీరు చెడ్డవారైయుండి ఏలాగు మంచిమాటలు పలుకగలరు? హృదయమందు నిండియుండు దానినిబట్టి నోరు మాటలాడును గదా.'** నిలువెత్తు విషాన్ని కలిగి బ్రతుకుతున్న జనుల మధ్య దేవుని కుమారుడైన యేసు జీవించాడు. వారి నోట మనిషిని బ్రతికించే ఒక్కమాట కూడా కనిపించదు. మరొక సందర్భములో కూడా ఆయన ఈ పదాన్ని ప్రయోగిస్తున్నాడు.

**మత్తయి సువార్త 23 : 33 'సర్పములారా, సర్పసంతానమా, నరకశిక్షను మీరేలాగు తప్పించుకొందురు?'** దేవుడు అపవాదికి, వానిని వెంబడించిన దూతలకు సిద్ధపరచిన నరక శిక్షను పొందడానికి మనిషి కూడా పరుగులు తీస్తున్నాడు. పాతాళ లోకమంతా విషసర్పముల లాంటి స్వభావముతో జీవించినవారితో నిండిపోతుంది. అక్కడ అంతా సర్పములాంటి విష స్వభావం కలిగినటువంటి దూతల మధ్య విష స్వభావం కలిగినటువంటి మనుష్యుల ఆత్మలే శిక్షను అనుభవిస్తారు. అందుకే యేసు, దేవునికి భిన్నముగా అపవాదికి అనుకూలముగా బ్రతుకుచున్న మనుష్యులను -

సర్పములారా, సర్పసంతానమా.. అని పిలుస్తున్నాడు. ఎందుకంటే, వారి నోరు విప్పితే విషం బయటికొస్తుంది. వారేమన్నా పని చేస్తే అది విషపూరితమైన కార్యక్రమముగా ఉంటుంది. అందుకే సర్పములారా, సర్పసంతానమా నరక శిక్షను మీరేలాగు తప్పించుకొందురు? అని ఆయన అంటున్నాడు. నరక శిక్షను తప్పించుకోవాలంటే, విషము పూర్తిగా మనిషిని వదిలిపోవాలి. విషము కలిగిన మనిషి పరలోకానికి అనర్హుడు. అపవాది వేసిన పన్నాగానికి మనిషి ఎందుకు పరలోకాన్ని కోల్పోవాలి? నిత్యజీవమును పొందడానికే దేవుడు తల్లి గర్భమున పడినది మొదలుకొని మనుష్యులందరినీ కాపాడుతున్నాడు. మనుష్యులకు కొంత జీవిత కాలమునిచ్చి వారికి బ్రతుకునిస్తున్నాడు. దీని కొరకు ఆయన మనుష్యుల నిమిత్తము ఎంతో కష్టపడుతున్నాడు; మరియు దీర్ఘశాంతమును కలిగి ఉంటున్నాడు. కనుక విషమును పోగొట్టుకొని దేవుని కుమారునిగా రూపాంతరము పొందడానికి ప్రతి మనిషి సాధన చేయాలి. దేవునివాక్యముచేత మనిషి తనలో ఉన్న మొత్తం విష స్వభావాన్ని నివారించుకోవాలి. అపవాదిని తమ కాళ్ల క్రింద చితుక త్రొక్కాలి. ఎందుకంటే, మనిషికి నిత్యజీవము కంటె గొప్పది, విలువైనది ఈ భూమి మీద ఏదీ లేదు. ఒకవేళ ఏ మనిషైనా అపవాది కాటుకు బలై, వాడివలె బ్రతికితే ఖచ్చితంగా నరకశిక్షను మాత్రం తప్పించుకోలేడు అనేది దేవుని అంతిమ ప్రకటన. అందుకే దేవుని గ్రంథమును మన చేతికి ఒక ఔషధము వలె ఇచ్చాడు. దానిలోని మాటలను చదివి, పరిశోధించి, సత్యాన్ని గ్రహించి తమలో ఉన్న విషాన్ని తగ్గించుకోమన్నాడు. ఇప్పుడు ఒక మంచి సందర్భాన్ని చూద్దాం.

**యెహెజ్కేలు 3 : 1- 'మరియు ఆయన నాతో ఈలాగు సెలవిచ్చెను - నరపుత్రుడా, నీకు కనబడినదానిని భక్షించుము, ఈ గ్రంథమును భక్షించి ఇశ్రాయేలీయులయొద్దకు పోయి వారికి ప్రకటన చేయుము. నేను నోరు తెరువగా ఆయన ఆ గ్రంథము నాకు తినిపించి - నరపుత్రుడా, నేనిచ్చుచున్న యీ గ్రంథమును ఆహారముగా తీసికొని దానితో నీ కడుపు నింపుకొనుమని నాతో సెలవియ్యగా నేను దాని భక్షించితిని; అది నా నోటికి తేనెవలె మధురముగా నుండెను.'** దేవుడు ప్రవక్తకు ఒక గ్రంథమునిచ్చి దానిని భక్షించమంటున్నాడు. భక్షించుము అనగా, ఆసక్తి కలిగి త్వర త్వరగా తినాలని అర్థము. దేవుని వాక్యము స్వచ్ఛమైనదిగా మనిషికి అందినప్పుడు, దేవుడు ఏమంటున్నాడంటే దానిని మీరు భక్షించాలి అంటున్నాడు. ఆ ప్రవక్త ఇశ్రాయేలీయుల యొద్దకు వెళ్లి దేవుని వాక్యమును ప్రకటించాలి. అప్పుడు ప్రవక్త తన నోరు తెరువగా ఆయన ఆ గ్రంథము తనకు తినిపించి, నరపుత్రుడా నేనిచ్చుచున్న ఈ గ్రంథమును ఆహారముగా తీసుకుని దానితో నీ కడుపు నింపుకొనుమని చెబుతున్నాడు. ఆ ప్రకారమే ప్రవక్త దానిని భక్షించాడు. అది ప్రవక్త నోటికి తేనె వలె మధురముగా ఉంది. ఎందుకంటే అది విషము కాదు. విషమైతే నోటికి చేదుగా ఉంటుంది. దేవుని వాక్యము గనుక ప్రవక్త నోటికి మధురముగా ఉంది. గ్రహించేవారికి దేవుని మాటలు ఊరటనిస్తాయి, నెమ్మదిని కలుగజేస్తాయి. అందుకే ప్రవక్త తన కడుపారా తిన్నాడు. దేవుడు తన వాక్యమును మనిషికి కొద్ది కొద్దిగా కాదు; మనిషి ఆశ పడినకొద్దీ దేవుడు దానిని వారికి అనుగ్రహించాలనే చూస్తున్నాడు. మనిషిదే ఆలస్యం. ఎంతకావాలంటే అంత విస్తారమైన జ్ఞానము ఆయన దగ్గర వేచి చూస్తోంది. మరోవైపు అపవాది దగ్గర కూడా కొద్దిగా విషం ఉంది. ఆయన జ్ఞానమును కడుపార తిని నిత్యత్వానికి ఆహ్వానింపబడతారో, లేక అపవాది యొక్క చిటికెడు విషానికి బలై పాతాళానికి జారిపోతారో నిర్ణయం మీరే తీసుకోవాలి.

ప్రియులారా! దేవుని మాటలు కలిగిన పరిశుద్ధ గ్రంథము యెడల మంచి ఆసక్తిని కలిగి ఉండండి. మీ జీవితకాలమంతా ఈ గ్రంథములోని మాటలను తినటానికి, వాటి ప్రకారం బ్రతికి మీ కడుపును నింపుకోవటానికి, మీలోని విషాన్ని పూర్తిగా తగ్గించుకోవటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించండి. అలాగే, మీరు విన్న దానిని, నేర్చుకున్న దానిని ఆచరణలో పెట్టాలి. మీ ఇంటివారికి దానిని బోధించండి. మీ చుట్టూ ఉన్న వారికి దానిని బోధించండి. యేసుక్రీస్తు మార్గమును వారికి పరిచయం చేయండి. ఎందుకంటే వారి బ్రతుకులు కూడా వెలుగుతో నిండాలి. వారికి ఎక్కిన విషాన్ని దేవుని వాక్యమనే ఔషధంతో తగ్గించండి. ఎవరైతే మనిషికున్న ఈ విషాన్ని తగ్గించే దేవుని వాక్యాన్ని తమలో కలిగి ఉంటారో, ఎవరైతే ఆ వాక్యాన్ని సమయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి మనుష్యుల రక్షణార్థమై ఉపయోగిస్తారో వారే నిజమైన వైద్యులు. అవును, వారే ఆత్మ సంబంధమైన మంచి వైద్యులు. ప్రపంచం ఈ వైద్యులను గుర్తిస్తే మంచి వెద్యం సమాజానికి అందుతుంది. ప్రవక్త దేవుడు చెప్పినట్టుగా ఆయన ఇచ్చిన గ్రంథమును భక్షించాడు. అది అతని నోటికి తేనె వలె మధురముగా

ఉంది. దానినంతా కడుపారా తిన్న తరువాత వెళ్లి అనేకమందికి దానిని ప్రకటిస్తున్నాడు. ఎందుకంటే, తిని కూర్చుంటే దాని వలన ఉపయోగమేముంది? తిన్న తరువాత దానికనుగుణంగా పని చెయ్యాలి. అందుకే దేవుని వాక్యమును భక్షించాలి; భక్షించిన దానిని సమాజానికి ప్రకటించాలి. ఈ పాఠానికి చివరిగా మరొక మంచి సందర్భమును చూద్దాం.

**యెషయా 5 : 20 'కీడు మేలనియు మేలు కీడనియు చెప్పుకుని చీకటి వెలుగనియు వెలుగు చీకటనియు ఎంచుకొనువారికి శ్రమ. చేదు తీపి అనియు తీపి చేదనియు ఎంచుకొనువారికి శ్రమ.'** ఇంత చదివినా మీ మనస్సు మారకపోతే, ఇంకా మీలో విషం ఉంటే మీరు ఈ నా రచనను ఎలా భావిస్తారో తెలుసా? ఇదొక చీకటి మాట అనుకుంటారు. కాని, ఎవరు నమ్మినా నమ్మకపోయినా ఇదే నిజమైన వెలుగు. ఈ వెలుగులో నేను కూడా నడవాలి అని నిర్ణయించుకుంటే మీకు నిజంగా విషం దిగిపోతుంది. మీరు దీనిని వెలుగు అని ఎంచుకుంటే భవిష్యత్తు మీకు ఆశాజనకంగా ఉంటుంది. దేహాన్ని విడిచిపెట్టిన తరువాత మీకు గొప్ప మేలు జరుగుతుంది. ఒకవేళ మీరు ఇది చీకటి అని ఎంచుకుంటే మీకు ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులో మాత్రం తప్పక కీడు జరుగుతుంది. ఇది నా మాట కాదు; దేవుని మాట. కీడు మేలని, మేలును కీడని, చీకటిని వెలుగని, వెలుగును చీకటని ఎంచుకొనువారు ఖచ్చితంగా శ్రమల పాలవుతారు. అందుకే, దేవుని మాటలు మీకు అందినప్పుడు మీరు నిర్లక్ష్య ధోరణితో - ఇది చేదు అనుకోకండి. నోటికి తియ్యగానున్న ఈ గ్రంథమును నేను భక్షించాలని, దానితో నా కడుపును నింపుకోవాలని ఉపక్రమించాలి. మంచి ఔషధముగా దీనిని లోపలికి తీసుకోవాలి; తద్వారా లోపల ఉన్న విషాన్ని శేషము లేకుండా నివారణ చేసుకోవాలి. సర్పముగా, సర్ప సంతానముగా బ్రతుకుతున్న వారు ఈ దేవుని వాక్యమనే ఔషధమును స్వీకరించి ఇక మీదట దేవుని కుమారునిగా బ్రతకాలి. ఆ స్థాయికి మనుష్యులంతా రావాలి. దేవుని కుమారునికే పరలోకంలో ప్రవేశం. అక్కడ బానిసలకు, దాస్యత్వంలో ఉన్న వారికి చోటు లేదు. పరలోకానికి వెళ్లేది జ్యేష్ఠుల సంఘము. నిత్యజీవమును అనుభవించే వారందరూ జ్యేష్ఠులు. ఆ మహా భాగ్యమును పొందడానికి క్రీస్తును ధరించుకున్న వారుగా ప్రతి మనిషి ఈ లోకములో బ్రతకాలి. ప్రతీ ఒక్కరూ ఈ దేవుని త్రోవలోనికి రాగలిగితే, దేవుని గ్రంథాన్ని బాగా చదివి దానితో మీ కడుపు నింపుకోగలిగితే, ఇదే సాతాను విషానికి మంచి బైబిల్ ఔషధం. ఈ ఔషధాన్ని మీరు పొందిన తరువాత మీ చుట్టూ ఉన్న సమాజానికి అందించండి. ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకు శుభము కలుగును గాక!

-------x-------

## ప్రశ్నలు

**1) ఈ ప్రకృతిలో దేవుడు విషాన్ని ఎందుకు సృష్టించాడు? వివరించండి.**

**2) తమలో విషమును కలిగియున్న మనుష్యులను గూర్చి పరిశుద్ధ గ్రంథములో ఏ విధముగా వ్రాయబడింది.**

**3) మనిషిలో దాగియున్న విషము ఏ విధముగా బయటపడుతుంది? దానిని గుర్తించడమెలా?**

**4) సర్పసంతానమగా ఎవరు? చర్చించండి.**

**5) విషముతో నిండిన మనిషికి దేవుని వాక్యములో ఇమిడియున్న విరుగుడు వైద్యమును గూర్చి వివరించండి.**

**6) దేవుని వాక్యమును ఎలా భక్షించాలి? సవివరముగా తెలియజేయండి.**

**7) నిలువెత్తు విషము కలిగిన మనిషిని దేవుని వాక్యము ద్వారా ఏలాగు రక్షించవచ్చు? వివరించండి.**

## 11. మానవాళికి మంచి సమరయుడు

ప్రపంచంలో ఉన్న మనుష్యులు యేసుక్రీస్తును ఒక మత వ్యవస్థాపకుడిగా, క్రైస్తవ్యాన్ని ఒక మతముగా, అది తమకు సంబంధించినది కాదు అన్నట్టుగా ప్రక్కకు తప్పుకొని వెళ్లిపోతున్నారు. అటువంటి ధోరణి కలిగియున్నవారంతా ఈ పాఠమును ఆద్యంతం చదివితే నిజానిజాలు తేటపడతాయి. భారతదేశంలో పుట్టి, భారతీయునిగా బ్రతుకుతున్న నేను నా జీవితములో ఇప్పుడు యేసుక్రీస్తును కలిగియున్నాను అంటే అది నాకు చాలా గొప్ప విషయం. ఎందుకంటే నా చుట్టూ నివసిస్తున్న ఎందరికో లేనటువంటి ఈ అవకాశమును నేను కలిగి యుండటంలో ఆ మహాదేవుని సంకల్పము ఉంది. నేను ఈ వార్తను ప్రకటించడానికి ప్రత్యేకింపబడ్డాను. దేవుడనుగ్రహించిన ఒక శ్రేష్ఠమైన మార్గములో ప్రయాణిస్తున్నాను. అలాగని నా చుట్టూ ఉన్న ఈ లోకం, లోకాధికారం, పాలకులు, చివరకు నా బంధువులు కూడా నేను క్రీస్తును తెలుసుకున్నందుకు నన్ను ప్రోత్సహించేవారైతే కాదు. ఒకరకంగా చెప్పాలంటే, యేసుక్రీస్తును నమ్ముకొంటే ద్వేషించేవారు ఎక్కువగా ఉన్న కాలములో మనము జీవిస్తున్నాము! ఉదాహరణకు, నేటి పాలకులు క్రైస్తవ్యాన్ని నిలువరించు నిమిత్తం ఒక హుకుం జారీ చేసారు. అదేమంటే, భారతదేశంలో ఉన్న పాలకులు యేసుక్రీస్తును స్వీకరిస్తే మీ కులాన్ని బట్టి మీకు ఇచ్చే రిజర్వేషన్ తీసేస్తాం అంటున్నారు. అలాగే భయపెట్టి చాలామందికి రిజర్వేషన్ తీసేసారు కూడా! మీరు బైబిల్ చేతబట్టితే పుట్టుకతో మీకు వచ్చే కులం, ఆ కులాన్ని బట్టి వచ్చే రిజర్వేషన్ తొలగిస్తామని భయపెడుతున్నారు. అణగారిన వర్గాలలో పుట్టినటువంటివారు, ఉన్నత స్థాయిలోనికి రావాలని ఒకనాడు డా॥ బి.ఆర్. అంబేద్కర్ గారు మరియు ఆయనతోపాటు ఉన్న కొంతమంది మేధావులు ఆలోచన చేసి వారిని సాంఘికంగా పైకి తీసుకుని వచ్చే నిమిత్తం రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. భారతదేశంలో నివసిస్తున్న ఎందరో నిమ్న జాతి వర్గాలవారు వారి బ్రతుకుకాలంలో అక్షరాస్యత లేకుండా, ఉద్యోగసాధన చెయ్యకుండా, సాంఘికంగా ఎదగకుండా, అగ్రవర్ణాల అకృత్యాలకు బలైపోతూ మేము ఈ పని కొరకే పుట్టాము కాబోలు అని చెప్పులు కుట్టుకుంటూ, రోడ్లు తుడుచుకుంటూ, ఏవైతే చిన్న చిన్న పనులుంటాయో, చెయ్యటానికి అసహ్యపడే పనులుంటాయో, వాటిని చేసుకుంటూ సరిపెట్టుకుంటున్నారు. ఇలా భావించిన వారందరూ అలాంటి పరిస్థితుల్లోనే ఉండిపోయినప్పుడు, సమానత్వమంటే ఇది కాదని చక్కని ఆలోచనచేసినవారే నాటి అంబేద్కర్ గారి నేతృత్వంలోని సభ్యులు! సమానత్వమంటే ఒక అగ్రకులంలో ఉన్నవారే చదువు చదువుకోవాలా? వారు మాత్రమే ఉద్యోగాన్ని సాధించాలా? వారు మాత్రమే పదవులను అలంకరించాలా? అలా కాకూడదు. స్వతంత్ర భారతదేశంలో ఏ కులంలో పుట్టినా సరే, యే వర్గంలో ఉన్నవాడైనా సరే వారందరూ సమానులే అని వారు ఆనాడు రాజ్యాంగాన్ని వ్రాసారు. దానిని వ్రాస్తున్నప్పుడు వారు ఆనాటికి కొన్ని వర్గాలను కనుగొన్నారు. భారతదేశంలో ఫలానా రాష్ట్రంలో, ఫలానా ప్రాంతంలో, ఫలానా మనుష్యులు అణగారిన వర్గాలుగా, అంటరానివారుగా జీవిస్తున్నారని, కనీసం వారిని ముట్టుకుంటే కూడా అశుద్ధం అంటుకుంటుందని భావించే రోజులలో వారికి రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. గతకాల చరిత్రలో అలాంటి పరిస్థితుల్లో నివసిస్తున్న వారినందరిని ఒక మంచి స్థాయిలో చూడాలని ఆనాటి మేధావి వర్గమంతా వీరికి రిజర్వేషన్ కల్పించింది. అలా వచ్చినటువంటి ఈ రిజర్వేషన్‌ను కేవలం యేసుక్రీస్తును నమ్ముకుంటే తీసేస్తాం అని భయపెట్టి క్రీస్తును ఒక మత వ్యవస్థాపకునిగా, క్రైస్తవ్యాన్ని ఒక మతముగా భావించిన నేడున్నటువంటి పాలకులు, ఆనాటివారు ఇచ్చిన రాజ్యాంగానికి గౌరవం ఇవ్వకుండా ఆయన ఫొటోకు, ఆయన విగ్రహానికి ఒక పూలమాల వేసేస్తే అది గౌరవమా చెప్పండి? వీరి రాజకీయ లబ్ధికోసం వారి పుట్టినరోజు వేడుకలు చేస్తే అది గౌరవమా చెప్పండి? నిజంగా ఆనాటి వారికి ఈ విషయాలు తెలిస్తే చాలా బాధపడతారు. ఒక ప్రక్క వారిని గౌరవిస్తున్నామని చెప్పుకొంటూ, మనుష్యులను భయపెడుతూ సమానత్వమనేది ఈ భూమిమీద లేకుండా చేస్తున్నారు.

ప్రియులారా! ఈ విషయాన్ని ఇక్కడ మీకు ఎందుకు జ్ఞాపకం చేస్తూ వ్రాస్తున్నానంటే, మన చుట్టూ ఉన్న ఈ సమాజం యేసుక్రీస్తును నమ్ముకొన్నందుకు ఎవ్వరినీ ప్రోత్సహించదు సరికదా, ద్వేషిస్తుంది. మీరు యేసుక్రీస్తును

నమ్ముకున్నారా, క్రైస్తవ్యాన్ని స్వీకరించారా, అయితే మాలోనుండి మీరు వెళ్లిపోయారా? అని హేళన చేసేవారు, తక్కువగా చూసేవారే ఈనాడు మనకు ఎందరో కనిపిస్తున్నారు. ఇట్టివారికి అందవలసిన ఫలాలను ఇవ్వకుండా, మైనారిటీ వర్గాలకు చెందిన వారనే ముద్రతో ప్రభుత్వం కూడా ఇలాంటివారిని ప్రక్కన పెడుతుంది. ఇక్కడ వీరి పక్షపాతధోరణిని మనము ఆలోచిస్తే కేవలం యేసుక్రీస్తును నమ్ముకుంటేనే రిజర్వేషన్ తీసేస్తాము అంటారు. అల్లాను నమ్ముకుంటే రిజర్వేషన్ తీస్తామని ఎక్కడాలేదు, గౌతమ బుద్ధున్ని నమ్ముకొంటే రిజర్వేషన్ తీసేస్తాం అని ఎక్కడా లేదు, నాస్తికులకు రిజర్వేషన్ తీసేస్తాం అని ఎక్కడా లేదు, ఏ మతాన్నీ ఆచరించకపోయినా రిజర్వేషన్ తీసేస్తాం అని ఎక్కడా లేదు. కానీ, క్రీస్తు దగ్గరకు వస్తే మాత్రం రిజర్వేషన్ తీసేస్తాం అంటున్నారు. ఇది ఎంత పక్షపాతమో చూడండి. వీరికి క్రైస్తవ్యంపై ఎంత కోపమో చూడండి. భారతదేశంలో క్రైస్తవ్యాన్ని ఎలాగైనా నిలుపుదల చెయ్యాలని, యేసుక్రీస్తును నమ్ముకొంటే అది కేవలం ఒక తక్కువ జాతి నమ్ముకొనే మతము అని చిత్రీకరించటానికి ఎంతో మంది ఎన్నో కుట్రలు ఇప్పటి వరకు చేసారు, ఇంకా చేస్తూనే ఉన్నారు. ఇది కేవలం భారతదేశంలోని పరిస్థితి. ఇక ప్రపంచ దేశాలలో కూడా దాదాపుగా ఇదే పరిస్థితి తాండవిస్తోంది.

అలాంటి ఈ పరిస్థితులలో నేను నమ్ముకొన్న యేసుక్రీస్తు చాలా గొప్పవాడని, క్రైస్తవ్యమంటే అది ప్రతి ఒక్కరికి మహాజ్ఞానాన్ని ప్రబోధించే మంచి మార్గమని నేర్పించటానికే 'మానవాళికి మంచి సమరయుడు' అనే ఈ పాఠాన్ని మీ ముందు ఉంచదలిచాను. అసలు యేసుక్రీస్తు అంటే ఎవరు? అసలు క్రైస్తవ్యమంటే ఏమిటి? వీటికి ప్రాథమికమైన, ప్రాముఖ్యమైన వివరణ ఈ పాఠంలో మీకు దొరుకుతుంది. యేసుక్రీస్తును లోకంలో ఉన్న మిగిలిన వారితో, క్రైస్తవ్యాన్ని మిగిలిన మతాలతో పోల్చటానికి వీలులేదు. ఈ మార్గము అంత గొప్పది. ఇది అంత మహోన్నతమైనది. ఈ క్రీస్తు గొప్పతనాన్ని, క్రైస్తవ్యపు పరిమళ సువాసనను ఈ ప్రపంచానికి నేను పరిచయం చేస్తున్నప్పుడు అవివేకులైనవారు కొన్ని అజ్ఞానపు మాటలు మాట్లాడుతున్నారు. అవి ఏమిటంటే, భారతదేశంలో నీవు పుడితే యేసుక్రీస్తును నమ్మటానికి వీలులేదు అంటున్నారు. అంటే వీరి ఉద్దేశ్యంలో క్రైస్తవ్యమనేది మన ప్రాంతానికి సంబంధించినది కాదు, మన దేశానికి సంబంధించినది కాదు, అది ఎక్కడో విదేశాలలో ఉండాల్సిన ఒక మతం అనుకుంటున్నారు. వారు ఈ చెడు అభిప్రాయాన్ని మార్చుకోవాలి. ఇది చాలా తప్పుడు అభిప్రాయం. ఒకప్రక్క ఈరోజు సమాజమంతా ప్రపంచీకరణవైపు అడుగులు వేస్తున్నారు. ఆంగ్లములో దీనిని 'గ్లోబలైజేషన్' అంటారు. అంటే ప్రపంచమంతా అన్ని విషయాలలో కలిసికట్టుగా ఉండాలని, ప్రపంచీకరణ జరగాలని కోరుకుంటున్నారు. నీ దగ్గర ఉన్న వస్తువులు నాకు పంపించు, నా దగ్గరున్న వస్తువులు నీవు తీసుకో; నీ యొక్క సాంకేతిక పరిజ్ఞానాన్ని నాకివ్వు, నా దగ్గర ఉన్న సాంకేతిక పరిజ్ఞానమును నీకిస్తాను అని ఈరోజు ప్రపంచీకరణ పేరుతో ప్రపంచమంతా ఒక చిన్న గ్రామముగా మారిపోయింది. దీనినిబట్టి ఎక్కడెక్కడో తయారైన వస్తువులు, ఎక్కడెక్కడివారిదో సాంకేతికత ఇప్పటికాలంలో అందరికీ అందుబాటులోకి వస్తున్నాయి. దీనికి కారణం ఏమిటంటే ప్రపంచీకరణ జరుగుచున్నది. ప్రతిదేశం తన తలుపులు తెరిచి మిగిలిన దేశాలను ఆహ్వానిస్తోంది. ఈ ప్రపంచీకరణ ఎందులో జరిగింది అంటే, శరీర సంబంధమైన చిన్న చిన్న వస్తువులలో జరిగింది. లోక జ్ఞానంలో, మట్టి జ్ఞానంలో మాత్రమే జరిగింది. ప్రకృతి సంబంధమైన విషయాలలో ప్రపంచీకరణ వేగంగా పుంజుకుంది. దేవుని సంగతులలో, దేవుని విషయాలలో ఈ ప్రపంచీకరణ ఆశించిన స్థాయిలో జరగలేదు. ఈ రోజు కొందరు మనుష్యులు దీనిని అడ్డుకొంటున్నారు. ఆ దేవుడు మావాడు కాదు, ఆ మార్గం మనకు సంబంధించినది కాదు, ఆ పుస్తకం మేము చదవాల్సింది కాదు అని నిషేధిస్తున్నారు. ఇది వేరే దేశానికి సంబంధించినదని పొరబాటు పడుతున్నారు. మిగిలిన విషయాలలో అయితే ప్రపంచీకరణ కావలిసివచ్చింది. ఏది శ్రేష్టమైనదో దానిని ఎన్నుకుని దానిని పొందుతున్నారు. ఉదాహరణకు, మన వాహనములో నింపుకుంటున్న పెట్రోల్ ఎక్కడినుండి వచ్చిందో తెలుసా? అది ఇరాన్ / ఇరాక్ / కువైట్ / సౌది అరేబియా వంటి దేశాలనుండి వచ్చిన క్రూడాయిల్ నుండి వచ్చింది. ఏమి? అలా ఎందుకు వాడుకుంటున్నారు. ఈ దేశంలో క్రూడాయిల్ చాలా తక్కువగా దొరుకుతుంది గనుక ఇక్కడ చమురు నిక్షేపాల స్థాయి తక్కువ గనుక ఈ విషయంలో అందరూ వాహనాలు నడుపుకోవాలంటే గల్ఫ్ దేశాలతో వాణిజ్యం చేయాలని అనుకున్నారు. ప్రతినిత్యం అక్కడనుండి ట్యాంకర్లు సముద్ర మార్గంలో వస్తున్నాయి, అది చమురు శుద్ధి కర్మాగారములోనికి వెళుతోంది, తద్వారా దానినుండి పెట్రోల్ మన బంక్‌లలోనికి వచ్చేస్తుంది. దీనినే ఈ రోజు మనిషి ప్రపంచీకరణ అంటున్నాడు. పెట్రోల్ విషయంలో, డీజిల్ విషయంలో ఇది నా దేశానికి సంబంధించినది కాదు అని ప్రపంచంలోని ఏ మనిషైనా

దానిని నిషేధించగలిగాడా? లేదు. అది ప్రకృతి సంబంధమైనది కదా, అందుకే దానిని నిషేధించలేకపోయాడు. చైనా దేశంలో ఒక మొబైల్ ఫోన్ తయారవుతోంది. వెంటనే అది ఇండియన్ మార్కెట్‌లోనికి వచ్చేస్తుంది. ఫలానా మొబైల్ ఎక్కడ తయారైంది అనగానే అది మేడిన్ చైనా. అలాగే మన దగ్గర తయారైన వస్తువులు మిగిలిన దేశాలకు ఎగుమతి అవుతాయి. జగమంత కుటుంబం మనది, అంతా మనవారే, అంతా మనదే, ఇదే ప్రపంచీకరణ! ఈ ప్రపంచీకరణకు నీ వస్తువు, నా వస్తువు అనే బేధాలు లేవు. ఈ విషయాలలో మాత్రం ప్రపంచమంతటిని కలుపుకుంటూ వెళ్తున్నారు. చదువు చదువుకునే విషయంలో ఇంజనీరింగ్ / మెడిసిన్‌కు వెళ్ళేసరికి ఎన్నో పుస్తకాలను విద్యార్థులు చదవాల్సి ఉంటుంది. వారు చదువుకుంటున్న వారి పుస్తకాలను వ్రాసిన రచయితలు ఎవరో మీకు తెలుసుగా! అందులో దాదాపు చాలామంది విదేశాలలో ఉన్నవారే! ఆంగ్ల రచయితలు, ఫ్రెంచ్ రచయితలు, డచ్ రచయితలు, గ్రీస్ రచయితలు,.. ఇలా చాలా మంది ఉంటారు. వారు వ్రాసిన పుస్తకాలను మన విద్యార్థులు కళాశాలలలో, విశ్వవిద్యాలయాలలో కూర్చొని చదువుకొంటున్నారు. అందుకే ఔషధాల దుకాణానికి వెళితే అక్కడ ఇంగ్లీషు మందులు అని వ్రాసి ఉంటుంది. గంటల, రోజుల వ్యవధిలోనే రోగము మనల్ని విడిచి వెళ్ళిపోతుంది. మరి ఈ మెడికల్ విభాగంలో ఎందుకు ఇంగ్లాండ్ నుండి అమెరికా నుండి ఆస్ట్రేలియా నుండి వైద్య పరిజ్ఞానాన్ని తెచ్చుకుంటున్నాము? అదే గ్లోబలైజేషన్. ఈ విషయంలో నాది నాదే, నీది నీదే అనే తేడా లేదు. ఎందుకంటే అలా అనుకుని కూర్చుంటే, ఇక్కడ మనిషి ప్రాణం పోతుంది. పిజ్జాహట్‌లో ఒక పిజ్జా బుక్ చేసుకొంటే మన దగ్గరకు పిజ్జా వచ్చేస్తుంది. ఏమిటింతకీ ఈ పిజ్జా? అది విదేశాలలో పుట్టిన పిజ్జా. అందుకే దాని పేరు పిజ్జా. ఇక్కడ దానికి అర్థాలుండవు.. పిజ్జా అనే మీరు కూడా తెలుగులో చదువుకోవాలి. పిజ్జాను ఒక దిబ్బరొట్టెలాగా గుండ్రంగా తయారు చేస్తారు, ఆ తరువాత దానిని నాలుగు ముక్కలుగా చేస్తారు. కుటుంబంలో నలుగురూ ఆ నాలుగు ముక్కలనూ తీసుకొని తినేయటమే! ఇది ఫాస్ట్ ఫుడ్ అన్నమాట. చూశారా! కెఎఫ్‌సి చికెన్, మెక్‌డొనాల్డ్స్ బర్గర్, కేఫిచినో కాఫి, ... ఇలా చెప్పుకుంటూ పోతే విదేశీయుల తిండ్లు ఇప్పుడు మన తిండ్లయిపోయాయి. బట్టలు, షూ, బెల్ట్ , కళ్లజోళ్లు, ... వీటన్నింటిలో విదేశీ బ్రాండ్ కనబడాల్సిందే! ఈ రోజు ప్రపంచమంతా వాడుకుంటున్న వెబ్‌సైట్స్, అప్లికేషన్స్ ఎక్కడనుండి వచ్చాయి? విదేశాలనుండే కదా! ఫేస్‌బుక్‌ను స్థాపించిన మార్క్ జుకర్ బర్గ్ ఎక్కడివాడు? విదేశీయుడే! అతడు స్థాపించిన, నడిపిస్తున్న ఫేస్‌బుక్ మీ అందరికి పరిచయం కాలేదా? బా...గా... పరిచయం! యూట్యూబ్ విదేశీయులదే, గూగుల్ విదేశీయులదే! చూశారా.. లోకసంబంధమైన అన్ని విభాగాలలో ఈ రోజు మనిషి ప్రపంచంతో కలిసిపోతున్నాడు. తన దగ్గరున్న డబ్బులిచ్చి పొరుగువాని దగ్గరనుండి కావలిసినదానిని తెచ్చుకుంటున్నాడు. దానిని నిస్సందేహంగా స్వీకరించగలుగుతున్నాడు. ఇలా మనిషి అన్ని విషయాలలో ప్రపంచీకరణలో ఉన్నాడు. కానీ, దేవుని దగ్గరకు వచ్చేసరికి కేవలం ప్రాంతాన్ని బట్టి ఈయన వేరు ఆయన వేరు అంటున్నాడు. యేసుక్రీస్తు నాకు సంబంధించిన వాడు కాడు అనుకుంటున్నాడు. విదేశీమతం, విదేశీ మతబోధకుడు, విదేశీ పుస్తకం అని ఈరోజు ఎన్నెన్ని తప్పుడు పదాలు వాడుతున్నారో మీకు తెలిసిందే. మిగిలిన అన్ని విషయాలలో మనిషికి విదేశీ అనే పదం గుర్తు రాదు. గుర్తు చేసుకుని గిరి గీసుకుంటే మనిషికి నాగరికత లేనట్టే! మరల అనాగరికుడిగా మారిపోతాడు.

ప్రియులారా! లోకంలో మనిషి పురోగతి ఇంత చక్కగా, వేగవంతంగా, సునాయాసంగా, సౌకర్యవంతముగా ఉన్నది అంటే దానికి కారణం ప్రపంచంలో ఒకరికి మరొకరు ఇచ్చి పుచ్చుకుంటున్నారు. అన్ని విషయాలలో మనిషి ఈ విధంగానే ప్రగతిని సాధిస్తున్నాడు. మన దగ్గర నుండి కొన్ని ఉత్పత్తులు మరొకరికి వెళుతున్నాయి. మరొకరి దగ్గరనుండి కావలసినవాటిని మనము తెచ్చుకుంటున్నాము. మనిషి దేవుని దగ్గరకు వచ్చేసరికి మాత్రమే ఎందుకో వింతగా ప్రవర్తిస్తున్నాడు. అలాగని యేసుక్రీస్తు ఎవరనుకుంటున్నారు? ఆయన ఒక ప్రాంతము కొరకే వచ్చినవాడా? ఒక జాతి నిమిత్తమే ప్రాణమును అర్పించాడా? ఆయన ప్రపంచమంతటి కొరకు వచ్చిన ఒక మహా రక్షకుడు! ఆయనను కాదని ఈరోజు మనిషి చాలా తప్పు చేస్తున్నాడు. ఆయన ఈ మానవాళికి ఎలాంటి వాడో, ఎందు నిమిత్తం ఈ భూమిమీద అడుగుపెట్టాడో ఆయన్ను గూర్చి వ్రాయబడిన మహోన్నతమైన సంగతులు ఇప్పుడు మీకు పరిచయం చేస్తాను.

**దానియేలు 7 : 14 'సకల జనులును రాష్ట్రములును ఆయా భాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు**

ప్రభుత్వమును మహిమయు అధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది అదెన్నటికిని తొలగిపోదు; ఆయన రాజ్యము ఎప్పుడును లయము కాదు.' యేసుక్రీస్తు రాకకు ముందు ఆయన నిమిత్తము వ్రాయబడిన ఈ చక్కని మాటలను జాగ్రత్తగా పరిశీలించండి. సకల జనులును, సకల రాష్ట్రములును, ఆయా భాషలు మాట్లాడువారును ఆయనను సేవించునట్లు అంటున్నాడు చూడండి. అంటే, హెబ్రీ భాష మాట్లాడు వారిని గూర్చి మాత్రమే యేసుక్రీస్తు వచ్చాడనుకొంటున్నారా? ఇశ్రాయేలీయుల జాతి కోసము మాత్రమే యేసుక్రీస్తు భూమిమీదకు వచ్చాడనుకొంటున్నారా? మధ్యాసియాలో పుట్టి అక్కడ నివసిస్తున్న వారికి మాత్రమే యేసుక్రీస్తు చెందినవాడు అనుకుంటున్నారా? లేక నేడున్నటువంటి అవివేకులు మాట్లాడుతున్నట్టుగా ఇంగ్లండ్ / యు.ఎస్.ఎ.కి మాత్రమే చెందిన వాడు అనుకుంటున్నారా? కాదు కాదు. ఆయన్ను గూర్చి వేల సంవత్సరాల క్రితం వ్రాయబడిన ఈ చక్కని మాటలను చూడండి. సకల జనుల కొరకు, అనగా భూమిమీద ఖండాలన్నింటి కొరకు, ఆరిన నేలమీద నివసిస్తున్న ప్రతి మనిషి కొరకు యేసుక్రీస్తు వచ్చాడు. యేసుక్రీస్తు దేవుడు! ఆయనకున్న అధికారము, ఆయన ప్రభుత్వము, ఆయన మహిమ చాలా విశేషమైనవి. ఆయన రాజ్యము శాశ్వతమైనది. ఐదేళ్లకో, పదేళ్లకో, ఒక జీవిత కాలానికో పడిపోయే ప్రభుత్వం కాదది. ఆయన శాశ్వతకాలము సకల జనులకు, సకల రాష్ట్రములకు, సకల భాషలు మాట్లాడేవారికి దేవునిచే అధికారమియ్యబడిన రారాజు! అది ఎన్నటెన్నటికి తొలగిపోదు. ఆయన రాజ్యము ఎప్పటికి లయము కాదు. మరి ఈ లోకం ఆయన్ను పరిశోధన చేసి, ఆయనలో ఉన్న మంచిని స్వీకరించరా? కేవలం ఒకే ఒక అడ్డును పెట్టుకొంటున్నారు. ఒకే ఒక గీతను గీసుకుంటున్నారు. అదేమిటంటే, ఆయన మాకు సంబంధించినవాడు కాదు అంటున్నారు. ఒక సెల్‌ఫోన్ విషయంలో మాత్రం అలా అనలేదు. ఆపిల్ సంస్థ ఉత్పత్తి ఐఫోన్ నాదికాదు అని అనలేకపోయింది ఈ సమాజం. తనకు నచ్చిన వాటిని, తనకు కావలిసినవాటిని ఎన్నిటినో కోరుకుంటున్న మనిషి, తన ఆత్మను రక్షించుకోవటానికి మాత్రం ఆలోచన చెయ్యలేకపోవటం వల్లనే యేసుక్రీస్తును చూడగానే ఆయన నాకు సంబంధించినవాడు కాదు అంటున్నారు. దేవున్ని ప్రక్కన పెట్టేస్తున్నాడు. యేసుక్రీస్తు సర్వాధికారిగా ఈ భూమిమీదకు వచ్చాడు. సకల ప్రాంతాల్లో ఉన్న మనుష్యులను రక్షించడానికి ఆయన వచ్చాడు. ఆయనను నిజముగా నమ్మినవారు అత్యున్నతమైన మార్గములో ఉన్నారని నిస్సందేహంగా చెప్పవచ్చు. పరలోకానికి మనలను తీసుకొని వెళ్ళే ఒక మహోన్నతమైన మార్గమే యేసుక్రీస్తు. ఆయన ఈ భూమిమీదనుండి పరలోకానికి ఆరోహణమవుతున్నప్పుడు తన చుట్టూ ఉన్న శిష్యులతో పలుకుతున్న మాటలలో దీనినే ఆయన ప్రస్తావిస్తున్నాడు.

మత్తయి సువార్త 28 : 18- **'అయితే యేసు వారియొద్దకు వచ్చి - పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను వారికి ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొన వలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను.'** సువార్తను ప్రకటించుటకు ఒకనాడు కేవలం ఇశ్రాయేలీయులలో ఉన్న ఇంటివారి దగ్గరకు మాత్రమే వెళ్ళమన్నాడు, యూదుల దగ్గరకు మాత్రమే వెళ్ళమన్నాడు. ఆయనకు అధికారం ఉంటే తప్ప దేనినీ చెయ్యడు, ధర్మమును ఏ మాత్రం అతిక్రమించడు. సమాధిలోనుండి తిరిగి లేచిన తరువాత, తన విషయమైన ధర్మశాస్త్రమును పూర్తిగా నెరవేర్చిన తరువాత పరలోకపు తండ్రి దగ్గర నుండి సర్వాధికారాన్ని పొందిన యేసుక్రీస్తు, అప్పటి నుండి శిష్యులకు ఏమని ఆజ్ఞాపిస్తున్నాడో చూడండి. యేసుక్రీస్తు వారితో పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది కనుక, మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చెయ్యండి అని చెబుతున్నాడు. సమస్త జనులను అనగా ఈ భూమిమీద ఉన్న ప్రతి ఒక్కరిని అని అర్థము. అవును, ఈ భూమిమీద ఉన్న సకల జాతి ప్రజలకు దేవుని వాక్యమును ప్రకటించాలి. ఎందుకంటే ఆయనకు పరలోకమందును, భూమిమీదను సర్వాధికారము తండ్రియైన దేవుని వలన ఇవ్వబడింది. యేసుక్రీస్తు విదేశీయుడు కాదు, ఆయన సర్వాధికారి. ఆయన ఎవరికైనా స్వదేశీయుడే. ఎందుకంటే ప్రపంచీకరణ దృష్టితో యేసుక్రీస్తును చూస్తే మీకు అర్థమవుతుంది. మీ వాహనంలో పోయబడిన పెట్రోల్ విదేశీ పెట్రోల్ అని అనుకుంటున్నారా? మీరు కొనుక్కున్న మొబైల్ ఫోన్ విదేశీ ఫోన్ అనుకుంటున్నారా? లేదు. అవి మీవి! ఈ రోజు మెట్రో నగరంలో మెట్రో రైల్ వచ్చింది అంటున్నారు. ఇది నాది కాదని అనుకోగలుగుతున్నారా లేక స్వీకరిస్తున్నారా? గగన

తలములో ఎగరటానికి మీరు ఎక్కుతున్న విమానాలన్నీ ఎక్కడనుండి వచ్చాయి అనుకుంటున్నారు? విదేశాలనుండే. మరి అందరూ వాటిలో కాలు మోపకుండా ఉండగలుగుతున్నారా లేక అందులో ప్రయాణం చేస్తున్నారా? అవును, ప్రయాణం చేస్తున్నారు. అంతెందుకండీ! ఒక దేశాన్ని వారు రక్షించుకోవాలి అంటే వారి దగ్గర అత్యాధునిక యుద్ధ సామాగ్రి ఉండాలి. అటువంటి యుద్ధ సామాగ్రి వారికి ఎక్కడ నుండి వస్తుంది? రష్యా నుండి వస్తుంది, అమెరికా నుండి వస్తుంది. అవును. బాంబ్‌లు, గ్రెనేడ్‌లు, ఎకె47లు ఇవన్నీ సైనికులకు ప్రభుత్వం ఎక్కడ నుండి సమకూర్చిపెడుతుంది? విదేశాలనుండి తీసుకొనివచ్చి సమకూర్చి పెడుతుంది. విదేశాలలో ఉన్న పరిజ్ఞానమును నేర్చుకుని, తద్వారా స్వదేశీ పరిజ్ఞానమును పెంచుకుంటే వారి దగ్గర కూడా అవి తయారవుతాయి. యేసుక్రీస్తు దగ్గరకు వచ్చేసరికి ప్రారంభంలోనే ఈ మానవజాతి పొరపాటు పడుతోంది. ఆయనకు భూమిమీదను, పరలోకమందును సర్వాధికారము ఇయ్యబడియున్నది. కనుక ఆయన శిష్యులు సర్వలోకానికి వెళ్లారు, సమస్త జనులను శిష్యులుగా చెయ్యుటకు దేవుని వాక్యమును ప్రకటించారు. నాటి నుండి నేటివరకు తరతరాలలో ఆయన శిష్యుల ప్రకటనలను బట్టి ఈనాడు నేను కూడా యేసుక్రీస్తును అంగీకరించగలిగాను. యేసుక్రీస్తు నాకు రక్షకుడు అయ్యాడు. దానిని ఒక బాధ్యతగా తీసుకుని మరికొంతమందికి ప్రకటించగలుగుతున్నాను.

**అపొస్తలుల కార్యములు 10 : 36 'యేసుక్రీస్తు అందరికీ ప్రభువు. ఆయనద్వారా దేవుడు సమాధానకరమైన సువార్తను ప్రకటించి ఇశ్రాయేలీయులకు పంపిన వర్తమానము మీరెరుగుదురు.'** ఒకనాడు ఇశ్రాయేలీయుల దగ్గరకు వెళ్లి, ఆ తరువాత సర్వజనుల యొద్దకు అది వెళ్లింది. దానిని బట్టి యేసుక్రీస్తు అందరికీ ప్రభువు. యేసు శిష్యుడైన పేతురు కూడా మొట్టమొదట ఇది కేవలం ఇశ్రాయేలీయుల కొరకే కాబోలు అనుకున్నాడు. ఇది కేవలం ఇశ్రాయేలీయుల కోసం మాత్రమే అయితే ముందుగా మోషే వచ్చాడు, దావీదు వచ్చాడు, ఎందరో ప్రవక్తలు వచ్చారు, దేవుని ధర్మశాస్త్రము ఇవ్వబడింది. ఇవన్నీ సరిపోతాయి కదా. కానీ దేవుని కుమారుడైన యేసు వచ్చాడంటే ఆయన సర్వలోకమును దృష్టిలో పెట్టుకుని వచ్చాడు. యేసుక్రీస్తు ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే వచ్చినవాడు కాదు. ఆనాడు యూదుడైన పేతురు, అన్యజాతీయులలో భక్తిపరుడైన కొర్నేలీ ఇంటికి పంపబడినప్పుడు, కొర్నేలీ ఇంటివారందరికి సువార్త వాక్యమును చెబుతున్నప్పుడు సర్వజాతి ప్రజల కొరకు యేసుక్రీస్తు వచ్చాడనే విషయమును పేతురు స్పష్టం చేస్తున్నాడు. ఆయనను ఎవరు అంగీకరిస్తారో వారికి బాప్తిస్మమును ఇవ్వాలి. వారిని దేవుని సంఘములో చేర్చాలి. వారి ద్వారా దేవుని పనిని జరిగించాలి. వారిని పరలోకానికి దగ్గర చేయాలి. మనిషిగా పుట్టిన ప్రతి వాని కొరకు యేసుక్రీస్తు ఈ భూమిమీదకు వచ్చాడు. ఆయన ఇశ్రాయేలీయులలో యూదునిగా మధ్యాసియాలో పుట్టాడు. పరలోకమునుండి ఈ భూమిమీదకు పంపబడినప్పుడు, ధర్మశాస్త్రమును నెరవేర్చే క్రమంలో ఆయన కన్య మరియ ద్వారా వచ్చాడు. ఆయన నా కుటుంబములో పుట్టలేదు, నా ప్రాంతములో పుట్టలేదు అనుకుంటే అది అవివేకమే తప్ప వివేకము కానే కాదు. ఒకవేళ మీ దగ్గరే పుట్టాడనుకుందాం. అప్పుడు ప్రపంచంలో మిగిలిన దేశాలవారు ఏమనుకుంటారు? అతడు మా దేశానికి సంబంధించిన వాడు కాదు అని అంటారు. సర్వలోక రక్షణార్థమై వచ్చినవాడని కేవలం మీరు నమ్మితే సరిపోతుందా? ప్రపంచమంతా నమ్మాలి. అందుకే దేవుని ప్రణాళిక చొప్పున ఆయన వచ్చాడు. ప్రపంచ వ్యాప్తంగా ఎందరో యేసుక్రీస్తును ఆశ్రయించ గలుగుతున్నారు. ఆయన మహాజ్ఞానాన్ని అంగీకరించగలుగుతున్నారు. ఈయనతోపాటు ఇంకా ప్రపంచంలో ఎన్నెన్నో చిన్న చిన్నవి అక్కడక్కడ మతాల పేరిట వెలిసాయి. ఆయా వ్యక్తులు స్థాపించినటువంటి ఎన్నెన్నో మతాలున్నాయి. వాటన్నింటిని నేను ఎందుకు స్వీకరించలేదు? అందులో పస లేదు. అందులో నన్ను రక్షించే మహాజ్ఞానం లేదు. మనల్ని రక్షించగలిగే శక్తి ఎందులో ఉందో దానిని స్వీకరించడానికి మనకు స్వేచ్ఛ ఉండాలి. నేను యేసును మాత్రమే ఎందుకు అంగీకరించగలిగాను? నేను బైబిల్‌ను మాత్రమే ఎందుకు దైవగ్రంథముగా స్వీకరించగలిగాను? దీనిద్వారా నిత్యజీవ పరిశోధనను నేను ఎందుకు చెయ్యగలుగుతున్నాను? అది ఆయనలో ఉన్న జ్ఞానము యొక్క గొప్పతనం. వివేకులమైనటువంటి మనము, ఆత్మను గూర్చి ఆలోచించే మనము యేసుక్రీస్తును ఆశ్రయిస్తే తప్పకుండా నిత్యజీవలాభమును పొందుతాము. నిజంగా ఆయన మానవాళి అంతటికి కావలిసినవాడు. అందుకే ఆయన బ్రతికి ఉన్న కాలంలో ఆయన్ను గూర్చి చెప్పటానికి ఒక మంచి ఉపమానమును తెలియజేసాడు. దానిని ఈ సందర్భంలో చూద్దాం.

లూకా సువార్త 10 : 29- **'అయితే తాను నీతిమంతుడైనట్టు కనబరచుకొనగోరి, అతడు - అవునుగాని నా పొరుగువాడెవడని యేసునడిగెను. అందుకు యేసు ఇట్లనెను...'** యేసుక్రీస్తును ఒక వ్యక్తి తాను నీతిమంతునిగా కనపరుచుకొనగోరి తన పొరుగువాడు ఎవడు అని అడుగుతున్నాడు. అప్పుడు యేసుక్రీస్తు ఒక మంచి ఉపమానమును చెబుతున్నాడు. **'ఒక మనుష్యుడు యెరూషలేమునుండి యెరికో పట్టణమునకు దిగి వెళ్లుచు దొంగలచేతిలో చిక్కెను; వారు అతని బట్టలు దోచుకొని, అతని కొట్టి కొరప్రాణముతో విడిచిపోయిరి.'** ఆయన ఉపమానములో భాగముగా, ఒక మనుష్యుడు ఎక్కడనుండి ఎక్కడకు బయలుదేరుచున్నాడో చూడండి. యెరూషలేమునుండి యెరికో బయలుదేరుచున్నాడు. ఇది అంతా రూపకాలంకారములో చెప్పబడింది. దీనిని మనము జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. యెరూషలేము అనేది ఇశ్రాయేలీయులకు ఒక పరిశుద్ధ పట్టణానికి గుర్తు! అది కేవలం రూపకాలంకారములో మాత్రమే చెప్పబడింది. అలాగని మిమ్మునందరినీ యెరూషలేము వెళ్ళమని కాదు. ఆయన ఒక ఉదాహరణగా దీనిని చెబుతున్నాడు. ఒక వ్యక్తి దేవుని నుంచి దయ్యం వైపు నడచి వెళ్ళిపోతున్నాడు. పరిశుద్ధతనుండి పాపమువైపుగా దిగి వెళ్ళిపోతున్నాడు. అతడు యెరూషలేమునుండి యెరికో పట్టణమునకు దిగి వెళుతున్నాడు. మనము ఎప్పుడూ దిగి వెళ్ళటానికి ప్రయత్నం చేయకూడదు. లోక సంబంధముగానైనా మిమ్మల్ని ఏమి చెయ్యమంటారు? ఒక్కొక్క మెట్టు ఎక్కమంటారా లేక దిగమంటారా? విద్యార్థిని ఒక్కొక్క తరగతి ఎక్కమంటారా లేక దిగమంటారా? 10వ తరగతి వరకూ చదివిన తరువాత ఇంటిలోని తల్లిదండ్రులు తమ పిల్లలను 10వ తరగతి పాస్ అయినావు కదా తరువాత 9వ తరగతికి వెళ్లు అని అంటారా? అనరు. ఇంటర్‌మీడియట్ అనే మెట్టు ఎక్కమంటారు. ఇంటర్మీడియట్ అయిపోయిన తరువాత మరల 10వ తరగతికి దిగమని చెబుతారా? చెప్పరు. డిగ్రీకి వెళ్లమంటారు. డిగ్రీ తరువాత పోస్టు గ్రాడ్యుయేషన్, ఆ తరువాత పిహెచ్‌డి... చూశారా! లోకవిద్యలో మనిషి ఒక్కొక్క మెట్టు ఎలా ఎక్కుతున్నాడో! కానీ దేవుని విషయంలో మనిషి నానాటికీ దిగిపోతున్నాడు. వయస్సు మీద పడేకొద్దీ దేవుని నుండి దూరమైపోతున్నాడు. చిన్న పిల్లవానిగా ఉన్నప్పుడు వానిలో కొంచెమైనా దైవత్వం కనిపిస్తుంది. దుష్టత్వం కొంచెం తక్కువగా ఉంటుంది. కానీ వాడు వయస్సులో పెరిగేకొద్ది వానిలో దుష్టత్వం కూడా పెరుగుతుంది. అలా చివరకు దైవత్వం '0' అయిపోతుంది. కనీసం కొంచెం కూడా వాడిలో దైవత్వం కనిపించకుండా పోతుంది. ఈ రోజు మనిషి యొక్క ప్రయాణం, మనిషి యొక్క జీవితం ఎలా ఉందంటే నానాటికీ దేవుని నుండి దూరం అవుతున్నాడు. మరోవైపు దుష్టునికి దగ్గరవుతున్నాడు. దీనిని ఒక వాక్యములో రూపకాలంకారములో యేసు తెలియజేస్తున్నాడు. ఒక మనుష్యుడు యెరూషలేము నుండి యెరికోకు దిగి వెళ్లుచున్నాడు. ఈ లోకంలో ఉన్న మనుష్యులందరూ అంతే! రోజురోజుకూ నేను నీతిలో గొప్పవాడను అవుతున్నానని, దేవునిలో నేను ఒక్కొక్క మెట్టు ఎక్కుతున్నానని చెప్పగలిగేవాడు లేడు. రోజురోజుకు పాడైపోతున్నవాడే మనకు కనిపిస్తున్నాడు. ఈ రోజు ఒకనిలో ఉన్న దుష్టత్వం కొద్దిగా ఉంటే, రేపటి దినానికి అది పెరిగి పెట్రేగిపోతుంది. ఇదే దుష్టత్వానికి ఉన్నటువంటి లక్షణం. మనిషిని ఒకసారి తనలోనికి ఆహ్వానించి, ఆకర్షించి ఆ తరువాత అందులో వారిని మత్తులుగా చేస్తుంది. అందుకే యేసుక్రీస్తు ఈ లోకాన్ని ఉదాహరణగా తీసుకొంటూ ఏమంటున్నాడంటే, ఒక మనిషి యెరూషలేమునుండి యెరికో పట్టణమునకు దిగి వెళ్లిపోతున్నాడు. ఈ మార్గ మధ్యములో ఆ మనుష్యునిపై బందిపోటు దొంగలు పడ్డారు. ఈ లోకంలో ఉన్న మనుష్యులను కూడా ఇలాంటి బందిపోటు దొంగలు పీక్కుని తింటున్నారు. దుష్టుడు ఈ మనుష్య సమాజాన్ని ఊరకనే వదులుతాడా, వదలడు. మనుష్యులను దైవత్వం విషయంలో దిగిపోయేలా చేస్తూ, చివరకు క్రిందనున్న లోకానికి చెర బడుతున్నాడు. ఈ మార్గము మధ్యలో ఈ మనుష్యులను దోచుకుంటున్నాడు. దొంగతనం, వ్యభిచారం, మత్తు పదార్థం, మతోన్మాదం... ఇలా అన్నింటిని మనిషికి అలవాటు చేశాడు. మనిషిని దిగిపోయేలా చేశాడు, మార్గము మధ్యలో గిఫ్ట్ ఇచ్చాడు, మరణానికి చేరువ చేసాడు. మనుష్యులనందరిని తన దుష్టజ్ఞానము చేత ఆకర్షిస్తూ, అపవాదియైనవాడు వారిని ఎన్నో వేదనలకు గురిచేస్తున్నాడు. నేటి ప్రపంచంలో శాంతి లేదు, సమాధానం లేదు! ఉదయం లేవగానే ప్రపంచవార్తలు వినగానే దారుణాలు, కుట్రలు, దోపిడీలు, మానభంగాలు, ఆత్మహత్యలు, అకృత్యాలు, బాంబు దాడులు,... ఇలాంటివే మనకు దర్శనమిస్తున్నాయి. విషపూరితమైన సమాజమే మన కళ్లకు కనబడుతోంది తప్ప, మంచి మానవత్వం ఎక్కడా కనిపించడం లేదు. అందుకే అప్పుడప్పుడు న్యూస్ లో వార్తలు చదివేవారు ఎక్కడైనా కొంచెం మానవత్వం కనిపిస్తే చాలు, దానిని చాలా విడ్డూరంగా, పెద్దగా ఎత్తి చూపిస్తారు. ఎందుకంటే ఆ

మానవత్వం ఈ రోజు కనుమరుగైపోయింది. అందుకే ఈ ప్రపంచానికది ఒక వింతైపోయింది.

మానవత్వమును కోల్పోతున్నటువంటి మనిషి దుర్మార్గానికి దగ్గరైపోతున్నాడు. యెరూషలేము నుండి యెరికో బయలుదేరి వెళ్ళుతున్న ఒకని మీద మార్గము మధ్యలో దొంగలుపడి వానిని దోచుకున్నారు. వానిని వస్త్రహీనునిగా చేసి కొట్టి చివరకు కొర ప్రాణముతో విడిచిపోయారు. ఇప్పుడు మన మధ్యనున్న సమాజము కూడా కొరప్రాణముతోనే ఉంది. ధనవంతుని దగ్గరనుండి పేదవానివరకు ఎవ్వరి దగ్గరా శాంతి, సుఖం, సమాధానము లేదు. డబ్బు సంపాదించేవాడు అర్ధరాత్రి 12 గంటలవరకు డబ్బుకోసమే ఆలోచిస్తున్నాడు. వాడికి కంటిమీద కునుకు లేదు, ప్రశాంతమైన జీవితం లేదు. తన శరీరాన్ని డబ్బు సంపాదనలో పూర్తిగా వాడి వాడి చివరకు ముసలివాడైపోతున్నాడు. 70, 75 యేళ్ల మీద పడుతున్నాయి. ఇక వృద్ధాప్యంలో మందులు మింగుతూ కూర్చుంటున్నాడు. మరోవైపు ఇంటి పనులు చేసుకుంటున్నటువంటి గృహిణి తన జీవితమంతా వంటావార్పులు చేసుకుంటూ నెట్టుకొస్తోంది. జీవిత పరమార్థం తెలియని మనుష్యులు పాతాళానికి దిగిపోతూ అపవాది అనే దొంగ చేతిలో పడి వారి సర్వమును కోల్పోతున్నారు. సుఖం ఎక్కడ? శాంతి ఎక్కడ? మనుష్యులలో ప్రశాంతత కొరవడింది. ఈ జనులు సంతోషిస్తున్నారు అనుకొంటున్నారా? అది నిజమైన నవ్వు కాదు. అది నిజమైన సంతోషము కాదు. సంతోషిస్తున్నామనే భ్రమలో వేదనలను అనుభవిస్తూనే ఉన్నారు. పైకి మాత్రం మేకపోతు గాంభీర్యాన్ని చూపిస్తారు. క్రొత్త బట్టలు వేసుకుంటారు, రుచిగల భోజ్యములను తింటారు. కాని లోపల దు:ఖంతో కూడిన హృదయం, దు:ఖంతో కూడినటువంటి జీవితంతో వారు కొర ప్రాణంతో ఉన్నారు. వారి ఆత్మను రక్షించుకున్నారనే ధైర్యం వారిలో లేదు. నిత్యజీవానికి దగ్గరవ్వాలనే ఆలోచన వారికి రాదు.

యేసు చెబుతున్న ఉపమానములో వాడు దొంగల చేతిలో చిక్కి కొరప్రాణముతో విడిచిపెట్టబడ్డాడు అప్పుడు ఏమి జరిగిందో **లూకా సువార్త 10 : 31** వ వచనములో చూడవచ్చు. **'అప్పుడొక యాజకుడు ఆ త్రోవను వెళ్లుట తటస్థించెను. అతడు అతనిని(కొరప్రాణముతో ఉన్నవానిని) చూచి ప్రక్కగా పోయెను.'** మొట్టమొదట ఆ మార్గములో యాజకుడు వెళుతూ త్రోవ ప్రక్కన కొరప్రాణముతో ఉన్న ఆ మనుష్యుని చూచి ఆదుకోకుండా అతనిని అలాగే వదిలి వెళ్ళిపోయాడు. చూశారా! నిజంగా ఈ సమాజంలో మనిషిని ఆదుకునే మార్గదర్శులు ఎందరున్నారు? దైవములుగా పిలువబడుతున్నా తమ చుట్టూ ఉన్న మనుష్యులను కనికరించని వారు  ఎందరో ఉన్నారు. వారందరూ సమాజాన్ని ఉద్ధరిస్తున్నారా? లేక అంటరానివారిగా ప్రక్కన పెట్టారా? మనము చేయలేనటువంటి ఎన్నో ఆచారాలను మన తలమీద రుద్ది అసలు అందులో జ్ఞానము చూపించకుండా మనలను వెర్రివాళ్లుగా, పిచ్చోళ్లుగా కొరప్రాణముతోనే ఉంచటానికి ప్రయత్నం చేశారు. మనలను వారికి బందీలుగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కాని ఇప్పటివరకూ రక్షణతో కూడిన మహాజ్ఞానాన్ని మనకు ఇచ్చింది ఎవరు చెప్పండి? మణికుమార్‌గా నన్నే మీరు ఉదాహరణగా తీసుకుంటే, యేసుక్రీస్తు నాలో గనుక నిజంగా లేకపోతే ఈ మణికుమార్ ఎలా ఉండేవాడో మీకు తెలుసా? తెలియాలంటే, నాతోపాటు పుట్టి, నాతోపాటు పెరిగి, నాతోపాటు చదివి, నాతోపాటు జీవితాన్ని కొనసాగిస్తున్న ఎందరినో చూస్తే మీకు అర్థమవుతుంది.  వారంతా యేసుక్రీస్తును తెలుసుకోలేదు. అందుకే ఈ సమాజంలో ఆత్మ జ్ఞానం లేకుండా బ్రతికేస్తున్నారు. ఈ ప్రపంచాన్ని దేవుని మార్గంలో నడిపించే పటిమ వారిలో లేదు. ఎందుకంటే వారిని ఎవ్వరూ ఆదుకోలేదు. యేసుక్రీస్తును వారు ఆదుకోనివ్వలేదు. ఆ యేసుక్రీస్తు ఎంతటి గొప్పవాడో చూడండి. ఆయన నాలోనికి రాగానే నన్ను ఎంత గొప్పవానిగా తయారు చేస్తున్నాడో చూడండి. మిగిలిన వారందరూ సామాన్యులుగా జీవిస్తూ కొరప్రాణంతో పడియున్నారు. యాజకులు అటుప్రక్కగా వస్తున్నారు. కాని వారు మన ఆత్మ రోగాన్ని కుదిర్చేవారు కాదు. మనకు మంచి మందు ఇచ్చేవారు కాదు. మన గాయాన్ని మాన్పేవారు కాదు. మన కొరకు తమ ధనాన్ని వెచ్చించేవారు కాదు. మన బాగుకోసం తమ కాలాన్ని, కష్టాన్ని వెచ్చించే వారు కాదు. మనలను చూచి ఆ ప్రక్కగా వెళ్ళిపోతారంతే. ఈ రోజు ఎవరైనా సరే మన దగ్గర నుండి పైకమును మాత్రమే కోరుకుంటారు. దేవుని పేరిట మనుష్యుల దగ్గర నుండి పైకమును వసూలు చేస్తారే తప్ప మనుష్యులకొరకు తమ ప్రాణములను ఇచ్చేటంత దైవస్వరూపులు ఈ రోజు ప్రపంచంలో ఎక్కడున్నారు చెప్పండి. ఒక యాజకుడు వచ్చి కొరప్రాణముతో పడియున్న వానిని చూచి ప్రక్కగా పోయెను. అతడు నాకు సంబంధించిన వాడు కాదు అని చూచి వెళ్లిపోతున్నాడు. గాయపడినవాని వలన నాకు ప్రయోజనం

లేదు సరికదా, ఇప్పుడు నేను వెళితే నా దగ్గర నుండి కొంచెం ధనాన్ని వాని స్వస్థత కొరకు వెచ్చించాలనే భయంతో వానికి సహాయము చేయకుండా ప్రక్కగా వెళ్లిపోతున్నాడు. ఇప్పుడు ఆ యాజకుడు పోయిన తరువాత మరొకడు ఆ మార్గమున వచ్చాడు. అలాగుననే లేవీయుడు ఒకడు ఆ చోటికి వచ్చి అతనిని చూచి అతడు కూడా ప్రక్కగా పోయెను. లేవీయుడు కూడా యాజకుల జాతికి చెందినవాడే. అతడు కూడా వీనితో మనకెందుకు? కొరప్రాణముతో ఉన్న వాని విషయం నాకెందుకు? అనుకున్నాడు. వానిని బాగుచేద్దాం అనుకుంటే వీడి పైసలు ఊడిపోతాయి, వీడి సమయం వృథా అవుతుంది. కనుక గాయపడిన వానిని అలానే ఉంచి వీడి దారి వీడు చూసుకున్నాడు. ఆ తరువాత మూడవ వాడు వస్తున్నాడు చూడండి.

లూకా సువార్త 10 : 33- **'అయితే ఒక సమరయుడు ప్రయాణమైపోవుచు, అతడు పడియున్నచోటికి వచ్చి అతనిని చూచి, అతనిమీద జాలిపడి, దగ్గరకుపోయి, నూనెయు ద్రాక్షారసమును పోసి అతని గాయములను కట్టి, తన వాహనముమీద ఎక్కించి యొక పూటకూళ్లవాని యింటికి తీసికొని పోయి అతని పరామర్శించెను.'** మూడవవాడుగా వచ్చిన ఈ సమరయుడు చూచి ప్రక్కగా పోయేవాడు కాదు. అలాగని ఆ సమరయునికి వేరే పని లేక కాదు. అతడు ఒక ప్రయాణములో తన పనిమీద వెళుతున్నాడు. పోని అలాగని ఈ సమరయునికి పడియున్న మనుష్యునికి ఏమాత్రం పరిచయం / సంబంధం లేదు. అయినా గాని, కొరప్రాణముతో ఉన్న వాని దగ్గరకు వెళ్ళి అతనిని చూచి అతని మీద జాలిపడి దగ్గరకు పోయి నూనె, ద్రాక్షారసము పోసి,అతనికి ప్రథమ చికిత్స చేసి, అతని గాయములు కట్టి తన వాహనము మీద ఎక్కించుకుని, ఒక పూటకూళ్లవాని ఇంటికి తీసుకొని పోయి అతనిని పరామర్శిస్తున్నాడు. తనకు ఏ సంబంధం లేకపోయినా, తనను సహాయం చేయనందుకు ఎవ్వరూ ఏమీ అనకపోయినా ఆ సమరయుడు తన పని నిమిత్తము ప్రయాణమై వెళుతున్నప్పుడు తాను చూచినటువంటి ఆ మనుష్యుని దుస్థితిని చూసి చలించిపోయాడు. క్రిందకు దిగి శ్రమకోర్చి అతని గాయములు కట్టాడు. ఒక పూటకూళ్లవాని ఇంటికి తీసుకొని వెళ్లాడు. అతని బాగోగులు పరామర్శిస్తున్నాడు. అంతేగాక, మరునాడు అంటే ఒక రోజంతా తన పని మానుకుని ఆ దోచుకోబడిన వానితోపాటే ఉన్నాడు. తన ప్రయాణమును, తన ముఖ్యమైన పనులనంతటిని అతడు ప్రక్కన పెట్టుకున్నాడు. ఒక మనిషి ప్రాణం కంటే ఇవన్నీ నాకు ముఖ్యమా? అనుకొన్నాడు. అందుకే అతనితో పాటు ఒక రోజంతా ఉండిపోయి మరునాడు రెండు దేనారములు తీసి ఆ పూటకూళ్లవానికి ఇచ్చి ఇతనిని పరామర్శించుము అని చెబుతున్నాడు. ఇక తాను చెయ్యవలసిన కార్యక్రమం ముగింపబడింది, తన అవసరత ఇక అక్కడ లేదు అనుకున్నప్పుడు అక్కడనుండి బయలుదేరుతున్నాడు. ఆ పూటకూళ్లవానికి రెండు దేనారములు ఇచ్చి, అతన్ని పరామర్శించుము. నీవు ఇంకా ఏమైనా అతని నిమిత్తము ఖర్చు చేసిన యెడల నేను మరల తిరుగు ప్రయాణములో వచ్చినప్పుడు అవి నీకు తీర్చెదనని అతనితో చెప్పి వెళ్లిపోయెను.

ప్రియులారా! ఉపమాన రూపములో దీనిని యేసుక్రీస్తు వారు చెప్పినప్పుడు జాగ్రత్తగా మీరు దీనిని ఆలోచిస్తే ఒక మంచి సమరయుడు త్రోవ ప్రక్కన కొరప్రాణముతో పడియున్నటువంటి ఆ వ్యక్తిని బ్రతికించాడు. అలాగని ఆ సమరయునికి, దొంగల చేతిలో చిక్కినటువంటి వ్యక్తికి ఏమైనా సంబంధం ఉందా చెప్పండి? లేదు. అతడు తన వంశములో పుట్టినవాడు కాదు, అతని కుటుంబీకుడు కాదు, అతని బంధువులలో ఒకడూ కాదు. ఇంతకుమునుపెన్నడూ అతనిని చూడను కూడా చూడలేదు. ఇప్పుడు యేసుక్రీస్తు దీని భావమును చెబుతున్నాడు. ఇలా దొంగల చేతిలో చిక్కిన వానికి పొరుగువారు ఎవరు? యాజకుడు, లేవీయుడు అనగా సమాజములో దేవున్ని పరిచయం చేయవలసిన వారు అతనిని చూచి ప్రక్కగా వెళ్ళిపోయారు. వీడు నాకు సంబంధించిన వాడు కాదు; ఎందుకంటే వీడు దొంగల చేతిలో చిక్కి రక్తం కారుతూ ఉన్నాడు గనుక వీడి దగ్గరకు వారు వెళ్ళకూడదనుకున్నారు. వాడికి తమ ధనమును ఖర్చు చెయ్యాలి గనుక చూచి చూడనట్టుగా ప్రక్కగా తప్పించుకుని పోయారు. అంటే, తన పొరుగువానిని ప్రేమించే మనస్సు వీరి దగ్గర లేదు. అందుకే ప్రక్కగా పోయారు. అతనితో ఏ మాత్రం సంబంధం లేనటువంటి సమరయుడు తన పనిమీద ఉన్నా సరే, అతని కొరకు ఆలోచించాడు. అవసరతను బట్టి ఒక రోజంతా అతనితో ఉన్నాడు. అతని బాగోగులు చూసుకున్నాడు, చివరకు అతనిని బ్రతికించాడు. ఇప్పుడు యేసుక్రీస్తు ఎవరు చెప్పండి! ఆయన బేత్లెహేము అనే ఒక కుగ్రామంలో

పుట్టాడు. ఆత్మ విషయమై కొరప్రాణముతో ఉన్న మనుష్యులందరి దగ్గరకూ ఆయన వస్తున్నాడు. యెరూషలేము నుండి యెరికో దిగి వెళ్ళిపోతూ దొంగల చేతిలో చిక్కినప్పుడు అనగా పరలోకము నుండి పాతాళానికి దిగిపోతూ అపవాది చేతిలో మనుష్యులందరూ బలైపోతున్నప్పుడు వారి దగ్గరకు యేసుక్రీస్తు ఒక మంచి సమరయుడుగా వస్తున్నాడు. నిజంగా నామట్టుకు ఆలోచిస్తే, నా దగ్గరకు ఆ మహానుభావుడు రాకపోతే నేను బ్రతికేవాడనా? ఈ యాజకుడు, లేవీయులలాంటి వారు నాచుట్టూనే ఉన్నా వారు నన్ను బ్రతికించేవారా? నన్ను చూచి ప్రక్కగా వెళ్లిపోయేవారు. వీడి చావు వీడిని చావమను అని ప్రక్కగా వెళ్లిపోయేవారే తప్ప తమ ప్రాణములకు తెగించి నన్ను బ్రతికించేవారెక్కడ?? అందుకే ఈ రోజు నేను బ్రతికింపబడ్డాను. మంచి సమరయుడు నా దగ్గరకు వచ్చాడు. నేను ఆ మంచి సమరయున్ని స్వీకరించాను. కొందరు స్వీకరించలేదు గనుక వారు ఇంకా అలాగే కొరప్రాణముతో ఉన్నారు. ఈ లోకంలో యేసుక్రీస్తు తప్ప ఎవ్వరూ ఎవరికీ సహాయం చెయ్యలేరు, గాయములు కట్టలేరు, పొరుగువారిని ప్రేమించలేరు. యేసుక్రీస్తు ఒక్కడే నిస్వార్థముగా సేవ చేసాడు. ఆయన ఒక్కడే తనది జగదైక కుటుంబం అన్నాడు. ఈ ప్రపంచమంతా నాదే అన్నాడు. ప్రపంచంలో నివసిస్తున్న ప్రజలందరూ నా పొరుగువారే అన్నాడు. ఏ ఒక్కరినీ నిషేధిస్తూ ఆయన గీత గియ్యలేదు. నేను కేవలం ఇశ్రాయేలీయులను మాత్రమే రక్షించటానికి వచ్చాను; ఈ తలపోటు అంతా నా కెందుకు అని ఆయన అనుకోలేదు. ఈ శ్రమ నుండి ఆయన తప్పించుకోలేదు. అందుకే మరల మరల చెబుతున్నాను. యేసుక్రీస్తు **'అందరికి'** ప్రభువు. అందరికి ప్రభువు గనుకనే ఎక్కడ ఉన్నవారికైనా, ఏ జాతిలో పుట్టినవారికైనా ఆయన తన రక్తాన్ని ఇస్తున్నాడు. తన, పర భేధాలు లేకుండా ఎవరికైనా తన మహాజ్ఞానాన్ని అందిస్తున్నాడు. మన తెలుగు భాషలోనికి ఆయన పలికిన మాటలు తర్జుమా అవ్వడం ఏమిటి చెప్పండి. ప్రపంచ నలుమూలలకు ఈ సమరయుని వార్తలు వెళ్లాయి, ఇంకా వెళుతూనే ఉన్నాయి. ఎందుకంటే ఆయన సర్వాధికారి. ఆయన ప్రభుత్వం భూమిమీద నలుమూలలా వ్యాపించి ఉంది. ఆయన మానవాళికి ఒక మంచి సమరయుడు, ఒక గొప్ప సమరయుడు. అందుకే ఈ సర్వ ప్రపంచాన్ని రక్షించడానికి ఆయన వచ్చాడు. ఎవరైతే కొరప్రాణంతో ఉండి ఆయన్ని స్వీకరించాలి అనుకుంటారో వారి దగ్గరకు ఆయన వెంటనే వస్తాడు. తన దగ్గర ఉన్న దానిని ఖర్చు చేస్తాడు. తనను వెంబడించిన శిష్యుల ద్వారా జ్ఞానాన్ని నేర్పిస్తాడు. తిరుగు ప్రయాణంలో మరల ఆయన వచ్చినప్పుడు బహుమతిని ఇచ్చి రక్షింపబడిన వారిని దేవుని పరలోకానికి తీసుకొని వెళ్ళటానికి సిద్ధపడుతున్నాడు. పొరుగువారిని ప్రేమించే విషయంలో యేసుక్రీస్తు ధర్మశాస్త్రమంతటిని  నెరవేర్చేసాడు.

**గలతీయులకు వ్రాసిన పత్రిక 5 : 14 'ధర్మశాస్త్రమంతయు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అను ఒక్క మాటతో సంపూర్ణమై ఉన్నది.'** ఒకడు ధర్మశాస్త్రమును పూర్తిగా నెరవేర్చాలి అనుకుంటే ఒక్క విషయమును పూర్తిచేస్తే చాలు. అదే, 'నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము'. యేసుక్రీస్తు తప్ప ఈ ప్రపంచంలో ఇప్పటివరకు ఎవరైనా ఈ మాటను పూర్తి చేసినవారున్నారా? లేదు. ప్రపంచ ప్రజలందరినీ తన పొరుగువారే, తనకు సంబంధించినవారే అని భావించి తాను వారందరికొరకు ప్రాణమును పెట్టాలి అనుకొన్నవాడు యేసుక్రీస్తు మాత్రమే! యేసుకు ముందు వచ్చిన ప్రవక్తలు సైతం ఈ విషయంలో యేసు కంటె తక్కువవారు కాదా? మోషే ఎవరికోసం వచ్చాడు. ఇశ్రాయేలీయుల కోసమే వచ్చాడు. మోషే తన యవ్వన కాలంలో గొడవపడుతున్న ఇద్దరు వ్యక్తులను చూచి, అందులో ఇశ్రాయేలీయుని వదిలి ఐగుప్తుయుడిని చంపేశాడు. ఈ విషయం ఫరోకు తెలిస్తే తన ప్రాణానికే ముప్పు అని ఆనాడు మోషే మిద్యాను అరణ్యమునకు తన మామయైన యిత్రో దగ్గరకు పారిపోయాడు. అందుకే, మోషే అందరి కొరకు వచ్చినవాడు కాదు. అలాగే, దావీదు అందరి కొరకు వచ్చినవాడు కాదు. కానీ యేసుక్రీస్తు ప్రతి ఒక్కని కొరకు వచ్చినవాడు. ఈ మాత్రం జ్ఞానం లేక, ఈ సమాజంలో కొంతమంది అభాగ్యులు యేసుక్రీస్తును గూర్చి తమకు ఇష్టము వచ్చినట్టు మాటలాడుతున్నారు. వారిలో ఇప్పటికీ కొందరు దావీదును నమ్ముతున్నారు, మోషేను నమ్ముతున్నారు, అబ్రాహామును నమ్ముతున్నారు. కానీ వీరు కొందరిని మాత్రమే అనగా, ఇశ్రాయేలీయులను మాత్రమే రక్షించడానికి వచ్చారు. ప్రపంచమంతా వారి పొరుగువారు కారు. కాని యేసుక్రీస్తుకు ప్రపంచమంతా పొరుగువారే. నరజాతిలో పుట్టిన ప్రతి మనిషి యేసుక్రీస్తుకి పొరుగువాడే. అందుకే ఆయన్ను గూర్చి ఏమి వ్రాయబడిందో తెలుసా? ఆయన ధర్మశాస్త్రమును పూర్తిగా నెరవేర్చాడు. ఎలా నెరవేర్చాడంటే, తన్ను వలె తన పొరుగువానిని ప్రేమించి నెరవేర్చాడు.

**రోమీయులకు వ్రాసిన పత్రిక 13 : 8- 'ఒకని నొకడు ప్రేమించుట విషయములో తప్ప మరేమియు ఎవనికిని అచ్చియుండవద్దు. పొరుగువానిని ప్రేమించువాడే ధర్మశాస్త్రము నెరవేర్చినవాడు'** దేవుని కుమారులు అందరినీ ప్రేమించాలి. అందరూ మన పొరుగువారే! అందుకే, ఒకనినొకడు ప్రేమించుట విషయంలో తప్ప మరేమియు ఎవనికిని అచ్చియుండవద్దు అనే విశేషమైన మాట వ్రాయబడింది. దేవుని ధర్మశాస్త్రము మనుష్యులకు ఏమి నేర్పిస్తున్నది? ధర్మశాస్త్రమును సరిగ్గా, పరిపూర్ణంగా అర్థంచేసుకుంటే అందులో ఉన్న సారాంశమేమిటో తెలుసా? నీ పొరుగువానిని నువ్వు ప్రేమించాలి. పొరుగువానిని ప్రేమించువాడే ధర్మశాస్త్రమును నెరవేర్చువాడు. **'ఏలాగనగా వ్యభిచరింపవద్దు, నరహత్య చేయవద్దు, దొంగిలవద్దు, ఆశింపవద్దు, అనునవియు, మరి ఏ ఆజ్ఞయైన ఉన్న యెడల అదియు నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమింప వలెనను వాక్యములో సంక్షేపముగా ఇమిడియున్నవి.'** ఇంత గొప్పగా పొరుగువానిని ప్రేమించినది ఎవరు? యెరూషలేము ప్రాంతంలో ఆయన పుట్టినా, యూదులలో ఆయన పెరిగినా, మనలనెందుకు ఆయన ప్రేమించాడు? మనకొరకు ఆయన ఎందుకు ఆలోచించాడు? మనకు దేవుని మహాజ్ఞానాన్ని ఎందుకు పరిచయం చేస్తున్నాడు. బాప్తిస్మము తీసుకోవడం ద్వారా ఒక క్రైస్తవునిగా మనలనెందుకు ఆయన రాజ్యములోనికి ఆహ్వానిస్తున్నాడు? దేవుని పరిశుద్ధాత్మను మనకు ఆదరణకర్తగా ఎందుకిస్తున్నాడు? దీనంతటికి కారణం ఏంటో తెలుసా? ఒక పొరుగువానిగా మనలను ఆయన ప్రేమించాడు. పొరుగువానిగా మనల్ని ఆదరించాడు. ఆయన ప్రపంచమంతటిని ప్రేమిస్తున్నాడు. యేసుక్రీస్తు ఈ మానవాళికి మంచి సమరయుడు. ప్రపంచ వేదికపైన ఎందరో దేవుళ్లుగా పిలువబడుతున్న వారు మనకు కనిపిస్తున్నారు. దైవములుగా, బాబాలుగా, మాతలుగా మనుష్యులకు పరిచయమవుతున్నారు. వీరంతా పొరుగువారిని ప్రేమించేవారేనా? ధనాన్ని ఆశించేవారు కొందరు, అధికారాన్ని ఆశించేవారు కొందరు, పొగడ్తలు కోరుకునేవారు మరికొందరు, మానప్రాణాలను బలిగొనేవారు ఇంకొందరు. మనుష్యులకు పరిచారము చెయ్యటానికి ఈ భూమిమీదకు వచ్చి, ప్రతి ఒక్కరిని తన పొరుగువానిగా భావించి, వారందరి కొరకు తన ప్రాణాన్ని పెట్టి, మృతులలోనుండి తిరిగి లేచినటువంటి ఆ మహానుభావుడే యేసుక్రీస్తు! ఈయనే మానవాళికి మంచి సమరయుడు. ఈ విషయాన్ని ఎవరైతే ఈ భూమిమీద తాము బ్రతుకుచున్న కాలములో గుర్తిస్తారో వారికి మాత్రమే ఆ సమరయుని యొక్క మంచి ఫలం అందుతుంది. కొరప్రాణంతో ఉన్నవారు బ్రతికింపబడతారు, వారికి మరల జీవితం దక్కుతుంది. లేదంటే, వారు మరణించక తప్పదు. అందుకే ప్రతి ఒక్కరూ మంచి సమరయుని ఫలమును అందుకోవాలి. ఆయన్ను స్వీకరించగలగాలి.

**యాకోబు వ్రాసిన పత్రిక 2 : 8 'మెట్టుకు నీవలె నీ పొరుగువానిని ప్రేమించుమను లేఖనములో ఉన్నట్టి ప్రాముఖ్యమైన యీ ఆజ్ఞను మీరు నెరవేర్చినయెడల బాగుగనే ప్రవర్తించువారగుదురు.'** నీవలె నీ పొరుగువానిని ప్రేమించాలి అనేది ప్రాముఖ్యమైన ఆజ్ఞ! ఈ ప్రపంచంలో దీనిని ఎవ్వరూ ఎవ్వరికి నేర్పించలేదు, నేర్చుకోలేదు. యేసుక్రీస్తే దీనిని పాటించి, తన్ను వెంబడించిన వానికి దీనిని నేర్పించాడు. అందుకే ఈరోజు ఎవరు వద్దన్నా, ఎవరు అడ్డుకున్నా దేవుని వాక్యము దానిని కోరుకున్న మనుష్యుల దగ్గరకు వెళ్ళగలుగుతుంది. ఎవరు వద్దన్నా తమ పొరుగువారిని ప్రేమించగలుగుతున్న క్రైస్తవులు మనకు కనిపిస్తున్నారు. ఎవరు వద్దన్నా ఆత్మలను రక్షించటానికి ఎంతో ఖర్చు చేస్తున్నారు. క్రైస్తవులు వారు నమ్ముకున్న సిద్ధాంతాలతో సరిపెట్టుకుని, ఒక గుడిలో నాలుగు గోడల మధ్య కూర్చొని భజన చేసుకోకుండా నలుదిక్కులకు దేవుని వాక్యపు పరిమళాన్ని వెదజల్లుతున్నారు. నిజానికి ఇదే దేవునిపై మనము చూపించవలసిన భక్తి! మనము మన పొరుగువారిని ప్రేమించటానికే క్రీస్తులో మరల పుట్టాము. దేనికీ భయపడకుండా దేవుని రాజ్యమును మనుష్యులకు పరిచయం చేస్తున్నాము. ఎందుకంటే మానవాళిని రక్షించటానికి మంచి సమరయునిగా ఆయన వచ్చాడు. ఆయనను ధరించుకొన్న మనము కూడా మంచి సమరయులముగా మారాలి. ఈ ప్రపంచ మానవాళిని రక్షించటానికి మన చేతనైనంతమట్టుకు ప్రయత్నించాలి. ఈ విషయమై వారు మనలను ద్వేషించినా, హేళన చేస్తున్నా, కష్టపెడుతున్నా, నష్టపరుస్తున్నా, మనము మాత్రం ఏం చేస్తున్నామో తెలుసా? వారి క్షేమమును కోరుకుంటున్నాం. అంటే మనవలె మన పొరుగువారిని ప్రేమించగలుగుతున్నామన్నమాట. దేవుడు అనుగ్రహించిన జ్ఞానమును పరిపూర్ణముగా ఈ విషయంలో మనము నెరవేర్చగలగాలి.

ప్రియులారా! ఈ జ్ఞానము గనుక మనిషికి అబ్బితే, ఈ రోజు సమాజం ఎంత చక్కగా ఉంటుందో ఆలోచించండి. తన వలె తన పొరుగువానిని ప్రేమించాలన్న ఆలోచన మనిషిలో పుడితే ఈ రోజు సమాజం ఎంత సస్యశ్యామలంగా మారుతుంది చెప్పండి! పాకిస్తాన్ వాడు ఇండియాను ద్వేషించాలని అనుకోడు. ఇరాక్ సిరియాలో ఉన్నటువంటి ఐ.ఎస్. ఐ.ఎస్. తీవ్రవాదులు మిగిలిన మనుష్యులను చంపాలనుకోరు. ఉగ్రవాదులు మిగిలిన దేశాల్లో బాంబుదాడులు చెయ్యాలనుకోరు. ఎందుకంటే వారు పొరుగువారిని ప్రేమించాలి. వారు నమ్ముకున్న దేవుడు వారికి ఏం నేర్పించాడో అన్నది అగమ్యగోచరం! సాటి మనిషిని చంపమని నేర్పిస్తున్నాడా? నేను నమ్మిన దేవుడైతే, సాటి మనిషిని బ్రతికించమని, అలా బ్రతికించడంకోసం ప్రాణాలకైనా తెగించమని నేర్పిస్తున్నాడు! మానవాళికి మంచి సమరయుడు మాత్రమే తన పొరుగువానిని బ్రతికిస్తాడు.

**రోమీయులకు వ్రాసిన పత్రిక 15 : 2 'తన పొరుగువానికి క్షేమాభివృద్ధి కలుగునట్లు మనలో ప్రతివాడును మేలైన దానియందు అతనిని సంతోషపరచవలెను.'** మన జీవిత ధ్యేయం ఇలాగే ఉండాలి. మానవాళికి మంచి సమరయుడైన యేసు సహాయమును అందుకున్న వారు ఇతరులకు సహాయమందించాలి. మన పొరుగువానికి క్షేమాభివృద్ధి కలుగునట్లుగా మన ప్రయత్నముండాలి. మనలో ప్రతివాడు మేలైన దానియందు మన పొరుగువారిని సంతోషపరచవలెను. వాక్యం నేర్చుకొంటున్నాము; ఆ వాక్యమును ఈ సమాజానికి వెదజల్లాలి. దేవుని వాక్యమును పొరుగువారి చెవులకు వినిపింప చెయ్యాలి. యెరూషలేమునుండి యెరికో వెళ్ళిపోతూ దొంగల చేతిలో చిక్కుబడుతున్న ఎందరో బాటసారులు మన చుట్టూ ఉన్నారు. వారు కొరప్రాణంతో ఉన్నారు. మనము కూడా ఒకప్పుడు అలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పుడు యేసుక్రీస్తు తన జ్ఞానమును పంపించి తన వాక్యము చేత మనలను బ్రతికించాడు కదా. ఇప్పుడు మనము సురక్షితమైన కాలములో, సమాధానకరమైన జీవితంలో ఉన్నాము కదా. ఇప్పుడు మన బాధ్యత ఏమిటంటే, పొరుగువారిని మన వలె ప్రేమించాలి. ఈ విధముగా మనము తండ్రియైన దేవునికోసం ఎంతోపనిని కలిగి ఉన్నాము. **యోహాను సువార్త 5 : 17** ప్రకారము, పరలోకపు తండ్రి పనిలో ఉన్నాడు, యేసుక్రీస్తు పనిలో ఉన్నాడు, పరిశుద్ధాత్ముడు పనిలో ఉన్నాడు, దేవదూతలందరూ పనిలో ఉన్నారు. మనము కూడా ఎల్లప్పుడూ దేవుని పనిలో ఉండాలి. ఇదిగో పొరుగువారిని ప్రేమించటానికే యేసు ఈ లోకములోకి పంపబడ్డాడు. ఆయన ఈ భూమిమీద పనిని ముగించి మరలా తిరిగి వెళ్లిపోయాడు. ఆయన్ను ధరించినవారు ఇప్పుడు ఈ భూమిమీద ఆయనవలె దేవుని పనిని చెయ్యాలి. మానవాళికి మీరందరూ మంచి సమరయులుగా మారిపోవాలి. మీ చుట్టూ ఉన్న సమాజాన్ని మీరు బ్రతికించటానికి శతవిధాలా ప్రయత్నం చెయ్యాలి. ఈ కార్యక్రమాలను కలిగి మంచి సమరయులవలె యేసుక్రీస్తును పోలినవారమై మహాలోకానికి వెళ్ళాలి. ఆయన రాజ్యంలో ఇప్పుడు మనకు కూడా సమరయులవలె అధికారం ఇవ్వబడింది. విశ్వవ్యాప్తమైన ఈ మహా సామ్రాజ్యంలో మనము కూడా రాజులము యాజకులము! **పేతురు వ్రాసిన మొదటి పత్రిక 2 : 9** ప్రకారం, మీరందరూ ఎవరో తెలుసా? రాజులైన యాజక సమూహం. ఆయన మహా సామ్రాజ్యంలో రాజులైన వారంతా మంచి సమరయులుగా పొరుగువారికి సేవలందించాలి. మేలైన వాటియందు మనుష్యులకు క్షేమాభివృద్ధి కలగాలి. మేలైనది దేవుని వాక్యమే!

చివరిగా, ఈ పాఠమును విన్న మీరు ఇంకా ఆ మంచి సమరయుని సహాయముచేత రక్షింపబడకపోతే వెంటనే మంచి నిర్ణయం తీసుకోండి. ఎందుకంటే, ఆపన్న హస్తమునందించడానికి యేసు ప్రభువు ఎల్లప్పుడూ సిద్ధముగా ఉన్నారు. ఒకవేళ మీరు ఆయన సహాయముచేత ఇప్పటికే రక్షింపబడినవారైతే వెంటనే మీరు కూడా మంచి సమరయులుగా మారి మీ పొరుగువారికి ఆ సహాయమందేలా కృషి చేయండి! ప్రభువు కృప మీకు తోడైయుండును గాక!

-------×-------

# ప్రశ్నలు

1) క్రీస్తు సువార్త ప్రకాశమును అడ్డగించుటకు నేటి కాలములో జరుగుతున్న దుష్ప్రయత్నములను చర్చించండి.

2) లోకసంబంధముగా ప్రపంచీకరణ ఏవిధముగా ముందుకు కొనసాగుచున్నదో తెలియజేయండి.

3) 'క్రీస్తు ప్రభుత్వము శాస్వతమైనది' - విశదీకరించండి.

4) యేసుక్రీస్తు అందరికీ ప్రభువెలా అవుతాడో తెలియజేయండి.

5) నిజమైన పొరుగువాడెవడో తెలియజేయడానికి యేసుక్రీస్తు చెప్పన ఉపమానమును వివరించండి.

6) ధర్మశాస్త్రమంతయు 'నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము' అను ఒక్కమాటలో ఏలాగు సంపూర్ణమైయున్నది?

7) పొరుగువానిని ప్రేమించుమని చెప్పిన యేసు మాటలు ఆచరణీయమా? లేక నిషేధమా? - చర్చించండి.

# 12. అణు పరిశోధనా? క్షేమసాధనా?

ఈరోజు ప్రపంచపటం మీద రెండువందలకు పైగా దేశాలున్నాయి. వీటిలో అగ్రరాజ్యాలున్నాయి, చిన్న రాజ్యాలూ ఉన్నాయి. ధనిక దేశాలున్నాయి, పేద దేశాలున్నాయి. ఈ రెండు వందల దేశాలలో దాదాపుగా ప్రతి దేశమూ ప్రపంచంలో మేమే అగ్రగన్యులుగా ఉండాలని ఆశ పడటాన్ని మనము చూస్తున్నాం. అందరిలోకెల్లా మాదే పై చేయి కావాలి అని ఆలోచించటం, ఆ దిశగా ప్రయత్నాలు చేయడం మనం చూస్తున్నాం. అమెరికా రష్యా మధ్య అగ్రరాజ్య పోరు, అమెరికా చైనా మధ్య వాణిజ్య పోరు, పాకిస్తాన్ ఇండియా మధ్య సరిహద్దు పోరు, దేశాలమధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉన్నది. పొరుగున ఉన్న దేశాలు, దూరాన ఉన్న దేశాలు మా దేశం గొప్పది అంటే మా దేశం గొప్పదనుకొంటూ ముందుకు వెళుతున్నారు. మేము ఫలానా రంగంలో గొప్పవారమంటే, మేము ఫలానా రంగంలో గొప్పవారమని చెప్పుకుంటూ ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇదీ నేటి ప్రపంచంలో ఉన్న దేశాల పరిస్థితి. దేశాలన్నీ దేవుని దగ్గరకు వచ్చి, దేవుని మాటలు విని వాటి ప్రకారము నడుచుకునే పరిస్థితి ఏనాడో పోయింది. మా సొంతబలం, మా దేశంలో ఉన్న సైనికబలం, మా దేశ ప్రజలకు ఉన్న జ్ఞానం, మా మట్టి మెదళ్లలో పుట్టిన ఆలోచనా బలం... ఇవే గొప్పవి అనుకుంటున్నారు. అలాంటి సందర్భానికి సంబంధించి ఒక ఆలోచనాత్మకమైన అంశాన్ని ఈ పాఠములో మనము ఆలోచన చేయబోతున్నాం. అదే అణుపరిశోధన!

అణుపరిశోధన (న్యూక్లియర్ రీసెర్చ్ / అటామిక్ రీసెర్చ్) అనే ఈ పదము ఈ 21వ శతాబ్దములో అప్పుడప్పుడు మనకు వార్తల్లో వినిపిస్తోంది. మనిషి సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ అణుపరిశోధనలో అడుగులు ముందుకు వేస్తున్నాడు. భూమిమీద ఎన్నో నిక్షేపాలను మనిషి ఇప్పటికే కనుగొన్నాడు, ఇంకా కనుగొంటూనే ఉన్నాడు. ఈ శక్తి నిక్షేపాలు ఎవరి దగ్గరైతే ఎక్కువగా ఉంటాయో ఆ దేశం ప్రపంచపటంలో గొప్పదిగా కనిపిస్తుంది. ఎవరికి బలం ఎక్కువగా ఉందో వాడే గెలుస్తాడు. అలాగే ప్రపంచ దేశాలలో ఎవరి దగ్గరైతే శక్తి ఎక్కువగా ఉందో వారే అగ్రగాములు. ఇలాంటి అగ్రరాజ్యాల్లో పేరుగాంచినవి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, రష్యా, కొన్ని యూరప్ దేశాలు, గల్ఫ్ దేశాలు, చైనా, జపాన్, ఉత్తర దక్షిణ కొరియాలు, ఆస్ట్రేలియా, ఇండియా వంటి దేశాలు. ఈ శక్తినిక్షేపాల పరిమాణము విషయంలో వీరి మధ్య పోటీ ఉంటుంది. అమెరికా దగ్గర ఎక్కువగా శక్తినిక్షేపాలుంటే అమెరికా గొప్పది, రష్యా దగ్గర ఎక్కువగా శక్తి నిక్షేపాలుంటే రష్యా గొప్పది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఉత్తర కొరియా అధ్యక్షుడు 'కిమ్ జాంగ్ ఉన్' మా దగ్గర కూడా శక్తి నిక్షేపాలున్నాయని తన ప్రయోగాల ద్వారా ప్రపంచానికి తెలియజెప్పాడు. దీంతో ప్రపంచమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఉత్తర కొరియా అధ్యక్షుడు అణుక్షిపణులను ప్రయోగిస్తున్నాడు, అణుపరిశోధనలు చేస్తున్నాడని తెలుసుకుని ప్రపంచంలో ఉన్న మిగిలిన అగ్రరాజ్యాలు ఎందుకు భయపడ్డాయంటే, ఉత్తర కొరియా దేశము గనుక తమ శక్తిని పెంచుకుంటే వారే ప్రపంచంలో అగ్రగాములవుతారు. వారు చెప్పినట్లుగా మిగిలిన దేశాలన్నీ వారిమాట వినాలనే భయం వారిని వెంటాడుతుంది.

ప్రపంచ దేశాధినేతలకు వారి మనస్సులలో ఉన్న ఆలోచన ఇదే! ప్రస్తుత కాలంలో దేశప్రజల బాగోగులు చూడటంకన్నా, సుపరిపాలన కన్నా ముందుగా వీరు ఎక్కువగా తమ తమ దేశాల శక్తిని ఎలా పెంచుకోవాలా అని ఆలోచిస్తున్నారు. ఇంతకీ ఒక దేశానికి ఉన్న శక్తినిక్షేపాలను దేనితో కొలుస్తారు? దేనినిబట్టి దేశంలో ఇంతశక్తి ఉంది అని చెప్పగలరు? దీనిని కొద్దిగా ఆలోచిస్తే, శక్తి నిక్షేపాలనగా- ఈ రోజు మనకు సృష్టిలో అవి చాలా రకాలుగా కనిపిస్తున్నాయి. భూమి యొక్క అంతర్భాగములో గనులలో దొరికే 'బొగ్గు' ఒక శక్తినిక్షేపం. అలాగే 'ముడి చమురు' / 'సహజ వాయువు' మరొక శక్తి నిక్షేపం. 'అణు శక్తి' కూడా మరొక శక్తి నిక్షేపం. నేటి కాలంలో ఎవరి దగ్గర ఎక్కువగా అణు శక్తి (న్యూక్లియర్ ఎనర్జీ) నిక్షేపాలున్నాయో వారే గొప్ప దేశాలుగా చలామణి అవుతున్నారు. ఎందుకంటే, మిగిలిన అన్ని శక్తి నిక్షేపాలకంటే అణు శక్తి నిక్షేపాలు చాలా విశేషమైనవి. అణు శక్తి నిక్షేపాలు పరిమాణంలో చిన్నవి, శక్తి విషయంలో అపారమైనవి. బొగ్గు,

ముడి చమురు, సహజ వాయువులు అణు శక్తి ముందు చాలా చిన్నవి. అణునిక్షేపాల వల్ల వాటి నుండి వెలువడే శక్తి చాలా ఎక్కువ. దాని లెక్క మీకు తెలిస్తే దాని వలన వచ్చే శక్తి ఎంత శక్తివంతమైనదో మీకర్ధమవుతుంది. ఒక గ్రాము యురేనియం (యురేనియం అనేది ఒక న్యూక్లియర్ పదార్థం, రసాయనికంగా దాని అణుభారము 235) మీరు తీసుకోగలిగితే, ఆ గ్రాము యురేనియంలో ఎంత శక్తి ఉంటుందంటే, సుమారు 3000 కిలోగ్రాముల బొగ్గును మండిస్తే ఎంత శక్తి వెలువడుతుందో అంత శక్తి ఉంటుంది. అంటే శక్తి విషయంలో 1 గ్రాము యురేనియం = 3 టన్నుల బొగ్గు. ఇప్పుడు దీనిని బట్టి, మీకు అణు నిక్షేపాల యొక్క శక్తి ఎంత భారీగా ఉంటుందో అర్థం చేసుకోవాలి. 'ఒక గ్రాము యురేనియం' అంటే అది పరిమాణములో ఎంత తక్కువో, శక్తిలో ఎంత ఎక్కువో అంచనా వేయండి. అణు శక్తికి సంబంధించిన పదార్థాలలో యురేనియం మాత్రమే కాదు, ఇంకా ఎక్కువ శక్తి కలిగిన అణు రసాయనాలు కూడా ఉన్నాయి. కానీ ఈ భూమిపై కాస్త విరివిగా లభించే అణు రసాయనాలలో యురేనియం ప్రసిద్ధి చెందినది. యురేనియం అణురియాక్టర్ల ద్వారా వచ్చేటువంటి శక్తి చాలా ఎక్కువ! ఒక్క గ్రాము యురేనియం వలనే ఇంతశక్తి వస్తుంటే. ఒక కిలోగ్రాము యురేనియం వలన ఇంకెంత శక్తి వస్తుందో ఆలోచించండి. 10కేజీల యురేనియం, ఒక టన్ను యురేనియం ఒక దేశము దగ్గర ఉంటే ఆ దేశానికి ఎంత శక్తి ఉంటున్నట్టో మీరు అంచనా వేయండి. అందుకే ఈ రోజు ప్రపంచ దేశాలన్నీ అణు నిక్షేపాల మీద తమ తమ దృష్టిని కేంద్రీకరించాయి. బొగ్గు లెక్కకు పరిమితిగా దొరుకుతుంది. ముడి చమురు, సహజ వాయువులు కూడా పరిమితికి తక్కువగానే దొరుకుతున్నాయి. అవి కూడా కొంత కాలానికి తరిగిపోతాయి. అందుకే ఇప్పుడు ప్రపంచ దేశాల దృష్టంతా అణు నిక్షేపాల మీద పడింది. అందుకే దేశాలన్నీ ఇప్పుడు ఈ అణు శక్తి విషయంలో ఒక గ్రూప్‌లా ఏర్పాటయ్యారు. ఆ గ్రూప్‌లో ప్రస్తుతం 48 దేశాలున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాలుంటే, అందులో 48దేశాలు మిగిలిన దేశాలకంటె కొంచెం ఎక్కువ బలము కలిగిన దేశాలుగా ఒక ప్రక్కకు వచ్చేసాయి. వీరికి ఈ న్యూక్లియర్ శక్తి మీద మంచి అవగాహన వచ్చింది. మేము ఈ న్యూక్లియర్ నిక్షేపాలను కలిగి ఉండాలని, వాటి వలన వచ్చే శక్తిని వాడుకోవాలని ఆశిస్తున్నారు. ప్రపంచంలో మా దేశం నెం.1 అవ్వాలి అని అనుకునే దేశాలు సుమారు 48 ఉన్నాయి. ఆ గ్రూప్ పేరే 'న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్' (ఎన్.ఎస్.జి.). ప్రస్తుతానికి మన భారతదేశానికి ఈ ఎన్.ఎస్.జి. లో ఇంకా సభ్యత్వం రాలేదు. ఈ ఎన్.ఎస్.జి.లో అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనాలాంటి దేశాలున్నాయి. ఇప్పుడు ఆ దేశాలు ప్రపంచాన్ని శాసిస్తున్నాయి. ఏ దేశమైనా తమ మీద ఆధారపడేటట్లుగా చేసుకుంటున్నాయి. యురేనియం వలన వచ్చే శక్తి అపారమైనది కనుక ఒక గ్రాము యురేనియం తోనే ఇంత శక్తి వెలువడుతుంటే ఇది ప్రపంచ మానవాళి మేలును కోరేదే కదా అని మనము అనుకోవచ్చు. అణు పరిశోధన మానవ కళ్యాణానికే కదా అని మనము ఆనందించవచ్చు. కానీ ఇక్కడ మరో తిరకాసు దాగి ఉంది. దేవుని వాక్యము దగ్గరకు మనిషి రాకపోతే అది ఎంతటి ప్రమాదానికి దారి తీస్తుందో ఈ అణుశక్తి తెలియజేస్తుంది. ఒకనాడు బొగ్గును మండించి శక్తిని వెలికితీసారు. తరువాత డీజిల్/పెట్రోల్/సహజవాయువులను మండించి శక్తిని తయారుచేస్తున్నారు. ఇప్పుడు ఇంకా అడుగు ముందుకు వేసి యురేనియం నుండి వెలువడే శక్తిని నిత్యావసరాలకు వాడుకోవచ్చు కదా అని మనిషి అనుకొన్నాడు. ఇంతవరకూ బాగానే ఉంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లు నిర్మిస్తున్నారు. దీనివలన విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసుకోవచ్చు. ఈ యురేనియం వలన ఒకవైపు భారీ లాభం కలుగుతున్నా మరొకవైపు మాత్రం కీడు వాటిల్లుతుంది. ఆ కీడే కనుక జరిగితే అది మన అంచనాలకు అందదు. అది అతి భయంకరమైన నష్టముగా ఉంటుంది.

ప్రియులారా! అణుపరిశోధన సరైన పద్ధతిలో చేయడం వలన ప్రపంచానికి మేలు జరుగుతుందనేది స్పష్టం. ప్రస్తుతం ప్రపంచ వేదికపై ఎన్.ఎస్.జి. దేశాలు, తాము మిగిలిన దేశాలకు యురేనియం సరఫరా చేస్తామని తెలుపుతున్నాయి. అయితే, అణు పరిశోధనను గూర్చి ఎన్.ఎస్.జి. దేశాలకు కూడా తెలియనటువంటి సంగతులు బైబిల్‌లో ఉన్నాయి. ఇంతకీ, అణుపరిశోధన చెయ్యడం మంచిదా, కాదా? యురేనియం నుండి అపారమైన శక్తి వెలువడుతుంది. ఒక న్యూట్రాన్ వచ్చి యురేనియం-235 ను ఢీకొంటే అది క్రిప్టాన్ మరియు బేరియం అనే రెండు పరమాణువులుగా విడిపోతుంది. అలా విడిపోయినప్పుడు అపారమైన శక్తి వెలువడుతుంది. ఇది ఒక సుదీర్ఘ రసాయన చర్య (చైన్ రియాక్షన్). దీనిని అంత సులభముగా ఆపలేము. అపారమైనటువంటి శక్తి అణు రియాక్టర్ నుండి వెలువడుతుంది. ఇలా వచ్చే శక్తిని

విద్యుచ్ఛక్తిని తయారు చెయ్యటానికి ఉపయోగించుకోవచ్చు. కానీ, ఒకవేళ ఈ రసాయన చర్య ఎక్కడైనా అదుపు తప్పి విఫలమైతే దాని పర్యవసానం వర్ణణాతీతం. అణు రియాక్టర్ సరిగ్గా పనిచేసినంతవరకు మంచిదే. దానిని మనుష్యులు సరిగ్గా ఉపయోగించినంత వరకు బాగానే ఉంటుంది. కాని ఒకవేళ దానిని దుర్వినియోగపరిస్తే పరిస్థితి ఏమిటి? అణుశక్తి అదుపు తప్పితే ఈ భూమిమీద మనిషన్నవాడే మిగలడు. ఎన్.ఎస్.జి. దేశాలు వారి దగ్గరున్న యురేనియం నిక్షేపాలను దుర్వినియోగపరిస్తే దానికి భారీ మూల్యమును చెల్లించాల్సి వస్తుంది. దీనికి నిదర్శనం, గతంలో రెండవ ప్రపంచయుద్ధ సమయంలో జపాన్ దేశంలో హిరోషిమా, నాగసాకి పట్టణాల మీద అమెరికా ప్రయోగించిన అణుబాంబులే. ఇప్పటికీ అక్కడ పచ్చగడ్డి కూడా మొలవని పరిస్థితి. అణు శక్తి విఫలమైతే, భయంకరమైన విస్ఫోటనాలను చూడాలి. కాని ఈ ప్రపంచానికి దీని మీద ఆలోచన లేదు. దీనిని గూర్చి అంతగా పట్టించుకోవడం లేదు. ఈరోజు లాభాలు వస్తే చాలు అనుకొంటున్నారు. అణుశక్తి ముసుగులో దురాశతో ఆలోచిస్తున్నారు. మిగిలిన దేశాలన్నీ మేము కూడా ఎన్.ఎస్.జి. దేశాల జాబితాలో చేరాలని ఉవ్విళ్లూరుతున్నాయే తప్ప, దేవుని గ్రంథము ఈ విషయమును గూర్చి ఏమని మాట్లాడిందో గమనించలేకపోతున్నారు.

ఇక మన దేశానికి సంబంధించి, తమిళనాడులో కూడంకుళం అనే ప్రాంతము మరియు ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళంలోని కొవ్వాడ ప్రాంతములలో నిర్మిస్తున్న అణురియాక్టర్‌లను గూర్చి ఎందరో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అణురియాక్టర్‌లను నిర్మించినప్పుడు బాగానే ఉంటుంది. వాటివలన విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసుకునేటప్పుడూ బాగానే ఉంటుంది. కానీ ఒకవేళ వాటి వలన నష్టం వాటిల్లితే.. దానిని మాత్రం అంచనా వేయలేము. విద్యుత్ శక్తి ఎవరికోసం? మనుష్యుల కోసం! మనుష్యులు బ్రతికుంటేనే విద్యుచ్ఛక్తి వారికి అవసరం. మనుష్యులే చనిపోతే? ఊరికి ఊరే శ్మశానంగా మారిపోతే? అప్పుడు విద్యుచ్ఛక్తి ఎవరికి కావాలి చెప్పండి? క్రీ.శ. 2011లో ఒక భారీ సునామి జపాన్ దేశాన్ని తాకింది. ఆ భయంకరమైన సునామి భూకంపంతో పాటుగా కలిపి వచ్చింది. అవి జపాన్ దేశాన్ని అతలాకుతలం చేసాయి. దీని వలన జపాన్ దేశం భారీగా నష్టపోవటానికి కారణం ఏమిటంటే వారిదేశంలో వారు నెలకొల్పుకొన్న అణురియాక్టర్లు మాత్రమే. అణు రియాక్టర్లు అదుపుతప్పితే జరిగే నష్టం అప్పటివరకు వారికి కూడా తెలియదు. యురేనియం ద్వారా అతి తక్కువ ఖర్చుకే పవర్ వస్తోంది కదా అనుకొన్నారు. సునామి మరియు భూకంపం వచ్చినప్పుడు ఈ అణు రియాక్టర్ల పరిస్థితి ఎలా ఉంటుందన్నది జపాన్ వారు చాలా బాగా తెలుసుకున్నారు. నిజంగా అణురియాక్టర్లు ఉండటం వల్ల, అప్పటికే అవి ఆపరేషన్‌లో ఉండటం వల్ల వాటివలన వచ్చినటువంటి భయంకరమైన రేడియేషన్ ఆ జపాన్ ప్రజలను తాకింది. ఉన్నపళంగా దానికి దగ్గరగా ఉన్నవారందరూ నాశనమయ్యారు. ఇది జరిగిన తరువాత వెనువెంటనే జపాన్ దేశం తీసుకొన్న నిర్ణయం ఏమిటో తెలుసా? ఫుకిషిమా నగరంలో ఉన్నటువంటి అణురియాక్టర్లను వారు మూసేసారు. నిజంగా వారు దెబ్బతిన్నారు గనుక నేర్చుకొన్నారు. మిగిలిన వారు ఇంకా దెబ్బతినలేదు గనుక అణురియాక్టర్లు, అణు పరిశోధనవైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రియులారా! ఈ ప్రపంచంలో దేవునిమాట చాలా శ్రేష్టమైనది. బైబిల్ ప్రపంచంలో ప్రతీ దేశానికి మార్గనిర్దేశకాన్ని చేస్తుంది. వారు ఎలా అడుగులు వెయ్యాలో బైబిల్ చెబుతుంది. వారెలా ఆలోచించాలో బైబిల్ నీకు తెలియజేస్తుంది. అందుకే ప్రపంచదేశాలు బైబిల్ దగ్గరకు రావాలి. ఇంతకీ అణుపరిశోధన చెయ్యాలా, వద్దా? అణురియాక్టర్లు కట్టాలా, వద్దా? దేవుని దగ్గరకు వచ్చి అడగాలి. దేవునిమాట ఈ ప్రపంచానికి క్షేమకరమైనది. అణురియాక్టర్, అణుపరిశోధన కంటే దేవునిమాటలే మనుష్యులకు ఎక్కువ లాభాన్ని కలిగిస్తాయి. దేవుడు ఈ మానవాళిని ఉద్దేశించి చేస్తున్న ఒక మంచి హెచ్చరికను చూడండి. బైబిల్ అంటే అది ఒక మత పుస్తకం కాదు; అది మహాజ్ఞానాన్ని నేర్పించే గ్రంథం!

**యాకోబు 1 : 14, 15 'ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భమును ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును'.** నేటి ప్రపంచంలో ప్రతి మనిషి, తన స్వకీయమైన దురాశలచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడుతున్నాడు. దేవుడు మనిషి చెంతనే యురేనియం నిల్వలు పెట్టాడు. కానీ ఆ మనిషి దేవుని దగ్గరకు వచ్చాడా? లేదు. యురేనియం వలన అపారమైన

శక్తి వస్తుంది గనుక ఇక నాకు తిరుగులేదనుకున్న మనిషికి దేవుడు ఒక అద్భుతమైన పాఠమును నేర్పుతున్నాడు. ఎన్.ఎస్.జిలో ఉన్న దేశాలు ఈ యురేనియంను చూసుకుని, మిగిలిన దేశాలను తమ కాలి క్రింద ఉంచుకోవాలనుకుంటున్నాయి. దీనిని బట్టి మిగిలిన దేశాలు కూడా ఆ ఎన్.ఎస్.జిలో సభ్యత్వాన్ని సంపాదించడానికి నానా ప్రయత్నాలూ చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో దేవుడు ఏమంటున్నాడో ఒక్కసారి ఆలోచించండి. నిలువెత్తు దురాశను కలిగిన ఈ దేశాలు దేవుని దగ్గరకు మాత్రం రాలేదు. దేవుని మాటలకు విలువనివ్వలేదు. ప్రకృతిలో దొరికిన యురేనియం నిక్షేపాన్ని మాత్రమే చూస్తున్నారు. దానిని బట్టి ఈరోజు ప్రపంచాన్ని ఏలాలనుకుంటున్నారు, అగ్రరాజ్యముగా మారాలనుకుంటున్నారు. చివరకు ప్రజల నాశనాన్ని చూడాలనుకొంటున్నారు. దేవుని మాటనుబట్టి దురాశ గర్భము ధరిస్తే, దాని కడుపున పాపము ఉంటుంది. ఆ పాపము జన్మించి, పరిపక్వమయితే అది మరణముకు దారితీస్తుంది. అణురియాక్టర్లను కడుతున్నారు, అణుబాంబులను తయారుచేసుకొంటున్నారు. రక్షణ విభాగంలో అణుబాంబులకు సంబంధించి ఎన్నింటినో తమ తమ అంబులపొదిలో దాచుకుంటున్నారు. క్రమంగా వాటి సంఖ్యను పెంచుకొంటున్నారు. దీని వలన ఏం జరుగుతుందో తెలుసా? మరణం! చివరకు దాని ఫలితం ఖచ్చితంగా మరణమే. ఎందుకంటే, ఇక్కడ సమస్తమును కలిగించిన సృష్టికర్తకు స్థానం లేదు. 2011లో జపాన్ దేశం దానినే చవిచూసింది. ఇంకా ఎన్నోదేశాలు ఆయాకాలాలలో దీనిని అనుభవించాయి. అయినా ఇంకా, ఈ ప్రపంచానికి బుద్ధి రాలేదు. వారికి బుద్ధికలగాలి అంటే, బుద్ధిని కలిగించే మాటలు వారి దగ్గరుండాలి. ఆ మాటలు వారికి ఎవరో ఒకరు చెప్పగలిగి ఉండాలి. వారి దగ్గర అలాంటి వారు లేరు. యురేనియం నిక్షేపాలను దాచుకొందాం, మన శక్తిని పెంచుకొందాం అని ఆలోచిస్తున్నారే తప్ప, దేవుని వాక్యమును పట్టించుకోని ఈ దుశ్చర్య ఒక దురాశ అని వారు గ్రహించుకోలేకపోతున్నారు.

**కీర్తనలు 7 : 14- 'పాపమును కనుటకు వాడు ప్రసవవేదన పడుచున్నాడు. చేటును గర్భమున ధరించినవాడై అబద్ధమును కనియున్నాడు. వాడు గుంట త్రవ్వి దానిని లోతు చేసియున్నాడు. తాను త్రవ్విన గుంటలో తానే పడిపోయెను. వాడు తలంచిన చేటు వాని నెత్తిమీదికే వచ్చును. వాడు యోచించిన బలాత్కారము వాని నడినెత్తి మీదనే పడును.'** అణుపరిశోధన ద్వారా పాపమును, తద్వారా మరణమును కనుటకు ఈ రోజు మనిషి ఒక రకంగా చెప్పాలంటే, ప్రసవవేదన పడుచున్నాడు. ఈ అణుపరిశోధన ఒక లోతైన గుంట వంటిది. ఈరోజు మనిషి తాను నడిచే దారిలో పాతాళమంత లోతైన గుంటను త్రవ్వుకున్నాడు. పాపము పండే సరికి ఆ గుంటలో పడిపోతున్నారు. దేవుని దగ్గరకు రాకపోతే తాను త్రవ్వుకొన్న గుంటలో తానే పడిపోతాడు. మనిషి తన స్వయంకృతాపరాధము చేత తన్ను తాను శిక్షించుకొంటున్నాడు. ఎందుకంటే మనిషిది దురాశ. వాడు తలంచిన చేటు వాడి నెత్తి మీదకే వచ్చింది. వాడు యోచించిన బలాత్కారము వాడి నడినెత్తి మీదనే పడింది. ఇది పరలోకపు తండ్రియైన దేవుని తీర్మానం. దేవుని దగ్గరకు రాని దేశాలు, ఆయన దగ్గర యోచించని ప్రజలు ఏమైపోతారో తెలుసా? నాశనానికి చేరువైపోతారు. అణుపరిశోధనలు చేస్తూ ఏదో నాలుగు డబ్బులు సంపాదించాలని అనుకొంటున్నారు, ప్రపంచంలో తాము అగ్రగాములుగా ఉండాలి అనుకొంటున్నారు. కాని చివరికి జరిగేదేంటి? కీడు, నాశనం, మరణం! తండ్రియైన దేవుడు తన దగ్గరకు రావాలని తన గ్రంథములో ఎన్నోసార్లు ఈ ప్రజలకు ఆహ్వానాన్ని తెలియజేసాడు. ఆయన దగ్గరకు వస్తే ప్రయోజనం ఏమిటో ఆయనే చెబుతున్నాడు. ఆయన మాటలను వినమని ఆయన తెలుపుతున్న ఒకానొక మంచి ఆహ్వానాన్ని చూడండి.

**లేవీయకాండము 26 : 3- 'మీరు నా కట్టడలను బట్టి నడుచుకొని నా ఆజ్ఞలను ఆచరించి వాటిని అనుసరించి ప్రవర్తించినయెడల మీ వర్షాకాలములలో మీకు వర్షమిచ్చెదను, మీ భూమి పంటలనిచ్చును, మీ పొలములచెట్లు ఫలించును, మీ ద్రాక్ష పండ్ల కాలము వరకు మీ నూర్పు సాగుచుండును, మీరు తృప్తిగా భుజించి మీ దేశములో నిర్భయముగా నివసించెదరు.'** ఈ భూమిమీద ఒక మనిషి జీవనానికి ఇంతకంటే కావలసింది ఏమిటి చెప్పండి. మనము వేటిని సంపాదించుకోవాలి చెప్పండి. మన దగ్గర ఉండవలసిన నిధి నిక్షేపాలు ఏమిటి చెప్పండి. మన దగ్గర దేవుడు ఉన్నాడని, దానిని బట్టి మనము అతిశయించాలి. అప్పుడు మిగిలిన ప్రతి ఒక్కరు లైనులో నిలబడతారు. ఒకని దగ్గర దేవుని మాటను ఉంచుకుంటే, దేవుని జ్ఞానమును తాను ప్రకటించగలిగితే అదే అతని గొప్పతనం. అప్పుడు అణురియాక్టర్లు కలిగినవాడైనా సరే, వాని

పాదాలమీద పడిపోవల్సిందే. ఎందుకంటే దేవుని మాటకు అంత శక్తి ఉంది. న్యూక్లియర్ పదార్థానికి అంత శక్తి లేదు. ఒకవైపు యురేనియం ఇచ్చే శక్తి ఎంత? మరోవైపు దేవుడు సృష్టించిన సూర్యుడు ఇచ్చే శక్తి ఎంత? భూమిలో ఉన్న ఓ చిన్న ఖనిజం, ఆ ఖనిజంలో ఉన్న అణుశక్తి ఎంత చెప్పండి. రవ్వంత దాని కొరకు మనిషి ఆలోచిస్తున్నాడు. కాని సర్వశక్తి సమూహాలను సృష్టించినటువంటి పరలోకమందున్న తండ్రి కొరకు ఆలోచించలేకపోతున్నాడు. ఆనాడు ఇశ్రాయేలీయులతో దేవుడు పలుకుతున్న ఆ మాటలను చూడండి. వారు దేవుని కట్టడలను బట్టి నడుచుకొని ఆయన ఆజ్ఞలను ఆచరించి వాటిని అనుసరించి ప్రవర్తించినయెడల, వారి వర్షాకాలంలో వారికి దేవుడు వర్షమిస్తాడు. ఈ రోజు మనిషి దగ్గర అణుపరిశోధన ఉన్నంత మాత్రాన వర్షాకాలంలో వర్షము రాకపోతే పంటలన్నీ ఎండిపోతే, ఆ అణుపరిశోధనతో మనిషి ఏమి చెయ్యగలడు? యురేనియంతో తిండి గింజలు పుడతాయా? దేవుడు మనిషికి ఆ తిండిగింజలే లేకుండా చేస్తే అప్పుడు మనిషి ఏమవుతాడు? అందుకే దేవుడు తన కట్టడలను అనుసరించి వాటి ప్రకారము ప్రవర్తించినయెడల మీ వర్షాకాలంలో మీకు వర్షమిచ్చెదను, మీ భూమి పంటలనిచ్చును, మీ పొలముల చెట్లు ఫలించును, మీ ద్రాక్షపండ్ల కాలము వరకు మీ నూర్పు సాగుచుండును అంటున్నాడు. అప్పుడు మీరు తృప్తిగా తిని మీ దేశములో నిర్భయముగా నివసించెదరు. ఈ రోజు ఒక దేశం మరొక దేశాన్ని చూచి ఎందుకు భయపడుతోంది? దేని నిమిత్తం ఈ భయం? ఈరోజు ఉత్తర కొరియా దగ్గర అణునిక్షేపాలు ఉన్నాయని అమెరికా భయపడుతోంది. పాకిస్తాన్ దగ్గర అణునిక్షేపాలు ఉన్నాయని ఇండియా భయపడుతోంది. రష్యా, చైనాల దగ్గర అణుబాంబులున్నాయని ప్రపంచ దేశాలు భయపడుతున్నాయి. ఈ ప్రపంచ దేశాలకు దేని నిమిత్తము భయపడాలో, దేని నిమిత్తము భయపడవలసిన అవసరం లేదో తెలియదు. ఒకని యొద్ద దేవుడుంటే, వానియొద్ద దేవుని వాక్యముంటే అతడు నిర్భయంగా ఉంటాడు. సర్వశక్తి స్వరూపాలను సృష్టించిన దేవుడు అండగా ఉంటే ఇక దేని అవసరత ఉంది? ఈ కనీసపు జ్ఞానము నేడున్న దేశాలకే లేదు. గనుక ఎన్.ఎస్.జి. సభ్యత్వం కోసం ఎదురుచూస్తున్నారు. దేవున్ని ప్రక్కన పెడుతున్నారు. అణుపరిశోధన వలన ఒక మనిషికి క్షేమమా? లేక ఒక దేశానికి క్షేమమా? ఒకవేళ అదే నిజమనుకుంటే ప్రపంచంలో ఇప్పటికే సుమారు 48 దేశాలు అణుపరిశోధన చేస్తూ ఎన్.ఎస్.జి. సభ్యత్వంలో ఉన్నాయి కదా. అలాగని వాటికేమైనా క్షేమం ఉందా? లేనే లేదు. అవి అంతర్యుద్ధాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కరువుకాటకాలతో విలవిలలాడుతున్నాయి. భయంకరమైన ప్రకృతి వైపరీత్యాలతో అతలాకుతలమవుతున్నాయి. వాటికే క్షేమము లేనప్పుడు మిగిలిన దేశాలు ఎందుకు ఇంకా పడిగాపులు కాస్తున్నాయి? దేవునిమాట దగ్గరకు నేటి సమాజం రాలేకపోతుంది. దేశంగా, రాష్ట్రంగా, ప్రాంతంగా, కుటుంబముగా ఏ ఒక్కరూ దేవుని దగ్గరకు రాలేకపోతున్నారు. కాని ఆయన మాటలు మాత్రం ఈ సమాజానికి ఎంత మేలుకొల్పుగా ఉన్నాయో చూడండి. లేవీయకాండము 26 : 6వ వచనంలో ఆయన ఏమంటున్నాడో జాగ్రత్తగా పరిశీలించండి. తాము నివసిస్తున్న దేశంలో తమకు క్షేమము కలుగజేసెదనని దేవుడు చెబుతూ, మీరు పండుకొన్నప్పుడు ఎవడును మిమ్ములను భయపెట్టడని, తమ దేశములో దుష్ట మృగములు లేకుండా చేసెదనని, తమ దేశములోకి ఖడ్గమే రాదని తెలియజేస్తున్నాడు. కాని ఇదంతా ఎప్పుడు జరుగుతుంది? వారు దేవుని మాటలను విని, వాటి ప్రకారము ప్రవర్తించినప్పుడు మాత్రమే! నేటి కాలంలో భయపడుతున్న దేశాలన్నీ యురేనియం నిల్వలు వేరే దేశాల నుండి కొనుక్కొని తెచ్చుకోవాలని ఆశ పడుతున్నారు. అణురియాక్టర్లను దిగుమతి చేసుకోవాలనుకుంటున్నారు. వీటి వలన చివరకు ఒరిగేదేమిటో తెలుసా? నష్టం! ఒక దేశము క్షేమకరముగా ఉండాలంటే తమ దగ్గర ఉండవలసింది దేవుని జ్ఞానము మాత్రమే!

ప్రసంగి 6 : 12 **'నీడవలె తమ దినములన్నియు వ్యర్థముగా గడుపుకొను మనుష్యుల బ్రదుకునందు ఏది వారికి క్షేమకరమైనదో యెవరికి తెలియును? వారు పోయిన తరువాత ఏమి సంభవించునో వారితో ఎవరు చెప్పగలరు?'** ఈరోజు మనుష్యులు వారి దినములను నీడవలె వ్యర్థముగా గడుపుకొంటున్నారు. అణుపరిశోధన చేద్దామా? అణు రియాక్టర్లు స్థాపించుకొందామా? శక్తి స్వరూపాలు కలిగిన దేశముగా మనము ఎదుగుదామా? ప్రపంచదేశాల నడుమ మనము కూడా న్యూక్లియర్ శక్తిని కలిగినవారమని చెప్పుకొందామా? అని ఆలోచిస్తున్నారు. మనుష్యుల వింత ప్రవర్తన ఎలా ఉందో చూడండి. ఇలా నీడవలె తను దినములన్నియు వ్యర్థముగా గడుపుకొను మనుష్యుల బ్రతుకునందు ఏది

వారికి క్షేమకరమో వారికి తెలియదని దేవుడు సెలవిచ్చాడు. నిజంగా అణుపరిశోధన ఒక దేశానికి క్షేమకరమైనదా? శక్తి నిక్షేపాలను తమ దగ్గర పెంచుకోవటం తమకు క్షేమకరమైనదా? భారీనిల్వలను తమ దగ్గర ఉంచుకోవటం తమకు క్షేమకరమైనదా? లేక దేవుని మాటలను వారు పాటించి, మిగిలిన దేశాలకు నీతి విషయంలో మాదిరిగా ఉండటం క్షేమకరమైనదా? అందుకే దేవుడు ప్రసంగి ద్వారా చెబుతున్నాడు. నీడవలె తమ దినములన్నియు వ్యర్థముగా గడుపుకొను మనుష్యుల బ్రతుకునందు ఏది వారికి క్షేమకరమైనదో ఎవరికి తెలియును. అంటే ఎవ్వరికీ తెలియదని అర్థము. అందుకే ఆయా పరిస్థితులలో దేవుని చేతిలో ఈ దేశాలు చావుదెబ్బలు తింటున్నాయి. సునామీ రూపంలో, భూకంపాల రూపంలో, కరువుకాటకాల రూపంలో ఈరోజు ఆయా దేశాలు చావు దెబ్బలు తింటున్నాయి. ఒక ప్రక్క సాంకేతికంగా అభివృద్ధి చెందామని చెప్పుకొంటున్నారు, మరో ప్రక్క ఏదైనా ఒక ప్రకృతి వైపరీత్యం వస్తే గడగడలాడిపోతున్నారు. మా దగ్గర అపారమైన సాంకేతిక పరిజ్ఞానము ఉందని చెప్పుకొంటున్న యు.ఎస్.ఎ. ఒక చిన్నపాటి తుఫాను వస్తే, వచ్చిన తుపానుకొక పేరు పెట్టుకొని ఈ తుపాను వలన మేము భారీగా నష్టపోయామని చెప్పుకొంటున్నారు. ఏమి? అమెరికా ఒక అగ్రదేశం కదా! మరి అమెరికాకు ఎందుకొచ్చిందా నష్టం? ఆ దేశానికెవరు కలిగించారు నష్టం? అమెరికాను భయపెట్టగలిగిన వారు ఎవరు? అమెరికాను గడగడలాడించగలవారు ఎవరు? అవును! ఉన్నారు. అగ్రరాజ్యాలైన రష్యా, చైనా వంటి దేశాలను గడగడలాడించగలిగిన వారు ఉన్నారు. ఆయనే దేవుడు! ఈ ప్రపంచంలో ఏ దేశమైనా ఆయనకు లెక్కలేదు. అది జపాన్ అయినా లేక కొరియా అయినా! నీడవలె తమ దినములన్నియు వ్యర్థముగా గడుపుకొంటూ, వారికి క్షేమకరమైనదేదో వారికి ఎవరు తెలియజేతురు? మనిషి ఈ భూమిమీద శరీరసంబంధమైన బ్రతుకులో 70, 80 సం.ల జీవితకాలం మట్టుకే ఆలోచిస్తున్నాడు. కాని వారు పోయిన తరువాత వారికి ఏమి సంభవించునో వారితో ఎవరు చెప్పగలరు? ఆ రహస్యాలను ఎన్.ఎస్.జి. చెబుతుందా? అణుపరిశోధన వలన ప్రమాదం వాటిల్లినప్పుడు మనుష్యులు తమ ప్రాణాలను కోల్పోతే, ఆ మనుష్యులు పోయిన తరువాత ఏమి జరుగుతుందో ఈ ఎన్.ఎస్.జి.లోని సభ్యత్వ దేశాలలో ఎవరైనా చెప్పగలరా? చెప్పలేరు. నిత్యజీవపరిశోధనలో తప్ప ఇంకెక్కడా ఇలాంటి సందర్భాలు ఇలాంటి సమాధానాలు మనుష్యులకు ఎవ్వరూ తెలియచేయలేరు. అది కేవలం దేవుని వాక్యముతోనే సాధ్యం. దేవుని జ్ఞానాన్ని పరిశోధిస్తున్న వారి మధ్యనే ఆ ప్రశ్నకు సమాధానము సాధ్యమవుతుంది. దేవుడు ఏ మనిషికైతే తన మహాజ్ఞానాన్ని ఇవ్వాలనుకొన్నాడో ఆ మనిషి ద్వారా మాత్రమే చెప్పించగలడు. ప్రపంచంలో ఇంకెంత పెద్ద అధికారి ఉన్నా సరే ఆయనకు లెక్క లేదు. ఎందుకంటే ఆయన దేవుడు; ఆయన సర్వోన్నతుడు! ప్రపంచ దేశాలన్నింటిని ఆయన గమనిస్తూ, ఏ దేశమైనా తన మాటల దగ్గరకు వస్తుందా అని ఆయన ఇంకా దీర్ఘశాంతంతోనే ఎదురు చూస్తున్నాడు. ఈ పాఠమును ప్రపంచదేశాలు నేర్చుకుంటే వారికి క్షేమము కలుగుతుంది.

**మీకా 2 : 7 'యాకోబు సంతతి వారని పేరు పెట్టబడినవారలారా, యెహోవా దీర్ఘశాంతము తగ్గిపోయెనా? యీ క్రియలు ఆయనచేత జరిగెనా? యదార్థముగా ప్రవర్తించువానికి నా మాటలు క్షేమసాధనములు కావా?'** అని అంటున్నాడు దేవుడు. మనిషి దగ్గర స్వార్థం ఉంటే ఆ స్వార్థమే తన్ను మరణానికి చేరువ చేస్తుంది. మనిషి దగ్గర దురాశ ఉంటే ఆ దురాశ పాపముగా మారి మరణానికి తన్ను చేరువ చేస్తుంది. కాని యదార్థముగా ప్రవర్తించు వాని యదార్థతను గూర్చి దేవుడు ఈ విధముగా మాట్లాడుతున్నాడు. యదార్థముగా ప్రవర్తించు వానికి ఆయన మాటలు ఎలా ఉంటాయో చూడండి. అవి క్షేమ సాధనములుగా ఉంటాయి. ప్రకృతిలో దొరికిన ఒక న్యూక్లియర్ పదార్థం యురేనియం. ఆ పదార్థాన్ని ఎలా వినియోగించుకోవాలో నిర్దేశించే అధికారము కలిగిన దేశాలు ఒక గ్రూపుగా ఏర్పడ్డాయి. ఆ గ్రూపులో చేరడానికి మిగిలిన దేశాలన్నీ పోటీపడుతున్నాయి. దేవుని మాటలు నేర్చుకోవటానికి గాని, దేవుని మాటలను నిధినిక్షేపాలుగా వారి దగ్గర ఉంచుకోవడానికి గాని ఎక్కడా గ్రూపులు లేవు. వర్డ్ ఆఫ్ గాడ్ గ్రూప్ ఎక్కడైనా ఉందా? లేదు. ప్రపంచ దేశాలలో దేవుని వాక్యం ఎక్కడుంది? శాస్త్రయుక్తంగా దేవుని వాక్యాన్ని నేర్చుకొనే భక్తులు ఎక్కడున్నారు? లేరు. ఏదో రెండు మూడు గంటలు గుడికి వెళ్లడం, ఏదో తాము సంపాదించిన దానిలో కొంత దేవుని పేరిట అర్పించడం, ఆ తర్వాత ఇంటికి వెళ్ళిపోవడం! నరులు పోయిన తర్వాత ఏమి జరుగునో వారికి తెలియదు గనుక భక్తులంతా ఇదే బానీలో ఉన్నారు.

ప్రియులారా! ఈ ప్రపంచానికి తెలియని సంగతులను దేవుడు తన గ్రంధములో వ్రాయించి మనుష్యులకు మేల్కొల్పుగా వాటిని తెలియజేస్తున్నాడు. యదార్థముగా ప్రవర్తించు వానికి దేవుని మాటలు క్షేమసాధనములు. దేవుని మాటకు క్షేమాన్ని సాధించే శక్తి ఉంది. సర్వసమాజాన్ని క్షేమంగా ఉంచే శక్తి ఉంది. దేవుని ఆదరణ మనిషికి తోడుగా ఉన్నప్పుడు మనిషి ఏ ఒక్కరికీ భయపడవలసిన అవసరం లేదు. మిగిలిన దేశాలన్నీ న్యూక్లియర్ నిక్షేపాలతోఎదిగిపోతున్నాయని భయపడవలసిన అవసరం దేనికి? అంతకంటె శక్తివంతమైన దేవుని మాటలు ఎవరి దగ్గర ఉంటే వారే శక్తిమంతులు. ఒకని దగ్గర దేవుని యదార్థత ఉన్నప్పుడు వాడే క్షేమంగా ఉన్నట్టు! అందుకే బైబిల్ లోని మాటలను మతసంబంధమైనవిగా చూడకూడదు. అవి కేవలం ఆదివారం రెండు గంటలు మాత్రమే చర్చించుకోవటానికో, భజన చేసుకోవటానికో మాత్రం కాదు. ఆయన మాటలు మనుష్యులకు క్షేమసాధనములు. అవి ఒక ప్రాంతానికి క్షేమసాధనములు; ఒక రాష్ట్రానికి క్షేమసాధనములు; ఒక దేశానికి క్షేమసాధనం; మొత్తంగా ఈ ప్రపంచమంతా ఆయన మాటలు వింటే ఈ ప్రపంచానికి క్షేమసాధనములు. ఇంత గొప్ప దేవుని మాటలను మనిషి ఏనాడు ఆలోచిస్తాడు? ఎప్పటికి మేల్కొంటాడు? నేటికీ ఇంకా అణుపరిశోధన వెంటే వెళ్లిపోతున్నాడు. దేవుని మాటల చెంతకు మనిషి ఏనాడొస్తాడు? ఆ దేవుని మాటలే సర్వసృష్టిని కలిగించాయి. దేవుని మాటలంటే మనిషికి ఇంకా అంత చులకన ఎందుకు? సత్యము తెలియక అభాగ్యులై, మూర్ఖులై దేవుని మాటల్లోవున్న ఆ శక్తిని ఎరుగక పాతాళానికి జారిపోతున్నారు.

**యిర్మీయా 7 : 23 'నా మాటలు మీరు అంగీకరించినయెడల నేను మీకు దేవుడనై యుందును మీరు నాకు జనులైయుందురు; మీకు క్షేమము కలుగునట్లు నేను మీకు ఆజ్ఞాపించుచున్న మార్గమంతటియందు మీరు నడుచుకొనుడి.'** మనుష్యులు దేవుని మాటల దగ్గరకు వచ్చినప్పుడు, ఆయన మాటలను అంగీకరించినప్పుడు ఆయన వారికి దేవుడై యుండును, వారు తనకు ప్రజలైయుందురు. వారికి క్షేమము కలుగునట్లుగా, దేవుడు వారికి ఆజ్ఞాపించు మార్గమంతటియందు వారు నడుచుకోవాలి. ఆ మార్గమంతా ఇదిగో, బైబిల్‌లో ఈ 66 పుస్తకాలలో ఉంది. ఆదికాండము మొదలుకొని మలాకి(39), మత్తయి సువార్త మొదలుకొని ప్రకటనగ్రంథము(27) మొత్తంగా 39+27=66 పుస్తకాలలో ఆయన మార్గమున్నది. ఆయన మార్గమునందు మనుష్యులంతా నడుచుకోవాలి. ఎందుకంటే ఈ ప్రపంచానికి క్షేమం కలగాలి గనుక! భయం గుప్పిట్లో నివసిస్తున్న దేశాలు క్షేమాన్ని కోరుకుంటున్నప్పుడు, ఆ క్షేమం ఎలా వస్తుంది? ఆ క్షేమాన్ని ఎలా సాధించగలరు? కేవలం దేవుని మాటల ద్వారా మాత్రమే సాధించగలరు. కనుక దేశాలన్నీ తమ తమ అంబులపాదిలో దేవుని మాటలను కూర్చుకోవాలి. వారి రక్షణకు సంబంధించిన అంబులపాదిలో ఏవో చిన్న చిన్న బాంబులు, తుపాకులు, యుద్ధసామాగ్రి కాదు. ఐక్యరాజ్యసమితిగా ఉన్నవారు ఈ విషయంపై దృష్టిని సారిస్తే, ప్రపంచశాంతి క్షణాల్లో వస్తుంది. ఏ దేశముయొక్క అంబులపాదిలో దేవుని మాటలుంటాయో ఆ దేశానికి మిగిలిన దేశాల వలన ఏమాత్రం భయం ఉండదు. ఆ దేశానికి దేవుడు ఒక రాజుగా ఉంటాడు. నిజంగా ఏ ఒక్కదేశమైనా ఈ విధంగా ఉంటే మిగిలిన ప్రపంచం నివ్వెరపోయి ఆ దేశము యొక్క పాదాల మీద పడాల్సిందే. ఎందుకంటే, ఏ ఒక్కరి దగ్గరా లేని దేవుని జ్ఞానము వారి దగ్గర ఉన్నందుకు ప్రపంచమంతా వారి దగ్గరకు వస్తుంది. కానీ ఏ ఒక్క దేశం కూడా ఆ విధంగా లేదు. మాకు అణుపరిశోధన కావాలి, మేము అణురంగంలో అభివృద్ధిని సాధించాలి, మేము కూడా ఏదో రోజున నాశనం అవ్వాలని కోరుకుంటున్నారే తప్ప దేవుని చెంతకు మాత్రం రాలేకపోతున్నారు. కోట్లరూపాయల ప్రజా ధనాన్ని ఈ అణుపరిశోధన నిమిత్తం ఇంకా ఖర్చు చెయ్యాలని ఆలోచిస్తున్నారు. ఎవరండీ వీరికి బుద్ధి చెప్పేది? ప్రజలు అణురియాక్టర్లు వద్దని ఉద్యమాలు చేస్తే వీరి మనస్సు మారుతుందా? విప్లవకారులు ఆందోళన చేస్తే వీరి మనస్సు మారుతుందా? కేవలం దేవుని మాటలు మాత్రమే దీనికి సరైన ఔషధం. అందుచేత దేవుని వాక్యమును చెప్పి మాత్రమే వీరిని మార్చాలి. దేవుని జ్ఞానము చేత వీరిని సరైన మార్గము లోనికి తీసుకొనిరావాలి. విషయము తెలియక, సత్యము అర్థంకాక, ఒకనాటి సుఖానుభవమును కోరుకుంటూ వారు తప్పుడు మార్గములో ప్రయాణం చేస్తున్నారు. కానీ దేవుని యొద్దకు రాకుండా, అణుపరిశోధన వలన ఎప్పటికీ వారు క్షేమాన్ని సాధించలేరు. కేవలం దేవుని మాటలను నేర్చుకోవటం వలన, దేవుని జ్ఞానమును కలిగి ఉండటం వలన, తమ అంబులపాదిలో దేవుని మాటలను ఉంచుకోవడం వలన మాత్రమే వారు క్షేమాన్ని సాధించగలరు.

**యెషయా 48 : 18 'నీవు నా ఆజ్ఞలను ఆలకింపవలెనని నేనెంతో కోరుచున్నాను. ఆలకించినయెడల నీ క్షేమము నదివలెను, నీ నీతి సముద్రతరంగములవలెను ఉండును.'** దేవుని మాటలను పాటించినప్పుడు ఒకని క్షేమము ఏ విధముగా ఉంటుందో దేవుడు తెలియజేస్తున్నాడు. ఆ క్షేమమును ఆరిపోని, ఎండిపోని నదితో పోల్చి చెబుతున్నాడు. అది సముద్ర తరంగములవలె ఎల్లప్పుడు ఉప్పొంగుతూనే ఉంటుంది. ఇక అణుపరిశోధన, అణుశక్తి అంటారా! అది మనుష్యుల దగ్గర ఉన్నంతవరకే ఉపయోగపడుతుంది. ఆ నిక్షేపాలు అయిపోతే మనిషి చేతులెత్తేస్తాడు. ఈ లోపు ఏదైనా ప్రమాదము సంభవిస్తే తన చుట్టూ ఉన్న జనులందరూ మరణిస్తారు. కాని దేవుని మాటలు ఎలా ఉంటాయో చూడండి. అవి క్షేమకరములు. అందుకే ఆయన మనుష్యులను తన ఆజ్ఞలను ఆలకింపవలెనని ఎంతో కోరుచున్నాడు. ఈ విషయంలో దేవుని ఆశ ఇంత అంత కాదు. ఆయన మాటలను ప్రజలు ఆలకించాలని, వాటి ప్రకారం ప్రజలు ప్రవర్తించాలని, దేశాలన్నీ ఆయన మార్గములోనికి రావాలని ఆయనకున్న కోరిక చాలా గొప్పది. దాని వలన వచ్చే ఫలితాన్ని కూడా ఆయన చెబుతున్నాడు. ఆ ఫలితమును గమనించైనా ఆయన మార్గములోకి మనుష్యులు రావాలని ఎంతో కోరుకుంటున్నాడు. ఏ దేశమైతే దేవుని మాటల ప్రకారం ప్రవర్తిస్తుందో, ఆ దేశము యొక్క క్షేమము ఒక నదివలె నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. సముద్ర తరంగముల వలె ఎల్లప్పుడూ ఎగిసిపడుతూనే ఉంటుంది. ఈ ప్రపంచంలో ఎన్నో గ్రంథాలయాలలో ఎన్నో పుస్తకాలు, ఎన్నో మాటలు ఉన్నా వాటిలో ఇలాంటి దేవుని సంగతులు లేవు. మనిషిని హెచ్చరించే సంగతులు లేవు. ఒక మనిషి ఏమి చెయ్యాలో, తానెలా నివసించాలో తనకు మార్గనిర్దేశకాలను ఇచ్చే సంగతులు లేవు. అవి కేవలం బైబిల్‌లో మాత్రమే ఉన్నాయి. దేశాలు ఎలాంటి మార్గములో నడుచుకోవాలో అనే సంగతులన్నీ బైబిల్‌లో మాత్రమే ఉన్నాయి.

**యిర్మీయా 2 : 37 'చేతులు నెత్తిని బెట్టుకొని ఆ జనమునొద్దనుండి బయలువెళ్లెదవు; యెహోవా! నీ ఆశ్రయములను నిరాకరించుచున్నాడు. వాటివలన నీకు క్షేమము కలుగదు.'** దేవుని మాటల దగ్గరకు రాకపోతే, ఆయన మహాజ్ఞానాన్ని ఆశ్రయించకపోతే, ఇంకా యురేనియం నిల్వలే కావాలి అనుకొంటే, ఇప్పటికీ ఎన్.ఎస్.జి. గ్రూప్‌లో సభ్యత్వము కావాలి అనుకుంటే, ఇంకా అణుపరిశోధనలనే చేస్తాను అనుకుంటే... వారు తమ చేతులు నెత్తిని పెట్టుకొని బయలుదేరుదురు. దేవుడు తమ ఆశ్రయములను నిరాకరించుచున్నాడు. అణురియాక్టర్ కట్టాలంటే నిరాకరించేది ప్రజలు కాదు; ముందు పరలోకంలోనే నిరాకరణ జరుగుతోంది. అణురియాక్టర్లను నిర్మించుకోవడానికి దేవుడు పరలోకంలో ఆమోదముద్ర వేసాడా? అవును, మనిషి చేసే పనికి ప్రతి పనికి, పరలోకంలో దేవుని ఆమోదముద్ర పడాలి. అప్పుడు అది భూమిమీద పది కాలాలపాటు క్షేమముగా ఉంటుంది. ఒకవేళ దేవుడు నిరాకరిస్తే వారు ఎంత చేసినా, ఎన్ని ప్రణాళికలు రచించినా, దాని వలన మాత్రం లాభమును సంపాదించలేరు. వారు మధ్యలోనే ఆరిపోతారు. ఎందుకంటే, దేవుని వాక్యములో ఈ విధముగా వ్రాయబడింది. 'భూమియందు ఏది విప్పబడునో అది పరలోకమందు విప్పబడును; భూమియందు ఏది బంధింపబడునో అది పరలోకమందు బంధింపబడును.' ఇది దేవుడు ఆయన సంఘానికి ఇచ్చినటువంటి ఆధిక్యత. పరలోకంలో దేవుని మనస్సులో ఉన్న ఆయన మాటలను ఆయన సంఘము ద్వారా ఈ సమాజానికి నేర్పిస్తున్నాడు. ఇక్కడి మనుష్యుల చేష్టలకు అక్కడ నిరాకరణ ముద్ర పడిందంటే, ఈ భూమిమీద వారు ఏమీ చెయ్యలేరు. ఎందుకంటే, యెహోవా వారి ఆశ్రయములను నిరాకరించుచున్నాడు. క్షేమము వారి దగ్గర నుండి వెళ్లిపోతుంది. వారు అపాయములో పడిపోతారు. దురాశ వలన వారు పాపమును చేస్తున్నారు. ఆ పాపము పరిపక్వమై వారు మరణానికి చేరువ అవుతున్నారు. ఇప్పటికైనా వారు కళ్లు తెరవాలి. ఈ మాటలు చదివిన తర్వాతైనా వారు కళ్ళు తెరవాలి. మరి ఇప్పుడు ఏం చెయ్యమంటారు? అని దేవున్ని అడిగితే ఆయన ఏమంటున్నాడో తెలుసా? ఇదిగో సర్వశ్రేష్ఠ గ్రంథమయిన బైబిల్ యొద్దకు వెళ్లమంటున్నాడు. ఆయన మాటల ప్రకారం ప్రవర్తించమంటున్నాడు. ఆయన చిత్తమును నెరవేర్చమంటున్నాడు. ఏ మాటలనైతే ఈ మంచి పుస్తకంలో దేవుడు వ్రాయించాడో వాటి ప్రకారం మనుష్యులు ప్రవర్తించిననాడు వారి వర్షాకాలంలో వారికి వర్షాన్ని ఆయనే ఇస్తాడు. వారి భూమి పండేలా ఆయనే చేస్తాడు. వారి కడుపు నిండేలా ఆయనే చేస్తాడు. భూమి మీద వారి బ్రతుకు దినములన్నియు క్షేమకరముగా ఉండేటట్లు ఆయనే పరలోకంలో ఆమోదముద్ర వేస్తాడు. దేవుడు తన సంఘము ద్వారా ఈరోజు దానిని ఈ సమాజానికి నేర్పిస్తున్నాడు. విన్నవాడు క్షేమము లోనికి వెళతాడు; నిరాకరించినవాడు క్షేమానికి దూరం

అవుతాడు. నిర్ణయం వారిదే!

--------×-------

## **ప్రశ్నలు**

**1)** అణు పరిశోధన విషయములో ఈ ప్రపంచపు పోకడ ఏమిటి? వివరించండి.

**2)** దురాశ పాపమును, పాపము మరణమును ఏలాగు వెంబడించుచున్నవో తెలియజేయండి.

**3)** 'తాను త్రవ్విన గుంటలో తానే పడిపోయెను' అని దేవుడు ఎవరిని గూర్చి వ్రాయించాడు? వివరించండి.

**4)** దేవుని కట్టడలను బట్టి నడచుకొనువానికి కలిగే బహుమానము ఏమిటి?

**5)** దేవుని మాటలు యదార్థవంతులకు క్షేమసాధనములని వివరించండి.

**6)** శాస్త్రవేత్తల పరిశోధనలు వాక్య విరుద్ధముగా ఉన్నప్పుడు వారి ప్రయత్నాలకు భంగపాటు తప్పదని - అణుపరిశోధనను ఉదాహరణగా తీసుకొని నిర్ధారించండి.

**7)** దేవుడు లేని సమాజమును ఆయన ఏలాగు శిక్షకు అప్పగిస్తాడో తెలియజేయండి.

# 13. భారత్ మాతాకీ జై.. అనాలా? వద్దా?

ఇది భారతీయులందరికీ సంబంధించిన ఒక అద్భుతమైన పాఠము. భారతదేశము భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగిన దేశము. అనేక రాష్ట్రాలు, అనేక భాషలు, అనేక జాతులు ఒకే దేశములో కలిసికట్టుగా సామరస్యతతో నివసించే దేశమే భారతదేశము. ప్రపంచములో మిగిలిన ఏ దేశానికీ ఇటువంటి గొప్పతనము లేదనే చెప్పాలి. భారతీయులంతా అనేక ఆచార వ్యవహారాలు కలిగిన వారైనప్పటికీ వారంతా ముక్కలైపోకుండా ఒకే ప్రభత్వం క్రింద, ఒకే రాజ్యాంగము క్రింద జీవిస్తూ, మేము భారతీయులం అనే ఒక గొప్ప నినాదంతో బ్రతుకుతున్నారు. భారతీయులంతా సోదరభావంతో కలిసిమెలిసి జీవిస్తున్న ఈ తరుణంలో కొందరు వ్యక్తులు వారి వారి స్వార్థ ప్రయోజనాల కోసం భారతీయులలో ఒకరి మధ్య ఒకరికి కొన్ని బలహీనమైన కారణాలను సృష్టించి గొడవలు పెడుతున్నారు. ఇందులో ముఖ్యంగా రాజకీయ నాయకులను, విద్యార్థి సంఘాల నాయకులను పావులుగా చేస్తూ వారి చేత ప్రశాంతంగా ఉన్న భారతదేశంలో అల్లకల్లోలాలను సృష్టిస్తున్నారు. భారతీయులను గ్రూపులు గ్రూపుగా విడగొట్టి, శాంతిని భగ్నం చేసి తద్వారా ప్రయోజనాలను పొందాలన్నదే శత్రుమూకల కోరిక. ప్రతి చిన్న దానిని వారి లబ్దికోసం పెద్ద సమస్యగా మారుస్తున్నారు. గోరుతో పోయే దానిని గొడ్డలి వరకు తెచ్చినట్టు అన్న రీతిగా ప్రతి చిన్న దానిని మీడియాలో చూపిస్తూ, వాటిని ఒక గొడవగా మారుస్తూ దానిపై ఒక చర్చ జరిపి, రచ్చ చేసి దేశంలో ఎలాగైనా సరే గొడవలు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. అలాంటి వాటిలో ఒకానొక సందర్భమే ఇప్పుడు మీరు నేర్చుకోబోతున్నటువంటి పాఠం!

'భారత్‌మాతాకీ జై' అనాలా, వద్దా? ఇటీవల భారతదేశ ప్రజలందరి మదిలో దీనిని గూర్చిన సందేహం, చర్చ మొదలైంది. భారతీయులలో కొందరు జై అనాలని, కొందరు జై అనవలసిన అవసరం లేదని రెండు వర్గాలుగా విడిపోతున్నారు. కనుక, 'భారత్‌మాతాకీ జై' అనాలా, వద్దా? అనే విషయమును జాగ్రత్తగా పరిశీలించి దేవుని జ్ఞానానుసారముగా చెప్పగలిగితే దీనికి పరిష్కారము దొరుకుతుంది. మంచి పరిష్కారమును వివరించిననాడు 'భారత్‌మాతాకీ జై' అనమని ఏ ఒక్కరినీ బలవంతము చేయవలసిన / బ్రతిమిలాడవలసిన అవసరం లేదు. ఎందుకంటే, విషయమును వివరించిన తరువాత ప్రతి ఒక్కరూ హృదయపూర్వకముగా దానిని అంగీకరిస్తారు. వాక్‌స్వాతంత్ర్యము కలిగిన ఈ భారతావనిలో మనము ఏ ఒక్కరినీ బెదిరించకూడదు, అలాగని బ్రతిమిలాడవలసిన అవసరమూ లేదు. కానీ విషయమును వివరించకుండా ఈ మధ్యకాలంలో కొంతమంది ఈ సంగతిని ప్రక్కదోవ పట్టిస్తున్నారు. 'భారత్‌మాతాకీ జై' అనాలంటే ఎందుకు అనాలో, లేక 'భారత్‌మాతాకీ జై' అనవలసిన అవసరం లేదంటే ఎందుకు అనక్కరలేదో తెలియజేయాలి. అప్పుడు భారతీయులు తమ విజ్ఞతతో తగిన నిర్ణయం తీసుకుంటారు.

ఇటీవల ఒక పెద్దాయన భారతదేశములో నివసిస్తున్న ప్రతి భారతీయుడు తప్పనిసరిగా 'భారత్‌మాతాకీ జై' అని తీరాల్సిందే అని తన ప్రసంగంలో అన్నాడు. భారతీయులుగా పుట్టిన వారందరూ 'భారత్‌మాతాకీ జై' అనాలి అని అన్నాడు. ఆయనే ప్రస్తుత రాష్ట్రీయ స్వయంసేవక్ (ఆర్.ఎస్.ఎస్.)లో ముఖ్యకార్యదర్శియైన శ్రీ మోహన్ భగవత్ గారు. ఈయన నాగపూర్ పట్టణంలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించి అందులో భాగముగా ఈ ప్రకటన చేసాడు. దీనికి ఒక కారణం ఉంది. అదేమిటంటే ఆ ప్రకటనకు ముందు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటిలో కన్హయ్య కుమార్ అనే ఒక విద్యార్థి నాయకుడు భారతదేశం మీద విపరీతమైన వ్యాఖ్యలు చేసాడనే నెపంతో అరెస్టు చేయబడి, విడుదల చేయబడ్డాడు. ఇలా విడుదల చేసిన సందర్భంలో, అది నచ్చనటువంటి మోహన్ భగవత్, కన్హయ్య కుమార్‌లా ఇంకెవ్వరూ తయారవ్వకూడదనే ఉద్దేశ్యంలో చేసిన ప్రకటన అది. ఈ విధంగా వచ్చిన సందర్భంలో, మోహన్ భగవత్ గారు భారతదేశంలో నివసిస్తున్నటువంటి ప్రతి వ్యక్తి భారతమాతను పూజించాలని, 'భారత్‌మాతాకీ జై' అనాలి అని చెప్పాడు. పోనీలే పెద్దాయన తన మనోభావాన్ని చెప్పాడు అనుకుంటే అక్కడితో కథ సుఖాంతమయ్యేది; కానీ అలా అవ్వలేదు. ఈ విషయాన్ని టి.వి.

మీడియా / పత్రికా మీడియా / దేశ విదేశాలలో ప్రసారం చేసారు. ఒకవైపు కన్హయ్య కుమార్ విడుదలను, మరోవైపు మోహన్ భగవత్ గారి వ్యాఖ్యలను చూపిస్తూ ఈ వార్త జనుల దగ్గరకు మోసుకెళ్లారు. ఇక ఇది చూచిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో ఉన్న హైదరాబాద్‌లో పాతబస్తీకి చెందిన ఎం.ఐ.ఎం. నేత శ్రీ అసదుద్దీన్ ఒవైసీ (ప్రస్తుత ఎం.పీ.) ముంబై పట్టణానికి తన పని మీద వెళ్లి అక్కడ నిర్వహించిన ఒక కార్యక్రమంలో 'నా పీకమీద కత్తి పెట్టినా నేను భారత్‌మాతాకీ జై అని మాత్రం అనను' అన్నాడు. ఎందుకంటే, భారత దేశ రాజ్యాంగంలో ఎక్కడైనా, ఏ సెక్షన్‌లో అయినా భారత్‌మాతాకీ జై అని ప్రతి భారతీయుడు అనాల్సిందే అని వ్రాయబడి ఉందా? అని ఈయన అడుగుతున్నాడు. అంటే అసదుద్దీన్ ఒవైసీ గారికి మోహన్ భగవత్‌గారు చేసిన ప్రకటన నచ్చలేదన్నమాట. ఇలా భారతదేశ ప్రజలకు ఏది న్యాయమో తెలియక, ఎవరి మాటలు సత్యమో అర్థంకాక, ఎవరికి నచ్చినవారి వైపుకు వారు వెళ్లి వారిని అనుకరిస్తున్నారు. ఒకవైపు మోహన్ భగవత్ గారివైపు ఆలోచిస్తే అది సబబుగా ఉన్నట్టు కనిపిస్తుంది, మరోవైపు అసదుద్దీన్ ఒవైసీ గారివైపు ఆలోచిస్తే అది కూడా నిజమే కదా అనిపిస్తుంది. ఇంతకి వీరిద్దరికి మధ్య ఒక క్రైస్తవునిగా నేను చెప్పవలసిన న్యాయం ఏమిటి? భారతదేశ క్షేమము కొరకు నేను చెప్పవలసిన ధర్మం ఏమిటి? భారతదేశ ప్రజలలో ఎందరో ఇస్లాంను స్వీకరించినవారున్నారు; హైందవులుగా జీవిస్తున్నవారున్నారు; క్రైస్తవులుగా బ్రతుకుతున్న వారున్నారు. ఇంకా ఆయా మత విశ్వాసాలను అవలంబిస్తున్నట్టుగా బౌద్ధులుగా ఉన్నారు, జైనులుగా ఉన్నారు, సిక్కులుగా ఉన్నారు. దేనినీ ఆచరించని నాస్తికులు కూడా ఉన్నారు. ప్రియులారా! బైబిల్‌ను చేతపట్టినటువంటి నేను ఇలాంటి ప్రశ్నలకు సమాధానాన్ని చెప్పగలనా? లేక అల్లెలూయా అని పాట పాడుకుంటూ ఇంటికి వెళ్ళిపోవడమేనా? నాకు తోచినది, నచ్చినది ఏదో ఒక ప్రసంగాన్ని తయారుచేసుకొని, దానిని వల్లించి, భజన చేసుకొని ఇంటికి వెళ్ళిపోవడమేనా క్రైస్తవ్యమంటే? కాదు. పక్షపాత ధోరణి లేకుండా అనగా, మోహన్ భగవత్ గారు తన పక్షాన మాట్లాడినట్లుగా గాని, అసదుద్దీన్ ఒవైసి గారు తన పక్షాన మాట్లాడుకొన్నట్టు గాని, లేక మరెవరో వారికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడినట్లుగా గాని నేను నా పక్షాన మాట్లాడటానికి వీలులేదు. దేవుని వాక్య ప్రకారం ఏది న్యాయమైనదో, ఏది నిత్యజీవార్థమైనదో దానిని మాత్రమే నేను మాట్లాడాలి. నిజంగా క్రైస్తవుడు ఈ ప్రపంచ దేశాలలో ఉన్న సమస్యలన్నిటికి పరిష్కారాన్ని చూపగలగాలి. ఆ స్థాయిలో దేవుడు ఒక క్రైస్తవున్ని చూడాలనుకొన్నాడు. క్రైస్తవుడు నోరు విప్పితే సమాజాన్ని బాగుచేసే మాటలు మాత్రమే రావాలని దేవుడు ఆశించాడు. కానీ నేడున్న క్రైస్తవ్యంలో అటువంటి ఫలములు దేవునికి ఎవరిలోనూ కనిపించడం లేదు. ఎండిపోయిన చెట్టుగా ప్రతీ ఒక్కరూ మారిపోయారు. వాళ్ల డప్పు వాళ్లు కొట్టుకుంటూ, ఎన్నాళ్ళుగానో దేవుని వాక్యమును చెబుతున్నవారు, వింటున్నవారు కూడా దేవునికి భిన్నంగా నడుచుకుంటున్నారు.

ఒకనాడు యాకోబు కుమారుడైన యోసేపు, ఫరో యొద్ద అధికారిగా నియమింపబడినప్పుడు ఆ రాజ్యానికి సంబంధించిన సమస్యలను దేవుని జ్ఞానమును బట్టి పరిష్కరిస్తున్నాడు. అలాగే, దానియేలు తన చిన్ననాటే యూదుల చెరలోనికి వెళ్లి బబులోను రాజ్యంలో ఒక దాసునిగా కనిపిస్తున్నాడు. కానీ, దానియేలు నోరు విప్పితే ఎలాంటి మాటలు వచ్చేవో తెలుసా! బబులోను దేశంలో ఉన్నటువంటి ఎందరో గొప్పగొప్పవారు, జ్ఞానులు, వివేకులు మొదలగువారెవ్వరికీ తెలియనటువంటి రహస్యాలను దానియేలు మాత్రమే దేవుని జ్ఞానముతో చెప్పగలిగేవాడు. ఇలాంటివారందరినీ మనము బైబిల్‌లో చూస్తున్నాము. కానీ నేటి క్రైస్తవులు వారివలె బ్రతకలేకపోతున్నారు, వారివలె ఆలోచించలేకపోతున్నారు. ఎప్పుడు చూచినా ఒక వ్యక్తికి ఉన్న చిన్న చిన్న రోగాలు, సమస్యలను గూర్చి ప్రార్థించాలి, ప్రవచించాలి అనుకునే నేటి నామకార్థ క్రైస్తవ్యానికి దేవుని మహా జ్ఞానము అందేదెన్నడో? ఈ ప్రపంచంలో అన్నింటికంటే ముఖ్యమైనది ఏమిటో తెలుసా? యెహోవా యందు భయభక్తులు, దాని వలన వచ్చే దేవుని జ్ఞానమును కలిగి ఉండటమే. దీని తర్వాతే ఏదైనా! మీరు సంపాదించే ధనమైనా, మీరు కట్టుకొన్న ఇల్లైనా, మీరు చేసుకొనే పెళ్ళైనా, ఇక ఏదైనా...! పరలోకమందున్న దేవుడు తన పిల్లలను గొప్ప స్థాయిలో చూడాలని అనుకుంటున్నాడు. కానీ, పాతాళానికి పోయే జాబితాలో నేటి మనుష్యులున్నారు.

నేటి భారతదేశంలో ఇప్పుడు ఒక సమస్య వచ్చిపడింది. కొందరేమో 'భారత్ మాతాకీ జై' అనమంటున్నారు. మరికొందరేమో తమ పీక మీద కత్తి పెట్టినా అలా అనము అంటున్నారు. కనీసం దీనిని గూర్చిన వార్తలను ప్రచురించడానికి

కూడా నేటి పత్రికా మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వెనకడుగువేస్తూ భయపడుతోంది. ఏమి మాట్లాడితే ఎవరు వారిపై దాడి చేస్తారోనని వారి భయం. ఇంతకీ ఈ విషయమై వారైనా ఏం మాట్లాడగలరు? వారి దగ్గరేమైనా దేవుని జ్ఞానము ఉందా? ఎక్కడైనా ఏదైనా వార్త జరిగితే దానిని తెర మీద చూపిస్తారు తప్ప దేవుని జ్ఞానాన్ని నేర్పించలేరు. ఇక విషయంలోనికి వెళితే, 'భారత్‌మాతాకీ జై' అనాలని మోహన్ భగవత్ గారు, పీక మీద కత్తిపెట్టినా అలా అనని అసదుద్దీన్ ఒవైసీ గారు అంటుంటే, వీరి మధ్యలోనికి మరొకడు వచ్చాడు. అతడే పతంజలి అధినేత బాబా రామ్‌దేవ్ గారు. ఇంతకీ ఇతనేమి అంటున్నారంటే, నా దగ్గర బోలెడు కత్తులున్నాయి, వచ్చి 'భారత్ మాతాకీ జై' అని అననే వారి పీకలు కోసేస్తాను, సిద్ధంగా ఉండండి అంటున్నాడు. చూసారా! ఈ సమస్యకు పరిష్కారమును చెప్పాల్సింది పోయి, జ్ఞానము లేనివారు, తెలియనివారు దానిని ఇంకా జఠిలం చేస్తున్నారు. అయ్యో! ఒక మనిషి ఒక వాక్యమును నీవు కోరినట్టుగా చెప్పనందుకు, పీకలు కోసేస్తావా? భారతదేశ రాజ్యాంగం దానిని సమర్ధిస్తుందా? 'భారత్ మాతాకీ జై' అనలేదని నిజంగా పీకలు కోసేస్తే, ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం అతడు నరహంతకుడవుతాడు. 'భారత్ మాతాకీ జై' అని అనను అంటున్నాడంటే, అతడు ఎందుకు అనను అంటున్నాడో తెలుసుకుని, ఎందుకు అనాలో తెలిసేలా వారికి జ్ఞానమును నేర్పించాలే తప్ప పీకలు కోసేస్తారా? జ్ఞానము లేనివారు తొందరపాటుతో, అవివేకముతో ఇలాంటి మాటలే మాటలాడతారు. ఒకవైపు ప్రభుత్వం దీనికి సరైన పరిష్కారమును చెప్పలేదు. మరోవైపు లోకజ్ఞానులు దీనికి సమాధానమును చెప్పలేదు. ఇక మిగిలిన సామాన్య ప్రజలంటారా.. వారి గురించి తెలిసిందే కదా! అసలైన వారి దగ్గరే జ్ఞానము లేకపోతే ఇక సామాన్యుల దగ్గర ఏముంటుంది చెప్పండి. ఎవరేమి చెబుతారో చూచి తెలుసుకోవడమే తప్ప జనులకు తెలిసిందేమీ లేదు. ఇలాంటి పరిస్థితులలో ఇప్పుడు మరి ఎవరు చెప్పాలి సమాధానం? ఈ ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోవాలా? మోహన్ భగవత్ చెప్పినది నిజమా? అసదుద్దీన్ ఒవైసి చెప్పినది నిజమా? అసలు భారతదేశంలో నివసిస్తున్న ప్రజలు ఎలాంటి నిర్ణయంలో ఉండాలి? 'భారత్ మాతాకీ జై' అనాలన్నది సత్యమైతే ఖచ్చితంగా అని తీరాలి. ఒకవేళ అది సత్యదూరమైతే అనవలసిన అవసరం లేదు కదా. దీనిని గూర్చి తరాలలో యుగాలలో ప్రపంచ దేశాల సమస్యలు తీర్చిన దేవున్ని అడుగుదాం. అనగా, ఆయన గ్రంథములోనికి వెళదాం.

**దానియేలు 2 : 28 'మర్మములను బయలుపరచగల దేవుడొకడు పరలోకమందు ఉన్నాడు. అంత్యదినములయందు కలుగబోవు దానిని ఆయన రాజగు నెబుకద్నెజరునకు తెలియజేసెను.'** ఈ రోజు భూమిమీద మనుష్యులకు తెలియని ఎన్నెన్నో మర్మములున్నాయి. వాటిమీద ఎవ్వరూ పెదవి విప్పటం లేదు. ఉదాహరణకు, తల్లి గర్భములోనికి మనిషి ఎలా ప్రవేశిస్తున్నాడు? మనిషి మరణించిన తరువాత ఏమి జరుగుతుంది? ప్రకృతిలోని శక్తులన్నీ క్రమం తప్పకుండా జరగడానికి కారణమెవరు? వీటిపై ఎవ్వరూ చర్చించరు. ఎవరికి వారు వారికి తెలిసినది, వారికి నచ్చినది సరిపెట్టుకుని వెళ్ళిపోతున్నారు. చిన్న చిన్న చెత్త చెత్త విషయాలను గూర్చి ప్రతిరోజు చర్చించుకునే ఈ లోకానికి విలువైనవాటి కొరకు చర్చించే సమయం లేదు. నిజంగా దైవ మర్మములు మనుష్యులకు అర్థమయితే, వాటిలో ఉన్న రహస్యాలు మనిషి తెలుసుకుంటే, ఆ మనిషి నీతికి చేరువవుతాడు, దేవునికి దగ్గరవుతాడు. అప్పుడు ప్రతి దేశం బాగుపడుతుంది. ప్రపంచశాంతి నెలకొల్పబడుతుంది. ఈ రోజు ఎక్కడ చూచినా రక్తసిక్తమైన ప్రాంతాలు మనకు కనిపించటానికి కారణం ఏమిటి? ఆయా ప్రాంతాలలో దేవుని మాట నెరవేరకపోవటమే దానికి ప్రధాన కారణం. అందుకే మనుష్యులు నరరూపరాక్షసులుగా తయారువుతున్నారు. ఒకడిని ఒకడు చంపుకొంటున్నారు. భవిష్యత్తులో జరుగబోయేదైనా, చరిత్రలో జరిగినదానినైనా, వర్తమానంలో నీవెలా ఉండాలి అన్నదానినైనా పరలోకంమందున్న దేవుడు తెలియజేస్తాడు. మర్మమయిన దానిని ప్రజలకు అర్థమయ్యే రీతిలో చాలా గొప్పగా ఆయన నేర్పిస్తాడు. ఆనాడు దానియేలు అనే ప్రవక్త ఈ భూమిమీద నివసించిన కాలంలో, బబులోను దేశానికి చక్రవర్తులుగా ఉన్నటువంటివారికి, ఎంతో ఉన్నతవిద్యను నేర్చుకున్నటువంటివారికి కూడా దేవుని మర్మములు తెలియదు. అలాంటి మర్మములను తెలియజేయాలంటే పరలోకమందున్న దేవునికి మాత్రమే అది సాధ్యమంటున్నాడు.

ఇప్పుడు మనము అలాంటి ఒక మర్మమైన 'భారత్‌మాతాకీ జై' అనాలా, వద్దా? అనుదానిని వెతకడానికి

ఈ పాఠంలో ఆలోచిద్దాం. ఇంతకీ ఈ భారత్‌మాత ఎవరు? ఆమె ఎలా ఉంటుంది? ఆమె వయసెంత? ఆమె ఏ కాలంలో పుట్టింది? క్రీస్తు శకము ఏ కాలంలో ఆమె వచ్చింది? క్రీస్తు శకము ఏ కాలంలో ఆమె వెళ్ళిపోయింది? ఆమె ఎక్కడ సమాధి చేయబడింది? ఇలాంటి విషయాలకు సమాధానాలు ఎక్కడా లేవు. అసలు భారత్‌మాత అనే వ్యక్తిత్వం పురుషుడా, స్త్రీ యా? భారత్‌మాత అనేది భారతదేశంలో ఉన్న మనిషి ఊహలలో ఉన్న ఊహా చిత్రం మాత్రమే. భారతీయులు తమ ఆలోచనలలో, తాము నివసిస్తున్న దేశంపై ఉన్న భక్తిభావంతో ఏమనుకున్నారంటే, భారతదేశ భూభాగమంతా ఒక 'మాత'లాంటిది అనుకున్నారు. అంతే తప్ప భౌతికంగా ఎక్కడా ఈ మాత ఉనికిలో లేదు. తెలుగు రాష్ట్రానికి సంబంధించిన 'తెలుగు తల్లి' కూడా సరిగ్గా ఈ కోవకు చెందినదే. భారతదేశంలో ఉన్న సుమారు 30 రాష్ట్రాలలో ఈ భారతమాత మనకు ఎక్కడా కనిపించదు. అక్కడ పుట్టినట్టుగా, అక్కడ జీవించినట్టుగా, అక్కడ సమాధి చేయబడినట్టుగా, ఫలానా కాలంలో ఆమె జీవితకాలము ఉన్నట్టుగా ఎక్కడా కనిపించదు. మరి ఇంతకీ ఈ భారత్‌మాత ఎవరు? మనిషి ఊహాచిత్రమైన భారతమాత ఫొటోలో కిరీటం పెట్టుకుని, భారతదేశ జెండాను పట్టుకుని నిలబడియున్న ఆ స్త్రీ మూర్తి రూపం ఎవరిది? ఆ ఫోటో చిత్రకారుని ఆలోచనల్లోంచి పుట్టింది మాత్రమే. భారతదేశమాతను మీరు కించపరుస్తున్నారా అని మీరు నన్ను గూర్చి పొరపాటు పడవద్దు. ఇక్కడ నేను మర్మమైన దానిని వెలికితీసే ప్రయత్నమును చేస్తున్నాను.

ఇక్కడ పాఠకులు గుర్తించవలసిన ముఖ్యమైన విషయం ఒకటుంది. అదేమిటంటే, దేవుడు దేశ పరిరక్షణను ఎప్పుడూ కాదనలేదు. దేశాన్ని కాపాడవద్దని దేవుడు ఈనాడూ ఏ ఒక్కరికీ చెప్పలేదు. నిజంగా ఆయన మహాజ్ఞానమును అర్థం చేసుకొంటే ఒక దేశ నివాసి తన దేశము యెడల ఎలా ఉండాలో అర్థమవుతుంది. పరిశీలనగా లోతులకువెళ్ళి మాట్లాడితే నిజంగా ఆలోచిస్తే నేను నివసిస్తున్న భారతదేశాన్ని ప్రేమించే వారిలో నాకంటే ఎక్కువగా ఎవ్వరూ ప్రేమించరేమో అన్నట్టుగా నా ప్రవర్తన ఉంటుంది. కేవలం భారత్‌మాతాకీ జై! అని చెప్పిన వారిని నిజభారతీయులుగా గుర్తించడానికి వీలులేదు. పైకి భారత్‌మాతాకీ జై! అని చెప్పి, నిజానికి భారతదేశాన్ని దోచుకుంటున్నవారున్నారు జాగ్రత్త! నేనైతే ఈ భారతదేశాన్ని చాలా ఎక్కువగా ప్రేమించాను. ఎందుకంటే నేను భారతీయుడను. నేను ఎందుకు ప్రేమించగలుగుతున్నానంటే నాకు దేవుడు తెలుసు. దేవుని జ్ఞానమును పొందినవారు తప్పకుండా తమ దేశముయెడల మంచి ప్రవర్తనను కలిగి ఉంటారు. ఇంతకీ, దేశమంటే ఏమిటి? దేశమంటే మట్టి కాదు; దేశమంటే మనుష్యులు! నేను నా దేశాన్ని ప్రేమించినవాడను. తన సహోదరుని కొరకు ప్రాణము పెట్టేటంతగా తోటివారిని ప్రేమించాలి. దీనినే దేవుడు నాకు నేర్పించాడు. కనుక నేను భారతదేశాన్ని(భారతదేశ ప్రజలును) హద్దులు లేకుండా ప్రేమిస్తున్నాను; కొలతలులేకుండా ప్రేమిస్తున్నాను. ఎవరైతే భారతదేశాన్ని ప్రేమిస్తున్నాను అని చెప్పుకుంటున్నారో వారందరికంటే ఒక రెట్టు ఎక్కువగా నేనే ప్రేమిస్తున్నాను. మీరు దేవున్ని ప్రేమించేవారైతే, దేశాన్ని కూడా ఎల్లప్పుడూ ప్రేమిస్తారు. ఏందుకంటే, దేశమనగా మట్టికాదు; దేశమంటే మనుష్యులు. మరి ఇంతకీ భారతమాత ఎక్కడ నుంచి వచ్చింది? దేశాన్ని ప్రేమించమని చెప్పవచ్చు, చెప్పాలి కూడా. దేవుడు తన గ్రంథములో వ్రాయించిన ధర్మశాస్త్ర సారాంశము కూడా అదే. అదేమంటే, నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించాలి! భారతదేశాన్ని భారతీయులంతా ప్రేమించాలి; ప్రపంచ దేశాలలో నివసిస్తున్న ప్రజలంతా తమ తమ దేశాలను ప్రేమించాలి. కానీ, ఇంతకీ ఈ భారతమాత ఎవరు? ఇక్కడ అపవాది అయినవాడు ఎంత కుటిలతతో ఆలోచించాడంటే, భారతదేశ ప్రజలు ఒకరిని ఒకరు ప్రేమించుకోకుండా చేసేలా ఒక మాతను సృష్టిద్దామనుకున్నాడు. వాడు భారతదేశ ప్రజలు ఒకరిని ఒకరు కొట్టుకొనేలా చేసి, పైకి దేశభక్తి నినాదాన్ని వినిపిద్దామనుకున్నాడు. నేడు అదే జరుగుతోంది. అందుకే, అసదుద్దీన్ ఒవైసీ భారత్‌మాతాకీ జై అని అనను అంటున్నాడు, బాబా రామ్‌దేవ్ కత్తితో నరికేస్తానంటున్నాడు. వీరిద్దరి మధ్య దేశభక్తి ముసుగులో జగడమును పుట్టించడానికి కొందరు దేశద్రోహులకు ఉపయోగపడుతున్న ఊహా చిత్ర రూపమే ఈ భారత మాత. మనకు భారతదేశం ఒక భూభాగంగా కనిపిస్తుంది, భారతదేశంలో నివసిస్తున్న ప్రజలు కనిపిస్తున్నారు. భారతమాత మాత్రం ఫోటోలో మాత్రమే కనిపిస్తుంది. చరిత్రలో ఆమె ఉనికి ఎక్కడా లేదు. 1947 భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ గారు కనిపిస్తున్నారు తప్ప భారతమాత కనిపించడం లేదు. అందుకే, గాంధీ గారంటే మనకిష్టం. సుభాష్‌చంద్రబోస్ గారు, భగత్‌సింగ్ గారు... ఇలా ఎందరో స్వాతంత్ర్య సమరయోధులంటే మనకిష్టం. ఇక్కడ ప్రశ్నేమిటంటే, భారతమాత ఎక్కడ నుంచి వచ్చింది? ఈ సందర్భంలో అపవాది తంత్రమును గూర్చి దేవుడు వ్రాయించిన

ఒక మంచి వాక్యమును మీకు జ్ఞాపకం చేస్తాను.

**కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 4 : 4 'దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగసంబంధమైన దేవత అవిశ్వాసులైనవారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను.'** ఏ క్రీస్తు స్వభావమైతే ప్రతి మనిషిలో కనిపించాలో ఆ స్వభావమును లేకుండా చేయడమే ఈ యుగసంబంధమైన దేవత చేసే పని. క్రీస్తు స్వభావము మనుష్యుల్లో కనిపిస్తే ప్రతి ఒక్కరూ వారి వారి సహోదరులను ప్రేమిస్తారు; అనగా తమ దేశాన్ని ప్రేమిస్తారు. అవసరమైతే తమ పొరుగువారి కొరకు ప్రాణం పెట్టేస్తారు. అటువంటి క్రీస్తు సువార్త ప్రకాశము మనుష్యులకు ప్రకాశింపకుండు నిమిత్తము ఈ యుగసంబంధమైన దేవత, అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గ్రుడ్డితనమును కలుగచేసింది. ఈ రోజు మనుష్యులు ఎలా గ్రుడ్డివారైపోయారంటే, తమ మధ్య నివసిస్తున్న తమ సహోదరులను చంపాలనుకొంటున్నారు. మట్టిని ప్రేమించాలనుకొంటున్నారు. మట్టిని ప్రేమించి, మనిషిని ద్వేషించడమే అసలైన గ్రుడ్డితనం. దేశాన్ని ప్రేమించాలి అని చెబుతున్నవాడు, తన పొరుగువాని పీక కోయాలనుకుంటున్నాడు. అపవాదియైనవాడు మనుష్యులచే ఒక దేవత బొమ్మను సృష్టింపచేసి, ఆ దేవతకు జై కొడితే భారతదేశాన్ని ప్రేమించినట్టే అంటున్నాడు. భారతమాత రూపానికి దండ వేయాలని చెబుతున్నాడు కానీ, భారతీయులను కత్తితో నరకమని చెబుతున్నాడు. ఇది నిజమా! ఇది ధర్మమా? ఇటువంటి మనస్సు నిజంగా సమాజ శ్రేయస్సును కోరుకుంటుందా? ఇలా మాట్లాడటం వల్ల రెండు వర్గాల మధ్య విభేధాలు రావంటారా? వారు వీరు ఒకరినొకరు కొట్టుకోరా? చంపుకునే వరకు వెళ్లిపోరా? ఒవైసీ తరుపున కొంతమంది ఉంటారు, భగవత్ తరుపున మరికొంతమంది ఉంటారు. వారు అలా మాట్లాడుతున్నప్పుడు వారి మాటలు విన్నటువంటి ప్రజలు ఈలలు, గోలలు చేసి వారి మాటలకు ప్రేరణ చెందుతున్నారు. ఆ తరువాత వారు ఖాళీగా ఉంటారా? అవకాశము కొరకు ఎదురుచూసి దాడులు చేస్తారు. ఈ లోకంలో అపవాదియైనవాడు ఎంత ఘోరంగా ఆలోచిస్తున్నాడో చూడండి. ఈ సమాజాన్ని అరణ్యముగా మార్చి, మనుష్యులను ఎలా మట్టుపెడుతున్నాడో చూడండి. అందుకే దేవుడు భవిష్యత్తును ఉద్దేశించి, ఈ యుగసంబంధమైన దేవత మనుష్యుల మనోనేత్రాలకు గ్రుడ్డితనాన్ని కలుగజేస్తుందని ముందుగా తెలియజేసాడు. ఇక క్రీస్తు సువార్త ప్రకాశము వీరికి తెలిసేదెలా? ఆ సత్య సువార్త వారి జీవితాలలో ప్రకాశించేలా వారి మనో నేత్రాలను తెరవాలి. భారతదేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ ప్రేమను చూపించాల్సింది ఒక బొమ్మకు కాదని, తమ చుట్టూ ఉన్న భారతీయులకని తెలుసుకునేలా వారి మనోనేత్రాలను తెరవాలి. భారతదేశమంటే భారతీయులే తప్ప ఒక ఆకారము కాదు. భారతదేశమంటే ఒక విగ్రహం కాదు, ఒక చిత్రపటము కాదు. భారతదేశము అంటే ఒక మాత కానే కాదు. భారతదేశము అంటే ప్రజలు; వారే భారతీయులు. ఇండియా అంటే ఇండియన్స్. వి ఆర్ ఇండియన్స్. వి లవ్ ఇండియన్స్. అంతవరకు వెళితే ఇండియన్స్ కొరకు ప్రాణం పెట్టడానికైనా నేను, మనము సిద్ధముగా ఉండాలి. అదే మన ప్రేమ. ప్రియులారా! ఇప్పుడు దేశాలను గూర్చి దేవుడు తన గ్రంథములో ఎటువంటి వివరములను పొందుపరిచాడో చూద్దాం. ఏ విధంగా వ్రాయిస్తున్నాడో ఆయన గ్రంథంలో తెరచి చూద్దాం. చరిత్రలో అసలు దేశమనేది ఎప్పుడు పుట్టింది? దేశాన్ని గూర్చిన సంగతులేమిటి? పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌ను తెరవగానే ఆదికాండము మొదటి అధ్యాయములో దేవుని సృష్టి కార్యక్రమాన్ని చూస్తున్నప్పుడు ఆయన మనకు ఆరిన నేలను భూమిగా పరిచయం చేస్తున్నాడు. ఆనాడు దేవుని మనస్సులో పుట్టిన ఆ సద్భావానికి, ఆయన పలికిన ఆ గాంభీర్యమైన మాటకు 'ఆరిన నేల' కనిపించింది. ఆ నేల మీదనే ఈరోజు మనము నివసిస్తున్నాము. ఆ నేలను గూర్చి మనము దేశ ప్రేమ ముసుగులో కొట్టుకోకూడదు. ఆ నేల మీద మనము బ్రతకాలని దేవుడు కోరుకున్నాడు. ఆ నేలను సృష్టించిన విధమును గూర్చి దేవుడు వ్రాయించిన గ్రంథమును మనం ఆలోచన చేద్దాం. ఆరిన నేలను దేవుడు సృష్టించి, మనుష్యుల చేతికి దానిని అప్పగించి, వారిని విస్తరించి ఆ భూమిని నిండించమని చెప్పాడు. ఆ క్రమంలో మనుష్యులు అనేకులుగా విస్తరిస్తున్నారు. ఆరిన నేలగా ఉన్న ఈ భూభాగాన్ని వారు దేశాలుగా విభజిద్దామని అనుకున్నారు. దానిని గూర్చి తెలుసుకుంటూ ముందుకు వెళదాం.

**ఆదికాండము 10 : 25 'ఏబెరుకు ఇద్దరు కుమారులు పుట్టిరి. ఒకనిపేరు పెలెగు; ఏలయనగా, అతని దినములలో భూమి దేశములుగా విభాగింపబడెను.'** ఇంతకీ ఈ భూమి దేశములుగా ఎప్పుడు విభజింపబడిందంటే, ఏబెరు

కాలములోనన్నమాట. అతడు తన కుమారునికి పెలెగు అనే పేరు దానినిబట్టే పెట్టినట్టుగా చరిత్ర చెబుతోంది. ఆ దేశాలే పెరిగి పెరిగి ఇప్పుడు ప్రపంచ పటంలో సుమారు 200 లకు పైగా కనిపిస్తున్నాయి. ఖండాలు, దేశాలు, రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, పట్టణాలు, పల్లెలు,... ఇలా భూమి విభాగింపబడింది. విభజింపబడిన తరువాత దేశంపై ప్రేమ, రాష్ట్రంపై ప్రేమ, జిల్లాపై ప్రేమ, మన ప్రాంతంపై ప్రేమ పెరిగింది. కాని మనిషి ఒక్కసారి వెనక్కి వెళితే, ప్రారంభకాలానికి వెళితే, దేవుడు సృష్టించిన ఈ భూమి, ఆరిన నేలగా మాత్రమే కనబడుతోంది. ఈ ఆరిన నేలే భారతదేశంలో ఉన్న నేల, అదే పాకిస్తాన్‌లో ఉన్ననేల, అదే చైనాలో ఉన్న నేల, అదే అమెరికాలో ఉన్న నేల. మనుష్యులు విస్తరించిన తరువాత వారే దీనిని విభజించుకున్నారు; వారి నివాస ప్రాంతానికి సరిహద్దులు గీసుకున్నారు; ఆ సరిహద్దులలో కాపలా పెట్టుకుంటున్నారు; దేశ రక్షణ కోసం ఆలోచిస్తున్నారు. ఈ దేశములుగా విభాగింపబడిన ఆరిన నేల యొక్క సృష్టి ఎవరిది అంటే, చరిత్రను త్రవ్వి వెనక్కి వెళితే ఇది పరలోకమందున్న దేవునిది. అందుకే ఏ దేశంలో ఏ సమస్య వచ్చినా వెంటనే దేవుని దగ్గరకు వెళ్లాలి. ఎందుకంటే ఆయన దీనినంతటిని సృష్టించినవాడు, దీనికంతటికి మొదటివాడు ఆయన మాత్రమే!

**కీర్తనలు 24 : 1 'భూమియు దాని సంపూర్ణతయు, లోకమును దాని నివాసులును యెహోవావే!'** మొదట ఆరిననేల కనబడునుగాక! అని దేవుని మాట పలికింది. అలాగే ఆరిన నేల కనిపించింది. అది మంచిదని దేవుడు చూసాడు. ఆ ఆరిన నేలమీద తన మనుష్యులు జీవించాలని దేవుడు అనుకున్నాడు. ఆ తరువాత ఏబెరు కాలములో నేల దేశములుగా విభాగింపబడింది. ఆ తరువాత ఆయన భూమియు దాని సంపూర్ణతయు కేవలం తనవేనని, లోకమును దాని నివాసులును తన వారేనని స్పష్టం చేస్తున్నాడు. భూమియు దాని సంపూర్ణతయు అనగా, ఈ భూమిలో ఏదైతే ఇమిడి ఉన్నదో అదంతా అని అర్థం. భూమి అనగా కేవలం చవుడు నేల ఒక్కటే కాదు అందున్న సమస్తము ఆయనదే. అలాగే, ఆ నేలమీద నివసిస్తున్న మనుష్యులంతా ఆయన వారే. భూమి దేశాలుగా విభజింపబడినప్పుడు ఆ దేశాలన్నీ దేవునివే. విభాగింపబడిన దేశాలు ఆయనవైనప్పుడు, ఆయా దేశాలలో నివసిస్తున్న ప్రజలు ఆయన వారైనప్పుడు, ఆయన చెప్పిన మాటల ప్రకారము వారంతా నడచుకోవాలన్నది న్యాయం. ఎందుకంటే, ప్రపంచ పరిపాలకుడు, పోషకుడు ఆయనే! ఇక్కడ లోకములో మనము చూస్తున్న మనుష్యుల పరిపాలనంతా ఒక నాటకం వంటిది. పరలోకమందున్న దేవుడు తన భూమిని ఎవరు ఎంతకాలం పరిపాలించాలంటే వారికి ఆ అవకాశమును ఇస్తాడు. తన ప్రజలను పరిపాలించటానికి ఆయన కొంతమంది అత్యల్పులైన మనుష్యులకు ప్రజాధికారమును ఒక ఉద్యోగంగా ఇస్తున్నాడు. అంతే తప్ప వారు నీతిమంతులనో వారు పరలోకానికి వస్తారనో కాదు. వారిలో అనేకమంది అనీతిమంతులనీ, వారందరూ ఆయా పదవులను డబ్బుకోసం, ఆస్తికోసం, ఆధిపత్యం కోసం, పేరు పలుకుబడుల కోసం మాత్రమే అలంకరిస్తున్నారని దేవునికి తెలుసు. కాని నిజంగా నీతిమంతులైన దేవుని పిల్లలకు ఇలాంటివి అప్పజెప్పితే ఇక దేవుని రాజ్య వ్యాప్తి ఎక్కడ జరుగుతుంది. అందుకే దేవుడు నీతిమంతులచేత ఆయన పనిని జరిగిస్తున్నాడు. అత్యల్ప మనుష్యులకేమో పరిపాలనా అవకాశమును ఇస్తున్నాడు. అనేకమంది పరిపాలకులకు ఇది అర్థంకాక తాము తమ సొంత బలము చేత సంపాదించుకున్న అధికారమనుకుంటున్నారు. కానే కాదు. ఆరిననేల దేవునిది, విభాగింపబడినటువంటి దేశములు ఆయనవి, ఆ దేశముల మీద అధికారమును దేవుడు ఎవరికి ఇస్తే అది వారికి కలుగుతుంది.

**దానియేలు 4 : 17 'ఈ ఆజ్ఞ జాగరూకులగు దేవదూతల ప్రకటననుసరించి జరుగును. నిర్ణయమైన పరిశుద్ధుల ప్రకటననుసరించి సంభవించును. మహోన్నతుడగు దేవుడు మానవుల రాజ్యముపైని అధికారియైయుండి తానెవరికి అనుగ్రహింపనిశ్చయించునో వారికి అనుగ్రహించుననియు, ఆయా రాజ్యములపైన అత్యల్ప మనుష్యులను ఆయన నియమించుచున్నాడనియు మనుష్యులందరు తెలుసుకొనునట్లు ఈలాగు జరుగును.'** నిజానికి దేశాల అధికారాన్ని పరలోకమందున్న దేవుడు కలిగియున్నాడన్న విషయమును ఎప్పుడూ మరచిపోకూడదు. పరిపాలకులకు ఈ అధికారాన్ని దేవుడే అనుగ్రహిస్తున్నాడు. రాత్రికి రాత్రే ఆ అధికారాన్ని ఒకని దగ్గర నుండి తియ్యాలనుకొంటే దేవుడు క్షణాలలో తీసేస్తాడు. కనుక కంటికి కనిపిస్తున్న ఈ అధికారాన్ని చూచి అదే గొప్పది అనుకోకండి. ఇది ఒక చవుడు నేల. ఇది వట్టి భూభాగం. దీన్ని నిత్యకాలము ఎవ్వరూ అనుభవించలేరు. ఆయన సెలవు లేకుండా భోజనముచేసి తృప్తి పొందుట ఎవరికి సాధ్యం?

భూమి అంతా తమదే అనుకుంటున్నారు. ఒకని కడుపులోనికి రెండు మెతుకులు వెళ్ళాలి అంటే, దేవుని అనుమతి కావాలని మరచిపోకూడదు. కేవలం ఒక మెతుకు తినడానికే ఆయన అనుమతి అవసరమైనప్పుడు, తన భూమిని కొంత కాలము పరిపాలించడానికి ఆయన అనుమతి అవసరం లేదంటారా? మానవుల రాజ్యముల పైన ఆయన అధికారిగా ఉన్నాడు. ప్రపంచంలో ఏ దేశమూ ఈ విషయమును తెలుసుకోలేకపోయింది. అందుకే, భారత్‌మాతాకీ జై అనాలా, వద్దా అనే ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. అసలు ఉనికిలో లేనివారికి జై కొట్టమంటున్నారు. కానీ, నిజానికి దీని సృష్టికర్త ఎవరోనన్న విషయం ఎవ్వరికీ పరిచయం కాలేదు. ఈ సృష్టిని నిర్మించినవారు ఎవరు? పరలోకమందున్న దేవుడే కదా. ఆయనను గూర్చి ఒక్క మాట కుడా వారి నోట రాకపోవటమనేది ఎంత దురదృష్టకరం చెప్పండి. వారికి వారే సృష్టించుకున్న గొడవలతో సతమతమవుతున్నారు. ద్వేషాలతో రగిలిపోతున్నారు. తత్ఫలితంగా ఒకరిని ఒకరు చంపుకొంటున్నారు. అసలు ఒక దేశంలో ఒక మనిషి నివసిస్తున్నందుకు తాను ఎలా ఆలోచించాలో ఆ ఆలోచనా విధానమే ఆ మనిషికి తెలియదు. ఆ మనిషి ఎంతటివాడైనా కావచ్చు. అతడు దేవునికి లోబడాల్సిందే.

**యిర్మీయా 27 : 5 'అధిక బలముచేతను చాచిన బాహువుచేతను భూమిని భూమిమీదనున్న నరులను జంతువులను నేనే సృజించి, ఎవరికిచ్చుట న్యాయమని నాకు తోచునో వారికే యిచ్చుచున్నాను.'** తన ప్రజలపై, తన భూభాగముపై అధికారమును ఎవరి చేతికిస్తే న్యాయమని దేవునికనిపిస్తుందో వారికే ఆ అధికారమును ఇస్తున్నాడు. ఒకనాడు ఇశ్రాయేలీయులను దేవుడు ఏర్పాటు చేసుకొన్నాడు. వారికి కూడా దేవుడు ఒక దేశమును స్వాస్థ్యముగా ఇవ్వాలనుకున్నాడు. అదే కనాను దేశం. ఆ దేశం భూమిమీద ఉన్న సకల దేశములకంటే గొప్పదైన దేశం. ఆ సుసంపన్నమైన దేశమును దేవుడు ఇశ్రాయేలీయుల చేతికి ఇవ్వాలనుకున్నాడు. అప్పటివరకూ ఆ దేశంలో ఎవరెవరో నివసిస్తున్నారు. అప్పుడు దేవుడు ఒక నిర్ణయం తీసుకున్నాడు. అబ్రాహాము గర్భాన పుట్టిన ఇస్సాకు, ఇస్సాకు నుండి పుట్టిన యాకోబు, యాకోబు నుండి వచ్చిన 12మంది సంతానము, వారి నుండి వచ్చిన ఇశ్రాయేలీయులు. ఆనాడు వారందరికి దేవుడు ఒక భూభాగాన్ని ఇవ్వాలనుకున్నాడు అప్పటివరకూ ఐగుప్తు బానిసత్వంలో ఉన్న వారందరిని విడిపించి, వారిని ఒక మంచి దేశానికి చేర్చాలనుకొన్నాడు దేవుడు. ఆ సందర్భమును ఒకసారి పరిశీలిద్దాం.

**ఆదికాండము 26 : 4 దేవుడు ఇస్సాకుతో - 'ఏలయనగా నీకును నీ సంతానమునకును ఈ దేశములన్నియు ఇచ్చి, నీ తండ్రియైన అబ్రాహాముతో నేను చేసిన ప్రమాణము నెరవేర్చి ఆకాశ నక్షత్రములవలె నీ సంతానమును విస్తరింపచేసి ఈ దేశములన్నియు నీ సంతానమునకు ఇచ్చెదను. నీ సంతానము వలన సమస్త భూలోకములోని సమస్త జనులు ఆశీర్వదింపబడుదురు.'** దేవుడు నిశ్చయించినదానిని ఆనాడు ఇశ్రాయేలీయులలో నెరవేర్చాడు. ఎందుకంటే, దేశములు ఆయన వశములో ఉన్నాయి. మరొక వాక్యమును చూద్దాం.

**ద్వితీయోపదేశకాండము 26 : 15 'నీ పరిశుద్ధాలయమగు ఆకాశములోనుండి చూచి, నీ జనులైన ఇశ్రాయేలీయులను పాలు తేనెలు ప్రవహించు దేశము అని నీవు మా పితరులతో ప్రమాణము చేసినట్లు మాకిచ్చియున్న దేశమును ఆశీర్వదింపుమని చెప్పవలెను.'** ఈ సందర్భానికి ఇశ్రాయేలీయులు దేవుడు తమకు ఇచ్చెదనని వాగ్దానము చేసిన దేశములో అడుగు పెట్టేసారు. వారు వెళ్లేటప్పటికి ఆ దేశములయందు నివసిస్తున్న వారందరిని దేవుడు చెదరగొట్టాడు. ఎందుకంటే, వారు ఆ దేశములో ఉండటానికి అనర్హులని దేవుడు నిర్ధారించాడు. మన ఇల్లు ఎవరికైనా అద్దెకు ఇస్తే, వారి ప్రవర్తన మనకు నచ్చకపోతే వెంటనే వారిని ఖాళీ చేయమంటాము. వారు ఖాళీ చేసి వెళ్ళిపోవాలి. ఈ ఆరిన నేలపై ఉన్న దేశములు దేవునివి. వీటిని ఆయన ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు ఖాళీ చేసి వెళ్లిపోవాలి. ఆయన ఏ ప్రాంతమునైతే ఖాళీచేయిద్దాం అనుకుంటాడో ఆ ప్రాంతాన్ని ఏ విధంగానైనా ఖాళీచేయించి తీరుతాడు. అందుకే ఆనాడు పాలు తేనెలు ప్రవహించు కనాను దేశాన్ని దేవుడు ఖాళీ చేయించి, తాను ఏర్పాటు చేసుకున్న ఇశ్రాయేలీయులకిచ్చాడు. వారు ఐగుప్తు బానిసత్వము నుండి విడిపింపబడి, అరణ్యమార్గములో ప్రయాణించుకొంటూ ఎన్నో వేదనలు అనుభవిస్తూ మోషే నాయకత్వంలో, యెహోషువా నాయకత్వంలో వారు వాగ్దాన భూమిలో అడుగుపెడుతున్నారు. అలా ఇశ్రాయేలీయులు వారికి దేవుడిచ్చిన ఆ దేశాన్ని చూడగానే ఇది నాది, అది నాది అని అనుకోవద్దన్నాడు. దేవుడు తన పరిశుద్ధాలయములో

నుండి చూచి వీరి దేశమును అనగా వీరిని ఆశీర్వదించేటట్లుగా వారు ప్రార్థించాలని, ఆ ప్రార్ధనకు తగినట్టుగా వారి ప్రవర్తన ఉండాలని మోషే చెబుతున్నాడు. ఎందుకంటే ఈ కనాను దేశం ఏ ఒక్కరికో స్వంతం కాదు. అది పూర్తిగా దేవునిది. ఆయనకు కృతజ్ఞత చూపిన వారిని తన దేశమందు నివసింపజేస్తాడు; ఆయనకు ఎదురు తిరిగిన వారిని తన దేశములో నుండి వెళ్లగొడతాడు.

ప్రియులారా! ఇశ్రాయేలీయులకు దేవుడిచ్చిన కనాను దేశములోనికి వారు వెళ్ళినప్పుడు దేవునిపై విశ్వాసము కలిగినటువంటి కొంతమంది వారిలో ఉన్నారు. మిగిలిన వారందరూ అల్ప విశ్వాసులే, అవిశ్వాసులే. ఇశ్రాయేలీయులందరూ మంచివారు కాదు. ఇశ్రాయేలీయులందరూ దేవునికిష్టులు కాదు. కానీ, దేవుడు భవిష్యత్ ప్రణాళిక కోసం వారినందరినీ వాగ్ధాన భూమిలో ప్రవేశపెట్టాడు. వారిలో అవిశ్వాసులందరూ విశ్వాసులుగా మారాలన్నదే దేవుని కోరిక. వారు తమ ప్రవర్తనను దేవుని వాక్యమునకనుకూలముగా మార్చుకోవాలి. ఒకవేళ మార్చుకోని పక్షములో ఈ ఇశ్రాయేలీయులను కూడా తన దేశము నుండి వెళ్లగొట్టడానికి ఆయన ఏ మాత్రం వెనుకాడడు. తదుపరి చరిత్రలో అదే జరిగింది. బబులోనీయులు, అష్షూరీయులు ఇశ్రాయేలీయుల మీదికి దండెత్తి వారికి నిలువ నీడ లేకుండా చేసారు. ఇదే దేవుని మీద తిరుగుబాటుకు ప్రతిఫలం. ఏది నీ భూమి? ఏది నీ దేశం? దేవుని గూర్చిన క్రీస్తు సువార్త ప్రకాశమును చూడని అనేకమంది గ్రుడ్డివారు నేటికీ భూసంబంధమైన విషయముల మీద మనస్సుంచుచూ అధోపాతాళానికి దిగజారిపోతున్నారు. ఆనాడు దేవుడు ఇశ్రాయేలీయులుగా కనాను దేశంలో ప్రవేశించిన వారినందరిని పరలోకమందు చూడాలి అనుకుంటూ వారికి ధర్మశాస్త్రమునిచ్చి వారికి తన మాటలు నేర్పిస్తుంటే ఇశ్రాయేలీయులందరూ తమ ప్రవర్తనను ఎలా మార్చుకున్నారో దేవుడు తన గ్రంథమందు స్పష్టముగా వ్రాయించాడు. ఈ భూమి నాది, ఈ దేశం నాది, ఈ ప్రాంతం నాది, ఆ ఇల్లు నాది అని ఎవరికి వారు పంచేసుకుంటున్నారు. అలాంటి మనస్సును కలిగియున్న ప్రతి ఒక్కరికీ దేవుడు కొంతమంది నీతిమంతుల ద్వారా సద్విషయములను తెలియజేసాడు. వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తే తాను నివసిస్తున్న భూమి యెడల ఒక మనిషి ఎటువంటి ఆలోచనతో ఉండాలో తప్పక అర్ధమవుతుంది.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక **11 : 13- 'వీరందరు ఆ వాగ్దానముల ఫలము అనుభవింపకపోయినను దూరమునుండి చూచి వందనము చేసి, తాము భూమిమీద పరదేశులమును యాత్రికులమునై యున్నామని ఒప్పుకొని విశ్వాసము గలవారై మృతినొందిరి.'** ఇంతకీ ఎవరు వీరందరూ? ఎవరి విశ్వాసమునైతే దేవుడు మెచ్చుకున్నాడో, ఎవరికైతే దేవుడు మొట్టమొదట ఒక దేశమును స్వాస్థ్యముగా ఇస్తానని వాగ్ధానము చేసాడో, ఎవరైతే నిజముగా దేవుని భూమిని అనుభవించుటకు హక్కుదారులో వారే వీరు. అనగా, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు. నిజానికి వీరు దేవుడు తమకు వాగ్ధానము చేసిన ఆ భూమిని తమ జీవిత కాలములో అనుభవించలేదు. దేవుడు వారికిచ్చిన వాగ్దాన భూమి మీద వారికి ఆశ కూడా లేదు. దానిని వారు తమది కాదు అనుకొన్నారు. వారు ఆ వాగ్ధాన ఫలమును అనుభవింపకపోయినను, దూరము నుండి చూచి వందనము చేసి తాము ఈ భూమి మీద పరదేశులమును యాత్రికులమునై యున్నామని ఒప్పుకొని విశ్వాసము గలవారై మరణించారు. ఒక మంచి దేశాన్ని దేవుడు అబ్రాహాము ఇస్సాకు యాకోబులకు ఇస్తున్నప్పుడు వారెందుకు తీసుకోవడం లేదు? ఆ దేశం మీద వారికి ప్రేమ లేదా? వారికి దేశభక్తి లేదా? వారికి దేవుడిచ్చిన దేశానికి జై అని వారు ఎందుకు అనటం లేదు? ఎందుకంటే వారు విశ్వాసులు! కనిపించని దానిని, ఉన్నదానిని వారు నమ్ముతున్నారు. కనిపించే ఈ చవుడు నేలను కాదు; కనిపించని మరో మహాలోకాన్ని, శాశ్వతమైన భూమిని వారు నమ్ముతున్నారు. ఆ నమ్మికతోనే వారు విశ్వాసముగలవారై మృతినొందారు. అందుకే ఈలాగు చెప్పువారు తమ స్వదేశమును వెదకుచున్నారని విశదపరచుచున్నారు కారా! అని వ్రాయబడింది. అంటే కనాను దేశం వారికి పరాయి దేశమా? అవును. కనాను దేశము వారికి పరాయి దేశము కనుకనే వారు వెళ్లిపోయారు. ఈ భూమిపై ఏ దేశములోనైనా మనము శాశ్వతముగా ఉండిపోతామా? ఆయుష్షు ఉన్నంత వరకు ఏదో ఒక దేశములో మనము బ్రతుకుతాము. ఆ ఆయుష్షు తీరగానే దేశమును ఖాళీ చేసి వెళ్లాలి. ఎంత దేశభక్తి ఉన్నా సరే దేశాన్ని వీడాల్సిందే. ఈ భారతదేశము మన స్వదేశమా! ఇది మన స్వదేశమయితే మనము శాశ్వతముగా ఇక్కడే ఉండిపోవాలి. ఉంటామా, వెళ్లిపోతామా? ఖచ్చితంగా వెళ్లిపోతాము. ఈ భూమి మీద ఏ

ఒక్కడికీ ఏ దేశమూ స్వదేశము కాదు. మరి మన స్వదేశం ఏమిటి? మన శాశ్వతమైన దేశం ఎక్కడుంది? దేవుడున్న లోకం, ఆత్మగా మనము శాశ్వతముగా నివసించే దేశం, పరలోకం, అదే మనుష్యులందరి స్వదేశం. అందుకే ఆనాడు విశ్వాసులు ఎటువంటి మనస్సుతో ఆలోచిస్తున్నారో చూడండి. ఇలాగు చెప్పువారు తమ స్వదేశమును వెదుకుచున్నామని విశదపరచుచున్నారు కారా? వారు ఏ దేశము నుండి వచ్చారో ఆ దేశమును జ్ఞాపకమందుంచుకొన్నయెడల మరల ఆ దేశమునకు వెళ్లుటకు వారికి వీలు కలిగి ఉండును. మనిషి ఏ దేశము నుండి ఈ భూమి మీదకు వచ్చాడు? ఏ దేశము నుండి తల్లిగర్భములోకి అడుగుపెట్టాడు? సగటున సుమారు 70యేళ్ల తాత్కాలిక జీవితమును కలిగి ఉండటానికి మనిషి మరో లోకము నుండి వచ్చాడు. వచ్చిన మనిషి విశ్వాసము కలిగినవాడైతే, మరల తన స్వదేశమునకు వెళ్లాలనే ఆలోచనతో బ్రతికినవాడైతే, పరలోకములో అడుగుపెడతాడు. లేదంటే, పాతాళానికి పోవాల్సిందే. కానీ, ఈ భూమిని శాశ్వతమైన దేశమని అనుకోకూడదు. ఆ రోజు దేవుడే స్వయంగా ఆ విశ్వాసవీరులకు తన భూమిని ఇస్తున్నప్పుడు వారు మరి శ్రేష్ఠమైన దేశమును కోరుకుంటున్నట్టుగా కనిపిస్తుంది. తండ్రీ ఈ భూభాగము మాకెందుకు? దూరము నుండి చూసి ఒక వందనం చేస్తామన్నారు. అయితే, పరలోకమనే దేశమును వారు కోరుకుంటూ, దేవునితో తమ నివాసం ఉండాలని వారు కోరుకుంటున్నారు. దీనిని దేవుడు మన కొరకు తన గ్రంథమందు ఎందుకు వ్రాయించి భద్రపరిచాడంటే, మనము కూడా ఇలాగే ఆలోచించాలని ఆయన అభీష్టము. అందుకే మనము ఏ దేశము నుండి వచ్చామో ఆ దేశమును మన జ్ఞాపకములో ఉంచుకుంటూ, ఈ దేశములలో బ్రతుకుతున్నంతకాలము విశ్వాసమును కలిగి జీవించాలి. అప్పుడు మాత్రమే మనము మరల ఆ శాశ్వతమైన దేశమునకు వెళ్లుటకు వీలు కలుగుతుంది. ఇప్పుడు చెప్పండి! భారతీయులలో ఎంతమందికి వారి స్వదేశం గుర్తుంది? భారతీయులలో ఎంతమంది తిరిగి వారు శాశ్వతమైన దేశమును దేవునియొద్ద పొందాలనే అభిలాషతో జీవిస్తున్నారు? ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎందరో మనుష్యులకు వారి స్వదేశం గుర్తు లేదు. ఈ సబ్జెక్ట్ నేటి పత్రికా/టివి/ ఎలక్ట్రానిక్ మీడియాకు తెలియదు; విద్యావేత్తలకు, ప్రజానాయకులకు, ప్రసిద్ధినొందిన వారికి తెలియదు.

మనిషి మరణించగానే వాని పేరు ఇక్కడ తుడిచి వేయబడుతుంది. కొంత కాలానికి అందరూ అతనిని/ ఆమెను మరచిపోతారు. వారి నివాసము వేరొకరిదవుతుంది. వారి చిరునామా చెరిగిపోతుంది. అయితే, చెరిగిపోని చిరకాలము ఉండే శాశ్వతమైన చిరునామా ఒకటుంది. దానిని పొందాలంటే, చరిత్రలో నీతిమంతులు బ్రతికిన విధానమును అలవర్చుకోవాలి. వారు ఏమి చెబుతున్నారో చూడండి. **హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 11 : 16** ప్రకారం, వారు మరి శ్రేష్ఠమైన దేశమును అనగా పరలోక సంబంధమైన దేశమును కోరుకుంటున్నారు. ఈ భూమిమీద కనాను దేశం పాలు తేనెలు ప్రవహించు దేశమైనా అది వారికొద్దు. వారికి శాశ్వతమైనది అనగా, పరలోకము అనగా, మన ఆత్మలకు తండ్రియైన దేవుడుండే లోకము కావాలి. దానికి ఎన్నటెన్నటికి నాశనము లేదు. మనిషి మరణము తరువాత అందులో ప్రవేశించాలంటే ఈ భూమి మీద ఉన్నదానిని తనది కాదు అనుకొని బ్రతకాలి. ఈ భూమి మీద జీవితకాలమంతా దేవునియెడల విశ్వాసమును కలిగి జీవించాలి. బ్రతుకుకాలమంతా దేవునికి జై అంటూ మనిషి బ్రతకాలి. యేసుక్రీస్తు సువార్త ప్రకాశము ఒకనికి ప్రకాశించినప్పుడు, మనోనేత్రాలు వెలిగినప్పుడు, ఆత్మను గూర్చి అతడు ఆలోచించగలగాలి. ఈ బ్రతుకు దేవుని కొరకే అనుకుంటూ ప్రతిక్షణం తన దేవునికొరకు అర్పితమవుతూ జీవించాలి. ఇదే ఒక మనిషి యొక్క బ్రతుకు పరమార్థం. ఉనికిలో లేని, చరిత్రలో కానరాని, కేవలం నీ ఊహలలో ఉన్న భారత్‌మాతకు జై అని ఎందుకు చెప్పాలో ఇప్పుడు ఆలోచించండి. పీకపై కత్తి పెట్టినా చెప్పనని ఒకరు, చెప్పకపోతే పీకలు కోస్తానని మరొకరు, దీనిని గూర్చి ఏమీ చెప్పలేక మౌనం వహిస్తే, దేవుడు ఈ విషయమై మహాజ్ఞానాన్ని వ్రాయించాడు. మీరు ఏ దేశం నుండి వచ్చారు? తిరిగి వెళ్లాలనే ఉద్ధేశ్యంతో మీరు ఈ భూమి మీద ఏ దేశాన్ని వెదకాలి? ఇంతకంటే శ్రేష్టమైన దేశమును, పరలోక సంబంధమైన దేశమును కోరుకోవాలి. పెలెగు కాలములో దేశములుగా విభాగింపబడిన ఈ నేల మనకు వద్దు. ఇది మనది కాదు. ఇది అశాశ్వతమైనది. నిజంగా దేశము అనగానే మనకు గుర్తు రావలసిన దేశం పరలోకమందు ఉంది. దీనిని మనము విడిచి వెళ్ళిపోతాము. పరలోక సంబంధమైన దేశమును కోరుకుంటున్న మనుష్యుల దేవుడనని అనిపించుకొనుటకు ఆయన వారిని గూర్చి సిగ్గుపడడు. ఈ భూమిని మాత్రమే కోరుకుంటున్న మిగిలిన వారందరిని గూర్చి దేవుడు సిగ్గుపడుచున్నాడు. ఈ భూమి

విషయమై ఒకరిని ఒకరు దూషించుకుంటూ తమ జీవితకాలమంతా వ్యర్థముగా గడుపుకొంటున్నారు. వీరిని చూస్తున్నటువంటి దేవుడు సిగ్గుపడుతున్నాడు. కాని, మరొకవైపు విశ్వాసులను ఆయన చూస్తున్నప్పుడు ఆయన వారిని గూర్చి ఆనందిస్తున్నాడు. అలాంటి వారి కొరకు ఆయన ఒక పట్టణమును సిద్ధపరిచాడు. ఇంతగా దేవుని కొరకు బ్రతుకుతున్నప్పుడు, గొప్ప విశ్వాసాన్ని కలిగి ఉన్నప్పుడు, అలాంటి వారి కోసం ఆయన ఒక మహాపట్టణాన్ని నిర్మించాడు. కేవలం తాత్కాలికంగా ఉండే ఈ భూమినే ఇంత అందంతో దేవుడు సృష్టించినపుడు, శాశ్వతమైన పరలోకపు పట్టణమును ఆయన ఇంకెంత గొప్పగా, అందంగా సిద్ధపరచి ఉంటాడో చెప్పండి. దైవసంబంధమైన ఈ జ్ఞానము మీకు శ్రేయస్కరము.

ఇక చివరిగా, రచయితగా నేను కూడా నా దేశాన్ని ప్రేమించేవాడనే. కాని, నా దేశ ప్రేమ మట్టికి సంబంధించినది కాదు, మనిషికి సంబంధించినది. నా దేశంలో ఉన్న ప్రజల కొరకు, వారందరిని బ్రతికించటానికి అవసరమైతే ప్రాణమునర్పించేటంతగా, రక్తము కార్చేటంతగా నేను మరణిస్తాను. దేవుని జ్ఞానము ప్రకారము, ఇదే అసలైన దేశభక్తి. ఒక జై కొడితే ప్రేమ ఉన్నట్టు కాదు. మన బ్రతుకులో తోటివారిని ప్రేమించగలిగితే, వారిని బ్రతికించగలిగితే అదే నిజమైన దేశభక్తి.

**యోహాను వ్రాసిన మొదటి పత్రిక 3 : 18 'చిన్నపిల్లలారా! మాటతోను నాలుకతోను కాక క్రియతోను సత్యముతోను ప్రేమింతము.'** జ్ఞానములేని వారినందరిని పిలిచి దేవుడు ఏమంటున్నాడో చూడండి. చిన్నపిల్లలారా! అంటున్నాడు. అంటే, వయస్సులో చిన్నవారని కాదు, జ్ఞానములో చిన్నవారని అర్థము. మాటతో, నాలుకతో మనము దేనినైనా ప్రేమించగలమా? క్రియతోను సత్యముతోను మాత్రమే నిజంగా ఎవరినైనా, దేనినైనా ప్రేమించగలము. దేశాన్ని ప్రేమించమని నేను కూడా చెబుతున్నాను. కానీ, ఎలా? కనిపిస్తున్న భూభాగాన్ని ప్రేమిద్దామా? కొండలను ప్రేమిద్దామా? అడవులను ప్రేమిద్దామా? నదులను ప్రేమిద్దామా? సరిహద్దులను ప్రేమిద్దామా! కాదు కాదు. భిన్నత్వంలో ఏకత్వమై అనేక విషయములలో సామరస్యముతో జీవిస్తున్నటువంటి నా భారతదేశ ప్రజలందరిని ఏ తారతమ్యము లేకుండా నేను క్రియతోను సత్యముతోను ప్రేమిస్తానే తప్ప మాటతోను నాలుకతోను ప్రేమించే అల్పుడను కాను. నేను దేవుడు చెప్పినట్టుగా నీతిమంతునిగా ఉండాలనుకుంటున్నాను. నీతిమంతుడైతే మాటతోను నాలుకతోను కాక క్రియతోను సత్యముతోను ప్రేమిస్తాడు. భార్యాభర్తలు మాటలతో ప్రేమించలేరు. ఉపాధ్యాయులు విద్యార్థులను మాటలతో ప్రేమించలేరు. ప్రపంచంలో ఏ ప్రేమకైనా మాట కాదు, క్రియ కావాలి. ఆ క్రియ సత్యముతో కూడినదై ఉండాలి. మాటతోను నాలుకతోను దేశానికి జై కొట్టడం వలన దేశభక్తిని కలిగి ఉన్నట్టా? వారు దేశాన్ని ప్రేమించినట్టా? కాదు! ఎవడైతే క్రియతోను, సత్యముతోను నా భాతరదేశ ప్రజల కొరకు ప్రాణమర్పించేటంతగా కష్టపడతాడో వాడే నా దేశాన్ని ప్రేమించినట్టు. ఐ లవ్ ఇండియా!

-------x-------

## ప్రశ్నలు

**1) భారతమాత ఎవరు? ఆమెకు జై అని భారతీయులు ఎందుకంటున్నారు? దీని విషయమైన చరిత్రను తెలియజేయండి.**

**2) భారత్‌మాతాకీ జై అనాలని కొందరు; అనకూడదని మరికొందరు ఎందుకు విభేదిస్తున్నారో చర్చించండి.**

**3) మనుష్య ప్రశ్నలన్నింటికీ సమాధానములను దేవుడు ఏలాగు చెప్పగలడో వివరించండి.**

**4) భూమి దేశములుగా ఎప్పటి నుండి విభజింపబడినది? దీని విషయమైన బైబిల్ చరిత్రను తెలియజేయండి.**

**5) 'మానవుల రాజ్యముపైని దేవుడే అధికారి' - దీనిని వివరించండి.**

**6) దేవుడు తన రాజ్యమును ఏలాటి మనుష్యులకు, ఎందు నిమిత్తము అప్పగించుచున్నాడు?**

7) 'నిజమైన దేశప్రేమ దైవప్రేమనుండి మాత్రమే పుడుతుంది' - దీనిని సహేతుకముగా వివరించండి.

## 14. సమాధానకర్త అగ్ని ఎందుకు వేసాడు?

సమాధానకర్త ఎవరు? ఆయన వేసిన అగ్ని ఏమిటి? వీటిని గూర్చి సవివరమైన సంగతులను ఈ పాఠములో అధ్యయనం చేద్దాం. పరలోకమందున్న తండ్రియైన దేవుడు, మనుష్యులకు తన జ్ఞానమును నేర్పించి వారిని సమాధానపరచాలని ఆశించాడు. ఎందుకంటే, రాతి యుగం నుంచి రాకెట్ యుగం వరకు మనిషి శరీరానుసారముగా ఎంతో అభివృద్ధిని సాధించినా, ఆత్మానుసారముగా ఇప్పటికీ అంతుచిక్కని ఎన్నో సంగతులు ఇంకా తెలియని సంగతులుగానే ఉండిపోయాయి. అవి ఈ మానవజాతికి సమాధానములు లేని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. అందువలన, తన కృపా బాహుళ్యమును బట్టి, దేవుడు తన ఆత్మ ప్రేరేపణ చేత తెలియజేసిన మాటలను భూమి మీద మనుష్యులకు పరిశుద్ధ గ్రంథము రూపములో సమాధానములుగా అనుగ్రహించాడు. ఒకవేళ ఆయన మాటలే గనుక ఈ సమాజంలో లేకపోతే ఆత్మజ్ఞానము మనుష్యులకు లేనట్టే అని చెప్పాలి. సమాధానము లేని ప్రపంచంగా మనము ఈ లోకాన్ని చూడవలసివచ్చేది. అందుకే దేవుడు ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు 66 పుస్తకాలలో మనుష్యులు తెలుసుకోవలసిన ఎన్నో ప్రశ్నలకు సమాధానములను వ్రాయించాడు. అవన్నీ సత్యమైనవి, యదార్థమైనవి మరియు నమ్మదగినవి.

ఈరోజు పరిశుద్ధ గ్రంథము (బైబిల్)తోపాటుగా ఎన్నెన్నో పుస్తకాలు గ్రంథాలయాలలో మనకు కనిపిస్తున్నా, వాటన్నింటిలో మానవజాతి నేర్చుకోవలసిన ప్రశ్నలకు సమాధానాలు లేవు. నిజానికి ప్రతి మనిషి పుట్టిన తరువాత అడుగవలసినటువంటి ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు, దేవుడెవరు? దేవుడెక్కడ ఉంటాడు? దేవుని ప్రణాళిక ఏమిటి? దేవదూతలెవరు? మనిషి ఎవరు? ఎందుకు పుడుతున్నాడు? ఎందుకు మరణిస్తున్నాడు? మరణించాక ఎక్కడికి వెళుతున్నాడు? లోకములెన్ని? దుష్టశక్తి ఎవరు? వాడి తంత్రములేమిటి? పాపము లోకములో ఎలా ప్రవేశించింది? పాపప్రక్షాళన ఎలా జరుగుతుంది? ఇలా ఆత్మకు సంబంధించి ఎన్నెన్నో ప్రశ్నలున్నాయి. లోక సంబంధమైన శాస్త్రాలలో వీటికి సమాధానములు దొరకవు. లోకజ్ఞానములో మనిషిని మరో లోకానికి చేర్చే మాటలు లేవు. అందుకే, ప్రతి మనిషి పుట్టిన తరువాత మొట్టమొదట తెలుసుకోవలసిన ఇలాంటి మంచి సంగతులను సమాధానములుగా దేవుడు తన గ్రంథములో పొందుపరిచాడు. దీనిని బట్టి బైబిల్ ఒక్కటే ప్రపంచంలో మిగిలిన పుస్తకాలన్నిటి కంటె భిన్నంగా కనిపిస్తుంది మరియు గొప్పగా కనిపిస్తుంది. దానిని చదివి గ్రహించిన మనిషికి ఎన్నో మంచి సమాధానములు దొరుకుతాయి.

ఇక్కడ మరొక ఆశ్చర్యకరమైన సంగతి ఏమిటంటే, ఈ లోకములో ఏదైనా ఒక శాస్త్రం పుట్టింది అంటే ఆ శాస్త్రము యొక్క ఆయువుపట్టు అంతా బైబిల్‌లోనే మనకు కనిపిస్తుంది. ఉదాహరణకు, వృక్షశాస్త్రము ఉంది. ఈ వృక్షశాస్త్రమునకు ప్రారంభం వృక్షములు. మొట్టమొదట అవి ఎలా పుట్టాయి అనేది బైబిల్‌లో మాత్రమే మనకు దొరుకుతుంది. ఇలా జంతువులు, పురుగులు, చేపలు, పక్షులు, పదార్థములు, సూర్యచంద్ర నక్షత్రములు, లోకములు, చివరకు మనిషి వరకు ప్రకృతిలో దేనిని చూచినా దానికి సంబంధించిన మూలాంశములు యదార్థమైనవిగా కేవలం బైబిల్‌లో మాత్రమే మనకు కనిపిస్తాయి. ఇలా మానవజాతికి కలిగే ప్రశ్నలకు సమాధానాలను వ్రాయించాలని దేవుడు సంకల్పించాడు. అందుకే తన గ్రంథము నిండా సమాధానాలను మాత్రమే దేవుడు వ్రాయించాడు. ఒకవేళ మనిషికి ఒక మంచి ప్రశ్న అడగడం కూడా చేతకాకపోతే ఆయనే ప్రశ్నలడుగుతూ వాటికి చక్కని సమాధానములను చెబుతున్నాడు. అంటే ఒక్కొక్కసారి మనిషికి ప్రశ్న వేసేటువంటి జ్ఞానం కూడా ఉండదనేది దేవుని ఆలోచన. ఇంత గొప్ప ఆలోచనతో ఆయన ఉంటే, మనిషికి మాత్రం దేవుని విషయములు ఒక మతంలా కనిపిస్తున్నాయి. మనిషికి దేవుడు చులకనైపోయాడు. దేవుడు తన ప్రజలను ఉన్నతమైన స్థాయిలో చూడాలనుకొని సమాధానములను అనుగ్రహించాడు. దేవుడు మనిషిని ప్రశ్నలడుగుతూ, తిరిగి వాటికి సమాధానములు చెబుతున్నటువంటి సందర్భం మనకు ఆయన గ్రంథములో కనిపిస్తుంది.

**యోబు 38 : 1- 'అప్పుడు యెహోవా సుడిగాలిలో నుండి ఈలాగున యోబునకు ప్రత్యుత్తరమిచ్చెను. జ్ఞానములేని**

మాటలు చెప్పి ఆలోచనను చెరుపుచున్న వీడెవడు? పౌరుషము తెచ్చుకొని నీ నడుము బిగించుకొనుము. నేను నీకు ప్రశ్న వేయుదును, నీవు దానిని నాకు తెలియజెప్పుము.' ఈ లోకమందున్న మనుష్యులు తమ జ్ఞానములేని మాటలచేత అనేకమంది ఆలోచనలను చెరుపుచున్నారు. మనిషి నేర్చుకోవలసింది ఏమిటి? నేర్చుకోవడానికి తాను అడగవలసిన ప్రశ్నలు ఏమిటి? ఇదేమీ తెలియనివ్వకుండా, దుష్టుడైన అపవాది మొదటి మనుష్యులైన ఆదాము హవ్వల దగ్గర నుంచి నేటి వరకు పుట్టుకొస్తున్న ప్రతి మనిషి ఆలోచనను చెరిపేస్తున్నాడు. వ్యర్థమైన మాటలచేత, పనికిమాలిన మాటలచేత, నీతి న్యాయములు లేని మాటలచేత మనుష్యులను మోసగిస్తున్నాడు. ఈ లోకమందు మనిషిని పరలోకానికి చేర్చే మాట లేదు. దైవ సంబంధమైన ఆత్మజ్ఞానం లేదు. అందుకే దేవుడు యోబుతో ఈ విధంగా మాట్లాడుతూ, మానవజాతికి కలుగవలసిన ప్రశ్నలు, వారు తెలుసుకోవలసిన ప్రశ్నలను గూర్చి తెలియజేస్తున్నాడు.

నేను భూమికి పునాదులు వేసినప్పుడు నీవు ఎక్కడ ఉంటివి? దానికి పరిమాణమును నియమించిన వాడు ఎవడో చెప్పుము? దానిమీద పరిమాణపు కొల వేసినవాడెవడో చెప్పుము. చూసారా! మనిషికి కలుగవలసిన ప్రశ్నలు, తెలుసుకోవలసిన జవాబులు ఈ మాదిరిగా ఉండాలి. భూమి గోళాకారముగా ఉందని దానికి ఒక పరిమాణము ఉందని మనుష్యులు నేర్చుకున్నారే తప్ప అది అలా ఉండడానికి కారణమెవరు? అనేది మనిషికి తెలియదు. భూమి యొక్క వైశాల్యము, దాని చుట్టుకొలత, దాని సాంద్రత, దాని వేగము.... ఇలా ఇవన్నీ ఈ లోక సంబంధమైన శాస్త్రాలు చెప్పగలుగుతున్నాయే గాని, ఇక్కడ దేవుడు అడిగే ప్రశ్న చూడండి ఎలా ఉందో! ఒకవేళ మనిషికి తెలిసినయెడల దానికి పరిమాణమును నియమించినవాడు ఎవడో చెప్పుము? దాని మీద పరిమాణపు కొలత వేసినవాడెవడో చెప్పుము? ఇంకా ఎన్నో ప్రశ్నలు ఆ వాక్యభాగములో చదువుకుంటూ వెళితే మనకు కనిపిస్తాయి. ఈ సమాజంలో ఇలాంటి ప్రశ్నలు మనకు ఎక్కడా కనిపించవు. అలాగని ఇవి పనికిరాని ప్రశ్నలని అనుకోకండి. ఎందుకంటే వీటితో ఆత్మజ్ఞానము ముడిపడి ఉంది. ఎలాగంటారా? ఈ ప్రశ్నలను దేవుడు అడుగుతున్నప్పుడు, వాటి సమాధానములలో సృష్టికర్తను గూర్చిన రహస్యాలు తెలుస్తాయి. అలాగే, ఆ వాక్యభాగములో దేవుడు సంధిస్తున్న మరో ప్రశ్న - 'నేను భూమికి పునాదులు వేసినప్పుడు నీవెక్కడ ఉంటివి?' దేవుడు ఈ సృష్టిని కలిగిస్తున్నప్పుడు నీవు ఉన్నావని చెప్పడానికి ఆయన ఈ ప్రశ్న వేస్తున్నాడు. ఈ భూమికి దేవుడు పునాదులు వేసినప్పుడు నేనెక్కడ ఉన్నాను? నేను క్రీ.శ.1960లో పుట్టాను, నేను క్రీ.శ.1980లో పుట్టాను, నేను క్రీ.శ.2000లో పుట్టాను అనుకుంటున్నారా? అయితే జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఈ భూమికి దేవుడు పునాదిని వేస్తున్నప్పుడు మనుష్యులంతా ఆయనలో భాగములుగా ఉన్నారు. ఈ రహస్యం చాలా గొప్పది. మన ప్రారంభం కొన్నాళ్ల క్రిందటిదని, మన ముగింపు మరి కొన్నాళ్లకు అయిపోతుందనే భ్రమలో ఈ లోకం 'రేపు చనిపోదుము గనుక తినుము, త్రాగుము, సంతోషించుము' అనే ధోరణిలో ఉంది. నేను భూమికి పునాదులు వేసినప్పుడు నీవు ఎక్కడ ఉంటివి అని అడిగిన ఆయన ప్రశ్నలో చాలా వివేకము ఉంది. అప్పటికి నీవు ఆయనలో మిళితమై ఉన్నావని చెప్పడానికి ఈ ప్రశ్న ఆయన వేశాడు. అప్పటికి యోబుకి దాని సమాధానము తెలియదు. ఎందుకంటే జ్ఞానము లేని మాటలు చెప్పి, తన ఆలోచనను చెరుపుచున్న వారందరూ యోబు చుట్టూ ఉన్నారు. యోబు ఆలోచన కూడా అలాగే చెడిపోయింది. కానీ, యోబులో ఉన్న విశ్వాసము దేవుని యెడల తనకున్న విధేయతను బట్టి, ఆయన యోబును మంచి ప్రశ్నలడిగి తిరిగి మరల ఆయనే సమాధానములను చెబుతున్నాడు. మనుష్యులను ఆయన ప్రశ్నలు అడుగుతున్నాడు, ఏ ఒక్కరూ వాటికి సమాధానమును చెప్పలేరు గనుక తిరిగి ఆయనే సమాధానమును తెలియజేస్తున్నాడు.

**యోబు 38 : 21 'ఇదంతయు నీకు తెలిసియున్నదిగదా. నీవు బహు వృద్ధుడవు, నీవు అప్పటికి పుట్టియుంటివి.'** ఈ మాటలు వినేసరికి ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. నేను నా తల్లిగర్భము నుండి పుట్టినప్పుడే నా పుట్టిన దినం అనుకున్నాను. ఈ భూమిమీద అడుగుపెట్టినపుడే నా ఉనికి ప్రారంభమయింది అనుకున్నాను. కానీ దేవుడు ఇలా మాట్లాడుతున్నాడు? నేను సృష్ట్యారంభమున అప్పటికే ఉన్నానా? దేవుడు ఈ భూమిని తయారు చేస్తున్నప్పుడు, దీనికి ఒక కొలతను ఆయన ఏర్పాటు చేస్తున్నప్పుడు నేను ఉన్నానా? అని ఆలోచించవలసిన పరిస్థితి. నిజంగా అప్పటికి యోబు ఎలా పుట్టియున్నాడు? యోబు మాత్రమే కాదు, నీవు నేను అప్పటికి ఎలా పుట్టియున్నవారము. ఇప్పుడు మరల దైవగ్రంథాన్ని

పరిశోధిస్తూ, దీని విషయమైన సంగతులు దేవుడు ఇంకా ఎక్కడైనా చెప్పాడేమో చూడాలి.

**కీర్తనలు 119 : 57 'యెహోవా, నీవే నా భాగము.'** పరలోకమందున్న తండ్రిని ఉద్దేశిస్తూ కీర్తనాకారుడైన దావీదు ఇక్కడ 'నీవే నా భాగము' అని పలుకుతున్నాడు. ఆత్మయైయున్న దేవుని నుండి ఒక భాగముగా దావీదు ఈ భూమి మీదకు వచ్చాడు. వచ్చిన దావీదు తల్లిగర్భములో ఒక దేహాన్ని ధరించుకున్నాడు. ఆత్మగా నేను ఎవరిని అంటే దేవుని యొక్క భాగాన్ని అంటున్నాడు దావీదు. కేవలం దావీదు మాత్రమే ఆయనలోని భాగము కాదు. నీవు నేను కూడా దేవునిలో నుండి భాగాలమే. ఆయన నుండి వచ్చి శరీరాలను ధరించుకున్నవారమే. మనుష్యులంతా ఆయనలో భాగాలుగా ఇమిడిపోయి ఉన్నారు. ఆయన ఆయా కాలాలలో మనుష్యులను భాగాలుగా విడదీసి, శరీరాన్నిచ్చి ఈ భూమి మీదకు పంపిస్తున్నాడు. అలా దేవుడు పంపగా, మన తల్లిగర్భములో మనము ఊపిరి పోసుకున్నాము, ఈ భూమిమీదకు వచ్చాము. ఒక పరిమితి కలిగిన బ్రతుకు కాలమును కలిగి ఉన్నాము. ఈ బ్రతుకు కాలంలో దేవునియొక్క సమాధానాలు మనకు తెలియకపోతే చాలా కష్టం. జ్ఞానములేకయే చనిపోతే మరల ఆయన భాగాలుగా పరలోకానికి వెళ్లే అవకాశం ఉండదు. ఈ రహస్యాలన్నీ అర్థమైతేనే, ఆయన జ్ఞానమును మనము తెలుసుకుంటేనే మరల ఆయన లోకానికి వెళ్లే అవకాశం మనకు ఉంటుంది. లేదంటే ఆయన కుమారులమైనా, ఒకప్పుడు ఆయనలోని భాగాలమైనా పాతాళ లోకానికి వెళ్ళి నిత్యనాశనమును అనుభవింపక తప్పదు. జ్ఞాన మార్గము తప్పినవాడు ఎవడైనా సరే, వాడు కుమారుడైనా వాడు సేవకుడైనా తండ్రియైన దేవుడు విడిచిపెట్టాడు. దేవుడున్న పరలోకంలో అపరిశుద్ధతకు స్థానం లేదు. మార్గము తప్పిన దేవదూతలను ఒకనాడు అక్కడ నుండి పొమ్మన్నాడు. వారి కొరకే పాతాళమనే లోకాన్ని సిద్ధపరిచాడు. దుష్టుడైన అపవాది, వాడిని వెంబడించిన దూతలును అక్కడికి పోయి, కొంత కాలము ఈ భూమి మీదకు విడిచి పెట్టబడ్డారు. అలా విడిచిపెట్టబడిన కాలములో మనలను శోధిస్తూ, ఆలోచనలను చెరుపుతూ, దేని కొరకు బ్రతకాలో దాని కొరకు కాకుండా, అనీతిమంతులుగా తన వెంట ఈడ్చుకుపోతున్నాడు. మార్గము తప్పిన దుష్టదూతలంతా ఒకప్పుడు దేవుని సేవకులు. అలాగే ఒకప్పుడు మనమందరము దేవుని కుమారులుగా దేవునిలో ఉండే భాగాలమే. దేవుని ఆజ్ఞలను నెరవేర్చకపోతే, దేవుని చిత్తాన్ని పాటించకపోతే నిత్య నరకం తప్పదని దేవుని గ్రంథం హెచ్చరిస్తోంది. అందుకే మనుష్యులకు దేవుడు సమాధానములను అనుగ్రహించి, తప్పిపోయిన దేవదూతలవలె కాక నీతిమంతులుగా పైనున్న లోకానికి రావాలని కోరుకుంటున్నాడు. దేవుని సమాధానములు తెలుసుకున్నవారు బహు తక్కువ మందిగా పరలోకానికి నిర్ణయింపబడుతున్నారు; దేవుని సమాధానములను నిర్లక్ష్యము చేసినవారుగా అనేకమంది లోకపు మాయలో పడి పాతాళానికి జారిపోతున్నారు. ప్రియులారా! ఈ పాఠమును చదువుతున్న మీరు ఈ విషయమును చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. దేవుని సమాధానములు ఈ భూమి మీద మనిషికి చాలా అవసరం. నేడున్న లోకం వాటికి గొప్పతనాన్ని ఇవ్వకపోవడం వల్ల, ఎవ్వరూ వాటి గురించి చర్చించకపోవడం వల్ల అవి అందరికీ చాలా దూరంలో ఉండిపోయాయి.

**కీర్తనలు 29 : 11 'యెహోవా తన ప్రజలకు బలము నను్రగహించును, యెహోవా తన ప్రజలకు సమాధానము కలుగజేసి వారి నాశీర్వదించును.'** ప్రశ్నలతో సతమతమవుతున్న వానిని చూడండి, సమాధానముతో నిండినవానిని చూడండి. ప్రశ్నలతో నిండిపోయినవాడు అస్సలు ఏమీ చేయలేడు; తన మనస్సంతా అదోలా ఉంటుంది. దేని మీదా అతడు దృష్టిని కేంద్రీకరించలేడు. ఎందుకంటే ప్రశ్నలతో వేధింపబడుతూ ఉంటాడు. అతని దగ్గర కోట్లాది రూపాయల ఆస్తిని ఉంచినా, అతని దగ్గర ఒక జటిలమైన ప్రశ్న ఉండిపోతే అతనికి మనశ్శాంతి ఉండదు. చరిత్రలో బబులోను రాజైన నెబుకద్నెజరుకు కొన్ని దర్శనములు వచ్చాయి. వాటిని అతడు మరచిపోయి, అసలు తనకు వచ్చిన దర్శనమేమిటో దాని భావమేమిటో తెలియనివాడై నిద్ర పట్టని రాత్రులు గడుపుతున్నాడు. దీనినిబట్టి మనోవ్యాకులముతో ఉన్న నెబుకద్నెజరు ఆ దేశంలో ఉన్నటువంటి శకునగాండ్రను, గారడీవిద్య గలవారిని, మాంత్రికులను, కల్దీయులను పిలుస్తున్నాడు. రాజు గారికి వచ్చిన కల వారే చెప్పాలి, ఆ కల భావము కూడా వారే చెప్పాలి అని చెప్పాడు. ఈ వింతైన ప్రశ్నకు అందరూ చేతులు ఎత్తేసారు. అప్పుడు నీతిమంతుడైన దానియేలు నెబుకద్నెజరు కన్న కల, ఆ కలకు భావాన్ని దైవజ్ఞానమును బట్టి చెప్పాడు. అప్పటికి గాని నెబుకద్నెజరు శాంతించలేదు. సమాధానము లేకపోతే ఒక వ్యక్తి ముందు ఎన్ని ఉంచినా సరే ఆ ప్రశ్నే తన దృష్టిలో

గొప్పది. ఆనాడు కలలుగన్న నెబుకద్నెజరు మహారాజుకు తన రాజ్యం మీద లేదు, తన సంపద మీద లేదు, ఇక దేనిమీదా తన దృష్టిలేదు గాని తనకు వచ్చిన ఒక కల, ఆ కలకు భావం మాత్రమే తనకు కావాలి. దానిని తెలుసుకుంటేనే తాను ప్రశాంతంగా ఉండగలడు. నిజంగా మనుష్యులకు దేవుడు వేసే ప్రశ్నలు అర్థమైతే, వాటిని ఆలోచించడం మొదలుపెడితే ఏ వ్యక్తి ఊరుకోలేడు. వాటికి సమాధానములు తెలిసే వరకు నిద్రపోడు. కానీ, అసలు దేవుడు వేసే ప్రశ్నలే ఇంకా మనిషి చెంతకు చేరలేదు కదా. అందుకే మనిషి అపవాది తనయునిగా మారిపోతున్నాడు. రానురాను మనిషి అస్సలు ప్రశ్నలు జోలికే వెళ్లకూడదనుకుంటున్నాడు. ఒకవేళ నిజంగా ఏదైనా ప్రశ్న మనిషికి కలిగినా, దానికి సమాధానమును వెదకడానికి బదులు ఆ ప్రశ్నను మరచిపోవడానికి దారులు వెదుకుతుంటాడు. నేడున్న ఈ విష సంస్కృతిలో ఒక వ్యక్తి మనస్సు బాగోకపోతే ఏమంటాడు? నేను వెళ్ళి మద్యము సీసా ఒకటి తెచ్చుకొని త్రాగేస్తాను అంటాడు. అంటే ప్రశ్నలన్నింటిని మరచిపోవడానికి, శరీరానికి మత్తును కలిగించుకోవడానికి, తన మెదడును మొద్దుబారేలా చేసుకోవడానికి మద్యం త్రాగుతున్నాడు. దీనితో సమస్యకు పరిష్కారం దొరుకుతుందా? సమస్య ఇంకా పెద్దదవుతుంది. ప్రశ్నల తీవ్రత ఎక్కువైపోతే ఇక చిట్టచివరి ఆయుధంగా విషం తెచ్చుకుంటాడు. తనకు ఎదురైన ప్రశ్నలను భరించలేక, సమాధానము దొరకక ఆత్మహత్యలు చేసుకుంటున్నవారు ఎందరో మనకు కనిపిస్తున్నారు. ప్రతి ఆత్మహత్య వెనుక దాగి ఉన్న రహస్యం ఇదే. వారికి ఎదురైన ప్రశ్నలు! సమాధానము లేదనుకుని పిరికిపంద ప్రయత్నంగా ఆత్మహత్యలు! సినీనటుడు రంగనాథ్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు? తనకు ఎదురైన ప్రశ్నలు. సినీనటుడు ఉదయ్‌కిరణ్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు? తనకు ఎదురైన ప్రశ్నలు. నటి ప్రత్యూష బెనర్జీ ఎందుకు ఆత్మహత్య చేసుకుంది? తనకు ఎదురైన ప్రశ్నలు. ఎందరో రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? వారికి ఎదురైన ప్రశ్నలు. చేసిన అప్పులు ఎలా తీర్చాలి? పంట పండకపోతే ఏమి చేయాలి? ఇలా ప్రశ్నలతో వేధింపబడుతున్న ప్రతి ఒక్కరూ వాటికి సమాధానమును రాబట్టవలసింది పోయి తమ జీవితాన్ని ముగించుకోవాలి అనుకుంటున్నారు. క్షణికావేశంతో సమాధానాలు దొరకక చావే పరిష్కారమనుకుంటున్నారు. కానే కాదు. చావు సమస్యలకు సమాధానము కాదు. ప్రతి ప్రశ్నకు సమాధానము ఉంది. అవి శరీర సంబంధమైనవి అయినా, ఆత్మ సంబంధమైనవి అయినా ప్రతి ప్రశ్నకు సమాధానము ఉంది. అందుకే దేవుడు ఏమంటున్నాడో తెలుసా? ఆయన తన ప్రజలకు ఒక మంచి ఆశీర్వాదమును ఇవ్వాలనుకుంటున్నాడు. ఆ ఆశీర్వాదం ఏమిటంటే సమాధానము అనే ఆశీర్వాదం. మీ మీ జీవితాలలో ఎదురయ్యే ప్రతి ప్రశ్నకు మీకు సమాధానాలు దొరికినప్పుడు మీకంటే ఐశ్వర్యవంతులు ఎవరుంటారు? అలాంటి వారు ఈ ప్రపంచంలోనే లేరు. ప్రపంచంలో ఉన్న ఐశ్వర్యమంతటిని మీ ముందు ఉంచి మిమ్మల్ని ప్రశ్నలతో ముంచెత్తితే మీకంటే దౌర్భాగ్యులు ఎవ్వరూ ఉండరు. ప్రశ్నలకు మంచి సమాధానములు దొరకడమే ఒక దీవెన, అదే ఆశీర్వాదం!

యేసుక్రీసును అంగీకరించి, బైబిల్ చేతపట్టి, క్రైస్తవ్యంలోనికి అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ ఎన్నెన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. ఎందుకు పుట్టామో, ఎందుకు బ్రతకాలో, ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు మన జీవిత గమ్యమేమిటో, ఏది వినాలో, ఎలా మాట్లాడాలో, ఏమి పని చెయ్యాలో, ఎందుకు వివాహము చేసుకోవాలో, కుటుంబ వ్యవస్థ ఎందుకో, పిల్లలను ఎలా పెంచాలో చివరకు దేవుడిచ్చిన ఆయుష్కాలమంతా బ్రతికి చనిపోయిన తరువాత ఎక్కడికి వెళ్లాలో... ఇలా ప్రతి ప్రశ్నకు చక్కని సమాధానములను దేవుడు తన పిల్లలమైన మన కొరకు తన గ్రంథములో పొందుపరిచాడు. నిజమైన ఆశీర్వాదమంటే ఇదే. అందుకే, **కీర్తనలు 29 : 11**లో యెహోవా తన ప్రజలకు బలము ననుగ్రహించును; యెహోవా తన ప్రజలకు సమాధానము కలుగజేసి వారి నాశీర్వదించును అని వ్రాయబడింది.

ప్రియులారా! దేవుని దగ్గర మాత్రమే మనుష్యుల ప్రశ్నలన్నింటికి మంచి సమాధానములున్నాయి. మంచి సమాధానములు అని ఎందుకన్నానంటే, సమాధానము తెలియనప్పుడు దేనిని పడితే దానినే సమాధానము అనుకుంటాము. ఆత్మహత్య చేసుకునే వాళ్లు చావే వారి ప్రశ్నకు సమాధాన మనుకున్నట్టన్నమాట. అందుకే, సమాధానములు మంచివిగా ఉండాలి. అవి మనిషిని నరకానికి తీసుకెళ్లిపోయే చెడ్డ సమాధానాలుగా ఉండకూడదు. పనికిరాని మాటలన్ని దుష్టుని

దగ్గర ఉంటాయి. అప్పటికప్పుడు మనిషిని శాంతింపచేసి వారిని దుష్టమార్గము లోనికి నడిపించే ఉద్దేశ్యముతో కుటిలమైన సమాధానాలు వాడి దగ్గర ఉంటాయి. కానీ, దేవుని దగ్గర మాత్రమే గొప్ప సమాధానాలు, మంచి సమాధానాలు, న్యాయమైన సమాధానాలు ఉన్నాయి. అవి మనుష్యులను పరలోకానికి తీసుకెళతాయి. దేవుడు ఈ విధంగా ప్రారంభకాలము నుంచి తన పిల్లలైన వారికి తన సమాధానములను ఇస్తూ వారిని ఆశీర్వదిస్తున్నాడు. ఎవరైతే ఆయన సమాధానముల దగ్గరకు వస్తున్నారో వారందరూ తమ ప్రశ్నలకు సమాధానములను పొందుతున్నారు. ఇక కొంతకాలానికి దేవుడు తన కుమారుడైన యేసును ఈ భూమి మీదకు పంపించి మనుష్యులకు పరిపూర్ణమైన సమాధానములను అనుగ్రహించాలి అనుకున్నాడు. ఎందుకంటే భవిష్యత్తును గూర్చి కూడా మనకు ఈరోజు ఎన్నో ప్రశ్నలు వస్తున్నాయి. ఈ ప్రపంచ భవిష్యత్తు ఎలా ఉ ండబోతుంది? చివరకు ఈ భూమి ఎలా అంతమవ్వబోతుంది? ఈ ప్రకృతి వినాశనం ఎప్పుడు జరుగుతుంది? ఇది ఎవరి వలన ముగింపబడుతుంది? వీటన్నింటికి సమాధానం దొరకాలి అంటే, తన కుమారుడైన దేవుని వాక్యము శరీరధారిగా భూమి మీదకు రావాలి. మనుష్యుల ప్రతి ప్రశ్నకు సత్య సంబంధమైన సమాధానాన్ని ఇవ్వాలి కనుక ఆయన ఈ లోకం లోనికి పంపబడ్డాడు. అలా పంపబడినప్పుడు ఆయనను గూర్చి వ్రాయబడిన ఒక మంచి వాక్యమును చూడండి.

మీకా 5 : 2 **'బేత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్పగ్రామమైనను నాకొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును; పురాతన కాలము మొదలుకొని శాశ్వతకాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను.'** 'దేవుని వాక్యము' ఆయాకాలాలలో మనుష్యుల అవసరతనుబట్టి సమాధానాలుగా భూమి మీదకు వస్తున్నాడు. అయితే, ఆయన ప్రత్యక్షమైన విధానంలో మార్పులను మనము గమనించాలి. పురాతనకాలములో ఆయన ఆత్మరూపిగా ప్రత్యక్షమైతే, శరీరధారిగా సుమారు 2000 సం.ల క్రితం వచ్చాడు. వచ్చిన ప్రతిసారి ఆయన రాక పరమార్థం మాత్రం సమాధానములను అనుగ్రహించడం మాత్రమే. ఇక చిట్టచివరి రాక అనగా యేసు రెండవ రాక మాత్రం విశ్వవినాశనంతో ముడిపడి ఉంది.

♦అబ్రాహాము కాలంలో మెల్కీసెదెకు రూపంలో ఆయన వచ్చాడు. **హెబ్రీయులకు 7 : 1 - 28**

♦నోవహు కాలంలో చెరలో ఉన్న ఆత్మల యొద్దకు ఆత్మరూపిగా వచ్చాడు. **2పేతురు 3 : 19 - 20**

దేవుని వాక్యము ప్రారంభకాలము నుంచి అవసరమునుబట్టి అనేకమారులు ప్రత్యక్షమగుచుండెను. పురాతనకాలము మొదలుకొని శాశ్వతకాలము వరకు ఆయన(దేవుని వాక్యము) ప్రత్యక్షమగుచుండెను. శరీరధారిగా ఆ దేవుని వాక్యము కన్యకయైన మరియ గర్భము ద్వారా వచ్చెను.

మీకా 5 : 3 **'కాబట్టి ప్రసవమగు స్త్రీ పిల్లలను కనువరకు ఆయన వారిని అప్పగించును. అప్పుడు ఆయన సహోదరులలో శేషించిన వారును ఇశ్రాయేలీయులతో కూడ తిరిగి వత్తురు. ఆయన నిలిచి యెహోవా బలము పొంది తన దేవుడైన యెహోవా నామ మహత్మ్యమునుబట్టి తన మందను మేపును. కాగా వారు నిలుతురు, ఆయన భూమ్యంతముల వరకు ప్రబలుడగును. ఆయన సమాధానమునకు కారకుడగును.'** భవిష్యత్ కాలములో దేవుని వాక్యము శరీరధారిగా వచ్చుటనుబట్టి ముందుగా మీకా ప్రవక్త ద్వారా దేవుడు ఈ వాక్యమును వ్రాయిస్తున్నాడు. దేవుని వాక్యము యేసుక్రీస్తుగా ఈ భూమి మీదకు వచ్చిన తరువాత ఆయన 'సమాధానానికి' కారకుడవుతాడు. ఆయన యొద్ద అన్నింటికీ సమాధానములు ఉ న్నాయి. ఆయన ఛేదించలేని ప్రశ్నలు ఈ ప్రపంచంలోనే లేవు. దానినిబట్టి ఆయన పేరు సమాధానకర్త! అందుకే యేసును వెంబడించిన శిష్యులు ఇక తమ ఇండ్లకు వెళ్ళకుండా ఆయనతోపాటే ఉండటంలో పరమార్థం ఇదే. ఒకవేళ వారు యేసును విడిచి వెళ్ళిపోయారంటే మరల ప్రశ్నలతో నిండిపోతారు. యూదులు, పరిసయ్యులు, ప్రధానయాజకులు, శాస్త్రులు, సద్దూకయ్యులు వీరందరూ యేసుక్రీస్తును నమ్మకపోయినా యేసుక్రీస్తు వెనుక తిరగడంలో అసలు రహస్యం ఇదే. వారంతా నిజంగా యేసుక్రీస్తును నమ్మరు కదా, మరి ఆయన కూడా ఎందుకు తిరిగేవారు? ఆయనకు దూరంగా ఉ ండొచ్చు కదా? లేదు లేదు. యేసుక్రీస్తు ఎక్కడ ఉంటే అక్కడే ధర్మశాస్త్రోపదేశకులు, ప్రధానయాజకులు, పరిసయ్యులు, సద్దూకయ్యులు ఉండేవారు. ఎందుకంటే ఆయన దగ్గర వారి ప్రశ్నలకు సమాధానాలున్నాయి. వాటిని తెలుసుకొనేవారు

కానీ, ఆయన్ను నమ్మేవారు కాదు. మరో ప్రశ్న కోసం ఎదురు చూసేవారు. మనకు ఎదురైన ప్రతి ప్రశ్నకు సమాధానమును తెలుసుకుని ఆత్మను రక్షించుకోవడమే జ్ఞానము. అది జరగనినాడు మనకు ఎన్ని సమాధానములు తెలిసినా నిష్ప్రయోజనమే!

ఇక దేవుని వాక్యమైన యేసు ఈ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ఆయన పన్నెండవ యేటనే బోధకుల మధ్య ప్రారంభించాడని దైవగ్రంథము చెబుతోంది. **(లూకా సువార్త 2 : 42 - 49)** దీనంతటినిబట్టి యేసుక్రీస్తు ఈ భూమి మీదకు ఒక సమాధానకర్తగా వచ్చాడని అర్థమవుతోంది. మనుష్యుల ప్రశ్నలకు పరిపూర్ణముగా సమాధానాలు అనుగ్రహించడానికి ఆయన వచ్చాడు. అందుకే ప్రారంభ శతాబ్ధములో శిష్యులు, అపొస్తలులు కూడా యేసుక్రీస్తును కలిగినవార్తై లోకములో పరిపూర్ణులైన వారి మధ్య దేవుని పరిపూర్ణమైన జ్ఞానమును బోధిస్తున్నారు. **(కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 2 : 6)** వారు భూలోకమును తలక్రిందులు చేసేవారుగా, ఎక్కడికి వెళితే అక్కడ మానవాళి ప్రశ్నలకు దైవ సంబంధమైన సమాధానములను చెబుతున్నారు. **(అపొస్తలుల కార్యములు 17 : 6)** క్రీస్తును ధరించుకున్న వారి దగ్గర సమాధానము లేని ప్రశ్నంటూ ఏదియు లేదు.

**యోహాను సువార్త 16 : 33 'నాయందు మీకు సమాధానము కలుగునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నాను. అయినను ధైర్యము తెచ్చుకొనుడి. నేను లోకమును జయించియున్నాననెను.'** ఈ లోకములో దేవుని కొరకు బ్రతుకుచున్న వారికి శ్రమ కలుగుతుంది, అయినను ధైర్యము తెచ్చుకోవాలి. యేసైతే ఈ లోకమును జయించియన్నాడు. ఆయన ఎలా జయించాడు? సమాధానకర్తగా ఉన్నాడు గనుక ఆయన జయించాడు. మీరు కూడా ఆయనను పోలి నడుచుకొంటూ, సమాధానములు కలిగినవార్తైతే మీరునూ ఈ లోకమును జయిస్తారు. ఎవరి దగ్గరైతే దేవుని సమాధానములుండవో వారు ఈ లోకాన్ని జయించలేరు. వారు చివరకు ప్రశ్నలతోనే మిగిలిపోతారు. వారి పరిస్థితి పాతాళానికి జారిపోవడమే తప్ప పరలోకానికి వెళ్లేవారుగా ఉండరు. అంటే, పరలోకంలో అడుగుపెట్టే ప్రతి ఒక్కడూ సమాధానములను కలిగి ఉంటాడన్నమాట. ఏ ప్రశ్నకైనా సమాధానమును క్రీస్తు ద్వారా కలిగియున్నవాడే పరలోక ప్రవేశానికి అర్హుడు.

**యోహాను సువార్త 14 : 27 'శాంతి మీకనుగ్రహించి వెళ్లుచున్నాను. నా శాంతినే మీకు అనుగ్రహించుచున్నాను.'** భూమి మీదకు వచ్చిన దేవుని వాక్యమైన యేసు, మనుష్యులకు శాంతిని అనుగ్రహించి వెళ్లాడు. ఇంతకీ ఏమిటీ శాంతి? శాంతి అనగా, విశ్రాంతి లేక నెమ్మది. సహజంగా ప్రతి మనిషి ఈ రోజు కోరుకునేది ఇదే. దేవుని దగ్గరకు వెళితే మనకు శాంతి, నెమ్మది, విశ్రాంతి అనుగ్రహింపబడుతుంది. అనగా, మనిషికి ఏ ప్రశ్నా ఉండదు. ఈ వాక్యభాగములో 'శాంతి' అని వ్రాయబడిన చోట ఫుట్‌నోట్‌లో 'సమాధానము' అని వ్రాయబడి ఉంది. అంటే, శాంతి అనగా సమాధానమును మీకనుగ్రహించి వెళ్లుచున్నానని యేసు ఇక్కడ చెబుతున్నాడు. నా శాంతినే అనగా, నా సమాధానమునే మీకు అనుగ్రహించుచున్నాను అంటున్నాడు. ఆత్మసంబంధమైన ప్రశ్నలకు ఎవరికైతే సమాధానములు దొరకలేదో వారు పాతాళానికి వెళ్ళిపోతారు. వారు మానోవ్యాకులంతో ఉంటారు. అందుకే యేసుక్రీస్తు సమాధానమును అనుగ్రహిస్తున్నాడు. ఆ సమాధానములో శాంతి ఉంది, నెమ్మది ఉంది, ప్రశాంతత ఉంది. ఆ సమాధానము కలిగిన యేసుక్రీస్తు మాటలను మీరు అంగీకరించగలిగితే మీ జీవితంలో ఎదురయ్యే ప్రతి ప్రశ్నకు మీకు సమాధానం దొరుకుతుంది. లోకము కూడా తప్పుడు సమాధానములను ఇవ్వాలని ప్రయత్నం చేస్తుంది. కాని లోకమిచ్చినట్టుగా ఆయన సమాధానాలను ఇవ్వడు. లోకమిచ్చిన సమాధానాలన్నీ ప్రకృతి సంబంధమైనవి, దెయ్యం సంబంధమైనవవి. వాటి వలన మనుష్యులకు సమాధానం దొరకదు సరికదా, వాటి వలన వారు కలతపడతారు, ఇబ్బందిపడతారు. అందుకే, లోకమిచ్చినట్టుగా యేసు తన సమాధానమును అనుగ్రహించుట లేదు. మీ హృదయములను కలవర పడనీయొద్దు, వెరవనీయొద్దు అంటున్నాడాయన. యేసును పరిశోధించండి, మీకు కావలసినటువంటి సమాధానాలు వెదకండి, శాంతిని పొంది ఆనందించండి. మీ హృదయాన్ని దేవుని వాక్యముతో నింపుకోండి అంటున్నాడు. ప్రశ్నలకు సమాధానములు అందినప్పుడు దేవునికి అనుకూలంగా బ్రతికే అవకాశం ఖచ్చితంగా కలుగుతుంది. అందుకే యేసుక్రీస్తు ఈ భూమి మీదకు వచ్చి, అందరికి ఏదో సొమ్మును పంచిపెట్టి వెళ్లిపోలేదు. తన శిష్యులకు ఆస్తిని కూడబెట్టి ఆయన వెళ్లలేదు. యేసు శిష్యులు సువార్తను ప్రకటించడానికి వెళు తునప్పుడు తమతో పాటు సంచిని తీసుకువెళ్లొద్దన్నాడాయన. మీ దగ్గర ఏదీ ఉంచుకోవద్దన్నాడాయన. నిజంగా యేసుక్రీస్తు

ఈ భూమిపై ఆస్తులను సంపాదించాలి అనుకుంటే ఆనాడు యేసును రాజుగా చేద్దామని కొందరనుకున్నారు. ఎందుకంటే ఆయన చేస్తున్న సూచకక్రియలు, అద్భుతాలు, మహత్కార్యాలు... ఇవన్నీ చూపించి ఆరోజు ఆయన ఆస్తిని సంపాదించుకునే అవకాశమైతే లేకపోలేదు. కానీ, ఆయన నిజమైన దేవుని కుమారుడు. ఆయన దృష్టిలో రంగు కాగితములు, ముద్రింపబడిన నాణెములు, భూములు, ఆస్తులు ఇవన్నీ గొప్పవి కాదు. ఇవన్నీ ఉన్నా 'సమాధానము' లేకపోతే మనిషికి విలువ లేదు. అందుకే ఆయన ఈ భూమిమీదకు అష్టైశ్వర్యములు ఇవ్వడానికి రాలేదు. లోకమందున్న దేవతలనబడినవారు ఇస్తారేమో! కాని యేసుక్రీస్తు ఏమి ఇస్తాడో తెలుసా? అన్నిటికంటే విలువైనది, కోట్లరూపాయలు వెచ్చించినా ఎవ్వరూ ఇవ్వలేనిది ఆయన ఇస్తాడు. ఆయన శాంతిని ఇస్తాడు. దీనినిబట్టి ఆయన ఎంత గొప్పవాడో చూడండి. కాని దురదృష్టవశాత్తు ప్రపంచంలో ఉన్న క్రైస్తవులకు సైతం యేసుక్రీస్తు ఏమి ఇస్తాడో అర్థంకాలేకపోయింది. యేసుక్రీస్తు దగ్గర ఏమి కోరుకోవాలో నేటి ప్రజలకు అర్థంకాకపోయింది. అందుకే యేసు దగ్గరకు వచ్చినా ఇంకా చిన్నిచిన్న కోరికలనే మరల ఆయన్ను కోరుకుంటున్నారు. ఈ భూమి మీద బ్రతుకులో నాకు ఫలానాది కావాలి, నాకు ఫలానాది కావాలి అంటున్నారు తప్ప, దేవుని కుమారుడవైన యేసూ నాకు కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. నా ప్రశ్నలకు నీవు సమాధానమును ఖచ్చితంగా చెప్పగలవు. కనుక వాటిని నాకు అనుగ్రహించమని యేసు దగ్గరకు వచ్చిన వారెవ్వరూ కానరారు. అనాదికాలము నుండి ఎవరు నన్ను ప్రశ్న వేస్తారు? ఆ ప్రశ్నకు నేనెప్పుడు సమాధానమును చెప్పాలి? అని దేవుడు ఎదురు చూస్తున్నాడు. మనిషి మరణించిన తరువాత మహా ఉన్నతమైన లోకాన్ని సంపాదించాలంటే సమాధానము కలిగినవాడై ఉండాలి గనుక మనుష్యులకు సమాధానాన్ని ఇవ్వాలి అనుకున్నాడు. తన కుమారుడైన యేసుక్రీస్తును పంపించి పూర్తి సమాధానములను అనుగ్రహించాడు. ఇక్కడి వరకు మీరు సంగ్రహించిన దానినిబట్టి 'యేసు సమాధానకర్త' అని మీకు అర్థమైంది. ఇక మన పాఠమును గూర్చి ఆలోచిస్తే 'సమాధానకర్త అగ్ని ఎందుకు వేశాడు?' మనుష్యులకు సమాధానాన్ని అనుగ్రహించెదనని చెప్పినవాడు మరల వారి మధ్య అగ్ని ఎందుకు వేస్తాడు? నిజంగా ఆయన అగ్ని వేసాడా? సమాధానమును అనుగ్రహించడానికి వచ్చిన ఆయన సమాధానము లేకుండా చేస్తాడా? చూద్దాం! దైవగ్రంథములో ఈ రహస్యాన్ని పరిశీలిద్దాం.

**లూకా సువార్త 12 : 49- 'నేను భూమిమీద అగ్ని వేయవచ్చితిని. అది ఇదివరకే రగులుకొని మండవలెనని యెంతో కోరుచున్నాను.'** యోహాను సువార్త 14 : 27లో యేసు - నేను శాంతిని అనుగ్రహించడానికి వచ్చాను అన్నాడు. తన శాంతిని అనుగ్రహించుచున్నాను అన్నాడు. మరల లూకా సువార్తలో ఈ సందర్భం వచ్చేసరికి ఆయన - నేను భూమిమీద అగ్నివేయవచ్చితిని అంటున్నాడు. ఇంతకీ ఏమిటీ అగ్ని? దీని వలన ఏమి జరుగుతుంది? చూద్దాం. ఆ అగ్ని కూడా ఇది వరకే రగులుకొని మండవవలెనని యెంతో కోరుచున్నాను అంటున్నాడు. అంటే భూమి మీద ఆయన వేసిన అగ్ని వలన మంటలు రగలాలనే బలమైన కోరిక యేసుక్రీస్తులో ఉంది. ఇంకా ఆ వాక్య కొనసాగింపును చూస్తే, **'అయితే నేను పొందవలసిన బాప్తిస్మమున్నది. అది నెరవేరువరకు నేనెంతో ఇబ్బందిపడుచున్నాను. నేను భూమిమీద సమాధానము కలుగజేయవచ్చితినని మీరు తలంచుచున్నారా? కాదు; భేదమునే కలుగజేయవచ్చితినని మీతో చెప్పుచున్నాను.'** అని అన్నట్టుగా వ్రాయబడింది. ఇక దీని భావమును మనము పరిశీలిద్దాం. ఆయన పొందవలసిన బాప్తిస్మమును గూర్చి ఈ సందర్భములో యేసు ప్రస్తావించాడు. అప్పటికే బాప్తిస్మమిచ్చు యోహాను చేత బాప్తిస్మమును పొందిన యేసు, మరల తాను పొందవలసిన బాప్తిస్మమును గూర్చి ఇక్కడ మాట్లాడుతున్నాడు. బాప్తిస్మమిచ్చు యోహాను అందరికీ నీళ్లతో మాత్రమే బాప్తిస్మమును ఇచ్చాడు.(మత్తయి సువార్త 3 : 11) మరి ఇక్కడ ఆయన పొందవలసిన బాప్తిస్మమేమిటి? బాప్తిస్మమనగా, ముంచబడుట అని అర్థము. ఆయన నీళ్ల బాప్తిస్మమును పొందిన తరువాత ఇక యే బాప్తిస్మము మిగిలి ఉంది? ఆయన బ్రతికి ఉన్నప్పుడు శిష్యులతో పదే పదే చెబుతూ గుర్తుచేస్తున్న మాటే, ఆయన సిలువ మరణం, సమాధి, పునరుత్థానములు! అవును, ఆయన అప్పటికి పొందవలసిన బాప్తిస్మమే, సిలువ మరణం. ఆ బాప్తిస్మము, అనగా భూగర్భములో ఆయన పూర్తిగా ముంచబడటమనే బాప్తిస్మమును తాను పొందువరకు ఎంతో ఇబ్బంది పడుచున్నాడు. ఆ బాప్తిస్మము ఎంతో ఇబ్బందిని, వేదనను కలిగించే బాప్తిస్మము. సరిగ్గా యేసువలె, మనుష్యులంతా దేవునికి పిల్లలవ్వాలంటే, శ్రమలు ఇబ్బందులనే బాప్తిస్మమును పొందక తప్పదన్నమాట. అందుకే, సమాధానకర్తయైన యేసు ఈ మాటలను తెలియజేస్తున్నాడు. నేను భూమి మీద సమాధానమును మాత్రమే కలుగజేయవచ్చితినని మీరు తలంచుచున్నారా? కాదు అంటున్నాడాయన.

సమాధానకర్త భేదమును కలుగజేస్తున్నాడా? అర్థంకాకపోతే ఇది ఒక జఠిలమైన ప్రశ్న, అర్థం చేసుకోగలిగితే ఇందులో మహాజ్ఞానము దాగి ఉంది. ఆయన శాంతిని అనుగ్రహించడానికి వచ్చాడని, యేసుక్రీస్తు దేవుడు పంపిన సమాధానకర్త అని తెలుసుకున్న పిదప ఆయన అగ్ని వేస్తాడని, భేదమును కలుగజేస్తాడని తెలిస్తే ఒకింత ఆందోళనకు గురౌతారు. అందుకే ఈ పాఠం! జాగ్రత్తగా ఆద్యంతం చదవండి. అద్భుతమైన విషయాలు మీకు తెలుస్తాయి.

సమాధానకర్తయైన యేసు ఈ భూమి మీదకు రావటం వలన మనుష్యులకు సమాధానముతో పాటు, భేదము కూడా కలుగుతుంది. ఇంతకీ ఏమిటీ భేదం? అది ఎలా ఉంటుంది? దానిని ఆ వాక్యభాగములోనే ఆయన వివరిస్తున్నాడు. **లూకా సువార్త 12 : 52, 53 వచనములలో - 'ఇప్పటినుండి ఒక ఇంటిలో అయిదుగురు వేరుపడి ఇద్దరికి విరోధముగా ముగ్గురును, ముగ్గురికి విరోధముగా ఇద్దరును ఉందురు. తండ్రి కుమారునికిని, కుమారుడు తండ్రికిని, తల్లి కుమార్తెకును, కుమార్తె తల్లికిని, అత్త కోడలికిని, కోడలు అత్తకును విరోధులుగా ఉందురని చెప్పెను.'** సమాధానకర్తయైన యేసును అంగీకరించిన తరువాత ఒక ఇల్లు రెండుగా విడిపోతుంది చూడండి. ఇద్దరికి వేరుగా ముగ్గురు, ముగ్గురికి వేరుగా ఇద్దరును ఉందురు. ఇది ఒక ఉదాహరణ. భేదము ఎలా కలుగుతుందో తెలియజెప్పే ఉదాహరణ. అలాగని సరిగ్గా ఒక కుటుంబములో అయిదుగురు సభ్యులు మాత్రమే ఉంటారని కాదు; ముగ్గురు ఇద్దరు మాత్రమే వేరుపడతారని కాదు. ప్రతి తండ్రి కుమారునికి మధ్య, ప్రతి తల్లి కుమార్తెకు మధ్య, ప్రతి అత్త కోడలికి మధ్య భేదము వస్తుందని కాదు. ఉదాహరణకు తీసుకుంటే యేసును అంగీకరించిన తరువాత మనవారే మనకు విరోధులుగా మారిపోతారని అర్థము. యేసు వచ్చిన తరువాత ఒక కుటుంబములో, ఒక గ్రామములో, ఒక వర్గములో, ఒక దేశములో భేదము తప్పనిసరిగా కలుగుతుంది. ఖచ్చితంగా యేసు శాంతిని అనుగ్రహించడానికి వచ్చాడు. ఈ మాట నిజం! అలాగే, యేసు భేదాన్ని కలుగజేయడానికి వచ్చాడు. ఈ మాట కూడా నిజం. ఈ రెండూ ఎలా నిజం అవుతాయి? దానిని వివరించేదే ఈ పాఠం!

యేసుక్రీస్తు శాంతిని సమాధానమును అనుగ్రహించడానికి వచ్చాడు. ఎవరికి? సమాధానాన్ని కోరుకున్న వారికి సమాధానమును అనుగ్రహించడానికి వచ్చాడు. ఎవరికైతే సమాధానం అక్కరలేదో వారు సమాధానాన్ని పొందినవారి దగ్గర నుండి వేరైపోతున్నారు. అప్పుడు వారి మధ్య భేదము పుడుతుంది. రెండు కత్తులు ఒకే ఒరలో ఇమడవని ఒక సామెత. మంచి, చెడు ఒకే మార్గములో ప్రయాణించడానికి వీలుపడదు. ఉంటే మంచైనా ఉండాలి లేదంటే చెడైనా ఉండాలి. ఎవరైతే దేవుని సమాధానాన్ని అంగీకరిస్తారో వారిని సమాధానపరచడానికి యేసు ఈ భూమి మీదకు వచ్చాడు. అయితే ఈ సమాధానము గిట్టని వారు కొంతమంది ఉంటారు. వారు ఒకే కుటుంబములో ఉన్నవారే కావచ్చు. వారికి, సమాధానమును పొందినవారికి మధ్యలో భేదము ఏర్పడుతుంది. ఇక్కడ పాఠకులు ఈ విషయమును చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. యేసు ఈ భూమిపై బ్రతికియున్న కాలంలో దీనికి సంబంధించిన కొన్ని మంచి సందర్భాలు ఇప్పుడు నేను చర్చిస్తాను.

**'యోహాను సువార్త 9 : 16 'పరిసయ్యులలో కొందరు - ఈ మనుష్యుడు విశ్రాంతిదినము ఆచరించుట లేదు గనుక దేవుని యొద్దనుండి వచ్చినవాడు కాడనిరి. మరికొందరు పాపియైన మనుష్యుడు ఈలాటి సూచకక్రియలేలాగు చేయగలడనిరి; ఇట్లు వారిలో భేదము పుట్టెను.'** చూసారా, యేసు సమకాలీకులైన వారిలో ఆయనను గూర్చి ఎలా అభిప్రాయపడుతున్నారో! పరిసయ్యులలో కొందరికి ఆయన సమాధానము అర్థమైంది, మరికొందరికి అర్థం కాలేదు. అందుకే కొందరు, ఈ మనుష్యుడు విశ్రాంతిదినమును ఆచరించడు గనుక ఇతడు దేవునియొద్దనుండి వచ్చినవాడు కాదని ఒక ముద్రవేసే ప్రయత్నం చేస్తున్నారు. వారి చెంతనే ఉన్న మరి కొందరు, అప్పటివరకు వారికే వంతపాడిన మరికొందరు, ఈయన దేవునియొద్దనుండి వచ్చినవాడే! ఎందుకంటే, మనుష్యులందరివలె యేసు కూడా పాపాత్ముడైతే ఈలాటి సూచకక్రియలేలాగు చేయగలడు? అంటున్నారు. ఆనాటి పరిసయ్యులలో కొందరు ఒకలా మారిపోయారు, మరికొందరు మరొకలా మారిపోయారు. యేసు వారి మధ్యకు రానంతవరకు ఈ పరిసయ్యులంతా ఒక్కటే. యేసు వారి మధ్యకు వచ్చిన తరువాత వారు విడిపోయారు చూడండి. ఇట్లు వారిలో భేదము పుట్టింది. ఇక్కడ యేసు పరిసయ్యులలో భేదాన్ని తీసుకొచ్చాడు. యేసు వచ్చాడు కనుకనే ఆ భేదము వారి మధ్యలో వచ్చింది. లేదంటే పరిసయ్యులు అందరూ ఒక్కటిగానే ఉండియుండేవారు. ఎందులో ఒక్కటిగా? శరీర

విషయములలో మాత్రమే సుమా. ఈ విధముగా, యేసు ఇచ్చే సమాధానమును ఒక కుటుంబములో ఎవరైనా అంగీకరిస్తే, ఆ కుటుంబంలో తండ్రికి కుమారునికి మధ్య సఖ్యత కుదరడం లేదు. ఉదాహరణకు, తండ్రేమో కుమారునితో ఎందుకయ్యా ఇవన్నీ? ఈ భూమి మీద బ్రతికినంతకాలం మన ఇష్టాన్ని మనం నెరవేర్చుకుందాం. తిందాం, త్రాగుదాం, ఆడదాం. దేవుడు, భక్తి ఇవన్నీ ఎంతవరకో అంతవరకే. పరలోకం నరకం ఇవన్నీ మనకెందుకు అంటాడు. కానీ కుమారుడేమో యేసు అనుగ్రహించిన సమాధానాన్ని తెలుసుకుని దానిని అంగీకరించినవాడు గనుక తన బ్రతుకు పరమార్థం అర్థమైనవాడై దేవుని ఇష్టాన్ని నెరవేర్చడానికి ఆలోచిస్తాడు. ఈ విధంగా వీరిద్దరి మధ్య అప్పటివరకు లేని భేదము పుడుతుంది. ఈ భేదము పుట్టడానికి కారణం ఎవరు? అక్షరాలా యేసు మాత్రమే! అందుకే యేసు నిజాన్ని చెబుతున్నాడు. నేను భూమి మీదకు సమాధానమును ఇవ్వడానికి అనుగ్రహింపబడ్డాను. కానీ నేనిచ్చే ఈ సమాధానమే మీలో కొందరికి మరికొందరికి మధ్య భేదాన్ని కలుగజేస్తుంది. ఆయన మంచిని చేయడమే మనుష్యులలో కొంతమందికి చెడుగా కనిపిస్తుంది. ఆయన దేవుని మహాకార్యక్రమాలను జరిగించటమే మనుష్యులలో కొంతమందికి ద్వేషాలను పుట్టిస్తుంది, విభేదాలను కలిగిస్తుంది. ఈ రోజుకీ యేసుక్రీస్తును కేంద్ర బిందువుగా చేసుకొని ఎన్నో వార్తలు స్వైరవిహారం చేయడాన్ని అప్పుడప్పుడు మనము వింటుంటాము. డావిన్సీ కోడ్ అనే ఒక సినిమా చిత్రీకరించి అందులో యేసుక్రీస్తుకు వివాహం అయినట్టుగా, యేసుక్రీస్తుకు పిల్లలు కలిగినట్టుగా, యేసుక్రీస్తును వివాహితునిగా చూపిస్తున్నారు. ఇప్పుడు యేసుక్రీస్తు అనుగ్రహించిన సమాధానము అర్థమైన వారందరూ ఈ సినిమా తప్పు అన్నారు. ఆ సమాధానము అర్థంకాని వారందరూ సినిమా ఒప్పేమో అంటున్నారు. అంటే, వీరిద్దరికి మధ్యలో భేదము పుట్టింది. దీనికి కారణం యేసుక్రీస్తు. ఆ తరువాత యేసుక్రీస్తును తమిళ హిందువుగా చూపిస్తూ, గణేష్ సావర్కర్ అనే వ్యక్తి తన ఇష్టానుసారముగా వ్రాసిన పుస్తకమును తీసుకొస్తున్నారు. యేసుక్రీస్తు యూదయలో పుట్టినవాడు కాదు, తమిళనాడులో పుట్టాడు అనేది వాడి వాదన. దీనిని నమ్మనివారు కొంతమంది, దీనిని నమ్మినవారు మరికొంతమంది. కనుక వీరి మధ్యలో భేదము పుట్టింది. యేసుక్రీస్తు సమాధానమును అనుగ్రహిస్తున్నప్పుడు ఆ సమాధానమే కొంతమంది మనుష్యుల మధ్య భేదాన్ని పుట్టిస్తుంది. నిజంగా యేసు తన విషయమైన నిజాన్ని నిర్భయంగా, ఉన్నది ఉన్నట్టుగా, ఎంత గొప్పగా మాట్లాడుతున్నాడో చూడండి. అసలు మనుష్యులైతే ఇలా ఎవరైనా చెప్పుకుంటారా? నేను సమాధానమును ఇవ్వడానికే వచ్చాను. నా సమాధానమును స్వీకరించండి అని చెబుతారు. అంతేకాని, నేను భేదాన్ని కలుగజేయడానికి కూడా వచ్చానని ఎవరైనా చెప్పుకుంటారా? ఏదైనా ఇంటికి మీరు వెళ్లి నేను ముక్కుసూటిగా మాట్లాడతాను, అందువల్ల నేను ఎక్కడ ఉంటే అక్కడ భేదము కలుగుతుంది అన్నారు అనుకోండి, అస్సలు మిమ్మును తమ ఇంటికి రానిస్తారా? కనుక, మిమ్మును మీరు ఎలా పరిచయం చేసుకొంటారు? నేను చాలా మంచివాడినండి, నేను చాలా సాత్వికుడనండి అని పరిచయం చేసుకుంటారు. యేసుక్రీస్తు మాత్రం ఉన్నది ఉన్నట్టుగా నిజాన్ని ముందుగా తన్ను అంగీకరింపబోవువారికి చెబుతున్నాడు. తరువాత మీరు ఆయన్ను తప్పుపట్టకూడదని వాస్తవాలను ఆయన తెలియజేస్తున్నాడు. యేసుక్రీస్తు శాంతిని అనుగ్రహిస్తాడు, అటువలె ఆయన వలన భేదము కూడా పుడుతుంది. మరొక సందర్భాన్ని పరిశుద్ధ గ్రంథము నుండి పరిశీలిద్దాం.

**యోహాను సువార్త 10 : 19 'ఈ మాటనుబట్టి యూదులలో మరల భేదము పుట్టెను.'** ఆనాడు యేసుక్రీస్తు పలుకుతున్న మాటలనుబట్టి, ఆయన చెబుతున్న సమాధానములనుబట్టి యూదులలో మరల భేదము పుట్టెను. **'వారిలో అనేకులు వాడు దయ్యము పట్టినవాడు, వెఱ్ఱివాడు; వాని మాట ఎందుకు వినుచున్నారనిరి. మరికొందరు ఇవి దయ్యము పట్టినవాని మాటలుకావు. దయ్యము గ్రుడ్డివారి కన్నులు తెరవగలదా? అనిరి.'** చూసారా! యూదులు ఆనాడు యేసును బట్టి రెండు వర్గాలుగా మారిపోయారు. మరల భేదము పుట్టింది అని వ్రాయబడిందంటే, అంతకు మునుపు కూడా యేసును బట్టి వారిలో భేదము పుట్టిందని అర్థము. ప్రియులారా! జాగ్రత్తగా అర్థం చేసుకోండి. యేసుక్రీస్తును అంగీకరించిన తరువాత సమాధానాన్ని పొందాలి. కానీ కొందరికి ఆ సమాధానము పొందడానికి మనస్సుండదు. అటువంటి పరిస్థితులలో మనుష్యులలో చాలా భేదములు పుడతాయి. ఒకని ఇంటిలోనివారే వానితో విభేదిస్తారు. సొంతవారితోనే వారికి గొడవలు వస్తాయి. మీరు నిజంగా యేసు ఇచ్చే సమాధానాన్ని గ్రహిస్తే, ఖచ్చితంగా ఎవరో ఒకరితో ఏదో ఒక సందర్భంలో మీకు భేదము పుట్టక తప్పదు. ఎందుకంటే, అది యేసులో ఉన్న లక్షణం. యేసు ఈ భూమి మీద జన్మించినప్పుడు, యూదుల

శుద్ధీకరణాచారము ప్రకారం ఎనిమిదవ దినమున సున్నతి చేయించడానికి ఆయన తల్లిదండ్రులు ఆయన్ను దేవాలయానికి తీసుకెళ్లారు. వారు ఇంకా ధర్మశాస్త్ర కొనసాగింపు కాలంలో ఉన్నారు గనుక, ఆ కార్యక్రమమును పూర్తిచేయడానికి యేసును తీసుకొని వచ్చారు. అప్పుడు సుమెయోను అను ఒక నీతిమంతుడు బాలుడైన యేసును, తల్లిదండ్రులను చూచి వారిని దీవిస్తూ ఒక గొప్ప మాట పలికాడు. దానిని ఒకసారి జ్ఞాపకం చేసుకుందాము.

**లూకా సువార్త 2 : 34 'సుమెయోను వారిని దీవించి - ఇదిగో అనేక హృదయాలోచనలు బయలుపడునట్లు ఇశ్రాయేలులో అనేకులు పడుటకును తిరిగి లేచుటకును వివాదాస్పదమైన గురుతుగా ఈయన నియమింపబడియున్నాడు. మరియు నీ హృదయములోనికి ఒక ఖడ్గము దూసుకొనిపోవునని ఆయన తల్లియైన మరియతో చెప్పెను.'** అంటే, యేసు ఒక వివాదాస్పదమైన గుర్తు. ఆయన ఉన్న చోట ఒక వివాదం ఉంటుంది. అది మంచిని గూర్చిన వివాదం, సత్యమును గూర్చిన వివాదం. అంతేగాని, యేసు మనుష్యులను నరహత్యలు చేయమనిగాని, దోచుకోమనిగాని చెప్పడం వలన పుట్టే వివాదమైతే కాదు. యేసు తన్ను నమ్మనివారిని శిక్షించమని, చంపమని ఎక్కడా చెప్పలేదు. నిజానికి ఆయన బోధలలో అవసరమైతే నీ సహోదరులకొరకు ప్రాణము పెట్టమన్నాడు. ఒకడు యేసులో ఉన్న సత్యాన్ని అంగీకరించుచున్న దానినిబట్టి మరొకడు తనతో విభేదిస్తున్నాడు తప్ప, ఏదో కీడు చేసావని వానితో విభేదించడం లేదు కదా. కొందరు యేసుక్రీస్తు దగ్గర నుండి మంచి సమాధానమును పొందుతున్నారనే నెపంతో మరికొందరు వారితో విభేదిస్తున్నారు. ప్రియులారా! అందుకే యేసుక్రీస్తును గూర్చి ఆయన చిన్ననాడే పలుకబడిన మాట - 'ఆయన ఒక వివాదాస్పదమైన గుర్తు'. సుమెయోను యేసును చూడగానే ఈయన వివాదాస్పదమైన గుర్తుగా ఉంటాడని, ఈయన ఎక్కడికి వెళితే అక్కడ పడిపోయిన కొందరు ఆయన వలన సమాధానమును పొంది లేస్తారని, మరికొందరు ఆయన ఇచ్చిన సమాధానము వలననే పడిపోతారని తెలియజేసాడు. ఇలా మనుష్యుల మధ్య భేదము పుడుతుంది. అందుకొరకే ఈయన దేవుని వలన నియమింపబడ్డాడు. తండ్రియైన దేవుడు ఆయన వారు ఎవరో, ఆయన వారు కాని వారు ఎవరో తేడా తెలుసుకోవాలంటే ఈ భేదము పుట్టక తప్పదు. అపవాది సంతానమునకు, స్త్రీ సంతానమునకు వైరము కలుగజేసెదనని దేవుడు ప్రారంభంలో చెప్పాడు. **(ఆదికాండము 3 : 15)** ఆ వైరమే ఈ వైరము. ఈ వైరము ఎవరి వలన పుడుతుంది? స్త్రీయందు పుట్టినవాని వలన పుడుతుంది. స్త్రీయందు పుట్టిన వారెవరు? యేసుక్రీస్తు! లోకమందున్నవారంతా చెడ్డవారే అయినప్పుడు వైరమెందుకు? ఆ చెడ్డవారిలో ఒక మంచివాడు ఉంటేనే వైరము ప్రారంభమవుతుంది. అది యేసుతో ప్రారంభమైంది. ఆయన ఒకవైపు సమాధానమును కలిగిస్తున్నాడు; మరోవైపు సమాధానము లేని వారు సమాధానమును పొందుచున్న వారిని చూచి అసూయపడుతున్నారు. వారితో భేదముతో ఉంటున్నారు. వారితో మాట్లాడలేకపోతున్నారు, వారితో కలవలేకపోతున్నారు. వారు వారి రక్తసంబంధీకులైననూ సరే వారితో ఏకీభవించలేకపోతున్నారు. దీనికి కారణం ఒకే ఒక్కరు. ఆయనే క్రీస్తు యేసు. ఆయన వలన ఒకరు సమాధానమును పొందుతున్నారు, మరొకరికి సమాధానము లేదు. ఇలా విభేదించినవారు సమాధానమును అంగీకరించరు, వారి జీవితంలో ఇక సమాధానము దగ్గరకు రారు. ఎందుకంటే యేసు అలాంటి వాడు. మీరు నిజంగా సమాధానమును పొందినవారైతే మీరు ధన్యజీవులు. ఇక లోకంలో ఈ భేదం అంటారా.. అది ఎంతకాలం ఉంటుంది? ఈ శారీరక బంధం ఎంతకాలం ఉంటుంది? భార్యాభర్తల మధ్య ఉన్న బంధం సుమారు 50 యేళ్లు ఉండొచ్చు. తల్లిదండ్రుల పిల్లల మధ్య బంధం ఎంతకాలం ఉంటుంది చెప్పండి. అది కూడా సుమారు 50 యేళ్లు ఉండొచ్చు. ఎవరో ఒకరు ముందుగా మరణించి వెళ్లిపోగానే, ఈ బంధం తెగిపోతుంది. అన్నాచెల్లెల మధ్య బంధం, అత్తా కోడళ్ల మధ్య బంధం, బంధువుల మధ్య బంధం... ఇవన్నీ ఎంతోకాలం కాదు. కొంత కాలము మాత్రమే. కానీ, దేవునితో మన బంధము శాస్వతమైనది. దానిని పొందడానికి ఏ బంధమును విడిచిపెట్టడానికైనా సిద్ధమే. ఎందుకంటే **మత్తయి సువార్త 10 : 37 - 38** ప్రకారం, దేవుని కంటె ఎక్కువగా దేనిని ప్రేమించినా ఆయన ప్రేమకు పాత్రులము కాలేము.

ఇంకా సుమెయోను మాటలలో యేసు తల్లియైన మరియను గూర్చి కూడా ప్రస్తావించబడింది. యేసును బట్టి తన తల్లియైన మరియ హృదయములోనికి ఒక ఖడ్గము దూసుకొనిపోవునని చెప్పబడింది. అనగా, యేసును బట్టి ఆయన తల్లియైన మరియకు ఘోరమైన శ్రమలు ఎదురవుతాయని అర్థము. విపరీతమైన ప్రశ్నలతో మరియ వేగిపోతుందని

అర్థము. పరిశుద్ధాత్మ వలన లోకరక్షకునికి జన్మనిచ్చినా, ఆ యేసును కన్నందుకు ఆనాటి సమాజంలో మరియను సూటిపోటి మాటలతో వేధిస్తారు. హృదయమంటే మనస్సు లేక ఆలోచనలు. ఆ మనస్సులోనికి ఒక ఖడ్గము దూసుకొని పోవును. అంటే, మరియ మనస్సును ఈ లోకపు మనుష్యుల మాటలు చీల్చివేస్తాయి. దయాప్రాప్తురాలైన మరియను ఇప్పటివరకు ఈ విధంగా ప్రపంచంలో ఎవ్వరూ అర్థం చేసుకొని ఉండరు. ఆమె జీవితం పూర్తిగా దైవగ్రంథములో వ్రాయబడలేదు గనుక మనుష్యులకు తెలియకపోవచ్చు. మనము పరలోకానికి వెళ్లాలంటే కావలసిన అవసరమైన సంగతులు మాత్రమే వ్రాయబడ్డాయి గనుక ఇటువంటి చరిత్ర మనకు అంత విపులముగా వ్రాయబడలేదు. కానీ అర్థం చేసుకుంటే, ఒక్క మాటలో మరియ యేసు విషయములో పడిన వేదనను దేవుడు తెలియజేస్తున్నాడు. యేసు విషయమై మరియ పొందిన వేదనను మీరు తెలుసుకోవాలి అనుకుంటే, దేవుని వాక్యమును లోతులకు వెళ్లి పరిశోధిస్తే ఖచ్చితంగా ఆమె జీవితం అర్థమవుతుంది. అర్థంచేసుకుంటే, ఒక్క మాట చాలదా? ఆమె జీవితములో యేసు విషయమై ఆమె పొందిన కష్టమును అర్థం చేసుకోవాలంటే సుమెయోను వారిని దీవిస్తూ పలికిన మాటలను జాగ్రత్తగా పరిశీలించాలి. పరిశుద్ధాత్మ వలన యేసుక్రీస్తును కన్నందుకు ఆనాటి నుంచి మరియ అష్టైశ్వర్యాలతో నిండిపోతావని ఆమెతో చెప్పబడలేదు. ఆ విధముగా మరియ దీవింపబడలేదు. ఆమె దేవుని కుమారుని బట్టి అనేకమైన కష్టాలను అనుభవించింది. యేసుకు జన్మనిచ్చినందుకు దయాప్రాప్తురాలైన మరియ ఎందుకు ప్రశ్నలతో వేగిపోతుంది? ఆమెను ఎందుకు ప్రశ్నలతో వేధిస్తారు? ఆమె యేసును కన్న తరువాత ఈ లోకం యేసును, మరియను, యోసేపును చూస్తున్నప్పుడు ఊరకనే ఊరుకుంటారా? చెప్పండి. యూదుల ఆచారాలు, కట్టుబాట్లు ఇన్ని అన్ని కావు. ఈ రోజున్నంత సాంఘిక జీవితం ఆ రోజు లేదు. మరియ దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో సూటిపోటిమాటలు అంటూనే ఉంటారు. యేసును చూచినంతకాలం ఆమె దగ్గరకు వచ్చిన బంధువులు, నెళవైనవారు యోసేపు లేకుండా పుట్టినవాడు ఈయనే కదా అని అవివేకముగా మాట్లాడినప్పుడు మరియ ఏమనుకుంటుంది చెప్పండి. అంటే వారి ఉద్దేశ్యం ఏమిటన్నమాట? మరియ ఎవరితోనైనా తప్పు చేసిందనా? ఒకవేళ నిలదీసి వారిని అడిగినా వారు ఏమంటారు, ఏమో తప్పు చేసావేమో? ఎందుకంటే చరిత్రలో ఇప్పటివరకు పరిశుద్ధాత్మ ప్రేరణ వలన ఎవరికైనా పిల్లలు పుట్టారా అని వారు అడుగుతారు. చరిత్రలో అబ్రాహాము భార్యయైన శారయికి సంతానము లేనప్పుడు, వారు వృద్ధాప్యములో ఉన్నా సరే దేవుడు వారికి పిల్లలను ఎలా అనుగ్రహించాడు? అబ్రాహాము ద్వారానే ఇస్సాకు వచ్చాడు తప్ప పరిశుద్ధాత్మ వలన కాదు కదా. రాహేలు గొడ్రాలుగా ఉన్నప్పుడు దేవుడు ఎవరి ద్వారా ఆమెకు పిల్లలను అనుగ్రహించాడు? తన భర్తయైన యాకోబు ద్వారానే కదా. హన్నా గర్భమును తెరచి ఆమెకు సమూయేలును తన భర్తయైన ఎల్కానా ద్వారా దేవుడు అనుగ్రహించాడు కదా. ఈ విధంగా అనేక ప్రశ్నలుచేత ఆనాటి యూదుల వలన ఆమె నొప్పింపబడుతుంది. ఇటువంటి ప్రశ్నలకు దయాప్రాప్తురాలైన మరియ ఏమని సమాధానం చెప్పుకోవాలి చెప్పండి? ఇలా అడిగిన వారందరి నోరు మూయించడానికి ఒక్కొక్కరి కోసం మరల దేవదూతయైన గబ్రియేలును రప్పించాలా? ఆమె ఇటువంటి వారికి ఏ ఆధారం చూపించగలదు చెప్పండి. ఏ మాటా బదులు చెప్పలేక, మౌనంగా ఉంటూ, తనలో తానే మధనపడుతూ దేవుని ఆజ్ఞానుసారముగా బ్రతికిన పునీత స్త్రీ మరియ. అందుకే యేసును బట్టి ఆమె హృదయములోనికి ఖడ్గము దూరుతుందని సుమెయోను తెలియజేసాడు. ఈ వేదన కేవలం మరియకు మాత్రమే. తన భర్తయైన యోసేపుకు లేదు. ఎందుకంటే, యేసు జననంలో యోసేపు ప్రమేయం లేదు. పైగా, యేసు పుట్టినప్పుడు మరియను చేర్చుకోమని దేవదూత చేత హెచ్చరించబడినా, కాలం గడిచేకొద్దీ ఆ సంగతులు మరచిపోయి చుట్టూ ఉన్నవారి మాటలకే విలువనిచ్చి మరియను అతడు కూడా నిందించే అవకాశం లేకపోలేదు. యోసేపు స్వప్నమందు హెచ్చరించబడినా స్వప్నం యోసేపుకు ఎంతకాలం గుర్తుంటుంది చెప్పండి. ఈ రోజు ఎన్నో దేవుని పాఠములు విన్నా, చదివినా కొంతకాలమే అవి మనుష్యులకు గుర్తుంటాయి. కొంతకాలానికి ఏదో ఒక లోక సంబంధమైన కారణము చేత అవి నీరుగారి పోతున్నాయి. అలాంటిది యోసేపుకు కలిగిన దర్శనం అతనిలో ఎంతకాలం నిలిచి ఉంటుంది? అతడు మరిచిపోయాడు. దేవుని విషయములను మరియ జ్ఞాపకముంచుకుంటుంది తప్ప యోసేపుకు అస్సలు జ్ఞాపకముండవు. **(లూకా సువార్త 2 : 51)** దేవునిపై ప్రేమ ఎవరికి ఎక్కువగా ఉంటుందో వారే దేవున్ని ఎక్కువగా జ్ఞాపకముంచుకుంటారు. అందుకే యేసు సిలువ వేయబడినప్పుడు ఆయన తల్లియైన మరియ అక్కడకు వచ్చింది తప్ప, యోసేపు రాలేదు. యేసు బోధ చేస్తున్నప్పుడు కూడా ఆయన

తల్లియైన మరియ, సహోదరులే వచ్చారని వ్రాయబడింది తప్ప యోసేపు రాలేదు. నిజానికి యోసేపు, యేసు శిష్యులకంటే ముందే యేసుతో పాటుగా ఉండాలి. ఎందుకంటే, ఆయన జననమప్పుడు సంభవించిన సంగతులన్నింటిని యోసేపు తన కళ్లారా చూచాడు, దేవదూత చేత హెచ్చరింపబడ్డాడు, ఆయన దేవుని కుమారుడని తెలుసుకున్నాడు. గనుక యోసేపు నిజంగా తన ఆత్మను రక్షించుకోవాలనే ఉద్దేశ్యముతో ఉంటే యేసు పాదముల మీద పడి రక్షణను వేడుకోవాలి. తన జీవితాంతం ఆయన సేవార్థమై బ్రతకాలి. యేసు లోకరక్షకుడు గనుక ఆయనకు కావలసిన ప్రతి దానిని యోసేపు సమకూర్చాలి. అది అతనికి కలిగిన మహాభాగ్యం. తన బ్రతుకుకాలమంతా యేసు వెంటే ఉండి దేవుని మహాజ్ఞానాన్ని నేర్చుకొని, చివరకు ప్రాణాన్ని కోల్పోయేంతవరకు యేసును విడువకూడదు. కానీ యోసేపులో యేసును గూర్చిన ప్రశ్న ఉండిపోయింది. ఆ ప్రశ్నను నివృత్తి చేసుకోలేకపోయాడు. అందుకే యోసేపు దేవుని కుమారునికి దూరంగా ఉన్నాడు. యేసు జీవితకాలంలో ఏనాడైనా యోసేపును గూర్చి మరల ప్రస్తావించబడిందా? మత్తయి, లూకా సువార్తలలో ప్రారంభపు అధ్యాయాలలో తప్ప ఇక ఎక్కడా యోసేపును గూర్చి మరల ప్రస్తావించబడలేదు. కాని యేసు తల్లియైన మరియను గూర్చి మాత్రం ప్రస్తావించబడింది. **(మత్తయి సువార్త 12 : 46 - 49)** యేసు జనసమూహములకు బోధ చేస్తున్నప్పుడు ఆయన తల్లియైన మరియ, ఆయన సహోదరులు వచ్చి వెలుపల నిలిచి ఆయనతో మాటలాడగోరు సందర్భము మనకు కనిపిస్తుంది. అప్పుడు ఒకడు వచ్చి ఇదిగో నీ తల్లియు, నీ సహోదరులును వెలుపల నీకొరకు ఎదురు చూస్తున్నారని యేసుతో చెప్పినప్పుడు ఆయన - పరలోకమందున్న తండ్రి చిత్తము ముందు ఈ లోకసంబంధమైన పనులు ఏమాత్రం ఎన్నికైనవి కావని తెలియజేస్తున్నాడు. యేసు తన శిష్యులవైపు చెయ్యి చాపి, ఇదిగో నా తల్లియు, నా సహోదరులును అని వారిని చూపిస్తున్నాడు. యేసు నోట ఈ మాటలు వినేసరికి మరల చుట్టూ ఉన్న జనసమూహములలో సందేహం పుడుతుంది. ఎందుకాయన ఇలా మాట్లాడుతున్నాడు? మరియ ఆయనకు తల్లి కాదా? మరి ఆయన ఎవరికి పుట్టాడు? మరల మరియ హృదయములోనికి ఒక ఖడ్గం. అందుకే, ఆనాడు సుమెయోను మరియను చూచి అలా అన్నాడు. యోసేపును గూర్చి సుమెయోను ఈ మాట చెప్పలేదు. తన తల్లియైన మరియ యేసు నిమిత్తం అనుభవించుచున్న కష్టమంతా ఆయనకు తెలుసు. చివరకు యూదులు యేసును సిలువ వేసేసారు. సిలువ మీద వ్రేలాడుతున్న యేసును చూడగానే కన్న గుండె కరిగిపోయింది. ఆమె తన ఇంటిలో ఉండలేకపోయింది. ఇక తన భర్తయైన యోసేపుతో గొడవ పెట్టుకుని యేసు యొద్దకు వచ్చేసింది. యోసేపుకు ఏం తెలుసు? యేసుక్రీస్తు గూర్చిన సమాధానమును తెలుసుకోలేకపోయాడు. ఇక ఆ రోజుతో మరియకు యోసేపుకు భేదం. యేసు అనుగ్రహించిన సమాధానమును స్వీకరించని యోసేపుకు, స్వీకరించిన మరియకు మధ్య ఏమి పుట్టిందో చూడండి. భేదం! అలాగని వారిద్దరూ ఎవరు? స్వయానా భార్యాభర్తలు. లోకానికే సమాధానాన్ని అనుగ్రహించడానికి వచ్చిన మహానుభావుడైన యేసు వారి కుటుంబములోనే జన్మించాడు. మొదటి భేదము అక్కడే పుట్టింది. మరియకు మాత్రం సమాధానాన్ని అనుగ్రహించడానికి వచ్చిన దేవుని కుమారుడైన యేసుక్రీస్తే కావాలి. అందుకే పరుగు పరుగున యేసు సిలువ దగ్గరకు వచ్చి అక్కడ నిలుచుంది.

**యోహాను సువార్త 19 : 26 'యేసు - తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలిచియుండుట చూచి, అమ్మా యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను, తరువాత శిష్యునిచూచి యిదిగో నీ తల్లి అని చెప్పెను. ఆ గడియ నుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను.'** యేసు ఒకవైపు ధర్మశాస్త్రమును నెరవేర్చి, లోకానికి రక్షణనుగ్రహించు నిమిత్తం తన ప్రాణమును ధారపోస్తున్నాడు. అటువంటి దీనస్థితిలో ఆయన సిలువమీద వ్రేలాడుతున్నప్పుడు, తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలిచియుండటం చూసాడు. మరియ హృదయములోనికి ఖడ్గము దూసుకొనిపోవునని ఒకనాడు సుమెయోను చెప్పిన మాటను బట్టి, ఇదిగో ఇన్నేళ్లుగా యేసు సిలువ మరణము వరకు మనస్సున ఆమె వేదనను అనుభవించింది. ఆమె అందరినీ విడిచిపెట్టి సిలువపై వ్రేలాడుతున్న యేసును చూడడానికి వచ్చిన దానినిబట్టి, ఆయన దగ్గరే ఉన్న తాను ప్రేమించిన శిష్యుడైన యోహానును చూపిస్తూ, అమ్మా! ఇదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెబుతున్నాడు. తరువాత ఆ శిష్యుని చూచి ఇదిగో నీ తల్లి అని చెబుతున్నాడు. ఆ గడియ నుండి యోహాను మరియను తన ఇంట చేర్చుకొనెను. ఆమె ఇల్లు కూడా వదిలి వచ్చింది కనుకనే, తన భర్తతో, తన కుటుంబముతో విభేదించుకుని వచ్చింది కనుకనే యేసు సిలువపై ఈ మాట చెప్పవలసి వచ్చింది. తన నిమిత్తం తన

తల్లి ఇల్లు లేనిదిగా అయిపోయింది. సమాధానకర్తను బట్టి భర్త లేనిదిగా, కుటుంబం లేనిదిగా ఒంటరి అయిపోయింది. తనకు సమాధానకర్తే కావాలనుకుంటూ, యేసు పుట్టిన దగ్గర నుండి ఆయన మరణిస్తున్నంత వరకు జరిగిన ప్రతి సన్నివేశమునూ జ్ఞాపకము చేసుకుంటూ ఆయన యొద్దకు పరుగు పరుగున వచ్చింది. దీనినిబట్టి తన హృదయములోనికి ఖడ్గము దూసుకొనిపోతుందనే ఆ గొప్ప మాట నెరవేరింది.

ప్రియులారా! యేసు తల్లియైన మరియను గూర్చిన ఈ పాఠం ప్రపంచానికి తెలియదు. పోనీ మరియను ఆరాధ్య దేవతగా పూజిస్తున్న వారికైనా ఈ పాఠం తెలుసంటారా? సమాధానకర్త అగ్ని వేయడానికి ఎందుకు వచ్చాడో ఈ ప్రపంచంలో ఎందరికి తెలుసు? నిజంగా ఈ పాఠం అర్థమైతే యేసును తెలుసుకున్న ప్రతీ ఒక్కరు నిద్రాహారాలు మాని ఆయన కొరకు బ్రతుకుతారు. తమ జీవితాంతం సమాధానాన్ని వెదుకుతారు. ఈ రోజు దేవుని వాక్యమును విన్నా, తన ఇంటిలో ఉన్నవారిని బట్టి యేసుని అంగీకరించలేని అభాగ్యులు ఎందరో ఉన్నారు. తన వర్గము వారికి దూరమైపోతానేమోననే భయంతో యేసును అంగీకరించలేనివారు ఈ రోజుకీ ఎందరో ఉన్నారు. తల్లిదండ్రులతో విడిపోతానేమో, భార్యతో విడిపోతానేమో, భర్తతో విడిపోతానేమో, పిల్లలతో విడిపోతానేమో, బంధువులతో విడిపోతానేమో, సంపదతో విడిపోతానేమో, ప్రాణం పోతుందేమో... ఏమిటీ భయం? నిత్యజీవం ముందు ఈ బంధములన్నీ చాలా చిన్నవి, తాత్కాలికమైనవి. మీ పరలోకపు తండ్రితో మీకున్న ఆత్మబంధమే బహు గొప్పది. ఆ బంధమును తిరిగి పొంది, మరల ఆయనున్న లోకమును సంపాదించుకోవాలంటే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా యేసు అనుగ్రహించుచున్న సమాధానమును పొంది తీరాలి. ఈ సమాధానాన్ని పొందినప్పుడు తప్పకుండా ఈ భూమిమీద అగ్ని రగులుతుంది. యేసును నమ్మినందుకు మనుష్యుల బ్రతుకులు ఎలా ఉంటాయో ఆయన ముందుగానే చెబుతున్నాడు.

**లూకా సువార్త 6 : 22- 'మనుష్యకుమారుని నిమిత్తము మనుష్యులు మిమ్మును ద్వేషించి వెలివేసి నిందించి మీపేరు చెడ్డదని కొట్టివేయునప్పుడు మీరు ధన్యులు. ఆ దినమందు మీరు సంతోషించి గంతులు వేయుడి. ఇదిగో మీ ఫలము పరలోకమందు గొప్పదై యుండును. వారి పితరులు ప్రవక్తలకు అదే విధముగా చేసిరి.'** మనుష్యకుమారుని నిమిత్తము, అనగా యేసు నిమిత్తము మనుష్యులు మిమ్మును కొట్టివేయునప్పుడు మీరు ధన్యులు అని వ్రాయబడింది. యేసును మీరు అంగీకరించి, ఆయనను వెంబడిస్తున్నప్పుడు ఎవరైనా మిమ్మును ద్వేషించి, మీ పేరు చెడ్డదని కొట్టివేసి, మిమ్మును వెలివేసి నిందించినప్పుడు మీరు ఆనందించాలి. ఎందుకంటే ఈ ప్రపంచంలో ఎవ్వరికీ దొరకని సమాధానములు యేసు ద్వారా మనకు దొరికాయి. మిగిలినవారు సమాధానముల దగ్గరకు రాలేదు. అగ్నివంటి మహా శ్రమలు చుట్టూ ఉన్న వారందరి వలన ఎదురైనప్పుడు, వాస్తవాలను ఈ పాఠము ద్వారా గ్రహించినవారై ఇక మీదట మీ విశ్వాస జీవితాన్ని చాలా బలంగా ముందుకు నడిపించుకోవాలి. మీరు దేవునిలో ఎంత ముందుకు వెళితే అంతగా ఈ లోకము మిమ్ములను ద్వేషిస్తుంది. మీరు ఎంతగా దేవునిలో ఎదిగితే అంతగా ఈ లోకము మిమ్మును చెడ్డమాటలచే నిందిస్తుంది. కాని మీరు విశ్వాసములో అంతకంతకు ఎదగాలి. మీకు కావలసింది పరలోకమే తప్ప పాతాళం కాదు.

**యోహాను సువార్త 15 : 18- 'లోకము మిమ్మును ద్వేషించినయెడల మీకంటె ముందుగా నన్ను ద్వేషించెనని మీరెరుగుదురు. మీరు లోకసంబంధులైనయెడల లోకము తన వారిని స్నేహించును. అయితే మీరు లోకసంబంధులు కారు, నేను మిమ్మును లోకములోనుండి ఏర్పరచుకొంటిని. అందుచేతనే లోకము మిమ్మును ద్వేషించుచున్నది.'** సమాధానకర్త అగ్ని ఎందుకు వేసాడో ఇప్పుడు మీకు పూర్తిగా అర్థం కావాలి. ఈ లోకము మిమ్మును ద్వేషిస్తే మీకంటె ముందుగా మొట్టమొదట యేసును ద్వేషించినట్టే. ఎవరి ఇష్టప్రకారం వారు బ్రతుకుతూ లోకము కోరుకున్నట్టుగా మనము జీవిస్తే, అందరూ మన బంధువులే, అందరూ మన స్నేహితులే! అలాంటప్పుడు ఎక్కడా అగ్ని ఉండదు. ఎంతోమందిని మనము సంపాదించుకొని ఉండేవారము. కానీ, యేసును బట్టి ఎందరినో కోల్పోతున్నాము అంటే, ఒక్కొక్కరిగా ఒక్కొక్కరిగా మనలను విడిచి వెళ్లిపోతున్నారంటే కారణం ఏమిటో తెలుసా? మనము దైవ సంబంధులుగా వారు దుష్టుని సంబంధులుగా మారిపోతున్నారని అర్థము. అందుకే, మీరు లోకసంబంధులైనయెడల లోకము తనవారిని స్నేహించును; అయితే మీరు లోకసంబంధులు కారు, యేసు మిమ్మును లోకములో నుండి ఏర్పరచుకున్నాడు; అందుచేతనే లోకము మిమ్మును ద్వేషించుచున్నది.

దీనినిబట్టి అగ్ని రగులుకుంటున్నది. అగ్ని రగిలితేనే యేసు అనుగ్రహించిన సమాధానములను అంగీకరిస్తున్నారని ఆయనకు అర్థమవుతుంది. అగ్ని రగిలితేనే మనకు మంచిది. దానినిబట్టి మనము విశ్వాసంలో గొప్పవారమవుతున్నట్టు!

ప్రియులారా! ఇది దేవుని మనస్సు. దీనిని అర్థం చేసుకుని ఒక క్రైస్తవుని జీవితం ఎలా ఉండాలో ఆలోచించుకుని సమాధానకర్తయైన యేసుక్రీస్తు అనుగ్రహించిన ఆ గొప్ప సమాధానమును పొందినవారై అగ్ని రగిలినా, ఎంత మండినా దేవుని కొరకు నిలబడే నిజ క్రైస్తవునిగా మీరుండాలన్నదే ఈ పాఠము యొక్క ముఖ్యోద్దేశ్యము. లోకమంతా మిమ్మును ద్వేషించినా, పరలోకమందున్న తండ్రిచేత మీరు అమితముగా ప్రేమింపబడతారు. దానిని మించిన ప్రేమ ముల్లోకాలలో ఎక్కడ వెదికినా మనకు దొరకదు. తగిన నిర్ణయం తీసుకోండి.

-------×-------

## ప్రశ్నలు

**1) 'దేవుని జ్ఞానము ప్రశ్నలు - సమాధానములతో నిండినది' - వివరించండి.**

**2) 'దేవుని ఆశీర్వాదము ఆయనిచ్చు సమాధానమే' - వివరించండి.**

**3) ఈ భూమి మీదకు దేవుడు పంపిన సమాధానకర్త ఎవరు? ఆయనను గూర్చి తెలియజేయండి.**

**4) యేసు - 'నేను ఈ భూమిమీద అగ్ని వేయ వచ్చితినని' ఎందుకు చెప్పెను? వివరించండి.**

**5) యేసు నిమిత్తము అనేకులలో భేదము పుట్టెను - ఎందుకో తెలియజేయండి.**

**6) 'యేసు ఒక వివాదాస్పదమైన గుర్తు' - వివరించండి.**

**7) సమాధానకర్తయైన యేసు, ఎందు నిమిత్తము అగ్ని వేసాడో సవివరముగా తెలియజేయండి.**

## 15. బైబిల్ బలిని కోరుతుందా? బ్రతుకునిస్తుందా?

సహజంగా ఈ భూమి మీద భక్తులందరూ వారి వారి విశ్వాసాలను బట్టి తమ దేవునికి అర్పణలు తీసుకుని వెళుతుంటారు. క్రైస్తవ్యంలో కూడా పరలోకమందున్న దేవుడు తన భక్తులను అర్పణలు ఇవ్వమన్నాడా? వాటిని ఆయన నిజంగా కోరుకుంటున్నాడా? బైబిల్ ప్రకారము అర్పణ ఇవ్వాలా, అక్కరలేదా? ఇస్తే ఎలా ఇవ్వాలి అనే అంశమును ఈ పాఠములో ఆలోచన చేద్దాం. క్రైస్తవులలో ఇప్పటికీ అనేకమంది పరలోకమందున్న దేవుడు తమనుండి ఒక జంతుబలిని, ఒక పక్షిబలిని, ఒక చిన్న అర్పణను కోరుకుంటున్నాడేమో అని పొరపాటు పడుతున్నారు. ఇప్పుడు మనము నేర్చుకోబోతున్న ఈ పాఠము తెలియక, వారి జీవితకాలమంతా తమకు నచ్చినవాటిని దేవునికి అర్పణలుగా ఇస్తూ సరిపెట్టుకుంటున్నారు. ఉదాహరణకు ఒక చిన్నపాటి దేవుని సంఘానికి వెళ్లి చూస్తే ప్రతి ఆదివారం, ఆ సంఘానికి వచ్చే సభ్యులు బియ్యం/ఫలాలు/కోడి గ్రుడ్లు/చిల్లర నాణెములు/రంగునోట్లు... ఇలాంటివి దేవునికి అర్పణలుగా ఇస్తున్నారు. దేవుడు వీటినే కోరుకుంటున్నాడని వారు భ్రమిస్తున్నారు. దాదాపుగా ప్రపంచవ్యాప్తంగా ఎందరో క్రైస్తవులలో, ఎన్నో క్రైస్తవ సంఘాలలో ఇదే తంతు మనకు కనిపిస్తుంది. దేవుని దగ్గరకు వారికి నచ్చినవి తీసుకుని వెళ్లడం, దేవుడు వాటిని స్వీకరిస్తున్నాడని అనుకోవడం ఈ రోజున మనము చూస్తున్నాము.

బైబిల్‌లో దేవుడు మనుష్యుల దగ్గర నుండి దేనిని అర్పణగా కోరుకుంటున్నాడు? మనము దేవునికిచ్చే అర్పణ దేవుని దృష్టిలో ఆమోదయోగ్యమైనది కాకపోతే, దేవుడు దానిని అంగీకరించకపోతే, దానివలన మనము నష్టపోతాము. ఒకవైపు మనము దేవునికి దూరమైపోతాము, మరొకవైపు మన అర్పణను కూడా మనము నష్టపోతాము. మనము ఇచ్చిన అర్పణ ఎక్కడికి వెళుతోంది? దేవుని యొద్దకా, లేదా? మన అర్పణను దేవుడు స్వీకరిస్తే అది మంచిదే. దేవుడు తీసుకోవాలనే కదా మనము ఆయన దగ్గరకు దానిని తీసుకువెళుతున్నాము. ఒక అరటిపండు లేక ఒక కొబ్బరికాయ లేక ఏమైనా కొన్ని వస్త్రాలు లేక మనకు కలిగిన కొద్దీ డబ్బులు... ఇలా ఏదో ఒకటి దేవుని దగ్గరకు తీసుకుని వెళ్లుచున్నప్పుడు దేవుడు మన తరపున వాటిని స్వీకరిస్తున్నాడా, లేదా అన్నది మనము తెలుసుకోవాలి. ఇది తెలియక చాలామంది ఇప్పటికీ గ్రుడ్డిగా తప్పటడుగులు వేస్తున్నారు. దీని వలన అనేకమంది మోసగాళ్లను కూడా పెంచి పోషిస్తున్నారు.

ప్రియులారా! ఈ భూమిమీద దేవుని పేరిట మనము ఖర్చు చేస్తున్నది దేవుని దగ్గరకు వెళుతుందా లేక ఒక మనిషి దగ్గరే ఆగిపోతుందా? అది ఇక్కడే ఆగిపోతే దేవుని కొరకు మనము ఖర్చుపెట్టడం దేనికి చెప్పండి? దానికి బదులు వాటిని ఒక పేదవానికి, కష్టాలలో ఉన్నవానికి ఇచ్చినా ఫలితం దక్కుతుంది. అడుక్కునేవానికి ఒక్కరూపాయి దానం చేయడానికి ఆలోచించే మనుష్యులు దేవునికి మాత్రం వేల/లక్షల/కోట్ల రూపాయలు అర్పణలుగా ఇస్తున్నారు. ఎందుకంటే, మనిషికున్న పాప భీతి! తాను పాపం చేసాననే భయం మనిషిని అనునిత్యం వెంటాడటం వలన దేవునికి ఎంతోకొంత అర్పణగా ఇచ్చి మనశ్శాంతిని పొందుతాడు. ఆ భయంతో ఒక్కొక్కసారి కోటాను కోట్ల రూపాయలను, కేజీల కొద్దీ బంగారాన్ని దేవునికి ఇచ్చేస్తారు. కానీ నిజంగా దేవుని దగ్గరకు ఆ అర్పణ వెళుతుందంటారా? దీనిని గూర్చి సవివరముగా తెలియజేసిన గ్రంథమే 'ది బైబిల్'. దేవుడు చాలా వివరంగా దీనిని గూర్చి మానవాళి కొరకు వ్రాయించాడు. దేవునికి అర్పణ ఎలా ఇవ్వాలి? బైబిల్ బలిని కోరుకుంటుందా? మనము ఇచ్చే అర్పణ ఎలా ఉంటే అది పరలోకమందున్న దేవుని దగ్గరకు చేరుతుంది?

పాతనిబంధన కాలంలో ఇశ్రాయేలీయులకు దేవుడిచ్చిన ధర్మశాస్త్రములో అర్పణలు ఇచ్చే విధివిధానములు పొందుపరచబడ్డాయి. బలి, అర్పణల విషయంలో ఆనాటి ఇశ్రాయేలీయుల ద్వారా దేవుడు గొప్ప విషయమును భావితరాలకు తెలియజేయాలనుకున్నాడు. అందుకే ఇశ్రాయేలీయులతో ఆయన బలి, అర్పణలను చెల్లించమన్నాడు. వారు తెచ్చిన బలిని, అర్పణను ఆయన తనకు తానుగా అనుభవించడానికి కాదు; ఒక మంచి పాఠమును అందరికీ తెలియజేయడానికి

ఇదొక సూచన మాత్రమే. దీనినిబట్టి ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్రము ప్రకారం దేవునియొద్దకు బలి, అర్పణలను తీసుకొచ్చేవారు. ఇలా కొంతకాలమయ్యేసరికి కాలక్రమేణా ఇశ్రాయేలీయులు పాపమును చేయడం ఒక అలవాటుగా మార్చుకున్నారు. ఇది దేవునికి నచ్చలేదు. ఇశ్రాయేలీయులు ఇచ్చే బలి, అర్పణలే వారు పాపములు చేయడానికి కారణమైతే వాటి వలన దేవునికి సంతోషం లేదు. ఒకవైపు ఇశ్రాయేలీయులు క్రమం తప్పకుండా పాపమును చేయడం, మరోవైపు క్రమం తప్పకుండా దేవునికి బలి, అర్పణలు ఇవ్వడం. సంవత్సరం పొడవునా పాపం చేస్తున్నాడు, నేరస్థునిగా మిగిలిపోతున్నాడు. దేవునికి అర్పణలు చెల్లించి, వాటి వలన తాను చేసిన పాపమునకు నివృత్తి జరిగిందని, మరల వెళ్లి పాపమును చేస్తున్నాడు. దీని వలన పాపము ఇంకా ప్రోత్సహింపబడుతోంది. ఇశ్రాయేలీయులు తమ పాపప్రవృత్తిని మార్చుకోలేకపోతున్నారు. ఎందుకంటే, పాపము చేసినా వెళ్లి దేవునికి ఒక అర్పణ ఇచ్చేస్తే ఆయన శాంతిస్తాడు కదా అనుకుంటున్నారు. దేవునికి ఒక జంతువునో, పక్షినో బలిగా ఇచ్చేటటువంటి మంచి అవకాశం తమకు దొరికింది కదా అని ఇశ్రాయేలీయులు పాపాత్ములుగానే జీవించడాన్ని పరమందున్న తండ్రి గమనిస్తున్నాడు. నిజానికి దేవుడు ధర్మశాస్త్రము ద్వారా ఇశ్రాయేలీయులకు నేర్పించాలనుకున్న పాఠం ఇదా? కానే కాదు. దేవుడు తాను స్వయంగా అనుభవించడానికి మనిషి దగ్గర నుండి చిన్న చిన్న వస్తువులను, జంతువులు, పక్షులను కోరుకోలేదు. ఆయన వాటిని ఎప్పుడూ స్వీకరించాలనుకోలేదు. పరలోకమందున్న దేవుడు ఎప్పుడైనా వాటిని తింటాడనుకున్నారా? ఒక అరటిపండు దేవునికి పెడితే దాని తొక్కను ఒలుచుకొని దేవుడు తింటాడా? అలాగైతే ఆ అరటిపండు అక్కడ మాయమైపోవాలి, తొక్క మాత్రమే మిగలాలి. ఏనాడైనా అలా జరిగిందా? తీసుకెళ్లిన దానిలో సగం మీకు, సగం దైవ సేవకునికి. లేదంటే, మొత్తమంతా దైవసేవకునికే. మనిషి ఇచ్చే అర్పణ దేవుని దగ్గరకు ఎక్కడ వెళుతుంది చెప్పండి? దేవుడు వాటిని ఎక్కడ తింటున్నాడు? మీరు భలేవారండి. దేవుడు తినడు, దేవుని తరుపున దైవసేవకులే తింటారు, అర్పణను గూర్చి మేము చిన్నప్పటి నుండి ఇలాగే నేర్చుకున్నాం అంటారా! అందుకే ఈ పాఠము ద్వారా మీ దగ్గరకు స్వయంగా ఆ దేవున్నే తీసుకువస్తున్నాను. నేను కేవలం బైబిల్‌లో దేవుడు నిజంగా కోరుకున్న బలి, అర్పణను ఈ పాఠము ద్వారా మీకు వివరిస్తాను. మనిషి అర్పించిన అర్పణలు దేవుని దృష్టికి ఎలా ఉంటాయో దైవగ్రంథములో చూద్దాం.

**కీర్తనలు 50 : 7- 'నా జనులారా, నేను మాటలాడబోవుచున్నాను ఆలకించుడి. ఇశ్రాయేలూ, ఆలకింపుము నేను దేవుడను, నీ దేవుడను, నేను నీ మీద సాక్ష్యము పలికెదను. నీ బలుల విషయమై నేను నిన్ను గద్దించుటలేదు. నీ దహనబలులు నిత్యము నాయెదుట కనబడుచున్నవి.'** ఇశ్రాయేలీయులను ఉద్దేశ్యిస్తూ దేవుడు తెలియజేస్తున్న అద్భుతమైన మాటలివి. ఇశ్రాయేలీయుల బలుల విషయమై దేవుడు వారిని గద్దించుట లేదు. అనగా, నాకు బలిని తీసుకురా, నాకు ఆకలి వేస్తుంది, అరటిపళ్లు పెట్టు, బియ్యం తీసుకురా, చలేస్తుంది బట్టలు కప్పు, అప్పులైపోయాను డబ్బు కట్టలు తీసుకురా అని ఆయనెన్నడూ మనిషిని అడగడం లేదు. మనిషి ఇచ్చే అర్పణల విషయమై ఆయన ఎప్పుడూ వారిని గద్దించలేదు. ఎందుకంటే, ఆయన దేవుడు. దేవుడంటే సృష్టికర్త. దేవుని సృష్టిలో కొంత మనము తీసుకుని మరల ఆ కొంతలో కొంత దేవునికిచ్చి, నావలన దేవుడు పోషింపబడుతున్నాడని ఏ ఒక్కరూ అనుకోవడానికి వీలు లేదు. ఆనాడు ఇశ్రాయేలీయులు వస్తున్నారు, దహనబలిని ఇస్తున్నారు, తిరిగి వెళ్ళిపోతున్నారు, పాపము చేస్తున్నారు, చివరకు పాపాత్ములుగానే మిగిలిపోతున్నారు. దేవునికి బలులు ఇవ్వడం వారికొక వాడుక, అలాగే పాపమును చేయడం కూడా వారికి వాడుక. అలాంటప్పుడు దేవుడు వారి బలుల విషయమై మాట్లాడుతున్నాడు. ఇంకా ఆ వాక్య కొనసాగింపును చూస్తే అర్పణ విషయమై దేవుని మనస్సు అర్థమవుతుంది.

**కీర్తనలు 50 : 9- 'నీయింట నుండి కోడెనైనను, నీ మందలోనుండి పొట్టేళ్లనైనను నేను తీసికొనను. అడవిమృగములన్నియు, వేయికొండలమీది పశువులన్నియు నావేగదా. కొండలలోని పక్షులన్నిటిని నేనెరుగుదును. పొలములలోని పశ్వాదులు నా వశమైయున్నవి. లోకమును దాని పరిపూర్ణతయు నావే.'** దేవుని స్థాయి తెలియని ఈ లోకము ఆయనను చాలా చిన్నగా పరిగణించింది. మాటల్లో మాత్రం 'గాడ్ ఈజ్ గ్రేట్' అంటారు. క్రియల్లో మాత్రం ఈ లోకానికి గాడ్ ఈజ్ నథింగ్. నిజానికి పరలోకమందున్న దేవుడు చాలా ఆస్తిపరుడు. ఆయనకున్న సంపదను లెక్కించడానికి

మనుష్యులేపాటివారు? దేవుని శక్తి స్వరూపాలను తెలియజేయడానికి ఆయన ప్రయోగిస్తున్న మాటలను చూడండి. ఒక జంతువును దేవునికి మన తరుపున ఒక బలిగా ఇద్దామనుకుంటే, ఆయనేమంటున్నాడో తెలుసా? అడవి మృగములన్నియు నావే గదా అని అంటున్నాడు. ఆఫ్రికా అడవిలోని మృగములన్నీ ఆయనవే. ప్రపంచ దేశాల అడవులలోని జంతువులన్నీ ఆయన వశమే. ఆయనే వాటికి తిండి పెడుతున్నాడు. ఆయనే వాటి మొర వింటున్నాడు. సింహానికి జింక రూపంలో ఆయనే ఆహారాన్ని పెడుతున్నాడు. జింకలకు పచ్చికబయళ్లలో గడ్డిని ఆయనే ఆహారంగా ఇస్తున్నాడు. సముద్రపు చేపలకు ఆహారాన్ని ఆయనే పెడుతున్నాడు. ఇలా ఒకటేమిటి? ప్రకృతిలోని ప్రతి జీవికీ ఆహారాన్ని పెట్టేది ఆయనే. అది మనిషికి అర్థంకాక అడవులలో వాటి దగ్గరకు వెళ్లి ఇది ప్రకృతి చక్రం అంటాడు. అవును, ఆ ప్రకృతి చక్రం నిరంతరాయంగా తిరగడానికి, దాని వెనుక ఉన్న మహాశక్తి పరలోకమందున్న దేవుడు. ఇప్పుడు ఆయన మనిషి తన యొద్దకు తెచ్చే బలులను గూర్చి ఏమంటున్నాడో తెలుసా. నీవు ఇచ్చే కోడె దూడ నాకు వద్దు; నీ మందలోని పొట్టేలు నాకు వద్దు అంటున్నాడు. నిజానికి అవన్నీ దేవునివే. కొండలలో ఎగురుతున్న పక్షులన్నీ దేవునికి తెలుసు. పొలములలోని పశ్వాదులు ఆయన వశమైయున్నవి. మొత్తానికి లోకము, దానిలోని సర్వ పరిపూర్ణత దేవునిదే. ఇక దీనికి కొనసాగింపుగా, ఆయన ఇంకా మాట్లాడుతున్నాడు. దేవుడు మనిషిని అర్పణ ఎందుకిమ్మన్నాడో తెలుసుకోకుండా ఇస్తే, దేవుడు వెంటనే ఇదే భావంతో ఆ అర్పణలన్నింటినీ వెనక్కి త్రిప్పికొడతాడు. ఇంతకీ మనిషి ఇస్తున్న అర్పణ దేవునికి ఉపయోగపడుతుందంటారా? మనమిచ్చే పక్షులు, జంతువులు దేవునికి ఆహారంగా మారతాయంటారా? లేదు. అందుకే, ఆయన తన మనస్సును సర్వ భక్త జనాంగానికి తెలియజేస్తున్నాడు. జాగ్రత్తగా చదవండి.

**కీర్తనలు 50 : 12- 'నేను ఆకలిగొనినను నీతో చెప్పను. వృషభముల మాంసము నేను తిందునా? పొట్టేళ్ల రక్తము త్రాగుదునా?'** ప్రియులారా! మనుష్యులు ఇచ్చే అర్పణలను గూర్చి దేవుడే దిగివచ్చి మాట్లాడితే ఇలాగే ఉంటుంది. ఒక దైవ సేవకున్ని అడిగితే మాత్రం, దేవునికి అన్నీ తెచ్చేయండి అంటాడు. కానీ, నిజంగా దేవున్ని అడిగితే, మీరిచ్చే ఇవన్ని నాకెందుకు అంటాడు. దేవునికి తెలియనిది, ఆయన ఎప్పుడూ చూడనిది, ఆయన్ను ఆనందపరిచేది దేవునికిస్తే ఆయన చాలా సంతోషిస్తాడు, దానిని వెంటనే అపురూపంగా స్వీకరిస్తాడు. ఈ భూమి మీద ఉన్నవన్నీ దేవునివే గదా. ప్రకృతి అంతా ఆయన సృష్టే కదా. అందులో నుండి 0.0000000000000000001% దేవునికిస్తే ఏంటయ్యా నీ అర్పణ అని దేవుడు అడుగుతున్నాడు. అసలు దేవుని ఆకలి ఎలాంటిదో మనిషికి తెలుసా? సర్వశక్తిమంతుడైన దేవుని ఆకలిని ఒక దూడతో లేక ఒక పొట్టేలుతో తీర్చేద్దామనుకుంటున్నారా? మనిషి చాలా అమాయకుడు మరియు పిచ్చివాడు కూడా! మనిషికి ఎవరూ ఈ విషయాలను చెప్పలేదు. కొంతమంది దైవ సేవకులు కూడా, దేవుని పేరిట వచ్చిన అర్పణలన్నింటినీ వారు కాజేద్దామనే ఆలోచనతో ఇవన్ని దేవుని దగ్గరకు తీసుకుని రమ్మనే చెప్పారు తప్ప నిజానికి దేవుని ఆకలి ఎలా ఉంటుందో చెప్పే ప్రయత్నం చేయలేదు. ప్రియ పాఠకులారా, దేవుని మనస్సును ఎప్పుడైనా ఇలా ఆలోచించారా? దేవున్ని దేవునిగానే చూడండి. ఒకనాడు ఇశ్రాయేలీయులను తనకు అర్పణలు ఇవ్వమని చెప్పింది ఆయనే. అలా చెప్పిన దేవుడు ఇశ్రాయేలీయులలో పరివర్తనను కోరుకున్నాడు. కానీ, ఇశ్రాయేలీయులలో పాపప్రవృత్తి పెరిగింది. ఇక కాలం గడిచేకొద్దీ ఇశ్రాయేలీయులలో మార్పు రాకపోవడాన్ని బట్టి, దేవుడు వారికి, వారి ద్వారా సర్వ ప్రపంచానికి  ఒక మంచి పాఠమును నేర్పించాలనుకున్నాడు.

**యెషయా 1 : 11 'యెహోవా సెలవిచ్చిన మాట ఇదే. విస్తారమైన మీ బలులు నాకేల? దహన బలులగు పొట్టేళ్లను, బాగుగా మేపిన దూడల క్రొవ్వును నాకు వెక్కసమాయెను. కోడెల రక్తమందైనను, గొఱ్ఱెపిల్లల రక్తమందైనను, మేకపోతుల రక్తమందైనను నాకిష్టము లేదు'.** ఇశ్రాయేలీయులలో మార్పు లేనిదానిని బట్టి దేవుడేమంటున్నాడో చూడండి. మీ విస్తారమైన బలులు నాకెందుకు? అంటున్నాడు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ భూమిమీదకు రాకముందు సుమారు 1000 యేళ్ల క్రితమే దేవుడు ఈ మాటలను చెబుతున్నాడు. మనము ఇప్పుడు క్రీ.శ. 21వ శతాబ్దములో ఉన్నాము. అనగా, సుమారు మూడు వేల సం॥ల క్రితమే దేవుడు ఈ మాటలను ఇశ్రాయేలీయులతో చెబుతున్నాడు. ఇది దేవుని మనస్సు. మనుష్యులను తన సత్య మార్గములోనికి రప్పించడానికి దేవుడు ప్రయత్నిస్తున్నాడు. సుమారు మూడు

వేల సంవత్సరాలుగా ఈ సమాజం దేవుని మాటలను సమాధి చేసింది, ఇంకా చేస్తూనే ఉంది. మనుష్యులకు అత్యవసరంగా తెలియవలసినటువంటి ఈ సంగతులు ఒక మూలన పడి ఉన్నాయి. దేవునికిష్టము లేని దానిని ఆయన సన్నిధికి తీసుకొని వస్తూ దేవున్ని ఎన్నేళ్లుగా ఇబ్బంది పెడుతున్నారో చూడండి. ఇటువంటి సంగతులతో కూడిన దేవుని మహాజ్ఞానమును అందించవలసిన దైవసేవకులనబడుతున్నవారు కూడా వీటిని మరుగున ఉంచుతున్నారు. ఎందుకంటే వారికి దేవుని పేరిట కాసింత ఆదాయం కావాలి. అందుకే, అర్పణ విషయమై మానవాళికి దేవుడు చెప్పాలనుకున్న ఈ సంగతులను ఈ పాఠములో పూర్తిగా వివరిస్తాను, ఇక చదవండి.

**యిర్మీయా 14 : 11- 'మరియు యెహోవా నాతో ఇట్లనెను. వారికి మేలు కలుగునట్లు ప్రజల నిమిత్తము ప్రార్థన చేయకుము. వారు ఉపవాసమున్నప్పుడు నేను వారి మొఱ్ఱను వినను; వారు దహనబలియైనను, నైవేద్యమైనను, అర్పించినప్పుడు నేను వాటిని అంగీకరింపను. ఖడ్గమువలనను, క్షామమువలనను, తెగులువలనను వారిని నాశనము చేసెదను.'** మనుష్యులు తరచు ఉపవాస ప్రార్థనలు చేస్తూ ఉంటారు. సంవత్సరం పొడుగునా ఎప్పటికప్పుడు దేవునికి ప్రార్థనలు చేస్తూనే ఉంటారు. యేటేటా బలులు, అర్పణలు దేవునికి తీసుకొని వెళుతూనే ఉంటారు. ఒకవైపు మనుష్యులు దేవుని కొరకు ఉపవాసముంటుంటే మరొకవైపు దేవుడు వాటిని వద్దంటున్నాడు. అవసరమనుకుంటే, మనిషి పాపం పండితే, వానిని ఖడ్గముతో సంహరించాలని దేవుడు సిద్ధపడుతున్నాడు. మనుష్యుల విషయమై దేవుని మనస్సు చూసారా ఎలా ఉందో! ఇదే దేవుని ఆలోచన విధానం. ప్రియులారా! మన పరలోకపు తండ్రి మనలను గూర్చి ఏమనుకుంటున్నాడో, అసలు ఆయన మన అర్పణలను తీసుకుంటున్నాడా లేదో తప్పనిసరిగా నిర్ధారణ చేసుకోవాలి. ఏదో అందరూ ఇస్తున్నారు కదా అని ఇచ్చేస్తే చివరకు ఖడ్గము మీదికొచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. మనుష్యుల అర్పణలను తీసుకోను అంటున్న సర్వోన్నత దేవునికి ఏమి కావాలి? ఈ భూమి మీద మానవ జీవితకాలంలో ఒక సగటు మనిషి నుండి దేవుడు కోరుకునేది ఏమిటి? ఈరోజు ప్రపంచంలో ఎందరో భక్తులున్నారు. ఆ భక్తుల దగ్గరకు వెళ్లి, మీ నుండి దేవునికి ఏమి కావాలి? ఆయన మీ నుండి ఏమి కోరుకుంటున్నాడు? అని అడిగితే వారు సరైన సమాధానమును చెప్పే స్థితిలో లేరు. ఒక దైవసేవకుని దగ్గరకు వెళ్లి అడిగినా అతడు ఏమి చెబుతాడు? మీకు కలిగిన దానిలో కొంత తీసుకొనివచ్చి దేవునికి ఇచ్చేయండి అని చెబుతాడు తప్ప విశేషమైన దేవుని జ్ఞానమును మాత్రం చెప్పలేడు. ఇప్పుడు నిజంగా దేవుడు ఒక మనిషిని అడుగుతున్న దానిని, దేవుడు స్వయంగా మనిషికి చెప్పాలనుకుంటున్నదానిని, దేవుడు తన మనసారా కోరుకుంటున్నదానిని మీకు వివరిస్తాను.

**ప్రసంగి 5 : 1 'నీవు దేవుని మందిరమునకు పోవునప్పుడు నీ ప్రవర్తన జాగ్రత్తగా చూచుకొనుము. బుద్ధిహీనులు అర్పించునట్లుగా బలి అర్పించుటకంటె, సమీపించి ఆలకించుట శ్రేష్ఠము. వారు తెలియకయే దుర్మార్గపు పనులు చేయుదురు.'** దేవుని మందిరమునకు పోవునప్పుడు ఒకని ప్రవర్తనను జాగ్రత్తగా చూచుకోవాలి; అంతే తప్ప అతడు అర్పించే బలులు, అర్పణలు కాదు. బలి, అర్పణ కంటె ఒకని ప్రవర్తన దేవుని దృష్టికి చాలా ముఖ్యమైనది. అందుకే, బుద్ధిహీనులు అర్పించే బలుల మీద ఆయన దృష్టి లేదు. అటువంటి అర్పణలు దేవునికిష్టం లేదు. కనుక, మనిషి తన ప్రవర్తనను దేవుని దృష్టికి గొప్పదిగా చూపించాలి. దేవుని మందిరమునకు పోయినప్పుడు అన్నింటికంటె ముందుగా సమీపించి దేవుని మాటలను ఆలకించాలి. మనుష్యుల దగ్గర నుండి పైసలు కోరుకునేవాడు కాదాయన. మనుష్యుల మంచి ప్రవర్తనను ఆయన కోరుకుంటున్నాడు. నిజంగా నా దృష్టిలో దేవుడంటే ఇలాగే ఉండాలి, ఉన్నాడు. అంత గొప్ప దేవుని గూర్చి ఈ పుస్తకాన్ని వ్రాసే అవకాశము నాకు లభించినందుకు ఆయనకు నా హృదయపూర్వక ధన్యవాదములు. మీరు కూడా అంత గొప్ప దేవుని గూర్చి తెలుసుకుంటున్నందుకు దేవునికి కృతజ్ఞతలు తెలుపవలసినవారైయున్నారు. ఇంకా ముందుకు వెళుతూ ఆయన జ్ఞానమును పరిశోధిద్దాం.

**హోషేయ 6 : 6 'నేను బలిని కోరను గాని కనికరమునే కోరుచున్నాను. దహనబలులు కంటె దేవుని గూర్చిన జ్ఞానము నాకిష్టమైనది.'** పరలోకమందున్న దేవుడు భూమి మీద ఏ మనిషి యొద్ద నుండీ బలిని కోరుకోవడం లేదు. అలాగని మనుష్యులను వారి వారి అర్పణలను ఇంటికి తీసుకెళ్లిపోమని వారిని పంపించి వేస్తున్నాడా? లేదు లేదు.

అనీతిమంతులుగా ఉండి బలి, అర్పణ దేవునికి ఇస్తే వాటిని ఆయన వద్దంటున్నాడు. అలాగని దేవుడు నీతిమంతుల బలి, అర్పణలను స్వీకరిస్తున్నాడు. అందులో కనికరమును ఆయన కోరుకుంటున్నాడు. ఇశ్రాయేలీయులతో ఆనాటి కాలంలో దేవుడు బలిని, అర్పణను ఎందుకు తీసుకు రావద్దంటున్నాడంటే వారిలో మార్పు లేదు. వారింకా అనీతిమంతులుగానే ఉన్నారు. కనుక, వారి బలి, అర్పణల కంటె శ్రేష్టమైనది కనికరము. దానిని వారి యొద్ద నుండి ఆయన కోరుకుంటున్నాడు. దేవుని గూర్చిన జ్ఞానమును మనుష్యులకు కలిగియుండాలని ఆయన కోరుకుంటున్నాడు. అందుకే, ముందుగా సమీపించి ఆలకించండి, దేవుని జ్ఞానమును నేర్చుకోండి.

**కీర్తనలు 51 : 16- 'నీవు బలిని కోరువాడవు కావు; కోరినయెడల నేను అర్పించుదును. విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు; దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు.'** గొఱ్ఱె, దూడ, మేక, ఫలములు, పైసలు, బియ్యం ఇవన్నీ దేవునికి ముఖ్యం కాదు. ఒకవేళ అవే ముఖ్యమైతే, నీవు నేను మనమంతా వాటినే మన జీవితకాలమంతా ఇచ్చేద్దాం. కానీ అవి దేవునికి వద్దు అని దేవుడే స్పష్టంగా చెబుతున్నాడు. చరిత్రలో దావీదు ఇశ్రాయేలీయులమీద పరిపాలన చేసిన ఒక మహా చక్రవర్తి. అటువంటి దావీదు ఏమంటున్నాడో చూడండి. 'నీవు బలిని కోరువాడవు కావు. కోరినయెడల నేను అర్పించెదను.' అంటే, దావీదుకు ఆనాడున్న స్థాయినిబట్టి అతన్ని దేవుడు కోరితే ఏమైనా ఇవ్వగలడు, దేవుని కొరకు ఏమైనా చేయగలడు. అలాంటి పరిస్థితులలో దావీదు దేవునికిష్టమైనదేదో తెలుసుకుంటున్నాడు. పరిశుద్ధాత్మ ప్రేరణతో దేవున్ని కీర్తిస్తూ, విరిగి నలిగిన మనస్సే దేవునికి అత్యంత ప్రీతికరమైన అర్పణ అంటున్నాడు. దేవుడు ప్రతి మనిషిలో మార్పును కోరుకుంటున్నాడు. ఆయన కనికరమును కోరుకుంటున్న దేవుడు. నిజంగా దేవునికి జంతువులు, పక్షుల బలులే ఇష్టమనుకుంటే ఈ రోజు మనము ఒక కోళ్లఫాం పెట్టుకోవాలి, లేక గేదెల/గొఱ్ఱెల ఫాం పెట్టుకోవాలి. దేవునికి రోజూ మాంసాహారం వండి పెట్టాలి. ఒక అరటితోట వేసుకుని అరటిపళ్లు దేవునికి ఇవ్వాలి. ఆయనకు ఏది ఇష్టమో దానిని పెట్టడానికి, ఆయనకు ఏమి కావాలో దానిని ఇవ్వడానికి మనము సర్వసిద్ధం. ఎందుకంటే మనకు పరలోకం కావాలి. మనము ఈ దేహాన్ని విడిచిపెట్టిన తరువాత మనకు నిత్యజీవం కావాలి. కానీ ఎందుకు చేయడం లేదు? ఎందుకంటే, దేవునికేది ఇష్టమో ఆయన తన గ్రంథమందు తెలియజేసాడు. మనుష్యులందరికి అర్థం కావాలని దేవుడు వాటిని స్పష్టంగా వ్రాయించాడు. దేవునికి దహనబలులు ఇష్టం లేవు. ఎవరిచ్చినా వాటిని ఆయన తీసుకోడు. దేవుడు తన మనసారా ఏమైనా కోరుకుంటున్నాడంటే, అది ఒక్కటే. ఆయన కనికరమును మాత్రమే కోరుకుంటాడు. దేవుని జ్ఞానమును సమీపించి ఆలకించుటయే శ్రేష్టము అంటున్నాడు. దేవుని జ్ఞానమే ఆయన దృష్టిలో విలువైనది. విరిగి నలిగిన మనస్సును మాత్రమే ఆయన స్వీకరిస్తాడు. మనిషి మార్పును మాత్రమే ఆయన కోరుకుంటున్నాడు. ఇప్పటికీ మీరు మారనివారైతే ఇదిగో ఈ మాటలు మీ కొరకే వ్రాయబడ్డాయని భావించి జాగ్రత్తగా చదవండి.

**హోషేయ 14 : 2 'మాటలు సిద్ధపరుచుకొని యెహోవా యొద్దకు తిరుగుడి. మీరు ఆయనతో చెప్పవలసినదేమనగా మా పాపములన్నిటిని పరిహరింపుము; ఎడ్లకు బదులుగా నీకు మా పెదవుల నర్పించుచున్నాము. నీవంగీకరింపదగినవి అవే మాకున్నవి.'** దేవునికి ఈ రోజు నామకార్థ భక్తులు ఏమి సిద్ధం చేస్తున్నారో మీకు నేను చెప్పవలసిన అవసరం లేదు. సంవత్సరానికొకసారి మేకపిల్లను సిద్ధం చేస్తున్నారు, గొఱ్ఱెపిల్లను సిద్ధం చేస్తున్నారు. సంవత్సరమంతా ఇంటి దగ్గర బాగా మేపుతున్నారు. వారనుకున్న సమయమొచ్చే సరికి దేవునికి బలిగా ఇచ్చేస్తున్నారు. అది వారి దృష్టిలో దేవునికి వారిచ్చిన ఒక అర్పణ. ఇంతకీ ఆ మాంసమంతా దేవుడు తిన్నాడా? లేదు. సగం దైవ సేవకునికి, మిగిలినది అర్పించిన వారికి. అయ్యో! మనుష్యులెంత అవివేకులు? మనుష్యులారా, మీ విరిగి నలిగిన మనస్సు దేవునికి ఇవ్వకపోతే, ఆయనకు మీరు ఎన్నిచ్చినా, ఆ అర్పణ దేవుని దగ్గరకు వెళ్లదు. ఆ అర్పణ దేవునిచే స్వీకరింపబడదు. మీలో మొదట దేవునికి కావాల్సింది మీ విరిగి నలిగిన మనస్సు. మీ మార్పు, మీ మంచితనం, మీ నీతి, మీ జీవితం దేవునికి కావాలి. అందుకే, మీరు ఆయనతో చెప్పవలసినదేమనగా, 'మా పాపములన్నిటిని పరిహరింపుము. ఎడ్లకు బదులుగా నీకు మా పెదవుల నర్పించుచున్నాము. నీవంగీకరింపదగినవి అవే మాకున్నవి అని చెప్పాలి. ఎంత చక్కని మాట! ఎంత విపులంగా వ్రాయబడిన

మాట! మాటలను సిద్ధపరచుకొని దేవుని యొద్దకు వెళ్లాలి. మనస్సు దేవునికి అనుకూలముగా మార్చుకొని దేవునితో చెప్పాల్సింది ఏమిటో తెలుసా? దేవా, నేను మారిపోయాను మహాప్రభో అని దేవుని దగ్గర మనిషి శరణు వేడుకోవాలి. అటువంటి మాటలను దేవుడు కోరుకుంటున్నాడు. ఇది లేనినాడు మనిషి ఎన్ని అర్పణలు ఇచ్చినా, కోట్ల రూపాయలు ఆయన సన్నిధిలో తెచ్చి పోసినా ప్రయోజనం లేదు. మనం మారాలి. మన బ్రతుకులు మారాలి.

ఇశ్రాయేలీయులకు తన మనస్సును ఈ విధంగా తెలియజేసిన పరలోకపు తండ్రి, ఇక అర్పణ విషయంలో పరిపూర్ణతను తెలియజేస్తున్నాడు. అటువంటి సమయంలో ఈ లోకానికి దేవుడు తన కుమారుడైన యేసును అనుగ్రహించాడు. ఆయన ద్వారా ఆ పరిపూర్ణమైన సంగతులను తెలియజేయాలనుకున్నాడు. అప్పుడు యేసు జననం ఈ భూమి మీద జరిగింది. అనేకమంది ప్రవక్తలు అప్పటికే దేవుని మనస్సును తెలియజేసారు. దేవుడు నిజంగా స్వీకరించే అర్పణ ఎలా ఉండాలో యేసు తన బ్రతుకులో చూపించడానికి వచ్చాడు. ఆనాడు యేసు దగ్గర అనేకమంది ఆయన చెబుతున్న మాటలు వింటున్నారు. ఆ మాటలలో ఆయన సరిగ్గా అర్పణకు సంబంధించిన సంగతిని ప్రస్తావించాడు. దేవుడు మనుష్యులయొద్ద నుండి ఏమి కోరుకుంటున్నాడో అనే దానిని యేసుక్రీస్తు పరిపూర్ణముగా తెలియజేసాడు. అంతకు మునుపు ప్రవక్తలు చెప్పారు, దావీదు, యెషయా, యిర్మీయా, హోషేయ.. ఇలా వీరంతా చెప్పారు. అయినా ఇంకా ప్రజలు వారి అర్పణ విషయంలో మారలేదు. మనిషి పాపాత్మునిగానే ఉన్నాడు; దేవునికి మాత్రం బలి, అర్పణ తీసుకువెళుతున్నాడు. ఇప్పుడున్న సమాజమే అలా ఉంటే, యేసుక్రీస్తువారి కాలంలో ఆనాటి సమాజం అలా ఉండదా? అవును, అలాగే ఉంది. అప్పుడు యేసుక్రీస్తు తన మాటలలో దేవుని మహాజ్ఞానాన్ని చెబుతున్నాడు.

మత్తయి సువార్త **5 : 21 'నరహత్య చేయవద్దు, నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారుగదా. నేను మీతో చెప్పునదేమనగా, తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును. తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును. ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును. కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీ సహోదరునికి విరోధమేమైననుకలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల అక్కడ బలిపీఠమునెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము. అటు తరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము.'** యేసు తన బోధలలో సరాసరి అర్పణ దగ్గరకు వచ్చాడు. ఒక వ్యక్తి బలిపీఠము మీద తన అర్పణను దేవునికి అర్పించుచుండగా తన సహోదరునితో విరోధమేమైనను కలదని అక్కడ అతనికి జ్ఞాపకం వస్తే వెంటనే అక్కడే బలిపీఠము ఎదుటే తాను దేవునికి ఇవ్వబోయే అర్పణమును విడిచిపెట్టి, మొదట వెళ్లి తన సహోదరునితో సమాధానపడాలి. అంటే ఇక్కడ దేనికి ప్రాముఖ్యత ఉంది? అర్పణముకా? లేక సమాధానకరమైన నీతికా? అర్పణముకు తొందర లేదు. ఎందుకంటే, కనికరము లేని అర్పణము దేవునికి అక్కరలేదు. నీ సహోదరుని మీద నీవు కోపపడటమో, లేక నీ సహోదరుడు నీ మీద కోపపడటమో జరిగితే ముందుగా దానిని ఆలోచించాలి. తన సహోదరునితో ఎలా సమాధానపడాలో ఆలోచించాలి. సమాధానపడిన తరువాత వచ్చి తన అర్పణమును అర్పించాలి. ఇక్కడ సహోదరుడు అంటే కేవలం రక్త సంబంధి మాత్రమే కాదు. పిల్లలు తమ చిన్ననాడు పాఠశాలలో లోకసంబంధమైన ప్రతిజ్ఞను చేస్తుంటారు. భారతదేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు అని ప్రతిజ్ఞ చేస్తారు. నిజానికి భారతీయులే కాదు, ప్రపంచంలో ఉన్న మనుష్యులందరూ మన సోదర సోదరీమణులే. కనుక ఏ ఒక్కరితోనైనా నీకు సమాధానము లేకపోతే, మొదట వెళ్లి వారితో సమాధానపడాలి. ఆ తరువాత వచ్చి నీ అర్పణమును దేవునికి అర్పించాలి. పొరుగువానిని ప్రేమించడం మరియు సహోదరుని మేలు కోరడమనేవి, దేవునికి బలిని ఇవ్వడం కంటే చాలా గొప్ప విషయాలు. ధర్మశాస్త్రంలో నరహత్య చేయవద్దని మాత్రమే వ్రాయబడింది. కానీ, యేసు వచ్చిన తరువాత ఆయన ఏమంటున్నాడంటే, నీ సహోదరుని మీద కోపపడి, వ్యర్థుడా ద్రోహీ అని చెబితేనే నరహత్యతో సమానమంటున్నాడు. దీనినిబట్టి మునుపు ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన ధర్మశాస్త్రమునకు మించిన దానిని యేసు నేర్పిస్తున్నాడు. ఎందుకంటే, ఆయన తన తండ్రియైన దేవుని దగ్గర ఈ జ్ఞానమును నేర్చుకున్నాడు. ఇప్పుడు యేసును గూర్చి ఆ అర్పణ విషయములో వ్రాయబడిన మరొక చక్కని సందర్భమును చూద్దాం.

హెబ్రీయులకు 10 : 5- **'ఆయన ఈ లోకమందు ప్రవేశించునప్పుడు ఈలాగు చెప్పుచున్నాడు. బలియు, అర్పణయు నీవు కోరలేదు గాని, నాకొక శరీరమును అమర్చితివి. పూర్ణహోమములు పాపపరిహారార్థ బలులు నీకిష్టమైనవి కావు. అప్పుడు నేను గ్రంథపు చుట్టలో నన్నుగూర్చి వ్రాయబడిన ప్రకారము దేవా, నీ చిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నాననంటిని.'** పరలోకమందున్న దేవుడు తన కుమారుడైన యేసును ఈ లోకములోనికి పంపించినప్పుడు, ఆయన ఈ లోకమందు ప్రవర్తింపవలసిన విధానమును జ్ఞాపకము చేసుకుంటున్నాడు. ఇప్పుడు దేవునికి మనుష్యుల దగ్గర నుండి కావలసింది బలియు, అర్పణయు కాదు. వాటిని దేవుడు కోరుకోవడం లేదు. కనుకనే దేవుని కుమారుడైన వాక్యమునకు ఒక శరీరము ఇవ్వబడింది. ఆ శరీరమును పరిశుద్ధాత్మ వలన మరియ గర్భములో నుండి తెచ్చుకుని, ఈ భూమి మీదకు ఆయన వచ్చాడు. ఇప్పుడు దేవునికి కావలసిన దానిని తన శరీరము ద్వారా మాత్రమే ఆయన ఇవ్వగలడు. ధర్మశాస్త్రములో వ్రాయబడిన పూర్ణహోమములు, పాప పరిహారార్థబలులు ఇవ్వడానికి యేసు రాలేదు. భూమి మీదకు వచ్చి పాపము చేస్తే వాటిని ఇవ్వవలసిన అవసరత ఏర్పడును. కానీ, ఆయన ఆ అవసరమే లేకుండా దేవునికి నచ్చని బలులు, అర్పణలను ఇవ్వకుండా, దేవునికి నచ్చే దానిని తన శరీరము ద్వారా నెరవేర్చడానికి ఇష్టపడుతున్నాడు. అందుకే ఆయన ఈ లోకమందు ప్రవేశించేటప్పుడు, గుర్తుచేసుకుంటున్న మాట ఏమిటంటే, దేవుడిచ్చిన శరీరము ద్వారా దేవుని చిత్తమును ఆ శరీరమందు నెరవేర్చాలి. సరిగ్గా యేసు దానినే నెరవేర్చినట్టుగా మనకు ఆయన జీవిత చరిత్ర చదివితే అర్థమవుతుంది. దేవునికి బలులు, అర్పణలే ఇష్టమైతే యేసు కూడా పక్షుల పెంపకంలోనో, పశువుల పెంపకంలోనో ఉండాలి కదా. కానీ, ఆయన తనకివ్వబడిన శరీరము ద్వారా అద్భుతమైన సేవ దేవునికి చేస్తున్నాడు. అందునుబట్టి **మత్తయి సువార్త 3 : 17**వ వచనములో పరలోకములో ఆ మహా దివ్య మహిమ నుండి ఒక స్వరము ఈలాగు వినిపించింది; 'ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేను ఆనందించుచున్నాను.' తనకిష్టమైన దానిని నెరవేర్చిన తన ప్రియసుతుని చూచిన తండ్రి అత్యంత సంతోషముతో చెప్పిన మాటలివి.

దేవుడు బలి, అర్పణలను గూర్చి తన గ్రంథములో ఇంత చక్కగా వ్రాయించి మన చేతులలో పెట్టినప్పుడు ఆ మాటలన్నింటిని ప్రక్కన పెట్టి ఈరోజు ప్రపంచ భక్త జనాంగం దేవునికి ఏదో ఇస్తున్నామని సరిపెట్టుకుంటూ, వారి జీవితాలను ఇంకా పాపమనే దరిద్రంలోనే ఉంచుకుంటూ అపవాది చేత పాతాళానికి ఈడ్వబడుతున్నారు కాదా? నేడున్న మనుష్యులు పైకి జీవిస్తున్నా దేవుని దృష్టిలో చనిపోయిన స్థితిలోనే ఉన్నారు. చచ్చిన శవాలుగా పేరుకు మాత్రమే బ్రతుకుతున్నారు. అందుకే దేవుడు ఈ ప్రపంచానికి ఒక మేలుకొలుపుగా ఈ పాఠాన్ని చెబుతున్నాడు. ఒక చివరి ప్రయత్నముగా తన మనస్సును తెలియజేస్తున్నాడు. దేవుని ఇష్టమేమిటో తెలుసుకోకుండా. ఆయన చిత్తాన్ని గాలికొదిలేసి, తమ ఇష్టాన్ని తాము నెరవేర్చుకుంటూ వారానికో రోజు, రోజుకో గంట భక్తి పేరుతో దేవున్ని మోసం చేస్తున్నప్పుడు ఇదే అసలైన పెద్ద నేరం. **లూకా సువార్త 16 : 19**వ వచనము నుండి మీరు చూస్తే, అక్కడున్న 'ధనవంతుడు మరియు లాజరు' సందర్భములో దేవుడు ఈ విషయాన్నే తెలియజేస్తున్నాడు. **లూకా సువార్త 16 : 25**వ వచనములో, ధనవంతుడు పాతాళము లోనికి పోయి, నరకమందు వేదననుభవిస్తున్నప్పుడు, అతడు దూరాన ఉన్న అబ్రాహామును చూచి తండ్రినైన అబ్రాహామా నేను ఇక్కడ అగ్ని జ్వాలలలో యాతనపడుచున్నాను, నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుమని అడుగుచున్నప్పుడు, నెమ్మది ననుభవించుచున్న అబ్రాహాము, ధనవంతుడు భూజీవితకాలములో తాను చేసిన దుష్క్రియ ఏమిటో చెబుతున్నాడు. అబ్రాహాము ధనవంతునితో, **'నా కుమారుడా నీవు నీ జీవితకాలమందు నీకిష్టమైనట్టుగా సుఖము అనుభవించితివి. ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసికొనుము.'** ధనవంతుడు తన జీవితకాలములో తనకిష్టమైనట్టుగా సుఖమును అనుభవించాడు. ఆనాడు లోకములో వాడికి తెలిసిన భక్తి ఏమిటి? దేవునికి ఏదో కొంత తీసుకుని వెళ్లి బలి, అర్పణ ఇచ్చేసి ఉంటాడు. దేవుని దగ్గరకు తన అర్పణను తీసుకువెళ్లి నేను సుఖంగా బ్రతకాలి, నా ఇష్టాన్ని నేను నెరవేర్చుకోవాలి, నా మనస్సు ఏమి చెప్పిందో అది చేస్తాను తప్ప దేవా, నీ ఇష్టంతో నాకు పని లేదు అంటే దేవుడు ఊరుకుంటాడా? అందుకే ఆ ధనవంతుడు తన దేహాన్ని విడిచిపెట్టిన తరువాత ఆత్మగా పాతాళలోకంలో నరకమందు వేదన అనుభవిస్తున్నాడు. అక్కడ ఈ విషయాలు అబ్రాహాము ద్వారా వాడికి అర్థమయ్యాయి. కానీ, ప్రయోజనం లేదు. ఎందుకంటే, అప్పటికే తన జీవితం, తన శరీరం తన చేయి దాటిపోయాయి. ఇక యేసును గూర్చి మనము పరిపూర్ణమైన సంగతులను తెలుసుకోవాలి.

దేవునికి నచ్చే బలి, అర్పణ విషయములో మనకు పూర్తి స్పష్టత కావాలి. వ్రాయబడిన సంగతులను చూద్దాం.

**హెబ్రీయులకు 10 : 8 'బలులు అర్పణలు పూర్ణహోమములు పాపపరిహారార్థ బలులును నీవు కోరలేదనియు, అవి నీకిష్టమైనవి కావనియు పైని చెప్పిన తరువాత ఆయన - నీ చిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నానని చెప్పుచున్నాడు. ఇవన్నియు ధర్మశాస్త్రము చొప్పున అర్పింపబడుచున్నవి. ఆ రెండవదానిని స్థిరపరచుటకు మొదటిదానిని కొట్టివేయుచున్నాడు.'** బలి, అర్పణలను గూర్చి మాట్లాడిన తరువాత, దేవుని చిత్తము నెరవేర్చుటకు వచ్చియున్నానని యేసు ఎందుకు చెప్పాడు? ఎందుకంటే, దేవుని చిత్తమును నెరవేర్చుటయే అసలైన అర్పణ. అదే అసలైన బలి. మనిషి పెంచుకుంటున్న దూడ కాదు, మనిషి పోగు వేసుకుంటున్న ధనము కాదు, మనిషి అనుకున్నదేదీ కాదు. దేవుడు మనిషి యొద్ద నుండి నీతిని కోరుకుంటున్నాడు. ఆ నీతి దేవుడిచ్చిన శరీరం ద్వారా జరగాలని కోరుకుంటున్నాడు. ఈ సంగతినే దేవుడు ప్రతి మనిషి నిమిత్తము తన గ్రంథపు చుట్టలో వ్రాసుకున్నాడు. మనుష్యుల నిమిత్తము దేవుడనుకున్న సంకల్పమంతా నెరవేరాలని దేవుడు కోరుకుంటున్నాడు. ఆ సంగతులు ఎలా వ్రాయబడ్డాయో, ఏమని వ్రాయబడ్డాయో బైబిల్ అనే వేద గ్రంథాన్ని ఒక్కసారి అయినా మనిషి మనోనేత్రాలు తెరచి చదివితే అవి అర్థమవుతాయి. మనిషి దేవుని దగ్గరకు వచ్చిన ప్రతీసారి ఏదో ఒక వాగ్దాన వచనము కొరకు, ఏదో ఒక సుఖవంతమైన ఆశీర్వాదము కొరకు ఎదురుచూచాడే తప్ప నానుండి దేవుడు ఏమి ఆశిస్తున్నాడనేది అర్థం చేసుకోలేదు. అందుకే ఇప్పటి వరకు ఎన్నో సంగతులు ఇంకా మరుగునే పడి ఉన్నాయి. ప్రియులారా! మనము బ్రతకాలి; మనము పరలోకానికి వెళ్లాలి. అలా జరగాలంటే, మన పరలోకపు తండ్రి ఇష్టాన్ని మనము నెరవేర్చాలి. ఇదేమీ నేరం కాదుగా. ఇదేమీ తప్పుడు సంగతి కాదుగా. ఏ దేశ రాజ్యాంగమైనా దేవుని కొరకు నీతిగా బ్రతకడం రాజ్యాంగ విరుద్ధమైనదని చెప్పిందా? లేదే. దేవుని కొరకు బ్రతకడం సమాజానికేమైనా విరుద్ధమైనదా? మన చుట్టూ ఉన్న సమాజాన్ని బ్రతికించాలని మనము ఆశపడుతున్నప్పుడు, అటువంటి మన బ్రతుకు, మన చుట్టూ నివసిస్తున్న సమాజానికి మేలునే తప్ప కీడు తలపెట్టదు. అటువంటి బ్రతుకు సమాజాన్ని చైతన్యపరుస్తుంది.

దేవునికి అర్పణ ఇచ్చే ముందు విరిగి నలిగిన మనస్సుతో ఆయన దగ్గర సాష్టాంగపడిపోవాలి. పాత రోత జీవితాన్ని దేవుని ముందు ఒప్పుకుని దానిని ఆ క్షణమందే విడిచిపెట్టి, నూతనత్వం లోనికి రావాలి. అటువంటి మనుష్యులు ఇచ్చే బలి, అర్పణ వలన దేవునికి సంతోషము. వారు ఇచ్చేది రెండు కాసులు మాత్రమే కావచ్చు. వారు తమ లేమిలో వారి స్థాయికి మించి దేవునికి ఇచ్చియుండవచ్చు. అయినా దేవుడు వారి అర్పణను చాలా గొప్పగా స్వీకరిస్తాడు. అట్టి అర్పణ ఎలా ఉపయోగపడుతుందో తెలుసా? మిగిలిన సహోదరులను బ్రతికించడానికి ఉపయోగపడుతుంది. ఎవరో తిని త్రాగడానికి మాత్రం అది ఖర్చు చేయబడదు. ఎవరైనా నిజంగా విరిగి నలిగిన మనస్సుతో దేవుని దగ్గరకు వెళ్లి. వారి మార్పును ఆయనకు చూపించి, నీతిమంతులై వారు అప్పటి వరకు కలిగియున్న ఆస్తిని దేవునికిస్తే, ఆయన దానిని ఎలా ఖర్చు చేయమంటాడో తెలుసా? తన తరములో మిగిలిన సహోదరులకు ఇటువంటి ఆత్మ జ్ఞానమును నేర్పించుటకు, వారిని బ్రతికించుటకు దానిని ఖర్చు చేయమంటాడు. అంతే తప్ప తాను అనుభవించడానికో లేక తన తరపున ఒక సేవకుడు అనుభవించడానికో మాత్రం కాదు. దేవుని జ్ఞానమును మనుష్యులకు నేర్పించడానికి, నీతిమంతులైనవారు ఇచ్చే అర్పణలు మాత్రమే దేవుని సన్నిధికి చేరతాయి. గనుక ప్రియులారా! దేవునికి అర్పణలు మీరు ఏ రూపములోనైనా ఇవ్వాలనుకున్నప్పుడు మొట్టమొదట మీరు మారాలి. మీలో పరివర్తన రావాలి. ఆ తరువాత మీరు దేవుని మాటలు వినాలి. సమీపించి ఆలకించి, దేవుని గూర్చిన జ్ఞానమును నేర్చుకోవాలి. అప్పుడు దేవుడు ఏ సందర్భములో ఎవరి దగ్గర ఎటువంటి అర్పణను ఎందుకొరకు స్వీకరిస్తాడో మీకు పూర్తిగా అర్థమవుతుంది. దేవునికి అర్పణ ఎలా ఇవ్వాలి? ఎప్పుడు ఇవ్వాలి? దేనికి ఇవ్వాలి? ఇదంతా మీకు అర్థమైతేనే మీరు దేవునికి అర్పణ ఇవ్వడం వలన ఉపయోగం ఉంటుంది. అప్పుడు మీ అర్పణ ఆయన సన్నిధిలో లెక్కింపబడుతుంది; పరలోకమందు మీకు ధనము కలుగుతుంది. చివరిగా ఒక మంచి మాటను మీకు పరిచయం చేస్తాను. జాగ్రత్తగా చూడండి.

ఎఫెసీయులకు **5 : 1- 'కావున మీరు ప్రియులైన పిల్లలవలె దేవుని పోలి నడుచుకొనుడి. క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు, మనకొరకు తన్నుతాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను;**

**అలాగుననే మీరును ప్రేమ కలిగి నడుచుకొనుడి.'** మీరు దేవుని పోలి నడుచుకోవాలి. దేవుని పోలి నడుచుకుంటే, క్రీస్తువలె మీరు కూడా బ్రతకడానికి ఆలోచిస్తారు. క్రీస్తు దేవునికి ఇచ్చిన బలి, అర్పణ వేరే ఏదో కాదు. దేవుడు తనకు ఇచ్చిన శరీరమును తిరిగి దేవుని సేవలో ఆయనకు అర్పించాడు. ఆ అర్పణను దేవునికి ఒక పరిమళ వాసనగా ఉంచుటకొరకు, మనుష్యులందరి కొరకు తన్ను తాను దేవునికి అప్పగించుకున్నాడు. కనుక మనమిచ్చేవి కాదు; మనమే దేవునికి కావాలి. మనము తీసుకుని వెళ్లే ఒక జంతువు, పక్షి దేవునికి వద్దు. ఆయన మనలాంటి శరీరధారి కాదు. ఆత్మ దేవునికి అవన్నీ అవసరం లేదు. నీవు దేవునికి అర్పణగా మారిపోవాలి. దేవుని పోలి నడుచుకోవడమంటే ఇదే. క్రీస్తు వలె మనము కూడా దేవునికి పరిమళ వాసనగా మారాలి. ఆయన యేసు కదా, ఆయనలా మేమెందుకు ఉండాలి? అసలు ఉండగలమా అనుకుంటున్నారా? ఉండగలరు. దేవుని చిత్తమును నెరవేర్చుట కొరకే పరిశుద్ధాత్మను దేవుడు అనుగ్రహిస్తున్నాడు. క్రీస్తు వలె మీరును ప్రేమకలిగి నడుచుకొనుడి. ఇది అర్థమైనవారైతే మీకు మీరే దేవుని కొరకు ఒక మంచి అర్పణముగా, బలిగా మీ జీవితమును దేవునికి అంకితం చేయండి. అప్పుడు మరణించిన తరువాత మంచి బహుమానమును దేవుని వలన పొందుతారు.

-------×-------

## ప్రశ్నలు

**1) పాత నిబంధన కాలములో ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్ర ప్రకారం దేవునికి అర్పణలను ఏ విధముగా ఇచ్చారు?**

**2) దేవుడు ఇశ్రాయేలీయుల అర్పణలను అనేక సందర్భములలో ఎందుకు నిరాకరించాడు? వివరించండి.**

**3) దేవుని ఆకలి ఏ విధముగా ఉంటుంది? దానిని మనిషి ఎలా తీర్చగలడు?**

**4) ఇశ్రాయేలీయులను దేవుడు వారి పాపముల విషయమై తనకు బలులు, అర్పణలు చెల్లించుమనుటలో ఆయన ఆంతర్యమేమిటి?**

**5) యేసుక్రీస్తు ఈ భూమి మీదకు వచ్చి దేవునికి ఇచ్చిన బలి, అర్పణ ఏలాటివి? వివరించండి.**

**6) దేవుని చిత్తమును నెరవేర్చి, ఆయనను సంతోషపెట్టడమెలా? వివరించండి.**

**7) ప్రస్తుత కాలములో దేవునికి మనిషి ఇవ్వవలసిన నిజమైన బలి, అర్పణమును దేవుని వాక్యము ద్వారా వివరించండి.**